శ్రీమన్మహామాహేశ్వర

అభినవగుప్తాచార్య కృత

తంత్రసారము

రూపెనగుంట్ల సత్యనారాయణ శర్మ

శ్రీమన్మహామాహేశ్వర

అభినవగుప్తాచార్య కృత

తంత్రసారము

రూపెనగుంట్ల సత్యనారాయణ శర్మ

పంచవటి స్పిరిట్యువల్ ఫౌండేషన్

blog : www.teluguyogi.net, e_mail : ssarma04@gmail.com

websites : www.mapanchawati.org, www.usapanchawati.org

ముందుమాట

అభినవగుప్తుని అద్భుత జీవితం

తంత్రసారమనే ఈ గ్రంథమును అభినవగుప్తాచార్యులవారు రచించారు. ఈయన పదవశతాబ్దంలో, క్రీ.శ. 950 - 1016 మధ్యలో కాశ్మీరదేశంలో నివసించారు. ఈయన కంటే 200 సంవత్సరముల ముందు నివసించిన వీరి పూర్వీకులలో ఒకరైన అత్రిగుప్తుడు క్రీ.శ. 740 ప్రాంతంలో ఉత్తరప్రదేశ్ లో నివసించినట్లు భావిస్తున్నారు. అప్పటిలో దానిని మధ్యదేశమని పిలిచేవారు. దానికి కారణం, అది హిమాలయాలకు వింధ్యపర్వతానికి మధ్యలో ప్రయాగకు పడమరగా ఉండటమే. ఈ అత్రిగుప్తుడు కూడా మహాపండితుడు. కాశ్మీర్ మహారాజైన లలితాదిత్య వర్మ ఆహ్వానం మేరకు ఈయన మధ్యదేశాన్ని వీడి, కాశ్మీరరాజ్యానికి వలస పోయినట్లు తెలుస్తున్నది. అప్పటినుంచీ వారి కుటుంబాలన్నీ కాశ్మీర్ లోనే ఉండేవి. కనుక, అభినవగుప్తుల జననం కాశ్మీర్ లోనే జరిగింది.

అభినవగుప్తులవారు జీవించి ఉన్న కాలంలో, పరమశివానుభవమును పొందిన పరమగురువుగా భావించి అనేకమంది శిష్యులు ఆయనను పూజించారు, అనుసరించారు. వేదాంత, తంత్రశాస్త్రములలో మహాపాండిత్యమూ, అద్భుతమైన యోగశక్తులకు తోడుగా, అమేయమైన శివాద్వైత అనుభవజ్ఞానం ఈయన సొంతమై ఉండేది.

ఇవిగాక నాట్య, సంగీత, వ్యాకరణాది శాస్త్రములలో ఈయన మహాజ్ఞాన సంపన్నుడు. 'కాశ్మీర శంకరాచార్య' అని ఈయనను అనేకమంది నవీన పండితులు పిలిచారు. కాశ్మీరశైవాద్వైతాన్ని ఈయన పరిపుష్టం చేసినట్లు ఈయనకు ముందున్న శైవాచార్యులెవరూ చేయలేకపోయారు. వెయ్యిసంవత్సరాల క్రితం జీవించిన ఈయన, జ్ఞానతృష్ణకే ప్రాధాన్యతనిచ్చి, అద్వైతశివానుభావం అందరికీ సాధ్యమే అన్నమాట చెప్పడమేగాక, సమస్త కులాలకూ చెందిన ముముక్షువులను కరుణతో చేరదీసి, వారికి ఈశ్వరసాక్షాత్కారానికి మార్గాన్ని చూపిన కారణజన్ముడు. స్త్రీలకు కూడా ఆధ్యాత్మిక సాధనామార్గంలో సమానస్థానాన్ని ఇచ్చిన మహనీయుడు. నాట్య సంగీతాది విద్యలలో ప్రతిభాసంపన్నుడు మాత్రమే గాక, కాశ్మీర శైవ తంత్రశాస్త్రమును కాచి వడపోసిన అనుభవజ్ఞాని.

ఎలాగైతే వేదాలలో దాగిఉండి జనులకు అర్థంకాకుండా ఉన్న అద్వైత వేదాంతతత్వాన్ని తన అద్వైతసిద్ధాంతం ద్వారా శంకరభగవత్పాదులు సామాన్యజనులకు కూడా తేటతెల్లం చేశారో, అదే విధంగా శైవాగమశాస్త్రాలలో నిగూఢంగా ఉన్న శివాద్వైతతత్వాన్ని తన గ్రంథాలద్వారా అభినవగుప్తులవారు లోకానికి వివరించారు.

ఆయన వైష్ణవ, బౌద్ధ, జైనాది వివిధ సాధనామార్గాలలోనూ, ద్వైతాద్వైతాది మతాలలోనూ మహాపండితుడేగాక, అతిరహస్యమైన శైవతంత్రజ్ఞానం కలిగినవాడు. భరతముని యొక్క నాట్యశాస్త్రానికి వ్యాఖ్యానం వ్రాసిన నాట్యశాస్త్ర కోవిదుడు, సంగీతనిధి, అష్టసిద్ధులనూ అరచేతిలో ఉంచుకున్న మహాయోగి. దాదాపు ఏభైకి పైగా సునిశిత తర్కపూరితములైన, మహోన్నత సిద్ధాంత ప్రతిపాదితములైన, ఉత్తమగ్రంథాలను

సంస్కృతంలో రచించిన మహాకవి, వ్యాకరణవేత్త. కపిలమహర్షి యొక్క సాంఖ్యశాస్త్రంలోనూ, శంకరుని అద్వైతసిద్ధాంతంలోనూ, బుద్ధుని అనాత్మవాదంలోనూ ఉన్న లోపాలను సవరించిన ధీశాలి. ఈయన జీవితం ఒక మహాద్భుతం.

క్రీ.శ. 950 ప్రాంతంలో, సాంప్రదాయపరమైన ఒక బ్రాహ్మణ కుటుంబంలో అయన జన్మించాడు. చిన్నప్పుడే తన తల్లియైన విమలకళాదేవిని కోల్పోయాడు. తండ్రిగారైన నరసింహగుప్తుడు మళ్ళీ వివాహం చేసుకోకుండా మహేశ్వరభక్తుడై ఆధ్యాత్మిక జ్ఞానసాధనకు అంకితుడైనాడు. తనను గురించి వ్రాసుకుంటూ 'యోగినీభూ' అన్న పదాన్ని అభినవగుప్తులవారు ఉపయోగించారు. అంటే, కౌలాచార పరమైన సంయోగం ద్వారా తల్లిదండ్రులకు జన్మించిన యోగశిశువని అర్థం. ప్రాచీనకాలంలో ఇటువంటి ప్రక్రియలు ఉండేవి. ఉత్తమసంతానాన్ని కనాలని సంకల్పించిన భార్యాభర్తలు నిష్ఠాపరులుగా యోగతత్పరులుగా ఉంటూ తత్ఫలంగా ఉద్భవించిన ఓజోశక్తితో కలిగిన సమాధిస్థితిలో, భైరవస్థితిలో, ఒక శిశువుకు జన్మనిస్తే, ఆ శిశువు పుట్టుకతోనే అత్యుత్తమములైన సంస్కారాలతో జన్మించి, కాలాంతరంలో అత్యంత మేధాసంపన్నునిగా, అత్యంత మహనీయునిగా, తపశ్శాలిగా, ద్రష్టగా, మహర్షిగా రూపుదిద్దుకునేవాడు. అభినవగుప్తులవారు పుట్టుకతోనే అట్టి కారణజన్మునిగా, యోగశిశువుగా జన్మించారు.

ఈయన అత్యంత చిన్నవయసు నుండీ అమితమైన ఆధ్యాత్మికతృష్ణను కలిగినవాడు. జ్వలిస్తున్న జ్ఞానతృష్ణతో అనేకమంది మహాగురువుల వద్ద శిష్యరికం చేసి, వారివద్దనున్న సమస్తజ్ఞానాన్నీ ఔపోసన పట్టాడు. బుద్ధునికి ఇద్దరే గురువులున్నారు. కానీ అయన, కనీసం 15 మంది మహనీయులైన గురువుల వద్ద శిష్యరికం చేసినట్లు, ఆయా శాస్త్రములనన్నింటినీ అతి తక్కువకాలంలో కూలంకషంగా నేర్చుకున్నట్లు మనకు ఆధారాలు లభిస్తున్నాయి. వీరిలో మహాసిద్ధులైన శైవసాంప్రదాయ గురువులే గాక వైష్ణవ, బౌద్ధ, జైన సాంప్రదాయాలకు చెందిన గురువులు కూడా ఉన్నారు.

ఆధ్యాత్మికతృష్ణ అనేది ఒకనికి తన ముసలితనంలో కలిగితే, అది సరియైన తృష్ణ కాదు. నిజమైన ఆధ్యాత్మికతపన అనేది చాలా చిన్నవయసులోనే ఎవరికైతే జ్వలిస్తుందో వారే ధన్యులు. వారే జీవిత పరమగమ్యాన్ని చేరుకోగలరు. ఇతరులకు అది అసాధ్యమౌతుంది.

ముఖ్యంగా త్రికసిద్ధాంతమైన కాశ్మీరశైవాన్ని, తంత్రమార్గమైన కౌలాన్నీ ఈయన నిష్ఠగా అధ్యయనం చేశాడు. వసుగుప్తుడనే సిద్ధగురువుచేత 8 వ శతాబ్దంలో క్రోడీకరించబడినదే త్రికసిద్ధాంతం. సృష్టి స్థితి లయములు మూడు. జాగ్రత్ స్వప్న సుషుప్తులు మూడు, సత్వ రజో తమో గుణములు మూడు, నరుడు, శక్తి, శివుడు మూడు. ఈ విధంగా మనకు కనిపిస్తున్న చరాచరసృష్టి సమస్తాన్నీ మూడు మూడు స్థాయిలలో సంపూర్ణంగా వివరించగలిగిన సిద్ధాంతమే త్రికసిద్ధాంతం. ఇది పరమేశ్వరాద్వయమును ప్రతిపాదిస్తుంది.

దీనిలో నిశితతర్కమయమైన సిద్ధాంతభాగమే గాక, సాధకుడిని ఆధ్యాత్మికంగా అత్యున్నతికి తీసుకుపోగల ఆచరణాత్మకమైన తంత్రసాధనామార్గం కూడా నిగూఢంగా దాగి ఉన్నది. అభినవగుప్తులవారు ఈ రెంటిలోనూ అత్యంత ప్రతిభాపూర్వక అభ్యున్నతిని పొందారు. ఈ రెంటినీ సమర్థవంతంగా బోధించగల సద్గురువులు ఆయనకు లభించారు. అదే ఆయన అదృష్టం. ఆయనపై గల శివానుగ్రహానికి నిదర్శనం.

తన గురువులందరిలోనూ సోమానందుని, శంభునాథుని ఆయన ప్రత్యేకంగా పేర్కొన్నారు. సోమానందుడు ఈయనకు క్రమ, త్రిక, ప్రత్యభిజ్ఞ సిద్ధాంతాలను బోధించాడు. శంభునాథుని వద్ద తాంత్రికపథమైన కౌలాచారాన్ని ఈయన ఔపోసన పట్టాడు. శంభునాథుని పత్ని (తన గురుపత్ని) నుంచి అభినవగుప్తుడు శక్తిపాతాన్ని పొందాడన్నదాన్ని బట్టి, వెయ్యేళ్ళ క్రితమే స్త్రీలు తంత్రమార్గంలో గురుత్వాన్ని వహించగల శక్తిస్వరూపిణులుగా విరాజిల్లేవారని మనకు తెలుస్తుంది. నిజం చెప్పాలంటే, ఒక తాంత్రికగురువుగా స్త్రీ రాణించినట్లు పురుషుడు రాణించలేడు. దానికి చాలా మార్మిక కారణాలున్నాయి. అందుకేనేమో, శ్రీరామకృష్ణులవారు కూడా భైరవీ బ్రాహ్మణినే తన తంత్రసాధనా గురువుగా ఎన్నుకున్నారు.

తన గురువులలో అందరిలోకీ శంభునాథుని ఈయన ఎక్కువగా తలచుకున్నాడు. ఈయన కరుణవల్లనే తాను పూర్ణజ్ఞానాన్ని పొందానని చెప్పుకున్నాడు. శైవాద్వైతాన్నీ తంత్రమార్గములో అప్పటివరకూ ఉన్న అన్ని సాధనామార్గాలనూ సమన్వయము చేస్తూ ఒక సంపూర్ణ అద్భుతగ్రంథాన్ని వ్రాసే బృహత్కార్యాన్ని తలపెట్టమని శంభునాథుడే ఈయనకు ప్రేరణ కలిగించాడు. ఈ ప్రేరణ నుంచి ఉద్భవించినదే 'తంత్రాలోకము' అనే అద్భుతగ్రంథం. 'మాలినీ విజయతంత్రమ'నే ప్రాచీన గ్రంథరాజాన్ని దీనికి ఆధారంగా తీసుకుని, అందులో చెప్పబడిన సిద్ధయోగీశ్వరీ మతాన్ని ఈయన గొప్పగా శ్లాఘించాడు.

'తంత్రాలోకము' 37 అధ్యాయాలతో విరాజిల్లుతున్న అద్భుత గ్రంథం. అప్పటివరకూ ఉన్న సమస్త శైవతంత్రసాధనలనూ క్రోడీకరించి, దానికి తన అనుభవజ్ఞానాన్ని రంగరించి అభినవగుప్తులవారు ఈ గ్రంథాన్ని వ్రాశారు. బహువిస్తారంగా ఉన్న దీనిని అర్థం చేసుకోలేని మందబుద్ధులకోసం, దీని యొక్క సంక్షిప్తరూపంగా 'తంత్రసారము' అనబడే ఈ గ్రంథరాజాన్ని కూడా మళ్ళీ ఆయనే వ్రాశారు.

శ్లో|| వితత స్తంత్రాలోకో విగాహితుం నైవ శక్యతే సర్వైహి
ఋజువచన విరచితమిదం తు తంత్రసారం తతః శృణుత ఇతి ||

'తంత్రాలోకమనే గ్రంథము అతి విస్తారమైనది యగుటచే దానిని అందరూ చదివి అర్థం చేసుకోలేరు గనుక, దాని సారమైన ఈ 'తంత్రసారమ'నే గ్రంథాన్ని తేలికభాషలో అందరికీ అర్థమయ్యే లాగున వ్రాస్తున్నాను', అంటూ ఈ గ్రంథాన్ని ఆయన ప్రారంభిస్తారు.

శ్లో|| అజ్ఞానం కిల బంధహేతురుదితః శాస్త్రే మలం తత్స్మృతం
పూర్ణజ్ఞాన కళోదయే తదఖిలం నిర్మూలతాం గచ్ఛతి
ధ్వస్తాశేషమలాత్మ సంవిదుదయే మోక్షశ్చ తేనామునా
శాస్త్రేణ ప్రకటీకరోమి నిఖిలం యత్జ్ఞేయ తత్త్వం భవేత్ ||

'సమస్త బంధాలకూ కారణం అజ్ఞానం. ఈ అజ్ఞానాన్ని శాస్త్రాలు 'మలం' అన్నాయి. 'నేనే పరమాత్మను' అన్న పూర్ణజ్ఞానం ఉదయించడం వల్ల ఈ అజ్ఞానమలం సమస్తమూ నిర్మూలనం అవుతుంది. ఈ విధంగా అజ్ఞానధ్వంసం కావడమూ సంవిత్ జ్ఞానోదయం కావడమే 'మోక్షం' అనబడుతుంది. అట్టి మోక్షాన్ని పొందే మార్గాన్ని ఈ శాస్త్రంలో నేను వివరిస్తున్నాను', అని ఈ గ్రంథంలో అంటారు.

శ్లో|| ఇత్థం షడర్ధ క్రమసంప్రదాయం స ప్రత్యయాప్రత్యయ భిన్నమాప్య

శ్రీ శంభునాథ కరుణారసేన స్వయం ప్రసన్నాదనపేక్ష్య వృత్త్యా ||

'నా గురువైన శంభునాథుని అవ్యాజమైన కరుణవల్ల నేను గ్రహించిన, తెలియబడునది తెలుసుకొనేవాడు అన్న భేదం లేని (అద్వైత) స్థితిని కలిగించునట్టి షడర్ధ (త్రిక) సాంప్రదాయాన్ని ఇక్కడ వివరిస్తున్నాను', అంటారు.

శ్లో|| కాశ్మీరికోభినవగుప్త పదాభిధానః
శ్రీతంత్రసార మకరోద్రుజునా క్రమేణ
యత్తేన సర్వజన ఏష శివం ప్రయాతు
లోకోత్తర ప్రసర శాంభవతంత్రసారం ||

'సమస్తజనులకూ శుభాన్నీ శివాద్వైతస్థితినీ కలిగించగలదీ సమస్త తంత్రములయొక్క సారమూ అయినట్టి ఈ శాంభవతంత్రం లోకోపకారం కోసం కాశ్మీరవాసియైన అభినవగుప్తునిచే వివరంగా చెప్పబడినది', అని ఈ గ్రంథంలో ఉన్నది.

ఈ మహనీయుడు వ్రాసిన 25 గ్రంథాలవరకూ ప్రస్తుతం లభిస్తున్నాయి. కానీ దాదాపు అంతకంటే ఎక్కువ గ్రంథాలు మన ఖర్మకొద్దీ నశించిపోయాయి. వీటన్నిటిలోకీ తలమానికమైన 'తంత్రాలోక'మనే గ్రంథం ప్రస్తుతం మనకు లభిస్తున్నది అంతవరకూ మనం అదృష్టవంతులమే అనుకోవాలి. ఈ తంత్రాలోకమనే గ్రంథాన్ని 'రనేరో నోలి' అనేవాడు సంస్కృతంనుంచి ఇటాలియన్ భాషలోకి అనువాదం చేశాడు. ఈ అద్భుతగ్రంథాన్ని చదవాలనే ఆశతో జ్ఞాన తృష్ణతో ఎంతోమంది యూరోపియన్, అమెరికన్ స్కాలర్స్ ఇప్పుడు ఇటాలియన్ నేర్చుకుంటున్నారు.

'తంత్రసారమ'నే ఈ గ్రంథం కూడా మొదటగా హిందీలోకి తరువాత యూరోపియన్ భాషలలోకి అనువదించబడింది. ప్రపంచ తంత్రసాహిత్యంలోనే ఈ రెండుగ్రంథాలనూ తలమానికములైనవని నేడు పండితులు వేనోళ్లతో కొనియాడుతున్నారు. భావగాంభీర్యతలోనూ, మార్మికతలోనూ, విస్తృతిలోనూ ఈ రెండు గ్రంథములకు సరిసాటి అయినవి ప్రపంచ ఆధ్యాత్మికవాఙ్మయంలో ఎక్కడా కనిపించవు.

కానీ భారతీయులమైన మనకు మాత్రం, అభినవగుప్తుల వారి గురించీ, లోకంకోసం ఆయన వ్రాసిన అద్భుతమైన గ్రంథాల గురించీ, వాటిలోని విషయాల గురించీ ఏమాత్రం తెలియదు. కనీసం తెలుసుకుందామన్న ప్రయత్నమూ మనకు లేదు. ఇదీ మన మహర్షులకు మనమిస్తున్న గౌరవం !

అత్యుత్తమ శక్తిపాతము (తీవ్ర - ఉత్కృష్ట శక్తిపాతము) ను పొందటానికి ఒక మనిషిలో ఉండవలసిన ఆరు శుభలక్షణములను తంత్రశాస్త్రం వివరించింది. ఈ గ్రంథం యొక్క 11 వ అధ్యాయమైన 'శక్తిపాత ప్రకాశనము' లో ఈ వివరాలు ఇవ్వబడినాయి. ఈ ఆరు శుభలక్షణములూ అభినవగుప్తులవారిలో సంపూర్ణంగా విరాజిల్లుతూ ఉన్నాయని, అందువల్లనే అత్యుత్తమమైన జ్ఞానసిద్ధిని ఆయన పొందగలిగాడని, క్రీ. శ. 12 వ శతాబ్దంలో 'తంత్రాలోకము' నకు వ్యాఖ్యానమును వ్రాసిన జయరథ పండితుడు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

ఈ గ్రంథమును దీక్షగా అధ్యయనం చేస్తే ఎన్నో అద్భుతవిషయాలు మనకు అర్థమౌతాయి. త్రిక, క్రమ, కుల, స్పంద, ప్రత్యభిజ్ఞ శాస్త్రముల సారమంతా ఈ గ్రంథంలో ఇమిడి యున్నది.

నరుడు, శక్తి, శివుడు మరియు అపరా, పరాపరా, పరా శక్తుల వర్ణనలో త్రికశాస్త్రం గోచరిస్తుంది. పన్నెండుగురు కాళికాశక్తుల వర్ణనలోను, తంత్రసాధనలో వారి ఉనికి యొక్క వివరణలోనూ క్రమసిద్ధాంతం కనిపిస్తుంది. చివరి అధ్యాయంలో విపులంగా చెప్పబడిన కౌలాచార సాధనల వివరణలో కులసంప్రదాయం దర్శనమిస్తుంది. బీజయోనులనబడే వర్ణశబ్దముల వివరణలోను, పరా, పశ్యన్తీ, మధ్యమా, వైఖరీ స్థితులతో కూడిన నాదముయొక్క వర్ణనలోను స్పందశాస్త్రము ఎదురౌతుంది. అనుపాయ వివరణలోను, ప్రత్యక్షదర్శనం ద్వారా సమస్తమునకూ అతీతమైన పరమేశ్వరాద్వయ స్థితిని పొందే విధానములో ప్రత్యభిజ్ఞశాస్త్రం గోచరిస్తుంది. ఈ విధముగా, అప్పటివరకూ ఉన్న అన్ని మతములనూ, సాంప్రదాయములనూ, వాటి వాటి స్థానములలో చక్కని మెట్లుగా ఉంచి, ఆయా మెట్లతో కూడిన ఒక అద్భుత సౌధమును ఈ గ్రంథరూపంలో నిర్మించారు ఆచార్యులవారు. అలా చేయడం ద్వారా, తన గురుదేవులైన శ్రీ శంభునాథులవారి సంకల్పాన్ని సాకారం గావించారు.

తాళపత్రములలో వ్రాసి భద్రపరుచబడిన ఈ గ్రంథాలను 11 వ శతాబ్దం నుండి 20 వ శతాబ్దం వరకూ ఏయే బ్రాహ్మణకుటుంబాలు భద్రంగా ఉంచి తీసుకువచ్చాయో, తురక రాక్షసుల విధ్వంసకాండనుండి వీటిని ఏ విధంగా ప్రాణాలకు తెగించి కాపాడాయో మన ఊహకందదు. కానీ, ఆ అజ్ఞాతకుటుంబాలకు శిరసు వంచి పాదాభివందనం చేయడం తప్ప మనం ఇంకేమీ చేయలేము. చివరకు, కాశ్మీరరాజైన మహారాజా ప్రతాపసింహుని ఆదేశం మేరకు, క్రీ.శ. 1918 వ సంవత్సరంలో ఈ గ్రంథాలను సేకరించి, కాగితం మీద అచ్చు వేసి శ్రీనగర్ లోని రాజగ్రంథాలయంలో వాటిని భద్రపరిచారు. ఆ రాజుగారికి, ఈ గ్రంథానికి హిందీభాషలో వ్యాఖ్యానం వ్రాసిన మహామహోపాధ్యాయ ముకుందరామశాస్త్రి గారికి నమస్సుమాంజలులు అర్పిద్దాం. వీరందరూ లేకపోతే, ఇప్పటికే మనకు లభించకుండా నశించిపోయిన వేలాది అమూల్యగ్రంథాల లాగా, ఈ గ్రంథాలు కూడా అగ్నికి ఆహుతై పోయి ఉండేవి. ఈ విజ్ఞానసంపద అంతా నశించి పోయి ఉండేది.

ప్రాతస్మరణీయులైన ఇట్టి మహనీయులను స్మరించుకోగలగడం ఒక అదృష్టమైతే, సనాతనధర్మమనే మహావృక్షానికి కాచిన మధురఫలాలవంటి వారి గ్రంథాలను రుచి చూచి, అధ్యయనం చేసి, జీర్ణం చేసికొనడం జీవిత ధన్యత్వానికి దోహద పడుతుంది.

మానవజాతి యొక్క ఆధ్యాత్మికచింతనలో అత్యున్నతశిఖరం వంటిదైన శివాద్వైతభావనను బోధించే ఈ 'తంత్రసారము' నకు నేను తెలుగు వ్యాఖ్యానమును వ్రాయగలగడం ఈశ్వరానుగ్రహం, ఆచార్యుల కటాక్షం, నా తల్లిదండ్రుల ఆశీస్సుల ఫలం మరియు నా పూర్వజన్మ సుకృతమని భావిస్తున్నాను.

తనకెంతో ఇష్టమైన 'భైరవస్తవము'ను పుష్య బహుళ దశమి నాడు రచించినట్లుగా అభినవగుప్తులవారు వ్రాశారు. అనుకోకుండా ఇదే సమయానికి ఈ గ్రంథమును తెలుగులోకి తెచ్చే ప్రక్రియ కూడా పూర్తయింది. అందువలన, అదే తిథి నాడు ఈ గ్రంథమును విడుదల చేస్తున్నాము.

ఈ గ్రంథమును చదివి, అర్థం చేసికొని, సాధన గావించి, ఇది సూచిస్తున్న పరమపదమును పొందే

మార్గంలో నడచి, ఋషి ఋణాన్ని, పితృ ఋణాన్ని, భరతమాత ఋణాన్ని తీర్చుకొమ్మని పాఠకులను కోరుతున్నాను.

సత్యనారాయణ శర్మ

పుష్య బహుళ దశమి

27 జనవరి 2022

హైదరాబాద్

కాశ్మీరశైవం - త్రికశాస్త్రం

మాతృ. మాన. మేయములు

సృష్టిని అర్థం చేసుకుందామనిన మానవుని ప్రయత్నం ఈనాటిది కాదు. ఇది సృష్టి మొదటినుండీ ఉన్నది. ప్రకృతిశక్తులైన పంచభూతాలను గమనించి అర్థం చేసుకుంటూ, వాటిని అదుపులోనికి తెచ్చుకుంటూ, బాహ్య ప్రపంచాన్ని శాసించే ప్రయత్నంలో మనిషి సైన్స్ ను పెంచుకున్నాడు. సృష్టిని అర్థం చేసుకుని, ఉపయోగించుకుని, సంతోషకరమైన జీవితాన్ని గడిపే దారిలో ఈ ప్రయత్నం సాగుతుంది. కనుక ఇది 'లౌకికం' అనబడుతుంది.

దీనికి విరుద్ధంగా, సృష్టి మూలమును, జీవితపు మూలమును, వాటి ఉపయోగాన్ని ప్రశ్నిస్తూ, 'సృష్టి ఎందుకు జరిగింది? మనిషి జీవితపు పరమ ప్రయోజనం ఏమిటి? జననమరణాల రహస్యమేమిటి? మరణం తరువాత ఏమౌతుంది? సృష్టికి కర్త అంటూ ఒకడున్నాడా? అది పురుషుడా, స్త్రీయా లేక ఆకారం లేని శక్తియా? ఉంటే దానితో సృష్టికీ, సృష్టిలోని జీవరాశులకూ ఉన్న సంబంధం ఏమిటి?' మొదలైన ప్రశ్నలను వేసుకుంటూ, అంతర్ముఖ ప్రయాణంలో సాగిపోతూ, ఆ ప్రశ్నలకు జవాబులను అన్వేషించే ప్రక్రియ 'పారలౌకికం' లేదా 'ఆధ్యాత్మికం' అనబడింది.

ఆయా వ్యక్తుల అన్వేషణల ఫలితంగా, ఆధ్యాత్మికలోకంలో ఎన్నో దారులు పుట్టుకొచ్చాయి. వాటిని మతాలన్నారు. ఒకే మతంలో మళ్ళీ ఎన్నో శాఖోపశాఖలు వచ్చాయి. ఎవరికర్థమైనట్లుగా వారు విషయాలను వెల్లడించారు. ఇదే పరిపూర్ణమన్నారు. అంతిమసత్యమన్నారు. ఈ క్రమంలో తర్కాన్ని ఊతగా తీసుకుని కొన్ని మతాలు నడిస్తే, దౌర్జన్యాన్ని ఆయుధంగా తీసుకుని మరికొన్ని మతాలు బలపడుతూ వచ్చాయి.

మన కనులకు గోచరిస్తున్న సృష్టిని తర్కబద్ధంగా వివరించిన అతిప్రాచీనమతం వైదికసాంఖ్యం. అయితే ఇది ప్రకృతి పురుషులను అంతిమసత్యములుగా భావించి అంతటితో ఆగిపోయింది. సృష్టిలో ఉన్నట్టి అనేకములైన ఇతర విషయములను, భేదములను ఇది సంతృప్తికరంగా వివరించలేకపోయింది. దీని పునాదిపైన ఉపనిషత్తులూ, బౌద్ధమూ, యోగశాస్త్రమూ నిలబడ్డాయి. బౌద్ధం అనాత్మవాదం గనుక భరతభూమిలో నిలువలేకపోయింది. ఉపనిషత్తులు మేధావులైన జ్ఞానుల సొత్తులై సామాన్యులకు దూరమయ్యాయి. యోగశాస్త్రం కూడా రహస్యములైన విషయాలతో నిండి, సామాన్యజనానికి ఆసనాలుగా మాత్రమే అందింది. వీటిలోని తార్కికలోపాలను సరిచేసి వాటికంటే ఉత్తమంగా నిలచింది అద్వైతవేదాంతం. కానీ అది నిత్యజీవితంలో ఆచరణాత్మకం కాకపోవడం వల్ల, మేధావులకు మాత్రమే అర్థమయ్యే గహనములైన విషయములతో తర్కముతో నిండి ఉండటం వల్ల జనసామాన్యానికి దూరమైంది. పైగా, దానిలోని 'మాయావాదం' లాంటి కొన్ని సమస్యలు మేధావులకు కూడా కొరుకుడు పడకుండా మిగిలిపోయాయి. వాటినన్నింటినీ తన అమేయమైన తార్కికపటిమతో పరిష్కరించి అత్యుత్తమంగా వెలిగింది శివాద్వైతశాస్త్రం. దీనికి వసుగుప్తుడు, సోమానందుడు, ఉత్పలదేవుడు, లక్ష్మణగుప్తుడు, భూతిరాజు, కల్లటభట్టు, అభినవగుప్తుడు, జయరథుడు మొదలైన సిద్ధగురువులు జీవం పోశారు. వీరిలో అభినవగుప్తుడు, ఎవరెస్టు శిఖరం వంటి

పండితుడు, జ్ఞాని, యోగి, సిద్ధుడు, ద్రష్ట అయి ఉన్నాడు. వీరందరూ క్రీ. శ ఎనిమిదవ శతాబ్దం నుండి పదకొండో శతాబ్దం వరకూ కాశ్మీరరాష్ట్రంలో నివసించి శైవసాంప్రదాయాన్ని పరిపుష్టం చేశారు.

ఏ మతమైనా, మానవుని అనుభవాన్ని ప్రాతిపదికగా తీసుకుని నడుస్తుంది. కనిపించని స్వర్గనరకాలను వివరించడం కంటే, ఎదురుగా కన్పిస్తున్న సృష్టిని సరిగ్గా అర్థం చేసుకోవడం ముఖ్యం. దీనిలో ఇంద్రియానుభవాలు ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. మానవుడు సృష్టిని అనుభవంగా పొందే క్రమంలో మాతృ, మాన, మేయములనేవి మూడూ ఉంటాయి. వీటినే ప్రమాత, ప్రమాణము, ప్రమేయము అని అంటారు.

'ప్రమాత' అంటే అనుభవాన్ని పొందేవాడు. 'ప్రమాణ'మంటే అనుభవం. 'ప్రమేయ'మంటే అనుభవానికి వచ్చే జీవి లేదా వస్తువు. ఈ మూడూ లేకుండా ఏ అనుభవమూ ఉండదు. లౌకికానుభవంలోగాని ఆధ్యాత్మికానుభవంలో గాని వీటి పాత్ర నిస్సంశయంగా ఉంటుంది.

ఒకే శక్తి సృష్టి, స్థితి, లయములను చేస్తూ ఉన్నప్పటికీ, ఆయా సమయాలలో దాని స్థితిని బట్టి, అది తీసుకునే రూపమును బట్టి, వారిని బ్రహ్మ, విష్ణు, రుద్రులుగా భావించడం జరిగింది. వీరిలో, విష్ణువును సర్వోత్తమునిగా భావించింది వైష్ణవం. రుద్రుని సర్వాధిపతిగా భావించింది శైవం. ఇవిగాక, ద్వైతాద్వైత విశిష్టాద్వైత విభాగాలు వీటిలో ఉన్నాయి. సృష్టికర్త, సృష్టి వేర్వేరని భావించేవి ద్వైతమతములు. రెండూ ఒకటేననేది అద్వైతం. సృష్టి, సృష్టికర్తలో భాగమనేది విశిష్టాద్వైతం.

వైష్ణవంలోనూ, శైవంలోనూ ద్వైత సాంప్రదాయాలు సమానంగా ఉన్నప్పటికీ, శైవంలో మాత్రమే అద్వైతం గోచరిస్తుంది. పరబ్రహ్మమును ప్రతిపాదించే ఉపనిషత్తులలోను, అద్వైతంలోను, మాయావాదం వంటి కొన్ని తాత్విక సమస్యలకు తృప్తికరములైన సమాధానములు లేవు. వాటిని అధిగమిస్తూ, ఒక తార్కికసౌధమును నిర్మించే ప్రయత్నాన్ని చేసింది పరమేశ్వరాద్వయశాస్త్రం. దీనినే కాశ్మీరశైవమని నేడంటున్నారు. దీనిలో ముఖ్యమైనది షడధ్వ భావన.

షడధ్వములు

అధ్వమంటే 'దారి' యని అర్థం. షడధ్వములనే మాటకు ఆరుదారులని అర్థం. సృష్టి ఈ ఆరు విధములుగా నిర్మితమై ఉన్నదని త్రికశాస్త్రం అంటుంది. కనుక ఈ ఆరుదారులలో ప్రయాణించడం ద్వారా జీవుడు పరమేశ్వరునిలో లీనమవుతాడని అదంటుంది. అవి, వర్ణ, మంత్ర, పద, కళా, తత్త్వ, భువనములు.

సృష్టిలో సమస్తానికీ సంకల్పం మూలం. సంకల్పం క్రియగా మారేలోపు శబ్దరూపమును ధరిస్తుంది. శబ్దములే వర్ణములు లేదా అక్షరశబ్దములు. సంస్కృతభాషలో 50 వర్ణములున్నాయి. వీటిలో 16 అచ్చులు, 34 హల్లులు ఉంటాయి. అచ్చులు శివస్వరూపములైతే, హల్లులు శక్తిస్వరూపములని తంత్రమంటుంది. ప్రపంచములోని ఏ భాషకైనా ఈ 50 శబ్దములే పునాదులుగా ఉంటాయి. కనుక, ఏ భాషయైనా చివరకు శివశక్తుల మయమే అవుతున్నది. సంకల్పం యొక్క రెండవరూపం, శబ్దం లేదా వర్ణం అవుతుంది. ఈ 50 వర్ణములతో వివిధములైన బీజమంత్రము లేర్పడతాయి. మంత్రములతో పదములు, వాక్యముల నిర్మాణం జరుగుతుంది. ఆయా శబ్దశక్తులతో ఏర్పడే భూమి, జలము, అగ్ని మొదలైన 36 తత్త్వములతో సృష్టి నిర్మాణం

జరుగుతుంది. ఇవి, మరలా నివృత్తి మొదలైన అయిదుకళలుగా విభజింపబడి ఉంటాయి. వీటన్నిటినీ ఇటుకలుగా తీసుకుని, 118 లోకములు లేదా భువనముల నిర్మాణం జరుగుతుంది. ఈ ఆరింటినీ కలిపి షడధ్వములని అంటారు.

షడధ్వములూ తనలోనే ఉన్నాయని, తాను వాటిలో నిండి యున్నానని ధ్యానిస్తూ, తానే విశ్వమంతా నిండిపోయిన పరమశివాద్వైతభావనలో లీనమయ్యే ప్రక్రియ ఈ మార్గపు సాధనా విధానమౌతుంది. దీనినే అనేక కోణములలో వివరిస్తూ, ప్రాథమిక స్థాయి నుండీ, అత్యున్నతస్థాయివరకూ సాధకుని చేయి పట్టుకుని నడిపిస్తుంది త్రికశాస్త్రం.

అత్యున్నతమైన భావనలతో కూడిన చింతనాధారను సతార్కికంగా వివరిస్తున్న ఈ శివాద్వైతశాస్త్రం ప్రపంచ ఆధ్యాత్మికచరిత్రలోనే తలమానికమైనదని చెప్పక తప్పదు.

భైరవ స్తవము

ఇది అభినవగుప్తులవారికి చాలా ఇష్టమైన స్తోత్రములలో ఒకటి. తన జీవితపు చివరి ఘట్టంలో, తాను రచించిన ఈ స్తోత్రమును పఠిస్తూనే, తన 1200 మంది శిష్యులతో బాటు, ఆయన భైరవగుహలోకి వెళ్లి మాయమైపోయినట్లుగా కాశ్మీర రాష్ట్రంలో ఈనాటికీ చెప్పుకుంటారు.

తొమ్మిదిశ్లోకములతో కూడిన ఈ స్తోత్రం చూడటానికి చిన్నదైనా, భావగాంభీర్యంలో చాలా లోతైనది. శివాద్వయశాస్త్రము యొక్క సారమంతా ఈ తొమ్మిది శ్లోకములలో నిక్షేపించి చెప్పబడింది.

శ్లో|| వ్యాప్త చరాచర భావ విశేషం
చిన్మయమేకమనన్త మనాదిం
భైరవనాథ మనాథ శరణ్యం
త్వన్మయచిత్తతయా హృది వందే || 1 ||

ఉ|| భావవిశేషుడై జగతి భేదములందున దాగి యొక్కడై
పావకుహోలె వెల్గు పర భైరవునంతట నెల్లగాంచుచున్
జీవుల కాదియౌ విభుని జిన్మయధాముని జిత్తమందు ని
త్తావున నిల్పి గొల్తు మది తన్మయమొంద యనాధ నాథునిన్

చరాచరములలో విశేషమైన భావరూపంలో వ్యాపించి యున్నవాడు, చిన్మయుడు, ఏకస్వరూపుడు, ఆదీ అంతములు లేనివాడు, అనాథలకు శరణమైనవాడు, నా చిత్తములో నిండియున్నవాడు అగు భైరవనాథునికి హృదయాంజలిని ఘటిస్తున్నాను.

శ్లో|| త్వన్మయమేత మశేష మిదానీం
భాతి మమ త్వదనుగ్రహ శక్త్యా
త్వం చ మహేశ సదైవ మమాత్మా
స్వాత్మమయం మమ తేన సమస్తం || 2 ||

చం|| ఎదుటను దేలు విశ్వమిక నెంతయు నీదగు రూపు దాల్చుచున్
పదపడి వెల్గె చోద్యముగ పారము నంటుచు నీ కృపాబ్ధియై
సదయుడవో మహేశ ! సరిసాటిగ నాదగు యాత్మ వీవెగా
ఇది యనుదంత యాత్మ ఘనవిస్తృతి యైచనె నెంత వింతయో !

ఈ సృష్టి అంతయూ నీచే నిండి వెలుగుతున్నట్లుగా నీ అనుగ్రహశక్తి వలన నాకు గోచరిస్తున్నది. ఓ మహేశ్వరా ! నీవే నా ఆత్మవు. ఈ సమస్తమూ నా ఆత్మమయమే అయి ఉన్నది.

శ్లో|| స్వాత్మని విశ్వగతేత్వయి నాథే
తేన న సంసృతి భీతి కదాస్తి
సత్స్వపి దుర్ధర దుఃఖ విమోహ
త్రాసవిధాయిషు కర్మగణేషు || 3 ||

ఉ|| పలిక వీవె గావె గన నెంచగరాని జగంబుకెల్ల; నా
పాలిట నాథుడట్లు వగపారగ యాత్మగ నిల్చియుండ; రా
జాలునె దుస్సహంబులగు జిక్కులబెట్టి వినోదమందు పో
గాలపు రూపులై యమరు కర్మగణంబుల కెల్లనా దరిన్ ?

ఓ నాథా ! విశ్వాత్మకుడవైన నీవే నా ఆత్మగా ఉన్నావు. అందువల్ల, భరింపరాని దుఃఖములు, మోహములతో నిండియున్న ఈ సంసారము యొక్క భయం నాలో కొంచెమైనా లేదు.

శ్లో|| అంతక మాం ప్రతి మా దృశమేనాం
క్రోధకరాల తమాం వినిధేహి
శంకరసేవన చింతన ధీరో
భీషణ భైరవ శక్తిమయోస్మి || 4 ||

మ|| యమరాజా ! నను గోపదృష్టి గనగా లేదందు నెట్టైట్లనన్
సమయింపంగ విధాయమౌ సులువు దుస్సాధ్యంబు జింతింప; నే
విమలాత్ముండ; శశాంకమౌళి పదసేవా చింతనా ధీరతన్
భ్రమభీతాదుల జంపి భైరవత నిర్భీతాత్మ నేనందితిన్

ఓ అంతకా ! క్రోధముతో నిండిన నీ కరాళదృష్టితో శంకరసేవలో మునిగిన ధీరుడనైన నావైపు చూడకు. నేను భీషణుడైన భైరవుని శక్తితో నిండియున్నాను.

శ్లో|| ఇత్థ ముపోఢ భవన్మయ సంవిద్
దీధితి దారిత భూరి తమిస్రః
మృత్యుయమాంతక కర్మపిశాచై
ర్నాథ నమోస్తు న జాతు బిభేమి || 5 ||

ఉ|| నీదగు యాత్మతేజమిట నిత్యపు వెల్గుల నన్ను గాచు; నా

పొదగు జిమ్మ చీకటుల బారగద్రోలుచు నెల్లవేళలన్
బాధలబెట్టు కర్మలిక బాహ్యపిశాచములొాచు నెంచ; గా
బోదు; యమాంతకుండ విట బాగుగ నన్నిక రక్షసేయగా

ఓ యమాంతకా ! నీ సంవిత్తు యొక్క వెలుగు, గొప్పదైన నా అజ్ఞానపు చీకటిని, కర్మపిశాచములను మరియు మరణమును కూడా నాశనం చేస్తున్నది. ఇతరమునెరుగను. నాథుడవైన నీకు నమస్కరిస్తున్నాను.

శ్లో|| ప్రోదిత సత్య విబోధ మరీచి
ప్రేక్షిత విశ్వపదార్థ సతత్వః
భావపరామృత నిర్భర పూర్ణో
త్వయ్యహమాత్మని నివృతి మేమి || 6 ||

ఆ|| సత్యబోధలందు సాన్నిధ్యమున్ గాంచి
విశ్వజాలమందు వివరమెంచి
అమృతభావ జలధి నాత్మలో నిండించి
నీవె నేనటంచు నెమ్మదింతు

సత్యమైన జ్ఞానము యొక్క వెలుగుగా నిన్ను గ్రహిస్తూ, విశ్వములోనున్న సమస్త పదార్థము యొక్క సత్యముగా నిన్ను వివరిస్తూ, పరామృతం వంటి నీ భావధ్యానములో మునిగి, నీవే యైన నా ఆత్మలో విశ్రాంతిగా ఉన్నాను.

శ్లో|| మానసగోచరమేతి యదైవ
క్లేశదశా తనుతాప విధాత్రీ
నాథ తదైవ మమ త్వదభేద
స్తోత్ర పరామృతవృష్టి రుదేతి || 7 ||

ఆ|| క్లేశ కష్ట తతుల గడతేర్చువాడవై
మనసు కందుదీవు మహిత గతుల
నీవె నేనటన్న నిక్కంపు భావమే
అమృత స్తోత్రమగుచు యవని కందె

దేహమునకు బాధలను కలిగించే కష్టములను పోగొట్టే నాథుడవైన నీవు మనస్సుకు మాత్రమే గోచరిస్తావు. నీతో కలిగిన అభేదత్వమే ఈ స్తోత్రమనే పరమామృత వర్షమును కురిపిస్తున్నది.

శ్లో|| శంకర సత్యమిదం వ్రతదాన
స్నానతపో భవతాప విదారీ
తావక శాస్త్ర పరామృతచింతా
స్యన్దతి చేతసి నివృతి ధారాం || 8 ||

ఆ|| స్నాన దాన వ్రతము సత్యమౌ తపమెన్న

దేవ ! కష్టతతుల దీర్చుగాక !
నీదు శాస్త్రచింత నిత్యామృతం బెంచ
ముక్తి వర్షమందు ముంచు మదిని

ఓ శంకరా ! ఇది సత్యం ! వ్రతము, దానము, స్నానము, తపస్సు మొదలైనవి భవతాపమును తొలగించవచ్చు. కానీ పరమమైన అమృతమువంటి నీ శాస్త్రము యొక్క ధ్యానము మాత్రము, నా చిత్తములో మోక్షవర్షమును కురిపిస్తున్నది.

శ్లో|| నృత్యతి గాయతి హృష్యతి గాఢం
సంవిదియం మమ భైరవనాథ
త్వామ్ ప్రియమాప్య సుదర్శనమేకం
దుర్లభమన్య జనైః సమయజ్ఞమ్ || 9 ||

ఆ|| ఆత్మయందు గాంచి యానందముగ నిన్ను
ఆడిపాడుచుందు నమిత గతుల
గోచరించుదీవు గోరంత భక్తికిన్
ఒరులకలవి గావు యుర్వియందు

ఓ భైరవనాథా ! నిన్ను ప్రేమించేవారికి నీవు చక్కగా గోచరిస్తావు. కానీ ఇతరులకు దుర్లభుడవు. ఈ విషయమును గ్రహించి నిన్ను నాలోనే చూస్తున్న నా అంతరంగము ఆడుతూ పాడుతూ గొప్పదైన ఆనందంలో తేలిపోతున్నది.

శ్లో|| వసురసపౌషే కృష్ణ దశమ్యామ్
అభినవగుప్తః స్తవమిమ మకరోత్
యేన విభుర్భవ మరుసంతాపం
శమయతి ఝటితి జనస్య దయాళుః || 10 ||

ఆ|| అరువదెనిమిదేండ్ల యరుదైన దినమందు
స్తవము నభినవుండు చక్కజేసె
దీనినెంచి మిగుల దయతోడ నీశుండు
తాపతతుల నెల్ల దీర్చుగాత

అష్టవసువులు గనుక, వసు అంటే 8. షడ్రసములు గనుక రస అంటే 6. తన 68 వ సంవత్సరంలో పుష్యమాసపు కృష్ణదశమి, మకరసంక్రాంతి నాడు అభినవగుప్తుడు ఈ స్తోత్రమును రచించాడు. దీనిని పఠించడం వల్ల, దయాళువైన పరమేశ్వరుడు కరుణిస్తాడు. జనులకు కలిగే బాధలను శమింపజేస్తాడు.

సమాప్తం స్తవమిదం అభినవాఖ్యం పద్య నవకమ్

అభినవగుప్తాచార్యుని చేత రచింపబడిన తొమ్మిది పద్యములతో కూడిన ఈ స్తోత్రము సమాప్తము.

విషయసూచిక

శ్రీ రామకృష్ణ ప్రార్థన



నా ఇష్టదైవమగు శ్రీరామకృష్ణుల ప్రార్థనతో ఈ గ్రంథము ప్రారంభించ బడుచున్నది.

శ్లో|| యోగారూఢాయ శాంతాయ యోగపట్టాభిషిక్తయే
నిత్య బోధనిమగ్నాయ రామకృష్ణాయతే నమః ||

యోగశిఖరమును అధిష్ఠించినవాడును, పరమశాంత స్వభావుడును, యోగపట్టాభిషిక్తుడును, నిత్య సమాధి నిమగ్నుడును అగు శ్రీరామకృష్ణునకు ప్రణామము.

శ్లో|| యోగేశ్వరాయ నిత్యాయ యోగవిఘ్న నివారిణే
యోగనాథాయ దేవాయ రామకృష్ణాయతే నమః ||

యోగేశ్వరుడును, నిత్యుడును, యోగసాధన యందు కలుగు విఘ్నములను నివారించువాడును, యోగనాథుడును, దేవదేవుడునగు శ్రీరామకృష్ణునకు ప్రణామం.

శ్లో|| ఈశ్వరాత్మక చిత్తాయ విష్ణుమాయా విలాసినే
లీలాకల్పిత దేహాయ రామకృష్ణాయతే నమః ||

ఈశ్వరునితో ఒకటైన చిత్తము కలవాడును, విష్ణుమాయతో తన జీవితమును ఉల్లాసముగా గడపినవాడును, లీలగా దేహమును ధరించినవాడును అయిన శ్రీరామకృష్ణునకు ప్రణామం.

శ్లో|| మాయామానుష వేషాయ మాయాభ్రాంతి విదారిణే
సచ్చిదానంద రూపాయ రామకృష్ణాయతే నమః ||

మాయామానుష వేషమును ధరించినవాడును, తన భక్తుల మాయాభ్రాంతిని నిర్మూలించువాడును, సచ్చిదానంద రూపుడునగు శ్రీరామకృష్ణునకు ప్రణామం.

శ్రీమన్మహామాహేశ్వర

అభినవగుప్తాచార్య కృత

తంత్రసారము

మొదటి ఆహ్నికము

విజ్ఞానభేద ప్రకాశనము

శ్లో|| విమలకలాశ్రయాభినవసృష్టి మహాజననీ
భరిత తనుశ్చ పఞ్చముఖ గుప్తరుచిర్జనకః |
తదుభయ యామలస్ఫురిత భావవిసర్గమయం
హృదయమనుత్తరామృతకులం మమ సంస్ఫురతాత్ || 1 ||

శుద్ధమైన కళలతో ఆశ్రయింపబడిన ఈ నిత్యనూతనమైన సృష్టికి మహాజనని. ఆమెను తన దేహంలో నింపుకుని పంచముఖములతో రహస్యమైన శక్తితో నిండియున్న జనకుడు, వీరిద్దరి యామలంతో స్ఫురిస్తున్న భావవిసర్గమయమైన అనుత్తరామృతకులము నా హృదయంలో చక్కగా వెలుగుతున్నది.

అభినవగుప్తాచార్యుల వారు శైవసిద్ధాంతమునందు మహాపండితుడేగాక, క్రమ - త్రిక సిద్ధాంతములను సమన్వయపరచి, జెపోశనపట్టి, శివాద్వైతానుభవమును పొందిన మహాసిద్ధుడు గూడ. తంత్రసార గ్రంథమును ప్రారంభించుచూ తన తల్లిదండ్రులను, శివశక్తులను ఒకే శ్లోకమున భక్తిపూర్వకముగా స్మరించుచున్నాడు. తల్లిదండ్రులను, గురువును, దైవమును కృతిప్రారంభమున స్మరించుట కృతికర్తలకు పరిపాటి.

ఈయన తండ్రిగారు నరసింహగుప్తుడు. తల్లి విమలకళ. విమలకలా అనే మొదటి పదంలోనే తల్లిగారిని స్మరిస్తూ తన కృతిని ప్రారంభించారు ఆచార్యులు. అభినవసృష్టి మహాజననీ అనే పదంలో 'అభినవగుప్తుడనైన నన్ను కనిన తల్లివి నీవు' అంటూ తల్లిగారిని స్మరిస్తున్నారు. రెండవపాదంలో 'గుప్తరుచిర్జనకః' అంటూ, తండ్రిగారైన నరసింహగుప్తులను స్మరించారు. విమలకళాస్వరూపిణి పరమేశ్వరి. ఆమె సృష్టిరూపంలో విలసిల్లుతున్నది. ఆమెయందు గుప్తముగా దాగి పరమేశ్వరుడున్నాడు. ఆయన సృష్టియందున్నాడు గాని బాహ్యదృష్టికి గోచరించనివాడై నిగూఢముగా ఉన్నాడు. కనుక గుప్తుడు. ఈ విధముగా విమలకల, గుప్త అనే పాదములలో తన తల్లిదండ్రులను, పరమేశ్వరీ పరమేశ్వరులను ఒకేసారి స్మరించారు ఆచార్యులవారు. అనగా, తన తల్లిదండ్రులను పార్వతీపరమేశ్వరులుగా భావించి నమస్కరించారు. వారి భావపరంపరయే, అనగా, వారి ఉత్తమసంస్కారములే, వారి తనయుడైనట్టి తన హృదయంలో కూడా అమృతమయములై భాసిస్తూ, తనను పరమేశ్వరపూజకు సిద్ధం చేసినాయన్న భావమును శ్లోకం యొక్క సామాన్యార్థంలో సూచించారు. తన్త్రాలోకమునకు భాష్యమును వ్రాసిన జయరథుడు అభినవగుప్తుని శిష్యుడు. ఆ గ్రంథమునకు కూడా

ప్రారంభశ్లోకం ఇదే. ఈ శ్లోకమునకు జయరథుడు, కులసాంప్రదాయమును బట్టి, క్రమసాంప్రదాయమును బట్టి, మామూలు అర్థమును బట్టి, మూడు విధములైన అర్థములను వ్యాఖ్యానించాడు.

ఈ విధంగా అభినవగుప్తాచార్యులు వ్రాసిన పదములు, శ్లోకములు, అనేక గూఢార్థములతో నిండి ఉంటాయి. కారణమేమంటే ఆయన మంత్రసిద్ధుడు, సమస్త శాస్త్రములను మథించిన మహాపండితుడు, మహాశివభక్తుడు, పరమశివానుభవమును పొందిన మహనీయుడు.

ఈ శ్లోకమునకు గల పారమార్థికార్థాన్ని గమనించుదాం. సృష్టి అభినవం. అంటే నిత్యనూతనము. దీనికి అవ్యక్త మహదహంకారాది తత్త్వములు ఆధారభూతములై యున్నవి. అవి విమలములు, శుద్ధములు. సృష్టికి మూలశక్తులు శుద్ధములైనవి. కనుకనే వాటిని శుద్ధవిద్యలంటారు. త్రిగుణాత్మికయగు ఆదిశక్తి ఈ సృష్టికి తల్లి. ఆ తల్లికి ఆధారమేమి? పరమేశ్వరుడే ఆమెకు ఆధారము. ఆమె ఆయనకంటే వేరు కాదు. ఆయనలో భాగమే ఆమె. ఆదిశక్తిని తనలో ధరించియున్న పరమేశ్వరుడు పంచముఖుడుగా, పంచభూతాత్మకుడుగా ఉన్నాడు. కానీ ప్రకటస్థితిలో లేకుండా, వాటిలో దాగి, గుప్తంగా ఉన్నాడు. సృష్టి వీరిద్దరి యామళమే, అనగా, కలయికయే. కనుకనే, పాంచభౌతికమగు భౌతికసృష్టి కూడా స్త్రీపురుషుల కలయికతోనే ముందుకు సాగుతున్నది. శివశక్తుల సమ్మిశ్రిత స్వరూపమైన సృష్టి అమృతమయమే. అద్వైతవేదాంతులు చెప్పునట్లు ఇది మాయ కాదు, భ్రాంతి కాదు. త్రికశాస్త్ర ప్రకారం సృష్టి అమృతమయం. శివశక్తుల ఆనంద విస్ఫోటనమే ఈ సృష్టి. వారి భావవిసర్గమే ఇది. విసర్గమంటే ఉద్భవించినట్టిది. అంటే, వారి భావమునుండి పుట్టినట్టిది. ఇది అనుత్తరము, అనగా, దీనికంటే అధికమైనది లేనట్టిది. ఇది అమృతకులము, అనగా, నాశనములేని నిత్యనిరంతర స్థితి.

సృష్టిని, అందులోని తత్త్వములను, వీటన్నింటినీ శివశక్తుల ఆనందకేళీ విసర్గముగా చూస్తున్నానని ప్రారంభ ప్రార్థనాశ్లోకములోనే అంటూ, త్రికశాస్త్రపు సారమునంతా ఈ ఒక్క శ్లోకంలోనే నిక్షిప్తం చేశారు అభినవగుప్తాచార్యులు. ఈ విధమైన దృష్టి, అత్యున్నతమైన సమాధిస్థితికి సంకేతము.

శ్లో|| వితతస్తన్త్రాలోకో విగాహితుం నైవ శక్యతే సర్వైః |
ఋజువచనవిరచితమిదం తు తన్త్రసారం తతః శృణుత || 2 ||

విస్తారమైనదైన తన్త్రాలోకమును అర్థం చేసికోవడం ఎల్లరకూ సాధ్యం కాదు. కనుక, సూటిమాటలతో నాచేత రచింపబడిన తన్త్రసారమును చెబుతున్నాను.

ఆచార్యులవారి చేత రచింపబడిన తంత్రాలోకమనే ఉద్గ్రంథమును అర్థము జేసికొనుట, పండితులకే సాధ్యముగాదు, ఇక పామరుల మాట చెప్పపని లేదు. ఈ గ్రంథము చాలా విస్తారమైనది. కనుక, లోకప్రయోజనార్థం, దాని సారమును క్లుప్తముగా, సూటియైన మాటలలో, సరళమైన భాషలో వివరించదలచి, 'తంత్రసారమ'నే ఈ గ్రంథమును వ్రాస్తున్నానని, ఈ గ్రంథప్రయోజనమును ముందుమాటగా వివరించారు.

శ్లో|| శ్రీశంభునాథభాస్కర చరణనిపాత ప్రభాపగత సంకోచమ్ |
అభినవగుప్త హృదమ్బుజ మేతద్విచినుత మహేశపూజనహేతోః || 3 ||

శ్రీ శంభునాథుడనే సూర్యుని పాదములనుండి ప్రసరించిన కాంతియొక్క హేతువుచేత అభినవగుప్తుని హృదయము తన సంకోచమును వీడి మహేశ్వరుని పూజకు సిద్ధమైనది.

దైవపూజకు పుష్పములు కావాలి. అంతఃపూజలో భక్తుని హృదయమే ఆ పుష్పమౌతుంది. ముకుళించుకుని ఉన్న మొగ్గవంటి తన హృదయం గురుకటాక్షంతో వికసించిన పుష్పమై, శివపూజకు ఎలా అర్హతను పొందినదో ఈ శ్లోకంలో వివరించారు ఆచార్యులు.

అభినవగుప్తులవారు యువకునిగా ఉన్నపుడు అధికమైన జిజ్ఞాస కలిగినవారు. ఎన్నో శాస్త్రములను ఎందరో గురువులవద్ద అభ్యసించారు. దాదాపుగా ఇరువదిమంది పైనే గురువులు ఈయనకున్నారు. కానీ, త్రికశాస్త్రపు రహస్యములను ఈయనకు అవగతం గావించిన మహనీయుడు శంభునాథుడనే గురువు. ఆయనను సూర్యునితో పోల్చుచూ, ఆయన పాదములనుండి ప్రసరించిన కిరణములు సోకి, తన హృదయకమలం వికసించిందని అలంకారిక భాషలో మనోజ్ఞంగా వివరించారు. ఈయన యొక్క గురుభక్తికి ఈ శ్లోకం తార్కాణంగా నిలుస్తున్నది.

మొదటి రెండు శ్లోకములలో దైవస్మరణ, గురుస్మరణ గావించి, విషయంలోకి ప్రవేశిస్తున్నారు.

ఇహ జ్ఞానం మోక్షకారణం బన్ధనిమిత్తస్య అజ్ఞానస్య విరోధకత్వాత్; ద్వివిధం చ అజ్ఞానం బుద్ధిగతం పౌరుషం చ; తత్ర బుద్ధిగతమ్ అనిశ్చయస్వభావం, విపరీతనిశ్చయాత్మకం చ । పౌరుషం తు వికల్పస్వభావం సంకుచితప్రథాత్మకం, తదేవ చ మూలకారణం సంసారస్య ఇతి వక్ష్యామో మలనిర్ణయే ।

బంధనిమిత్తమైన అజ్ఞానమునకు విరోధియగుటచేత ఈ జ్ఞానము మోక్షకారణము; బుద్ధిగతము, పౌరుషమని అజ్ఞానము రెండు విధములు. వీనిలో బుద్ధిగతమైనది అనిశ్చయస్వభావము మరియు విపరీత నిశ్చయాత్మకము. పౌరుషమనేది వికల్పస్వభావము, సంకుచితప్రథాత్మకం. మలమును నిర్ణయించుచూ, సంసారమునకు ఇదే మూలకారణమని చెప్పుచున్నాను.

తత్ర పౌరుషమ్ అజ్ఞానం దీక్షాదినా నివర్తేతాపి, కిం తు దీక్షాపి బుద్ధిగతే అనధ్యవసాయాత్మకే అజ్ఞానే సతి న సంభవతి హేయోపాదేయ నిశ్చయ పూర్వకత్వాత్ తత్త్వశుద్ధి శివయోజనారూపాయా దీక్షాయా ఇతి । తత్ర అధ్యవసాయాత్మకం బుద్ధినిష్ఠమేవ జ్ఞానం ప్రధానమ్, తదేవ చ అభ్యస్యమానం పౌరుషమపి అజ్ఞానం నిహన్తి, వికల్పసంవిదభ్యాసస్య అవికల్పాన్తతా పర్యవసానాత్ । వికల్పాసంకుచిత సంవిత్ప్రకాశరూపో హి ఆత్మా శివస్వభావ ఇతి సర్వథా సమస్తవస్తునిష్ఠం సమ్యఙ్నిశ్చయాత్మకం జ్ఞానముపాదేయమ్ । తచ్చ శాస్త్రపూర్వకమ్ ।

వీనిలో పౌరుషమనే అజ్ఞానము దీక్షలవల్ల నివర్తిస్తుందిగాని, ప్రయత్నం చెయ్యని కారణం చేత, బుద్ధిలోని అజ్ఞానం మాత్రం నమసిపోదు. హేయోపాదేయముల నిశ్చయము, తత్త్వశుద్ధి, శివధ్యానముల రూపమైన దీక్షలవల్లనే ఇది (బుద్ధిపరమైన అజ్ఞానం నశించడం) జరుగుతుంది. కనుక, ఈ రెంటిలోనూ, అధ్యవసాయాత్మికమైన, బుద్ధినిష్ఠాపూర్వకమైన జ్ఞానమే ప్రధానము. దానిని అభ్యాసం గావించడం వల్ల, వికల్ప సంవిద్ జ్ఞానమునుండి, అవికల్పస్థితి వరకూ ఉన్నట్టి పౌరుషమనే అజ్ఞానం కూడా నశిస్తుంది. వికల్పం వల్ల సంకుచితం కాని సంవిత్ప్రకాశరూపమే శివస్వభావమైన ఆత్మ అంటూ చక్కని నిశ్చయముతో సమస్త వస్తువులపట్లా సర్వథా నిలచియుండే జ్ఞానమే స్వీకరించదగినట్టిది. ఇది శాస్త్రము చెప్పుచున్నది.

శాస్త్రం చ పరమేశ్వరభాషితమేవ ప్రమాణమ్ । అపర శాస్త్రోక్తానామర్థానాం తత్ర వైచిత్ర్యేణ అభ్యుపగమాత్ తదర్థాతిరిక్తయుక్తిసిద్ధనిరూపణాచ్చ, తేన అపరాగమోక్తం జ్ఞానం తావత ఏవ బన్ధాత్ విమోచకమ్, న సర్వస్మాత్, సర్వస్మాత్ తు విమోచకం పరమేశ్వరశాస్త్రం, పఞ్చస్రోతో (మయం) దశాష్టాదశవస్వష్టభేదభిన్నమ్ । తతోఽపి సర్వస్మాత్ సారం షడర్ధశాస్త్రాణి । తేభ్యోఽపి మాలినీవిజయమ్ । తదన్తర్గతశ్చార్థః సంకలయ్యాశక్యో నిరూపయితుమ్ ।

శాస్త్రము పరమేశ్వర భాషితమన్నది ప్రమాణము. అపరశాస్త్రములచే చెప్పబడిన అర్థములను బాగుగా పరిశీలించి వాటిని యుక్తిసిద్ధమైన నిరూపణము చేయగా, మిగులునట్టిదే అపర-ఆగమోక్తమైన జ్ఞానము. ఈ జ్ఞానము వలన బంధవిమోచనమౌతుందని భావిస్తారుగాని అందరికీ ఇది జరుగదు. అందరికీ బంధవిమోచనం కలిగించేది పరమేశ్వరశాస్త్రమే. ఇది అయిదు పాయలుగా పారుతూ, పది, పద్దెనిమిది, అరువదినాలుగు రకములుగా ఉన్నది. వాటన్నిటి సారమే త్రికశాస్త్రము. వానిలోకూడా మాలినీవిజయమే ముఖ్యమైనట్టిది. దాని అంతరార్థములను సేకరించి నిరూపిస్తున్నాను.

న చ అనిరూపిత వస్తుతత్త్వస్య ముక్తత్వం మోచకత్వం వా, శుద్ధస్య జ్ఞానస్యైవ తథారూపత్వాత్ ఇతి । స్వభ్యస్తజ్ఞానమూలత్వాత్ పరపురుషార్థస్య తత్సిద్ధయే ఇదమ్ ఆరభ్యతే

నిరూపింపబడనట్టి వస్తువుచేత మోక్షము రాదు, అది మోచకము కూడా కాలేదు. శుద్ధజ్ఞానము వల్ల మాత్రమే ఇది జరుగుతుంది. స్వభ్యస్తజ్ఞానమే పరమమైన పురుషార్థసిద్ధిని కలిగిస్తుందని చెబుతూ ఆరంభిస్తున్నాను.

వ్యాఖ్యానము

ఏ శాస్త్రమునకైనా కొన్ని పారిభాషిక పదములుంటాయి. వాటిని గ్రహించనిదే, ఆ శాస్త్రం ఏమి చెబుతున్నదో అర్థం కాదు. కనుక ముందుగా వాటిని అర్థం చేసుకోవాలి. బంధమునకు కారణం అజ్ఞానం అంటున్నారు. బంధమంటే ఏమిటి?

తనను తాను ఒక దేహధారిగా, ఒక పరిమితుడైన జీవునిగా, జననమరణములకు, కర్మకు బద్ధుడైన క్షుద్రునిగా భావించడమే బంధము. బంధమునకు విపరీతమైనది మోక్షము. అదేమిటి? ఈ పరిమితులను భేదించి, తనను తాను, నిరాకారునిగా, అపరిమితునిగా, జనన మరణములకు, కర్మకు, ప్రకృతికి అతీతుడైన, శుద్ధచైతన్యస్వరూపుడైన పరమశివునిగా అనుభవంలో తెలుసుకోవడం మోక్షం. బంధమునకు కారణం అజ్ఞానం. అంటే ఏమిటి? తానే పరమశివుడనన్నది తెలియని స్థితియే అజ్ఞానం. ఈ అజ్ఞానం, ఊరకే పోయేది కాదు. అనుకున్నంతమాత్రాన నశించేది కాదు. ఆ అజ్ఞానమును నశింపజేసే మార్గములున్నాయి. అవియే, ఆణవ, శాక్త, శాంభవ, అనుపాయములు. వాటిని ముందుముందు వివరిస్తుంది ఈ శాస్త్రం.

ఈ అజ్ఞానము మనలో రెండు విధములుగా ఉంటుంది. ఒకటి బుద్ధిగతం, అంటే మన బుద్ధిలో భాగంగా ఉంటుంది. రెండవది పౌరుషం, అంటే పురుషునకు లేదా ఆత్మకు సంబంధించినది. ఈ రెండింటి లక్షణములను వివరిస్తున్నారు.

బుద్ధిగతమైన అజ్ఞానమునకు లక్షణములు రెండు.

1. అనిశ్చయ స్వభావము. అంటే, దేనినీ తేల్చుకోలేని సందిగ్ధపరిస్థితిలో మనస్సు ఊగిసలాడుతూ ఉండే స్థితి.

2. విపరీత నిశ్చయాత్మకము. అంటే, ఉన్నదానిని ఉన్నట్లుగా కాక, మరొకవిధంగా తప్పుగా అర్థం చేసుకునే మానసికస్థితి. ఈ రెండూ కలసి, బుద్ధిగతమైన అజ్ఞానం అనబడతాయి. అంటే, బుద్ధిని ఆవహించిన అజ్ఞానమని అర్థం.

పౌరుషగతమైన అజ్ఞానమునకు కూడా రెండు లక్షణములున్నాయి.

1. వికల్పస్వభావం: అంటే, ఊహించడం. ఒక్కటిగా ఉన్న తాను, నానాత్వంతోకూడిన ఈ సృష్టిగా మారినట్లు ఊహించుకోవడం.

2. సంకుచిత ప్రథ: సంకుచితత్వంలో మునిగి తనను తాను అల్పాత్మగా భావించడం. ఆదీ అంతమూ లేని పరమాత్మ తనను తాను తగ్గించుకొని 'జీవాత్మనే నేను' అనుకోవడం. ఈ రెండూ పౌరుషమనే అజ్ఞానలక్షణములు. అంటే, ఆత్మను ఆవరించిన అజ్ఞాన లక్షణములని అర్థం.

ఈ రెండు అజ్ఞానములే మనయొక్క సంసారభ్రాంతికి కారణములు. వీటిని మలమని అంటారు, అంటే 'మురికి' అని అర్థం. ఇది శరీరమునకు పట్టిన మురికి కాదు. బుద్ధికి, ఆత్మకు పట్టిన మురికి. దీనిని ఎలా తొలగించాలి?

పురుష (ఆత్మ) స్థాయిలోని అజ్ఞానము, సద్గురువుచేత ఇవ్వబడిన దీక్షాస్వీకారం వల్ల నశిస్తుంది. దానిని తొలగించే శక్తి గురువుకుంటుంది. కానీ, శిష్యునియందలి బుద్ధిగతమైన అజ్ఞానమును అతడు తొలగించలేడు. దానిని ప్రయత్నపూర్వకంగా శిష్యుడే తొలగించుకోవాలి. అలాంటి ప్రయత్నం చెయ్యకపోతే అది పోదు. ఏమిటా ప్రయత్నం? సాధనాపరమైన గట్టి నిశ్చయమును తీసుకోలేకపోవడము, లేదా తప్పుడు నిశ్చయమును తీసుకుని దానిని అనుసరించడము. ఈ రెండూ బుద్ధిపరములైన అజ్ఞానములని పైన చెప్పబడింది. ఈ శ్లోకములో వీటిని వివరిస్తున్నారు. ఇందులో మూడు అంశములున్నాయి.

హేయోపాదేయముల నిశ్చయము - హేయమనగా, కూడనిది, తిరస్కరించదగినది, అసహ్యమైనది. ఉపాదేయమనగా, కూడునది, స్వీకరించదగినది, సహించునది. సాధనామార్గమున ఏది మంచిది? ఏది కాదు? ఏది సరియైనది? ఏది కాదు? ఏది అనుసరించదగినది? ఏది కాదనిన నిశ్చయజ్ఞానం శిష్యునకుండాలి. అది లేకపోవడం అజ్ఞానమనబడుతుంది. ఈ నిశ్చయజ్ఞానమునకే మరోపేరు వివేకము. వేదాంత శాస్త్రములో ఇది 'యుక్తాయుక్త వివేకమ' ని చెప్పబడింది.

తత్త్వశుద్ధి - అనగా, మనయందున్న పంచభూతములు, పంచతన్మాత్రలు, దశేన్ద్రియములు, మనస్సు, అహంకారము, బుద్ధి, ప్రకృతులను తత్త్వములంటారు. అవి, శుద్ధి చేయబడాలి. ఆ దారిలో సాధన సాగాలి. అప్పుడు సాధకునిలో తత్త్వశుద్ధి జరుగుతుంది.

శివధ్యానదీక్ష - తత్త్వశుద్ధి లభించగా, చెదరని ఏకాగ్రతతో, పరమేశ్వరధ్యానమును అభ్యసించాలి.

ఈ మూడు విధములైన దీక్షలవల్ల బుద్ధిని ఆశ్రయించియున్నట్టి అజ్ఞానము నమసిపోతుంది.

అనగా, ఆత్మపరమైన అజ్ఞానమును గురువు నివృత్తి చేయగలడు. బుద్ధిపరమైన అజ్ఞానము మాత్రము శిష్యునియొక్క శ్రద్ధాపూర్వకమైన సాధనవల్లనే గాని ఇతరత్రా నిర్మూలింపబడదు. కనుక, ఈ రెండు విధములైన దీక్షలలోను, సంకల్పపూర్వకమైన శ్రద్ధతో సాధనను గావించే, బుద్ధినిష్ఠతో కూడిన దీక్షయే ఉత్తమమైనది. అనగా, గురువుయొక్క శక్తియుక్తులకన్ననూ, శిష్యునియొక్క శ్రద్ధాభక్తులకే ఇక్కడ పెద్దపీట వేయబడినది.

ఇది ఆచరణలో కూడా సత్యమని మనకు గోచరిస్తుంది. దీక్షను పొందిన అనేకమంది శిష్యులలో, ఎవరైతే శ్రద్ధాభక్తులతో సాధనగావిస్తారో వారే సిద్ధిని అందుకుంటారు. ఇతరులు జారిపోతారు. సాధనామార్గంలో దీనిని మనం స్పష్టంగా గమనించవచ్చు.

దీనిని శ్రద్ధతో సాధనగావిస్తే, ఆత్మగతమైన అజ్ఞానము కూడా తొలగిపోతుంది. ఈ ఆత్మగతమైన అజ్ఞానము, వికల్పము నుండి అవికల్పము వరకూ ఆవరించి ఉంటుంది. వికల్పమంటే ఆలోచన ఉదయించడం, అవికల్పమంటే ఆలోచనా రహిత స్థితి. ఈ రెంటి మధ్యలో 'నేను' అనిన అహంభావం ఆవరించి ఉంటుంది. వికల్పమును తొలగించి, దానిని సంవిత్ తో నింపే అభ్యాసమును శ్రద్ధగా ఆచరిస్తే, ఆత్మను ఆవరించిన అజ్ఞానము కూడా నశిస్తుంది.

వికల్పము చేత సంకుచితము కాని, ఆవరింపబడని, సంవిత్ యొక్క వెలుగేదైతే ఉన్నదో అదే ఆత్మ. అనగా ఆలోచనల స్థాయికి అతీతమైన, శుద్ధమైన, ఎరుక యొక్క వెలుగేదైతే ఉన్నదో అదే ఆత్మ. ఇది శివస్వరూపమైనట్టిది, అనగా శుభస్వరూపము, మంగళస్వరూపమైనట్టిది. అన్ని జీవులపట్లా, అన్ని వస్తువులపట్లా, ఇదే ఎరుకతో, ఎల్లవేళలా ఉండగలిగితే అదే జ్ఞానసిద్ధి. ఈ స్థితియే పొందదగినట్టిది. ఈ విషయము మన కల్పితము కాదు. స్వయానా పరమేశ్వరుడే ఈ విషయమును చెప్పినాడన్నది శైవశాస్త్రములలో చెప్పబడి యున్నది. వీటిని శైవాగమములంటారు. మరి ఇవిగాక, బౌద్ధము, వైష్ణవము మొదలైన ఇతర శాస్త్రములున్నాయి కదా? వాటిలో కూడా బంధము, మోక్షములు ప్రతిపాదింపబడినవి కదా? యనిన శంక రావచ్చును. ఆయా శాస్త్రములు అపరాగమములు. అనగా అపరావిద్యను బోధించునవి గాని పరావిద్యను బోధించునవి కావు. కానీ వాటిలో కూడా యుక్తియుక్తములైన తర్కములున్నవి. అవి కూడా కొన్ని సిద్ధాంతములను ప్రతిపాదిస్తున్నవి. ఆయా సిద్ధాంతములను విచారణ చేయగా, అవి చెప్పుచున్న జ్ఞానము లభిస్తుంది. అది కూడా బంధమోచకమే యని లోకులనుకుంటారు గాని, అది సత్యము కాదు. కారణమేమనగా ఆయా మతస్థులకు పరిపూర్ణమైన బంధవిమోచనం కలుగడం లేదు. పరిపూర్ణ బంధవిమోచనమన్నది ఒక్క శైవాగమములలోనే చెప్పబడుచున్నది. ఎందుకనగా, పరిపూర్ణ స్వాతంత్ర్యరూపమైన పరమేశ్వరైక్యము ఇందులో మాత్రమే సూచింపబడినది. మిగిలిన మతములన్నియు ద్వైతరూపములు కాగా, శివాద్వైతమొక్కటే అద్వైతమును ప్రతిపాదిస్తున్నందున, ఇది పరిపూర్ణ బంధవిముక్తి హేతువగుతున్నది.

సాంఖ్యము నిరీశ్వరవాదము. అందులో ప్రకృతి-పురుష వివేకమే పరమావధి. దానిని మించి విశ్వపు నిర్మాణమునది వివరించలేదు. బౌద్ధము శూన్యవాదము. నిర్వాణము (ఆరిపోవుట) యే దాని పరమగమ్యము.

అది అనాత్మవాదము కూడ. ఆత్మయన్నది భ్రమయని బుద్ధుడన్నాడు. ఇక, వైష్ణవాది ఇతరమతములలో తర్కయుక్తములైన సిద్ధాంతములున్నప్పటికీ, అవి భక్తి ప్రతిపాదికములే గాని, లయప్రధానములుగావు గనుక పరిపూర్ణ స్వాతంత్ర్యమును అవి ప్రతిపాదించవు. పరమేశ్వరోక్తమైన ఆగమశాస్త్రమొక్కటే ఆయనతో ఐక్యమును ప్రతిపాదిస్తుంది. కనుక ఒక్క దీనిలోనే పరిపూర్ణమైన ముక్తి, స్వాతంత్ర్యములు లభిస్తాయి.

పరమేశ్వరునిచేత చెప్పబడిన ఈ ఆగమశాస్త్రము అయిదుపాయలుగా ఉన్నది. ఎందుకనగా, పరమశివునకు సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశానులనే అయిదుముఖములు కలవని ప్రసిద్ధి. ఈ ఐదుముఖములనుండి రకరకములైన ఆగమములు చెప్పబడినవి గనుక వీటిని అయిదుపాయలుగా పారిన జ్ఞానగంగగా భావించారు. వీటిలో పది ఆగమములు ద్వైతసిద్ధాంతమును ప్రతిపాదించునట్టివి. ఇవి శివాగమములు. ద్వైతాద్వైత సిద్ధాంతమును చెప్పునవి పద్దెనిమిది. ఇవి రుద్రాగమములు. శుద్ధమైన అద్వైతమును బోధించునవి అరువది నాలుగుగా ఉన్నాయి. ఇవి భైరవాగమములు. వెరసి ఇవి మొత్తము 92 తంత్రశాస్త్రములు. వీటన్నిటి సారమే త్రికశాస్త్రము. దీనినే నేడు కాశ్మీరశైవమని అంటున్నారు. దీనిలో ప్రత్యభిజ్ఞ, కుల, క్రమ, స్పందములనే నాలుగు శాఖలున్నాయి. ఈ శాస్త్రములో ఉన్న తంత్రగ్రంథములలో కూడా మాలినీవిజయతంత్రము చాలా ముఖ్యమైనది. దురదృష్టవశాత్తూ ఈ గ్రంథము ప్రస్తుతం లభించడం లేదు. కానీ దీని సారమును ఉద్ధరించిన అభినవగుప్తులు తన తంత్రాలోకము, తంత్రసారము అనే గ్రంథములలో దానిని భద్రపరచి ఉంచడం వలన ఈ జ్ఞానము నేడు మనకు లభిస్తున్నది. మాలినీ విజయతంత్రములోని అంతరార్థములను సేకరించి, వాటిని అర్థం చేసుకొనలేని అశక్తులకోసం, తాను వివరిస్తున్నానని అభినవగుప్తులంటున్నారు. ఎందుకనగా, వస్తుతత్త్వమును సరిగా నిరూపించవలసి యుంటుంది. అట్లా నిరూపింపబడకపోతే అది మోక్షమును ఇవ్వలేదు. ఆ విధముగా సరిగా నిరూపింపబడి, తద్వారా తెలిసికొనబడినట్టి శుద్ధమైన జ్ఞానమే మోక్షమును ఇవ్వగలుగుతుంది. కనుక, సరిగా గ్రహించబడి, సరిగా అభ్యసింపబడిన జ్ఞానమొక్కటే, పరపురుషార్థమైన మోక్షమును కలిగిస్తుందని అంటూ ఈ గ్రంథవివరణ ప్రారంభింపబడుచున్నది.

చతుర్విధ ఫల పురుషార్థములలో ధర్మార్థ కామములు అపరములు. ఏమనగా, అవి భోగములను కలిగించునట్టివే గాని, మోక్షమును ఇవ్వలేవు. భోగేచ్ఛయే బంధము, కనుక భోగమూలములైన ఈ మూడును బంధములే. నాలుగవదియైన మోక్షము పరము. అనగా, భోగేచ్ఛను దాటుటయే మోక్షము. అట్టి మోక్షమును ఆత్మజ్ఞానమొక్కటే కలిగించగలదు గాని మొదటి మూడు పురుషార్థములు అందుకు సమర్థములు కావు.

శ్లో|| అజ్ఞానం కిల బన్ధహేతురుదితః శాస్త్రే మలం తత్స్మృతం
పూర్ణజ్ఞానకలోదయే తదఖిలం నిర్మూలతాం గచ్ఛతి |
ధ్వస్తాశేషమలాత్మసంవిదుదయే మోక్షశ్చ తేనామునా
శాస్త్రేణ ప్రకటీకరోమి నిఖిలం యజ్జ్ఞేయతత్త్వం భవేత్ || 4 ||

అజ్ఞానమే ఖచ్చితమైన బంధహేతువని శాస్త్రములలో చెప్పబడింది. దానినే మలమంటారు. పూర్ణజ్ఞానమనే వెలుగు ఉదయించినప్పుడు ఈ అజ్ఞానం మొత్తం నిర్మూలనమౌతుంది. నిశ్శేషంగా ఈ మలం ధ్వంసమైనప్పుడు ఉదయించే ఆత్మసంవిత్తే మోక్షమని గ్రహించాలి. దీనిని ఈ శాస్త్రంలో వివరిస్తున్నాను.

దేహమునకు మురికి పడుతుంది. అదే విధముగా మనసుకు, బుద్ధికి, ఆత్మకు కూడా అంటుకుంటుంది. దేహమలం స్నానముతో తాత్కాలికముగా పోతుంది. కానీ మనో బుద్ధ్యాత్మలకు పట్టిన మురికి భౌతికమైనది కాదు. కనుక ఆ విధముగా పోదు. అది చీకటి వంటిది గనుక వెలుగుతోనే పోతుంది. జ్ఞానోదయమే ఆ వెలుగు. పూర్ణమైన జ్ఞానోదయం వలన మనస్సు, బుద్ధి, ఆత్మలకు పట్టిన అజ్ఞానమనే చీకటి పూర్ణముగా నశిస్తుంది. అప్పుడు కలిగే స్థితినే మోక్షమని తెలుసుకోవాలి. అది ఎలా జరుగుతుంది? అనే దానిని ఈ శాస్త్రములో చెబుతున్నానని అభినవగుప్తులవారంటున్నారు.

ఉపోద్ఘాతః - ఉపోద్ఘాతము

తత్ర ఇహ స్వభావ ఏవ పరమోపాదేయః, స చ సర్వభావానాం ప్రకాశరూప ఏవ అప్రకాశస్య స్వభావతానుపపత్తేః, స చ నానేకః ప్రకాశస్య తదితర స్వభావానుప్రవేశాయోగే స్వభావభేదాభావాత్; దేశకాలావపి చ అస్య న భేదకౌ తయోరపి తత్ప్రకాశస్వభావత్వాత్, ఇతి ఏక ఏవ ప్రకాశః, స ఏవ చ సంవిత్, అర్థప్రకాశరూపా హి సంవిత్ ఇతి సర్వేషామత్ర అవివాద ఏవ।

కనుక, స్వభావమే పరమముగా స్వీకరింపదగినట్టిది. అదే అన్నిభావములలోను ప్రకాశరూపంలో ఉంటుంది. అప్రకాశమునకు స్వభావముందని చెప్పడం అసంబద్ధమౌతుంది. ప్రకాశం కంటే ఇతరములు దానిలో ప్రవేశించలేనందువల్లనూ, తన స్వభావంలో భేదం ఉండనందువల్లనూ అది అనేకం కాదు. దేశకాలములు కూడా దీనిని భేదించలేవు, వాటిని కూడా అదే వెలిగిస్తుంది గనుక. అతీతంగా ఉంటుంది. అది ఒక్కటిగా ఉంటున్న వెలుగై ఉన్నది, అదే సంవిత్. అర్థప్రకాశమే సంవిత్ అనడం అన్నింటా అవివాదమైనది.

స చ ప్రకాశో న పరతన్త్రః, ప్రకాశ్యత్వైవ హి పారతన్త్ర్యమ్, ప్రకాశ్యతా చ ప్రకాశాన్తరాపేక్షిత్వైవ, న చ ప్రకాశాన్తరం కించిత్ అస్తి ఇతి స్వతన్త్ర ఏకః ప్రకాశః, స్వాతన్త్ర్యాదేవ చ దేశకాలాకారావచ్ఛేదవిరహాత్ వ్యాపకో నిత్యః, సర్వాకారనిరాకారస్వభావః, తస్య చ స్వాతన్త్ర్యమ్ ఆనన్దశక్తిః తచ్చమత్కార ఇచ్ఛాశక్తిః, ప్రకాశరూపతా చిచ్ఛక్తిః, ఆమర్శాత్మకతా జ్ఞానశక్తిః, సర్వాకారయోగిత్వం క్రియాశక్తిః ఇత్యేవం ముఖ్యాభిః శక్తిభిః యుక్తోఽపి వస్తుత ఇచ్ఛాజ్ఞానక్రియాశక్తియుక్తః అనవచ్ఛిన్నః ప్రకాశో నిజానన్దవిశ్రాన్తః శివరూపః, స ఏవ స్వాతన్త్ర్యాత్ ఆత్మానం సంకుచితమ్ అవభాసయన్ అణురితి ఉచ్యతే।

ప్రకాశమునకు పరతంత్రము లేదు. ప్రకాశింపబడునట్టిది పరతంత్రమై ఉన్నది. ప్రకాశం లోపల ప్రకాశమే ఉన్నది. అదితప్ప వేరే ఏదీ లేదు. ఈ ప్రకాశం ఏకమై స్వతంత్రమై ఉన్నది. ఈ స్వాతంత్ర్యపు కారణంగా, దేశము, కాలము, ఆకారము, అవచ్ఛేదములను విడచి, వ్యాపకమై, నిత్యమై, సర్వాకారనిరాకార స్వభావితమై ఉంటుంది. దీని స్వాతంత్రమే దీని ఆనందశక్తి. దీని చమత్కారమే ఇచ్ఛాశక్తి. దీని వెలుగు చిచ్ఛక్తి. ఇంకొకదానితో రాపిడిపడే స్వభావమే జ్ఞానశక్తి. ఏ ఆకారమునైనా ధరించగలిగే సామర్థ్యమే క్రియాశక్తి. ఇటువంటి ముఖ్యశక్తులు అనేకం ఉన్నప్పటికీ వస్తుతః ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులతో, అనవచ్ఛిన్న ప్రకాశరూపమై, తన ఆనందంలో తానే విశ్రాంతిగా ఉంటూ, శివరూపమై ఉంటుంది. తన స్వాతంత్ర్యశక్తి వల్ల తనను తానే కుంచించుకుని అణువు అనబడుతుంది.

పునరపి చ స్వాత్మానం స్వతన్త్రతయా ప్రకాశయతి, యేన అనవచ్ఛిన్నప్రకాశశివరూపతయైవ ప్రకాశతే। తత్రాపి స్వాతన్త్ర్యవశాత్ అనుపాయమేవ స్వాత్మానం ప్రకాశయతి సోపాయం వా, సోపాయత్వేఽపి ఇచ్ఛా వా

జ్ఞానం వా క్రియా వా అభ్యుపాయ ఇతి త్రైవిధ్యం శామ్భవశాక్తాణవభేదేన సమావేశస్య, తత్ర చతుర్విధమపి ఏతద్రూపం క్రమేణ అత్ర ఉపదిశ్యతే|

మళ్ళీ తన స్వతంత్రశక్తితో అంతులేని వెలుగుగా శివరూపంలో వెలుగుతుంది. తన పరిమితిలేని స్వాతంత్ర్యంతో కొన్నిసార్లు ఉపాయసహితంగాను, కొన్నిసార్లు ఉపాయరహితంగాను తన ఆత్మలో తానుంటుంది. ఆ ఉపాయములే ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులు. ఇవి మూడు భేదములతో శాంభవ, శాక్త, అణవములనే సమావేశములుగా ఉన్నది. దీనియొక్క ఈ నాలుగు రూపములు ఇప్పుడు చెప్పబడుచున్నవి.

శ్లో|| ఆత్మా ప్రకాశవపురేష శివః స్వతన్త్రః
స్వాతన్త్ర్యనర్మరభసేన నిజం స్వరూపమ్
సంఛాద్య యత్పునరపి ప్రథయేత పూర్ణం
తచ్చ క్రమాక్రమవశాదథవా త్రిభేదాత్ || 5 ||

ప్రకాశమే ఆత్మ. ఇదే శివుడు, స్వతంత్రుడు. రహస్యమైన ఈ స్వాతంత్ర్యపు ఉద్వేగంతో తన నిజరూపమును కప్పి, మళ్ళీ మునుపటివలెనే పూర్ణమైన వెలుగుగా అవుతాడు. ఈ ఆరోహణావరోహణలు మూడు విధములుగా ఉంటాయి.

వ్యాఖ్యానము

స్వభావమంటే ఆత్మభావము. ఆత్మయే అన్నింటికీ మూలము. ఎందుకనగా, తాను లేనిదే ఏ ఇతరమునూ మానవుడు గ్రహించలేడు. అదే విధముగా పరమాత్మయైన పరమశివుడే సమస్తసృష్టికీ మూలము. ఆయన లేనిదే సృష్టి లేదు. కనుక, స్వభావమే (ఆత్మభావమే) అన్నింటికంటే గొప్పదైనట్లుగా గ్రహించాలి. అదే అన్నిభావములలోను ప్రకాశరూపంలో ఉంటుంది. అన్ని భావములనూ 'నేన'న్న భావమే ఆధారమై వెలిగిస్తుంది. కనుక అది ఆధారపు వెలుగు. దానికి విరుద్ధమైన చీకటి, స్వభావం కాలేదు. ఎందుకనగా, ఎఱుకయే మానవుని స్వభావం గాని, ఎఱుకలేమి కాదు. ఈ స్వభావమన్నది వస్తుతః ఏకముగాని, అనేకము కాదు. ఎందుకని? వెలుగులో వెలుగే ఉంటుంది గాని, చీకటి ఉండలేదు. ఆత్మప్రకాశము వేరే దానిని తనలోకి ఒప్పుకొనదు. ఎందుకనగా, ఆ వేరుదానిని తెలిసికొనునది తానే గనుక, తానే అంతిమమైనది. పోనీ, తనకు రకరకములైన స్వభావములున్నవా? అంటే, లేవు. స్వ(ఆత్మ)భావమన్నది ఎల్లపుడూ ఒక్కటిగానే ఉంటుంది. దానిలో ద్వంద్వము లేదు. కనుక అది అనేకం కాదు, ఏకమే.

సృష్టి సమస్తమునూ, దేశకాలములతో బంధింపబడి యున్నది. దేశమంటే ఒక ప్రదేశము. సృష్టిలోని ప్రతిదీ ఒక ప్రదేశములో ఉంటుంది. ఒకచోటకు పరిమితమై ఉంటుంది. దానిని దేశమని, ఇంగ్లీషులో space అంటారు. అలాగే, సృష్టిలోని సమస్తమూ కాలమునకు లోబడి ఉంటున్నదిగాని కాలాతీతమై ఏదియును లేదు. దీనిని time అన్నారు. ప్రపంచమంతా దేశకాలముల (space-time continuum) వ్యవస్థయేనని వేదాంతమన్నది. దీనివద్దకే నవీన భౌతికశాస్త్రజ్ఞులు కూడా వచ్చినారు. ప్రకాశము (వెలుగు) గా, సంవిత్ (జ్ఞానము)గా ఉన్నట్టి ఆత్మను దేశకాలములు బాధించలేవు. ఎందుకంటే, వాటి ఉనికికి కూడా ఇదే కారణమై,

వాటిని వెలిగిస్తూ ఉన్నది గనుక. 'నేను' లేనిదే దేశ కాలములకు ఉనికి లేదు. కనుక, ఆత్మ దేశకాలములకు విభిన్నమై, అతీతమై ఉన్నది. ఒక్కటిగా ఉన్నట్టి వెలుగే ఆత్మ. దానినే సంవిత్ (జ్ఞానస్వరూపము) అని అంటున్నాము. అట్లుగాక వేరేవిధముగా అర్థమును గ్రహించడం వీలుకాదు కాబట్టి, ఏది ఉన్నదో దాని అర్థము ప్రకాశించడమే 'సంవిత్' అని అన్ని మతములూ ఒప్పుకుంటున్నాయి.

జ్ఞానపు వెలుగు ఇంకొకదానికి లోబడి యున్నదా? అంటే, లేదని తెలుస్తున్నది. ప్రకాశింపబడునది ఇంకొకదానికి లోబడి యున్నది గాని, ప్రకాశము ఆ విధముగా లేదు. ఈ జ్ఞానపు వెలుగు యొక్క లోపల, వెలుగే ఉన్నదిగాని వేరేదియునూ లేదు. ఆ వెలుగు ఏకమై, నిరంకుశమై, స్వతంత్రమై ఉన్నది.

తానే సర్వస్వతంత్రమవడం చేత ఈ వెలుగు, దేశము, కాలము, ఆకారము, భాగములను విడచి, సర్వవ్యాపకమై, నిత్యమై ఉంటుంది. దీనికి వ్యష్టిత్వం లేదు. నాశనం లేదు. తన ఇష్టం వచ్చిన ఏ ఆకారమును కావాలనుకుంటే ఆ ఆకారమును దాలుస్తుంది. అదే సమయంలో నిరాకారముగా కూడా ఉంటుంది. ఎట్లా కావాలంటే అట్లా ఉండగలిగే ఈ విధమైన స్వాతంత్ర్యం ఉండటం చేత అది ఆనందస్వరూపమై ఉంటుంది. ఎందుకంటే, స్వతంత్రం లేకపోతే ఆనందం ఉండదు. కనుక, దీని స్వాతంత్రమే దీని ఆనందశక్తి యని చెప్పబడింది. అదే విధముగా, దీనినుండి పుట్టిన రవ్వయే ఇచ్ఛాశక్తి. దీని వెలుగే చిచ్ఛక్తి, తనను తాను ఆవిష్కరించుకునే ప్రయత్నమే దీని జ్ఞానశక్తి. ఏ ఆకారమునైనా ధరించగలిగే సామర్థ్యమే దీని క్రియాశక్తి.

జ్ఞానస్వరూపమైన ఈ వెలుగుకు ఇటువంటి శక్తులు అనేకములున్నాయి. అయినప్పటికీ, ముఖ్యముగా ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తుల రూపంగా ప్రకాశిస్తూ, అంతులేనట్టి వెలుగుగా, తన ఆనందంలో తానే శయనించి, శివస్వరూపమై ఉంటుంది. అంటే, శుభంకరమై, మంగళకరమై ఉంటుంది. తనకున్నట్టి స్వాతంత్ర్యశక్తితో, ఒక ఆటలాగా, తనను తానే తగ్గించుకుని అణువు (జీవుడు) అనబడుతుంది. అంటే, అనంతుడైన పరమశివుడు, లీలగా తనను తాను పరిమితునిగా మార్చుకుని జీవుడౌతున్నాడు. శ్రీ రామకృష్ణులవారిలా అనేవారు - 'పంచేంద్రియముల వలలో చిక్కి పరమాత్మ రోదిస్తున్నది'. ఆయనింకా ఇలా అనేవారు - 'పాశబద్ధుడే జీవుడు, పాశముక్తుడే శివుడు'.

మరలా ఇదే అణువు (జీవుడు) లీలామాత్రంగా తన స్వస్వరూపమును ధరించి అనంతమైన జ్ఞానస్వరూపమైన వెలుగుగా శివరూపమును దాలుస్తుంది. తన ఇష్టానుసారంగా, కొన్నిసార్లు ఉపాయముల ఆధారంతోను (ఉపాయి గాను), మరికొన్ని సార్లు ఉపాయముల అవసరం లేకుండానూ (అనుపాయి గాను) ఉండగలుగుతుంది. ఏమిటా ఉపాయములు? అంటే, అవియే ముందు చెప్పబడిన ముఖ్యశక్తులైన ఇచ్ఛా, జ్ఞాన, క్రియలు. వాటిని వరుసగా శాంభవ, శాక్త, అణవోపాయములంటారు. వీటివల్ల మూడు విధములైన సమావేశము (కలయిక లేదా లయము) జరుగుతుంది. అంటే, పరిమితుడైన జీవుడు తనను తాను పరమేశ్వర స్వరూపంలోకి ఆవిష్కరించుకునే ప్రయత్నం ఈ మూడు మార్గములలో చేయబడుతుంది. అవియే ఈ మూడు ఉపాయములు లేదా మూడు సాధనా మార్గములు. ఇవిగాక అనుపాయమనే నాల్గవ ఉపాయమున్నది గాని, దీనిని ఉపాయమని స్పష్టముగా చెప్పలేము. మిగిలిన మూడు ఉపాయములూ లేనట్టి స్థితియే నాలుగవదియైన అనుపాయము. కనుక ఈ నాలుగు విధములైన భేదములను అభినవగుప్తులు ఈ గ్రంథములో వివరించినారు.

ఆ// వెలుగు; తానె యాత్మ; వేయేల శివుడేను;
వాని ప్రభువు వాడె; వాస్తవమున
ఆట వోలె తగ్గి యణువుగా తానౌను
మూడు మెట్ల దాల్చు ముందు రూపు

ఈ అధ్యాయపు సారమునంతా ఒక్క శ్లోకములో అభినవగుప్తులు చెప్పుచున్నారు. ఇదే విధానమును అన్ని అధ్యాయముల చివరలోను వీరనుసరించారు.

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే విజ్ఞానభేదప్రకాశనం నామ ప్రథమమాహ్నికమ్ || 1 ||

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని విజ్ఞానభేదప్రకాశనమనే మొదటి ఆహ్నికము.

రెండవ ఆహ్నికము

అనుపాయ ప్రకాశనము

యదార్థః - యదార్థము

అథ అనుపాయమేవ తావత్ వ్యాఖ్యాస్యామః।

ఇప్పుడు అనుపాయమును వ్యాఖ్యానిస్తున్నాను.

అనుపాయమంటే, ఉపాయం లేకపోవడం. అంటే, ఎటువంటి ప్రత్యేకమైన సాధనా లేకుండా సూటిగా పరమశివుని చేరుకునే మార్గమని అర్థం. మార్గం కాని మార్గమని అర్థం.

యదా ఖలు దృఢశక్తిపాతావిద్ధః స్వయమేవ ఇత్థం వివేచయతి సకృదేవ గురువచనమ్ అవధార్య, తదా పునరుపాయవిరహితో నిత్యోదితః అస్య సమావేశః। అత్ర చ తర్క ఏవ యోగాఙ్గమ్ ఇతి కథం వివేచయతి ఇతి చేత్? ఉచ్యతే-యోఽయం పరమేశ్వరః స్వప్రకాశరూపః స్వాత్మా తత్ర కిమ్ ఉపాయేన క్రియతే, న స్వరూపలాభో నిత్యత్వాత్, న జ్ఞప్తిః స్వయంప్రకాశమానత్వాత్, న ఆవరణవిగమః ఆవరణస్య కస్యచిదపి అసంభవాత్, న తదనుప్రవేశః అనుప్రవేష్టుః వ్యతిరిక్తస్య అభావాత్।

ఎవరైతే, బలమైన శక్తిపాతమును పొందినవాడు, ఒక్కమారు గురువచనమును అవధరించి, స్వయముగా విచారిస్తాడో, అప్పుడు వేరే ఏ ఉపాయం యొక్క అవసరం లేకుండానే, నిత్యత్వంలోకి, సమావేశంలోకి మేల్కొంటాడు. 'అచట తర్కమే యోగాంగమై ఉన్నది. లేకుంటే, వివేచన ఎలా కలుగుతుంది?' అనిన ప్రశ్న ఉదయిస్తే, దానికి ఈ విధంగా సమాధానం చెబుతాము - 'పరమేశ్వరుడు తన ఆత్మయే అయినప్పుడు, స్వప్రకాశమే అయినప్పుడు, అతడిని ఏ ఉపాయం ద్వారా సాధించగలం?' దీనిని స్వరూపలాభమని అనలేము. ఎందుకంటే అది నిత్యం గనుక. స్వరూపజ్ఞానమని కూడా అనలేము, ఎందుకంటే, అది స్వయంప్రకాశం గనుక. ఆవరణలు తొలగడం అనికూడా అనలేము, ఎందుకంటే, దానికి ఆవరణలుండటం సంభవంకాదు గనుక. ఒకదానిలో ఇంకొకటి ప్రవేశించిందని కూడా అనలేము, ఎందుకంటే, రెండూ వేర్వేరు కావు గనుక.

కశ్చాత్ర ఉపాయః తస్యాపి వ్యతిరిక్తస్య అనుపపత్తేః, తస్మాత్ సమస్తమిదమేకం చిన్మాత్రతత్త్వం కాలేన అకలితం, దేశేన అపరిచ్ఛిన్నమ్, ఉపాధిభిరమ్లానమ్, ఆకృతిభిరనియన్త్రితం, శబ్దైరసందిష్టం, ప్రమాణైరప్రపఞ్చితం, కాలాదేః, ప్రమాణపర్యన్తస్య స్వేచ్ఛయైవ స్వరూపలాభనిమిత్తం చ, స్వతన్త్రం ఆనన్దఘనం తత్త్వం, తదేవ చ అహమ్ తత్రైవ అన్తర్మయి విశ్వం ప్రతిబిమ్బితమ్ ఏవం దృఢం వివిఞ్చానస్య శశ్వదేవ పారమేశ్వరః సమావేశో నిరుపాయక ఏవ, తస్య చ న మన్త్ర-పూజాధ్యాన-చర్యాది నియన్త్రణా కాచిత్।

దానికంటే వేరేదేదీ లేనప్పుడు దానిని తెలుసుకునే ఉపాయమెలా ఉంటుంది? కనుక ఈ సమస్తమూ - ఏకము, చిన్మాత్రము, కాలం చేత కల్లోలపడనిది, దేశంచేత పరిచ్ఛిన్నం కానిది, ఉపాధులచేత కృంగిపోనిది, రూపములచేత నియంత్రించబడనిది, శబ్దములచేత చెప్పబడనిది, ప్రమాణములచేత వివరించబడనిదై యున్నది. కాలము నుండి ప్రమాణపర్యన్తము వరకు, ఆయన ఇచ్ఛతోనే వెలుగుతున్నవి. అదే విధముగా అవన్నియు, స్వరూపలాభనిమిత్తమై ఉన్నవి. అది స్వతంత్రము, ఆనందఘనము, అదియే 'అహమ్' అనబడే

స్పందన. దాని లోలోతులలో ఈ విశ్వం ప్రతిబింబిస్తున్నది. ఈ విధమైన దృఢమైన వివేచన ఉన్నపుడు, అతనికి పరమేశ్వరునితో సమావేశం కలుగుతుంది. దీనికి ఏ విధమైన ఉపాయములూ అక్కరలేదు. అట్టివానికి మంత్ర, పూజ, ధ్యాన, చర్యల నియంత్రణ ఉండదు.

శ్లో|| ఉపాయజాలం న శివం ప్రకాశయేద్
ఘటేన కిం భాతి సహస్రదీధితిః |
వివేచయన్నిత్థముదారదర్శనః
స్వయంప్రకాశం శివమావిశేత్క్షణాత్ || 6 ||

ఉపాయజాలములు శివుని ప్రకాశింపజేయలేవు. సహస్రకిరణుడగు సూర్యుడు కుండచేత వెలుగుతాడా? ఈ విధంగా వివేచనగావించే ఉదారదర్శనుడు, స్వయంప్రకాశరూపుడైన శివునితో సమావేశమును ఒక్క క్షణంలో పొందగలుగుతాడు.

వ్యాఖ్యానము

సాధకులలో అందరూ ఒకే స్థాయిలో ఉండరు. వారిలో స్థాయీభేదములుంటాయి. ఉత్తమోత్తమ, ఉత్తమ, మధ్యమ, అధమసాధకులని వారిలో కూడా తారతమ్యములుంటాయి. వీరిలో, ఉత్తమోత్తమ సాధకులకు అనుపాయము సిద్ధిస్తుంది. వారికి ఉండవలసిన లక్షణములేమిటి?

అనుపాయమునకు అర్హతలు

మొదటగా, బలమైన శక్తిపాతమును అతడు పొంది ఉండాలి. ఆ తరువాత గురువాక్యములను ఒక్కసారి వినాలి. అట్లా కలగాలంటే, అతని మనస్సు తీవ్రమైన వివేకవైరాగ్యములతో నిండి ఉండాలి. పొడిగా ఉన్న అగ్గిపుల్లతో ఇటువంటి సాధకుని శ్రీరామకృష్ణులు పోల్చేవారు. అగ్గిపెట్టె గురువు. అది ఎలాగూ పొడిగానే ఉంటుంది. అగ్గిపుల్ల అంటే శిష్యుడు. అతని మనస్సు ఇంద్రియవ్యామోహములు లేకుండా అత్యంత శుద్ధమైన స్థితిలో ఉన్నపుడు, ఒక్కసారి గీచినంతనే భగ్గుమని మండే అగ్గిపుల్లలాగా, గురూపదేశమును ఒక్కసారి వినినంతనే, అతనిలో జ్ఞానోదయమౌతుంది. వేరే సాధనలను చేయవలసిన అవసరం అతనికి ఉండదు. మనస్సు అత్యంత పరిపక్వ స్థితిలో ఉండటమే దీనికి గల కారణము.

బలమైన శక్తిపాతము, గురూపదేశము, స్వయంవిచారణ - ఈ మూడూ ఉన్నవానికి తత్క్షణమే పరమేశ్వరానుసంధానం కలిగి సమాధి సిద్ధిస్తుంది. నిత్యసత్యస్వరూపమైన పరమశివానుభవంలో అతడు లీనుడౌతాడు. తాంత్రికపరిభాషలో సమావేశమంటే, పరమశివునితో సమరసం.

ఇదంతా సులభంగా అర్థం కావడంకోసం, ఒక కథను చెబుతారు.

పాతకాలంలోని ఒక అమ్మాయికి పెళ్లి కుదిరింది. తన కాబోయే భర్త అందచందముల గురించి, గుణగణముల గురించి ఆమె ఎంతో విని ఉన్నది. కానీ అతడిని చూడలేదు. అతడిని చూడకుండానే ఎంతో ప్రేమలో పడింది. ఎప్పుడూ పరధ్యానంగా, తన్మయత్వంలో ఉండేది. ఈ తన్మయత్వమునే శక్తిపాతమంటారు.

ఒకరోజున ఆమె ఒక సంతకు వెళ్ళింది. అక్కడ ఆ కాబోయే భర్త ఆమెకు ఎదురుపడ్డాడు. కానీ ఇతడు అతడే అని ఆమెకు తెలియదు. అందుకని అతడిని చూడగానే ఈమెకు ఏమీ అనిపించలేదు. అందరినీ చూచినట్లే చూచి ప్రక్కకు తప్పుకుంది. అప్పుడు, ఇద్దరినీ ఎరిగిన ఒక మనిషి వచ్చి, 'ఇతడే నీకు కాబోయే భర్త' అని ఆ అమ్మాయితో చెప్పాడు. అట్లా చెప్పిన వ్యక్తి, గురువు. గురువుకు ఈశ్వరుడూ తెలిసి ఉంటాడు, శిష్యుడూ తెలిసి ఉంటాడు. కనుక ఇద్దరినీ ఒకరికొకరికి పరిచయం చేస్తాడు. ఆ క్షణంలో ఆ అమ్మాయికి ఒక్కసారిగా సిగ్గు, ఆనందం, సంభ్రమం ముప్పిరిగొన్నాయి. అంటే, గురూపదేశాన్ని విన్నది. తరువాత, తన మనసులో 'ఓహో! ఇతడేనా నేనిన్నాళ్ళుగా ఊహించుకుంటున్నవాడు' అనుకుంది. ఇది స్వయం విచారణ. ఆ క్షణం నుంచీ ఆ అమ్మాయి ఆనందం లోనే ఉండిపోయింది.

శక్తిపాతము, గురూపదేశము, స్వయం విచారణలంటే ఇవే.

అయితే, ఇక్కడ కొన్ని ప్రశ్నలు తలెత్తవచ్చని ఊహించిన అభినవగుప్తులవారు, ఆ ప్రశ్నలను తానే లేవనెత్తుతూ, వాటికి సమాధానములను కూడా తానే ఇస్తున్నారు. అవేమనగా,

ఇక్కడ, శిష్యునకు గురూపదేశమున్నది, దానినతడు లోతుగా విచారిస్తాడని అంటున్నారు కదా? మరి, అదే అతని సాధనయని అనవచ్చును గదా? అతని తర్కమే అతని సాధన. కనుక, సాధన లేదని, అనుపాయమని దీనినెలా అనగలమన్న ప్రశ్న ఉదయిస్తుంది.

జవాబు: పరమశివుడు, సాధకుని అంతరాత్మగా ఉన్నపుడు, అతడు స్వయంప్రకాశమైన వెలుగై సాధకుని లోలోపల వెలుగుతూ ఉన్నపుడు, దానిని చేరుకోవడానికి వేరే సాధన ఎలా కుదురుతుంది?

పోనీ, మీరు చెబుతున్నట్లుగా, పరమశివుడు తన స్వరూపమే అనుకుందాం. ఆ స్వరూపమే సాధకునకు లభించిందని అనవచ్చు కదా?

జవాబు: ఒకప్పుడు లేనిదైతే, ఇంకొకప్పుడు లభించే అవకాశముంటుంది. ఎప్పుడూ లోపల వెలుగుతూ ఉన్నది క్రొత్తగా లభించేదేముంది? కనుక దానిని లాభమని అనలేము.

పోనీ, దానిని స్వరూపజ్ఞానమని అనవచ్చు కదా?

జవాబు: అది కూడా వీలుకాదు. ఎందుకనగా, తానే స్వయంప్రకాశమైన వెలుగును, మనం తెలుసుకోవడం ఎలా కుదురుతుంది? మనలో ఉండి, తెలుసుకొంటున్న తెలివే అదైనప్పుడు, దానిని మళ్ళీ తెలుసుకోవడం ఎలా? దేనితో తెలుసుకోవడం? మరపనేది లేనిదానిని, ఒకసారికి మరచిపోవడం, మరలా గుర్తు తెచ్చుకోవడం ఎలా సంభవిస్తుంది? కనుక స్వరూపజ్ఞానమని కూడా దానిని అనలేము.

పోనీ, దాని చుట్టూ ఉన్న ఆవరణలు, పొరలు తొలగడం వల్ల తెలియబడిందని అనుకోవచ్చు కదా?

జవాబు: వీలుకాదు. ఎందుకనగా, అనంతమైన వెలుగును ఏ ఆవరణలు బంధించగలవు? దానికసలు ఆవరణలే లేవు. కనుక, లేని ఆవరణలు తొలగడం ఎలా సంభవిస్తుంది? కాదు.

శిష్యుడు దానిలోకి ప్రవేశించాడని అనుకోవచ్చు కదా?

జవాబు: ఇదీ వీలుకాదు. ఎందుకంటే, ప్రవేశించేవాడూ అదీ వేర్వేరు కాదు కాబట్టి. తనలోకి తానెలా ప్రవేశించగలడు? కుదరదు.

దానిని గ్రహించే ఉపాయము లేదా?

జవాబు: లేదు. ఎందుకంటే, దానికంటే విడిగా ఏదైనా ఉన్నపుడు, దానితో దీనిని గ్రహించవచ్చు. అటువంటిది సంభవం కానప్పుడు, అన్నీ తానేయై ఉన్నదానిని దేనితో తెలుసుకుంటాము? కనుక, అనుపాయమనేది ఒక ప్రత్యేకమైన ఉపాయమని కూడా చెప్పలేము.

బ్రహ్మానుభూతిని వివరిస్తూ వివేకానందస్వామి ఇలా అంటారు, 'దానినొక అనుభూతియని చెప్పలేము. ఎందుకంటే, అనుభవించేవాడు దానికంటే విడిగా ఉంటే కదా అలా చెప్పడానికి? బ్రహ్మము ఇంద్రియాతీతము, మనోబుద్ధ్యహంకారములకు అతీతముగా ఉన్నది. కనుక, బ్రహ్మమును తెలుసుకోవడం వీలుకాదు. మరి దారి లేదా? ఉన్నది, దానిలో మునిగి, దానిలో కరిగి, దానిగా మారిపోవడమొక్కటే దారి'.

శ్రీరామకృష్ణులవారు దీనిని, 'ఉప్పుబొమ్మ సముద్రంలో కరగిపోవడం' గా వర్ణించారు. అప్పుడేమి మిగులుతుంది? సముద్రం మిగులుతుందని కూడా చెప్పలేము. ఎందుకంటే, అట్లా చెప్పవలసిన ఉప్పుబొమ్మ, తానే లేకుండా కరగిపోయింది కాబట్టి. అపుడు చెప్పేదీ ఉండదు, వినేవాడూ ఉండడు. ఆ స్థితిలో ఏముందో చెప్పడం వీలుకాదు. అందుకనే, ఈ స్థితిని అవాఙ్మానసగోచరమని వేదం వర్ణించింది.

కాబట్టి ప్రకాశరూపమైన, సంవిద్రూపమైన, శివత్వము ఈ విధంగా ఉన్నది.

అఖండమైనది

ఎటువంటి ఎల్లలు, హద్దులు లేనిదై, చిత్స్వరూపమై, అనగా తెలివి తానే అయినట్టిదై యున్నది.

కాలము చేత కల్లోలపడనిది

కాలమును సృష్టించినది కూడా అదే కావడం చేత, కాలమునకు అతీతం కావడం చేత, కాలమును తెలుసుకొనుటకు అవసరమైన వేరొకటి దానిలో లేని కారణం చేత, కాలము చేత బాధింపబడనిదై యున్నది.

దేశంచేత పరిచ్ఛిన్నం కానిది

సర్వత్రా నిండి యున్నందున, దేశమన్నది దానినుండియే పుట్టినందున, అది దేశమునకు లోబడదు. అంటే, ఒకచోట ఉన్నట్లుగా దానిని గుర్తించడం సాధ్యంకాదు.

ఉపాధులచేత కృంగిపోనిది

ఆధారముల యొక్క అవసరం దానికి లేనందున, పరిమితులకు అతీతమై యున్నందున.

రూపములచేత నియంత్రించబడనిది

సమస్త రూపాతీతమై, నిరాకారమై వెలుగుచున్నందున, అది అన్ని రూపములను మించి యున్నది.

శబ్దములచేత చెప్పబడనిది

శబ్దములనేవి పరిమితమైన ఒక భావమును మాత్రమే మాటలలో చెప్పగలుగుతాయి, ఇంద్రియములకు లోబడిన అనుభూతులను మాత్రమే వెల్లడించగలుగుతాయిగాని, అపరిమితమైనదానిని, ఇంద్రియములకు అతీతమైనదానిని చెప్పలేవు గనుక.

ప్రమాణములచేత వివరించబడనిది

ఒకదానితో మరొకదానిని పోల్చి చెప్పడం ప్రమాణమంటారు. అన్ని పోలికలనూ అధిగమించి యున్నదానిని దేనితో పోల్చి చెప్పడం? దానిని వివరించడం అట్లా వీలు కాదు గనుక. విశ్వంలో ఉన్నట్టి కాలము నుండి ప్రమాణము వరకు అన్నీ దాని ఇచ్ఛతోనే వెలుగుతున్నవి. అవియన్నియు దాని స్వరూపమును పొందటానికే ఉద్దేశించబడి ఉన్నవి. అది సర్వస్వతంత్రము మరియు ఆనందమే తానై ఉన్నది. అదియే అహమ్ లేదా నేను నేనన్న స్పందన. అనంతమైన ఈ స్పందన యొక్క లోలోతులలో విశ్వము ప్రతిబింబిస్తున్నది. ఈ దృఢమైన వివేచనాశక్తి ఉన్నవానికి పరమేశ్వరునితో ఆ క్షణమే ఐక్యత లభిస్తుంది. ఇట్లా లభించడానికి ఏ విధములైన ఉపాయములు, సాధనలు అవసరం లేదు. మంత్రములు, పూజలు, ధ్యానములు, క్రియల యొక్క అవసరం ఎంతమాత్రం లేదు. అవన్నియు తగినంత స్థాయి లేని సాధకుల కోసం ఉద్దేశించబడినవి. ఉత్తమోత్తమ లక్షణములున్నట్టి సాధకునకు అనుపాయమే చాలు. గురుకటాక్షంతో, ఒకే ఒక్కక్షణంలో అతనికి పరమేశ్వరానుసంధానం లభిస్తుంది. అయితే, దానికి తగినట్టి అర్హతలు అతనిలో ఉండాలి.

ఆ|| సాధనమ్ము లెట్లు సాధించురా వాని?
భానుడెట్లు వెల్గు భాండమందు?
ఇట్లు చింతజేయు విబుధుండు భువియందు
తానె శివుని జేరు తత్క్షణమ్ము

"సాధనములచేత పరమశివుడు లభిస్తాడా? సర్వమునూ మించినట్టి వెలుగై యున్నవానిని ఉపాయములు పట్టుకోగలవా? వెయ్యి కిరణములతో వెలిగే సూర్యుడు నీటి కుండలో ఎట్లా ఇముడుతాడు? అదే విధముగా, అనంతుడైన పరమాత్మను, పరిమితమైన మనస్సుతో ఎలా భావించగలము?" ఈ విధమైన చింతనలో లీనుడైన ఉదారహృదయుడు, ఆ చింతనద్వారా స్వయంప్రకాశరూపుడైన పరమశివునితో సమావేశమును ఆ క్షణమే అందుకుంటాడు. ఇదే అనుపాయము.

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే అనుపాయప్రకాశనం నామ ద్వితీయమాహ్నికమ్ || 2 ||

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని అనుపాయప్రకాశనమనే రెండవ ఆహ్నికము.

మూడవ ఆహ్నికము
శాంభవోపాయ ప్రకాశనము

యదార్థః - యదార్థము

అథ శామ్భవోపాయః |

ఇప్పుడు శాంభవోపాయము చెప్పబడుచున్నది.

యదేతత్ ప్రకాశరూపం శివతత్త్వమ్ ఉక్తమ్, తత్ర అఖణ్డమణ్డలే యదా ప్రవేష్టుం న శక్నోతి, తదా స్వాతన్త్ర్యశక్తిమేవ అధికాం పశ్యన్ నిర్వికల్పమేవ భైరవసమావేశమ్ అనుభవతి, అయం చ అస్య ఉపదేశః,- సర్వమిదం భావజాతం బోధగగనే ప్రతిబిమ్బమాత్రం ప్రతిబిమ్బలక్షణోపేతత్వాత్, ఇదం హి ప్రతిబిమ్బస్య లక్షణం- యత్ భేదేన భాసితమ్ అశక్తమ్ అన్యవ్యామిశ్రత్వేనైవ భాతి తత్ ప్రతిబిమ్బమ్, ముఖరూపమివ దర్పణే, రస ఇవ దన్తోదకే, గన్ధ ఇవ ఘ్రాణే, మిథునస్పర్శ ఇవ ఆనన్దేన్ద్రియే, శూలకున్తాదిస్పర్శో వా అన్తఃస్పర్శనేన్ద్రియే, ప్రతిశ్రుత్కేవ వ్యోమ్ని |

ఏ ప్రకాశమైతే శివతత్త్వమని చెప్పబడుతున్నదో, ఆ అఖండమండలమునందు ప్రవేశించటం శక్యం కానప్పుడు, దానియొక్క స్వాతంత్ర్యశక్తినే అధికంగా భావిస్తూ, నిర్వికల్పస్థితిలో భైరవసమావేశమును పొందుతాడు. దీనిగురించిన ఉపదేశము ఈ విధంగా ఉన్నది : ఈ సమస్తభావజాలమంతా బోధరూపమైన గగనంలో ప్రతిబింబమాత్రంగా ఉన్నది. భావజాలమునకు ప్రతిబింబలక్షణమున్నది. ప్రతిబింబ లక్షణమేమనగా, విడిగా ప్రకాశించడానికి అశక్తమై, అన్యముతో మిశ్రితమవడం వల్ల ఏదైతే భాసిస్తుందో అదే ప్రతిబింబము - అద్దంలో ముఖంలాగా, దన్తోదకమందు రసములాగా, ముక్కునందు వాసనలాగా, ఆనందేన్ద్రియము నందు మైథునస్పర్శలాగా, లోపలి స్పర్శేన్ద్రియములో శూలము, కుంతము మొదలైనవాటి స్పర్శలాగా, ఆకాశంలో ప్రతిధ్వనిలాగా ఇది ఉన్నది.

న హి స రసో ముఖ్యః తత్కార్యవ్యాధిశమనాద్యదృష్టేః | నాపి గన్ధస్పర్శౌ ముఖ్యౌ గుణేరః తత్ర అభావే తయోరయోగాత్ కార్యపరమ్పరానారమ్భాత్ చ | న చ తౌ న స్తః దేహోద్ధూలన విసర్గాది దర్శనాత్ | శబ్దోఽపి న ముఖ్యః కోఽపి వక్తి ఇతి ఆగచ్ఛన్త్యా ఇవ ప్రతిశ్రుత్కాయాః శ్రవణాత్ | ఏవం యథా ఏతత్ ప్రతిబిమ్బితం భాతి తథైవ విశ్వం పరమేశ్వరప్రకాశే |

వ్యాధిని ఉపశమింపజేయలేదు గనుక, రసం ముఖ్యమైనది కాదు. గుణి లేకుండా, కార్యపరంపర ఆరంభం కాదు గనుక, వాసన, స్పర్శలు కూడా ముఖ్యములు కావు. కానీ, దేహకంపనము, విసర్గము మొదలైనవి కనిపిస్తున్నందున, వాటిని పూర్తిగా లేవని కూడా చెప్పలేము. రాబోతున్న ధ్వని యొక్క ప్రతిధ్వని వినిపిస్తుంది గనుక, శబ్దం కూడా ముఖ్యం కాదు. ఇవన్నీ ఏ విధంగా ప్రతిబింబములుగా ఉన్నాయో, అదే విధంగా విశ్వము కూడా పరమేశ్వరప్రకాశంలో ప్రతిబింబంగా ఉన్నది.

నను కిమ్ అకారణకం తత్? హన్త తర్హి హేతుప్రశ్నః-తత్ కిం బిమ్బవాచోయుక్త్యా, హేతుశ్చ పరమేశ్వరశక్తిరేవ స్వాతన్త్ర్యాపరపర్యాయా భవిష్యతి, విశ్వప్రతిబిమ్బధారిత్వాచ్చ విశ్వాత్మకత్వం భగవతః,

సంవిన్మయం హి విశ్వం చైతన్యస్య వ్యక్తిస్థానమ్ ఇతి, తదేవ హి విశ్వమ్ అత్ర ప్రతీపమ్ ఇతి ప్రతిబిమ్బధారిత్వమ్ అస్య, తచ్చ తావత్ విశ్వాత్మకత్వం పరమేశ్వరస్య స్వరూపం న అనామృష్టం భవతి, చిత్స్వభావస్య స్వరూపానామర్శనానుపపత్తేః / స్వరూపానామర్శనే హి వస్తుతో జడతైవ స్యాత్, ఆమర్శశ్చ అయం న సాంకేతికః, అపి తు చిత్స్వభావతామాత్ర నాన్తరీయకః పరనాద గర్భ ఉక్తః, స చ యావాన్ విశ్వవ్యవస్థాపకః పరమేశ్వరస్య శక్తికలాపః తావన్తమ్ ఆమృశతి /

మరి వీనిలో బింబమేమిటి అనిన ప్రశ్న రావచ్చు. లేదా, ఇవన్నీ అకారణములా అనిన ప్రశ్నకూడా. అయితే ఇది హేతువుకు సంబంధించిన ప్రశ్నయా? అయితే, బింబమును గురించి వాదమెందులకు? పరమేశ్వరశక్తియే హేతువు. దాని పర్యాయపదమే స్వాతంత్ర్యశక్తి. విశ్వమనే ప్రతిబింబమును ధరిస్తున్నది గనుక భగవంతుని విశ్వాత్మకత్వమౌతున్నది. సంవిన్మయమైన విశ్వమే చైతన్యముయొక్క వ్యక్తీకరణస్థానము. ప్రతిబింబంలాగా ఏది ధరింపబడుతున్నదో అదే విశ్వము. కనుక పరమేశ్వరుడు ప్రతిబింబధారి అవుతున్నాడు. దానివల్ల పరమేశ్వరుని విశ్వాత్మకత్వమునకు కళంకం రావడంలేదు. ఎందుకనగా, చిత్ యొక్క స్వభావమునకు తన స్వరూపామర్శ లేకపోవడం సంభవించదు. స్వరూపామర్శ లేకపోతే అది జడమవుతుంది. ఈ ఆమర్శ సాంకేతికం కాదు. కేవలం చిత్స్వభావమే గాని ఇతరము కాదు. ఇది పరనాదమై ఉంటుంది. ఇదియే విశ్వవ్యవస్థాపకమై ఉన్నది. పరమేశ్వరునియొక్క శక్తికలాపమంతటినీ ఇది స్పర్శించగలుగుతుంది.

తత్ర ముఖ్యాస్తావత్ తిస్రః పరమేశ్వరస్య శక్తయః-అనుత్తరః-ఇచ్ఛా-ఉన్మేష ఇతి, తదేవ పరామర్శత్రయమ్ అ-ఇ-ఉ ఇతి, ఏతస్మాదేవ త్రితయాత్ సర్వః శక్తి-ప్రపఞ్చః చర్చ్యతే, అనుత్తర ఏవ హి విశ్రాన్తిరానన్దః, ఇచ్ఛాయామేవ విశ్రాన్తిః ఈశనమ్, ఉన్మేష ఏవ హి విశ్రాన్తిరూర్మిః, యః క్రియాశక్తేః ప్రారమ్భః, తదేవ పరామర్శత్రయమ్ ఆ-ఈ-ఊ ఇతి / అత్ర చ ప్రాచ్యం పరామర్శత్రయః ప్రకాశభాగసారత్వాత్ సూర్యాత్మకం, చరమం ప్రామర్శత్రయం విశ్రాన్తిస్వభావాహ్లాదప్రాధాన్యాత్ సోమాత్మకమ్, ఇయతి యావత్కర్మాంశస్య అనుప్రవేశో నాస్తి /

వీనిలో, అనుత్తరము, ఇచ్ఛ, ఉన్మేషములనబడే, పరమేశ్వరుని మూడుశక్తులు ముఖ్యములైనవి. వీని మూడు శబ్దములు 'అ-ఇ-ఉ' లు. ఈ మూడింటినుండి సర్వశక్తులు విస్తరించినవి. అనుత్తరములో ఆనందం విశ్రాంతమై ఉన్నది, ఇచ్ఛలో ఈశనము, ఉన్మేషములో ఊర్మి. ఇక్కడ క్రియాశక్తి ప్రారంభమౌతుంది. ఈ మూడింటి పరామర్శ 'ఆ-ఈ-ఊ' లై ఉన్నవి. ఈ మొదటి మూడు పరామర్శలు ప్రకాశభాగము యొక్క సారమును కలిగివుండటం చేత సూర్యాత్మకములౌతున్నవి. చివరి మూడువిమర్శలు విశ్రాంతిస్వభావకములై, ఆహ్లాద ప్రాధాన్యమును కలిగియుండటం చేత సోమాత్మకములౌతున్నవి. ఇచ్ఛటివరకూ కర్మాంశ ప్రవేశం కాలేదు.

యదా తు ఇచ్ఛాయామ్ ఈశనే చ కర్మ అనుప్రవిశతి యత్ తత్ ఇష్యమాణమ్ ఈశ్యమాణమ్ ఇతి చ ఉచ్యతే, తదా అస్య ద్వౌ భేదౌ ప్రకాశమాత్రేణ రశ్రుతిః, విశ్రాన్త్యా లశ్రుతిః, రలయోః ప్రకాశస్తమ్భస్వభావత్వాత్, ఇష్యమాణం చ న బాహ్యవత్ స్ఫుటమ్, స్ఫుటరూపత్వే తదేవ నిర్మాణం స్యాత్, న ఇచ్ఛా ఈశనం వా, అతః అస్ఫుటత్వాత్ ఏవ శ్రుతిమాత్రం రలయోః, న వ్యఞ్జనవత్ స్థితిః / తదేతద్వర్ణచతుష్టయం ఉభయచ్ఛాయాధారిత్వాత్ నపుంసకమ్-ఋ-ౠ-ఌ-ౡ ఇతి / అనుత్తరానన్దయోః ఇచ్ఛాదిషు యదా ప్రసరః

తదా వర్ణద్వయమ్ ఏ-ఓ ఇతి | తత్రాపి పునరనుత్తరానన్దసంఘట్టాత్ వర్ణద్వయమ్ ఐ-ఔ ఇతి | సా ఇయం క్రియాశక్తిః, తదేవ చ వర్ణచతుష్టయమ్ ఏ-ఐ ఓ-ఔ ఇతి | తతః పునః క్రియాశక్త్యన్తే సర్వం కార్యభూతం యావత్ అనుత్తరే ప్రవేక్ష్యతి, తావదేవ పూర్వం సంవేదనసారతయా ప్రకాశమాత్రత్వేన బిన్దుతయా ఆస్తే-అమితి | తతస్తత్రైవ అనుత్తరస్య విసర్గో జాయతే-అః ఇతి | ఏవం షోడశకం పరామర్శానాం బీజస్వరూపమ్ ఉచ్యతే |

ఇచ్ఛ మరియు ఈశానములలో కర్మ ప్రవేశించినపుడు అది ఇష్యమాణం ఈశ్యమాణం అనబడుతుంది. దానిలో రెండు భేదములుత్పన్నములౌతున్నాయి. ప్రకాశస్వభావం వల్ల 'ఋ' అనే శృతి, విశ్రాంతి స్వభావం వల్ల 'ఌ' అనే శృతి కలుగుతున్నాయి. ఈ 'ఋ', 'ఌ' లకు ప్రకాశము మరియు స్తంభనములు స్వభావములు. ఇష్యమాణమైనప్పటికీ బాహ్యములాగా స్ఫుటంగా ఉండదు, ఎందుకంటే, స్ఫుటరూపంవల్ల దానికి రూపం నిర్మాణమౌతుంది. అదేవిధంగా ఇచ్ఛ మరియు ఈశానులు కూడా స్ఫుటులు కారు. అస్ఫుటులు గనుకనే 'ఋ', 'ఌ' లు శ్రుతిమాత్రులుగా ఉన్నారు గాని వ్యంజనముల వలె లేరు. ఇప్పుడు, ఉభయచ్ఛాయల ఆధారములతో 'ఋ-ౠ-ఌ-ౡ' అనబడే నాలుగు నపుంసకవర్ణములు వచ్చినవి. అనుత్తరానందములు ఇచ్ఛాదులవైపు ప్రసరించినపుడు 'ఏ-ఓ' అనబడే రెండు వర్ణములు ఏర్పడుతున్నాయి. మరలా వీనిలో, అనుత్తరానందములు సంఘటితములైనప్పుడు 'ఐ-ఔ' అనే రెండు వర్ణములు పుడుతున్నాయి. ఇదే క్రియాశక్తి. ఇది 'ఏ-ఐ-ఓ-ఔ' అనబడే నాలుగు వర్ణముల రూపంలో ఉంటుంది. క్రియాశక్తి యొక్క అంతంలో కార్యభూతమైన సర్వమూ మళ్ళీ అనుత్తరంలో ప్రవేశిస్తుంది. అప్పుడు అంతకు పూర్వమున్నట్టి సంవేదనాసారమైన ప్రకాశమాత్రంగా బిందువుగా ఉంటుంది. దానిని 'అం' అంటాము. అప్పుడు దానియందే అనుత్తరం యొక్క విసర్గం అవుతుంది, అది 'అః' అనబడుతుంది. ఈ పదహారు పరామర్శలను బీజస్వరూపములంటారు.

తదుత్థం వ్యఞ్జనాత్మకం యోనిరూపమ్ | తత్ర అనుత్తరాత్ కవర్గః, శ్రద్ధాయాః ఇచ్ఛాయాః చవర్గః, సకర్మికాయా ఇచ్ఛాయా ద్వౌ టవర్గస్తవర్గశ్చ, ఉన్మేషాత్ పవర్గః-శక్తిపఞ్చకయోగాత్ పఞ్చకత్వమ్ | ఇచ్ఛాయా ఏవ త్రివిధాయా య-ర-లాః, ఉన్మేషాత్ వకారః, ఇచ్ఛాయా ఏవ త్రివిధాయాః శ-ష-సాః, విసర్గాత్ హకారః, యోనిసంయోగజః క్షకారః | ఇత్యేవమ్ ఏష భగవాన్ అనుత్తర ఏవ కులేశ్వరరూపః |

వానినుండి యోనిరూపములైన వ్యంజనములు ఉద్భవిస్తాయి. వానిలో, అనుత్తరమునుండి 'క' వర్గము, శ్రద్ధారూపమైన ఇచ్ఛనుండి 'చ' వర్గము, సకర్మక ఇచ్ఛతో 'ట' వర్గము మరియు 'త' వర్గములనే రెండు, ఉన్మేషమునుండి 'ప' వర్గము ఏర్పడతాయి. పంచశక్తుల కలయికతో పంచకత్వమౌతుంది. త్రివిధములైన ఇచ్ఛలతో 'య-ర-ల' లు, ఉన్మేషమునుండి 'వ' కారము, త్రివిధములైన ఇచ్ఛలతో 'శ-ష-స' లు, విసర్గమునుండి 'హ' కారము, యోనిసంయోగమునుండి 'క్ష' కారము ఉదయిస్తాయి. ఈ విధంగా అనుత్తరరూపుడైన భగవానుడే కులేశ్వరరూపంలో ఉన్నాడు.

తస్య చ ఏకైవ కౌలికీ విసర్గశక్తిః, యయా ఆనన్దరూపాత్ ప్రభృతి ఇయతా బహిఃసృష్టిపర్యన్తేన ప్రసృతాః వర్ణాదిపరామర్శా ఏవ బహిస్తత్త్వరూపతాం ప్రాప్తాః స చ ఏష విసర్గస్త్రిధా, ఆణవః చిత్తవిశ్రాన్తిరూపః, శాక్తః చిత్తసంబోధలక్షణః, శాంభవః చిత్తప్రలయరూపః ఇతి | ఏవం విసర్గ ఏవ విశ్వజననే భగవతః శక్తిః | ఇత్యేవమ్ ఇయతో యదా నిర్విభాగతయా ఏవ పరామర్శః తదా ఏక ఏవ భగవాన్, బీజయోనితయా భాగశః పరామర్శే శక్తిమాన్ శక్తిశ్చ | పృథక్ అష్టకపరామర్శే చక్రేశ్వరసాహిత్యేన నవవర్గః, ఏకైకపరామర్శప్రధాన్యే

పఞ్చాశదాత్మకతా । తత్రాపి సంభవద్భాగభేదపరామర్శనే ఏకాశీతిరూపత్వమ్ । వస్తుతస్తు షట్ ఏవ పరామర్శాః, ప్రసర్పణప్రతిసంచరణయోగేన ద్వాదశ భవన్తః పరమేశ్వరస్య విశ్వశక్తిపూర్ణత్వం పుష్ణన్తి ।

ఆయనయొక్క ఏకైక కౌలికీశక్తి విసర్గశక్తియే. ఆనందరూపిణియైన ఇది అక్కడనుండి బాహ్యసృష్టి వరకూ స్పందించుచూ, వర్ణాది పరామర్శ గావిస్తూ, బాహ్యతత్త్వముల రూపమును పొందుతూ ఉన్నది. ఈ విసర్గము మూడువిధములై ఉన్నది. వీనిలో అణవము చిత్తవిశ్రాంతిరూపము. శాక్తము చిత్తసంబోధలక్షణము. శాంభవము చిత్తప్రళయరూపము. ఈవిధముగా విసర్గమే భగవంతుని శక్తియై విశ్వజనని అనబడుతున్నది. దీనినంతటినీ భాగములు లేని ఏకముగా పరామర్శగావించినపుడు భగవానుడు ఒక్కడే అవుతున్నాడు. బీజయోనులంటూ పరామర్శ గావించినప్పుడు శక్తిమంతుడు మరియు శక్తి అవుతున్నాడు. మరలా, అష్టకరూపంలో పరామర్శగావించినపుడు చక్రేశ్వరునితో కలిపి నవవర్గములౌతున్నాయి. ఒక్కొక్క వర్ణమును పరామర్శించినప్పుడు ఏబది వర్ణములౌతున్నాయి. దానిలో కూడనూ, సంభావ్యభాగముల ప్రకారం చూచినట్లైతే ఎనుబది ఒకటి అవుతున్నాయి. వాస్తవికంగా పరామర్శలు ఆరు. ప్రసర్పణ ప్రతిసంచరణల పూర్వకంగా పన్నెండౌతున్నాయి. ఇవి పరమేశ్వరుని యొక్క విశ్వశక్తిని పూర్ణము, పుష్టము గావిస్తున్నాయి.

తా ఏవ ఏతాః పరామర్శరూపత్వాత్ శక్తయో భగవత్యః శ్రీకాలికా ఇతి నిరుక్తాః । ఏతే చ శక్తిరూపా ఏవ శుద్ధాః పరామర్శాః శుద్ధవిద్యాయాః పరాపరరూపత్వేన మాయోన్మేషమాత్రసంకోచాత్ విద్యావిద్యేశ్వరరూపతాం భజన్తే ।

ఇదియే పరామర్శరూపిణిగా భగవంతుని శక్తిగా ఉన్నది, ఈమెయే శ్రీ కాళికాశక్తియని చెప్పబడినది. ఈమె శక్తిరూపిణి, శుద్ధ పరామర్శ, శుద్ధవిద్య. పరాపరరూపిణియై మాయయొక్క ఉన్మేష సంకోచములవల్ల విద్యగా, విద్యేశ్వరునిగా విభజింపబడుచున్నది.

మాయాయాం పునః స్ఫుటీభూతభేదవిభాగా మాయీయవర్ణతాం భజన్తే, యే పశ్యన్తీమధ్యమావైఖరీషు వ్యావహారికత్వమ్ ఆసాద్య బహీరూప తత్త్వస్వభావతాపత్తి పర్యన్తాః తే చ మాయీయా అపి శరీరకల్పత్వేన యదా దృశ్యన్తే, యదా చ తేషామ్ ఉక్తనయైరేతైః జీవితస్థానీయైః శుద్ధైః పరామర్శైః ప్రత్యుజ్జీవనం క్రియతే తదా తే సవీర్యా భవన్తి, తే చ తాదృషా భోగమోక్షప్రదాః, ఇత్యేవం సకలపరామర్శ విశ్రాన్తిమాత్రరూపం ప్రతిబిమ్బిత సమస్తతత్త్వ, భూత, భువనభేదమ్ ఆత్మానం పశ్యతో నిర్వికల్పతయా శాంభవేన సమావేశేన జీవన్ముక్తతా । అత్రాపి పూర్వవత్ న మన్త్రాదియన్త్రణా కాచిదితి ।

మాయవల్ల, మరలా స్ఫుటీభూతమై, అనేకములైన భేదవిభాగములతో, మాయావర్ణములుగా విభజింపబడుచున్నది. ఇది పశ్యన్తీ, మధ్యమా, వైఖరులనబడే వ్యావహారిక రూపములను ధరించి బాహ్యతత్త్వ స్వభావమును పొందుచున్నది. మాయావర్ణములైనప్పటికీ శరీరసమములై, శుద్ధపరామర్శ యనబడే ప్రాణమును పొందినప్పుడు సవీర్యములౌతున్నవి. ఆ విధంగా అవి భోగ, మోక్ష, ప్రదములౌతున్నవి. ఈ విధముగా సకలపరామర్శలు విశ్రాంతిని పొందగా, ప్రతిబింబములుగా కనిపిస్తున్న సమస్త భూతములు, భువనభేదములు తన ఆత్మయేనని చూచుచూ, నిర్వికల్పస్థితిలో శాంభవసమావేశమును పొందగా, జీవన్ముక్తత్వము లభిస్తున్నది. దీనిలోకూడా, ముందువలెనే, మంత్రములు మొదలైనవాటి శ్రమ, ఇసుమంతైననూ లేదు.

శ్లో|| అన్తర్విభాతి సకలం జగదాత్మనీహ
యద్వద్విచిత్రరచనా ముకురాన్తరాలే |
బోధః పరం నిజవిమర్శ రసానువృత్త్యా
విశ్వం పరామృశతి నో ముకురస్తథా తు || 7 ||

సకలజగత్తూ ఆత్మలోలోపల భాసిస్తున్నది. అంతరాలమనే అద్దంలో ఈ విచిత్రరచన గోచరిస్తున్నది. పరమైన బోధ, నిజవిమర్శరసము ననుసరించి, విశ్వమును పరామర్శ గావిస్తున్నది. కానీ అద్దము ఆ విధంగా చెయ్యలేదు.

వ్యాఖ్యానము

శాంభవోపాయము - అనుపాయముల పోలిక

సంవిద్రూపిధైన (జీవముతో కూడియున్న జ్ఞానమైన) ఏ వెలుగైతే శివతత్త్వమని చెప్పబడుతున్నదో, ఎల్లలు లేనట్టి ఆ అఖండ కాంతిమండలములో తాను పూర్తిగా కరగి లయమయ్యే సమాధిస్థితిని వెంటనే అందుకోవడం అందరికీ సాధ్యం కాదు. ఉత్తమోత్తమ లక్షణములు కలిగిన అత్యంత కొద్దిమంది సాధకులు మాత్రమే దానిని అందుకోగలుగుతారు. ఇతరులకు అది వీలుకాదు. కారణమేమంటే, దానికి వారివారి ఆలోచనలు, త్రిగుణములు, అహంకార మమకారములు, అజ్ఞానము, అవిద్య, కర్మ ఇత్యాదులన్నీ అడ్డు వస్తూ ఉంటాయి. అటువంటివారు ఉత్తమసాధకులేగాని ఉత్తమోత్తమ సాధకులు కారు.

మరి అలాంటి సాధకులేమి చేయాలి? అనగా, పరమశివుని యొక్క స్వాతంత్ర్యశక్తినే వారు ఎక్కువగా ధ్యానిస్తూ ఉండాలి. అప్పుడు దానిలో లీనమైన మనస్సుతో వారు నిర్వికల్పసమాధి స్థితిని అందుకుంటారు. దానిలో భైరవసమావేశమును పొందుతారు. దీనిని శాంభవోపాయమని పిలుస్తారు.

ఈ స్వాతంత్ర్యశక్తియే పరమశివుని ఇచ్ఛాశక్తి. అది దేనికీ లోబడనిది, ఎల్లలు లేనిది, తన ఇష్టానుసారం ప్రవర్తించేదిగా ఉన్నది. ప్రకాశ (వెలుగు) రూపమైన పరమశివుని స్వరూపము, విమర్శనాత్మకమై యున్నది. అనగా, జ్ఞానస్వరూపముగా ఉన్నదని ముందే అనుకున్నాము. అది సృష్టిలో సర్వే సర్వత్రా ప్రసరిస్తూ, తన ఇచ్ఛానుసారము తాను ప్రసరించిన దానినెల్లా తన స్వరూపముతో నింపుతూ అనుగ్రహమయముగా వెలుగుతున్నది.

ఈ విషయమై కఠోపనిషత్ ఈ విధముగా అంటున్నది.

శ్లో|| న తత్ర సూర్యో భాతి న చంద్ర తారకం
నేమా విద్యుతో భాన్తి కుతోయమగ్నిః
తమేవ భాంత మనుభాతి సర్వం
తస్యభాసా సర్వమిదం విభాతి || (2-2-15)

అచ్చట సూర్యుడు వెలుగడు, చంద్రుడు, నక్షత్రములు వెలుగవు. విద్యుత్తూ ప్రకాశించదు, ఇక అగ్నిమాట

చెప్పేదేముంది? అది వెలగడం వల్ల, సర్వమూ వెలుగుతున్నది. దానివెలుగుతోనే ఈ సర్వమూ వెలుగుతున్నది.

భగవద్గీత కూడా ఇదే భావమును వెల్లడిస్తుంది.

శ్లో|| న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః
యద్గత్వా ననివర్తన్తే తద్ధామ పరమం మమ || (15-6)

అక్కడ సూర్యుడు, చంద్రుడు, అగ్ని వెలుగరు. ఎక్కడికి చేరిన తరువాత ఇక వెనుకకు తిరిగి రావడం ఉండదో అదే నా పరమధామము.

అట్టి వెలుగుకు, స్వాతంత్ర్యశక్తి పర్యాయపదంగా ఉన్నది. నిరంకుశమైన అట్టి ఇచ్ఛాశక్తిని ధ్యానించే యోగి శాంభవ సమావేశమును పొందుతున్నాడు.

క్రిందటి అధ్యాయములో చెప్పబడిన 'అనుపాయ'మనే స్థితిని సహజసమాధి యని పిలువవచ్చు. అది రాకపోకలు లేని నిరంతరసమాధి స్థితి. అయినప్పటికీ అత్యంత సహజంగా, ఏ విధమైన ప్రత్యేకతా లేనట్లుగా, అతి మామూలుగా కనిపించే స్థితి. ఈ స్థితిలో ఉన్నట్టి మహానుభావుని గ్రహించడం లోకులకు సాధ్యం కాదు. ఎందుకనగా, ఆయన పూర్తిగా మనవలెనే, అతిసాధారణంగా ఉంటాడు గనుక. ఏవైనా దివ్యమహిమలు ప్రదర్శించినపుడు మాత్రమే అతని దివ్యత్వమును సామాన్యులైన లోకులు గుర్తించగలుగుతారు. లేదంటే గుర్తించలేరు.

దానికంటే ఒక మెట్టు క్రిందది శాంభవోపాయము ద్వారా కలిగే నిర్వికల్ప సమాధి స్థితి. దానివల్ల భైరవశివునితో ఐక్యం లభిస్తుంది. అది ఏ విధంగా జరుగుతుందో ఈ అధ్యాయంలో అభినవగుప్తులు వివరిస్తున్నారు.

బింబము - ప్రతిబింబము

సృష్టిరూపంలో ఉన్నట్టి ఈ సమస్తభావజాలమంతా ఎరుక, బోధ, జ్ఞానము అనిన ఆకాశంలో కేవలం ప్రతిబింబముగా ఉన్నది. సమస్తమైన భావజాలమునకు ప్రతిబింబము యొక్క లక్షణమున్నది. ప్రతిబింబమంటే ఏమిటి? తనంతట తానుగా ప్రకాశించే శక్తి దానికుండదు. ఇంకొకదానితో కలిసినప్పుడే అది ఉండగలుగుతుంది, వ్యక్తము కాగలుగుతుంది. వ్యక్తమైనదానిని ప్రతిబింబమంటాము. తనంతట తానుగా ఉండగలిగినది బింబము. ఇంకొకదాని ఆధారంతో ప్రకాశించేది ప్రతిబింబము. కనుక సృష్టి, విశ్వము, దానిలోని జీవులు, తత్త్వములు, భావములు ఇవన్నీ ప్రతిబింబములే. ఏమనగా, వాటికి స్వయముగా ఉండే సామర్థ్యం లేదు గనుక. అవి పరమేశ్వరుని నుండి ఉద్భవించి, ఆయన ఆధారంతో నిలబడి ఉంటున్నవి. మరలా ఆయనలోకే లయమౌతున్నవి. కనుక అవి అద్దములో కనిపిస్తున్నటువంటి ప్రతిబింబము వంటివి.

ప్రకాశరూపుడైన పరమశివుడు నిర్మలమైన ఆకాశంలాగా ఉన్నాడు. ఆయనలో సమస్తవిశ్వమూ ప్రతిఫలిస్తున్నది. ఆయన యొక్క స్వచ్ఛతయే సృష్టిలోని సమస్తజీవులలో, వస్తువులలో ప్రతిబింబిస్తున్నది.

పంచేంద్రియములు - వాటి చర్యలు

అద్దంలో ముఖం కనిపిస్తుంది. నోటిలోని లాలాజలము నందు రుచి తెలుస్తుంది. ముక్కుకు వాసన తెలుస్తుంది. జననేంద్రియమునకు మైథునసమయంలో స్పర్శ తెలుస్తుంది. శూలము, బరిసె మొదలైన వాటితో దెబ్బ తగిలినప్పుడు, అవి చర్మము లోపలకు గుచ్చుకున్నపుడు, శరీరపు లోలోపల వాటి స్పర్శ తెలుస్తుంది. అదే విధముగా ఆకాశంలో ప్రతిధ్వని వినిపిస్తుంది. ఇవి, వరుసగా రూపము, రుచి, వాసన, స్పర్శ, శబ్దములు. వీటినే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములంటారు. అంటే, పంచేంద్రియములైన కన్ను, నాలుక, ముక్కు, చర్మము, చెవులకు కలిగే అనుభూతులు. ఆయా అనుభూతులు, ఆయా ఇంద్రియములలో ప్రతిబింబిస్తున్నాయి.

అయిదు ఇంద్రియములలో ఒక్కొక్క దానికి ఒక్కొక్క లక్షణమున్నది. కన్ను చూస్తుంది గాని, వినలేదు. చెవి వింటుంది గాని, చూడలేదు. ఇదే విధముగా, ఇంద్రియములలో, దేని లక్షణం దానిదే. ఈ విధముగా, సృష్టిలోని వివిధ వస్తువులకున్న అయిదు లక్షణములను అయిదు ఇంద్రియములు విడివిడిగా గుర్తిస్తున్నాయి. మరియొక విధంగా చూచినపుడు, ఆయా లక్షణములు ఆయా ఇంద్రియములలో ప్రతిబింబిస్తున్నాయి గనుక అవి తెలియబడుతున్నాయి. కనుక ఇంద్రియానుభవములన్నీ ప్రతిబింబముల చర్యలే గాని బింబజ్ఞానములు కావు.

తనంతట తానుగా, వ్యాధిని ఉపశమింపజేయలేదు గనుక రసం (రుచి) ముఖ్యమైనది కాదు. అనగా, మనమొక ఔషధమును మ్రింగినపుడు, రుచిలో ఔషధము కలసి దేహములో చేరి పనిచేస్తున్నది గనుక, రోగం నయమౌతున్నది. ఔషధం లేకుండా ఉత్త రుచి, రోగమును నయం చేయలేదు. కనుక రుచి అనేది ఒక వాహకమే గాని ముఖ్యము కాదు. అదియొక ప్రతిబింబము వంటిదే గాని, అసలైన బింబము కాదు.

అదే విధముగా ప్రతి వాసనకు ఒక గుణముంటుంది. అది సువాసనగాని, దుర్వాసనగాని అవుతుంది. ఆ గుణము లేకుండా, ఉత్త 'వాసన' అనే మాటకు అర్థం లేదు. వాసన యొక్క గుణమును బట్టి, దానిని గుర్తించినవానిలో ప్రతిచర్య ఉంటుంది. సువాసనను ఆస్వాదించడము, దుర్వాసనను అసహ్యించుకోవడము జరుగుతాయి. కనుక, గుణమును బట్టి వాసనకు ప్రాధాన్యత ఉంటుంది. కనుక అది కూడా ఒక వాహకమే, ఒక ప్రతిబింబమే గాని, ముఖ్యము కాదు; అసలైన బింబమూ కాదు.

అదే విధముగా స్పర్శ కూడా. దాని గుణమును బట్టి దానికి విలువ ఆపాదించబడుతుంది. సున్నితమైన స్పర్శ వేరు, మోటు స్పర్శ వేరు. ప్రేమతో కూడిన స్పర్శ వేరు, హింసతో కూడిన స్పర్శ వేరు. స్పర్శ వెనుక ఉన్న గుణమును బట్టి దానికి విలువ కలుగుతుంది గాని, ఏ విధమైన గుణమూ లేని ఉత్త 'స్పర్శ' అనేది ఉండదు. దానికి ప్రతిస్పందన కూడా ఉండదు. కానీ, స్పర్శ అనేది అసలు లేదని అనలేము. ఎందుకంటే, మైథునక్రియలో, దేహము వణకడము, స్ఖలనము మొదలైనవి కనిపిస్తున్నవి గనుక.

అదే విధముగా, శబ్దం కూడా ముఖ్యం కాదు. శబ్దము దేనినుండి ఉద్భవించినదో ఆ మూలము ముఖ్యముగాని, శబ్దము ముఖ్యము కాదు. మరి ప్రతిధ్వని విషయమేమిటి? అనిన ప్రశ్న రావచ్చు. దానికి కూడా ఒక ధ్వని మూలమై ఉంటుంది, ఆ ధ్వనికి కూడా దానిని పుట్టించిన వ్యక్తి మూలమై ఉంటాడు గనుక, అతడే బింబము, అతనికి ఇవన్నీ ప్రతిబింబములు మాత్రమే.

ఈ విధముగా, పంచేంద్రియముల చర్యలన్నీ కేవలము ప్రతిబింబములే గాని, అసలైన, వాటికవి

స్వతంత్రములైన, బింబములు కావు. సృష్టి మొత్తమును, పంచేంద్రియముల, పంచభూతముల అమరికయే గనుక, ఇవన్నీ ఏ విధంగా ప్రతిబింబములుగా ఉన్నాయో, అదే విధంగా ఈ చరాచరవిశ్వమంతా కూడా పరమేశ్వరుడనే అనంతమైన, అఖండమైన జ్ఞానస్వరూపమైన వెలుగులో, ఒక ప్రతిబింబంలాగా ఉన్నది. అంతేగాని, దీనికి స్వతంత్రమైన ఉనికి లేదు.

బింబము - హేతువు

మరి, ఇప్పటివరకూ మీరు చెప్పిన ఇంద్రియానుభూతులలో, అసలైన బింబమేమిటి? ఇవన్నీ ప్రతిబింబములని అన్నారు కదా? వీటికి బింబములు లేవా? బింబము లేకుండా ప్రతిబింబం ఎలా ఉంటుంది? ఉంటే, ఆ బింబమేమిటి? అనిన ప్రశ్న ఉదయిస్తుంది. అలాగే, ఒక పని జరగాలంటే, దాని వెనుక ఒక కారణం ఉండాలి. కారణం లేకుండా కార్యం ఉండదు. కనుక, ఈ ఇంద్రియానుభూతులకు మూల కారణమేమిటి? అని కూడా ప్రశ్న ఉదయిస్తుంది. దానికి ఈ విధంగా సమాధానం చెబుతున్నారు.

ఈ సమాధానమును కోరుతున్న మీరు, హేతువాదుల లాగా అగుపిస్తున్నారు. ఎందుకనగా, వీటన్నింటికీ వెనుకనున్న 'హేతువు' ను మీరడుగుతున్నారు గనుక. బింబము వేరు, హేతువు వేరు. బింబము ఉండవచ్చు, కానీ, అది ప్రతిఫలించడానికి హేతువు మళ్ళీ వేరుగా ఉంటుంది. మీరడుగుతున్నది బింబము గురించియా? లేక అది ప్రతిఫలించడానికి అవసరమైన హేతువు గురించియా? ఏదేమైనప్పటికీ, సమాధానమును వినండి.

పరమశివుడు - శక్తి

ఈ సమస్తానికీ పరమేశ్వరశక్తియే అసలైన హేతువు. దానికి మరొక పేరున్నది. అదే, ఆయనయొక్క స్వాతంత్ర్యశక్తి. ఆయన సర్వస్వతంత్రుడు. ఆ స్వాతంత్ర్యమే ఆయన యొక్క శక్తి. ఆయనలో ప్రతిఫలిస్తున్న ఈ విశ్వమనే ప్రతిబింబమును, ఆయన శక్తియే భరిస్తున్నది, ధరిస్తున్నది గనుక, అది భగవంతుని యొక్క అనంతమైన విశ్వాత్మకత్వముగా, విశ్వమంతా వ్యాపించియున్న తత్త్వముగా గోచరిస్తుంది. జ్ఞానము, స్వాతంత్ర్యము, వెలుగుల రూపమైన ఈ సృష్టియే అఖండ పరమేశ్వరచైతన్యము వ్యక్తమయ్యే చోటు. అలాంటప్పుడు విశ్వమునకు పరమేశ్వర స్పృహ ఎందుకని లేదు? అంటే, పరమేశ్వరుని వెలుగు విశ్వంపైన పడుతున్నప్పటికీ దానిలో 'నేను పరమేశ్వరుని శక్తినే, ఆయన స్వరూపమునే' యన్న స్పృహ లేదు. అంటే, ఆత్మచైతన్యం దానిలో లేదు. దీనికి కారణం మాయ, లేదా మలము. అయితే, ఇది అద్వైతవేదాంతము చెప్పే మాయ కాదు. ఈ మలమేమిటో ముందు వివరింపబడింది.

అద్దంలో ప్రతిబింబంలాగా, సృష్టి, పరమేశ్వరునిలో భాసిస్తూ ఉన్నది. కనుక పరమేశ్వరుడు ప్రతిబింబధారి అవుతున్నాడు. ఇక్కడ మరొక్క ప్రశ్న ఉదయిస్తుంది.

పరమేశ్వరుడు అద్దంలాగా ఒకచోట ఉన్నపుడు ఆయన యొక్క విశ్వవ్యాపకత్వమునకు లోటు వస్తుంది కదా? అని. కానీ, దీనివలన పరమేశ్వరుని విశ్వాత్మకత్వమునకు ఎటువంటి చెదరుబాటునూ రాదు. ఎందుకనగా, చిత్ యొక్క స్వభావమునకు, తన స్వరూపమును తానే మరచిపోయే సమస్య ఉత్పన్నం కాదు గనుక. ఆ విధంగా తన స్వరూపమును తానే పూర్తిగా మరచిపోతే, అది జడమవుతుంది గాని చైతన్యస్వరూపం

కాలేదు. కనుక సృష్టియొక్క ప్రతిఫలింపు వలన పరమేశ్వరునికి పరిమితత్వం ఎన్నటికీ రాదు.

మరి ఈ పరామర్శ (తనను తాను గ్రహించి ఆవిష్కరించుకునే ప్రయత్నం) సాంకేతికమా? అనగా, దీనిలో విభాగములున్నవా? క్రియలున్నవా? ఉంటే, వాటి విధానమేమి? అనిన ప్రశ్న ఉదయిస్తే, సమాధానమేమనగా, 'ఆ విధముగా జరుగదు' అని. ఈ స్వరూప పరామర్శ యున్నది కేవల చిత్ యొక్క సహజమైన స్వభావం మాత్రమేగాని ఇతరము కాదు. అది పరమేశ్వర సంవిత్ యొక్క ఒక లక్షణము మాత్రమే. దీనికే మరొక పేరు, పరనాదము. అదొక విశ్వాతీతమైన స్పందనానాదము. ఈ నాదంలోనే విశ్వమంతా ఇమిడి ఉంటుంది. పరమేశ్వరునికి ఉన్నట్టి రకరకములైన శక్తులనన్నింటినీ ఈ పరనాదమనేది తనలోని వివిధశబ్దముల రూపములుగా ప్రతిఫలించగలుగుతుంది.

పరమేశ్వరుడు, ఆయనయొక్క శక్తి - వీరిని ప్రతిపాదించిన తరువాత, ఆ శక్తి, శబ్దములలో ఎలా ఇమిడి యుంటుందో, ఏ విధముగా వికసిస్తుందో, వివరిస్తున్నారు ఆచార్యులవారు.

అచ్చులు - సృష్టిక్రమము

అఖండుడు, అనంతుడు, అపరిమితుడు, నిరాకారుడు, కేవల సంవిత్ స్వరూపుడూ అయిన పరమశివునికి పరిమితుడైన జీవునిగా మారాలని, సృష్టిని చేయాలని, ఆకారమును ధరించాలని అనిపించడము, అది క్రియారూపమును దాల్చడము, తిరిగి సృష్టి అంతంలో మళ్ళీ తన స్వస్వరూపమును తాను ధరించడము - ఈ ప్రక్రియ మొత్తమూ శక్తి సహాయముతోనే జరుగుతున్నది. అందుకనే, శక్తి సహాయము లేనిదే శివుడు కదలలేడని తంత్రశాస్త్రములలో చెప్పబడింది. శక్తి, శబ్దమయి. శబ్దములే మంత్రములు. కనుక శక్తి, మంత్రమయి. ఆయా కార్యములను చేసేటప్పుడు, కార్యానుసారియై ఒకే శక్తి అనేక రూపములను ధరిస్తుంది. ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులుగా శబ్దములే పనిచేస్తాయి. ఈ ప్రక్రియ అంతా, అక్షరమాలలో ఏ విధముగా ఒదిగియున్నదో ఈ అధ్యాయములో అభినవగుప్తులు వివరించారు. మంత్రశాస్త్రము పైన సమగ్ర సంక్షిప్త వ్యాఖ్యానముగా ఈ అధ్యాయమును భావించవచ్చును.

మూడు ముఖ్యశక్తులు

పరమేశ్వరునకున్నట్టి లెక్కలేనన్ని శక్తులలో, మూడు శక్తులు ముఖ్యములైనవి. అవి, అనుత్తర, ఇచ్ఛా, ఉన్మేషములనబడే మూడుశక్తులుగా, ఈ క్రిందివిధముగా ఉన్నాయి.

అనుత్తరము

ఉత్తరమంటే ముందుది, అధికమైనది. అనుత్తరమంటే వీటికి వ్యతిరేకమైనది. అనగా, తనకంటే అధికమైనది లేనట్టిది. ఇది, 'అ' కారము. ఏమనగా, అక్షరమాలలో అకారమే మొదటి శబ్దము. దానికంటే ముందు వేరే అక్షరమేదీ లేదు గనుక, దానికంటే అధికమైన అక్షరమేదీ లేదు గనుక, ఇది పరమేశ్వరునికి ప్రతీకయై, ఆయనయొక్క స్వస్వరూపమైన 'అనుత్తరశక్తి' అనబడుతుంది.

ఇచ్ఛ

ఇది పరమేశ్వరుని సంకల్పశక్తి. ఇచ్ఛకే సంకల్పమని మరో పేరు. ఇది, 'ఇ' కారము. ఇది అక్షరమాలలోని రెండవ శబ్దము. కనుక ఇది పరమేశ్వరుని ఇచ్ఛాశక్తి. అనగా, ఒక్కడుగా, అనంతుడుగా, తనలో తానుగా ఉన్న పరమేశ్వరునకు సృష్టిని చేయాలన్న ఇచ్ఛ ఉదయించింది.

ఉన్మేషము

ఉన్మేషమంటే, తెరచుట అని అర్థం. కన్నులు తెరుచుకోవడం, మూయడాలను ఉన్మేష, నిమేషములని అంటారు. అంటే, క్రియ యని అర్థం. నిద్రిస్తున్న స్థితినుండి, ప్రయత్నపూర్వకంగా మనం కన్నులను తెరుస్తాము. కనుక ఇది పరమేశ్వరుని క్రియాశక్తి. దీనిద్వారా, తన శక్తిని ఉపయోగించి, సృష్టిగా క్రియారూపమును ఆయన ధరించాడు.

అచ్చులు - శివస్వరూపములు - సృష్టిక్రమం

ఈ మూడు మూలశక్తులనుండి, పరమేశ్వరుని మిగతా శక్తులన్నీ విస్తరించాయని చెప్పవచ్చును. ఎలాగంటే, 'అ' కారములో ఆయనయొక్క ఆనందస్వరూపం ఉన్నది. అది క్రియాశక్తిగా ఇంకా అవతరించలేదు గనుక విశ్రాంతిగా తనలో తానున్న స్థితిలో ఉన్నది. అంటే, స్వస్వరూపమని అర్థం. ఇది అనుత్తరశక్తి.

అదే విధముగా, 'ఇ' కారమైన ఇచ్ఛలో ఈశనమున్నది. అంటే, ఈశిత్వము లేదా ప్రభుత్వము. సృష్టిని చేయాలని, దానిని నడపాలని, ఇచ్ఛ ఉదయించింది. కనుక ఇది ఇచ్ఛాశక్తి.

మూడవదియైన, 'ఉ' కారములో, ఉన్మేషములో, ఊర్మి యున్నది. అంటే, స్పందనమని అర్థం. 'ఉ' కారము జ్ఞానశక్తి.

ఈ మూడు శబ్దముల పరామర్శ ఆ-ఈ-ఊ లై ఉన్నవి. పరామర్శ అనే పదమును ముందుగా అర్థం చేసుకోవాలి. ఆమర్శ అనే సంస్కృతపదమునకు 'వ్యక్తీకరింపబడుట', 'దర్శించుట', 'వ్యాప్తి చెందుట' అని అర్థములున్నాయి. పరామర్శ అంటే, 'పరమునకు వ్యాప్తిచెందటం' అనిన అర్థంలో తీసుకుంటే, హ్రస్వముగా ఉన్న శబ్దము దీర్ఘము గావడమని, తనను తాను వ్యక్తీకరించుకోవడమని అర్థమౌతుంది. కనుక, అ, ఇ, ఉ లనబడే పొట్టి శబ్దములు దీర్ఘములుగా వ్యక్తీకరింపబడినప్పుడు ఆ, ఈ, ఊ లౌతున్నాయి.

ఏ శబ్దమైనా దీర్ఘముగా ఉచ్చరింపబడినప్పుడు, చివరకది శూన్యంలో లయిస్తుంది. అంటే, పరంలో ఆమర్శ అవుతుంది. కనుక దీనిని 'పరామర్శ' అంటాము.

అనుత్తరమునకు వ్యాప్తి ఆనందము. కనుక 'అ' కారము 'ఆ' కారములో విశ్రమిస్తున్నది. అదే విధముగా ఇచ్ఛకు వ్యాప్తిస్థానము ఈశిత్వము. కనుక, 'ఇ' కారము 'ఈ' కారములో విశ్రమిస్తున్నది. ఉన్మేషమునకు ఊర్మి వ్యాప్తిస్థానము. కనుక 'ఉ' కారము 'ఊ' కారములో విశ్రమిస్తున్నది. కనుక, అ ఆ, ఇ ఈ, ఉ ఊ లు వరుసగా ఆనందము, ఇచ్ఛ, జ్ఞాన శక్తులౌతున్నాయి.

సూర్యుడు - చంద్రుడు

ఈ మొదటి మూడు శబ్దములు (అ, ఇ, ఉ లు) వెలుగు యొక్క రూపములుగా ఉన్నాయి. ఎందుకనగా, అప్పటివరకూ నిశ్శబ్దరూపంలో ఉన్న చీకటిని పారద్రోలి, ఒక భావమును వ్యక్తీకరించడంలో, పదముల నిర్మాణప్రక్రియలో అవి పునాదులుగా పడుతున్నాయి గనుక, ఆలోచనకు, భావమునకు అవి వెలుగునిస్తున్నాయి గనుక, అవి సూర్యశక్తిని కలిగి ఉంటున్నాయి. తరువాతివైన దీర్ఘశబ్దములు (ఆ, ఈ, ఊ లు) విశ్రాంతిగా ముందుకు సాగుతున్నాయి కాబట్టి, ఆహ్లాదమును సుఖమును సూచిస్తున్నాయి కాబట్టి, చల్లని వెన్నెలవంటి చంద్ర స్వరూపములౌతున్నాయి. సూర్యుడు చీకటిని పోగొట్టి వెలుగునిస్తాడు. చంద్రుడు చల్లని వెన్నెలతో హాయినిస్తాడు. కనుక మొదటి మూడు శబ్దములు సూర్యశక్తులు, తరువాత మూడు శబ్దములు చంద్రశక్తులని చెప్పబడినాయి.

ఇప్పటివరకూ వెలుగు, ఆహ్లాదములే వచ్చినవి గాని, కర్మ రాలేదు. ఇప్పుడది కూడా వస్తున్నది. ఇచ్ఛ లేదా ఈశానమంటే ఈశ్వరత్వమని, ప్రభుత్వమని అనుకున్నాము కదా ! ఇది శుద్ధమైన సంకల్పరూపంలో మాత్రమే ఇప్పటివరకూ ఉన్నది. దానిలో కర్మ ప్రవేశించినపుడు అది ఇష్యమాణం లేదా ఈశ్యమాణం అని అనబడుతుంది. వీనిలో, ఇష్యమాణమంటే, ఆధిపత్యమును చెలాయించాలన్న ఇచ్ఛ లేదా సంకల్పము. ఈశ్యమాణమంటే, దేనిపైన అయితే ఆధిపత్యమును చెలాయించాలనుకుంటామో అది. ఇచ్ఛ ఉన్నపుడు, దానిచేత పొందబడే ఒక వస్తువు కూడా ఉండాలి. అంటే, కర్మ సంకల్పము, కర్మను ఆపాదించుకునే పదార్థము, రెండూ వెంటవెంటనే పుడుతున్నాయి. అప్పుడు, దానిలో రెండు భేదములు కలుగుతాయి. వెలుగు (సూర్యుని) స్వభావం నుంచి 'ఋ' అనే శబ్దము, విశ్రాంతి (చంద్రుని) స్వభావం నుంచి 'ఌ' అనే శబ్దము పుడుతున్నాయి. ఎందుకనగా, వెలుగుకు ప్రసరించడం లక్షణము, విశ్రాంతికి స్వీకరించడం లక్షణం గాబట్టి. కనుక, ఈ 'ఋ', 'ఌ' అనబడే శబ్దములకు ప్రకాశము మరియు స్తంభనములు స్వభావములుగా ఉంటాయి. ఎందుకంటే, అవి సూర్య, చంద్రస్వరూపములు గనుక.

ఈ స్థాయిలోని శక్తి, ఇష్యమాణమైనప్పటికీ, అనగా, ఆధిపత్యమును చెలాయించాలన్న సంకల్పమును ధరించినప్పటికీ, అది బాహ్యరూపమును ధరించి, స్ఫుటంగా ఉండదు. ఎందుకంటే, స్ఫుటరూపం ధరిస్తే దానికొక ఆకారం ఏర్పడుతుంది. ఇప్పటికి ఈ శబ్దములకు సగము రూపమే వచ్చింది గాని, పూర్ణరూపం రాలేదు. అంటే, హ్రస్వరూపమే ఉన్నదిగాని, దీర్ఘరూపం రాలేదు. అదేవిధంగా, ఇచ్ఛ మరియు ఈశానులు కూడా ప్రస్తుతానికి ఇంకా స్పష్టమైన రూపమును ధరించలేదు. కనుకనే 'ఋ', 'ఌ' లు హ్రస్వ శబ్దరూపములలోనే ఉన్నాయి గాని, దీర్ఘరూపములలోకి ఇంకా రాలేదు. ఇప్పుడు, హ్రస్వ, దీర్ఘఛాయల ఆధారములతో ఋ-ౠ-ఌ-ౡ అనబడే నాలుగు శబ్దములు పుట్టినాయి. వీటిలో సూర్య, చంద్ర శక్తులు రెండూ కలిసి ఉన్నాయి గనుక, ఇవి పురుషులూ స్త్రీలూ రెండూ గనుక, వీటిని నపుంసక వర్ణములని అంటున్నాము. అంతేగాక, 'ఋ', అనేది 'ర' కారము తోనూ, 'ఌ' అనేది 'ల' కారము తోనూ ముడిపడి యున్న శబ్దములు, కానీ, సమగ్రమైన స్వరూపములను సంతరించుకున్నవి కావు. సగము ఛాయలతోనే ఉన్నాయి కనుక నపుంసక వర్ణములైనాయి.

క్రియాశక్తి వర్ణములు

అనుత్తరమనబడే 'అ' కారము, ఆనందమనబడే 'ఆ' కారములు, ఇచ్ఛ మరియు ఉన్మేషములైన 'ఇ, ఉ'

ల వైపు కొద్దిగా ప్రసరించినపుడు 'ఏ-ఓ' అనబడే రెండు శబ్దములు ఏర్పడుతున్నాయి. మరలా, 'ఇ, ఉ' లతో 'అ, ఆ' లు పూర్తిగా కలసిపోయినప్పుడు, 'ఐ-ఔ' అనే రెండు శబ్దములు పుడుతున్నాయి. అంటే, అనుత్తర, ఆనందశక్తులు - ఇచ్ఛా ఉన్మేషశక్తులతో కలసి, పూర్తిగా క్రియారూపమును ధరించాయి. కనుక, దీనిని 'క్రియాశక్తి' అని అంటున్నాము. ఇది ఏ-ఐ-ఓ-ఔ అనబడే నాలుగు శబ్దముల రూపములుగా ఉంటుంది. క్రియాశక్తి, సృష్టిలో తాను చేయవలసిన పనిని పూర్తిచేసినప్పుడు, ఇవన్నీ ఉపసంహరింపబడి, వెనుకకు మరలి, పరమేశ్వరస్వరూపమైన అనుత్తరంలో, అనగా, 'అ' కారములో ప్రవేశిస్తాయి. అప్పుడు సృష్టికి పూర్వమున్నట్టి స్పందనారూపంలో, ఒక వెలుగుతున్న బిందువులాగా శక్తి ఉంటుంది. అందుకే, దానిని 'అం' అంటాము. అంటే, ఇప్పటివరకూ జరిగిన ప్రక్రియ యంతయు ఒక బిందువు రూపమును ధరించింది. అప్పుడు, ఒక్కసారిగా విసర్గము జరిగి సృష్టి మొదలౌతుంది. అందుకని అది 'అః' అనబడే విసర్గము అవుతుంది. వెరసి, 'అ' నుండి 'అః' వరకూ ఉన్నట్టి, ఈ పదహారు శబ్దములను (అచ్చులు) బీజములంటారు. ఎందుకంటే, ఇవి సృష్టిబీజములు లేదా 'అచ్చు'లు గనుక. వీటినుండి యోనిరూపములైన 33 వ్యంజనములు (హల్లులు) ఉద్భవిస్తాయి.

సృష్టి మొత్తం శివశక్తిమయము. శివుడు బీజస్వరూపుడు, శక్తి యోనిస్వరూపిణి. అందుకనే, 'అ' నుండి 'అః' వరకూ ఉన్నట్టి పదహారు అచ్చులు శివస్వరూపములుగా ఉన్నాయి. వాటిని బీజములంటారు. 'క' నుంచి, 'హ' వరకూ ఉన్నట్టి హల్లులు ముప్పది మూడు శక్తిస్వరూపములు. వాటిని యోనులంటారు. సృష్టి మొత్తము శబ్దమయము గనుక అంతా శివశక్తి స్వరూపమే. అలాగే, బీజ యోనుల (అచ్చులు, హల్లుల) కలయికలతో, సృష్టికి మారుపేరైన భాష, దానియొక్క శబ్దజాలం సమస్తమూ పుడుతుంది.

సృష్టికి శబ్దము ఎట్లా మారురూపమైంది? అంటే, సృష్టిలో ఉన్న ప్రతిదానికీ ఒక పేరున్నది. అది ఒక శబ్దంతో సూచింపబడుతుంది. భౌతికమైన ప్రతిదానికీ ఒక భావన ఆధారంగా ఉన్నది. ఆ భావన ఒక శబ్దసహాయంతో ప్రకటించబడుతుంది. కనుక సృష్టి, ఉత్త భౌతికమే కాదు, అది భావనారూపము, శబ్దరూపము కూడా.

'క్ష' కారము - గణపతి

'క' నుండి 'స' వరకూ ఉన్న శక్తిమయములైన హల్లులతో కలసిన శబ్దము క్ష. అందుకే, దీనిని యోనిసంయోగముచేత పుట్టిన శబ్దమని అన్నారు. కనుక ఇది శక్తిస్వరూపమై ఉన్నది. కనుక అమ్మవారి ఒంటి నలుగు నుండి పుట్టిన గణపతికి సూచకము. 'క' నుంచి 'హ' వరకూ ఉన్నట్టి ఎనిమిది హల్లుల వర్గములను (కవర్గము, చవర్గము, టవర్గము, తవర్గము, పవర్గము, యవర్గము, శవర్గము, హ) గణములంటారు. ఆ గణములకు అధిపతి గనుక 'క్ష' కారము గణపతి అవుతున్నది. పార్వతీదేవి, తన ఒంటినుండి తీసిన నలుగుతో ఒక బొమ్మను చేసి, దానికి వినాయకునిగా ప్రాణం పోసినదని చెప్పే కథలోని అంతరార్థమిదే. అందుకనే, 'క్ష' అనే అక్షరమును సంస్కృతములో వ్రాస్తే, అది తొండముతో ఉన్న గణపతి క్ష ఆకారంలో ఉంటుంది. ఈ కారణం వల్లనే, అక్షరాభ్యాస ప్రారంభంలో, విద్య చక్కగా ఒంటబట్టాలన్న సదుద్దేశ్యంతో, శిశువుచేత గణపతి పూజను చేయించే ఆచారం ఉద్భవించింది.

హల్లులు - శక్తిస్వరూపములు

శక్తిస్వరూపములైన హల్లుల పుట్టుక ఎలా జరిగినదో వివరిస్తున్నారు.

అనుత్తరమనబడే 'అ' కారము నుండి 'క' వర్గము పుట్టింది. ఉత్త శ్రద్ధతో కూడిన ఇచ్ఛనుండి 'చ' వర్గము పుట్టింది. అనగా, దీనిలో క్రియ లేదు. శ్రద్ధమాత్రమే ఉన్నది. అనగా, 'ఇ' కారమునుండి అని అర్థము. తరువాత, కర్మతో కూడిన ఇచ్ఛతో 'ట' వర్గము మరియు 'త' వర్గములనే రెండు పుట్టినాయి. అంటే, 'ఈ' కారమునుండి యని అర్థము. ఉన్మేషమునుండి 'ప' వర్గము ఏర్పడింది. అంటే, 'ఉ' కారము నుండి యని అర్థము. అయిదు శక్తులతో కూడినందుచేత క,చ,ట,త,ప,లనే అయిదు వర్గములు పుట్టినాయి. ఇవి పంచభూతములపైన, అదే విధముగా పంచ తారాగ్రహములపైన ఆధిపత్యమును కలిగి ఉన్నాయి. సృష్టి స్థితి సంహారములనబడే మూడు ఇచ్ఛాశక్తులనుండి 'య, ర, ల' శబ్దములు, ఉన్మేషము నుండి 'వ' కారము పుట్టినాయి. మరలా మూడు విధములైన ఇచ్ఛలతో 'శ, ష, స' శబ్దములు, విసర్గమునుండి 'హ' కారము, యోనిసంయోగమునుండి 'క్ష' కారము ఉదయిస్తాయి. యోనిసంయోగమంటే క, ష, హ అనే అక్షరముల కలయిక. వీనిలో అనుత్తరమైన 'అ' కారము కలసియే ఉంటుంది.

ఈ క్రింది పట్టికను గమనించండి.

అనుత్తరము	అ	క వర్గము	క ఖ గ ఘ ఙ
శుద్ధమైన ఇచ్ఛ	ఇ	చ వర్గము	చ ఛ జ ఝ ఞ
ఇచ్ఛ+కర్మ	ఈ	ట వర్గము	ట ఠ డ ఢ ణ
		త వర్గము	త థ ద ధ న
ఉన్మేషము	ఉ	ప వర్గము	ప ఫ బ భ మ
ఇచ్ఛాశక్తి (సృష్టి, స్థితి, లయము)	ఈ		య, ర, ల
ఉన్మేషము	ఉ		వ
ఇచ్ఛాశక్తి (సృష్టి, స్థితి, లయము)	ఈ		శ, ష, స
ఉన్మేషము	ఉ		హ
యోనిసంయోగము			క్ష

అచ్చులు - తంత్రార్థములు

అచ్చు	అర్థము
అ	అనుత్తరమనే చిత్శక్తి
ఆ	ఆనందశక్తి
ఇ	నిష్క్రియతో ఉన్న ఇచ్ఛాశక్తి
ఈ	క్రియాసంకల్పంతో కూడిన ఇచ్ఛాశక్తి

అచ్చు	అర్థము
ఉ	ఉన్మేషశక్తి
ఊ	ఊర్మిశక్తి
ఋ	ప్రకాశ ప్రధానమైన క్రియాశక్తి అస్ఫుటరూపం
ౠ	ప్రకాశ ప్రధానమైన క్రియాశక్తి స్ఫుటరూపం
ఌ	ఆహ్లాదప్రధానమైన క్రియాశక్తి అస్ఫుటరూపం
ౡ	ఆహ్లాదప్రధానమైన క్రియాశక్తి స్ఫుటరూపం
ఏ	క్రియాశక్తి - మొదటిస్థాయి
ఐ	క్రియాశక్తి - రెండవస్థాయి
ఓ	క్రియాశక్తి - మూడవస్థాయి
ఔ	క్రియాశక్తి - నాలుగవస్థాయి
అం	బిందువు - అనుత్తర, ఆనంద, ఇచ్ఛా, ఉన్మేష శక్తుల కుదింపు. విసర్గమునకు ముందటి ఏకాగ్రస్థితి
అః	విసర్గము - సృష్టి ప్రారంభము

ఈ పదహారు బీజములు (బీజాక్షరములు), యోగసాంప్రదాయములోని విశుద్ధచక్రపు పదహారు దళములలో ఉంటాయన్నది గమనార్హం.

హల్లులు - తంత్రార్థములు

అనుత్తర, ఆనందము (అ, ఆ) ల నుండి - పంచమహాభూతముల ఉద్భవం

ఈ క్రింది పట్టికను గమనించండి.

హల్లు	శక్తి	పంచభూతములు
క	క్రియాశక్తి	భూమి
ఖ	జ్ఞానశక్తి	జలము
గ	ఇచ్ఛాశక్తి	అగ్ని
ఘ	ఆనందశక్తి	వాయువు
ఙ	చిత్శక్తి	ఆకాశము

ఇచ్ఛా, ఈశనము (ఇ, ఈ) ల నుండి - పంచ తన్మాత్రల ఉద్భవం

హల్లు	శక్తి	పంచతన్మాత్రలు
చ	క్రియాశక్తి	గంధము
ఛ	జ్ఞానశక్తి	రసము
జ	ఇచ్ఛాశక్తి	రూపము

హల్లు	శక్తి	పంచతన్మాత్రలు
ఝ	ఆనందశక్తి	స్పర్శ
ఞ	చిత్శక్తి	శబ్దము

ఉన్మేషము, ఊర్మిల (ఉ, ఊ) నుండి – మనోబుద్ధ్యాది పంచకముల ఉద్భవం

హల్లు	శక్తి	బుద్ధి పంచకం
ప	క్రియాశక్తి	మనస్సు
ఫ	జ్ఞానశక్తి	బుద్ధి
బ	ఇచ్ఛాశక్తి	అహంకారము
భ	ఆనందశక్తి	ప్రకృతి
మ	చిత్శక్తి	పురుషుడు

ప్రకాశము (ఋ, ౠ) నుండి కర్మేంద్రియముల ఉద్భవం

హల్లు	శక్తి	కర్మేంద్రియము
ట	క్రియాశక్తి	పాణి (చేతులు)
ఠ	జ్ఞానశక్తి	పాయువు (గుదము)
డ	ఇచ్ఛాశక్తి	పాదము
ఢ	ఆనందశక్తి	ఉపస్థ (లింగము/యోని)
ణ	చిత్శక్తి	వాక్కు

అహ్లాదము (ఌ–ౡ) నుండి జ్ఞానేంద్రియముల ఉద్భవం

హల్లు	శక్తి	జ్ఞానేంద్రియము
త	క్రియాశక్తి	శ్రోత్రము (చెవులు)
థ	జ్ఞానశక్తి	చక్షువు (కన్నులు)
ద	ఇచ్ఛాశక్తి	త్వక్ (చర్మము)
ధ	ఆనందశక్తి	రసన (నాలుక)
న	చిత్శక్తి	ఘ్రాణము (ముక్కు)

ఆరు ఉపాధులు

ఈ ఆరును పురుషుని ఉపాధులు. వీటికి లోబడటం చేతనే, తనను తాను పరిమితునిగా జీవుడు భావించుకుంటాడు.

హల్లు	కంచుకములు (ఉపాధులు)
య	కాలము, కళ (కళయంటే కళాత్మకత, కల్పనాశక్తి)

హల్లు	కంచుకములు (ఉపాధులు)
ర	విద్య (పరిమితమైన విషయముల జ్ఞానము)
ల	రాగము, నియతి (రాగమంటే ఇష్టము, నియతి యంటే విధి)
వ	మాయ (ఉన్నదానిని లేనట్లు, లేనిదానిని ఉన్నట్లు చూడటం)

నాలుగు శుద్ధతత్త్వములు

హల్లు	శుద్ధవిద్యా తత్త్వములు
శ	శుద్ధవిద్యా తత్త్వము
ష	ఈశ్వర తత్త్వము
స	సదాశివ తత్త్వము
హ	శక్తితత్త్వము

వర్ణమాలలోని మొదటి వర్ణమైన 'అ' పరమశివునికి సూచిక కాగా చివరిదైన 'హ' శక్తితత్త్వమైనది. ఈ విధముగా అక్షరమాలలోని వర్ణములన్నీ 'అ' - 'హ' ల మధ్యలోనే ఉంటున్నాయి. వీటికి బిందువును చేర్చగా 'అహమ్' అవుతుంది. శైవతంత్రముల ప్రకారము ఇదే శివశక్తుల మహామంత్రము. ఇది సృష్టిక్రియను సూచించే మంత్రము కాగా, దీనిని విపరీతముగా ఉచ్చరించినపుడు, 'మ్ హా' అనబడే సంహార మంత్రమౌతుంది. కుండలినీసాధనలోను, కాశ్మీరశైవసంప్రదాయములోని యోగసాధనలోను వీటి ఆచరణాత్మకములైన ఉపయోగములున్నాయి.

శబ్దాతీతుడే శబ్దమయుడు

ఈ విధంగా అనుత్తరరూపుడైన భగవానుడే కులేశ్వరరూపంలో ఉన్నాడు. అనుత్తర స్వరూపుడంటే, సర్వాతీతుడై, తనకంటే అధికులుగా, ఉన్నతులుగా వేరెవరూ లేనట్టి స్థితిలో ఉన్న పరమేశ్వరుడు. ఆ స్థితి 'అ' కారముతో సూచితమౌతున్నది. కులమంటే సృష్టి, అనగా, 'హ' కారముతో అంతమయ్యే శక్తిస్వరూపములైన అక్షరముల సముదాయము. కనుక 'అ' నుండి 'హ' ల మధ్యలోనే శివశక్తులిద్దరూ నెలకొని యున్నారు. దీనికి స్పందనాశబ్దమైన 'మ్' ను కలుపగా 'అహమ్' అవుతుంది.

కులేశ్వరుడంటే అక్షరమాలకు అధిపతి. అనగా, సృష్టికి అతీతుడైన పరమేశ్వరుడు. శక్తిద్వారా ఆయనలో సృష్టి ప్రతిఫలిస్తుంది. ఇంకొక కోణములో సృష్టియే తానౌతున్నాడు. ఆ విధముగా, శబ్దములకు అతీతుడైనవాడు, శబ్దముల సమూహమే తానౌతున్నాడని అర్థము. దీనికి సూచకం 'అహమ్' అనబడే శబ్దము. తంత్రశాస్త్రమున ఇది ఓంకారసమమైన మహామంత్రముగా లెక్కించబడుతుంది.

విసర్గశక్తియే కాళి

అట్టి పరమశివుని యొక్క ఏకైకమైన కౌలికీశక్తి విసర్గశక్తియే. అంటే, 'అహ' అనబడే శబ్దము. మనము చింతలనుండి, బాధలనుండి తాత్కాలికంగానైనా సరే విముక్తులమైనప్పుడు, విశ్రాంతిని పొందినప్పుడు మనకు

తెలియకుండానే ఈ శబ్దము మన నోటినుండి వస్తుంది. ఇది అందరికీ అనుభవమే. ఆనందస్వరూపమైన ఈ శబ్దము తన స్వస్థానము నుండి, అనగా, పరమేశ్వరుని స్థానము నుండి, బాహ్యసృష్టి వరకూ వరుసగా ప్రసరిస్తూ, అక్షరమాలలోని నానావిధములైన శబ్దములను సృష్టిస్తూ, చివరకు భౌతికమైన రూపములను ధరించి, పంచభూతములుగా, సృష్టిగా బాహ్యమైన రూపమును పొందుతూ ఉన్నది.

ఇది పరమేశ్వరుని నుండి సృష్టివైపు ప్రసరించినపుడు 'ప్రవృత్తి' యని, దీనికి వ్యతిరేకదిశలో సృష్టి నుండి పరమేశ్వరునివైపు పయనించినప్పుడు 'నివృత్తి' యని పిలువబడుతుంది. అనగా, ఈ శక్తి భోగరూపముగా, మోక్షరూపముగా, రెండువిధములుగానూ పనిచేస్తుంది. వీనిని అవిద్యాశక్తి, విద్యాశక్తి యని పిలువవచ్చును. సృష్టితో మమేకమై, దానిని అనుభవించాలన్న కోరిక అవిద్యాశక్తి, భోగమును దాటి మోక్షమును పొందాలనుకునేది విద్యాశక్తి.

విసర్గము యొక్క మూడు రూపములు

ఈ విసర్గక్రియ - అణవ, శాక్త, శాంభవములని మూడువిధములుగా ఉన్నది. అందుకనే - ఉపాయములు, సాధనలు కూడా ఈ మూడువిధములై ఉంటున్నవి.

అణవోపాయము

వీనిలో, అణవము చిత్తవిశ్రాంతిరూపము. అనగా, చిత్తమును స్థిరపరచి దానికి విశ్రాంతినిస్తుంది. ఇది ద్వైతరూపము. అనగా, నేను వేరు, నాచే చూడబడుచున్న సృష్టి వేరన్న ద్వైతములో ఉంటుంది. దీనిని భేదమంటారు. ఇది 'మ్' అనిన ధ్వనిగా జీవుని స్థాయియై యున్నది.

జీవునిస్థాయిలో విసర్గము జరుగవలెనంటే, ఎంతో ప్రక్రియ అవసరమౌతుంది. సృష్టిని అంచెలంచెలుగా నిర్మించవలసి యుంటుంది. ఆ తరువాత జీవుని ఆవిర్భావం జరుగుతుంది. ఇది ఎంతో క్రియాకలాపంతో కూడుకున్నది. కనుక ఇది క్రియాశక్తి యొక్క పని అవుతుంది. విసర్గము నుండి బయలుదేరిన క్రియాశక్తి అధ్వప్రక్రియద్వారా సృష్టి స్తరములను నిర్మించుకుంటూ క్రిందకు దిగి వస్తుంది. కనుక, జీవుడు మరలా పైకి ఎదిగి, పరమశివుని చేరుకోవాలంటే, ఈ క్రియాశక్తి సహాయమునే తీసుకోవలసి యుంటుంది. దీనికి, మంత్రతంత్రములు, క్రియా కలాపములు, ఆరాధనలు, పూజలు, జపతపాది క్రియలు ఇవన్నీ అవసరమౌతాయి. కనుక, అణవోపాయము క్రియాశక్తి మార్గము. ఈ సాధనలవలన, మనస్సు నిగ్రహింపబడి నిశ్చలమౌతుంది గనుక ఇది మనోనిగ్రహరూపమై ఉంటుంది.

శాక్తోపాయము

శాక్తము చిత్తసంబోధ లక్షణము. అనగా, అజ్ఞానముతో ఉన్న చిత్తమును నిద్రలేపి దానికి జ్ఞానమునిస్తుంది. 'సృష్టిని నాలోనికి స్వీకరించి గ్రహిస్తున్నాన'న్న స్పృహలో ద్వైతాద్వైతపు భావనగా ఉంటుంది. దీనిని భేదాభేదమంటారు. ఇది 'హ' అనిన ధ్వనిగా వర్ణమాలలోని చివరి వర్ణమై శక్తిస్థాయియై యున్నది.

శక్తి రెండు విధములు - శుద్ధశక్తి, అశుద్ధశక్తి. విసర్గముతో ఉద్భవించిన ఈ రెండూ కలసి సృష్టిలో ఎన్నో

తారతమ్యములను, అంతస్తులను నిర్మించుకుంటూ వస్తాయి. సాధకునిలో కూడా ఈ రెండూ ఉంటాయి. అశుద్ధశక్తి వలన చిత్తము చీకటిలో, అజ్ఞానములో ఉంటుంది. శుద్ధశక్తి దానిని జయించినపుడు చిత్తములో బోధ కలుగుతుంది. కనుక, తనలోని శుద్ధశక్తి సహాయముతో తనలోనే ఉన్న అశుద్ధశక్తిని తొలగించి, దానికి ఆధారమైన పరమేశ్వరుని చేరుకోవడం ఈ మార్గపు లక్షణం. ఇది జ్ఞానశక్తి యొక్క స్థాయి గనుక, జ్ఞానమును పొందిన చిత్తము ద్వారా ఈ ఉపాయము సంభవిస్తుంది. పోయిన అజ్ఞానము యొక్క ఛాయకంటే, పొందబడిన జ్ఞానము యొక్క ఛాయ ఎక్కువగా ఉంటుంది గనుక, ద్వైతాద్వైతములతో కూడిన ఈ స్థాయిలో ద్వైతము యొక్క ఛాయ తక్కువగాను, అద్వైతపు ఛాయ ఎక్కువగాను ఉంటుంది. శాక్తోపాయము జ్ఞానశక్తి మార్గము.

శాంభవోపాయము

శాంభవము చిత్తప్రళయరూపము. అనగా, చిత్తమును లయము గావిస్తుంది. ఇది అద్వైతభావన. దీనిని అభేదమంటారు. ఈ స్థితిలో ఉన్నపుడు, చూచే నేను, చూడబడుచున్న సృష్టి, ఈ ప్రక్రియకు అవసరమైన చిత్తము, మూడూ లేవు. ఇది 'అ' అని ధ్వనిగా శివునిస్థాయియై యున్నది.

ఇచ్ఛాశక్తి వలన సృష్టి జరుగుతుంది. అదియే సృష్టికి మూలస్పందనము. కనుక ప్రళయం కూడా ఇచ్ఛాశక్తితోనే జరుగుతుంది. దేనితో శక్తి క్రిందకు వస్తుందో దానితోనే పైకి పోతుంది. ఇచ్ఛామాత్రంతో, స్వాతంత్ర్యశక్తి ధ్యానంతో, చిత్తం నశిస్తుంది. పరమేశ్వర సమావేశం లభిస్తుంది. కనుక శాంభవోపాయము ఇచ్ఛాశక్తి మార్గము.

విసర్గమే సృష్టి ప్రక్రియయై ఉన్నది గనుక, అదే భగవంతుని శక్తిగనుక, విశ్వమును రచించే శక్తి గనుక, విశ్వజనని అనబడుతున్నది.

అనేకమైన ఏకము

శబ్దరూపమైన ఈ ప్రసారమునంతా, అయా విభాగములేవీ లేనట్టి ఏకస్వరూపముగా దర్శించినప్పుడు భగవంతుడు పరనాదస్వరూపుడై ఒక్కడే అవుతాడు. ఇది నాదముయొక్క 'పరా' అనిన స్థితి.

ఆ విధముగా కాకుండా, బీజములు (అచ్చులు), యోనులు (హల్లులు) అంటూ, రెండు వర్గములుగా చూచినప్పుడు, శక్తిమంతుడు (శివుడు) మరియు శక్తి అవుతున్నాడు. మరలా, అష్టకరూపంలో, అనగా, క,చ,ట,త,ప,య,శ,హ వర్గములుగావిభజించి చూచినప్పుడు, చక్రేశ్వరుడైన 'క్ష' కారముతో కలిపి మొత్తము తొమ్మిది వర్గములౌతున్నాయి. ఒక్కొక్క అక్షరమును విడివిడిగా లెక్కించినప్పుడు మొత్తము ఏబది శబ్దములౌతున్నాయి. దానిలో కూడనూ, అక్షరములు మొత్తము ఎన్ని విడివిడి భాగములౌతాయో అన్నిగా విభజించి చూచినప్పుడు, అవి ఎనుబది ఒకటి శబ్దములౌతున్నాయి. ఇవన్నియు, వ్యక్తీకరింపబడి, ఇంద్రియసంవేదనా భూమికలోకి వచ్చి చేరడం వలన, 'అపరా' అనబడతాయి. ఈ అంకెలకు తంత్రశాస్త్రమున ప్రత్యేక ప్రతిపత్తి యున్నది.

పన్నెండు కాళికాశక్తులు

మూలంలో దర్శించినప్పుడు 'అ, ఇ, ఉ, ఆ, ఈ, ఊ' లనబడే శబ్దములు ఆరుగా ఉన్నాయి. అనుత్తర, ఇచ్ఛా, ఉన్మేష, ఆనంద, ఈశాన, ఊర్మిలనబడే ఆరు పరామర్శ శక్తులే అవి. కానీ, పెరిగి తరిగే (హ్రస్వములు దీర్ఘములుగా, మరలా దీర్ఘములు హ్రస్వములుగా మారే) క్రమంలో ఇవి ఆరునూ, పన్నెండుగా మారుతాయి.ఈ పన్నెండు శక్తులూ కలసి పరమేశ్వరుని యొక్క విశ్వవ్యాపకత్వమును, విశ్వశక్తిని పరిపూర్ణము, పరిపుష్టము గావిస్తున్నాయి. అంటే, సృష్టిని నడపడంలో పరమేశ్వరునకు సహాయపడుతూ ఉన్నాయి. ఈ పన్నెండు విధములైన శక్తుల రూపమే, సకలపరామర్శ రూపిణిగా, భగవంతుని శక్తిగా ఉన్నది, ఈమెయే శ్రీ కాళికాశక్తియని నిరుక్తము చెప్పుచున్నది.

కాళికాశక్తులు పన్నెండని ప్రసిద్ధి. క్రమ సాంప్రదాయం ప్రకారం, వారు -

1. సృష్టికాళి

2. రక్తకాళి

3. స్థితినాశనకాళి

4. యమకాళి

5. సంహారకాళి

6. మృత్యుకాళి

7. రుద్రకాళి

8. మార్తాండకాళి

9. పరమార్కకాళి

10. కాలాగ్నిరుద్రకాళి

11. మహాకాలకాళి

12. మహాభైరవ ఘోరచండకాళి

అని చెప్పబడతారు. క్రమ సాంప్రదాయంలో ఈ వివిధ కాళికాశక్తుల ఉపాసన ప్రసిద్ధి చెందినది. వీని వివరములు శాక్తోపాయములో చెప్పబడినవి.

మానవుడు తన ఇంద్రియముల ద్వారా పొందుతున్న అనేకములైన అనుభవముల వెనుక ఉన్న ప్రక్రియ అంతా ఈ పన్నెండు శక్తుల అధీనములో ఉంటుంది. జన్మ, కర్మ, బంధము, మోక్షము, సమస్తమూ ఈ శక్తుల అదుపాజ్ఞలలోనే ఉంటుంది.

ఈమె శక్తిరూపిణిగా, శుద్ధ పరామర్శ (శుద్ధమైన జ్ఞానము) గా, శుద్ధవిద్య (శుద్ధమైన మంత్రము) గా ఉన్నది. పరాపరరూపిణియైనప్పటికీ, మాయయొక్క సంకోచ వ్యాకోచములవల్ల విద్య (మంత్రము, శక్తి,

హల్లులు) గా, విద్యేశ్వరుని (మంత్రాధిదేవత, శివుడు, అచ్చులు) గా రెండు రూపములుగా విభజింపబడుచున్నది. అదే మాయవల్ల, మరలా ఆకారమును ధరించి, అనేకములైన భేదములతో కూడిన విభాగములతో, ఎనిమిది గణములతో కూడిన (క, చ, ట, త, ప, య, శ, హ లనబడే) మాయావర్ణములుగా విభజింపబడుచున్నది. ఆ తరువాత, పరారూపమునుండి వెలువడుతూ, పశ్యన్తీ, మధ్యమా, వైఖరులనబడే వ్యావహారికముగా మనము గుర్తించగలిగే నాదరూపములను ధరించి బాహ్యతత్త్వములుగా రూపొందుచున్నది.

నాదము యొక్క నాలుగు రూపములు

నాదము - పరా, పశ్యన్తీ, మధ్యమా, వైఖరీ అని నాలుగు రూపములలో ఉంటుందని తంత్రశాస్త్రము చెబుతుంది.

పరా

దీనినే పరాశక్తి యని కూడా వ్యవహరిస్తారు. ఇది పరమేశ్వరునిలో నిండి, ప్రపంచాతీతమై, సృష్టివైపు అసలు చూడని శుద్ధమైన ఎరుక. ఇది ప్రత్యక్చితి. అంటే, తనలోకి తాను తొంగిచూస్తున్న జ్ఞానమై ఉంటుంది. బహిర్ముఖంగా ఉండదు. కనుక, దీనిని గ్రహించడం మానవుని మనస్సుకు సాధ్యం కాదు. యోగశాస్త్రం ప్రకారం ఈ పరానాదమనేది మూలాధారచక్రంలో కుండలినీ రూపంలో ఉంటుంది. ఈ కారణంచేతనే, సుషుమ్నా ద్వారమును తన నోటితో మూసి నిద్రిస్తున్న మహాసర్పంగా దీనిని చిత్రీకరిస్తారు. దీనిని నిద్రలేపడమే యోగుల కర్తవ్యము. దీనిని, నాదం కాని నాదము, లేదా అవ్యక్తనాదమని అనవచ్చు.

పశ్యన్తి

అంతర్ముఖత నుండి వెలువడి, సృష్టివైపు చూస్తున్న శక్తిని, పశ్యన్తి అంటారు. అంటే, 'చూచునది' యని అర్థం. పరమేశ్వరునితో ఒక్కటిగా ఉన్న అద్వైతస్థితి నుండి, కొద్దిగా ప్రక్కకు జరిగి, ద్వైతం వైపు దృష్టి సారించిన శక్తి యని అర్థం. ఇది శుద్ధమైన ఇచ్ఛ లేదా సంకల్పమౌతుంది. మూలాధారం నుండి కొద్దిగా కదలి స్వాధిష్ఠాన చక్రమునకు చేరి, సంకల్పాత్మకమై ఉన్న శక్తిని 'పశ్యన్తి' అంటాము.

మధ్యమ

ఈ స్థాయిలో మనస్సు ప్రవేశిస్తుంది. అంటే, సృష్టిని అర్థం చేసుకుందామన్న ఆలోచనాస్రవంతి, గ్రహింపు, చింతన, మననం సాధకునిలో మొదలౌతాయి. వాటినుండి భావములు పుట్టుకొస్తాయి. వాటిని వెల్లడించడానికి అవసరమైన శబ్దముల నిర్మాణము మనస్సులో జరుగుతుంది. స్వాధిష్ఠాన చక్రం నుండి ఇంకా పైకెక్కి, శరీరమునకు మధ్యలోనున్న హృదయస్థానమును చేరి, భావాత్మకముగా ఉన్న నాదమును 'మధ్యమ' అంటాము.

వైఖరి

ఒకనిచే గ్రహింపబడిన జ్ఞానము, పదములు, వాక్యములుగా వ్యావహారికభాషలో బయటకు ప్రసారమై,

మనచేత అర్థము చేసికొనబడుతుంది. హృదయమునుండి, హృదయగతములైన భావములను తీసుకుని, గొంతులో నున్న విశుద్ధచక్రమును చేరి, పదముల రూపంలో ఆ భావములను మాటలలో వెలిబుచ్చే స్థితిని 'వైఖరి' అంటాము.

లలితా సహస్రనామములు దీనిని ఈ విధంగా స్తుతించాయి.

పరా ప్రత్యక్చితీ రూపా పశ్యన్తీ పరదేవతా
మధ్యమా వైఖరీ రూపా భక్తమానస హంసికా

ఈ అక్షరశబ్దములన్నీ శక్తిమయములు, మాయావర్ణములైనప్పటికీ, అవి దేహములై ఉంటాయి. ప్రాణమున్నపుడే దేహం కదులుతుంది. కనుక శుద్ధపరామర్శ (శుద్ధమైన ఎరుక, జ్ఞానము) యనబడే ప్రాణమును (శ, ష, స, హ లను) పొందినప్పుడు, ఆయా అక్షరములు, శబ్దములు, మంత్రములై, బలమును సంతరించుకుంటున్నవి. అప్పుడవి తమను ఉపాసించువారికి భోగమును, మోక్షమును ఇవ్వడానికి సమర్థములౌతున్నవి. ఈవిధముగా, అక్షరమాలలోని సాధారణశబ్దములే మంత్రములుగా మారుతున్నాయి.

ఈ విధముగా సృష్టిలో ఉన్నట్టి అన్ని శబ్దములు విశ్రాంతిని పొందగా, ప్రతిబింబములుగా తన దృష్టికి కనిపిస్తున్న సమస్త తత్త్వములు, జీవులు, లోకములు అన్నీ తన ఆత్మలోనే ఉన్నవని చూచుచున్న స్థితియే నిర్వికల్పసమాధి.

షడధ్వములు

త్రికశాస్త్రములో షడధ్వములున్నాయి. అధ్వమంటే దారి, క్రమము యని అర్థములున్నవి. అవి, వర్ణ, మంత్ర, పద, కళ, తత్త్వ, భువనములని ఆరుగా ఉన్నాయి.

వర్ణాధ్వము - వర్ణములంటే శుద్ధశబ్దములు లేదా బీజములు. కనుక ఇది బీజాక్షరమార్గము. దీనిలో బీజాక్షరముల సహాయముతో పరమశివుని చేరుకోవాలి.

మంత్రాధ్వము - వర్ణముల కలయికలతో మంత్రములేర్పడతాయి. కనుక ఇది మంత్రమార్గము. మంత్రముల సహాయముతో పరమశివుని చేరాలి.

పదాధ్వము - పదములంటే వాక్యములు. కనుక ఇది స్తోత్రపారాయణలతో కూడిన మార్గము. స్తోత్రముల సహాయముతో పరమశివుని చేరుకోవాలి.

కళాధ్వము - పరమశివునకు అయిదు కళలున్నాయి. అవి, సమస్త సృష్టినీ ఆవరించి ఉన్నాయి. అవి, నివృత్తికళ, ప్రతిష్ఠాకళ, విద్యాకళ, శాంతికళ, శాంత్యతీతకళ. ఈ కళలను తనలో గుర్తిస్తూ, ఒక్కొక్కదానిని దాటుతూ చివరిదైన శాంత్యతీతకళను చేరుకోవాలి. అదే పరమశివుడు. కనుక ఇది, కళాపథము.

తత్త్వాధ్వము - పృథివి నుండి శివునివరకు 36 తత్త్వములు సృష్టిలో ఉన్నాయి. వాటిని తనలోనే దర్శించి, ఒక్కొక్కదానిని అధిగమిస్తూ పరమశివుని చేరాలి. ఇది తత్త్వపథము.

భువనాధ్వము - పరమశివుని అయిదు కళలలోను 118 భువనములు లేదా లోకములున్నాయి. ఆయా లోకములను తనలోనే గుర్తించి, వాటిని సృష్టించినట్టి శక్తితో మమేకమై, ఆ శక్తికి ఆధారుడైన పరమశివుని చేరుకోవాలి. ఇది భువనపథము.

ఈ అధ్వములు (మార్గములు, దారులు) అన్నీ తనలోనే ఉన్నవన్న దర్శనమును సాధకుడు పొందాలి. ఇవియన్నీ తనలోనే ఉదయించి, స్థితిని పొంది, అస్తమిస్తున్నవన్న అనుభవంలో అతడు కుదురుగా ఉండాలి. అట్టి నిర్వికల్పస్థితిలో అతడు శాంభవసమావేశమును పొందుతాడు. ఎందుకనగా, శంభునిలోనే ఈ సృష్టి అంతా, అధ్వముల రూపంలో ఉన్నది. కనుక ఆయా అధ్వములను తనలోనే దర్శిస్తున్న సాధకుడు, తానే పరమశివుడౌతాడు. ఈ విధముగా, సాధకునకు జీవన్ముక్తత్వము అప్పటికప్పుడే లభిస్తున్నది. ఈ విధానములో కూడా, ఇంతకు ముందువలెనే, అనగా, అనుపాయములో వలె, మంత్రములు మొదలైనవాటిని జపించి అనుష్ఠించవలసిన అగత్యము ఉండదు.

ఆ// అంతమందు జగతి యట్లట్టుగా వెల్గు
అద్దమందు బింబ మరసినట్లు
తనను బట్టి పరము; తనలోక మట్లట్లె
అద్దమట్టులౌనె యరసి జూడ?

సమస్త విశ్వమూ తనలోనే గోచరిస్తుంది. తానుండటం వల్ల ఇతరం కనిపిస్తున్నది. తనలో ప్రతిఫలించి సృష్టి కనిపిస్తుంది. అద్దంలో ప్రతిబింబం కనిపించినట్లు ఇది జరుగుతుంది. అద్దం లేకుంటే ప్రతిబింబం లేదు. అట్లే, స్వాత్మ లేనిదే విశ్వం లేదు. కాకుంటే, మన బోధను బట్టి, విమర్శను బట్టి జగత్తు మనకు అనుభూతమౌతుంది. అద్దము ఆ విధంగా గ్రహించలేదు. అదే అద్దానికీ ఆత్మకూ గల భేదము.

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే శాంభవోపాయప్రకాశనం నామ తృతీయమాహ్నికమ్ ‖ 3 ‖

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని శాంభవోపాయప్రకాశనమనే మూడవ ఆహ్నికము.

నాలుగవ ఆహ్నికము

శాక్తోపాయ ప్రకాశనము

యదార్థః - యదార్థము

అథ శాక్తోపాయః |

ఇప్పుడు శాక్తోపాయము చెప్పబడుచున్నది.

తత్ర యదా వికల్పం క్రమేణ సంస్కురుతే సమనన్తరోక్తస్వరూపప్రవేశాయ, తదా భావనాక్రమస్య సత్తర్క-సదాగమ-సద్గురూపదేశ- పూర్వకస్య అస్తి ఉపయోగః | తథాహి-వికల్పబలాత్ ఏవ జన్తవో బద్ధమ్ ఆత్మానమ్ అభిమన్యన్తే, స అభిమానః సంసారప్రతిబన్ధహేతుః, అతః ప్రతిద్వన్ద్విరూపో వికల్ప ఉదితః సంసారహేతుం వికల్పం దలయతి ఇతి అభ్యుదయహేతుః |

ఇంతకుముందు చెప్పబడిన స్వరూపంలోకి ప్రవేశించడం కోసమై, వికల్పములను క్రమంగా సంస్కరించుకునే క్రమంలో సత్తర్కము, సదాగమము, సద్గురూపదేశముల యొక్క ఉపయోగం ఉంటుంది. వికల్పబలం వల్లనే జంతువు 'నేను బద్ధుడను' అని అనుకుంటుంది. ఈ అభిమానమే సంసార బంధహేతువు. దానికి ప్రతిద్వంద్వియై ఉదయించిన వికల్పము వల్ల సంసారహేతువైన వికల్పము దండింపబడి అభ్యుదయహేతువౌతుంది.

స చ ఏవం-రూపః సమస్తేభ్యః పరిచ్ఛిన్నస్వభావేభ్యః శివాన్తేభ్యః తత్త్వేభ్యో యత్ ఉత్తీర్ణమ్ అపరిచ్ఛిన్నసంవిన్మాత్రరూపం తదేవ చ పరమార్థః, తత్ వస్తువ్యవస్థాస్థానం, తత్ విశ్వస్య ఓజః, తేన ప్రాణితి విశ్వమ్, తదేవ చ అహమ్, అతో విశ్వోత్తీర్ణో విశ్వాత్మా చ అహమ్ ఇతి | స చ అయం మాయాన్ధానాం న ఉత్పద్యతే సత్తర్కాదీనామ్ అభావాత్ | వైష్ణవాద్యా హి తావన్మాత్ర ఏవ ఆగమే రాగతత్త్వేన నియమితా ఇతి న ఊర్ధ్వదర్శనేఽపి తదున్ముఖతాం భజన్తే, తతః సత్తర్క-సదాగమ-సద్గురూపదేశ-ద్వేషిణ ఏవ | యథోక్తం పారమేశ్వరే

దాని రూపం ఇలా ఉంటుంది. పరిచ్ఛిన్నస్వభావము కలిగిన సమస్తము నుండి శివాంతమువరకు ఏవైతే తత్త్వములున్నాయో, వాటిని దాటిన అపరిచ్ఛిన్న సంవిన్మాత్ర రూపమేదైతే ఉన్నదో, అదే పరమార్థము. వస్తువులయొక్క వ్యవస్థాస్థానమదే. అదే విశ్వముయొక్క ఓజస్సు. దానివల్లనే విశ్వం ప్రాణంతో ఉన్నది. అదే అహం. కనుక విశ్వోత్తీర్ణము మరియు విశ్వాత్మ కూడా అహమే అయి ఉన్నది. సత్తర్కము లేకపోవడం వల్ల మాయాంధులలో ఇది కలుగదు. వైష్ణవము మొదలైన ఆగమములలో రాగతత్త్వముతో నియమితమై ఊర్ధ్వదర్శనముల వైపు పురోగమించరు, ఒప్పుకొనరు. అందుకనే వారు సత్తర్కము, సదాగమము, సద్గురూపదేశములను ద్వేషిస్తారు. కనుక పరమేశ్వరాగమము ఇలా చెబుతున్నది.

శ్లో|| వైష్ణవాద్యాః సమస్తాస్తే విద్యారాగేణ రఞ్జితాః |
న విన్దన్తి పరం తత్త్వం సర్వజ్ఞజ్ఞానవర్జితాః ||

ఇతి । తస్మాత్ శాంభవదృఢశక్తిపాతావిద్ధా ఏవ సదాగమాదిక్రమేణ వికల్పం సంస్కృత్య పరం స్వరూపం ప్రవిశన్తి ।

'వైష్ణవము మొదలైన సమస్తములు విద్యారాగముతో రంజితములై సర్వజ్ఞ జ్ఞానమును వర్జించి, పరతత్త్వమును అందుకొనలేవు'

కనుక దృఢమైన శాంభవ శక్తిపాతమును పొందినవాడు మాత్రమే సదాగమముల క్రమంలో తన వికల్పమును సంస్కరించుకుని పరస్వరూపమును చేరుకుంటున్నాడు.

నను ఇత్థం పరం తత్త్వం వికల్ప్యరూపం స్యాత్?, మైవమ్-వికల్పస్య ద్వైతాధివాసభఙ్గమాత్రే చరితార్థత్వాత్, పరంతత్త్వం తు సర్వత్ర సర్వరూపతయా స్వప్రకాశమేవ ఇతి న తత్ర వికల్పః కస్యైచిత్ ఉపక్రియాయై ఖణ్డనాయై వా । తత్ర అతిదృఢశక్తిపాతావిద్ధస్య స్వయమేవ సాంసిద్ధికతయా సత్తర్క ఉదేతి, యోఽసౌ దేవీభిః దీక్షిత ఇతి ఉచ్యతే । అన్యస్య ఆగమక్రమేణ ఇత్యాది సవిస్తరం శక్తిపాతప్రకాశనే వక్ష్యామః ।

ఇప్పుడీ విధముగా ప్రశ్నించవచ్చు - 'అలా అయితే, వికల్పం వల్ల పొందబడే పరతత్త్వము వికల్పముల రూపమే అవుతుంది కదా?'. దానికి సమాధానమేమనగా - ద్వైతమును భంగమొనర్చడమే వికల్పముయొక్క చరితార్థత. పరతత్త్వమనేది సర్వత్రా సర్వరూపములలోనూ స్వప్రకాశమే అయి ఉన్నది. వికల్పమనేది ఇదిగాక ఏ ఇతరత్రా ఉపక్రియ కొరకు గాని, ఖండన కొరకు గాని కాదు. అతిదృఢమైన శక్తిపాతమును పొందినవానికి సహజసిద్ధంగానే సత్తర్కం ఉదయిస్తుంది. వీరు 'దేవిచేత దీక్షను పొందినవారు' అనబడతారు. ఇతరులకు, ఆగమక్రమానుసారం ఏ విధంగా దీక్షను జరుపవలెనన్నదానిని, ఇంకా వివరంగా 'శక్తిపాత ప్రకాశనము'నే ఆహ్నికంలో వివరిస్తాను.

కిం తు గురోరాగమనిరూపణే వ్యాపారః, ఆగమస్య చ నిఃశఙ్క-సజాతీయ-తత్ప్రబన్ధ-ప్రసవ-నిబన్ధన-సముచిత-వికల్పోదయే వ్యాపారః, తథావిధవికల్పప్రబన్ధ ఏవ సత్తర్క ఇతి ఉక్తః, స ఏవ చ భావనా భణ్యతే అస్ఫుటత్వాత్ భూతమపి అర్థమ్ అభూతమివ స్ఫుటత్వాపాదనేన భావ్యతే యయా ఇతి ।

ఏమనగా, ఆగమనిరూపణమే గురువుయొక్క వ్యాపారము. అదేమనగా, నిశ్శంక మరియు సజాతీయభావములకు ఏది అడ్డుగా ఉన్నదో దానిని తొలగించడం ద్వారా సముచితములైన వికల్పములను ఉదయింపజేయడమే ఆ వ్యాపారము. ఆ విధములైన అశుద్ధవికల్పములను బంధించడమే సత్తర్కమనబడుతుంది. అస్ఫుటంగా ఉన్న అర్థములను స్ఫుటంగా భావించడమే భావన అవుతుంది.

న చ అత్ర సత్తర్కాత్ శుద్ధవిద్యాప్రకాశరూపాత్ ఋతే అన్యత్ యోగాఙ్గం సాక్షాత్ ఉపాయః, తపఃప్రభృతేః నియమవర్గస్య, అహింసాదేశ్చ యమప్రకారస్య, పూరకాదేః ప్రాణాయామవర్గస్య వేద్యమాత్రనిష్ఠత్వేన క ఇవ సంవిది వ్యాపారః । ప్రత్యాహారోఽపి కరణభూమిమేవ సాతిశయాం కుర్యాత్, ధ్యానధారణాసమాధయోఽపి యథోత్తరమ్ అభ్యాసక్రమేణ నిర్వర్త్యమానా ధ్యేయవస్తుతాదాత్మ్యం ధ్యాతుః వితరేయుః । అభ్యాసశ్చ పరే తత్త్వే శివాత్మని స్వస్వభావే న సంభవత్యేవ ।

ఇందులో శుద్ధవిద్యా ప్రకాశరూపమైన సత్తర్కము దప్ప వేరే యోగాంగములేవీ ఉపాయములు కావు. తపస్సు మొదలైన నియమములు, అహింస మొదలైన యమములు, పూరకము మొదలైన ప్రాణాయామములు,

వేద్యమాత్రనిష్ఠములై ఉండటం వల్ల సంవిత్ వ్యాపారములెలా అవుతాయి? ప్రత్యాహారంకూడా ఇంద్రియరంగములోనే పనిచేస్తుంది. ధ్యాన, ధారణ, సమాధులు కూడా అభ్యాసక్రమం వల్ల మనస్సును నిగ్రహింపజేసి ధ్యేయవస్తువులో ధ్యాతకు తాదాత్మ్యతను కలిగిస్తాయి. పరతత్వము, స్వస్వభావము అయిన శివాత్మలో అభ్యాసం సంభవం కాదు.

సంవిద్రూఢస్య ప్రాణబుద్ధి దేహనిష్ఠీకరణరూపో హి అభ్యాసః- భారోద్వహన శాస్త్రార్థబోధ నృత్తాభ్యాసవత్, సంవిద్రూపే తు న కించిత్ ఆదాతవ్యం న అపసరణీయమ్ ఇతి కథమ్ అభ్యాసః । కిం తర్కేణాపి ఇతి చేత్, ఉక్తమత్ర ద్వైతాధివాసనిరాసప్రకార ఏవ అయం న తు అన్యత్ కించిదితి।

ప్రాణము, బుద్ధి, దేహములు సంవిత్ లో రూఢములై నిష్ఠగా ఉండటమే అభ్యాసము. బరువులెత్తడము, శాస్త్రార్థములను గ్రహించడము, నృత్యమునభ్యసించడములలో వలె సంవిత్ లో గ్రహించడము, తిరస్కరించడం ఉండవు, కనుక అభ్యాసమేముంటుంది? అటువంటప్పుడు, తర్కం వల్ల కూడా ఏమౌతుంది? అనగా, ద్వైతాధివాసమును నిరసించడం తప్ప దీనికి వేరే ప్రయోజనం లేదు.

లౌకికేఽపి వా అభ్యాసే చిదాత్మత్వేన సర్వరూపస్య తస్య తస్య దేహాదేః అభిమతరూపతాప్రకటీకరణం తదితరరూపన్యగ్భావనం చ ఇతి ఏష ఏవ అభ్యాసార్థః । పరతత్త్వే తు న కించిత్ అపాస్యమ్ ఇతి ఉక్తమ్ । ద్వైతాధివాసోఽపి నామ న కశ్చన్ పృథక్ వస్తుభూతః అపి తు స్వరూపాఖ్యాతిమాత్రం తత్, అతో ద్వైతాపాసనం వికల్పేన క్రియత ఇత్యుక్తేః।

లౌకికాభ్యాసములలో కూడా, చిదాత్మగా సర్వరూపములలో ఉంటూ ఆయా దేహములలో అభిమతరూపములను ప్రకటీకరించడం, ఇతరరూపములను నిగ్రహించడము, ఇదే అభ్యాసార్థమై ఉన్నది. పరతత్త్వములో దేనినీ నిరాకరించడం ఉండదు. ద్వైతాధివాసము కూడా దీనికంటే విడిగా ఇంకొక వస్తువు కాదు గనుక ద్వైతమును నిరసించడం వికల్పం వలన చేయబడుతుందని చెప్పబడినది.

అయం పరమార్థః-స్వరూపం ప్రకాశమానమ్ అఖ్యాతిరూపత్వం స్వయం స్వాతన్త్ర్యాత్ గృహీతం క్రమేణ ప్రోజ్ఝ్య వికాసోన్ముఖమ్, అథ వికసత్, అథ వికసితమ్ ఇత్యనేన క్రమేణ ప్రకాశతే, తథా ప్రకాశనమపి పరమేశ్వరస్య స్వరూపమేవ, తస్మాత్ న అత్ర యోగాఙ్గాని సాక్షాత్ ఉపాయః । తర్కం తు అనుగృహ్ణీయురపి, సత్తర్క ఏవ సాక్షాత్ తత్ర ఉపాయః, స ఏవ చ శుద్ధవిద్యా, స చ బహుప్రకారతయా సంస్కృతో భవతి, తద్యథా- యాగో హోమో జపో వ్రతం యోగ ఇతి, తత్ర భావానాం సర్వేషాం పరమేశ్వర ఏవ స్థితిః, నాన్యత్ వ్యతిరిక్తమ్ అస్తి ఇతి వికల్పరూఢిసిద్ధయే పరమేశ్వర ఏవ సర్వభావార్పణం యాగః, స చ హృద్యత్వాత్ యే సంవిదనుప్రవేశం స్వయమేవ భజన్తే తేషాం సుకరం పరమేశ్వరే అర్పణమ్ ఇత్యభిప్రాయేణ హృద్యానాం కుసుమ తర్పణ గన్ధాదీనాం బహిరుపయోగ ఉక్తః । సర్వే భావాః పరమేశ్వరతేజోమయా ఇతి రూఢవికల్పప్రాప్త్యై పరమేశ సంవిదనలతేజసి సమస్తభావగ్రాస రసికతాభిమతే తత్తేజోమాత్రావశేషత్వ సహ సమస్తభావవిలాపనం హోమః।

ఈ పరమార్థము స్వస్వరూపమై, ప్రకాశమై ఉన్నది. స్వయముగా తన స్వాతంత్ర్యముతో అఖ్యాతిరూపమును స్వీకరించి, క్రమంగా వికాసోన్ముఖమై, వికసిస్తూ, చివరకు పూర్తిగా వికసితమై, ప్రకాశిస్తుంది. ఆ విధంగా ప్రకాశించడం కూడా పరమేశ్వరస్వరూపమే అయి ఉన్నది. కనుక దానికి

యోగాంగములు సాక్షాదుపాయములు కావు. ఒకవేళ తర్కమును తీసుకున్నప్పటికీ, సత్తర్కమే అచ్చట ఉపాయమైనది. అదియే శుద్ధవిద్య. అదియే, యాగము, హోమము, జపము, వ్రతము, యోగము మొదలుగా బహుప్రకారములుగా సంస్కరింపబడుతుంది. ఈ భావములన్నింటికీ పరమేశ్వరునియందే స్థితి ఉన్నది. దానికంటే అన్యములేదన్న వికల్పము రూఢియగుట కొరకు, పరమేశ్వరునియందు సర్వభావములను అర్పణం చేయడం యాగము. ఈ హృద్యమైన సాధనతో ఎవరైతే స్వయముగా సంవిత్ లో ప్రవేశించగలుగుతారో వారికి పరమేశ్వరార్పణము చాలా సులభమనే భావమునకై హృద్యములైన కుసుమములు, తర్పణము, గంధములు మొదలైనవి బాహ్యముగా ఉపయోగింపబడతాయి. సర్వభావములూ పరమేశ్వర తేజోమయములే యన్న వికల్పము రూఢమగుట కొరకు సమస్తభావములనూ మ్రింగడం కొరకు సిద్ధంగా ఉన్నట్టి పరమేశుని సంవిదగ్నితేజస్సులో ఆ తేజస్సుతో అవశేషములయ్యేంతవరకూ సమస్తభావములనూ లయము గావించడం హోమము.

తథా ఉభయాత్మక పరామర్శోదయార్థం బాహ్యాభ్యన్తరాది ప్రమేయరూప భిన్నభావానపేక్షయైవ ఏవం-విధం తత్ పరంతత్త్వం స్వస్వభావభూతమ్ ఇతి అన్తః పరామర్శనం జపః । సర్వత్ర సర్వదా నిరుపాయ పరమేశ్వరాభిమానలాభాయ పరమేశ్వర సమతాభిమానేన దేహస్యాపి ఘటాదేరపి అవలోకనం వ్రతమ్ । యథోక్తం శ్రీనన్దిశిఖాయామ్ '......... సర్వసామ్యం పరం వ్రతమ్ ।' ఇతి ।

బాహ్యము అభ్యంతరము అనే ప్రమేయరూపములైన భిన్నభావములను అపేక్షించకుండా ఉండే ఏ పరతత్త్వము స్వస్వభావభూతమై ఉన్నదో దానిని లోలోపల పరామర్శించడం జపము. నిరుపాయమైన పరమేశ్వరాభిమానము లభించుటకొరకు పరమేశ్వరునితో సమస్థితిద్వారా సర్వత్రా సర్వదా ఘటము మొదలైనవాటిని చూడటం వ్రతము. దీనిని శ్రీనందిశిఖ ఇలా చెప్పుచున్నది - 'సర్వసమత్వమే ఉత్తమవ్రతము......'.

ఇత్థం విచిత్రైః శుద్ధవిద్యాంశరూపైః వికల్పైః యత్ అనపేక్షితవికల్పం స్వాభావికం పరమార్థతత్త్వం ప్రకాశతే తస్యైవ సనాతన తథావిధ ప్రకాశమాత్రతారూఢయే తత్స్వరూపానుసంధానాత్మా వికల్పవిశేషో యోగః ।

వికల్పములను ఆశించకుండా ఉండే విచిత్రమైన శుద్ధవిద్యాంశరూపమైన వికల్పస్వభావంతో ఏ పరమార్థతత్త్వమైతే ప్రకాశిస్తున్నదో అదే సనాతనమైన ప్రకాశముగా ఉన్నదన్నది రూఢి కావడం కొరకు తత్స్వరూపమును అనుసంధానము గావించే వికల్పవిశేషమే యోగము.

తత్ర పరమేశ్వరః పూర్ణసంవిత్స్వభావః, పూర్ణైవ అస్య శక్తిః,-కులం సామర్థ్యం ఊర్మిః హృదయం సారం స్పన్దః విభూతిః త్రీశికా కాలీ కర్షణీ చణ్డీ వాణీ భోగో దృక్ నిత్యా ఇత్యాదిభిః ఆగమభాషిభిః తత్తదన్వర్థప్రవృత్తాభిః అభిధీయతే, తేన తేన రూపేణ ధ్యాయినాం హృది ఆస్తామ్ ఇతి । సా చ సమగ్రశక్తితాదర్శనేన పూర్ణతాసంవిత్ ప్రకాశతే । శక్తయశ్చ అస్య అసంఖ్యేయాః । కిం బహునా, యత్ విశ్వం తా అస్య శక్తయః, తాః కథమ్ ఉపదేష్టుం శక్యాః ఇతి । తిస్రస్తు తావత్ విశ్వం సమాప్యతే, యయా ఇదం శివాదిధరణ్యన్తమ్ అవికల్ప్యసంవిన్మాత్రరూపతయా బిభర్తి చ పశ్యతి చ భాసయతి చ పరమేశ్వర సా అస్య శ్రీపరాశక్తిః । యయా చ దర్పణహస్త్యాదివత్ భేదాభేదాభ్యాం సా అస్య శ్రీపరాపరాశక్తిః । యయా

పరస్పరవివిక్తాత్మనా భేదేనైవ సా అస్య శ్రీమదపరాశక్తిః ।

పరమేశ్వరుడు పూర్ణసంవిత్స్వరూపుడై ఉన్నాడు. ఆయన శక్తికూడా పూర్ణమే. అది, కులము, సామర్థ్యము, ఊర్మి, హృదయము, సారము, స్పందము, విభూతి, త్రీశికా, కాళీ, కర్షణీ, చండీ, వాణీ, భోగ, దృక్, నిత్యా మొదలైన ఆగమపదములలో వాని అన్వర్థప్రవృత్తములలో ఉన్నదో, అయా రూపములలో ధ్యానించేవారి హృదయములలో ఆ విధంగా ఉంటుంది. ఆమెయే సమగ్రశక్తిరూపిణి యనిన దర్శనంతో పూర్ణసంవిత్ ప్రకాశిస్తుంది. శక్తులు అసంఖ్యాకములు. ఎక్కువ మాటలెందుకు? విశ్వమేదైతే ఉన్నదో, అదంతా పరమేశ్వరుని శక్తియే. వాటిగురించి చెప్పడం శక్యం కాదు. మూడుశక్తులతో ఈ విశ్వమంతా సమాప్తమౌతుంది. శివునినుండి పృథివివరకూ ఉన్న తత్త్వములను అవికల్పక సంవిన్మాత్రంగా ఏ శక్తి సహాయంతో పరమేశ్వరుడు భరిస్తున్నాడో, చూచుచున్నాడో, ప్రకాశింపజేస్తున్నాడో అదియే ఆయనయొక్క పరాశక్తి. ఏ శక్తివలన అద్దంలో ఉన్న ఏనుగులాగా పరమేశ్వరుడున్నాడో అది ఆయనయొక్క పరాపరశక్తి. దేనివల్ల పరస్పరము విడివిడిగా ఆత్మలుగా భేదం గోచరించుచున్నదో అది అపరాశక్తి.

ఏతత్ త్రివిధం యయా ధారణమ్ ఆత్మన్యేవ క్రోడీకారేణ అనుసన్ధానాత్మనా గ్రసతే, సా అస్య భగవతీ శ్రీపరైవ శ్రీమన్మాతృ-సద్భావ-కాలకర్షిణ్యాది-శబ్దాన్తరనిరుక్తా । తా ఏతాః చతస్రః శక్తయః స్వాతన్త్ర్యాత్ ప్రత్యేకం త్రిధైవ వర్తన్తే । సృష్టౌ స్థితౌ సంహారే చ ఇతి ద్వాదశ భవన్తి ।

ఈ విధంగా మూడుశక్తులను తన ఆత్మలో ధరించి క్రోడీకరించి ఏ శక్తి అయితే అనుసంధానం గావిస్తున్నదో ఆ భగవతి పరాత్పర. ఆమె శ్రీమన్మాతృసద్భావ, కాలకర్షిణి ఇత్యాది శబ్దములద్వారా చెప్పబడుతుంది. ఈ నాలుగుశక్తులు తమ స్వాతంత్ర్యముతో ప్రత్యేకములై మూడువిధములుగా వర్తిస్తాయి. సృష్టి - స్థితి - సంహారములుగా ఇవి పన్నెండౌతాయి.

తథాహి - ౧ సంవిత్ పూర్వమ్ అన్తరేవ భావం కలయతి, ౨ తతో బహిరపి స్ఫుటతయా కలయతి, ౩ తత్రైవ రక్తిమయతాం గృహీత్వా తతః తమేవ భావమ్ అన్తరుపసంజిహీర్షయా కలయతి, ౪ తతశ్చ తదుపసంహారవిఘ్నభూతాం శఙ్కాం నిర్మినోతి చ గ్రసతే చ, ౫ గ్రస్తశఙ్కాంశం భావభాగమ్ ఆత్మని ఉపసంహారేణ కలయతి, ౬ తత ఉపసంహర్తృత్వం మమేదం రూపమిత్యపి స్వభావమేవ కలయతి, ౭ తత ఉపసంహర్తృస్వభావకలనే కస్యచిద్భావస్య వాసనాత్మనా అవస్థితిం కస్యచిత్ తు సంవిన్మాత్రావశేషతాం కలయతి, ౮ తతః స్వరూపకలనానాన్తరీయకత్వేనైవ కరణచక్రం కలయతి, ౯ తతః కరణేశ్వరమపి కలయతి, ౧౦ తతః కల్పితం మాయీయం ప్రమాతృరూపమపి కలయతి, ౧౧ సఙ్కోచత్యాగోన్ముఖవికాసగ్రహణరసికమపి ప్రమాతారం కలయతి, ౧౨ తతో వికసితమపి రూపం కలయతి ఇతి ఏతా ద్వాదశ భగవత్యః సంవిదః ప్రమాతౄన్ ఏకం వాపి ఉద్దిశ్య యుగపత్ క్రమేణ ద్విశః త్రిశ ఇత్యాదిస్థిత్యాపి ఉదయభాగిన్యః చక్రవదావర్తమానా బహిరపి మాసకలారాశ్యాదిక్రమేణ అన్తతో వా ఘటపటాదిక్రమేణాపి భాసమానాః చక్రేశ్వరస్య స్వాతన్త్ర్యం పుష్ణత్యః శ్రీకాలీశబ్దవాచ్యాః ।

1. సంవిత్ పూర్వస్థితిలో లోలోపల భావమును ఊహిస్తుంది.

2. తదుపరి బాహ్యంగా కూడా భావమును స్ఫుటంగా కల్పిస్తుంది.

3. బాహ్యరూపమును ధరించిన భావములోని రక్తిని గ్రహించి, దానిని తిరిగి తన లోపలకే

ఉపసంహరించుదామన్న కల్పన గావిస్తుంది.

4. 'ఈ ఉపసంహారమును నేను చేయగలనా?' అనిన అనుమానమును సృష్టించి, మళ్ళీ తానే దానిని సంహరిస్తుంది.

5. గ్రస్తమౌతున్న శంక యొక్క భావభాగమును ఆత్మలో ఉపసంహారం చేయాలని కల్పిస్తుంది.

6. ఆ ఉపసంహారం చేస్తున్నది కూడా తన రూపమేనని కల్పిస్తుంది.

7. ఉపసంహరింపబడుతున్న స్వభావకలనంలో కొంతభావమును వాసనాత్మకముగా ఉంచి, కొంతభాగమును సంవిత్ యొక్క అవశేషంగా కల్పిస్తుంది.

8. తనలోనికి కరణచక్రమును ఉపసంహరిస్తుంది.

9. తరువాత కరణేశ్వరుని కూడా ఉపసంహరిస్తుంది.

10. తదుపరి మాయాస్వరూపమైన ప్రమాతను కూడా గ్రసిస్తుంది.

11. సంకోచత్యాగమును చేసి వికాసగ్రహణమునకున్ముఖమైన ప్రమాతను కూడా ఉపసంహరిస్తుంది.

12. ఆ తరువాత ప్రమాత యొక్క వికసితరూపమును కూడా ఉపసంహరిస్తుంది.

ఈ పన్నెండు భగవతులు సంవిద్రూపులై, ప్రమాతలలో ఒక్కరికిగాని, అనేకమందికి గాని, ఇద్దరుగా, ముగ్గురుగా, వివిధములుగా ఉదయించి, చక్రంలాగా తిరుగుతూ గోచరిస్తారు. బాహ్యంగా కూడా, మానము, కళ, రాశి అనే క్రమంలోను, ఘటపటాది క్రమంలోను వెలుగుతూ, చక్రేశ్వరునికి పుష్టిని కలిగిస్తూ ఉంటారు గనుక కాళీశబ్దంతో పిలువబడతారు.

కలనం చ-గతిః క్షేపో జ్ఞానం గణనం భోగీకరణం శబ్దనం స్వాత్మలయీకరణం చ । యదాహుః శ్రీభూతిరాజగురవః 'క్షేపాజ్జ్ఞానాచ్చ కాలీ కలనవశతయాథ.....।' ఇతి । ఏష చ అర్థః తత్ర తత్ర మద్విరచితే వివరణే ప్రకరణస్తోత్రాదౌ వితత్య వీక్ష్యః । న అతిరహస్యమ్ ఏకత్ర ఖ్యాప్యం, న చ సర్వథా గోప్యమ్ ఇతి హి అస్మద్గురవః ।

కలనమంటే గతి, క్షేపము, జ్ఞానము, గణనము, భోగీకరణం, శబ్దనం, స్వాత్మలయీకరణమని అర్థములున్నాయి. ఈ విషయమై శ్రీ భూతిరాజ గురుదేవులిలా అన్నారు - 'క్షేపమును, జ్ఞానమును, కలనమును గావిస్తుంది గనుక కాళీ అనబడుతుంది'. ఈ అర్థములను అక్కడక్కడా నాచే రచింపబడిన వివరణలలోను, ప్రకరణస్తోత్రములలోను వివరముగా చూడవచ్చు. 'అతిరహస్యమును ఒకేచోట తెరచి చూపకూడదు, అదేవిధంగా ఎల్లపుడూ దానిని రహస్యంగానూ ఉంచకూడద'ని మా గురుదేవులన్నారు.

తదేవమ్ యదుక్తం యాగహోమాది తత్ ఏవం-విధే మహేశ్వర ఏవ మన్తవ్యమ్ । సర్వే హి హేయమేవ ఉపాదేయభూమిరూపం విష్ణుతః ప్రభృతి శివాన్తం పరమశివతయా పశ్యన్తి, తచ్చ మిథ్యాదర్శనమ్ అవశ్యత్యాజ్యమ్ అనుత్తరయోగిభిరితి, తదర్థమేవ విద్యాధిపతేః అనుభవస్తోత్రే మహాన్ సంరమ్భః, ఏవం-విధే

యాగాదౌ యోగాన్తే చ పఞ్చకే ప్రత్యేకం బహుప్రకారం నిరూఢిః యథా యథా భవతి తథైవ ఆచరేత్, న తు భక్ష్యాభక్ష్యశుద్ధ్యశుద్ధ్యాదివివేచనయా వస్తుధర్మోజ్ఝితయా కల్పనామాత్రసారయా స్వాత్మా ఖేదనీయ ఇతి ఉక్తం శ్రీపూర్వాదౌ, న హి శుద్ధిః వస్తునో రూపం నీలత్వవత్, అన్యత్ర తస్యైవ అశుద్ధిచోదనాత్, దానస్యేవ దీక్షితత్వే, చోదనాతః తస్య తత్ తత్ర అశుద్ధమ్ ఇతి చేత్ చోదనాన్తరేఽపి తుల్యం, చోదనాన్తరమ్ అసత్-తద్బాధితత్వాత్ ఇతి చేత్ న, శివచోదనాయా ఏవ బాధకత్వం యుక్తిసిద్ధం సర్వజ్ఞానోత్తరాద్యనన్తాగమసిద్ధం చ ఇతి వక్ష్యామః।

యాగహోమముల విషయంలో ఏదైతే చెప్పబడిందో అదంతా మహేశ్వరుని రూపమునకే వర్తిస్తుంది. హేయమైనదానినే ఉపాదేయమని అందరూ భావిస్తూ, విష్ణువు నుండి శివునివరకూ అంతా పరమశివుడే అని తలచుచున్నారు. ఈ మిథ్యాదృష్టిని అనుత్తరయోగి విసర్జించాలి. దీనిని శ్రీ విద్యాధిపతి తన 'అనుభవస్తోత్రం'లో గొప్పగా వివరించారు. ఈ విధంగా యాగముల నుంచి యోగములవరకూ ఈ అయిదు విషయములు బహుప్రకారములుగా చెప్పబడినాయి. ఏయే విధంగా ఎవరికి గురి కుదురుతుందో, ఆయా విధములుగా వీటిని ఆచరించాలి. 'ఇది భక్ష్యము, ఇది కాదు, ఇది శుద్ధము, ఇది కాదు' అనే వివేచనలతో వస్తుధర్మమునకు లోనై, కల్పనామాత్రమైన వాటిని చూచి ఆత్మను కష్టపెట్టుకోకూడదని, శ్రీపూర్వాది గ్రంథములలో అన్నారు. రూపమున నీలత్వమువలె వస్తువులో శుద్ధత్వము లేదు. అన్యత్ర దానికే అశుద్ధత్వం కలుగుతున్నది. 'దీక్షితుడైనవానికి దానమివ్వడం అశుద్ధమ'ని ఒకచోట చెప్పబడినా, మరొకచోట ఇంకొకరీతిగా చెప్పబడినదానినిబట్టి, కాదని తెలుతుంది. మరి ఆ రెండవది అసత్యమా అంటే, కాదంటాము. శివవాక్యమే ఇతరములను బాధిస్తుంది. ఇది యుక్తిసిద్ధము, సర్వజ్ఞానోత్తరాది ఎన్నో ఆగమములు చెప్పినదని చెప్పుచున్నాను.

తస్మాత్ వైదికాత్ ప్రభృతి పారమేశ్వర సిద్ధాన్తతన్త్ర కులోచ్ఛుష్మాదిశాస్త్రోక్తోఽపి యో నియమో విధిః వా నిషేధో వ సోఽత్ర యావదకించిత్కర ఏవ ఇతి సిద్ధమ్ । తథైవ చ ఉక్తం శ్రీపూర్వాదౌ వితత్య తన్త్రాలోకాత్ అన్వేష్యమ్ ।

కనుక వైదికము నుండి పరమేశ్వర సిద్ధాంతతంత్రములైన కులోచ్ఛుష్మము మొదలైన శాస్త్రముల వరకు, ఇది విధి, ఇది నిషేధమంటూ, ఏ నియమములైతే ఉన్నాయో, అవి ఇక్కడ అవసరం లేదనుట సిద్ధమగుచున్నది. శ్రీపూర్వాది గ్రంథములలో ఇదియే చెప్పబడినది. తంత్రాలోకమునందు విస్తారముగా గలదు. అన్వేషింపవలసినది.

శ్లో॥ యో నిశ్చయః పశుజనస్య జడోఽస్మి కర్మ-
సంపాశితోఽస్మి మలినోఽస్మి పరేరితోఽస్మి ।
ఇత్యేతదన్యదృఢనిశ్చయలాభసిద్ధ్యా
సద్యః పతిర్భవతి విశ్వవపుశ్చిదాత్మా ॥ 8 ॥

పశువు - పశుపతి

'పశువు'లైన జనులకు ఈ విధమైన నిశ్చయముంటుంది - 'నేను జడుడను. కర్మను మూటగట్టుకుంటున్నాను. మలినుడను, ఇతరుల అధీనంలో ఉన్నాను'. దీనికి విరుద్ధమైన దృఢనిశ్చయం

కలిగినప్పుడు ఆ క్షణంలోనే అతడు విశ్వమునంతా నిండిన చిదాత్మయై 'పతి' అవుతున్నాడు.

శ్లో|| యథా యథా నిశ్చయ ఈదృగాప్యతే
తథావధేయం పరయోగినా సదా |
న వస్తుయాథాత్మ్యవిహీనయా దృశా
విశఙ్కితవ్యం శిశిదేశనాగణైః || 9 ||

పరయోగి తత్త్వము

పరయోగియైనవాడు ఈ విధమైన నిశ్చయమును పొందటానికి సర్వదా జాగరూకుడుగా ఉండాలి. వస్తువుయొక్క యదార్థతత్త్వమును అతడు మరచిపోరాదు. మూఢజనుల వృధావాదములలో పడి శంకామనస్కుడు కాకూడదు.

వ్యాఖ్యానము

ఇంతకు ముందటి అధ్యాయములో, శాంభవోపాయం ద్వారా భైరవసమావేశమునెలా పొందవచ్చునో చెప్పబడింది. దానిని సాధించలేనివారు అంతకంటే క్రింది మెట్టైన శాక్తోపాయమును అనుసరించాలి. దానికోసం, ఆ ప్రక్రియకు అడ్డువస్తున్నట్టి వికల్పములను ముందుగా సంస్కరించుకోవాలి. వికల్పములంటే ఏమిటి? ఈ సాధనకు అవి ఏ విధముగా అడ్డువస్తాయి? అనిన దానిని ముందుగా తెలుసుకోవాలి.

వికల్పములంటే విరుద్ధకల్పనలు. అంటే, సత్యవిరుద్ధములైన ఆలోచనలు. వీటికి లోబడిన సాధకుడు సత్యమును దర్శించలేడు. ఈ వికల్పముల బలం వల్లనే, జంతుస్థాయిలో ఉన్న సాధకుడు 'నేను బద్ధుడను' అని అనుకుంటాడు. పరమశివసమావేశం లేని జీవుడు జంతువుతో సమానుడు. ఎలాగంటే, బంధింపబడటమే జంతువు యొక్క లక్షణం. కనుక, మాయకు బద్ధుడైన జీవుడు కూడా జంతువుతో సమానుడే. ఈ విధముగా నిరంతరమూ 'నేను అల్పుడను, బద్ధుడను' అంటూ భావిస్తూ ఉండటమే సంసారబంధమునకు గల ముఖ్యకారణము. ఈ విధంగా ఆలోచించడాన్ని, వికల్పములు లేదా అశుద్ధపు ఆలోచనలని అంటాము.

కనుక ఈ అడ్డుగా ఉన్నట్టి అశుద్ధవికల్పములు పోవాలంటే, వాటికి సమఉజ్జీలుగా, సమాంతరములుగా ఉన్న శుద్ధవికల్పములు సాధకునిలో ఉదయించాలి. అప్పుడు సంసారబంధమును కల్పిస్తున్న వికల్పములు ఖండింపబడి, సాధనలో పురోగతి కలుగుతుంది.

సంసారబంధమును కల్పిస్తున్న వికల్పములు ఎలా పోతాయి? అంటే, దానికి, మూడు విధములైన ఆసరాలు సాధకునికి కావాలి. అవి, సత్తర్కము, సదాగమము, సద్గురూపదేశములు.

సత్తర్కము

సత్ + తర్కము అంటే, సరియైన ఆలోచన అని అర్థం. సత్యస్వరూపుడైన పరమశివుని చెంతకు చేర్చే ఆలోచనాధోరణి యని మరొక అర్థం. 'నేను బద్ధుడను, నేను అల్పుడను, నేను జీవుడను' మొదలైన సంకుచిత

ఆలోచనలను విడచిపెట్టి, 'నేను పరమేశ్వరుడను, అఖండుడను, నిత్యుడను, అనల్పుడ'ను అనిన ఆలోచనలో స్థిరముగా ఉండటమే సత్తర్కమని చెప్పబడుతుంది. ఈ విధమైన సత్తర్కమును శిష్యుడు అనుసరించాలి.

సదాగమము

సత్ + ఆగమము అంటే, సరియైన శాస్త్రము, సత్యమైన బోధను గావించే శాస్త్రము, పరమేశ్వరునిచే చెప్పబడిన శైవాగమమని అర్థము. దీనిలో మాత్రమే, పరిపూర్ణ చిదానంద స్వరూపమైన స్వాతంత్ర్యసిద్ధిని కలిగించే బోధ చేయబడినది. కనుక ఈ సదాగమము యొక్క బోధను శిష్యుడు ఆలకించాలి.

సద్గురూపదేశము

సద్గురువంటే ఎవరు? పరమేశ్వర సమావేశమును పొంది, పరమశివానుభవంలో స్థిరంగా ఉన్నవాడే సద్గురువు. అట్టి సద్గురువు మాత్రమే, అట్టి స్థితికి చేరే ఉపాయమును అర్హులకు బోధించగలడు. శక్తిపాతమును గావించగలడు. శిష్యుని చేయి పట్టుకుని నడిపించి పరమశివానుభవములో అతడిని లీనం చేయగలడు. అటువంటి సద్గురువును శిష్యుడు సమీపించి, ఆయన ద్వారా ఉపదేశమును పొంది కృతార్థుడు కావాలి.

పతంజలిమహర్షి తన యోగసూత్రములలో 'వితర్కబాధనే ప్రతిపక్ష భావనం' అంటూ, 'తనను బాధిస్తున్న వితర్కములు విడచిపోవాలంటే, వాటికి విరుద్ధములైన ఆలోచనలను యోగి అభ్యాసం చేయాలి' అని అన్నారు. కానీ, అభినవగుప్తులు దీనిని ఒప్పుకొనలేదు. శిష్యుడు తనంతట తానుగా ప్రతిపక్షభావననెలా చేయగలడు? అంతటి సమర్థత, పరిపక్వతలు అతనికుండవు. తన నిమ్నమనస్సును తనంతట తానై ఎదుర్కొని, జయించి, దానిని ఓడించే శక్తి అతనికి ఉండదు. కనుక అతనికి సరియైన ఆలోచనావిధానమును నేర్పించే ఒక శాస్త్రముండాలి, దానిని బోధించే ఒక గురువుండాలి. అతడు తన శక్తితో ఈ శిష్యుని ఆదుకొని, ఆసరాగా నిలచి, అభ్యుదయమార్గంలో అతడిని నడిపించాలని అభినవగుప్తులన్నారు.

ఈ మూడు విధములైన సాధనలవలన, అప్పటివరకూ తనను బాధపెడుతున్న అశుద్ధములైన వికల్పములు అతడిని వీడిపోతాయి. అప్పుడు శుద్ధములైన భావముల పరంపర అతనిలో తలెత్తుతుంది. వాటి స్వరూపం ఈ విధంగా ఉంటుంది.

ఈ చరాచరమైన సృష్టిలో - పరిమితములై, నశించే స్వభావము కలిగిన పంచభూతములు మొదలుగాగల వాటి నుండి, శివుని వరకూ ఏవైతే ముప్పదియారు తత్త్వములున్నాయో, వాటినన్నింటినీ మించి వెలుగుతున్న అపరిమితతత్త్వమై, నాశనం లేనిదై, కేవలము సంవిత్ రూపమై ఏదైతే ఉన్నదో అదే పరమార్థము. అంటే, అంతిమసత్యము. దానికే పరమశివుడని పేరు.

సాంఖ్యము మొదలైన సిద్ధాంతములలో, ఒక్కొక్కదానిలో ఒక్కొక్కవిధముగా ఈ తత్త్వములు చెప్పబడినాయి. త్రికసిద్ధాంతము, తనకంటే ప్రాచీనమైన శైవసిద్ధాంతము నుండి 36 తత్త్వములను గ్రహించింది. దీనిప్రకారం ఈ ముప్పదియారు తత్త్వములు, ఈ విధంగా ఉంటాయి.

1. శివుడు 2. శక్తి 3. సదాశివుడు 4. ఈశ్వర 5. శుద్ధవిద్య 6. మాయ 7. కాలము 8. నియతి 9. కళ 10.

కలిగినప్పుడు ఆ క్షణంలోనే అతడు విశ్వమునంతా నిండిన చిదాత్మయై 'పతి' అవుతున్నాడు.

శ్లో|| యథా యథా నిశ్చయ ఈదృగాప్యతే
తథావధేయం పరయోగినా సదా |
న వస్తుయాథాత్మ్యవిహీనయా దృశా
విశఙ్కితవ్యం శిశిదేశనాగతైః || 9 ||

పరయోగి తత్త్వము

పరయోగియైనవాడు ఈ విధమైన నిశ్చయమును పొందటానికి సర్వదా జాగరూకుడుగా ఉండాలి. వస్తువుయొక్క యదార్థతత్త్వమును అతడు మరచిపోరాదు. మూఢజనుల వృథావాదములలో పడి శంకామనస్కుడు కాకూడదు.

వ్యాఖ్యానము

ఇంతకు ముందటి అధ్యాయములో, శాంభవోపాయం ద్వారా భైరవసమావేశమునెలా పొందవచ్చునో చెప్పబడింది. దానిని సాధించలేనివారు అంతకంటే క్రింది మెట్టైన శాక్తోపాయమును అనుసరించాలి. దానికోసం, ఆ ప్రక్రియకు అడ్డువస్తున్నట్టి వికల్పములను ముందుగా సంస్కరించుకోవాలి. వికల్పములంటే ఏమిటి? ఈ సాధనకు అవి ఏ విధముగా అడ్డువస్తాయి? అనిన దానిని ముందుగా తెలుసుకోవాలి.

వికల్పములంటే విరుద్ధకల్పనలు. అంటే, సత్యవిరుద్ధములైన ఆలోచనలు. వీటికి లోబడిన సాధకుడు సత్యమును దర్శించలేడు. ఈ వికల్పముల బలం వల్లనే, జంతుస్థాయిలో ఉన్న సాధకుడు 'నేను బద్ధుడను' అని అనుకుంటాడు. పరమశివసమావేశం లేని జీవుడు జంతువుతో సమానుడు. ఎలాగంటే, బంధింపబడటమే జంతువు యొక్క లక్షణం. కనుక, మాయకు బద్ధుడైన జీవుడు కూడా జంతువుతో సమానుడే. ఈ విధముగా నిరంతరమూ 'నేను అల్పుడను, బద్ధుడను' అంటూ భావిస్తూ ఉండటమే సంసారబంధమునకు గల ముఖ్యకారణము. ఈ విధంగా ఆలోచించడాన్ని, వికల్పములు లేదా అశుద్ధపు ఆలోచనలని అంటాము.

కనుక ఈ అడ్డుగా ఉన్నట్టి అశుద్ధవికల్పములు పోవాలంటే, వాటికి సమఉజ్జీలుగా, సమాంతరములుగా ఉన్న శుద్ధవికల్పములు సాధకునిలో ఉదయించాలి. అప్పుడు సంసారబంధమును కల్పిస్తున్న వికల్పములు ఖండింపబడి, సాధనలో పురోగతి కలుగుతుంది.

సంసారబంధమును కల్పిస్తున్న వికల్పములు ఎలా పోతాయి? అంటే, దానికి, మూడు విధములైన ఆసరాలు సాధకునికి కావాలి. అవి, సత్తర్కము, సదాగమము, సద్గురూపదేశములు.

సత్తర్కము

సత్ + తర్కము అంటే, సరియైన ఆలోచన అని అర్థం. సత్యస్వరూపుడైన పరమశివుని చెంతకు చేర్చే ఆలోచనాధోరణి యని మరొక అర్థం. 'నేను బద్ధుడను, నేను అల్పుడను, నేను జీవుడను' మొదలైన సంకుచిత

ఆలోచనలను విడచిపెట్టి, 'నేను పరమేశ్వరుడను, అఖండుడను, నిత్యుడను, అనల్పుడ'ను అనిన ఆలోచనలో స్థిరముగా ఉండటమే సత్తర్కమని చెప్పబడుతుంది. ఈ విధమైన సత్తర్కమును శిష్యుడు అనుసరించాలి.

సదాగమము

సత్ + ఆగమము అంటే, సరియైన శాస్త్రము, సత్యమైన బోధను గావించే శాస్త్రము, పరమేశ్వరునిచే చెప్పబడిన శైవాగమమని అర్థము. దీనిలో మాత్రమే, పరిపూర్ణ చిదానంద స్వరూపమైన స్వాతంత్ర్యసిద్ధిని కలిగించే బోధ చేయబడినది. కనుక ఈ సదాగమము యొక్క బోధను శిష్యుడు ఆలకించాలి.

సద్గురూపదేశము

సద్గురువంటే ఎవరు? పరమేశ్వర సమావేశమును పొంది, పరమశివానుభవంలో స్థిరంగా ఉన్నవాడే సద్గురువు. అట్టి సద్గురువు మాత్రమే, అట్టి స్థితికి చేరే ఉపాయమును అర్హులకు బోధించగలడు. శక్తిపాతమును గావించగలడు. శిష్యుని చేయి పట్టుకుని నడిపించి పరమశివానుభవములో అతడిని లీనం చేయగలడు. అటువంటి సద్గురువును శిష్యుడు సమీపించి, ఆయన ద్వారా ఉపదేశమును పొంది కృతార్థుడు కావాలి.

పతంజలిమహర్షి తన యోగసూత్రములలో 'వితర్కబాధనే ప్రతిపక్ష భావనం' అంటూ, 'తనను బాధిస్తున్న వితర్కములు విడచిపోవాలంటే, వాటికి విరుద్ధములైన ఆలోచనలను యోగి అభ్యాసం చేయాలి' అని అన్నారు. కానీ, అభినవగుప్తులు దీనిని ఒప్పుకొనలేదు. శిష్యుడు తనంతట తానుగా ప్రతిపక్షభావననెలా చేయగలడు? అంతటి సమర్థత, పరిపక్వతలు అతనికుండవు. తన నిమ్నమనస్సును తనంతట తానై ఎదుర్కొని, జయించి, దానిని ఓడించే శక్తి అతనికి ఉండదు. కనుక అతనికి సరియైన ఆలోచనావిధానమును నేర్పించే ఒక శాస్త్రముండాలి, దానిని బోధించే ఒక గురువుండాలి. అతడు తన శక్తితో ఈ శిష్యుని ఆదుకొని, ఆసరాగా నిలచి, అభ్యుదయమార్గంలో అతడిని నడిపించాలని అభినవగుప్తులన్నారు.

ఈ మూడు విధములైన సాధనలవలన, అప్పటివరకూ తనను బాధపెడుతున్న అశుద్ధములైన వికల్పములు అతడిని వీడిపోతాయి. అప్పుడు శుద్ధములైన భావముల పరంపర అతనిలో తలెత్తుతుంది. వాటి స్వరూపం ఈ విధంగా ఉంటుంది.

ఈ చరాచరమైన సృష్టిలో - పరిమితములై, నశించే స్వభావము కలిగిన పంచభూతములు మొదలుగాగల వాటి నుండి, శివుని వరకూ ఏవైతే ముప్పదియారు తత్త్వములున్నాయో, వాటినన్నింటినీ మించి వెలుగుతున్న అపరిమితతత్త్వమై, నాశనం లేనిదై, కేవలము సంవిత్ రూపమై ఏదైతే ఉన్నదో అదే పరమార్థము. అంటే, అంతిమసత్యము. దానికే పరమశివుడని పేరు.

సాంఖ్యము మొదలైన సిద్ధాంతములలో, ఒక్కొక్కదానిలో ఒక్కొక్కవిధముగా ఈ తత్త్వములు చెప్పబడినాయి. త్రికసిద్ధాంతము, తనకంటే ప్రాచీనమైన శైవసిద్ధాంతము నుండి 36 తత్త్వములను గ్రహించింది. దీనిప్రకారం ఈ ముప్పదియారు తత్త్వములు, ఈ విధంగా ఉంటాయి.

1. శివుడు 2. శక్తి 3. సదాశివుడు 4. ఈశ్వర 5. శుద్ధవిద్య 6. మాయ 7. కాలము 8. నియతి 9. కళ 10.

విద్య 11. రాగము 12. పురుషుడు 13. ప్రకృతి 14. బుద్ధి 15. అహంకారము 16. మనస్సు 17. శ్రోత్రము 18. త్వక్ 19. నేత్రము 20. రసన 21. నాసిక 22. వాక్కు 23. పాణి 24. పాదము 25. పాయువు 26. ఉపస్థ 27. శబ్దము 28. స్పర్శ 29. రూపము 30. రసము 31. గంధము 32. ఆకాశము 33. వాయువు 34. అగ్ని 35. జలము 36. పృథివి

అనాది తత్త్వములు	శివ-శక్తులు	2
శుద్ధ తత్త్వములు	సదాశివ, ఈశ్వర, శుద్ధవిద్య	3
అశుద్ధ తత్త్వములు	మాయ, కాలము, నియతి, కళ, విద్య, రాగము	6
ప్రకృతి పంచకము	పురుషుడు, ప్రకృతి, బుద్ధి, అహంకారము, మనస్సు	5
జ్ఞానేంద్రియములు	శ్రోత్రము, త్వక్, నేత్రము, రసన, నాసిక	5
కర్మేంద్రియములు	శ్రోత్రము, త్వక్, నేత్రము, రసన, నాసిక	5
పంచతన్మాత్రలు	శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము	5
పంచభూతములు	ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథివి	5
	మొత్తము	36

ఈ ముప్పదియారు తత్త్వములను మించినది పరమశివతత్త్వము. ఈ 36 తత్త్వములతో కూడిన సమస్తసృష్టికి ఆధారం అదే. దానినుంచే సృష్టి ఉదయించింది గనుక అదే విశ్వముయొక్క ఆధారశక్తియై ఉన్నది. దాని ఆధారంతోనే ఈ విశ్వమంతా ప్రాణంతో నిండి ఉన్నది. అదే 'అహమ్' అనబడుతుంది. నిరంతరం 'నేను' 'నేను' అంటూ స్పందిస్తున్న విశ్వస్పందన అదే. జీవులలో ఉన్న గుండెచప్పుడు అదే. ఈ 'అహమ్' అన్నదానికి రెండు స్థితులున్నాయి. అది విశ్వాతీతంగానూ ఉన్నది, విశ్వమంతా నిండికూడా ఉన్నది.

ఈ విధమైన సత్తర్కము (సరియైన అవగాహన) లేకపోవడం వల్ల, మాయతో గ్రుడ్డివారైన మనుష్యులలో పరమశివానుభవం కలుగదు.

శైవాగమములు కాకుండా మిగతా ఆగమములు కూడా ఉన్నాయి. అవి వైష్ణవము మొదలైనట్టివి. ఆయా ఆగమములు రాగతత్త్వముతో ఆగిపోతాయి. అంతకంటే పైకి చూడటానికి ఒప్పుకోవు. రాగమంటే ఏమిటి? భోగములను అనుభవించాలన్న అభిలాషయే రాగము. దానికోసం, పరమాత్మ నుండి వరములను పొంది, ఆయన సృష్టించిన సృష్టిలో సుఖముగా కాలమును గడపడమే వాటి పరమోద్దేశ్యమై ఉంటుంది గాని, మాయాస్వరూపమైన ఈ సృష్టిని దాటి, ఆయనలో లీనం కావడం వాటియొక్క పరమగమ్యం కాదు.

స్థూలముగా చూచినప్పుడు, మతములలో రెండు విధములైన ఆలోచనలుంటాయి.

ఒకటి - దైవం సృష్టిని చేసి, దానికంటే విడిగా ఎక్కడో కూర్చుని యున్నది. రెండు - దైవం సృష్టిని చేసి, సృష్టిలో, సృష్టిగా ఉన్నది. మొదటిభావనకు దైవం యొక్క బహిర్యామిత్వమని, రెండవదానికి దైవం యొక్క అంతర్యామిత్వమని పేర్లు.

బహిర్యామిత్వ భావనను నమ్మే మతములు సంకుచిత దృష్టిని కలిగి ఉంటాయి. ద్వేషము, హింసలను అనుసరిస్తూ ఉంటాయి. వీటికి భిన్నములుగా అంతర్యామిత్వ భావనను అనుసరించే మతములు సహనంతో ప్రేమతో ఉంటాయి. అభినవగుప్తులవారు చెబుతున్న త్రికశాస్త్రము ప్రకారం, దైవం బహిర్యామిగానూ, అంతర్యామిగానూ రెండు విధములుగానూ ఉంటుంది. ఈ భావనను, ఈయన, తనకంటే ప్రాచీనములైన శ్వేతాశ్వతరాది ఉపనిషత్తుల నుండి గ్రహించి ఉండవచ్చునని నా భావన. ఏమంటే, 'తత్సృష్ట్వా తదనుప్రావిశత్', (బ్రహ్మము సృష్టిని చేసి దానిలో ప్రవేశించినది) అనిన మంత్రములు వేదములలోనే స్పష్టంగా ఉన్నాయి గనుక.

అందుకనే, మిగతా ఆగమములను పాటించే వైష్ణవులు మొదలైనవారు, రాగభావనతో భోగభావనతో ఆగిపోతారు. వారు భగవంతుని సృష్టిలో ఉంటూ, సృష్టిని అనుభవించాలన్న అనురాగముతో నిండియుంటారు కనుక, ఆయనలో లయమును ఒప్పుకొనరు, కనుకనే, లయప్రధానమైన శైవాగమమును కూడా ఒప్పుకొనరు. అందుకని, అది బోధించే సత్తర్కము, సదాగమము, సద్గురూపదేశములను వారు ద్వేషిస్తారు. పరమాత్మతో ఐక్యానుసంధానమును ఊహించడానికి వారు ఇష్టపడరు. కనుక శైవాగమము ఇలా చెబుతున్నది.

"వైష్ణవము మొదలైన ఆగమములు విద్యారాగముతో రంజితములై ఉంటాయి.

సర్వజ్ఞజ్ఞానమును వర్జించడం వలన అవి పరతత్త్వమును అందుకొనలేవు"

ఈ విధమైన విచారణ వల్ల ఏమి తేలుతున్నది? దృఢమైన శాంభవశక్తిపాతమును పొందిన శిష్యుడు మాత్రమే, సదాగమములు ఏదైతే బోధిస్తున్నాయో ఆ క్రమంలో తన వికల్పమును సంస్కరించుకుని, పరమశివ స్వరూపమును చేరుకుంటున్నాడని తేలుతున్నది. మిగతా వారికది సాధ్యం కాదు.

ఇప్పుడు ఇంకొక ప్రశ్న తలెత్తవచ్చు. "మీరు చెబుతున్నట్లుగా జరిగే పనైతే, వికల్పముల వల్ల పొందబడే పరతత్త్వము కూడా వికల్పముల రూపమే అవుతుంది కదా? అలాంటప్పుడది పరమశివస్వరూపమెలా అవుతుంది?" అని.

ఈ ప్రశ్నలో తర్కమున్నది. ప్రాచీనులైన మహర్షులు, ఈ విధముగా ఏయే ప్రశ్నలను ప్రత్యర్థులు అడుగవచ్చునో ఊహించి, వాటిని వారే లేవనెత్తి, సమాధానములు కూడా ఇస్తారు. ఈ ప్రక్రియ ద్వారా వారు ప్రతిపక్షమును నిరుత్తరం గావిస్తూ, తమ వాదమును నిరూపించుకుంటారు. ఆదిశంకరుల అద్వైతగ్రంథములలోను, ఇతరములైన అనేక ఇతరశాస్త్రములలో కూడా ఈ విధానమును మనం గమనించవచ్చు.

మట్టితో చేయబడిన కుండలోకూడా మట్టి స్వభావమే ఉంటుంది. అదేవిధంగా, ఆలోచనల ద్వారా పొందబడే ఫలితం కూడా ఇంకొక ఆలోచనయే అవుతుంది గాని దానికతీతమైనది ఎట్లా అవుతుంది? అన్నది ఈ ప్రశ్న.

ఈ ప్రశ్నకు సమాధానమేమనగా - ద్వైతభావమును భంగం చేయడమే శుద్ధవికల్పముయొక్క పని. అంతేగాని పరమశివత్వమును అందించడం కాదు. అశుద్ధవికల్పముల ద్వారా శిష్యునిలో ద్వైతభావన గట్టిగా

వేళ్లూనుకుని ఉన్నది. దానిని తొలగించడానికే శుద్ధవికల్పముల అవసరంగాని, పరమేశ్వరుని నిరూపించడం వాటి ఉద్దేశ్యం కాదు. అంతటి శక్తి కూడా వాటికుండదు. అశుద్ధ వికల్పమును తొలగించడమే శుద్ధవికల్పము యొక్క పని.

అంటే, ఈ ప్రక్రియ, ముల్లుతో ముల్లును తీయడం వంటిది. శ్రీ రామకృష్ణులిలా అనేవారు, 'నీ కాలికి ఒక ముల్లు గుచ్చుకున్నపుడు, దానిని ఇంకొక ముల్లుతో తీసివేసి, అప్పుడు రెండు ముళ్ళనూ అవతల పారవేసినట్లుగా, నీలో ఉన్న అవిద్యను, అజ్ఞానమును - విద్యతో, జ్ఞానంతో తొలగించాలి. ఆ తరువాత, విద్యావిద్యలను, జ్ఞానాజ్ఞానములను రెంటినీ అవతల పారవేసి, రెంటికీ అతీతుడవు కావాలి'.

అశుద్ధ వికల్పములు, పరమశివానుభవమునకు అడ్డుగా నిలుస్తున్నాయి. వాటిని శుద్ధ వికల్పముల సహాయంతో తొలగించగా, అనాదిగా ఉన్నట్టి పరమశివస్వరూపం తానై వెలుగుతుంది. అడ్డును తొలగించడమే చేయవలసింది. అంతేగాని, అడ్డును తొలగించడం వల్ల, క్రొత్తగా పొందేది ఏదీ ఉండదు.

పరమశివునకు, ఒకప్పుడు ఉండి మరొకప్పుడు లేకపోవడం సంభవించదు. ఆయన నిత్యుడు. సర్వవ్యాపి, సర్వాతీతుడు కూడా. ఆయన తనలో తానుగా వెలుగై ఉన్నాడు, అన్నింటిలో కూడా వెలుగుగానే ఉన్నాడు. కాబట్టి ఆయనను వేరొక వెలుగు ప్రకాశింపజేయలేదు. శుద్ధవికల్పం కూడా అందుకు సమర్థం కాదు. మరి అలాంటప్పుడు శుద్ధవికల్పము యొక్క ఉపయోగమేమున్నదని మరొక ప్రశ్న ఉదయిస్తుంది.

వికల్పమనేది ఇతరత్రా ఏదో ఒకదానిని సాధించడంకోసం గాని, ఇంకొకదానిని ఖండించి, మా మతమే సరియైనదన్న వాదనను నిరూపించడం కోసంగాని కాదు.

ఈ విధమైన సత్తర్కము లేదా సరియైన ఆలోచనావిధానమనేది, అతిదృఢమైన శక్తిపాతమును పొందినవానికి దానంతట అదే ఉదయిస్తుంది. దీనిని, ఏవో గ్రంథములను చదివి నేర్చుకొనవలసిన పని లేదు. శక్తిపాతమనేది సత్తర్కమును తనంతట తానే ఉదయింపజేస్తుంది. ఇది కొంతమందిలో తనంతట తానే కలుగుతుంది. ఇదికూడా ఒక విధమైన అదృశ్యదీక్షయే. ఇటువంటి శిష్యులు 'దేవిచేత దీక్షను పొందినవారు' అనబడతారు. వారికి పరాదేవియే ఈ విధమైన అనుగ్రహమును కలిగిస్తుంది. వీరు మిక్కిలి అదృష్టవంతులు. అయితే, ఈ స్థాయి లేనట్టి మిగతావారికి, ఆగమశాస్త్రములలో చెప్పబడిన విధముగా ఏ విధంగా దీక్షను ఇవ్వాలన్న వివరమును, 'శక్తిపాతప్రకాశనమ'నే ముందటి అధ్యాయంలో వివరిస్తానని ఆచార్యులవారంటున్నారు.

ఈ విధమైన దీక్షనిచ్చే గురువు ఆ దీక్షద్వారా ఏమి చేస్తాడు? అతడు క్రొత్తగా ఏమీ చెయ్యడు. ఆగమశాస్త్రములలో ఏమి చెప్పబడినదో దానిని నిరూపిస్తాడు గాని అంతకంటే ఇతరమైనదేదీ గురువు చెయ్యడు. మరి, ఆగమశాస్త్రములలో ఏమి చెప్పబడినది? శిష్యునకున్నట్టి సందేహములనన్నింటినీ తొలగించి, పరమేశ్వరానుసంధానమునకు దారిచూపగల భావములేవైతే ఉన్నాయో, వాటికి అడ్డుగా నిలుస్తున్న విరుద్ధభావములను అతనినుంచి తొలగించడమే శాస్త్రములలో చెప్పబడినది. ఈ పని ద్వారా, శుద్ధములై, సాధనలో సహాయపడగలిగినట్టి వికల్పములను శిష్యునిలో ఉదయింపజేయడమే గురువు యొక్క పని. ఈ ప్రక్రియకు విరుద్ధములైన ఇతర వికల్పములు వాటి తలల నెత్తకుండా బంధించడమే సత్తర్కము లేదా సరియైన

తర్కమనబడుతుంది.

ఈ సత్తర్కం ఉదయించడం వలన శిష్యునిలో ఏమి జరుగుతుంది?

సత్తర్కమనేది శుద్ధవిద్య యొక్క వెలుగై ఉన్నది. అది ఉదయించడం వలన, అప్పటివరకూ అర్థం అయ్యీ కానట్లుగా ఉన్న గూఢమైన అర్థములను శిష్యుడు స్ఫుటంగా భావించగలగుతాడు. ఇది భావన అనబడుతుంది. కనుక శుద్ధమైన భావన అతనిలో మేలుకొంటుంది. ఇదిగాక, ఇతర సాధనలు వేటినైనా శిష్యుడు ఆచరించవలసిన అవసరం ఉన్నదా? అంటే, ఈ మార్గములో ప్రయాణిస్తున్న సాధకులు, శుద్ధవిద్య యొక్క వెలుగైన సత్తర్కమును అనుసరించడం తప్ప, వేరే యోగసాధనలేవీ చేయవలసిన అవసరం లేదు.

శాక్తోపాయులకు యోగాంగముల అవసరం లేదు

పతంజలి మహర్షిచేత చెప్పబడిన అష్టాంగయోగములో యమనియమాది ఎనిమిది మెట్లు చెప్పబడినాయి. కానీ ఈ మార్గములోని శాక్తోపాయమునకు అర్హత ఉన్నట్టి శిష్యునకు అవేవీ అవసరం ఉండవు. అహింస మొదలైన యమములు, తపస్సు మొదలైన నియమములు, పూరకము మొదలైన ప్రాణాయామములు కూడా అవసరం లేదు. ఇవన్నీ కూడా, శిష్యుడు వాటిని గ్రహించుకొని, అభ్యాసం చేసి, సాధించవవలసినవి. అవి సర్వాతీతమైన సంవిత్ వ్యాపారములెలా అవుతాయి? కావు గనుక, వాటిని సాధన చేయవలసిన పని లేదు.

అదేవిధంగా, ప్రత్యాహారమనేది కూడా ఇంద్రియముల లోలోపలే పనిచేస్తుంది. ప్రత్యాహారమంటే, బయటకు పరుగెత్తుతున్న ఇంద్రియములను చిక్కబట్టి, వాటిని తన లోలోపలకు నిగ్రహించడమే. కనుక అది కూడా పరమేశ్వరుని సమావేశమును కలిగించలేదు. ఇదే విధముగా, ధ్యాన, ధారణ, సమాధులు కూడా. వాటిలో ఏమి జరుగుతుంది? అభ్యాసబలం చేత మనస్సును నిగ్రహింపజేసి, దేనినైతే ధ్యానిస్తున్నాడో ఆ ధ్యేయవస్తువులో, ధ్యానించే సాధకునికి తాదాత్మ్యతను కలిగించే ప్రక్రియ వాటిలో ఉంటుంది. అంటే, యోగమంతా అభ్యాసరూపమే. అందుకే దానిని అభ్యాసయోగమంటారు.

అయితే, ఇక్కడొక సమస్య ఉన్నది. పరమశివుడు పరతత్త్వమై యున్నాడు. అంటే, సమస్తానికీ అతీతముగా ఉన్నాడు. అభ్యాసానికి కూడా అతీతుడు. కనుక ఆయనను అభ్యాసంతో ఎట్లా చేరుకోవడం? వీలుకాదు. ఆయన అంతటా స్వస్వభావ రూపంలో ఉన్నాడు. అంటే, ఆత్మస్వరూపుడై, అత్యంత సహజస్థితిలో ఉన్నాడు. అటువంటి, పరమశివునిలో అభ్యాసం ఏ విధంగా కుదురుతుంది? కుదరదు. కనుక, యోగసాధనతో పరమేశ్వరుడు లభించడు.

శాక్తోపాయము నందు, శుద్ధమైన తర్కము వల్లనే అంతా జరుగుతుంది. దీనిలో ఇతర సాధనల అవసరం ఏమాత్రమూ ఉండదు. నవీనకాలంలో ఈ మార్గమును నిరూపించినవారిలో రమణమహర్షి ప్రసిద్ధులు. వారి తరువాత కాశ్మీరవాసియైన స్వామి లక్ష్మణ్ ఝూ గారు ప్రసిద్ధులు. జపధ్యానములు, ప్రాణాయామము, యమనియమములు మొదలైన సాధనలు, ఇంతకంటే క్రిందిస్థాయిలో ఉన్నట్టి సామాన్యసాధకుల కోసం ఉద్దేశించబడినట్టివి. అవి అణవోపాయము క్రిందకు వస్తాయి. శాక్తోపాయ సాధకులకు అవి అవసరం ఉండవు.

మరి శాక్తోపాయములో ఏమి జరుగుతుంది? అంటే, శిష్యుని ప్రాణము, బుద్ధి, దేహములు సంవిత్ లో

కుదురుకుని స్థిరములుగా ఉండటం తప్ప, ఇందులో వేరే ఏమీ ఉండదు. అదొక్కటే ఈ మార్గపు సాధన.

బరువులెత్తడమును క్రమంగా అభ్యసిస్తే, కొంతకాలానికి, మామూలు మనిషి ఎత్తలేని బరువును వస్తాదు ఎత్తి చూపగలుగుతాడు. మామూలుగా మనకు అర్థం కాని శాస్త్రములను ఆయా గురువుల వద్ద నేర్చుకుంటే, వాటి అర్థములను గ్రహించడం సాధ్యమౌతుంది. లౌకికవిద్యలన్నీ ఇటువంటివే. మామూలు మనిషి నృత్యమును చేయలేడు. కానీ, అభ్యాసం వల్ల అది సాధ్యమౌతుంది. ఈ విద్యలన్నింటిలోనూ, కొన్నింటిని స్వీకరించడము, మరికొన్నింటిని తిరస్కరించడము ఉంటుంది. కానీ సంవిత్ లో మాత్రము, గ్రహించడము, తిరస్కరించడం అనే ప్రక్రియలు లేవు. అది సర్వాతీతమై ఉన్నది.కనుక, దానిలో అభ్యాసమేముంటుంది? అభ్యాసంతో దానిని పొందటం ఎలా వీలవుతుంది? కాదు.

అలాంటప్పుడు ఇంకొక ప్రశ్న ఉదయించవచ్చు.

"మీరు సత్తర్కమే ప్రధానమని చెబుతున్నారు కదా. మరి తర్కం వల్ల కూడా ఏమౌతుంది? తర్కం కూడా ఒక అభ్యాసం వంటిదే కదా? దానిలో ఒకదానిని స్వీకరించడం మరొకదానిని నిరసించడం ఉంటుంది కదా? మరి ఇదెలా పరమేశ్వరసమావేశమును కలిగించగలదు?" అనినప్పుడు, "ద్వైతముగా కనిపిస్తున్నదానిని నిరసించడం తప్ప, దీనికి ప్రత్యేకమైన వేరే ప్రయోజనం లేద"ని సమాధానమును ఇవ్వవలసి యుంటుంది.

లౌకికములైన పనులలో కూడా చిదాత్మగా సర్వరూపములలో ఉంటూ, ఆయా దేహములలో తనకు ఇష్టమనిపించిన వాటిని ప్రకటించడం, వాటికి విరుద్ధములైన వాటిని తిరస్కరించడము, ఇదంతా కూడా ఎందుకు చెయ్యబడుతుంది? అంటే, ద్వైతమును నిరసించే అభ్యాసమును నిరూపించడం కోసమై ఇదంతా ఉన్నది. పరతత్త్వములో దేనినీ నిరాకరించడం ఉండదు. ద్వైతము కూడా పరమశివుని కంటే వేరైన ఇంకొక వస్తువు కాదు. అది కూడా ఆయనలోనిదే. కనుక ద్వైతమును నిరసించడం మాత్రమే శుద్ధవికల్పం వలన చేయబడుతుందని చెప్పబడినది. ఈ సత్తర్కములో ద్వైతము తొలగించబడుతుంది గాని, దాని స్థానంలోకి, లౌకికములైన పనులలో చేసినట్లు, వేరే దేనినో స్వీకరించడం ఉండదు. ద్వైతభావన తొలగినప్పుడు, ఏది ఉన్నదో అదే ప్రకాశిస్తుంది గాని, ఇంతకుముందు లేనిది, క్రొత్తగా వచ్చేది, ఏమీ ఉండదు.

పరమశివతత్త్వమనే పరమార్థము, స్వస్వరూపమై, ప్రకాశమై ఉన్నది, స్వయముగా తన స్వాతంత్ర్యముతో తన వెలుగును తగ్గించుకుంటుంది. మళ్ళీ క్రమంగా వికాసోన్ముఖమై, వికసించడం మొదలుపెట్టి, చివరకు పూర్తిగా వికసించి, ప్రకాశిస్తుంది. ఈ విధంగా తగ్గించుకోవడము, వికసించడము, ప్రకాశించడము, ఇదంతా పరమేశ్వరస్వరూపమే అయి ఉన్నది. కనుక దానికి ప్రత్యేకములైన యోగాంగములు, సాధనలు అవసరం లేదు. అవి దీనిని పొందటానికి ప్రత్యక్షములైన ఉపాయములు కావు.

ఒకవేళ తర్కమును ఉపాయముగా అనుకున్నప్పటికీ, అచ్చట ఉపాయమౌతున్నది మామూలు తర్కము కాదు. ఇది సత్తర్కము లేదా శుద్ధవిద్య. అంటే, శుద్ధమైన జ్ఞానపూరితమైన తర్కము. ఈ తర్కము - అంతరికములైన యాగము, హోమము, జపము, వ్రతము, యోగము మొదలైన అనేకవిధములైన సాధనలుగా అనుష్ఠింపబడుతూ క్రమేణా శుద్ధత్వాన్ని సంతరించుకుంటుంది. శాక్తోపాయములో ఇవన్నీ ఎలా ఉంటాయో వివరిస్తున్నారు.

యాగము

తన మనస్సులో ఉదయిస్తున్న భావములన్నింటికీ పరమేశ్వరునియందే స్థితి ఉన్నది. ఆయన ఆధారముతోనే అవి ఉదయిస్తున్నవి గాని వాటికి స్వతంత్రప్రతిపత్తి లేదన్న భావము సాధకునిలో స్థిరపడాలి. ఈ విధమైన దృఢత్వం రావడం కోసం, పరమేశ్వరుని కంటే వేరే ఏదీ లేదన్న శుద్ధమైన భావన గట్టియగుట కొరకు, తనయొక్క అన్ని భావములనూ పరమేశ్వరునియందు అర్పణం చేయడం యాగము. ఇదే అంతర్యాగము.

హృదయమునకు హాయిని కలిగించే ఈ విధమైన సాధనతో, ఎవరైతే తమంతట తాముగా సంవిత్ లో ప్రవేశించగలుగుతారో వారికి పరమేశ్వరానుసంధానము చాలా సులభమనే భావమును చెప్పడం కోసం, హృదయమునకు హాయిని కలిగించే పూవులు, తర్పణము, గంధము మొదలైనవి బాహ్యాపూజలో ఉపయోగింపబడతాయి.

హోమము

తనయొక్క సర్వభావములూ పరమేశ్వరుని తేజస్సుతో నిండియున్నట్టివే యన్న భావన స్థిరపడటం కోసం, సమస్తభావములనూ మ్రింగడం కొరకు సిద్ధంగా ఉన్నట్టి పరమశివుని జ్ఞానాగ్ని తేజస్సులో, సమస్తభావములనూ లయము గావించడం హోమము. తన భావములన్నీ పరమశివాగ్నిలో పడి పూర్తిగా కాలి భస్మముగా మారేంతవరకూ ఈ సాధన చేయాలి. ఇది అంతరిక హోమము.

జపము

లోపలా బయటా అనే భేదం లేకుండా అనుభవం లోకి వస్తున్న ప్రతిదానిని తనకంటే వేరుగా చూడకుండా, తన యొక్క స్వభావముగా ఉన్నట్టి పరమశివతత్త్వమే ఇదంతా అన్న స్థితిలో నిరంతరం ఉండటమే జపము. అసలైన జపమంటే ఇదే.

వ్రతము

'నేను పరమేశ్వరుడనే' అనినట్టి అనుభవంలో కుదురుకోవడం కోసం, ఆయనతో సమస్థితిలోకి యోగియైనవాడు ప్రవేశించాలి. పరమేశ్వరునకు వేరుగా ఇతరమేదీ లేదు గనుక, అదే విధంగా తాను కూడా, తన దేహమును, తన చుట్టూ ఉన్నట్టి కుండ మొదలైన నిర్జీవ వస్తువులతో సహా ఒక్కటే అయినట్లుగా, అన్నీ పరమేశ్వర స్వరూపములే అన్న భావంతో, అన్నింటినీ నిరంతరం చూస్తూ ఉండటమే వ్రతము.

ఈ విషయమై శ్రీనందిశిఖ అనే గ్రంథము ఇలా చెప్తుచున్నది.

'అన్నింటినీ సమభావంతో చూడటమే మహావ్రతము'

యోగము

ఆలోచనలకు అతీతంగా, దేనినీ ఆశించకుండా ఉండే ఒక విచిత్రమైన స్థితి ఉన్నది. అది కూడా ఒక

ఆలోచనయే అయినప్పటికీ, ఇతర ఆలోచనలవలె కాకుండా, శుద్ధవిద్యాంశ యొక్క స్వరూపమైనది. ఇలాంటి భావముతో, ఏ పరమార్థతత్త్వమైతే దేనికీ అంటకుండా, అన్నింటికీ అతీతంగా వెలుగుతున్నదో, అదే సనాతనమైన పరమేశ్వరప్రకాశమన్న సత్యము చక్కగా అర్థం కావడం కోసం, దానిని తన స్వరూపముగా నిరంతరం అనుసంధానము గావించే ఆలోచనయే (ధ్యానమే) యోగము.

శక్తి - వివిధ స్వరూపములు

పరమేశ్వరుడు పరిపూర్ణజ్ఞానంతో నిండిన వెలుగుగా ఉన్నాడు. ఆయన శక్తికూడా ఆయనలాగా పరిపూర్ణమైనట్టిదే. ఆ శక్తి - కులము (దేహము, వర్ణశబ్దము), సామర్థ్యము (శక్తి), ఊర్మి (భావోదయము), హృదయము, సారము, స్పందము (కదలిక), విభూతి (అంశశక్తి), త్రిశిఖ (మూడు తలలున్న దేవి), కాళి (కలనము చేయునది), కర్షణీ (కుదించునది), చండి (రౌద్రి, భయంకరి), వాణి (వాగ్దేవి), భోగ (భోగించునది, లక్ష్మి), దృక్ (జ్ఞానదేవి,సరస్వతి), నిత్య (పదహారు నిత్యాదేవతల స్వరూపిణి) మొదలైన ఆగమశాస్త్రములలో ఉపయోగింపబడే రకరకములైన పేర్లతో చెప్పబడుతూ ఉంటుంది. ఆయా రూపములలో, ఆయా శక్తులుగా, ధ్యానులచేత వారి హృదయములలో ధ్యానింపబడుతూ ఉంటుంది. ఎవరు ఏ పేరుతో, ఏ రూపంతో ఆరాధిస్తే, ఆయా రూపములతో వారికి గోచరిస్తూ ఉంటుంది.

ఈ శక్తులన్నీ కలిసిన మూలశక్తియే ఆమె అనినట్టి భావనతో ఉపాసింపబడినప్పుడు తన పూర్ణమైన వెలుగుతో ప్రకాశిస్తూ అట్టి ఉపాసకునికి దర్శనమిస్తుంది. దేవియొక్క శక్తిస్వరూపములు లెక్కలేనన్ని ఉన్నాయి. ఎక్కువ మాటలెందుకు? విశ్వంలో ఉన్న శక్తులన్నీ ఆమె స్వరూపములే. విశ్వశక్తులుగా ఆమెయే ఉన్నది. వాటినన్నిటి గురించి పూర్తిగా గ్రహించి చెప్పగలగడం మానవమాత్రులకు సాధ్యం కాదు.

కానీ, స్థూలంగా చూచినప్పుడు, సృష్టి మొత్తాన్నీ మూడే మూడుశక్తులు పరిపాలిస్తున్నాయి. అవి - పరాశక్తి, పరాపరశక్తి, అపరాశక్తి. వీరిలో అంతస్స్యూతగా ఉన్నది పరాత్పరి.

పరాశక్తి

శివునినుండి పృథివివరకూ ఉన్న 36 తత్త్వములను అఖండమైన సంవిత్ స్వరూపంగా ఉన్న ఏ శక్తి సహాయంతో, వాటికతీతుడైన పరమేశ్వరుడు చూచుచున్నాడో, భరిస్తున్నాడో, మరియు ప్రకాశింపజేస్తున్నాడో అదియే ఆయనయొక్క పరాశక్తి. ఇది అద్వైతము మరియు అభేదమనబడుతుంది.

పరాపరశక్తి

ఏ శక్తివలన అద్దంలో ఉన్న ఏనుగులాగా పరమేశ్వరుడున్నాడో అది ఆయనయొక్క పరాపరశక్తి. అద్దంలో ఏనుగు ప్రతిబింబం అగుపిస్తున్నది. కానీ అది అసలైన ఏనుగు కాదు. అదే సమయంలో ఏనుగు కాకపోనూ లేదు. అదే విధంగా, పరమేశ్వరుని నుండి సృష్టి విరజిమ్మబడుచున్నది. సృష్టిలో పరమేశ్వరుడున్నాడు. అదే సమయంలో దానికి భిన్నంగానూ ఉన్నాడు. అంటే, ద్వైతాద్వైతమని, భేదాభేదమని అర్థం.

అపరాశక్తి

దేనివల్ల పరస్పరము విడివిడిగా ఉన్నట్టి ఆత్మలుగా, సృష్టిలో భేదం గోచరించుచున్నదో అది అపరాశక్తి. అగ్నినుండి నిప్పురవ్వలు వెలువడినట్లుగా పరమశివుని నుండి ఇన్ని ఆత్మలు వెలువడటం ఏ శక్తి వల్ల జరుగుతున్నదో, అది ఆయనయొక్క అపరాశక్తి. ఇది ద్వైతమని, భేదమని పిలువబడుతుంది.

సృష్టికి ఆధారభూతములుగా ఉన్నట్టి, పర, పరాపర, అపర లనే ఈ మూడుశక్తులను తనలో ధరించి, వాటిని క్రోడీకరించి, ఏ శక్తి అయితే ఈ మూడింటిని అనుసంధానం గావిస్తున్నదో, ఆ భగవతికి "పరాత్పర" యని పేరున్నది. ఆమె "మాతృసద్భావ", "కాలకర్షిణి" ఇత్యాది పేర్లతో ఆగమములలో పిలువబడుతుంది. ఈ విధంగా, ఈ నాలుగుశక్తులూ, తమతమ స్వాతంత్ర్యములతో, ప్రత్యేకములైన సృష్టి, స్థితి, సంహారరూపములై, మూడుమూడు విధములుగా వర్తిస్తాయి. కనుక, ఇవి పన్నెండౌతాయి. ఈ పన్నెండుగురే పన్నెండు కాళికాశక్తులు.

వీరు చేసే పనులు, ప్రమాత, ప్రమాణ, ప్రమేయములనే మూడు స్థాయిలలో ఉంటాయి. వీటినే క్లుప్తముగా మాతృ, మాన, మేయములంటారు. అంటే, జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయములని అర్థం. మామూలు మాటలలో చెప్పాలంటే - తెలుసుకొనునది, తెలుసుకొనుట, తెలియబడునది యని, కర్త, క్రియ, కర్మ లని చెప్పవచ్చు.

మానవుని అనుభవప్రక్రియ అంతా ఈ పన్నెండు కాళీశక్తుల అదుపులోనే ఉంటుందని చెప్పినారు కదా. అది ఎలా ఉంటుందో గమనిద్దాం!

1. మొదటి శక్తి - సృష్టికాళి: సంవిత్ యొక్క పూర్వస్థితిలో, అనగా, ఈ చరాచరమయమైన సృష్టికి ముందు, తన లోలోపల సృష్టిలోని సమస్త భావములను ఊహిస్తుంది.

అనగా, సృష్టిలో ఏయే లోకములు, జీవులు, పదార్థములు ఎక్కడెక్కడ ఏ విధంగా ఉండాలన్న ప్రణాళికను తన లోలోపల రచిస్తుంది. ఈమె సృష్టిస్వరూపిణి.

ఏవేవో చెయ్యాలన్న ఊహాలలో ఎప్పుడూ తేలుతూ ఉండే ఊహాజీవులు ఈమె ఉపాసకులు.

2. రెండవ శక్తి - రక్తకాళి: భావములకు బాహ్యమయములైన రూపములను ఈ శక్తి కల్పిస్తుంది.

రక్తమంటే రంగు. అంటే, రూపంలేనిదానికి ఒక రూపమును ఇవ్వడం. రూపమంటూ లేని భావములకు, రూపంతో కూడిన ఒక స్థితిని కల్పిస్తుంది. ఆలోచనలకు ఒక రంగును అద్ది వాటికి భౌతికరూపములను ఇస్తుంది. కనుక ఈమె స్థితి స్వరూపిణి.

ఆవిష్కర్తలు, చిత్రకారులు, రంగులతో పనిచేసేవారు, ఊహాలకు వాస్తవరూపాన్నిచ్చే విజ్ఞానవాదులు, కళాకారులందరూ ఈమె ఉపాసకులు.

3. మూడవ శక్తి - స్థితినాశనకాళి: బాహ్యంగా వ్యక్తములవుతున్న భావములను సంతోషముతో ఆనందించి, వాటిని తనలోకి లయం చేసుకుందామన్న ఊహతో వాటిని ఉపసంహరిస్తుంది. అంటే, సృష్టిని మళ్ళీ తనలోనికి తీసుకుంటుంది. ఈమె లయస్వరూపిణి.

ఉన్నదానిని ముందు ఆనందముగా అనుభవించి, తరువాత వాటిని మార్చివేద్దామన్న ఆలోచనతో ఉండే

విప్లవవాదులు, సంస్కరణవాదులు, పాతను నిర్మూలిద్దామన్న సంకల్పంతో పనిచేసేవాళ్ళు ఈమె ఉపాసకులు.

4. నాలుగవ శక్తి - యమకాళి: ఈ విధంగా సృష్టిని లయం చేయడానికి ఏవేవి ఆటంకములుగా ఉన్నాయో? అన్న అనుమానమును మొదటగా సృష్టించి, ఆ శంకను నిర్మూలించి, తరువాత ఆయా ఆటంకములను కూడా నిర్మూలిస్తుంది.

మార్పును ఒప్పుకోలేనివారు, భయస్తులు, అనుమానస్తులు, తమమీద తమకే నమ్మకం లేనివారు, మార్పు నిజంగా అవసరమా? మారినది ఇంతకుముందు కంటే బాగా ఉంటుందా? మొదలైన ఆలోచనలు చేసి, చివరకు, మారక తప్పదన్న నిశ్చయానికి వచ్చి, మార్పును స్వాగతించేవారు ఈమె ఉపాసకులు.

ఈ నాలుగు ప్రక్రియలూ, ప్రమేయస్థాయిలో, అంటే బాహ్యప్రపంచస్థాయిలో, భౌతికస్థాయిలో జరుగుతాయి. అంటే, పంచభూతములు, ఇంద్రియములు, ప్రకృతి శక్తులు మొదలైనవాటి సృష్టి, స్థితి, ఉపసంహారము, లయము ఈ స్థాయిలో చేయబడతాయి.

5. అయిదవ శక్తి - సంహారకాళి: తరువాత, ఈ విధముగా అనుమానిస్తున్న శక్తి (శంక) ఏదైతే ఉన్నదో, దాని భావరూపమును కూడా తనలోకి తీసుకుంటుంది.

6. ఆరవశక్తి - మృత్యుకాళి : ఆ విధముగా ఉపసంహారం చేయడానికి ఒక శక్తిని సృష్టించి, అదికూడా తన రూపమేనని భావిస్తుంది.

7. ఏడవశక్తి - రుద్రకాళి: ఈ విధంగా ఉపసంహరిస్తున్న శక్తిలో కొంత భావమును వాసనాత్మకముగా ఉంచి, మరి కొంతభాగమును సంవిత్ యొక్క రూపంగా ఉంచుతుంది.

8. ఎనిమిదవ శక్తి - మార్తాండకాళి: తన స్వభావమును బయటకు విరజిమ్మి, కరణచక్రము (ఇంద్రియముల సమూహము) లను కల్పిస్తుంది.

ఈ నాలుగు ప్రక్రియలూ, ప్రమాణస్థాయిలో జరుగుతాయి. అంటే, జ్ఞానము, తెలుసుకొనుట అనే భూమికలో, అంతఃకరణ స్థాయిలో జరుగుతాయి.

9. తొమ్మిదవ శక్తి - పరమార్కకాళి : కరణేశ్వరులను (ఇంద్రియముల అధిపతులను) కల్పిస్తుంది.

10. పదవశక్తి - కాలాగ్నిరుద్రకాళి : మాయకు లోబడిన భూమికలో ఉన్న ప్రమాత (ఆత్మ) ను కల్పిస్తుంది.

11. పదకొండవ శక్తి - మహాకాలకాళి: సంకోచమును వదలిపెట్టి వికాసమును గ్రహించవలెనన్న రసికత్వము కలిగిన ప్రమాత (ఆత్మ) ను కల్పిస్తుంది.

12. పన్నెండవ శక్తి -మహాభైరవ ఘోరచండ కాళి: ఆ తరువాత ప్రమాత (ఆత్మ) యొక్క పరిపూర్ణ వికసితరూపమును కల్పిస్తుంది.

పూర్తిగా వికసించి, 36 తత్త్వములను దాటి, పరమేశ్వరునితో ఒక్కటైన స్థితిని పొందిన ఆత్మయొక్క స్థితి

ఇది. సామాన్యభాషలో చెప్పాలంటే మోక్షమును పొందటం. ఈ స్థితిలో జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయములు మూడూ ఒక్కటౌతాయి. అనగా, తెలుసుకొంటున్న 'నేను', తెలివి, తెలియబడుతున్న 'ప్రపంచము' - ఈ మూడూ ఒక్కటిగా మారిపోయి అనిర్వచనీయమైన పరమశివానుభవంలో సాధకుడు లీనుడౌతాడు.

'మహాభైరవ' అంటే, పరమశివుడు. 'ఘోర' అంటే సృష్టి, 'చండ' అంటే జీవాత్మ, కాళి అంటే శక్తి. అంటే, పరమశివునిలో, సృష్టి, జీవులు కలసిపోయిన స్థితి గనుక దీనిని 'మహాభైరవ - ఘోర - చండకాళి' అంటారు. ఈ మూడింటినీ కలిపివేసే కాళిని ఈ పేరుతో పిలుస్తారు.

ఈ నాలుగు ప్రక్రియలూ ప్రమాతస్థాయిలో, అనగా, జ్ఞాత స్థాయిలో, జీవాత్మ స్థాయిలో జరుగుతాయి.

ప్రమేయము – జ్ఞేయము – భౌతిక ప్రపంచము యొక్క స్థాయి		
సృష్టి (అపరా)	1. సృష్టికాళి	సృష్టికి ముందున్న స్థితిలో, భౌతిక సృష్టిని ఊహిస్తుంది
స్థితి (పరాపర)	2. రక్తకాళి	ఆ ఊహలకు భౌతికరూపాన్నిచ్చి, దానిని కొనసాగనిస్తుంది
లయము (పరా)	3. స్థితినాశనకాళి	భౌతికసృష్టిని ఉపసంహరిస్తుంది
శ్రీమాతృసద్భావ (పరాత్పర)	4. యమకాళి	తనలోకి లయం చేసుకొంటుంది
ప్రమాణము – జ్ఞానము – భావాత్మక స్థాయి		
సృష్టి (అపరా)	5. సంహారకాళి	'సంహరింపబడిన భౌతికసృష్టి మొత్తం నాలో భావాత్మకంగా ఉన్నది' అనిన జ్ఞానమును పొందుతుంది
స్థితి (పరాపర)	6. మృత్యుకాళి	అదే జ్ఞానమును కొంతకాలం కొనసాగించి, చివరకు దానిని లయం చేయాలని సంకల్పిస్తుంది
లయము	7. రుద్రకాళి	భావాత్మకమైన సృష్టి యొక్క స్థితి కూడా లయమౌతుంది
శ్రీమాతృసద్భావ (పరాత్పర)	8. మార్తాండకాళి	అహంకారము అవ్యక్తస్థితిలో వెలుగుతూ ఉంటుంది
ప్రమాత – జ్ఞాత – ఆత్మయొక్క స్థాయి		
సృష్టి (అపరా)	9. పరమార్కకాళి	అహంకారమును మాయాత్మలో లయం చేస్తుంది. అంటే మాయతో కూడిన ఆత్మయొక్క సృష్టి జరుగుతుంది
స్థితి (పరాపర)	10. కాలాగ్ని రుద్రకాళి	మాయతో కూడిన ఆత్మ కొంతకాలం ఉండి, తరువాత మాయకు అతీతమైన స్థితిని పొందాలని కోరుకుంటుంది
లయము (పరా)	11. మహాకాలకాళి	అది ప్రమాతలో లయమౌతుంది
శ్రీమాతృసద్భావ	12. మహాభైరవ ఘోర	ప్రమాతను పరమశివునిలో

(పరాత్పర)	చండకాళి	పరిపూర్ణంగా లయం చేస్తుంది

ఈ పన్నెండుగురు భగవతీశక్తులు, సంవిద్రూపులై, సృష్టిలో ఉన్న ఆత్మలలో ఒక్కరిని గాని కొంతమందిని గాని ఉద్దేశించి, ఇద్దరుగా, ముగ్గురుగా, అనేక విధములుగా ఉదయిస్తూ చక్రాకారంలో తిరుగుతూ వారికి గోచరిస్తారు. అంటే, అందరు యోగులకు ఈ 12 మంది శక్తుల దర్శనం కాదు. యోగులు వారివారి పరిపక్వతను బట్టి కొంతమంది ఒకరిని, మరి కొంతమంది ఇద్దరిని, ఈ విధంగా దర్శించగలుగుతారు. బాహ్యప్రపంచంలో అయితే - నెలలు, కళలు, రాశులు మొదలైన క్రమంలోను, కుండ, వస్త్రము మొదలైన వస్తువుల రూపములలోను వీరు వెలుగుతూ ఉన్నారు. అంటే, పన్నెండు నెలలరూపంలో ఉన్నది వీరే. పన్నెండు నెలలు, నిజమునకు పన్నెండుమంది సూర్యులకు సూచికలు. ఈ విధంగా ఒక్కొక్క రాశిలోని సూర్యుడు ఒక్కొక్క కాళికి సంకేతముగా ఉన్నాడు. కళలంటే చంద్రకళలు. రాశులంటే, రాశిచక్రంలోని మేషాది రాశులు. ఈ విధముగా చక్రేశ్వరునికి బలమును పూర్ణత్వమును చేకూరుస్తూ 'కాళికా' శబ్దముతో పిలువబడుతున్నారు. చక్రేశ్వరుడంటే పరమశివుడు. కాలస్వరూపమైన కాళి ఈ విధంగా కాలునికి (పరమశివునికి) సృష్టి నడకలో పుష్టిని కలిగిస్తున్నది. అంటే, తోడ్పడుతుంది.

కలనమును చేసే శక్తికి కాళి యని పేరు. కలనమంటే ఏమిటి? ఈ పదమునకు ఏడు విధములైన అర్థములున్నాయి.

1. గతి: వేగముతో కూడిన కదలిక.

2. క్షేపము: బయటకు విరజిమ్మడం.

3. జ్ఞానము: గ్రహించడం, తెలుసుకోవడం.

4. గణనము: లెక్కపెట్టడం, ప్రణాళికలు రచించడం.

5. భోగీకరణం: అనుభవించడం.

6. శబ్దనం: వాక్కు ద్వారా వ్యక్తపరచడం.

7. స్వాత్మలయీకరణం: తనలో లయం చేసుకోవడం.

ఈ విషయమును ఇంకా వివరిస్తూ, శ్రీ భూతిరాజ గురుదేవులు, 'కాళికాదేవి' అనే పదము యొక్క అర్థమును ఈ విధంగా వివరించారు - 'విక్షేపమును కలిగిస్తుంది గనుక, జ్ఞానమును వెదజల్లుతుంది గనుక, కలనమును (కల్పన, లెక్కించుట లను) చేస్తుంది గనుక కాళి అనబడుతుంది'. కాళిక అనే పదమునకు ఇదే అర్థము.

నాచే రచింపబడిన ఇతర వివరణలలోను, స్తోత్రములలోను ఈ అర్థములను వివరముగా చూడవచ్చు. ఎందుకంటే, అతిరహస్యమును ఒకేచోట తెరచి చూపకూడదు, అదేవిధంగా ఎల్లప్పుడూ దానిని రహస్యంగానూ ఉంచకూడదని మా గురుదేవులన్నారు. ఇదే వారి విధానము.

ఎందుకిలా? అంటే, అవసరం ఉన్నా, లేకపోయినా, ఆధ్యాత్మిక రహస్యములను అందరికీ ప్రదర్శించడం మంచిది కాదు. దానివల్ల, వాటి విలువ తగ్గిపోవడమే గాక వేరేఉపయోగం ఏమీ ఉండదు. దీనికి వ్యతిరేకంగా, పూర్తిగా వాటిని దాచిపెట్టడమూ మంచిది కాదు. ఈ పనివల్ల, వాటి ఉనికికే భంగం వాటిల్లుతుంది. కనుక, వీటిని చెప్పీ చెప్పనట్లుగానే చెప్పాలి. ఇలా చెప్పడం వల్ల, నిజమైన సాధకులలో జిజ్ఞాస, ఉత్కంఠలు రేకెత్తబడి వారిని ఇంకా సాధనోన్ముఖులను గావిస్తాయి. అన్వేషణకు పురికొలుపుతాయి. కనుక, విషయమును సూచనప్రాయంగా చెప్పి, మిగతా వివరమును వారంతట వారే గ్రహించేటట్లు చెయ్యడమే గురువుల పరమోద్దేశ్యము.

యాగము, హోమము మొదలైనవాటి విషయంలో పైన ఏదైతే చెప్పబడిందో అదంతా పరమశివునకే వర్తిస్తుంది. కానీ, జనులందరూ ఏమి చేస్తున్నారు? కానిదానిని అవునంటూ స్వీకరిస్తున్నారు. అందుకనే, విష్ణువు నుండి శివునివరకూ ఉన్న దేవతలను పరమశివుడే అని తలచుచున్నారు. ఈ భావన సరియైనది కాదు. వీరందరూ 36 తత్త్వముల పరిధిలోపల ఉన్న దేవతలేగాని, వాటికి అతీతుడైన పరమేశ్వరుడు కారు. కనుక, వీరే పరమాత్ములన్న మిథ్యాపూరితమైన దృష్టిని, అనుత్తరయోగియైనవాడు వదలిపెట్టాలి. 'అనుత్తరయోగి' అంటే, పరమశివాగమమైన త్రికశాస్త్రమును అనుసరిస్తున్న యోగి యని అర్థం. ఈ విషయమును, శ్రీ విద్యాధిపతి తన అనుభవస్తోత్రంలో గొప్పగా వివరించారు.

ఈ విధంగా, యాగము, హోమము, వ్రతము, జపము, యోగము మొదలైన అయిదు విషయములలో రకరకములైన స్థాయీభేదములున్నాయి. ఏయే విధంగా ఎవరికి గురి కుదురుతుందో, ఎవరికేది సరిపోతుందో చూచుకొని, వారు, ఆయా విధములుగా వాటిని ఆచరించాలి. వాటిలో స్థిరంగా నిలబడటానికి ప్రయత్నం చేయాలి. అంటే, తనకు అనువైన సాధనను ఎంచుకుని, దానిని గట్టిగా సాధన చెయ్యాలని అర్థం.

ఈ మార్గములో నడచే యోగి ఏ విధంగా ఉండాలి? ఆహారవిషయములో అతనికి 'ఇది తినదగినది, ఇది తినకూడనిది, ఇది శుద్ధమైనది, ఇది కాదు' మొదలైన విచక్షణ అవసరం లేదు. అంటే, మామూలు యోగసాధకులు అనుసరించే ఆహారనియమములు ఇతనికి అవసరం ఉండవు. శుద్ధత, పవిత్రతలనేవి వస్తువులలో లేవు. అవి, మనస్సుచేత కల్పించబడేవి. కనుక వస్తువులలో అవి ఉన్నాయన్న భ్రమకు లోనైపోయి, మనస్సు కల్పిస్తున్న భావములను చూచి, తన ఆత్మను అనవసరంగా క్షోభ పెట్టుకోకూడదని శ్రీపూర్వాది గ్రంథములలో చెప్పబడింది.

నియమనిష్ఠలే ప్రధానములుగా భావిస్తూ చాలామంది చాదస్తులుగా తయారౌతూ ఉంటారు. నియమముల ఉపయోగం, వాటిని దాటించి సత్యసాక్షాత్కారమును సాధకునకు కలిగించడం మాత్రమే. అంతేగాని, అవియే సర్వస్వములుగా భావిస్తూ అక్కడే ఆగిపోకూడదు. అలాగని, వాటినసలు పాటించకుండా తిరస్కరించి, ఇష్టానుసారం ప్రవర్తించనూ కూడదు.

వస్తువులో లక్షణమనేది ప్రతిబింబిస్తుంది గాని, స్వతహాగా ఏ వస్తువూ దోషపూరితమైనది కాదు. ఉదాహరణకు, సముద్రజలం నీలంగా కనిపిస్తుంది. కానీ, అది ఆకాశముయొక్క ప్రతిఫలింపేగాని, నీటికా రంగు స్వతస్సిద్ధంగా లేదు. అదే విధంగా, వస్తువులో శుద్ధత్వమూ అశుద్ధత్వమూ ఉండవు. ఒక పరిస్థితిలో

ఉన్నపుడు శుద్ధమైనది, ఇంకొక పరిస్థితిలో ఉన్నపుడు అశుద్ధమౌతున్నది.

'దీక్షను స్వీకరించినవానికి దానం ఇవ్వకూడదు, అలా ఇవ్వడం దోష'మని శాస్త్రములలో ఒకచోట చెప్పబడినప్పటికీ, అదే శాస్త్రములో మరొకచోట దీనికి విరుద్ధంగా చెప్పబడిన దానినిబట్టి, మనకు ఏమి అర్థమౌతున్నది? ఒక ఖచ్చితమైన నియమమంటూ వస్తువునకు విధించలేమని అర్థమౌతుంది. మరి ఆ రెండవ శాస్త్రవాక్యం అబద్ధమా అంటే, కాదని చెప్పవలసి వస్తుంది. ఎందుకంటే, ఎన్నో శాస్త్రవాక్యములున్నప్పటికీ, శివవాక్యమే వాటన్నిటినీ అధిగమిస్తుంది. ఇది తర్కమునకు నిలబడుతుంది. అదీగాక, సర్వజ్ఞానోత్తర తంత్రము మొదలైన ఇతర ఆగమములు చెప్పినదానినే నేను ఇక్కడ చెబుతున్నాను.

కనుక వైదికమార్గము నుండి, శివాగమ తంత్రగ్రంథమైనట్టి కులోచ్ఛుష్మతంత్రము వరకూ, 'ఇది చేయదగినది, ఇది చేయకూడనిది', అంటూ ఏ విధములైన నియమములైతే ఉన్నాయో, అవి త్రికశాస్త్రమును అనుసరించే యోగికి అవసరం లేదన్న విషయం స్పష్టమౌతున్నది. శ్రీపూర్వము మొదలైన ఇతర గ్రంథములలో కూడా ఈ విషయమే చెప్పబడినది. ఇదే విషయము తంత్రాలోకమునందు ఇంకా వివరంగా నాచేత చెప్పబడింది. ఆయా వివరములను దానినుంచి గ్రహించవచ్చు.

పశువు - పశుపతి

పశువులంటే జీవులు. పశుపతి యంటే, పరమశివుడు. పశువుకూ పశుపతికీ ఉన్న భేదమేమిటి?

ఆ॥ పశులకిట్టి యూహ పట్టింపుగా నుండు
జడుడనైతి కర్మజంత్రమందు
మలినమందు జిక్కి మరణించు చున్నాడ
ఒరుల బంటునగుచు యోర్వకుంటి

ఆ॥ ఇట్టి యూహలన్ని విపరీతము లటంచు
వాని ద్రోసివేయ వన్నెకెక్కు
విశ్వమందు నిండు విశ్వాత్మగా దేరి
పతిగ మారునతడు పదము నంది

పశువు అంటే ఇంద్రియబంధంలో, మాయాబంధంలో చిక్కుకుని ఉన్న జీవుడు. అతడు ఇలా అనుకుంటాడు. - 'నేను జడుడను. కర్మను మూటగట్టుకుంటున్నాను. మురికిపట్టి ఉన్నాను, ఇతరుల చెప్పుచేతలలో ఉన్నాను'. దీనికి విరుద్ధమైన దృఢనిశ్చయం, అనగా, 'నేను చైతన్యస్వరూపుడను, నాకు కర్మ లేదు, నాకు మాలిన్యం లేదు, నేను సర్వస్వతంత్రుడను' అన్నట్టి గట్టినిశ్చయం కలిగినప్పుడు ఆ క్షణంలోనే అతడు విశ్వమునంతా నిండిన చిదాత్మయై, 'పశుపతి' అవుతున్నాడు.

పరయోగియొక్క తత్త్వము

ఆ॥ పరము గోరు యోగి పరవశుం డవరాదు

వస్తుతత్త్వమెపుడు వదలరాదు
మూర్ఖజనులు జేయు ముచ్చట్లలో జేరి
శంకలందరాదు సాధకుండు

పరయోగమార్గంలో సాధన చేసేవాడు పరయోగి. ఇటువంటివాడు ఈ విధమైన గట్టి నిశ్చయమును పొందటానికి ఎల్లప్పుడూ జాగరూకుడుగా, మరపుకు లోనుకాకుండా ఉండాలి. ప్రపంచం యొక్క, తనయొక్క, యదార్థతత్త్వములను అతడు ఏ పరిస్థితిలోనూ మరచిపోకూడదు. తెలివిలేని సామాన్యమానవులు చేసే పనికిరాని వాదములలో పడిపోయి, తన మనస్సులో అనుమానమును రేకెత్తనివ్వకూడదు. ఇటువంటి జాగ్రత్తను అతడు పాటించాలి.

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే శాక్తోపాయప్రకాశనం నామ చతుర్థమాహ్నికమ్ || 4 ||

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని శాక్తోపాయప్రకాశనమనే నాలుగవ ఆహ్నికము.

ఐదవ ఆహ్నికము

అణవోపాయ ప్రకాశనము

యదార్థః - యదార్థము

తత్ర యదా వికల్పః స్వయమేవ సంస్కారమ్ ఆత్మని ఉపాయాన్తరనిరపేక్షతయైవ కర్తుం ప్రభవతి, తదా అసౌ పాశవవ్యాపారాత్ ప్రచ్యుతః శుద్ధవిద్యానుగ్రహేణ పరమేశశక్తిరూపతామ్ ఆపన్న ఉపాయతయా అవలమ్బ్యమానః శాక్తం జ్ఞానమ్ ఆవిర్భావయతి / తదేతచ్చ నిర్ణీతమ్ అనన్తర ఏవ ఆహ్నికే /

ఈ విధముగా, ఏ విధమైన ఇతర ఉపాయమూ అవసరము లేకుండా, వికల్పము స్వయముగా తనను తాను సంస్కరించుకోగలిగినప్పుడు, అప్పుడది పశువ్యాపారము నుండి విముక్తిని పొంది, శుద్ధవిద్యానుగ్రహంతో పరమేశ్వరశక్తిగా మారి, దానినే ఉపాయంగా మలచుకుని, శాక్తజ్ఞానంగా ఆవిర్భవిస్తుంది. దాని వివరణను గత అధ్యాయంలో ఇచ్చియున్నాను.

యదా తు ఉపాయాన్తరమ్ అసౌ స్వసంస్కారార్థం వికల్పోఽపేక్షతే, తదా బుద్ధిప్రాణదేహఘటాదికాన్ పరిమితరూపాన్ ఉపాయత్వేన గృహ్ణాన్ అణుత్వం ప్రాప్త ఆణవం జ్ఞానమ్ ఆవిర్భావయతి, తత్ర బుద్ధిః ధ్యానాత్మికా, ప్రాణః స్థూలః సూక్ష్మశ్చ, ఆద్య ఉచ్చారణాత్మా, ఉచ్చారణం చ నామ పఞ్చప్రాణాద్యా వృత్తయః, సూక్ష్మస్తు వర్ణశబ్దవాచ్యో వక్ష్యతే, దేహః సంనివేశవిశేషాత్మా కరణశబ్దవాచ్యః, ఘటాదయో బాహ్యాః కుమ్భ-స్థణ్డిల-లిఙ్గ పూజాద్యుపాయతయా కీర్తయిష్యమాణాః /

ఒకవేళ ఏదైనా ఉపాయంద్వారా స్వసంస్కారమును పొందగోరితే, అప్పుడు బుద్ధి, ప్రాణము, దేహము, ఘటము మొదలైనవాటి పరిమితరూపములను ఉపాయములుగా తీసుకుని, అణుత్వమును పొందటం వలన అణవజ్ఞానము ఆవిర్భవిస్తుంది. అప్పుడు బుద్ధి ధ్యానాత్మకమౌతుంది. ప్రాణము, స్థూలము సూక్ష్మములని రెండు విధములు. మొదటిది ఉచ్చారణాత్మ, ఉచ్చారణమంటే పంచప్రాణముల వృత్తులు. సూక్ష్మము వర్ణశబ్దవాచ్యమౌతుంది. సన్నివేశ విశేషాత్మయైన దేహము కరణమౌతుంది. ఘటాదులు బాహ్యములు, కుంభ స్థణ్డిల లింగ పూజాది ఉపాయములని కీర్తింపబడుచున్నవి. వాని ధ్యానములను ఉచితరీతిని ఉపదేశిస్తాను.

తత్ర ధ్యానం తావత్ ఇహ ఉచితమ్ ఉపదేక్ష్యామః, యత్ ఏతత్ స్వప్రకాశం సర్వతత్త్వాన్తర్భూతం పరంతత్త్వమ్ ఉక్తం, తదేవ నిజహృదయబోధే ధ్యాత్వా, తత్ర ప్రమాతృ-ప్రమాణ-ప్రమేయరూపస్య వహ్న్యర్కసోమ త్రితయస్య సంఘట్టం ధ్యాయేత్ యావత్ అసౌ మహాభైరవాగ్నిః ధ్యానవాత సమిద్ధాకారః సంపద్యతే, తస్య ప్రాక్తన శక్తిజ్వాలా ద్వాదశక పరివృతస్య చక్రాత్మనః చక్షురాదీనామ్ అన్యతమసుషిర ద్వారేణ నిఃసృతస్య బాహ్యే గ్రాహ్యేత్మని విశ్రాన్తం చిన్తయేత్, తేన చ విశ్రాన్తేన ప్రథమం తద్బాహ్యం సోమరూపతయా సృష్టిక్రమేణ ప్రపూరితం, తతః అర్కరూపతయా స్థిత్యా అవభాసితం, తతోఽపి సంహారవహ్నిరూపతయా విలాపితం, తతః అనుత్తరాత్మతామ్ ఆపాదితం ధ్యాయేత్ / ఏవం తచ్చక్రం సమస్తబాహ్యావస్త్వభేదపరిపూర్ణం సంపద్యతే /

ధ్యానము

స్వయంప్రకాశరూపమని, అన్ని తత్త్వములలో నిండి యున్నదని, ఏ పరతత్త్వమైతే చెప్పబడినదో దానిని తన హృదయబోధలోనే ధ్యానిస్తూ, అక్కడ ప్రమాతృ ప్రమాణ ప్రమేయరూపములలో ఉన్నట్టి అగ్ని, సూర్య, చంద్రుల సంఘట్టమును, ధ్యానవాయువుయొక్క తోడ్పాటుతో సమిద్ధాకారమును పొందునంతవరకూ ధ్యానించవలెను. అది ఇంతకుముందు చెప్పబడిన పన్నెండు శక్తిజ్వాలలతో ఆవరింపబడినదై చక్రమువలె ఉంటూ, కన్ను మొదలైన ఇంద్రియద్వారములద్వారా బయటకు చిమ్మబడి, బాహ్యమున తెలియబడుతున్న వస్తుప్రపంచములో విశ్రాంతిని పొందుతున్నదని ధ్యానించాలి. ఆ విశ్రాంతిలో మొదటగా అది సోమరూపముద్వారా సృష్టిక్రమంలో పూరితమై, ఆ తరువాత అర్కరూపంలో స్థితిద్వారా అవభాసితమై, ఆ పిమ్మట సంహారాగ్ని రూపంలో విలీనమై, అక్కడ అనుత్తరాత్మగా ఉన్నదని ధ్యానించాలి. ఈ విధముగా ఈ చక్రము సమస్తబాహ్యవస్తు అభేదరూపమై పరిపూర్ణమై విరాజిల్లుతుంది.

తతో వాసనాశేషానపి భావాన్ తేన చక్రేణ ఇత్థం కృతాన్ ధ్యాయేత్ | ఏవమ్ అస్య అనవరతం ధ్యాయినః స్వసంవిన్మాత్రపరమార్థాన్ సృష్టిస్థితిసంహారప్రబన్ధాన్ సృష్ట్యాది స్వాతన్త్ర్య పరమార్థత్వం చ స్వసంవిదో నిశ్చిన్వతః సద్య ఏవ భైరవీభావః | అభ్యాసాత్ తు సర్వేప్సిత సిద్ధ్యాదయోఽపి |

అశేషములైన వాసనాభావములను కూడా ఈ చక్రంలోనే ఇమిడ్చి ధ్యానించాలి. దీనిని ఈ విధంగా అనవరతమూ ధ్యానించేవానికి, సృష్టి స్థితి లయములను గావిస్తున్న స్వసంవిత్ ఏదైతే ఉన్నదో దానియొక్క స్వాతంత్ర్య పరమార్థత్వము నిశ్చయమౌతుంది. దానిని భైరవభావమంటారు. దీని అభ్యాసంవల్ల కోరుకున్న సిద్ధులన్నీ లభిస్తాయి.

శ్లో|| స్వప్రకాశం సమస్తాత్మతత్త్వం మాత్రాదికం త్రయమ్ |
అన్తఃకృత్య స్థితం ధ్యాయేద్ధృదయానన్దధామని ||

త్రయీమాత్రాదిరూపమై స్వప్రకాశమైన ఆత్మతత్త్వమేదైతే ఉన్నదో దానిని తన అంతరాంతరములలో నిలుపుకుని హృదయంలోని ఆనందధామముగా దానిని ధ్యానించాలి.

శ్లో|| తద్ద్వాదశమహాశక్తిరశ్మిచక్రేశ్వరం విభుమ్ |
వ్యోమభిర్నిఃసరద్బాహ్యే ధ్యాయేత్సృష్ట్యాదిభావకమ్ ||

ఆ పన్నెండు మహాశక్తుల కాంతిచక్రము యొక్క విభుని ఈశ్వరుని, లోపలనుంచి బయట శూన్యంలోకి ప్రసరిస్తున్న వానిగా, సృష్ట్యాదులను భావిస్తూ ధ్యానించవలెను.

శ్లో|| తద్గ్రస్తసర్వబాహ్యాన్తర్భావమణ్డలమాత్మని |
విశ్రామ్యన్భావయేద్యోగీ స్యాదేవం స్వాత్మనః ప్రథా ||

దానిచేత గ్రస్తమైన సమస్త బాహ్యభావములూ ఆత్మయొక్క భావమండలంలో విశ్రమిస్తున్నట్లుగా యోగి భావించాలి. దీనివల్ల ఆత్మదీప్తి కలుగుతుంది.

ఇతి సంగ్రహశ్లోకాః | ఇతి ధ్యానమ్ |

ఇవి సంగ్రహశ్లోకములు. ఇది ధ్యానము.

అథ ఉచ్చారః / ఉచ్చారము

తత్ర ప్రాణమ్ ఉచ్చిచారయిషుః పూర్వం హృదయ ఏవ శూన్యే విశ్రామ్యతి, తతో బాహ్యే ప్రాణోదయాత్, తతోఽపి బాహ్యం ప్రతి అపానచన్ద్రపూరణేన సర్వాత్మతాం పశ్యతి, తతః అన్యనిరాకాఙ్క్షో భవతి, తతః సమానోదయాత్ సంఘట్టవిశ్రాన్తిమ్ అనుభవతి, తత ఉదానవహ్న్యుదయే మాతృమేయాదికలనా గ్రసతే । తద్గ్రాసకవహ్నిప్రశమే వ్యానోదయే సర్వావచ్ఛేదవన్ధ్యః స్ఫురతి । ఏవం శూన్యాత్ ప్రభృతి వ్యానాన్తం యా ఏతా విశ్రాన్తయః తా ఏవ నిజానన్దో, నిరానన్దః, పరానన్దో, బ్రహ్మానన్దో, మహానన్దః, చిదానన్ద ఇతి షట్ ఆనన్దభూమయ ఉపదిష్టాః, యాసామ్ ఏకః అనుసంధాతా ఉదయాస్తమయవిహీనః అన్తర్విశ్రాన్తి పరమార్థరూపో జగదానన్దః ।

ప్రాణమును ఉచ్చారము గావించే పూర్వము హృదయపు శూన్యతలో దానిని విశ్రాంతిగా ఉంచాలి. అప్పుడు బాహ్యంలో ప్రాణోదయమౌతుంది. అక్కడకూడా బాహ్యంలోని అపానమును చంద్రునిద్వారా పూరించడంచేత సర్వాత్మను వీక్షిస్తాడు. అప్పుడు అన్యమును ఆకాంక్షించడు. సమానముదయించడం వల్ల సంఘట్టవిశ్రాంతిని అనుభవిస్తాడు. ఉదానాగ్ని ఉదయించడంతో మాతృమేయాది కలన గ్రసించబడుతుంది. ఆ గ్రాసకాగ్ని ప్రశమించడంతో వ్యానముదయించగా అన్ని ఆచ్ఛాదనములూ తొలగిపోతాయి. ఈ విధముగా శూన్యము మొదలుకొని వ్యానమువరకూ ఏ విశ్రాంతులైతే ఉన్నాయో అవి నిజానందము, నిరానందము, పరానందము, బ్రహ్మానందము, మహానందము, చిదానందములనబడే ఆరు ఆనందభూములని ఉపదేశము. వీటిని ఏకముగా అనుసంధానిస్తున్నది ఉదయాస్తమయవిహీనమైన, అంతర్విశ్రాంతి పరమార్థరూపమైన జగదానందము.

తత్ ఏతాసు ఉచ్చారభూమిషు ప్రత్యేకం ద్వ్యాదిశః సర్వశో వా విశ్రామ్య అన్యత్ తద్దేహప్రాణాద్యతిరిక్తం విశ్రాన్తితత్త్వమ్ ఆసాదయతి । తదేవ సృష్టిసంహారబీజోచ్చారణరహస్యమ్ అనుసందధత్ వికల్పం సంస్కుర్యాత్, ఆసు చ విశ్రాన్తిషు ప్రత్యేకం పఞ్చ అవస్థా భవన్తి ప్రవేశతారతమ్యాత్ । తత్ర ప్రాగానన్దః పూర్ణతాంశస్పర్శాత్, తత ఉద్భవః క్షణం నిఃశరీరతాయాం రూఢేః, తతః కమ్పః స్వబలాక్రాన్తౌ దేహతాదాత్మ్యశైథిల్యాత్, తతో స్వబలాక్రాన్తౌ దేహతాదాత్మ్యశైథిల్యాత్, తతో నిద్రా బహిర్ముఖత్వవిలయాత్ । ఇత్థమ్ అనాత్మని ఆత్మభావే లీనే స్వాత్మనః సర్వమయత్వాత్ ఆత్మని అనాత్మభావో విలీయతే ఇతి, అతో ఘూర్ణిః మహావ్యాప్త్యుదయాత్ ।

ఈ ఉచ్చారభూములలో, ప్రత్యేకముగా రెండురెండుగా గాని, మొత్తముగా గాని, విశ్రాంతి అనుభవమైతే, దేహప్రాణములకు భిన్నమైన విశ్రాంతితత్త్వము అనుభూతమౌతుంది. అదియే సృష్టి సంహారణబీజముల రహస్యము, దానిని అనుసంధానం గావిస్తూ వికల్పమును సంస్కరించాలి. ప్రవేశములలోని తారతమ్యభేదములవలన ఈ విశ్రాంతులకు ఐదు అవస్థలు ఉంటాయి. వానిలో ప్రాగానందము పూర్ణతాంశ స్పర్శను కలిగి ఉంటుంది. దాని ఉద్భవక్షణంలో శరీరస్పృహ రూఢిగా పోతుంది. అప్పుడు కంపం కలుగుతుంది. దాని బలంవల్ల దేహతాదాత్మ్యత శిథిలమౌతుంది. అప్పుడు బహిర్ముఖత్వం విలయమైపోగా నిద్ర కలుగుతుంది. అప్పుడు అనాత్మభావములన్నీ ఆత్మలోను, ఆత్మభావం అనాత్మలలోను లీనములౌతాయి. అట్లా కావడంచేత, స్వాత్మ సర్వమయమౌతుంది. అప్పుడు మహావ్యాప్తి ఉదయించడంచేత ఘూర్ణి కలుగుతుంది.

తా ఏతా జాగ్రదాదిభూమయః తుర్యాతీతాన్తాః । ఏతాశ్చ భూమయః త్రికోణ-కన్ద-హృత్తాల్వూర్ధ్వకుణ్డలినీచక్ర-ప్రవేశే భవన్తి । ఏవమ్ ఉచ్చారవిశ్రాన్తౌ యత్ పరం స్పన్దనం గలితాశేషవేద్యం, యచ్చ ఉన్మిషద్వేద్యం, యచ్చ ఉన్మిషితవేద్యం, తదేవ లిఙ్గత్రయమ్ ఇతి వక్ష్యామః స్వావసరే । పరం చాత్ర లిఙ్గం యోగినీహృదయమ్ । తత్ర ముఖ్యా స్పన్దనరూపతా సంకోచవికాసాత్మతయా యామలరూపతోదయేన విసర్గకలావిశ్రాన్తిలాభాత్ ఇత్యలమ్ । అప్రకాశః అత్ర అనుప్రవేశః ।

ఇవన్నీ, తుర్యాతీతమే అంతమైన జాగృదాది భూములు. ఈ భూములన్నీ త్రికోణము, కందము, హృదయము, తాలువు, ఊర్ధ్వకుండలిని మొదలగు చక్రములలో ప్రవేశించడం వల్ల కలుగుతాయి. ఈ ఉచ్చారవిశ్రాంతులలో ఏ పరస్పందనమైతే *గలితాశేష* వేద్యమౌతుందో, ఏది ఉన్మిష వేద్యమౌతుందో, ఏది ఉన్మిషిత వేద్యమౌతుందో, ఇదే లింగత్రయము. అవసరమును బట్టి ముమ్ముందు వివరిస్తాను. దీనికి పరమైనది యోగినీహృదయము. వీనిలో స్పందనరూపమే ముఖ్యమైనది. దానిలో సంకోచవికాసాత్మత వల్ల యామలరూపం ఉదయించడంతో, విసర్గకళారూపమైన విశ్రాంతి ప్రాప్తమౌతుంది. దానిలో ప్రవేశించే విధానము చెప్పరానిది.

శ్లో॥ పూర్వం స్వబోధే తదను ప్రమేయే విశ్రమ్య మేయం పరిపూరయేత ।
పూర్ణేఽత్ర విశ్రామ్యతి మాతృమేయ-విభాగమాశ్వేవ స సంహరేత ॥

ముందు స్వబోధరూపమై, తదుపరి ప్రమేయమందు విశ్రాంతిని గైకొని, మేయమును పూరిస్తున్నది. పూర్ణమునందు విశ్రాంతమై మాతృమేయాది విభాగములను శీఘ్రమే సంహరిస్తున్నది.

శ్లో॥ వ్యాప్త్యాథ విశ్రామ్యతి తా ఇమాః స్యుః శూన్యేన సాకం షడుపాయభూమ్యః ।
ప్రాణాదయో వ్యాననపశ్చిమాస్త-ల్లీనశ్చ జాగ్రత్ప్రభృతి ప్రపఞ్చః ॥

వ్యాప్తి మొదలైన విశ్రామములేవైతే ఉన్నాయో అవి శూన్యముతో కలిపి ఆరు ఉపాయభూములుగా ఉన్నాయి. ప్రాణము మొదలుకొని వ్యానముయొక్క అంతమువరకూ ఉన్నవాటిలోనే జాగ్రత్ మొదలైన ప్రపంచమంతా ఉన్నది.

శ్లో॥ అభ్యాసనిష్ఠోఽత్ర తు సృష్టిసంహృతద్-
విమర్శధామన్యచిరేణ రోహేత్ ।

వీనిలో అభ్యాసనిష్ఠుడైనవాడు సృష్టిసంహారము మొదలైన విమర్శధామములను అచిరములోనే అధిరోహిస్తాడు.

ఇతి ఆన్తరశ్లోకాః । ఇతి ఉచ్చారణమ్ ।

ఇవి అంతరశ్లోకములు. ఇది ఉచ్చారణము.

అథ సూక్ష్మప్రాణాత్మా వర్ణః ।

ఇప్పుడు సూక్ష్మ ప్రాణాత్మ వర్ణనము.

అస్మిన్ ఏవ ఉచ్చారే స్ఫురన్ అవ్యక్తానుకృతిప్రాయో ధ్వనిః వర్ణః, తస్య సృష్టిసంహారబీజే ముఖ్యం రూపం, తదభ్యాసాత్ పరసంవిత్తిలాభః, తథాహి-కాదౌ మాన్తే సాచ్కే అనచ్కే వా అన్తరుచ్చారితే స్మృతే వా సమవిశిష్టః సంవిత్స్పన్దస్పర్శః సమయానపేక్షిత్వాత్ పరిపూర్ణః, సమయాపేక్షిణోఽపి శబ్దాః తదర్థభావకా మనోరాజ్యాదివత్, అనుత్తరసంవిత్స్ఫుర్యాత్ ఏకీకృతహృత్కణ్ఠోష్ఠో ద్వాదశాన్తద్వయం హృదయం చ ఏకీకుర్యాత్ ఇతి వర్ణరహస్యమ్ । అన్తఃస్ఫురద్విమర్శానన్తర సముద్భూతం సితపీతాద్యాన్తరం వర్ణమ్ ఉద్భావ్యమానం సంవిదమ్ అనుభావయతి ఇతి కేచిత్ ।

ఈ ఉచ్చారములో స్ఫురించే అవ్యక్తానుకృతి ప్రాయమైన ధ్వనియే వర్ణము. సృష్టి సంహార బీజములే దానియొక్క ముఖ్యరూపములు. వాని అభ్యాసం వల్ల పరసంవిత్ లభిస్తుంది. వాటిని కాదినుంచి మాంతము వరకూ, అచ్చులతో గాని, లేకుండా గాని, లోలోపల ఉచ్చరించినా, స్మరించినా, సమానమైన శక్తితో సంవిత్ స్పందస్పర్శను కలిగిస్తాయి. సమయము లేకున్నప్పటికీ అవి పరిపూర్ణములే. సమయముతో కలసి ఉన్నవైనా, శబ్దములు వాని అర్థముల భావములను మనోరాజ్యములోనే కదా కల్పిస్తాయి. అనుత్తర సంవిత్ స్పర్శవలన హృదయము, కంఠము, ఓష్ఠములు ఏకమవ్వడము, ద్వాదశాంతద్వయము హృదయములు ఏకమవ్వడమే వర్ణరహస్యము. లోలోపల స్ఫురించిన విమర్శానంతర సముద్భూతములైన శ్వేత, పీత వర్ణములను ధ్యానించడం ద్వారా సంవిత్తును అందుకోవాలని మరికొందరంటారు.

శ్లో॥ వాచ్యవిరహేణ సంవిత్ స్పన్దాదిన్ద్వర్కగతినిరోధాభ్యామ్ ।
యస్య తు సమసంప్రవేశాత్ పూర్ణా చిద్బీజపిణ్డవర్ణవిధౌ ॥

ఇంద్వర్కగతి నిరోధాభ్యాసం వల్ల, వాచ్యము కానట్టి సంవిత్ స్పందమును పొందుతూ, ఎవడైతే చక్కగా దీనిలో ప్రవేశిస్తాడో, వాడు చిత్, బీజము, పిండవర్ణముల విధులలో పూర్ణుడౌతున్నాడు.

ఇతి అన్తరశ్లోకః । ఇతి వర్ణవిధిః । కరణం తు ముద్రాప్రకాశనే వక్ష్యామః!

ఇది అంతర శ్లోకము. ఇది వర్ణవిధి. కరణమును ముద్రాప్రకాశన ప్రకరణములో వివరిస్తాను.

శ్లో॥ వికల్పః కస్యాపి స్వయమనుపయన్పూర్ణమయతా-
ముపాయాత్సంస్కారం వ్రజతి స ఉపాయోఽత్ర బహుధా ।
ధియి ప్రాణే దేహే తదను బహిరిత్యాణవతయా
స నిర్ణీతో నైషాం పరఫలవిధౌ కాపి హి భిదా ॥

కొందరికి వికల్పము స్వయముగా, ఉపాయములేకుండా, పూర్ణమౌతుంది. కొందరికి ఉపాయమువల్ల సంస్కరింపబడుతుంది. బుద్ధి, ప్రాణము, దేహము, బాహ్యవిషయముల రూపములలో ఆ ఉపాయములు చాలా ఉన్నాయి. అవి నిర్ణీతములై ఇట్లే ఉండాలని చెప్పలేము. అవి ఎట్లున్నప్పటికీ, పరఫలమును పొందినపిదప వాటిలో భేదమేముంటుంది?

వ్యాఖ్యానము

శాక్తోపాయము - ఆణవోపాయముల పోలిక

ఇంతకు ముందటి అధ్యాయములో చెప్పబడిన విధముగా - ఏ విధమైన బయటి ఉపాయమూ అవసరము లేకుండా, సాధకుని మనస్సు తనసుతాను సంస్కరించుకోగలిగినప్పుడు, శుద్ధభావముల అభ్యాసముతో అశుద్ధభావములను తనంతట తాను పోగొట్టుకోగలిగినప్పుడు, పశువుగా మాయకు బద్ధుడై ఉన్నస్థితి నుండి విముక్తిని పొంది, శుద్ధవిద్యానుగ్రహంతో పరమేశ్వరశక్తిగా మారి, ఆ శక్తినే ఉపాయంగా మలచుకుని, శాక్తజ్ఞానం ద్వారా పరమశివానుభవమును పొందుతుంది. అది శాక్తోపాయము. దాని వివరమంతా ముందటి అధ్యాయంలో వివరించబడింది కదా !

దానికి తగినంత మానసికపరిపక్వత లేకపోవడం వల్ల, శాక్తోపాయమును సాధించలేకపోతే, అటువంటి సాధకునికి, అంతకంటే తక్కువస్థాయికి చెందిన ఉపాయం అవసరమౌతుంది. అప్పుడు బుద్ధి, ప్రాణము, దేహము, లేదా ఒక వస్తువు మొదలైన పరిమిత ఆకారములను ఉపాయములుగా తీసుకుని సాధన చేయగా తనను తాను తగ్గించుకుంటున్నాడు గనుక, అణువుగా మారుతున్నాడు గనుక, అణవజ్ఞానము కలుగుతుంది. ఆ విధంగా ఈ స్థాయిలోని సాధకులకు మనస్సు ధ్యానాత్మకమౌతుంది. కనుక దీనిని అణవోపాయమంటారు.

ప్రాణము, స్థూలము సూక్ష్మమని రెండు విధములు. స్థూలప్రాణము సూక్ష్మప్రాణముగా మారనిదే మనస్సు ధ్యానస్థితిలో నిలకడను పొందదు. వీటిలో స్థూలప్రాణము ఉచ్చారణాత్మగా ఉంటుంది. ఉచ్చారణమంటే పంచప్రాణముల వృత్తులు. అవి - ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములు. వాటి కదలికలుగా, స్థూలమైన ప్రాణసంచారం దేహంలో సాగుతుంది. సూక్ష్మప్రాణము, బీజాక్షరముల శబ్దస్వరూపమై ఉంటుంది. ఇవన్నీ దేహంలోనే జరుగుతాయి గనుక, సాధనారంగం దేహమే అవుతుంది. కనుక అదికూడా ఒక సాధనమే. ఇకపోతే, కలశము మొదలైన వస్తువులు బాహ్యంగా ఉపయోగపడే సాధనములు. కలశము, పూజావేదిక, శివలింగము మొదలైనవి బాహ్యమైన ఉపాయములని చెప్పబడుచున్నవి.

మొదటగా, ధ్యానము ఉపదేశింపబడుచున్నది

ఇప్పటివరకూ ఏ పరమశివతత్త్వమైతే, స్వయంప్రకాశమని, సృష్టిలోని అన్ని తత్త్వములలో అంతర్యామిగా ఉన్నదని చెప్పబడినదో, దానిని తన హృదయములో ఉన్న చైతన్యరూపమైన ఎరుకగా ధ్యానించాలి. అక్కడనే, సూర్య, చంద్ర, అగ్నుల వెలుగులు కలసిపోతున్నట్లుగా ధ్యానించాలి. వీరిలో అగ్నిని ప్రమాత (జ్ఞాత లేదా జ్ఞానమును పొందుతున్నది) గాను, సూర్యుని ప్రమాణము (జ్ఞానము, తెలివి) గాను, చంద్రుని ప్రమేయము (జ్ఞేయము, తెలియబడుతున్న వస్తువు) గాను ధ్యానించాలి. అనగా, మన అనుభవమునకు అవసరమైన జ్ఞాత - జ్ఞానము - జ్ఞేయములు మూడూ తన హృదయములో కలసిపోయి ఒక్కటిగా అయిపోతున్నట్లుగా ధ్యానించాలి. దీనిని, సూటిగా చేయలేనివారు, ఏదో ఒక రూపము యొక్క ఆధారము కావలసినవారు, సూర్య, చంద్ర, అగ్నులను ధ్యానిస్తూ, ఆ మూడూ తన హృదయంలో ఒక్కటిగా కలసిపోయి, ఒక పెద్ద వెలుగుగా మారినట్లు ధ్యానించాలి. దాని పేరు మహాభైరవాగ్ని. అనగా, భైరవశివుని స్వరూపమని అర్థం. ఆ వెలుగు ఒక చక్రంలాగా వెలుగుతున్నట్లు, దానిచుట్టూ ఇంతకు ముందు చెప్పబడిన పన్నెండుగురు కాళికాశక్తులు ఆవరించి ఉన్నట్లు ధ్యానించాలి. అవి, సృష్టి, స్థితి, లయము, అనాఖ్య (తురీయము, పేరులేనిది) ములని చెప్పబడతాయి. అవి ఈ క్రింద చూపిన పన్నెండు విధములుగా ఉంటాయి.

సృష్టి - సృష్టి	సృష్టి- స్థితి	సృష్టి - సంహారము	సృష్టి - అనాఖ్యము
స్థితి - సృష్టి	స్థితి - స్థితి	స్థితి - సంహారము	స్థితి - అనాఖ్యము
సంహారము - సృష్టి	సంహారము - స్థితి	సంహారము - సంహారము	సంహారము - అనాఖ్యము

జ్ఞేయము - జ్ఞేయము	జ్ఞేయము - జ్ఞానము	జ్ఞేయము - జ్ఞాత	జ్ఞేయము - అనాఖ్యము
జ్ఞానము - జ్ఞేయము	జ్ఞానము - జ్ఞానము	జ్ఞానము - జ్ఞాత	జ్ఞానము - అనాఖ్యము
జ్ఞాత - జ్ఞేయము	జ్ఞాత - జ్ఞానము	జ్ఞాత - జ్ఞాత	జ్ఞాత - అనాఖ్యము

జాగ్రత్ - జాగ్రత్	జాగ్రత్ - స్వప్న	జాగ్రత్ - సుషుప్తి	జాగ్రత్ - తురీయ
స్వప్న - జాగ్రత్	స్వప్న - స్వప్న	స్వప్న - సుషుప్తి	స్వప్న - తురీయ
సుషుప్తి - జాగ్రత్	సుషుప్తి - స్వప్న	సుషుప్తి - సుషుప్తి	సుషుప్తి - తురీయ

అంటే, సృష్టిలో - సృష్టి, స్థితి, లయము, అనాఖ్యము నాలుగు నడుస్తూ ఉంటాయి. అదే విధంగా స్థితిలోను, సంహారములోను కూడా నడుస్తూ ఉంటాయి. ఈ విధముగా ఈ శక్తులు పన్నెండౌతాయి. వీరి గురించి ఇంతకు ముందు వివరించారు కదా !

ఈ పన్నెండుగురు శక్తులు పన్నెండు అగ్నిజ్వాలల రూపంలో, ఈ మహాభైరవాగ్నిని ఆవరించి ఉన్నట్లు ధ్యానిస్తూ, ఇవి కన్ను, ముక్కు, మొదలైన అయిదు జ్ఞానేంద్రియములు, చేతులు, కాళ్ళు మొదలైన అయిదు కర్మేంద్రియములు, మనస్సు, బుద్ధి - ఈ పన్నెండు వాకిళ్ళ ద్వారా బయట ప్రపంచం లోకి వెలుగులుగా ప్రసరిస్తూ, వస్తువుల పైన పడుతున్నట్లుగా ధ్యానించాలి.

ఈ వెలుగులో చంద్ర, సూర్య, అగ్నులనబడే మూడు కాంతులున్నాయి కదా ! కనుక, అది వస్తువులపైన పడినప్పుడు, మొదటగా చంద్రకాంతి రూపంలో ఆయా వస్తువులు సృష్టి చేయబడి, సూర్యకాంతి ద్వారా పోషింపబడి, అగ్నితేజస్సు ద్వారా దహింపబడి, అనాఖ్యపు ఎరుక ద్వారా అనుత్తర పరమశివస్వరూపంగా మారుతున్నాయని ధ్యానించాలి. ఈ విధంగా ధ్యానించినప్పుడు, ధ్యానికి తన ఇంద్రియముల ద్వారా అనుభూతిలోకి వస్తున్న సమస్తమూ, సృష్టి, స్థితి, లయ, అనాఖ్య శక్తులతో పరిపూర్ణమై, పరమశివస్వరూపంగా అనుభవమౌతుంది. ఇంతవరకూ సృష్టిని వివిధ వస్తువులుగా, జీవులుగా చూస్తున్న దృష్టి మాయమై, అంతటినీ పరమశివస్వరూపంగా చూచే దృష్టి కలుగుతుంది. దీనినే 'శివదృష్టి' 'జ్ఞానదృష్టి' అంటారు. పరమశివుని దృష్టి పడినప్పుడు ఆ వస్తువు భస్మమౌతుంది. అదే విధంగా, ఈ దృష్టితో చూచినప్పుడు, ఆయా వస్తువుల పట్లా, జీవులపట్లా, రాగద్వేషముల రూపంలో మనలో ఉన్న 'మాయ' లేదా 'అవిద్య' భస్మమౌతుంది.

ఈ విధంగా ఇంద్రియగోచరమౌతున్న సమస్త భౌతిక ప్రపంచమూ, ఈశ్వరీకరించబడిన తరువాత, ఆ భౌతికరూపముల సూక్ష్మ వాసనలను కూడా, అనగా, వాటిగురించి తన మనస్సులో ఉన్న సంస్కారములను కూడా ఇదే భైరవాగ్నిలో కాల్చి భస్మం చేయాలి. చిత్తపు లోతులలో ఉన్న సంస్కారములను నాశనం చేసే

మార్గం ఇదే.

ఈ విధంగా తెంపులేకుండా నిత్యమూ ధ్యానించే యోగికి ఏమి జరుగుతుంది? సృష్టి స్థితి లయములను చేస్తున్నట్టి, అడ్డులేని స్వాతంత్య్రరూపంలో ఉన్న పరతత్త్వము అనుభూతిలోకి వస్తుంది. తాంత్రికపరిభాషలో దానినే భైరవభావమని పిలుస్తారు. ఈ భైరవభావంలో నిరంతరం నిలచి ఉండటం వల్ల, సమస్తములైన సిద్ధులు ఆ యోగికి వాటంతట అవే కలుగుతాయి. పరభైరవునికి లేని సిద్ధులు శక్తులు ఏమున్నాయి? పన్నెండు కాళికాశక్తులు తనను ఆవరించిన వెలుగులని, తానే పరభైరవుడనని ధ్యానించే యోగికి సిద్ధుల కొరత ఏముంటుంది?

దీనినే సంగ్రహరూపంలో వివరిస్తున్నారు.

ప్రమాత(జ్ఞాత, లయము) - ప్రమాణ(జ్ఞానము, స్థితి) - ప్రమేయ(జ్ఞేయము, సృష్టి)ములు మూడుగా తనంతట తానుగా వెలుగుతున్న ఆత్మ ఏదైతే ఉన్నదో, దానిని తన హృదయంలోని ఆనందపు వెలుగుగా, యోగియైనవాడు నిత్యమూ ధ్యానించాలి.

పైన వివరించినట్లుగా, సృష్టి, స్థితి, లయము, అనాఖ్యముల కలయికలతో ఏర్పడిన పన్నెండుగురు మహాశక్తుల కాంతిచక్రము యొక్క మధ్యలో ఉంటూ, వాటియొక్క అధిపతియైన ఈశ్వరుని, తన హృదయంలో నుంచి బయట శూన్యంలోకి ప్రసరిస్తున్న వెలుగుగా భావిస్తూ ధ్యానించాలి.

ఈ వెలుగు ఏయే వస్తువుల పైన, వ్యక్తులపైనా పడుతున్నదో, అనగా, తనకు ఏయే వస్తువులు, జీవులు మొదలైనవి తన ఇంద్రియముల ద్వారా తెలియబడుతున్నాయో, అవి యన్నీ, తన యొక్క ఆత్మలోనే ఉన్నాయని, తన ఆత్మస్వరూపములే అవి యని, తన వెలుగుతోనే అవి వెలుగుతున్నాయన్న భావనలో నిలచి, యోగియైనవాడు స్థిరంగా ధ్యానించాలి. దీనివలన, ఆ యోగికి, లోపలా బయటా కూడా, ఆత్మదీప్తి నిండుతుంది.

ఇప్పుడు ఉచ్చారము (పంచప్రాణ రహస్యము) వివరించబడుచున్నది

సూటిగా మనస్సును నియమించి ధ్యానమును చేయగలగడం ఉత్తమపద్ధతి. అది చేయగలిగిన వారికి, ధ్యానవిధానమును ముందుగా ఉపదేశించిన తదుపరి, అలా చేయలేనివారికోసం, ప్రాణాయామమును ఉపదేశిస్తున్నారు.

ఉత్తమసాధకులకు ప్రాణాయామము యొక్క అవసరం లేదు. వారి మనస్సులు స్వచ్ఛములై, సహజముగా ఏకాగ్రములయ్యే స్థితిలో ఉంటాయి గనుక వారికి ప్రాణమును నియమించే అవసరం ఉండదు. అయితే, అంతటి స్థాయి, అందరికీ ఉండదు కాబట్టి, మధ్యమస్థాయి సాధకులకు ప్రాణాయామం అవసరమవుతుంది. అది చేసిన కాసేపు మాత్రమే వారి మనస్సు ఏకాగ్రమై నిలబడుతుంది.

ప్రాణమును ఊర్ధ్వమునకు, అక్కడనుంచి బయటకు, పంపించే ముందుగా హృదయపు శూన్యతలో దానిని విశ్రాంతిగా ఉంచాలి. తరువాత దానిని బయటకు పంపి, బాహ్యంలో ఉంచాలి. బాహ్యంలోని అపానమును చంద్రునిద్వారా పూరించడంచేత, సాధకుడు సర్వాత్మను వీక్షిస్తాడు. అప్పుడు అన్యమును

ఆకాంక్షించదు.

అనగా, సుఖపూర్వక (అనులోమ విలోమ) ప్రాణాయామమని అర్థం. యోగాభ్యాసపరులందరూ దీనిని చేస్తారు గాని, భావనాత్మకంగా చెయ్యరు. కనుకనే, ఇక్కడ చెప్పబడిన ఫలితములు వారికి లభించవు. దీనిని చెయ్యడానికి ముందుగా, హృదయమును శూన్యం చేసి, అక్కడనుంచి ప్రాణమును రేచకసహితంగా బయటకు పంపించే విధానం యోగికి తెలియాలి. ఆ తరువాత ఇడానాడి (చంద్రనాడి) ద్వారా ఊపిరిని పూరించాలి. ఈ విధముగా బయటా, లోపలా ఉన్నది ఒకే ప్రాణమన్న భావనలో యోగి స్థిరంగా ఉంటూ ఈ ప్రాణాయామమును చేయాలి. ఈ ధ్యానస్థితి చేతకానివారికి ఇది ఉత్త శ్వాసవ్యాయామమౌతుంది తప్ప, ఇక్కడ చెప్పబడిన ఫలితం మాత్రం లభించదు.

ఎప్పుడైతే అంతటా నిండియున్న ప్రాణమును తెలుసుకుంటాడో, అప్పుడు సర్వాత్మను, అనగా, అంతటా నిండియున్న ప్రాణరూపియైన ఆత్మను తెలుసుకుంటాడు. అది చాలా సుఖంగా ఉండే స్థితి. దీనిని రుచిచూచిన యోగి ఇతరములు వేటినీ కోరుకోడు.

ప్రాణాపాన వాయువులు సమానంగా మారినప్పుడే సమానవాయువు ఉదయిస్తుంది. ఈ రెంటిలో హెచ్చుతగ్గులున్నపుడు అది ఉదయించదు. సాధారణంగా, మానవులకు ప్రాణము, అపానము రెండూ సమానంగా ఎప్పుడూ ఉండవు. వాటి దీర్ఘతలోను, స్థూల, సూక్ష్మస్థితులలోను, వాటిని నడిపే విధానంలోను, మామూలు మనుషులకు అర్థం కాని తేడాలుంటాయి. వీటి రహస్యములను తెలిసి, అభ్యాసంతో దానిని సాధించిన యోగులలో మాత్రమే ఇవి అన్నివిధములుగా సమానస్థాయిలో ఉంటాయి. ఎప్పుడైతే ప్రాణము, అపానము రెండూ అన్నివిధములుగా ఒకే విధంగా నిలుస్తాయో, అప్పుడు ఆ రెండింటి చర్యలు ఆగిపోయి, సమానవాయువనే ఇంకొక వాయువు యోగి దేహంలో పనిచెయ్యడం మొదలుపెడుతుంది. ఈ సమానవాయువు ఉదయించడం వల్ల, చాలా విశ్రాంతిగా, హాయిగా, ఉండే స్థితి యోగికి అనుభవంలోకి వస్తుంది.

ఈ స్థితిలో ఉండటం బాగా అలవాటైనపుడు, అభ్యాసపరిపక్వతలో, ఉదానవాయువనేది యోగి దేహంలో ఉదయిస్తుంది. ఉదానమంటే పైకి ఎగరడమని అర్థం. అది అగ్నిలక్షణం గనుక యోగి దేహంలో విపరీతమైన అగ్ని పుడుతుంది. పతంజలిమహర్షి తన యోగసూత్రములలో 'సమానజయాత్ ప్రజ్వలనమ్' అనే సూత్రంలో దీనిని వివరిస్తూ, 'సమానవాయువును జయించడం వలన, యోగి దేహంనుంచి కాంతి వెలువడుతుంది' అంటారు. ఈ ఉదానవాయువు పుట్టడం వలన, మాతృ(జ్ఞాత), మేయ(జ్ఞేయము) మొదలైన భిన్నత్వము మాయమౌతుంది. అంటే, చూస్తున్న తనకు, చూడబడుతున్న వస్తువుకు భేదమనేది యోగికి తెలియకుండా పోతుంది. ఇదే విధంగా, మిగతా ఇంద్రియములకు కూడా జరుగుతుంది. అనగా, కర్త, కర్మ రెండూ ఒక్కటైపోతాయి. అంటే, సృష్టికి తనకు ఏ విధమైన భేదమూ లేనట్లుగా అతనికి అనిపిస్తూ ఉంటుంది. ఈ స్థితిలో ఉన్న యోగి, ఏదో అయోమయస్థితిలో ఉన్నట్లుగా, చూచేవారికి అగుపిస్తాడు.

ఈ స్థితి బాగా అలవాటైన పిదప, జ్ఞాతలో జ్ఞేయమును లయం చేసుకుంటున్న ఉదానమనే అగ్ని కూడా చల్లారడంతో, వ్యానమనే అయిదవ వాయువు యోగిలో ఉదయిస్తుంది. అప్పుడు ఆత్మకున్నట్టి అన్ని విధములైన

ముసుగులూ తొలగిపోయి, మబ్బులు వీడిన సూర్యునిలా ఆత్మతేజస్సు తనంతట తానుగా ప్రకాశిస్తుంది.

పంచకోశములే ఆత్మను కప్పిన ముసుగులు. అవి, అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములు. ఇవి అయిదు రకాలైన మేఘములనుకుంటే, వాటి వెనుకనున్న సూర్యునిలా ఆత్మజ్యోతి ఉంటుంది. వీనిలో, అన్నమయ, ప్రాణమయ కోశములు, ప్రాణాపానముల కలయికతో తొలగుతాయి. అంటే, వాటి స్పృహ యోగికి పోతుంది. సమానవాయువుతో మనోమయకోశం తొలగుతుంది. అంటే, మనస్సులో ఆలోచనలు మొత్తం శాంతిస్తాయి. ఉదానవాయువుతో విజ్ఞానమయకోశం ప్రక్కకు తప్పుకుంటుంది. అంటే, 'తాను వేరు, ఇంద్రియములతో తనకు అనుభూతిలోకి వస్తున్న ప్రపంచం వేరు' అనిన విజ్ఞానపూరితమైన ద్వంద్వభావన నశిస్తుంది. అప్పుడు, నిష్కారణమైన ఆనందం ఒక్కటే ఎప్పుడూ అతనిలో ఉబుకుతూ ఉంటుంది. ఇది ఆనందమయకోశ లక్షణం. వ్యానవాయువు ఉదయించడంతో ఈ ఆనందమయకోశం కూడా తొలగిపోతుంది. ఈ విధంగా, పంచవాయువుల సాధన, పంచకోశములను అడ్డు తప్పిస్తుంది. 'ఆత్మసాక్షాత్కారం' అంటూ మనం తేలికమాటలలో అనుకునే స్థితి, అప్పటికి మాత్రమే యోగికి అందుబాటులోకి వస్తుంది.

ఈ ప్రక్రియ మొత్తమూ, 'హృదయంలో ఉన్న శూన్యం' నుంచి మొదలుపెట్టబడి, వ్యానవాయువు ఉదయించడంతో ముగిసింది. ఈ విధముగా, శూన్యము, పంచవాయువులు కలసి, ఆరు విధములైన విశ్రాంతులతో నిండిన స్థితులు యోగికి అనుభవములౌతాయి. వాటి పేర్లు వరుసగా - నిజానందము, నిరానందము, పరానందము, బ్రహ్మానందము, మహానందము, చిదానందములనబడతాయి. ఇవి ఆనందభూములు. అనగా, ఈ స్థితులలో ఉన్నపుడు చాలా హాయిగా అనిపిస్తుంది.

నిజానందము	హృదయస్థితి	శూన్యత్వము
నిరానందము	ప్రాణాపానముల ఏకత్వము	సర్వవ్యాపి ప్రాణస్థితి
పరానందము	సమానవాయువు	వస్తువుల సమత్వము
బ్రహ్మానందము	ఉదానవాయువు	ద్వైతనిర్మూలనము
మహానందము	వ్యానవాయువు	నిష్కారణానందము
చిదానందము	వ్యానము శాంతించడం	ఆత్మస్థితి

ఈ ఆరు ఆనందభూమికలను వివరించవలసి యున్నది.

నిజానందము

ప్రాణము ఉదయించడానికి పూర్వము, హృదయంలో స్థిరంగా ఉంటుంది. అప్పుడు హృదయం శూన్యంగా ఉంటుంది. దానిలో ఎటువంటి కదలిక కూడా ఉండదు. అది తనదే అయినప్పటికీ శూన్యస్థితి. అప్పటికి, యోగికి ఇంకా చైతన్యము అనుభవంలో ఉండదు. ఆత్మచైతన్యమూ ఉండదు. అనంతచైతన్యమూ ఉండదు. ఉత్త శూన్యత మాత్రమే అనుభవంలో ఉంటుంది. దీనినే చాలామంది 'బ్రహ్మానుభూతి' అనుకుంటూ పొరపడుతూ ఉంటారు. ఇది చాలా ప్రాథమికస్థాయి మాత్రమే.

నిరానందము

ఈ శూన్యస్థితిలోనుండి ప్రాణాపానముల చలనం వలన, బయటి ప్రపంచం అనుభవం లోకి వస్తూ ఉంటుంది. అప్పుడు ఈ నిజానందము మాయమై నిరానందం కలుగుతుంది. అంటే, అంతకు ముందున్న ఆనందస్థితి మాయమై పోతుంది. కనుక ఇది నిరానందము (ఆనందపు లేమి) అనబడుతుంది.

పరానందము

సమానవాయువు ఉదయించడం చేత, ఇంద్రియముల ద్వారా అనుభూతిలోకి వస్తున్న సమస్త వస్తువులూ సమానములుగా యోగికి అనుభూతి కలుగుతుంది. అనగా, ఒకదానికి, ఇంకొకదానికి మధ్యనున్న భేదం, యోగికి అగుపించదు. ఇది సమత్వ స్థితి. కనుక దీనిని 'పరానందము' అంటారు. దీనిని కూడా బ్రహ్మానుభూతిగా భ్రమించే అవకాశం ఉన్నది. చాలామంది దీనినే సాధనామార్గంలో సర్వోత్తమస్థాయి అనుకుంటూ ఉంటారు. కానీ కాదు.

బ్రహ్మానందము

గోచరమౌతున్న చరాచరప్రపంచం మొత్తమూ, తనకంటే భిన్నం కాదని, జ్ఞాతకూ జ్ఞేయమునకూ భేదము లేదన్న అనుభూతి ఈ స్థాయిలో కలుగుతుంది. ద్వైతభావన మాయమౌతుంది గనుక, దీనిని బ్రహ్మానందమని అంటారు. కానీ ఇది కూడా సర్వాతీతస్థితి కాదు. ఎందుకంటే, ద్వైతం మాయం కావడమనే కారణం దీని వెనుక ఉన్నది గనుక. ఏ కారణం పైనైనా ఆధారపడి ఉన్నది సర్వోత్తమస్థితి కాబోదు.

మహానందము

తనవరకే పరిమితమైన బ్రహ్మానందము, ఈ స్థితిలో సర్వవ్యాపకమౌతుంది గనుక మహానందమనబడుతుంది. 'మహా' అనగా అనంతమని అర్థం. వ్యాపకత్వము అనేదానిపైన ఆధారపడి యున్నది గనుక, ఈ ఆనందము కూడా అత్యుత్తమం కాదు.

చిదానందము

జ్ఞాతకూ, జ్ఞేయమునకూ భేదము లేకుండా, అంతరికమూ బాహ్యమూ అనిన భేదము లేకుండా, పరిమితము, అపరిమితమానిన భేదము లేకుండా, అన్ని ఆధారములకూ అతీతమై, కేవలము 'చిత్' తో నిండియున్న ఆనందస్థితి ఇది. కనుక చిదానందమని చెప్పబడుతుంది. ఇది అన్నింటికీ అతీతమై, అదే సమయంలో అన్నింటిలోనూ ఉంటూ, ఏ ఆధారమూ లేకుండా ఉన్నప్పటికీ, అన్నింటికీ ఆధారమై ఉండే స్థితి. కనుక ఇది అత్యున్నతమైన ఆనందస్థితి.

ఈ ఆరు ఆనందభూములలోను, దండలో దారంలాగా అంతస్సూత్రంగా ఉంటూ, వీటినన్నింటినీ ఒక్కటిగా కలిపి ఉంచుతున్నదేమిటి? అది, ఉదయము, అస్తమయములంటూ లేనట్టి, అంతరికవిశ్రాంతి యైన జగదానందము. దీనికి ఈ ఆరు భూమికలవలె ఒకప్పుడు ఉదయించడము, మరొకప్పుడు అస్తమించడము ఉండవు. ఇది పరమేశ్వర స్వరూపము. ఈ ఆనందభూములలో, ఉచ్ఛ్వాస నిశ్వాసములలో గాని, లేదా

కుంభకసమయంలో గాని, ఆయా విశ్రాంతులు యోగికి అనుభవమైతే, అప్పుడతనికి అంతవరకూ తెలియనట్టి, దేహప్రాణములకు విభిన్నమైనట్టి, విశ్రాంతితత్త్వము గ్రహింపులోకి వస్తుంది. అంతవరకూ అతనికి దేహము, ప్రాణము అనబడే రెండు స్థితులలోనే 'విశ్రాంతి' అనేది తెలిసి ఉంటుంది. కానీ, ఇప్పుడు, వాటికి అతీతమైన 'విశ్రాంతి స్థితులు' తెలియవస్తాయి. అదియే సృష్టి సంహార బీజముల రహస్యము.

సృష్టి - సంహార బీజములు

సృష్టి బీజమంటే 'స' కారము, సంహారబీజమంటే 'హ' కారము. పరమశివుని నుండి బయటకు సృష్టి ఉదయించింది. అదే విధంగా, ఆ యోగి తననుండి, ఊపిరిని బయటకు వదలడం సృష్టి అవుతుంది. అంటే, నిశ్వాసము (ఊపిరిని వదలడం), 'సో' అనిన శబ్దంతో అనుసంధానమౌతుంది. సంహారమంటే, సృష్టి మొత్తాన్నీ పరమశివుడు తనలోకి ఉపసంహరించుకోవడం. దీనికి సూచికగా, బయటనున్న గాలిని యోగి తనలోనికి పీల్చుకుంటాడు. అంటే, ఉచ్ఛ్వాసము (ఊపిరిని పీల్చుకోవడం), 'హం' అనిన శబ్దంతో అనుసంధానమౌతుంది. వెరసి ఇది, 'సోహం' అనిన హంసమంత్ర జపమౌతుంది. కొన్ని తంత్రసాంప్రదాయములలో దీనిని 'అహమ్' అనికూడా ఉపయోగిస్తారు. ఎందుకనగా, ఇంతకుముందు వివరించినట్లు, 'అ' అన్నది సృష్టిప్రారంభము, 'హ' అన్నది దాని చివర, 'మ్' అన్నది అంతము లేదా లీనము గనుక 'అహమ్' అన్నది సృష్టి సంహారబీజముల కలయికతో కూడిన మహామంత్రమౌతుంది. 'సోహం' మంత్రములో కూడా 'అహమ్' అనిన మంత్రము అంతర్భాగంగా ఉన్నది. శుద్ధవిద్య యైన 'స' కారం ఒక్కటే, దానికి అధికంగా కలుస్తుంది.

ఈ సహజమంత్రము, మన ప్రయత్నంతో సంబంధం లేకుండా ప్రాణమున్నంత వరకూ, ప్రతిమనిషిలోనూ నిరంతరం జరుగుతూనే ఉంటుంది గనుక, దీనిని అజపా జపమంటారు. అంటే, జపం కాని జపమని, మనం చెయ్యకుండా దానంతట అదే జరిగే జపమని అర్థం. ఈ 'సోహం' మంత్రమును లేదా 'అహమ్' మంత్రమును ఉచ్ఛ్వాస నిశ్వాసములతో అనుసంధానం గావిస్తూ, తన ఆలోచనలను యోగియైనవాడు సంస్కరించుకోవాలి.

ధ్యానపూర్వకమైన ప్రాణాయామము ఆధ్యాత్మికమైన ఉత్తమ ఫలితములనిస్తుంది. అది కాకుండా, ఊరకే ఊపిరిని పీలుస్తూ వదులుతూ చేసే అధమప్రాణాయామము, ఉత్త ఆరోగ్యాన్ని మాత్రమే ఇస్తుంది, అదికూడా సరిగా చేయబడితే మాత్రమే. అందుకనే, 'భావనాత్మకము కాని ప్రాణాయామమును చేసేవాడికీ కమ్మరి కొలిమితిత్తికీ తేడా లేద' ని ఆదిశంకరులన్నారు.

పంచ స్థితులు

ఈ విశ్రాంతులు తనలో ఉదయిస్తున్న సమయంలో, యోగికి కొన్ని సూచకలక్షణములు కనిపిస్తాయి. వాటినే అయిదు అవస్థలంటారు. అవి, ప్రాగానందము, ఉద్భవము, కంపము, నిద్ర, ఘూర్ణి అనబడతాయి. వీటిని వివరిస్తున్నారు.

ప్రాగానందము

వానిలో, ప్రాగానందము (మొదటగా ఉదయించే ఆనందము) పూర్ణతాంశ స్పర్శను కలిగి ఉంటుంది. పరమశివుడే పరిపూర్ణుడు. ఆయన యొక్క అంశ, శుద్ధమైన జీవాత్మ ఆ ఆత్మయొక్క స్పర్శ, ప్రాగానందంలో ఉంటుంది. అంటే, ఈ పంచప్రాణసాధన మొదటిలో కలిగే ఆనందంలో ఆత్మయొక్క ఛాయ ఉంటుంది. అందుకే, చాలామంది దీనిని చిదానందముగా భావించి పొరపాటు పడుతూ ఉంటారు.

ఉద్భవము

ఈ ఆనందము ఉదయిస్తున్న సమయంలో, దానిలోనే స్థిరంగా ఉండగలిగితే, శరీరస్పృహ తప్పకుండా పోతుంది. ఈ స్థితి మొదటిలోనే రాదు. నిరంతరమైన అభ్యాసంతో దీనిని సాధించాలి. చాలామందికి, దీనిని సాధించడానికే ఏళ్లకేళ్లు పడుతుంది. మొదటిలో ఈ స్థితి ఒక్క క్షణంపాటు మాత్రమే ఉంటుంది. అభ్యాసం చెయ్యగా చెయ్యగా, దీనిలో స్థిరత్వం కలుగుతుంది. ఎక్కువసేపు దానిలో ఉండగలగడం అలవాటౌతుంది. దానిని 'ఉద్భవం' అంటారు.

కంపము

అప్పుడు ఒక కుదుపు వంటిది దేహంలో కలుగుతుంది. దీనిని 'కంపము' అంటారు. ప్రాణరూపిణియైన కుండలిని, సుషుమ్నలో ప్రవేశించే సమయంలో ఈ కుదుపు కలుగుతుంది. రాకెట్టు ఆకాశంలోకి లేచేముందు కలిగేటటువంటి ప్రేలుడు లాగా ఇది యోగికి తన శరీరంలో అనుభూతమౌతుంది. దానిలో స్థిరంగా ఉండటం అలవాటు అయ్యేకొద్దీ, తన దేహంతో యోగికున్న ఏకత్వం సడలిపోతూ ఉంటుంది. అనగా, తన శరీరంతో తనకే సంబంధం పోతూ ఉంటుంది. అప్పుడు, దేహానికి ఏమీ జరిగినప్పటికీ కూడా, తనకు మాత్రం ఏమీ కానటువంటి స్థితి కలుగుతుంది.

నిద్ర

ఈ స్థితిలో, ఇంద్రియములు, మనస్సు బయటకు చూడటం మానివేస్తాయి. అంటే, యోగసూత్రములలో చెప్పబడిన 'ప్రత్యాహారస్థితి' కలుగుతుంది. ఈ స్థితి ఒక నిద్రలాగా ఉంటుంది. ఈ స్థితిలో ఉన్న యోగి, బయటనుండి చూచేవారికి నిద్రపోతున్నట్లుగా కనిపిస్తాడు. కానీ అది నిద్ర కాదు. ఈ స్థితిలో ఏమౌతుంది?

అనాత్మభావం ఆత్మలోను, ఆత్మభావం అనాత్మలోను లయములౌతాయి. కనుక ఇంద్రియగోచరములౌతున్న వస్తువులు వేరు, తాను వేరన్న దృష్టికోణం యోగినుంచి మాయమౌతుంది. సృష్టి అంతా తన ఆత్మలోకే వచ్చి చేరిపోతూ ఉంటుంది. ఆ విధంగా అవన్నీ ఆత్మలో లీనం కావడంచేత, తన ఆత్మయే, తానే ఎక్కడ చూచినా ఉన్నట్లుగా యోగి దర్శిస్తాడు. అప్పుడు, తన ఆత్మయే విశ్వమంతా నిండియున్న అనుభూతి యోగికి కలుగుతుంది. విశ్వమయుడౌతాడు. దీనిని 'మహావ్యాప్తి' అంటారు.

ఘూర్ణి

ఇది ఉదయించడం చేత 'ఘూర్ణి' అనబడే స్థితి కలుగుతుంది. అంటే, రంగులరాట్నంలో లాగా, అన్నీ గిర్రున తిరిగిపోతూ, ఏదో తెలియని శూన్యంలోకి, తనలోకి, లయమైపోతున్నట్లు కనిపిస్తాయి. ఈ స్థితులన్నీ,

జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయము మరియు తురీయాతీతములంటూ వేదాంతమున చెప్పబడిన అయిదు ప్రముఖస్థితులు.

వివేకానందస్వామి సన్యాసి కాకముందు, నరేంద్రునిగా కళాశాలలో చదువుకుంటూ ఉన్న సమయంలో, శ్రీరామకృష్ణులను దర్శించాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు అతడిని సమీపించి హృదయభాగంలో మెల్లిగా తాకారు. అప్పుడేం జరిగిందో, తన మాటలలో తానే చెప్పాడు నరేంద్రుడు.

'శక్తివంతమైన ఆ స్పర్శతో ఒక్కసారిగా నాకేదో అయింది. నేను చూస్తున్న ప్రపంచమంతా నా కళ్ళముందే గిర్రున సుడిగుండంలాగా తిరిగిపోతూ, ఏదో తెలియని చోటకు మాయమైపోతోంది. అప్పటిదాకా నాకు కనపడుతున్న ఇళ్ళు, చెట్లు, మనుషులు, ఆకాశం సమస్తం ఈ సుడిగుండంలో చిక్కుకుని మాయమైపోయాయి. చివరకు 'నేను' అనిన నా స్పృహను కూడా అది మ్రింగివేయబోతోంది. నేను చనిపోతున్నానని నాకర్థమైంది. చివరి క్షణంలో శక్తిని కూడగట్టుకున్న నేను 'మహానుభావా ! మీరు నాకేం చేస్తున్నారు? నాకింటిదగ్గర తల్లిదండ్రులు, అక్కచెల్లెళ్ళు, తమ్ముడు ఉన్నారు' అంటూ పెద్దగా అరిచాను. విలాసంగా నవ్వుతూ శ్రీరామకృష్ణులవారు, మళ్ళీ నా ఛాతీమీద సున్నితంగా స్పృశించారు. నేను చూస్తున దృశ్యం మొత్తం ఆగిపోయింది. మళ్ళీ మామూలుగా అన్నీ నాకు కనిపించసాగాయి. శ్రీరామకృష్ణులవారు నవ్వుతూ ఇలా అన్నారు 'ఇప్పటికిది చాలు. సమయం వచ్చినపుడు అంతా నీకే తెలుస్తుందిలే !'.

ఆ సమయంలో నరేంద్రునికేం జరిగిందో, ఇప్పటివరకూ ఏ గ్రంథములోనూ ఎవరూ వ్రాయలేదు. ఆయనకా సమయంలో జరిగింది ఇది. శ్రీరామకృష్ణుల శక్తివంతమైన స్పర్శతో నరేంద్రుని ప్రాణశక్తి మొత్తమూ, అతని సుషుమ్నానాడిలో ప్రవేశించి ఊర్ధ్వకుండలిని అని చెప్పబడిన చోటకు చేరిపోయింది. 'ఘూర్ణి' అంటూ అభినవగుప్తులవారి చేత చెప్పబడిన స్థితి, ఆయనకు ఒక్క క్షణంలో కలిగింది. నరేంద్రుడు కారణజన్ముడు, సప్తఋషులలో ఒకడు, హిందూమతమును ఉద్ధరించే పనికోసం జన్మించాడు గనుక, దానిని తట్టుకుని నిలబడగలిగాడు. మామూలు మనిషైతే అదే క్షణంలో చనిపోయేవాడు.

ఈ ఆనందభూములన్నీ, యోగి యొక్క ప్రాణము ఊర్ధ్వగామినిగా మారి, వరుసగా, త్రికోణము, కందము, హృదయము, తాలువు, ఊర్ధ్వకుండలిని మొదలగు చక్రములలో ప్రవేశించడం వల్ల కలుగుతాయని చెప్పబడింది. ఇవి యోగపరములైన స్థానములు. వీనిలో త్రికోణమునే 'యోనిస్థానమ'ని ప్రాచీనయోగగ్రంథములలో అన్నారు. కందమంటే 'దుంప' అని అర్థం. ఇది నాభిప్రాంతంలో ఉంటుంది. దుంపలో అన్ని వేర్లు కలసి ఉన్నట్లుగా, దేహంలో ఉన్న 72,000 నాడులు ఇక్కడ కలసి ఉంటాయి గనుక దీనిని కందము (దుంప) అన్నారు. హృదయమంటే అనాహతచక్రము. తాలువంటే కొండనాలుక భాగము. ఊర్ధ్వకుండలిని అంటే, శిరస్సుపైన పన్నెండు అంగుళముల ఎత్తులో ఉన్న ద్వాదశాంతము.

ఈ అయిదువిధములైన స్థితులకు, వేదాంతములో చెప్పబడిన జాగ్రదాది స్థితులకు, యోగశాస్త్రములో చెప్పబడిన చక్రములకు సామ్యము ఈ క్రింది విధముగా ఉంటుంది.

యోగస్థితులు	వేదాంతములో చెప్పబడిన స్థితులు	యోగకేంద్రములు (చక్రములు)
ప్రాగానందము	జాగ్రత్తు	త్రికోణము

యోగస్థితులు	వేదాంతములో చెప్పబడిన స్థితులు	యోగకేంద్రములు (చక్రములు)
ఉద్భవము	స్వప్నము	కందము
కంపము	సుషుప్తి	హృదయము
నిద్ర	తురీయము	తాలువు
ఘూర్ణి	తురీయాతీతము	ఊర్ధ్వకుండలిని (ద్వాదశాంతము)

ఈ విధమైన ఉచ్చారవిశ్రాంతులలో ఉన్న సమయంలో, యోగి లింగత్రయమును అనుభూతి చెందుతాడు. అవి, అవ్యక్త లింగము, వ్యక్తావ్యక్త లింగము, వ్యక్త లింగములు.

లింగమనే పదమునకు అనేక అర్థములున్నాయి. కొన్నింటిని ఇక్కడ చూద్దాము.

1. దేనిలో విశ్వమంతా లీనమౌతుందో అది లింగము.

2. ప్రమాణము లేదా గుర్తు. ఒకదానిని నిరూపించదానికి, దానితో పోల్చబడేది లింగము. ఉదాహరణకు, ఆత్మను ఇదంటూ నిర్వచించలేము గనుక, నిర్వచనమునకు అందుబాటులోకి వస్తున్న 'ప్రకృతి' ని ఆసరాగా తీసుకుంటూ, 'ప్రకృతికి అతీతుడు పురుషుడు' అంటూ, ప్రకృతితో పోల్చి చెప్పడం జరుగుతుంది. కనుక, ఇక్కడ, 'ప్రకృతి' అనేది పురుషునకు లింగమౌతుంది.

ఇక్కడ, స్పందసిద్ధాంతపు భావనలను అభినవగుప్తులవారు ప్రవేశపెడుతున్నారు.

అవ్యక్త లింగము

సృష్టికి అతీతంగా ఏ పరస్పందనమైతే ఉన్నదో, అది, మిగతా సమస్తమునూ తనలోకి మ్రింగి, లయం చేసుకుని, తెలియబడుతుంది. ఇది ప్రథమ లింగము.

అయితే ఈ స్థితిని తెలుసుకోవాలంటే దానికి విడిగా ఉంటూ, దానిని తెలుసుకోవడం సాధ్యం కాదు. అదొక బ్లాక్ హోల్ వంటిది. దానిని చూడటం కోసం దగ్గరకు పోయిన, ద్రష్టను కూడా అది మ్రింగివేస్తుంది. కనుక, దానిలో లీనం కావడమే దానిని 'తెలుసుకోవడం' అని చెప్పవచ్చు. అదేమిటో, దాని బయటనుండి తెలుసుకోవడం ఎవరికీ సాధ్యంకాదు. దీనినే 'అవ్యక్తము' (ఎన్నటికీ వ్యక్తము కాని స్థితి) అని వేదాంతము పిలిచింది. శ్రీరామకృష్ణుల స్పర్శతో వివేకానందునికి అనుభవంలోకి రాబోయినది ఈ స్థితియే. దీనిని, ఇంతకుముందు చెప్పబడినట్టి, 'అహమ్' (నేను) అనబడే స్పందనగా తలచవచ్చు. ఈ స్థితిలో, సృష్టి సమస్తమూ 'నేను' లో లయమౌతుంది. పూర్తిగా కన్నులు మూసుకున్నట్టి స్థితి ఇది.

వ్యక్తావ్యక్త లింగము

అంటే, 'నేను - సృష్టి' రెండూ ఉన్నట్టి స్థితి. అంటే, కొంత వ్యక్తమౌతూ, కొంత వ్యక్తం కాకుండానూ ఉండే స్థితి అన్నమాట. ఇందులో ఉన్న యోగికి, 'నేను' అనినట్టి అహంస్ఫురణ ఉంటుంది, అదే సమయంలో, 'ప్రపంచమును నేను అనుభూతి చెందుతున్నాను' అనే స్పృహ కూడా ఉంటుంది. కన్నులను సగం తెరచి,

సగం మూసి ఉంచినట్టి అర్ధనిమీలిత స్థితి ఇది.

వ్యక్త లింగము

అంటే, సృష్టి పూర్తిగా గోచరిస్తూ ఉన్నట్టి స్థితి. ఇందులో 'నేన'న్న స్ఫురణ బాగా తగ్గిపోయి, సృష్టిలోకి ద్రష్ట పూర్తిగా వెళ్ళిపోయిన స్థితి యన్నమాట. కన్నులు పూర్తిగా తెరచి చూస్తున్న స్థితి ఇది.

ఈ మూడింటినీ - అద్వైతము, ద్వైతాద్వైతము, ద్వైతములని, అవ్యక్తము, వ్యక్తావ్యక్తము, వ్యక్తములని చెప్పవచ్చు. ప్రాణసాధనను చేస్తున్న యోగికి, ఈ మూడు స్థితులూ అనుభవములోకి వస్తాయి. వీటి యొక్క పూర్తి వివరణ ముందుముందు చెప్పబడుతుంది.

యోగినీహృదయము

దీనిలో ఉత్తమమైనది యోగినీహృదయము. ఇందులో స్పందనయే అతిముఖ్యమైనది. దాని సంకోచము, వికాసముల వల్ల, శివశక్తిస్వరూపమైన యామళం ఉదయించడంతో, విసర్గపు వెలుగైన విశ్రాంతి యోగికి లభిస్తుంది. దానిలోకి ప్రవేశించే విధానము, రహస్యము గనుక, చెప్పకూడనిదిగా ఉన్నది. కనుక ఇంతటితో ఈ వివరణను ఆపివేయడం జరుగుతున్నది.

ఆత్మసంవిత్ అన్నది ముందుగా స్వబోధ (ఆత్మజ్ఞాన) రూపమై తనలో తానుగా (హృదయగతమై) ఉంటుంది. తదుపరి, అక్కడనుండి, బాహ్యముగా ఉన్నట్టి ప్రమేయము (ఇంద్రియగోచరమౌతున్న సమస్తము) లోకి ప్రసరించి, ఆయా వస్తువులను పూరిస్తున్నది. అనగా, వాటికి స్థితిని కల్పిస్తున్నది. అక్కడనుండి, తిరిగి వెనుకకు వచ్చి, పూర్ణములో నిలిచి, మాతృమేయాది (తెలుసుకొనువాడు, తెలిసికొనబడుతున్నది అన్నట్టి) విభాగములను శీఘ్రమే సంహరిస్తున్నది.

పైన చెప్పబడిన మహావ్యాప్తి మొదలైన విశ్రామభూమికలేవైతే ఉన్నాయో అవి హృదయగతమైన శూన్యముతో కలిపి ఆరు ఉపాయములుగా ఉన్నాయి. ప్రాణము, అపానము, సమానము, ఉదానము, వ్యానము అనబడే పంచప్రాణవాయువుల లోపలే జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయము, తురీయాతీతములతో నిండిన సమస్తమూ నిలచి యున్నది.

ఈ పంచప్రాణసాధనలోను, ఆరు విశ్రామభూమికలలోను స్థిరంగా ఉండటం నేర్చుకున్నవాడు సృష్టి, సంహారము మొదలైన ఆత్మవిమర్శ యొక్క స్థితులను త్వరగానే అందుకోగలుగుతాడు.

పంచప్రాణసాధన ద్వారా ఆత్మజ్ఞానమును, సృష్టి, స్థితి, సంహారముల రహస్యములను గ్రహించగోరువాడు అనుసరించవలసిన మార్గం ఇది.

ఈ విషయమై, ఇతర చోట్ల చెప్పబడిన శ్లోకములు పై విధముగా ఉన్నాయి. ఇది ఉచ్చారణ రహస్యము.

ఇప్పుడు సూక్ష్మ ప్రాణాత్మ వర్ణనము చెప్పబడుచున్నది.

పై విధముగా చెప్పబడినట్లు, పంచప్రాణముల యొక్క ఊర్ధ్వసంచారము తనలో జరుగుతున్న యోగికి తన

లోలోపల ఒక విధమైన ధ్వని (నాదము) వినవస్తుంది. అది, సృష్టిలో నిత్యమూ ప్రతిధ్వనిస్తున్నప్పటికీ, బాహ్యంగా వ్యక్తము కానట్టి ఓంకారధ్వనిని పోలి ఉంటుంది. వర్ణమాల లోని అక్షరముల శబ్దములను పోలి ఉంటుంది గనుక దానినే వర్ణశబ్దమంటారు. వర్ణమాలలో నున్న సమస్త అక్షరముల, శబ్దముల, సారాంశరూపమే, సృష్టి మరియు సంహారబీజములైన 'స' మరియు 'హ' లు. అనగా 'సోహం' మంత్రమని అర్థము. ఈ మంత్రము యొక్క అభ్యాసం వల్ల పరసంవిత్ ను యోగి అందుకుంటాడు. ఈ వర్ణశబ్దములను, 'క' వర్గము నుండి, 'ప' వర్గము యొక్క చివరివరకూ, అనగా 'క' నుండి 'మ' వరకు, అచ్చులతో కలిపిగాని, కలుపకుండా గాని జపించాలి. మంత్రములంటే ఇవే. వీటిని, పెదవులు కదలకుండా, తన లోలోపల మౌనంగా ఉచ్చరించినా గొప్ప ఫలితముంటుంది. లేదా ఊరకే వాటిని స్మరించినా కూడా అదే ఫలితముంటుంది. ఏమిటా ఫలితం? సంవిత్ యొక్క స్పందము అనుభూతిలోకి రావడమే ఆ ఫలితం. ఉదాత్త, అనుదాత్త, స్వరితములనబడే స్వరములతో, విధివిధాన సహితంగా వాటిని జపించడం సమయవిధి. సమయవిధిని పాటించినా, లేదా, స్వరం లేకుండా ఊరకే వాటిని స్మరించినా కూడా, వాటి శక్తిలో ఏమీ తేడా రాదు. ఎందుకంటే, ఎలా జపించబడినప్పటికీ, అవి పరిపూర్ణములే గనుక. స్వరము, విధివిధానములతో కలసి ఉన్నప్పుడు కూడా, భావనను బట్టేకదా మంత్రఫలితం ఉండేది? కనుక మంత్రమునకు భావం ప్రధానం గాని ఆచారం కాదు.

తనకంటే ఎక్కువైనదేదీ లేనట్టి, సంవిత్ యొక్క స్పర్శవలన హృదయము, కంఠము, పెదవులు ఏకములు కావాలి. అంటే, హృదయంలో ఉన్నట్టి భావము, గొంతులో శబ్దరూపమును ధరించి, నోటిద్వారా బయటకు రావాలి. దీనికి ముందుగా హృదయశుద్ధి ఉండాలి. తరువాత, హృదయం నుండి నోటివరకూ భావప్రసరణ శుద్ధంగా స్పష్టంగా ఉండాలి. ఆ తరువాత, రెండు ద్వాదశాంతములు, హృదయము ఏకములు కావాలి. శిరస్సు పైన ఒక ద్వాదశాంతస్థానమున్నట్లే, మూలాధారం క్రింద ఇంకొక ద్వాదశాంతమున్నది. వీని మధ్యలో హృదయమున్నది. ఈ మూడూ, మంత్రశబ్దంతో ఒక్కటైపోవాలి. ఇదే మంత్రజపం యొక్క రహస్యం. అప్పుడు మంత్రం సిద్ధిస్తుంది. ఈ రహస్యం తెలియకపోతే మంత్రం సిద్ధించదు.

అయితే, ఈ విషయంలో, మరికొంతమంది చేసే భావన ఈ క్రిందివిధంగా ఉన్నది.

హృదయం లోపల స్ఫురించిన ఆత్మవిమర్శనుండి తెలుపు, పసుపు రంగులలో ఉన్న శబ్దములు (అక్షరములు) ఉదయిస్తాయి. వాటిని ధ్యానించడం వల్ల ఆత్మసంవిత్ అందుకోబడుతుందని వారంటారు.

చంద్ర, సూర్య, నాడుల చలనములను ఆపడం వల్ల, మాటలలో చెప్పలేనట్టి సంవిత్ స్పందమును ఎవరైతే అనుభవంలో తెలుసుకొని, దీనిలో ప్రవేశిస్తాడో, వాడు, చిత్, బీజము, పిండవర్ణముల విధులలో పూర్ణుడౌతున్నాడు. చిత్ అంటే శుద్ధచైతన్యస్వరూపమైన పరమశివతత్త్వము. బీజమంటే బీజాక్షరస్వరూపమైన వర్ణశబ్దముల జ్ఞానము. పిండవర్ణములంటే, బీజాక్షర సముదాయకములైన మంత్రములు.

ఇడా, పింగళా నాడులలో ఆడుతున్న ఊపిరిని నిరోధించి, లోలోపల వినవస్తున్న నాదమును, దానిలోని రెండు రూపములను (అనాహతము, ఆహతము) ఏ యోగి అయితే వింటాడో, వాడికి చైతన్యముతో నిండినట్టి మంత్రశబ్దముల జ్ఞానము దానంతట అదే వస్తుందని భావము.

ఇది పై విషయమై వేరొక చోట చెప్పబడిన శ్లోకము. వర్ణవిధి యనునది, పై విధముగా స్థూల, సూక్ష్మ,

రూపములుగా ఉన్నది. కరణమనే దానిని గురించి 'ముద్రాప్రకాశన ప్రకరణము' లో వివరంగా చెబుతాను.

కొందరికి వికల్పము స్వయముగా, ఉపాయములేకుండా, పూర్ణమౌతుంది. కొందరికి ఉపాయమువల్ల సంస్కరింపబడుతుంది. బుద్ధి, ప్రాణము, దేహము, బాహ్యావిషయముల రూపములలో ఆ ఉపాయములు చాలా ఉన్నాయి. అవి నిర్ణీతములై ఇట్లే ఉండాలని చెప్పలేము. అవి ఎట్లున్నప్పటికీ, పరఫలమును పొందినపిదప వాటిలో భేదమేముంటుంది?

ఆ॥ కొన్ని చోట్ల దలపు కోరకున్ననె తాను
పూర్ణమౌను గాదె పుడమియందు
కొన్నిచోట్ల యదియె కొండంత సాధనల్
జేయు పిదప మీరి సిద్ధినందు

ఆ॥ దేహప్రాణ చిత్త దేవతా మూర్తులన్
సాగు సాధనములు చక్కనున్న
నిక్కమెంచరాదు నిర్ణీతములె యంచు
శివుని జేరు పిదప చిక్కులేల?

కొందరు సాధకులకు, ఆలోచన అనేది తనంతట తానే, ఎటువంటి ఉపాయము కూడా లేకుండా, పరిపూర్ణమౌతుంది. మరి కొందరికి ఉపాయమువల్ల సంస్కరింపబడుతుంది. ఈ విధముగా సాధకుని బుద్ధిని, ప్రాణమును, దేహమును, విగ్రహములు మొదలైన బాహ్యావిషయములను ఉపయోగించుకుంటూ చేసే సాధనోపాయములు చాలా విధములైనవి ఉన్నాయి. ఉన్నతస్థాయి సాధకులకు, అవి అల్పములుగా అనిపించవచ్చు. అవి అందరికీ అదే విధముగా ఉండవలెనన్న నియమం కూడా లేదు. అవి నిర్ణీతములు కూడా కావు. కానీ, అవి కూడా చిదానంద స్వరూపమైన పరమశివానుభవమునకు దారిచూపేవే. దానిని పొందిన తర్వాత, అక్కడకు ఏ దారిలో వచ్చామన్న భేదం ఏముంటుంది? కొండ శిఖరమును ఎక్కిన తర్వాత, ఏ దారిలో అక్కడకు చేరారనిన భేదం ఉండనట్లుగానే, ఇది కూడా ఉండదు.

అనగా, యోగులలో ఎవరెవరి స్థాయీభేదములను బట్టి, ఎవరెవరి మానసిక సంస్కారముల పరిపక్వతను బట్టి - శాంభవోపాయము గాని, శాక్తోపాయము గాని, అణవోపాయము గాని - వారికి కుదురుతుంది. అతి కొద్దిమందిలో మాత్రం, అనుపాయము సిద్ధిస్తుంది. ఏదేమైనప్పటికీ, అంతిమ గమ్యమైన పరమశివానుభావమును పొందిన తర్వాత ఈ ఉపాయములలో భేదములుండవు. సముద్రంలో, ఎన్నో దిక్కులనుండి వచ్చిన నానానదులు కలసినప్పటికీ, కలసిన తర్వాత వాటిలో ఏమీ భేదం ఉండదు. ఇది కూడా అదే విధంగా జరుగుతుంది.

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే అణవోపాయప్రకాశనం నామ పంచమమాహ్నికమ్ ॥ 5 ॥

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని అణవోపాయప్రకాశనమనే అయిదవ ఆహ్నికము.

ఆరవ ఆహ్నికము

కాలాధ్వ ప్రకాశనము

యదార్థః - యదార్థము

అథ బాహ్యవిధిః |

ఇప్పుడు బాహ్యవిధి వివరింపబడుచున్నది.

స ఏవ స్థానప్రకల్పనశబ్దేన ఉక్తః, తత్ర త్రిధా స్థానం-ప్రాణవాయుః శరీరం బాహ్యం చ, తత్ర ప్రాణే తావత్ విధిః, సర్వః అసౌ వక్ష్యమాణః అధ్వా ప్రాణస్థః కల్పతే, తస్య క్రమాక్రమకలనైవ కాలః, స అచ పరమేశ్వర ఏవ అన్తర్భాతి, తద్భాసనం చ దేవస్య కాలీ నామ శక్తిః, భేదేన తు తదాభాసనం క్రమాక్రమయోః ప్రాణవృత్తిః |

ఇదియే స్థానప్రకల్పమని చెప్పబడుతుంది. దీనికి మూడు స్థానములున్నాయి - ప్రాణవాయువు, శరీరము, బాహ్యము. వీనిలో ప్రాణముయొక్క విధి ఇది: ఇప్పటివరకూ చెప్పబడిన అధ్వములన్నీ ప్రాణములోనే ఉన్నాయి. ప్రాణము యొక్క క్రమ - అక్రమ చలనమే కాలము. దానిలోకూడా పరమేశ్వరుడే నిండి యున్నాడు. దైవముయొక్క భాసనమే కాళి అనే శక్తి. దాని అభాసనము యొక్క క్రమాక్రమభేదములే ప్రాణవృత్తులు.

సంవిదేవ హి ప్రమేయేభ్యో విభక్తం రూపం గృహ్ణాతి, అత ఏవ చ అవచ్ఛేదయోగాత్ వేద్యతాం యాన్తీ నభః, తతః స్వాతన్త్ర్యాత్ మేయే స్వీకారౌత్సుక్యేన నిపతన్తీ క్రియాశక్తిప్రధానా ప్రాణనారూపా జీవస్వభావా పఞ్చభీ రూపైః దేహం యతః పూరయతి, తతోఽసౌ చేతన ఇవ భాతి |

సంవిత్తే ప్రమేయమునుండి విభక్తమై రూపమును ధరిస్తున్నది. అవచ్ఛేదయోగం వల్ల అదే ఆకాశమును కూడా తెలిసికొంటున్నది. తన స్వాతంత్రంతో మేయమును స్వీకరించే ఉత్సాహంలో క్రిందకు దిగుతూ క్రియాశక్తి ప్రధానమైన ప్రాణరూపమై జీవస్వభావమును ధరించి అయిదురూపములతో దేహమును పూరిస్తుంది. అందులో చేతనారూపంలో భాసిస్తుంది.

తత్ర క్రియాశక్తౌ కాలాధ్వా ప్రాచ్యభాగే, ఉత్తరే తు మూర్తివైచిత్ర్యరూపో దేశాధ్వా, తత్ర వర్ణ-మన్త్ర-పదాధ్వనః కాలాధ్వని స్థితిః పర-సూక్ష్మ-స్థూలరూపత్వాత్ | దేశాధ్వస్థితిస్తు తత్త్వ-పుర-కలాత్మనా ఇతి భవిష్యతి స్వావసరే | తత్ర యద్యపి దేహే సబాహ్యాభ్యన్తరమ్ ఓతప్రోతరూపః ప్రాణః, తథాపి ప్రస్ఫుటసంవేద్యప్రయత్నః అసౌ హృదయాత్ప్రభృతి ఇతి, తత ఏవ అయం నిరూపణీయః | తత్ర ప్రభుశక్తిః ఆత్మశక్తిః యత్న ఇతి త్రితయం ప్రాణేరణే హేతుః-గుణముఖ్యభావాత్ | తత్ర హృదయాత్ ద్వాదశాన్తాన్తం స్వాఙ్గులైః సర్వస్య షట్త్రింశదఙ్గులః ప్రాణచారః నిర్గమే ప్రవేశే చ, సోచిత బల-యత్న- దేహత్వాత్ సర్వస్య | తత్ర ఘటికా తిథిః మాసో వర్షం చ వర్షసమూహాత్మా, ఇతి సమస్తః కాలః పరిసమాప్యతే | తత్ర సపఞ్చాంశే అఙ్గులే చషక ఇతి స్థిత్యా ఘటికోదయః, ఘటికా హి షష్ట్యా చషకైః తస్మాత్ ద్వానప్తత్యఙ్గులా భవతి |

ఆ క్రియాశక్తి ముందుగా కాలాధ్వము, తరువాత మూర్తివైచిత్ర్యరూపమైన దేశాధ్వము. వర్ణము, మంత్రము పదాధ్వముల స్థితి కాలాధ్వంలో ఉన్నది, ఎందుకనగా పరము, సూక్ష్మము, స్థూలరూపములచేత.

దేశాధ్వంలో తత్త్వము, పురము, కళలు అవసరమునుబట్టి కలుగుతాయి. దేహము యొక్క బాహ్యాభ్యంతరములలో ఓతప్రోతమై ప్రాణమున్నప్పటికీ, స్ఫుటంగా సంవేద్యమయ్యే ప్రయత్నము హృదయంలోనే జరుగుతుంది గనుక అక్కడనే దానిని నిరూపించవలసి యున్నది. గుణ-ముఖ్య-భావములచేత ప్రాణసంచారంలో ప్రభుశక్తి, ఆత్మశక్తి, ప్రయత్నము, ఈ మూడును ముఖ్యములైనవి. ఎవరికి తగినట్లుగా వారికి, బలము, యత్నము, దేహములననుసరించి, వారివారి హృదయమునుండి ద్వాదశాంతము వరకూ తమ బొటనవ్రేలికణుపు కొలతతో 36 రెట్లుగా ప్రాణసంచారం ప్రవేశిస్తూ నిర్గమిస్తూ ఉంటుంది. దానిలో ఘడియలు, తిథులు, మాసములు, సంవత్సరము, సంవత్సరసమూహములు - ఈ విధంగా సమస్తకాలమూ పరిసమాప్తి అవుతుంది. ఒకటీ ఇరవయ్యావ వంతుతో చషకమౌతుంది. 6 చషకములతో ఒక ఘటిక అవుతుంది. ఈ విధముగా 72 అంగుళములు ఏర్పడతాయి.

అథ తిథ్యుదయః । సపాదమఙ్గులద్వయం తుటిః ఉచ్యతే, తాసు చతసృషు ప్రహరః, తుట్యర్ధం తుట్యర్ధం తత్ర సంధ్యా, ఏవం నిర్గమే దినం, ప్రవేశే రాత్రిః, ఇతి తిథ్యుదయః ।

ఇప్పుడు తిథి ఉదయం గురించి. రెండుంబావు అంగుళములు తుటి అనబడుతుంది. ఒక్కొక్క తుటిలో సగం సంధ్య అవుతుంది. నాలుగైతే ప్రహరము. ఇది నిర్గమించడం దినము, ప్రవేశము రాత్రి. ఈ విధంగా తిథి ఏర్పడుతుంది.

అథ మాసోదయః । తత్ర దినం కృష్ణపక్షః, రాత్రిః శుక్లః, తత్ర పూర్వం తుట్యర్ధం అన్త్యం చ తుట్యర్ధం విశ్రాన్తిః అకాలకలితాః, మధ్యాస్తు పఞ్చదశ తుటయ ఏవ తిథయః, తత్ర ప్రకాశో విశ్రాన్తిశ్చ ఇతి ఏతే ఏవ దినానిశే । తత్ర వేద్యమయతాప్రకాశో దినం, వేద్యస్య విచారయితరి లయో రాత్రిః, తే చ ప్రకాశవిశ్రాన్తీ చిరాచిరవైచిత్ర్యాత్ అనన్తభేదే, తత్సామ్యే తు విషువత్ । తత్ర కృష్ణపక్షే ప్రాణార్కే అపానచన్ద్ర ఆప్యాయికామ్ ఏకామేకాం కలామ్ అర్పయతి, యావత్ పఞ్చదశ్యాం తుటౌ ద్వాదశాన్తసమీపే క్షీణపృథగ్భూతకలాప్రసరః చన్ద్రమాః ప్రాణార్క ఏవ లీయతే । తదనన్తరం యత్ తుట్యర్ధం స పక్షసంధిః । తస్య చ తుట్యర్ధస్య ప్రాచ్యమ్ అర్ధమ్ ఆమావస్యం, ద్వితీయం ప్రాతిపదం । తత్ర ప్రాతిపదే తస్మిన్ భాగే స ఆమావస్యో భాగో యదా కాసప్రయత్నావధానాదికృతాత్ తిథిచ్ఛేదాత్ విశతి తదా తత్ర గ్రహణమ్, తత్ర చ వేద్యరూపసోమసహభూతో మాయాప్రమాతృరాహుః స్వభావతయా విలాపనాశక్తః కేవలమ్ ఆచ్ఛాదనమాత్రసమర్థః సూర్యగతం చాన్ద్రం అమృతం పిబతి ఇతి । ప్రమాతృ-ప్రమాణ-ప్రమేయ-త్రితయా విభాగకారిత్వాత్ స పుణ్యః కాలః పారలౌకికఫలప్రదః । తతః ప్రవిశతి ప్రాణే చిదర్క ఏకైకయా కలయా అపానచన్ద్రమ్ ఆపూరయతి, యావత్ పఞ్చదశీ తుటిః పూర్ణిమా, తదనన్తరం పక్షసంధిః గ్రహణం చ ఇతి ప్రాగ్వత్, ఏతత్ తు ఐహికఫలప్రదమ్, ఇతి మాసోదయః ।

ఇప్పుడు మాసోదయము గురించి. ఇక్కడ దినమే కృష్ణపక్షము, రాత్రి శుక్లపక్షము. దానికి ముందూవెనుకలలో తుటిలో అర్ధభాగం విశ్రాంతి. అది అకాలకలితము. మధ్యలోని పదిహేనుతుటులే తిథులు. అక్కడ ప్రకాశము, విశ్రాంతులే పగలూరాత్రులు. తెలిసికొంటున్న వెలుగున్నపుడు దినము, తెలివి లేకపోవడము, వేత్తలో వేద్యము లయంకావడమే రాత్రి. వీటిలో ప్రకాశము విశ్రాంతి ఎక్కువతక్కువభేదములతో ఉంటాయి, వాటి సమత్వమే విషువత్. కృష్ణపక్షంలో ప్రాణసూర్యుని అపానచంద్రుడు దగ్గరౌతూ ఒక్కొక్క కళను అర్పిస్తూ వస్తాడు. కళాప్రసరణంతో క్షీణుడైన చంద్రుడు పదిహేనుతుటులలో ద్వాదశాంతమును

సమీపించి, ప్రాణసూర్యునిలో లీనమౌతాడు. దాని తరువాత ఒక తుట్యర్థము పక్షసంధి అవుతుంది. దాని ముందు సగము అమావాస్య, రెండవ సగం పాడ్యమి. ఆ పాడ్యమి భాగంలో అమావాస్య భాగం దగ్గు లేదా ప్రయత్నముల వల్ల కలసినప్పుడు తిథిచ్ఛేదం అవుతుంది. అప్పుడది గ్రహణం అంటాము. మాయాప్రమాతృడైన రాహువు వేద్యరూపుడైన చంద్రునితో కలసి, స్వభావతః చంద్రుని నశింపజేయు శక్తి లేనప్పటికీ, అచ్ఛాదనాసమర్థుడైనందువల్ల, సూర్యగతుడైన చంద్రుని అమృతమును త్రాగుతాడు. ప్రమాతృ-ప్రమాణ-ప్రమేయము లనబడే మూడు విభాగములు మాయమౌతున్నందువలన అది పారలౌకిక ఫలములనిచ్చే పుణ్యకాలమౌతున్నది. అప్పుడు చిదర్కమనబడే ప్రాణము ప్రవేశించి ఒక్కొక్క కళను అపానచంద్రునిలో నింపుతుంది. అటువంటి పదిహేను తుటులు పూర్ణిమ అవుతుంది. దాని తరువాత పక్షసంధి, గ్రహణము ముందువలెనే. ఇది ఐహికఫలప్రదము, మాసోదయము.

అథ వర్షోదయః । తత్ర కృష్ణపక్ష ఏవ ఉత్తరాయణం షట్సు షట్సు అఙ్గులేషు సంక్రాన్తిః మకరాత్ మిథునాన్తం । తత్ర ప్రత్యఙ్గులం పఞ్చ తిథయః, తత్రాపి దినరాత్రివిభాగః, ఏవం ప్రవేశే దక్షిణాయనం, గర్భత్వమ్, ఉద్భవేచ్ఛా, ఉద్బుభూషుతా, ఉద్భవిష్యత్వమ్, ఉద్భవారమ్భః, ఉద్భవత్తా, జన్మాదివికారషట్కం చ ఇతి క్రమాత్ మకరాదిషు ఇతి । తత్రైవ ఉపాసా అత్ర ఫలం సముచితం కరోతి । అత్ర చ దక్షాద్యాః పితామహాన్తా రుద్రాః శక్తయశ్చ ద్వాదశాధిపతయ, ఇతి వర్షోదయః ।

ఇప్పుడు వర్షోదయము. కృష్ణపక్షమే ఉత్తరాయణము. మకరం నుండి మిథునం వరకూ ఆరారు అంగుళములకొక సంక్రాంతి అవుతుంది. దానిలో ఒక్కొక్క అంగుళము అయిదు తిథులతో సమానము. దానిలోకూడా దినరాత్రివిభాగమున్నది. శ్వాసప్రవేశమే దక్షిణాయనము. గర్భత్వము, ఉద్భవేచ్ఛ, ఉద్భవ బుభూషత, ఉద్భవించడానికి పూనుకోవడం, ఉద్భవించడం మొదలు, ఉద్భవించడం - మొదలైన జన్మాదివికారములు ఆరును, క్రమంగా మకరం నుంచి ఉంటాయి. కనుక ఆయా సమయాలలో చేయబడిన ఉపాసనలు తగిన ఫలితములనిస్తాయి. దక్షుడు మొదలుకొని పితామహునివరకూ ఉన్న రుద్రులు వారిశక్తులతో కలసి పన్నెండు రాశులకు అధిపతులై ఉంటారు. ఇది వర్షోదయము.

ప్రత్యఙ్గులం షష్టిః తిథయ ఇతి క్రమేణ సంక్రాన్తౌ వర్షమ్ ఇత్యనేన క్రమేణ ప్రవేశనిర్గమయోః ద్వాదశాబ్దోదయః, ప్రత్యఙ్గులం తిథీనాం శతత్రయం, సపఞ్చాంశేఽఙ్గులే వర్షం, యత్ర ప్రాక్ చషకమ్ ఉక్తమ్ ఇతి గణనయా సంక్రాన్తౌ పఞ్చ వర్షాణి, ఇతి అనయా పరిపాట్యా ఏకస్మిన్ ప్రాణనిర్గమప్రవేశకాలే షష్ట్యబ్దోదయః, అత్ర ఏకవింశతిసహస్రాణి షట్ శతాని ఇతి తిథీనాం సంఖ్యా । తావతీ ఏవ అహోరాత్రే ప్రాణసంఖ్యా, ఇతి న షష్ట్యబ్దోదయాత్ అధికం పరీక్ష్యతే అనన్త్యాత్ ।

ప్రతి అంగుళములో అరవై తిథులున్నట్లు అనుకున్నట్లైతే, సంక్రాంతియే వర్షమౌతుంది. ఈ క్రమంలో ప్రవేశనిర్గమనములలో పన్నెండు వత్సరములౌతాయి. ప్రతి అంగుళంలో మూడునూర్ల తిథులున్నట్లు అనుకుంటే, ఒకటిన్నీ ఐదవవంతు అంగుళంలో వర్షమౌతుంది, దాని పూర్వభాగం చషకమౌతుంది. ఇట్లా గణిస్తే సంక్రాంతి అయిదు వర్షములౌతుంది. ఈ లెక్కలో ఒకసారి ప్రాణం నిర్గమించి ప్రవేశిస్తే అరవై ఏళ్ళవుతుంది. దీనిలో *21,600* తిథులసంఖ్య వస్తుంది. ఒక అహోరాత్రములో ప్రాణసంఖ్య కూడా అదే. అనంతమౌతుంది గనుక అరవై అబ్దములను మించి పరీక్షించడం లేదు.

తత్ర మానుషం వర్షం దేవానాం తిథిః, అనేన క్రమేణ దివ్యాని ద్వాదశవర్షసహస్రాణి చతుర్యుగమ్ | చత్వారి త్రీణి ద్వే ఏకమ్ ఇతి కృతాత్ ప్రభృతి తావద్భిః శతైః అష్టౌ సంధ్యాః | చతుర్యుగానామ్ ఏకసప్తత్యా మన్వన్తరమ్, మన్వన్తరైః చతుర్దశభిః బ్రాహ్మం దినం, బ్రహ్మదినాన్తే కాలాగ్నిదగ్ధే లోకత్రయే అన్యత్ర చ లోకత్రయే ధూమప్రప్లావితే సర్వే జనా వేగవదగ్నిప్రేరితా జనలోకే ప్రలయాకలీభూయ తిష్ఠన్తి | ప్రబుద్ధాస్తు కూష్మాణ్డహాటకేశాద్యా మహాలోకే క్రీడన్తి |

ఒక మనుష్యవర్షము దేవతలకు ఒక తిథి. ఈ క్రమంలో 12,000 దివ్యవర్షములు ఒక చతుర్యుగము. నాలుగు మూడు రెండు ఒకటి ఈ విధంగా కృతము మొదలైన యుగములు, అదేవిధంగా 800 మొదలైన సంధ్యలు. 71 చతుర్యుగములైతే ఒక మన్వంతరము. 14 మన్వంతరములైతే బ్రహ్మకొక్క దినము. బ్రహ్మదినాంతమున లోకత్రయము కాలాగ్నిదగ్ధములై పోగా, మిగతా లోకములన్నీ ఈ పొగవల్ల కమ్మబడతాయి. వేగాగ్నిప్రేరితులై అందరు జనులూ జనలోకమును చేరి ప్రళయకాలంవరకూ అక్కడుంటారు. ప్రబుద్ధులైన కూష్మాండ హాటక ఈశాదులు మహాలోకంలో క్రీడిస్తూ ఉంటారు.

తతో నిశాసమాప్తౌ బ్రాహ్మీ సృష్టిః | అనేన మానేన వర్షశతం బ్రహ్మాయుః | తత్ విష్ణోః దినం తావతీ చ రాత్రిః, తస్యాపి శతమ్ ఆయుః | తత్ దినం తదూర్ధ్వే రుద్రలోకప్రభో రుద్రస్య, తావతీ రాత్రిః, ప్రాగ్వత్ వర్షం, తచ్ఛతమపి చ అవధిః | తత్ర రుద్రస్య తదవసితౌ శివత్వగతిః, రుద్రస్య ఉక్తాధికారావధిః, బ్రహ్మాణ్డధారకాణాం తత్ దినం శతరుద్రాణాం, నిశా తావతీ, తేషామపి చ శతమాయుః | శతరుద్రక్షయే బ్రహ్మాణ్డవినాశః |

అప్పుడు రాత్రి సమాప్తమై బ్రహ్మదేవుని సృష్టి మళ్ళీ మొదలౌతుంది. అలాంటి లెక్కలో నూరువర్షములు బ్రహ్మదేవుని ఆయువు. అది విష్ణుదేవునకు ఒక పగలు, అలాంటిదే ఒక రాత్రి. ఆయనకు కూడా నూరేళ్లు ఆయువు. దానిపైనున్న రుద్రలోకప్రభువైన రుద్రునకు అది ఒక దినము, అలాంటిదే రాత్రి. ముందువలెనే వర్షము, అలాంటి నూరు ఆయన ఆయువు. ఆ తరువాత రుద్రుడు శివునిలో లీనమౌతాడు. రుద్రుని జీవితకాలం, బ్రహ్మాండధారకులైన శతరుద్రులకు ఒక దినము, రాత్రికూడా అంతే. వారికి కూడా నూరేళ్లు ఆయువు. శతరుద్రుల ఆయుస్సు తీరినప్పుడు బ్రహ్మాండం నాశనమౌతుంది.

ఏవం జలతత్త్వాత్ అవ్యక్తాన్తమ్ ఏతదేవ క్రమేణ రుద్రాణామ్ ఆయుః | పూర్వస్యాయురుత్తరస్య దినమ్ ఇతి | తతశ్చ బ్రహ్మా రుద్రాశ్చ అబాద్యధికారిణః అవ్యక్తే తిష్ఠన్తి ఇతి | శ్రీకణ్ఠనాథశ్చ తదా సంహర్తా | ఏషోఽవాన్తరప్రలయః, తత్క్షయే సృష్టిః | తత్ర శాస్త్రాన్తరముక్తా అపి సృజ్యన్తే | యత్తు శ్రీకణ్ఠనాథస్య స్వమ్ ఆయుః తత్ కఞ్చుకవాసినాం రుద్రాణాం దినం, తావతీ రజనీ, తేషాం యదాయుః తత్ గహనేశదినం, తావతీ ఏవ క్షపా, తస్యాం చ సమస్తమేవ మాయాయాం విలీయతే |

ఈ విధంగా జలతత్త్వం నుండి అవ్యక్తాన్తము వరకూ క్రమముగా రుద్రుల ఆయుస్సు ఇలా ఉంటుంది. వెనుకటివారి ఆయుస్సు తరువాతి వారికి దినమౌతుంది. (ప్రళయసమయంలో) జలము మొదలైనవాటి అధిపతులైన బ్రహ్మ రుద్రుడు మొదలైనవారు అవ్యక్తములో ఉంటారు. శ్రీకంఠనాథుడప్పుడు సంహారకుడౌతాడు. ప్రళయం తర్వాత అంతరం ఇలా ఉంటుంది. దాని తరువాత మళ్ళీ సృష్టి జరుగుతుంది. అప్పుడు ఇతరశాస్త్రములననుసరించి ముక్తులైనవారు కూడా సృష్టింపబడతారు. శ్రీకంఠనాథుని ఆయుస్సు కంచుకవాసులైన రుద్రుల ఒక్క దినము, అంతే రాత్రి. వారి ఆయుష్కాలమే గహనేశుని ఒక దినము,

రాత్రికూడా అంతే. దానిలో ఈ సమస్తమూ మాయలో లీనమైపోతుంది.

పునః గహనేశః సృజతి । ఏవం యః అవ్యక్తకాలః తం దశభిః పరార్ధైః గుణయిత్వా మాయాదినం కథయేత్, తావతీ రాత్రిః । స ఏవ ప్రలయః । మాయాకాలః పరార్ధశతేన గుణిత ఐశ్వరతత్త్వే దినమ్ । అత్ర ప్రాణో జగత్ సృజతి, తావతీ రాత్రిః, యత్ర ప్రాణప్రశమః, ప్రాణే చ బ్రహ్మబిలధామ్ని శాన్తేఽపి యా సంవిత్, తత్రాప్యస్తి క్రమః ।

మళ్ళీ గహనేశుడు సృష్టి చేస్తాడు. ఈ అవ్యక్తకాలమును పది పరార్ధములతో గుణించగా ఒక మాయాదినమౌతుంది, అంతే రాత్రి. ఆ రాత్రే ప్రళయము. మాయాకాలమును పరార్ధశతంతో గుణించగా ఈశ్వరుని యొక్క దినమౌతుంది. అప్పుడు ప్రాణము మళ్ళీ సృష్టిని చేస్తుంది. అంతే కాలం రాత్రి. దానిలో ప్రాణం విశ్రాంతి తీసుకుంటుంది. ప్రాణము బ్రహ్మబిలంలో శాంతమైనా లేదా మేల్కొనిఉన్నా, ఇదే క్రమం జరుగుతుంది.

ఐశ్వరే కాలే పరార్ధశతగుణితే యా సంఖ్యా, తత్ సదాశివం దినం, తావతీ నిశా, స ఏవ మహాప్రలయః । సదాశివః స్వకాలపరిక్షయే బిన్ద్వర్ధచన్ద్రనిరోధికా ఆక్రమ్య నాదే లీయతే , నాదః శక్తితత్త్వే, తత్ వ్యాపిన్యాం, సా చ అనాశ్రితే । శక్తికాలేన పరార్ధకోటిగుణితేన అనాశ్రితదినం । అనాశ్రితః సామనసే పదే, యత్ తత్ సామనస్యం సామ్యం తత్ బ్రహ్మ । అస్మాత్ సామనస్యాత్ అకల్యాత్ కాలాత్ నిమేషోన్మేషమాత్రతయా ప్రోక్తాశేషకాలప్రసరప్రవిలయచక్రభ్రమోదయః ।

ఈశ్వరకాలమును పరార్ధశతంతో గుణించగా, అది సదాశివుని ఒక దినమౌతుంది, అంటే రాత్రి. అది మహాప్రళయం. సదాశివుని కాలము క్షయమైనప్పుడు బిందువును అర్ధచంద్రుని, నిరోధికను ఆక్రమించి నాదంలో లీనమౌతాడు. నాదం శక్తితత్వంలో, అది వ్యాపినిలో, అది అనాశ్రితమౌతుంది. శక్తికాలమును పరార్ధకోటి గుణితం చేస్తే అనాశ్రితం యొక్క దినమౌతుంది. అనాశ్రితమునకు సమనస్సు పదమౌతుంది. సామానస్యమునకు సామ్యము బ్రహ్మ. ఈ సామనస్యమునకు కన్ను మూసి తెరచుట వంటి లెక్కలేనన్ని కాలములు నడుస్తూ సృష్టి ప్రళయరూపమైన చక్రభ్రమణం నడుస్తూ ఉంటుంది.

ఏకం దశ శతం సహస్రమ్ అయుతం లక్షం నియుతం కోటిః అర్బుదం వృన్దం ఖర్వం నిఖర్వం పద్మం శఙ్కుః సముద్రం అన్త్యం మధ్యమ్ పరార్ధమ్ ఇతి క్రమేణ దశగుణితాని అష్టాదశ, ఇతి గణితవిధిః । ఏవమ్ అసంఖ్యాః సృష్టిప్రలయాః ఏకస్మిన్ మహాసృష్టిరూపే ప్రాణే, సోఽపి సంవిది, సా ఉపాధౌ, స చిన్మాత్రే, చిన్మాత్రస్యైవ అయం స్పన్దో-యదయం కాలోదయో నామ ।

ఏకం1, దశ10, శతం10x10, సహస్రము100x10, అయుతము 1000x10, లక్ష10000x10, నియుతము 100000x10, కోటిః1000000x10, అర్బుదము (పదికోట్లు), వృన్దము (నూరుకోట్లు), ఖర్వము (వెయ్యికోట్లు), నిఖర్వము (పదివేలకోట్లు), పద్మము (లక్షకోట్లు), శఙ్కుః(పదిలక్షలకోట్లు), సముద్రము (కోటికోట్లు), అన్త్యము (పదికోట్లకోట్లు), మధ్యము(నూరుకోట్లకోట్లు), పరార్ధము(వెయ్యికోట్ల కోట్లు) ఈ క్రమంలో ఒకదానికొకటి పదిపది రెట్లుగా పద్దెనిమిది మెట్లుగా ఈ లెక్క ఉంటుంది. ఈ విధంగా లెక్కలేనన్ని సృష్టి ప్రళయములుంటాయి. ఈ మహాసృష్టిరూపమే ప్రాణము. అలాంటిదే సంవిత్. ఉపాధులు కూడా అంతే, చిన్మాత్రము కూడా అంతే, చిన్మాత్రయొక్క స్పందనే కాలము.

తత ఏవ స్వప్నసంకల్పాదౌ వైచిత్ర్యమ్ అస్య న విరోధావహమ్ | ఏవం యథా ప్రాణే కాలోదయః, తథా అపానేఽపి హృదయాత్ మూలపీఠపర్యన్తమ్ | యథా చ హృత్కణ్ఠ-తాలు-లలాట-రన్ధ్ర-ద్వాదశాన్తేషు బ్రహ్మ-విష్ణు-రుద్రేశ- సదాశివానాశ్రితాఖ్యం కారణషట్కమ్, తథైవ అపానేఽపి హృత్కంన్దానన్ద- సంకోచ- వికాస-ద్వాదశాన్తేషు, బాల్య-యౌవన-వార్ధక-నిధన-పునర్భవ- ముక్త్యధిపతయ ఏతే |

కనుక స్వప్నములు సంకల్పములు మొదలైన విచిత్రమంతా దానితో విరోధించదు. ప్రాణమునకు కాలోదయమెలా అవుతుందో అదే విధంగా హృదయము నుండి మూలపీఠంవరకూ అపానమునకౌతుంది. హృదయము, కంఠము, తాళువు, లలాటము, రంధ్రము ద్వాదశాంతములకు వరుసగా బ్రహ్మ, విష్ణువు, రుద్ర, ఈశ్వర, సదాశివుడు, అనాశ్రితుడు ఆరు కారణములౌతున్నారు. అదే విధంగా అపానమునకు కూడా, హృదయము, కందము, ఆనందము, సంకోచము, వికాసము, ద్వాదశాంతములలో - బాల్యము, యౌవనము, వార్ధక్యము, నిధనము, పునర్భవము, ముక్తి వీటికి అధిపతులై ఉన్నారు.

అథ సమానే కాలోదయః | సమానో హార్దీషు దశసు నాడీషు సంచరన్ సమస్తే దేహే సామ్యేన రసాదీన్ వాహయతి | తత్ర దిగష్టకే సంచరన్ తద్దిక్పతిచేష్టామ్ ఇవ ప్రమాతుః అనుకారయతి | ఊర్ధ్వాధస్తు సంచరన్ తిసృషు నాడీషు గతాగతం కరోతి | తత్ర విషువద్దినే బాహ్యే ప్రభాతకాలే సపాదాం ఘటికాం మధ్యమార్గే వహతి | తతో నవశతాని ప్రాణవిక్షేపాణామ్, ఇతి గణనయా బహిః సార్ధఘటికాద్వయం వామే దక్షిణే వామే దక్షిణే వామే ఇతి పఞ్చ సంక్రాన్తయః |

ఇప్పుడు సమానవాయువులో కాలోదయము గురించి చెప్పబడుచున్నది. సమానవాయువు హృదయం నుండి దశవిధనాడులలో సంచరిస్తూ సమస్తదేహంలోనూ రసములను ప్రవహింపజేస్తూ ఉంటుంది. ఎనిమిది దిక్కులలో సంచరిస్తూ ప్రమాతచేత ఆ దిక్పతిచేష్టను అనుకరింపజేస్తూ ఉంటుంది. పైకీ క్రిందకూ మూడు నాడులలో సంచరిస్తూ రాకపోకలను చేస్తూ ఉంటుంది. విషువత్ దినమున బాహ్యంగా ప్రభాతకాలంలో ఘటికంబావు కాలంపాటు మధ్యేమార్గంలో నడుస్తుంది. దానికి 900 ప్రాణవిక్షేపణములుండటం చేత ఘటికన్నర పాటు ఎడమ, కుడి, ఎడమ, కుడి దారులలో నడిస్తే అయిదు సంక్రాంతులౌతాయి.

తతః సంక్రాన్తిపఞ్చకే వృత్తే పాదోనాసు చతుర్దశసు ఘటికాసు అతిక్రాన్తాసు దక్షిణం శారదం విషువన్మధ్యాహ్నే నవ ప్రాణశతాని | తతోఽపి దక్షిణే వామే దక్షిణే వామే దక్షిణే ఇతి సంక్రాన్తిపఞ్చకం, ప్రత్యేకం నవశతాని ఇత్యేవం రాత్రావపి, ఇతి | ఏవం విషువద్దివసే తద్రాత్రౌ చ ద్వాదశ ద్వాదశ సంక్రాన్తయః | తతో దినవృద్ధిక్షయేషు సంక్రాన్తివృద్ధిక్షయః | ఏవమ్ ఏకస్మిన్ సమానమరుతి వర్షద్వయం శ్వాసప్రశ్వాసయోగాభావాత్ | అత్రాపి ద్వాదశాబ్దోదయాది పూర్వవత్ |

ఈ విధంగా అయిదు సంక్రాంతులు ఆవృత్తములై, పదమూడున్నర ఘటికల కాలం దక్షిణాయనంతో శరద్విషువత్ అవగా, మధ్యాహ్నమునకు 900 ప్రాణములౌతాయి. మళ్ళీ కుడి, ఎడమ, కుడి, ఎడమలుగా అయిదు సంక్రాంతులౌతాయి. ఇదే విధంగా 900 ప్రాణములతో రాత్రి కూడా అవుతుంది. ఈ విధంగా పగలూ రాత్రులలో విషువత్తులతో పన్నెండు పన్నెండు సంక్రాంతులౌతున్నవి. దినవృద్ధిక్షయములను బట్టి సంక్రాన్తివృద్ధిక్షయములౌతాయి. ఈ శ్వాసప్రశ్వాసలు కలవనందువలన ఈ విధంగా ఒక సమానవాయువులో రెండువర్షములౌతాయి. ఈ విధంగా మునుపటిలాగా పన్నెండుఅబ్దములౌతాయి.

ఉదానే తు ద్వాదశాన్తావధిశ్చారః స్పన్దమాత్రాత్మనః కాలస్య । అత్రాపి పూర్వవత్ విధిః ।

ఉదానమునకు పన్నెండుసార్ల నడకలో కాలమునకు ఒక స్పన్దమౌతుంది. దానికీ మునుపటి విధముగానే లెక్క.

వ్యానే తు వ్యాపకత్వాత్ అక్రమేఽపి సూక్ష్మోచ్ఛలత్తాయోగేన కాలోదయః ।

కానీ వ్యానం మాత్రము అంతటా వ్యాపించి ఉంటుంది గనుక అక్రమమైనప్పటికీ సూక్ష్మచలనయోగం వల్ల కాలోదయమౌతుంది.

అథ వర్ణోదయః । తత్ర అర్ధప్రహరే అర్ధప్రహరే వర్ణోదయో విషువతి సమః, వర్ణస్య వర్ణస్య ద్వే శతే షోడశాధికే ప్రాణానామ్, బహిః షట్త్రింశత్ చషకాణి ఇతి ఉదయః, అయమ్ అయత్నజో వర్ణోదయః । యత్నజస్తు మన్త్రోదయః అరఘట్టఘటీయన్త్రవాహనవత్ ఏకానుసంధిబలాత్ చిత్రం మన్త్రోదయం దివానిశమ్ అనుసందధత్ మన్త్రదేవతయా సహ తాదాత్మ్యమ్ ఏతి । తత్ర సదోదితే ప్రాణచార సంఖ్యయైవ ఉదయసంఖ్యా వ్యాఖ్యాతా, తద్ద్విగుణితే తదర్ధమ్ ఇత్యాదిక్రమేణ అష్టోత్తరశతే చక్రే ద్విశత ఉదయః, ఇతి క్రమేణ స్థూలసూక్ష్మే చారస్వరూపే విశ్రాన్తస్య, ప్రాణచారే క్షీణే, కాలగ్రాసే వృత్తే సంపూర్ణమ్ ఏకమేవేదం సంవేదనం చిత్రశక్తినిర్భరం భాసతే ।

ఇప్పుడు వర్ణోదయము చెప్పబడుచున్నది. విషువత్ సమమైన అర్ధప్రహరము అర్ధప్రహరములో వర్ణముల వర్ణోదయమౌతుంది. ప్రతి వర్ణమునకూ 216 ప్రాణములుంటాయి, బయటకు 36 చషకములుదయిస్తాయి. ఆ విధంగా ప్రయత్నం లేకుండానే వర్ణములుదయిస్తాయి. యత్నంతో మంత్రములుదయిస్తాయి. అరఘట్టఘటీయన్త్రమును నడిపించినట్లుగా, రాత్రిమ్బవళ్ళు మంత్రమును అనుసంధానం చెయ్యడం వల్ల యోగికి మంత్రదేవతతో తాదాత్మ్యత ఏర్పడుతుంది. అక్కడ సదోదిత ప్రాణచారసంఖ్యయే ఉదయసంఖ్యగా చెప్పబడుతుంది. అది రెండైతే ఇది సగమౌతుంది. ఈ క్రమంలో 108 సంఖ్యలున్న చక్రములు 200 ఉదయిస్తాయి. ఈ క్రమంలో స్థూలసూక్ష్మ చారస్వరూపంలో విశ్రాంతి తీసుకునేవాడికి ప్రాణచారము క్షీణిస్తుంది, కాలగ్రస్తమై వృత్తం సంపూర్ణమౌతుంది. చిత్రశక్తితో కూడిన ఒక్కటే సంవిత్తు భాసిస్తుంది.

కాలభేద ఏవ సంవేదనభేదకః న వేద్యభేదః శిఖరస్థజ్ఞానవత్, జ్ఞానస్య యావాన్ అవస్థితికాలః స ఏవ క్షణః, ప్రాణోదయే చ ఏకస్మిన్ ఏకమేవ జ్ఞానమ్, అవశ్యం చైతత్, అన్యథా వికల్పజ్ఞానమ్ ఏకం న కించిత్ స్యాత్మ్రమికశబ్దారూషితత్వాత్ మాత్రాయా అపి క్రమికత్వాత్ । యదాహ 'తస్యాదిత ఉదాత్తమర్ధహ్రస్వమ్' । (పా. వ్యా. 1-2-32) ఇతి ।

కాలభేదమే సంవేదనలో భేదమును సృష్టిస్తుందిగాని వేద్యములో భేదం వల్ల కాదు. శిఖరంపైన ఉన్నవాని జ్ఞానంలాగా. జ్ఞానముయొక్క అవస్థితి కాలమే క్షణము. ఒక్క ప్రాణోదయంలో ఒక్కటే జ్ఞానముంటుంది. కాకుంటే వికల్పజ్ఞానం ఎక్కడా ఒక్కటి కాలేదు. క్రమములైన శబ్దముల వల్లనే మాత్రలకు కూడా క్రమత్వం కలుగుతోంది. ఈ విధంగా చెప్పబడింది - "దానినుండి ఉదయించిన ఉదాత్తము అర్ధహ్రస్వమైనది..."

తస్మాత్ స్పన్దాన్తరం యావత్ న ఉదితం తావత్ ఏకమేవ జ్ఞానం । అత ఏవ ఏకాశీతిపదస్మరణసమయే వివిధధర్మానుప్రవేశముఖేన ఏక ఏవ అసౌ పరమేశ్వరవిషయో వికల్పః కాలగ్రాసేన అవికల్పాత్మా ఏవ

సంపద్యతే ఇతి । ఏవమ్ అఖిలం కాలాధ్వానం ప్రాణోదయ ఏవ పశ్యన్, సృష్టిసంహారాంశ్చ విచిత్రాన్ నిఃసంఖ్యాన్ తత్రైవ ఆకలయన్, ఆత్మని ఏవ పారమేశ్వర్యం ప్రత్యభిజానన్ ముక్త ఏవ భవతి ఇతి ।

కనుక స్పందాంతరమున ఏదైతే ఉదయించినదో అంతవరకూ జ్ఞానము ఏకమే. అందుకనే 81 పదముల స్మరణసమయములో వివిధధర్మముల అనుప్రవేశం ద్వారా ఒక్కటే అయినట్టి పరమేశ్వర విషయవికల్పము కాలగ్రాసంవల్ల అవికల్పాత్మయై భాసిస్తుంది. ఈ అఖిలమైన కాలాధ్వమును ప్రాణోదయముగా చూచుచూ, లెక్కలేనన్ని విచిత్రములైన సృష్టిసంహారములను అందులోనే గ్రహించుచూ, తనలోనే పరమేశ్వరుని ప్రత్యక్షజ్ఞానం ద్వారా గ్రహించిన వాడు ముక్తుడౌతాడు.

శ్లో॥ సంవిద్రూపస్యాత్మనః ప్రాణశక్తిం పశ్యన్రూపం తత్రగం చాతికాలమ్ ।
సాకం సృష్టిస్థితిసంహారచక్రై-ర్నిత్యోద్యుక్తో భైరవీభావమేతి ॥

సంవిద్రూపియైన ఆత్మలో ప్రాణశక్తిని, అందులోనున్న కాలాతీతరూపమును చూచుచూ, సృష్టి-స్థితి-సంహారచక్రములందు నిత్యమూ ఉద్యుక్తుడైనవాడు భైరవభావమును పొందుచున్నాడు.

వ్యాఖ్యానము

ఈ అధ్యాయములో బాహ్యావిధి ఉపదేశింపబడింది. బాహ్యావిధి యనేది స్థానప్రకల్పమని చెప్పబడుతుంది. మాలినీవిజయ తంత్రమును అభినవగుప్తులు ఎంతో శ్లాఘించారు. దానిలో అణవోపాయమును వివరిస్తూ, 'ఉచ్చారము, కరణము, ధ్యానము, వర్ణము, స్థానప్రకల్పనము మొదలైన సాధనల సహాయంతో పరమేశ్వరునిలో లయం కావడమే అణవోపాయమ'ని చెప్పబడింది.

స్థానప్రకల్పనమంటే, అంతటా వ్యాపించియున్న దానిని సూటిగా చూడలేనప్పుడు, దానికంటూ ఒక స్థానమును కల్పించి, తద్వారా దానిని గుర్తించడమే స్థానప్రకల్పము. దీనికి మూడు స్థానములున్నాయి. అవి, 1. ప్రాణవాయువు 2. యోగియొక్క దేహము 3. బయటి వస్తువులు.

ప్రాణవాయువు

దీనికి రెండు రూపములున్నాయి. ఒకటి, స్థూలప్రాణము. ఇది ఆకాశంలాగా సర్వవ్యాపిగా ఒక్కటిగా ఉంటుంది. రెండు, సూక్ష్మప్రాణము. ఇది జీవులలో పంచప్రాణములుగా ఉంటూ, అనేకములైన జీవక్రియలను చేస్తూ ఉంటుంది. ప్రాణము, అపానము, సమానము, ఉదానము, వ్యానములే పంచప్రాణములు.

యోగియొక్క దేహము

యోగిలోని యోగచక్రములు, షోడశాధారములు ఈ కోవకు చెందుతాయి.

బాహ్య వస్తువులు

మండలము (యంత్రము), స్థండిలము (పూజావేదిక), పాత్ర (ఘటము), అక్షసూత్రము (జపమాల), పుస్తకము (మంత్ర గ్రంథము), లింగము (శివలింగము), విగ్రహములు మొదలైనవి,

ఈ మూడింటిని ఆధారములుగా తీసుకుంటూ పరమేశ్వరచైతన్యమును యోగియైనవాడు అందుకోవాలి. వీటిలో మొదటి రెండూ, యోగి యొక్క లోపల ఉన్నట్టివి. మూడవది బయటది. ఈ స్థాయిలో కూడా, కొద్దిగా పైమెట్టులో ఉన్నవారికి మొదటి రెండు సాధనలు చెప్పబడతాయి. అవికూడా చేయలేనివారికి, మూడవతరగతికి చెందిన విగ్రహాది బయటి సాధనలు చెప్పబడతాయి.

ప్రాణసాధన

ప్రాణమన్నది ధ్యానసాధనలో చాలా ముఖ్యమైనది. ఎలాగంటే, ఇప్పటివరకూ చెప్పబడిన ఆరు అధ్వములూ ప్రాణములోనే ఉన్నాయి గనుక. ప్రాణము రెండు విధములుగా ఉంటుందని ఇంతకు ముందు చెప్పినారు. ఒకటి విశ్వవ్యాప్తమైన ప్రాణము, రెండు యోగి దేహంలో ఉన్నట్టి ప్రాణము. పైన చెప్పబడిన ఆరు అధ్వములూ విశ్వప్రాణంలో ఉంటూ విశ్వసృష్టిని చేస్తున్నాయి. అదే విధంగా యోగిదేహంలో కూడా ఉంటూ, అతని లోపలి సృష్టిని చేస్తున్నాయి. విశ్వంలో ఉన్నవాటికి, యోగి దేహంలో ఉన్నవాటికి సమన్వయము చేయడమే తంత్రశాస్త్ర లక్షణము.

పరమేశ్వరుని యొక్క ఉచ్ఛ్వాస నిశ్వాసములే సృష్టి లయములు. అదే విధంగా, యోగియొక్క దేహంలోని సృష్టి లయములే అతని యొక్క ఊపిరి నడకలు. మామూలు మాటలలో చెప్పాలంటే, ఉచ్ఛ్వాస నిశ్వాసములే కాలము. ఇంకొక విధంగా, ఊపిరి బయటనుంచి లోపలకు, లోపలనుంచి బయటకు ఆడుతూ ఉండటమే కాలము. ఈ నిర్వచనము తంత్రశాస్త్రంలో ఇవ్వబడింది. కాలాన్ని అనేకులు అనేకరీతులలో నిర్వచించే ప్రయత్నమును గావించారు. శాస్త్రవేత్తలు కూడా ఈ ప్రయత్నమును చేశారు. కానీ, కాలమును సరిగ్గా నిర్వచించినది యోగ-తంత్ర శాస్త్రమొక్కటే. కాలానికి ఒక అద్భుతమైన నిర్వచనాన్ని, అభినవగుప్తాచార్యులవారు ఇక్కడ ఇచ్చారు. అదేమంటే, ప్రాణము యొక్క క్రమ - అక్రమ చలనమే కాలము. వీటినే సవ్య - అపసవ్య చలనములని చెప్పవచ్చు. అంటే, ఉచ్ఛ్వాస నిశ్వాసములు. ఊపిరి ఆడుతున్నంతవరకూ జీవికి కాలం ఉంటుంది. ఊపిరి ఆగిపోతే కాలం ఆగిపోతుంది. 'అతనికి కాలం మూడింది, అతడు కాలం చేశాడు' అంటూ, చనిపోయినవానిని గురించి చెప్పడం మనకందరికీ తెలుసును కదా ! కనుక, ఊపిరి ఆడటమే కాలమన్నది తంత్రశాస్త్రపు అవగాహన.

ఊపిరి ఉన్నవాడికే కాలం తెలుస్తుంది. ఊపిరాగిపోతే కాలం లేదు. 'మిగతా వాళ్ళకుంది కదా?' అని ప్రశ్న రావచ్చు. వారిలో కూడా, ఎవరికైతే ఊపిరి ఆడుతున్నదో వారివరకూ కాలం ఉంది. ఆగిపోతే లేదు. కాలాన్ని తెలుసుకునేవాడు లేనప్పుడు, వాడివరకూ కాలం లేనట్లే. కాలమనేది సాపేక్షమన్నది గమనార్హం. ఒక్కొక్క ప్రదేశంలో కాలం ఒక్కొక్కవిధంగా ఉంటుంది. కొన్నిచోట్ల అసలు ఉండకపోవచ్చు కూడా. అది కాలాతీత స్థితి. సైన్స్ ప్రకారం కూడా ఇది సాధ్యమే.

కాలంలో కూడా పరమేశ్వరుడే నిండి యున్నాడు. పరమేశ్వరుడు లేనిదంటూ సృష్టిలో ఏదీ లేదు. ఆ పరమశివుని వ్యక్తరూపమే, ఆవిర్భావమే, శక్తిప్రసారమే 'కాళి' అనబడే శక్తి. కాళియొక్క వ్యక్తీకరణలో ఉన్న 'సవ్య-అపసవ్య' చలనస్థితులే ప్రాణము యొక్క నడకలు.

సంవిత్తే ప్రమాత, ప్రమాణము, ప్రమేయము మొదలైన రూపములను వరుసగా ధరిస్తున్నది. ఇది

కాళియొక్క సవ్య (క్రమ) రూపము. ఈ స్థితులనుండి అది తిరోహితమై (వెనుకకు నడచి) తిరిగి తనదైన శూన్యరూపంలో ఉంటున్నది. ఇది అపసవ్య (అక్రమ) రూపము. మరలా, తనకున్నట్టి పరమ స్వతంత్రశక్తితో, ప్రమేయమును స్వీకరించే ఉత్సాహంలో శూన్యస్థితినుండి క్రిందకు దిగివస్తూ, క్రియాశక్తి ప్రధానమైన ప్రాణరూపమును ధరించి, జీవస్వభావమును ఆరోపించుకొని, అయిదు విధములైన రూపములతో మానవదేహమును పూరిస్తుంది. మళ్ళీ అందులోని చేతనారూపంలో తానే భాసిస్తుంది. కనుక ఈ క్రియాశక్తి స్వరూపమంతా కాళియే.

అధ్వములంటే, పరమశివుని చేరుకునే మార్గములని ఇంతకుముందు వివరించాను. క్రియాశక్తి మొదటిభాగంలో కాలాధ్వముంటుంది. అంటే, కాలమనే దారి ఉంటుంది. దాని తరువాతి భాగంలో, రకరకములైన బాహ్యరూపములతో కూడిన దేశాధ్వముంటుంది. కనుక, మొదటిది కాలము, తరువాత (ప్ర)దేశము, అవుతుంది.

ఈ కాలాధ్వంలో, వర్ణము, మంత్రము, పదములనే మూడు మెట్లున్నాయి. ఇవి కాలం యొక్క రూపములే. దానియొక్క పరము, సూక్ష్మము, స్థూలరూపములవడం చేత, అవి కాలంలో ఉంటున్నాయి. వర్ణమంటే బీజాక్షరము. వాటితో ఏర్పడేవి మంత్రములు. మంత్రములతో ఏర్పడేవి పదములు. ఇవి ఒకదానికంటే మరొకటి వరుసగా సూక్ష్మతమములుగా ఉంటాయి. అంటే, వర్ణము పరమనే స్థాయిలో ఉంటుంది. మంత్రము సూక్ష్మస్థాయికి చెందినది. పదములు స్థూలములు.

ఇదేవిధంగా, దేశాధ్వంలో కూడా మూడు మెట్లున్నాయి. అవి తత్త్వము, పురము, కళ. తత్త్వములంటే సృష్టిలో ఉన్న 36 తత్త్వములు, పురము లేదా భువనములంటే వివిధములైన లోకములు. ఇవి 118 అని తంత్రశాస్త్రమంటుంది. కళలంటే సృష్టిలోని వెలుగులు, లోకముల స్వభావములు. అవి అయిదు. ఇవన్నీ, ఆయా అధ్యాయములలో వివరించబడతాయి.

ఈ క్రింది పట్టికను గమనించండి.

పరమశివుడు	కాళి	కాలాధ్వము	వర్ణము	50
			మంత్రము	3
			పదము	81
		దేశాధ్వము	కళ	5
			పురము	118
			తత్త్వము	36

క్లుప్తముగా చెప్పవలెనంటే, కాలము ప్రాణస్వరూపమై ఉన్నది. ప్రాణము శబ్దరూపంలో ఉన్నది. దానిలో మూడు భాగములున్నాయి. అవి - వర్ణము, మంత్రము, పదము. దేశమంటే ప్రదేశమని అర్థము. దీనిలో కూడా మూడు భాగములున్నాయి. అవి - తత్త్వము, పురము (భువనము), కళ. ఈ కాలాధ్వము, దేశాధ్వములు, కాళికారూపమైన క్రియాశక్తిలో సగము సగములుగా ఉంటాయి.

ప్రాణశక్తి యనేది విశ్వంలో అన్నిచోట్లా ఉన్నది. మానవదేహము లోపల కూడా అది పనిచేస్తున్నది, బయటకూడా పనిచేస్తున్నది. దేహము లోపల, శ్వాసించడము, గుండె కొట్టుకోవడము, రక్తప్రసరణ, ఆహారము జీర్ణం కావడం మొదలైన జీవక్రియలను నడుపుతున్నది. విశ్వంలో పంచభూతముల చలనంగా, గ్రహగోళముల చలనంగా, నక్షత్రములలో కాంతిని, వేడిని పుట్టిస్తున్న ప్రక్రియలుగా ఉన్నది. కానీ, ఇది స్పష్టంగా వ్యక్తమవుతున్నది మన హృదయంలోనే కాబట్టి, దీనిని గ్రహించాలంటే మన హృదయాలలోనే గ్రహించాలి. కనుక, దానినక్కడ మాత్రమే గుర్తించాలి, నిరూపించాలి.

మన లోలోపల నిత్యమూ నడుస్తున్న ప్రాణశక్తి చలనమును గ్రహించాలంటే, అది మూడు రకములుగా జరుగుతుంది. ప్రాణసంచారంలో వీటిని 1. ప్రభుశక్తి 2. ఆత్మశక్తి 3. ప్రయత్నము అని పిలుస్తాము. ఇవి గౌణము (అనుషంగికము, ముఖ్యము కానిది) మరియు ముఖ్యములుగా ఉంటాయి.

దైవశక్తి - ఆత్మశక్తి - స్వప్రయత్నము

యోగిలోని ప్రాణశక్తిలో - దైవశక్తి, ఆత్మశక్తి, స్వప్రయత్నము - ఈ మూడునూ రకరకములైన పాళ్ళలో కలసి ఉంటాయి. దైవశక్తి ఎంతగా ప్రాణములో వ్యాపిస్తుందో అంతగా దాని గుణము వృద్ధి అవుతుంది. ఆత్మశక్తిని బట్టి ప్రాణము యొక్క శక్తి ఉంటుంది. యోగియొక్క సాధనాప్రయత్నంలోని తీవ్రతను బట్టి అతనికి కలిగే ఫలితం ఉంటుంది. కనుక ఈ మూడు లక్షణములు ప్రాణశక్తికి కీలకములై ఉంటాయి. అనగా, ప్రాణముపైన దైవశక్తి యొక్క పనిని బట్టి - ప్రాణము యొక్క గుణము, ఆత్మశక్తి యొక్క పనిని బట్టి - ప్రాణముయొక్క శక్తి, సాధనాతీవ్రతను బట్టి - లభించే ఫలితములుంటాయి.

ప్రభుశక్తి అనే మాటతో ఈశ్వరశక్తి సూచితమౌతున్నది. ఈశ్వరునకు - వామశక్తి, జ్యేష్ఠాశక్తి, రౌద్రీశక్తి అనే మూడు శక్తులున్నట్లు శైవాగమములలో చెప్పబడుతుంది. ఇవి జీవులలో ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులుగా ప్రకటితములౌతూ ఉంటాయి. వీటినే పరా, పరాపరా మరియు అపరా శక్తులంటారు. యోగులలో అయితే, ఇడా, పింగళా, సుషుమ్నా అనే మూడునాడులుగా ఇవి ఉంటూ ప్రాణసంచారమునకు కేంద్రములుగా ఉంటాయి.

ప్రాణసంచారము

మానవులందరిలోనూ ప్రాణశక్తి ఒకే విధంగా ఉండదు. ఎవరెవరి బలమును బట్టి, ప్రయత్నమును బట్టి, దేహము యొక్క స్థితిని బట్టి, వారివారి హృదయమునుండి ద్వాదశాంతము వరకూ, బొటనవ్రేలికణుపు కొలతతో 36 రెట్లుగా ప్రాణసంచారం లోపలకూ బయటకూ జరుగుతూ ఉంటుంది. బొటనవ్రేలి కణుపును 'అంగుళం' అంటాము. ఈ అంగుళం కొలత ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా ఉంటుంది. ఎవరికి వారికి, హృదయం నుండి ద్వాదశాంతం వరకూ 36 అంగుళముల దూరం ఉంటుంది. దానిలో ఘడియలు, తిథులు, మాసములు, సంవత్సరము, సంవత్సర సమూహములు - ఈ విధంగా కాలం మొత్తమూ ఇమిడి ఉంటుంది. అనగా, మనము పీల్చుకునే ఊపిరిలోనే కాలం ఉన్నది. కాలవిభజనకూడా దానిలోనే ఉన్నది. దానినిక్కడ వివరిస్తున్నారు.

ఒక అంగుళము మరియు దానిలో అయిదవవంతు కలసి చషకమనబడుతుంది. అటువంటి ఆరు చషకములు ఒక ఘటిక అనబడుతుంది. ఈ విధముగా చషకములు, ఘటికలతో 72 అంగుళములు ఏర్పడతాయి.

1 చషకము = 1.2 అంగుళములు

6 చషకములు=- 7.2 అంగుళములు - 1 ఘటిక

5 ఘటికలు = 30 చషకములు - 36 అంగుళములు - ఆరోహణం

5 ఘటికలు = 30 చషకములు - 36 అంగుళములు - అవరోహణం

10 ఘటికలు = 72 అంగుళములు - 1 అవృత్తి

కాలగణనంలో చూచినప్పుడు, ఒక ఘటిక అంటే 24 నిముషముల సమయము. రెండు ఘటికలైతే ఒక ముహూర్తము, అంటే, 48 నిముషములు. రెండున్నర ఘటికలు నేటి కాలమానంలో ఒక గంట అవుతున్నాయి.

హృదయం నుండి ద్వాదశాంతము వరకు	ఉచ్ఛ్వాసము	36 అంగుళములు	ఆరోహణము
ద్వాదశాంతము నుండి హృదయం వరకు	నిశ్వాసము	36 అంగుళములు	అవరోహణము
	మొత్తము	72 అంగుళములు	ఒక అవృత్తి

పగలు			
10 ఘటికలు	4 గంటలు (ఉదయం 6 - ఉదయం 10)	మొదటి అవృత్తి	సృష్టి
10 ఘటికలు	4 గంటలు (ఉదయం 10 - మధ్యాహ్నం 2)	రెండవ అవృత్తి	స్థితి
10 ఘటికలు	4 గంటలు (మధ్యాహ్నం 2 - సాయంత్రం 6)	మూడవ అవృత్తి	లయం
30 ఘటికలు	12 గంటలు		
రాత్రి			
10 ఘటికలు	4 గంటలు (సాయంత్రం 6 - రాత్రి 10)	నాలుగవ అవృత్తి	సృష్టి
10 ఘటికలు	4 గంటలు (రాత్రి 10 - రాత్రి 2)	అయిదవ అవృత్తి	స్థితి
10 ఘటికలు	4 గంటలు (రాత్రి 2 - ఉదయం 6)	ఆరవ అవృత్తి	లయం
30 ఘటికలు	12 గంటలు		

తిథి ఉదయము

ఇప్పుడు తిథిని గురించి చెప్పబడుతున్నది. రెండుంబావు అంగుళములను 'తుటి' అంటున్నాము. ఒక ఆరోహణ (36 అంగుళముల) లో 16 తుటులున్నాయి. అదే విధంగా అవరోహణ (36 అంగుళముల) లో మళ్ళీ 16 తుటులున్నాయి. తుటిలో సగభాగం, 'సంధ్య' అవుతుంది. నాలుగు తుటులు కలసి ఒక ప్రహరము (మూడు గంటలు) అవుతాయి. ఒక తుటి యంటే 45 నిముషములు. ఒక అంగుళమునకు 20 నిముషములౌతుంది. యోగియైనవాడు, ఈ విధముగా తన ప్రాణములోనే, అనగా శ్వాసలోనే, కాలస్వరూపమును ధ్యానించాలి.

శ్వాస, దేహంలోనుంచి బయటకు పోవడం పగలైతే, లోపలకు రావడం రాత్రి యనబడుతుంది. పగలంటే సృష్టి, రాత్రియంటే లయం. ఈ విధంగా శ్వాసలోనే, పగలూ రాత్రులు, సృష్టి లయములతో కూడిన 'తిథి' ఏర్పడుతుంది.

మాసోదయము

ఈ విధానములో - శుక్ల, కృష్ణ పక్షములతో కూడిన మాసము కూడా ప్రాణము (శ్వాస) లోపలనే ఉన్నట్లు యోగియైనవాడు ధ్యానించాలి. ఇక్కడ దినమే కృష్ణపక్షమని, రాత్రి శుక్లపక్షమని చెప్పబడింది. ఎలాగంటే, దినములో సూర్యునికి బలం పెరుగుతుంది, చంద్రునికి బలం తగ్గుతుంది. కనుక అది కృష్ణపక్షము. రాత్రిలో సూర్యునికి బలం తగ్గుతుంది, చంద్రునికి బలం పెరుగుతుంది. కనుక, అది శుక్లపక్షమౌతున్నది. దినమంటే నిశ్వాసమని, రాత్రియంటే ఉచ్ఛ్వాసమని తాంత్రికపరిభాషలో అర్థం చేసుకోవాలి.

శుక్లపక్షపు రోజులలో చంద్రసూచకమైన ఇడానాడి బలమును పుంజుకుంటుంది. కృష్ణపక్షపు రోజులలో సూర్యసూచకమైన పింగళానాడి బలమును పుంజుకుంటుంది. ఇక్కడ ఒక్కొక్క తుటి ఒక్కొక్క తిథి అవుతుంది. కనుక పదిహేను తుటులు పదిహేను తిథులౌతాయి. పదహారవ తుటిలో సగం 'సంధ్య' అవుతుంది. మిగతా సగం పాడ్యమి అవుతుంది.

ఈ సంధ్యాసమయమన్నది కాలపు పరిధిలో ఉండదు. కనుక ధ్యానసాధనకు ప్రశస్తమైనది. ఈ సాధనలో, పగటికీ రాత్రికీ అర్థములు వేరుగా ఉంటాయి. వేద్యమును (తెలిసికొనబడుతున్న దానిని), వేత్త (తెలుసుకొంటున్నవాడు) చూస్తున్నపుడు పగలు అనబడుతుంది. అదే విధంగా, వేత్తలో వేద్యము లయం కావడం రాత్రి అవుతుంది.

ఈ ఆరోహణా అవరోహణలలో, వెలుగు (క్రియ, సృష్టి), చీకట్లు (విశ్రాంతి, లయము), తిథులను బట్టి ఎక్కువతక్కువలుగా మారుతూ ఉంటాయి. తిథులలో చంద్రకాంతి పెరుగుతూ తరుగుతూ ఉన్నట్లుగా ఇది కూడా జరుగుతుంది. ఈ రెండూ ఎక్కడైతే సమానంగా ఉంటాయో అది 'విషువత్' అవుతుంది.

అనగా, సాధారణ స్థితిలో, పగలూ రాత్రులు సమానంగా ఉండకుండా హెచ్చుతగ్గులుగా ఉంటాయి. ఉత్తరాయణంలో పగళ్ళు పెద్దవిగా ఉంటాయి. దక్షిణాయనంలో రాత్రుళ్ళు పెద్దవిగా ఉంటాయి. పగలంటే ప్రకాశము, వెలుగు. పగటిపూట మనము వస్తువులను స్పష్టంగా చూడగలుగుతాము. కనుక అది ప్రకాశాత్మకం. దానిలో వేద్యము (గోచరించే వస్తువు) కు ప్రాముఖ్యత ఎక్కువ. అలాగే, రాత్రిపూట చీకటి

హెచ్చుగా ఉంటుంది. అది విశ్రాంతి ప్రాధాన్యమైన సమయము. అప్పుడు వస్తువులు కనిపించవు. ఈ స్థితిలో ఉన్నపుడు, వేద్యము కంటే వేత్త (తెలిసికొనేవాడు) కు ప్రాముఖ్యత ఎక్కువ. కనుక అది ఆహ్లాదాత్మకం. యోగపరిభాషలో వీటినే ఇడా పింగళా నాడులలో ప్రాణసంచారమని చెబుతారు. పగలూ రాత్రీ అనేవి ఏడాదిలో రెండుసార్లు మాత్రమే సమానంగా ఉంటాయి. వాటిని విషువత్ దినములంటారు. తంత్రపరిభాషలో చెప్పాలంటే, ఇడా పింగళా నాడులు, సూర్యచంద్రులు, పగలూ రాత్రులు, ప్రకాశ విశ్రాంతులు, వేత్త వేద్యములు ఎప్పుడు సమానంగా ఉంటాయో అది విషువత్ సమయం. యోగులు ఈ విధంగా సమస్తమునూ తమలోనే గ్రహిస్తారు.

కృష్ణపక్షంలో ఈ ప్రక్రియ ఎలా ఉంటుందో చూద్దాం. చంద్రుడు సూర్యునికి దగ్గర కావడమే కృష్ణపక్షము. కనుక ఒక్కొక్క తిథికీ ఒక్కొక్క చంద్రకళ తగ్గిపోతూ వస్తుంది. అమావాస్యనాడు పూర్తిగా చీకటిగా ఉంటుంది. సూర్యుడు ప్రాణమని, చంద్రుడు అపానమని తంత్రశాస్త్రంలో చెప్పబడుతుంది. ఈ విధంగా చూచినప్పుడు, ప్రాణమనే సూర్యునికి, అపానమనే చంద్రుడు ఒక్కొక తిథికీ దగ్గరౌతూ, తనవైన ఒక్కొక్క కళను అతనికి అర్పిస్తూ వస్తాడు. ఈ విధంగా తన కళలను అర్పించి క్షీణుడైన చంద్రుడు, పదిహేను తుటులలో ద్వాదశాంతమును సమీపించి, ప్రాణసూర్యునిలో లీనమౌతాడు. దాని తరువాత ఒక తుటిలో సగభాగం పాటు, 'పక్షసంధి' అవుతుంది. అంటే, శుక్లపక్షానికీ కృష్ణపక్షానికీ మధ్యలో ఉన్న సంధికాలం. ఒక తుటి అంటే, 45 నిముషములు గనుక, దానిలో సగభాగమైన 22.5 నిముషములు 'సంధికాలం' అవుతుంది. దానిలో, ముందు సగము అమావాస్యకు చెందిన భాగమౌతుంది. అంటే, 11.25 నిముషములన్నమాట. రెండవ సగభాగము, అంటే ఇంకొక 11.25 నిముషములు పాడ్యమికి చెందిన భాగమౌతుంది. దగ్గు లేదా తుమ్ము లేదా అటువంటి ఇతరపనుల వల్ల, ఈ పాడ్యమి భాగంలోకి, అమావాస్యభాగం కలసినప్పుడు, 'తిథిచ్ఛేదం' అనబడేది జరుగుతుంది. దానినే 'గ్రహణం' అని తాంత్రికులు పిలుస్తారు. కనుకనే, ఏదైనా పనిని మొదలుపెట్టే సమయంలో ఎవరైనా దగ్గినా, తుమ్మినా, అది గ్రహణసమయం కనుక, శకునం మంచిది కాదని, కొంచం ఆగి, కాళ్ళను కడుక్కుని బయలుదేరమని పెద్దవాళ్లంటారు. ఈ ఆచారం వెనుకనున్న తంత్రవిజ్ఞానం ఇదే.

గ్రహణమంటే, రాహువు చంద్రుని మ్రింగడం. రాహువు మాయాస్వరూపుడు. మాయ అనేది పరమేశ్వరుని శక్తియే. రాహువు ప్రమాత, అంటే, గ్రహించేవాడు. చంద్రుడు వేద్యము, అంటే, గ్రహింపబడే వస్తువు. మాయారూపియైన జ్ఞాత, జ్ఞేయమును నశింపజేయలేదు. ఎందుకనగా, అది పరమేశ్వరస్వరూపము గనుక. అదే విధముగా, చంద్రుడు (జీవుడు) కూడా సూర్యుని (పరమశివుని) వెలుగును వెదజల్లేవాడేగాని, ఇతరుడు కాదు. కనుక మాయారూపియైన జ్ఞాత, జ్ఞేయమును తాత్కాలికంగా ఆచ్ఛాదించగలదు. ఈ గ్రహింపునే 'ఆచ్ఛాదన' అంటాము. ఈ విధమైన ఆచ్ఛాదన వలన, అంటే, వస్తువును గ్రహిస్తున్నందువలన, దానిరూపంలో ఉన్న పరమేశ్వరుని చైతన్యమునే మాయ ఆస్వాదిస్తున్నది. దీనినే - గ్రహణరాహువు - సూర్యునిలో ఉన్న చంద్రుని అమృతమును త్రాగుతాడని మార్మికభాషలో చెప్పినారు.

ఈ విధంగా, గ్రహణసమయంలో, రాహువు, చంద్రుడు, సూర్యుడు ఒక్కటౌతున్నారు. అంటే, 'అనుభూతి' అనబడే ప్రక్రియలో ఉన్నట్టి, ప్రమాతృ (జ్ఞాత)- ప్రమాణ (జ్ఞాన) - ప్రమేయ (జ్ఞేయ) ములనబడే మూడు విభాగములు మాయమౌతున్నాయి. అనుభూతి ఒక్కటిగా మారుతున్నది. కనుక గ్రహణసమయమనేది

పారలౌకిక ఫలములనిచ్చే పుణ్యకాలమౌతున్నది. అందుకనే, ఆ సమయంలో చేయబడిన జపధ్యానాది సాధనలు అనంతమైన ఫలితములనిస్తాయని శాస్త్రములు చెబుతున్నాయి.

ఆ తరువాత, చిదర్కము (చిద్రూపియైన సూర్యుని తేజస్సు) అనబడే ప్రాణము చంద్రునిలో ప్రవేశించి, ఒక్కొక్క కళను అపానచంద్రునిలో నింపుతుంది. ప్రాణమంటే సూర్యుని వెలుగు. దానికి మరోపేరు అర్కచైతన్యము. అది, మళ్ళీ అమావాస్య చంద్రునిలో ప్రవేశించి, ఒక్కొక్క కళనూ నింపుకుంటూ, ఒక్కొక్క తిథినీ మళ్ళీ పేర్చుకుంటూ పోతుంది. అటువంటి పదిహేను తుటుల తర్వాత పూర్ణిమ వస్తుంది. దాని తరువాత మళ్ళీ తుట్యర్థభాగం 'పక్షసంధి'. ఆ తరువాత మళ్ళీ గ్రహణము, ఇవన్నీ ముందువలెనే వస్తాయి. ఈ గ్రహణసమయము ఐహికఫలప్రదమై ఉంటుంది. ఈ విధంగా మాసమనేది యోగియొక్క ప్రాణంలోనే ఉదయిస్తుంది.

వర్షోదయము

ఈ సాధనలో, ఉచ్ఛ్వాస నిశ్వాసములతో కూడిన ఒక ఆవృత్తిలో ఒక సంవత్సరముంటుంది. తంత్రశాస్త్ర ప్రకారము, కృష్ణపక్షమే ఉత్తరాయణము, అంటే, ఊపిరిని వదలడం (నిశ్వాసం) ఉత్తరాయణమని అర్థం.

ఉత్తరాయణమంటే, మకరరాశి నుండి మిథునరాశి వరకూ సూర్యుని గమనము. ఈ ఆరు మాసములు, హృదయము నుండి ద్వాదశాంతము (యోగపరిభాషలో చెప్పవలెనంటే, అనాహత చక్రము నుండి సహస్రార చక్రము) వరకు ఉన్న 36 అంగుళములలో ఇమిడి ఉంటాయి. అంటే, ప్రతి ఆరు అంగుళములకు, ఒక రాశినుండి మరొక్క రాశికి సూర్యసంక్రమణం జరుగుతుంది. మాసములోని ఆరు అంగుళములలో, ఒక్కొక్క అంగుళము అయిదుతిథులతో సమానము. అంటే, అంగుళములో అయిదవభాగము ఒక తిథి అవుతుంది. కనుక అయిదార్లు ముప్పై తిథులౌతాయి. మళ్ళీ ఈ తిథిలో కూడా దినరాత్రి విభాగమున్నది. అంటే, అంగుళములో పదవభాగము పగలౌతుంది. అంతే భాగము రాత్రి అవుతుంది. ఈ రెండూ కలసి ఒక తిథి అవుతాయని అర్థము. ఇదే విధంగా శ్వాస పీల్చుకోవడం దక్షిణాయనమౌతుంది.

మకరరాశిలో సూర్యుని ప్రవేశంతో, ఉత్తరాయణ పుణ్యకాలం మొదలై, పగటివెలుగు క్రమేణా పెరుగుతూ వస్తుంది. ఇది, గర్భంలోని పిండము పెరగడానికి సూచికగా ఉంటుంది. ఆయా సామ్యములు ఈ క్రిందివిధంగా ఉంటాయి.

సంఖ్య	రాశి	స్థితి
1	మకరం	తల్లి గర్భంలో పిండంగా ఉన్న స్థితి
2	కుంభం	జన్మించాలన్న ఇచ్ఛ తలెత్తడం
3	మీనం	జన్మించాలన్న తపన పెరగడం
4	మేషం	జననానికి ఉద్యమించడం
5	వృషభం	జననం మొదలు
6	మిథునం	జన్మించడం

శిశువు, తల్లిగర్భంలో ఉన్నపుడు, నాలుగవ నెలనుండి ప్రతినెలా ఒక్కొక్క విధమైన వైదికక్రియను తండ్రి నిర్వర్తిస్తాడు. దానివల్ల, శిశువుకు మంచి జరుగుతుందని, ఆయుష్షుకు వృద్ధి కలుగుతుందనే భావన ఒకటి ఉన్నది. అదే విధంగా, ప్రాణసాధనలో కూడా, ఆయా మాసముల కాలసమయాలలో చేయబడిన ఉపాసన, ఉద్భవించబోతున్న జ్ఞానమనే శిశువుకు పరిపుష్టిని కలుగజేస్తుంది. బాహ్యామైన ఉత్తరాయణమునకూ, అంతరిక ప్రాణసాధనలోని ఉత్తరాయణమునకూ ఇదే సామ్యము.

రాశిచక్రంలోని పన్నెండు రాశులకు, పన్నెండుగురు సూర్యులు అధిపతులై ఉన్నారు. యోగులకు తెలిసినట్టి అంతరిక రాశిచక్రంలో, దక్షుడు మొదలుకొని పితామహునివరకూ ఉన్న రుద్రులు వారి శక్తులతో కలసి పన్నెండు రాశులకు అధిపతులై ఉంటారు. వారు 1. దక్షుడు 2. చండుడు 3. హరుడు 4. శౌని 5. ప్రమథుడు 6. భీముడు 7. మన్మథుడు 8. శకుని 9. సుమతి 10. నందుడు 11. గోపాలకుడు 12. పితామహుడు.

ద్వాదశ వర్షోదయము

ఇదే విధముగా, ప్రతి అంగుళములోను అరవైతిథులున్నట్లు ధ్యానించినట్లైతే, ఇంతకుముందు అనుకున్న రాశిసంక్రమణమే ఒక సంవత్సరమౌతుంది. అనగా, ఇంతకుముందు ఒక నెల అయినది, ఇప్పుడు సంవత్సరమౌతుంది. ఈ క్రమంలో, ఒక్క శ్వాస యొక్క ఉచ్ఛ్వాస, నిశ్వాసములలో పన్నెండు సంవత్సరములుంటాయి. ఈ సాధనలో, తన ప్రతి శ్వాసలోను పన్నెండు సంవత్సరముల కాలం గడచిపోతూ ఉండటాన్ని యోగి గమనిస్తాడు.

షష్ట్యబ్దోదయము

ఆ తరువాత, ప్రతి అంగుళంలోను, మూడునూర్ల తిథులున్నట్లు ధ్యానిస్తే, పైలెక్క అయిదోవంతుకు కుదించబడుతుంది. అప్పుడు, ఒకటిన్నీ ఐదవవంతు అంగుళంలోనే ఒక సంవత్సరం ఇమిడిపోతుంది. దాని పూర్వభాగం చషకమౌతుంది. ఇట్లా గణిస్తే ఇంతకుముందు ఒక సంక్రాంతి అయినది ఇప్పుడు అయిదు సంవత్సరములౌతుంది. ఈ లెక్క ప్రకారం, ఒకసారి శ్వాస నిశ్వాసము, ఉచ్ఛ్వాసములు జరిగితే, అరవై ఏళ్ళవుతుంది. ఒక్కొక్క ఏడాదికి 360 తిథుల చొప్పున, దీనిలోని తిథుల సంఖ్య 21,600 అవుతుంది. ఒక పగలూ రాత్రులలో, మానవుని శ్వాసల మొత్తము సంఖ్య కూడా ఇదే. ఇంతకంటే ఎక్కువగా లెక్కిస్తే, లెక్కకు మించిన అనంతమౌతుంది గనుక అరవై సంవత్సరములను మించి వివరించడం లేదు.

దేవతాలోకముల కాలము

కాలమనేది ఒక్కొక్కలోకంలో ఒక్కొక్క విధంగా ఉంటుందని అనుకున్నాము కదా. నిన్నా మొన్నటి వరకూ ఈ లెక్కలను ఎవరూ నమ్మలేదు. ఈనాడు సైన్స్ వచ్చి, ఒక్కొక్క గ్రహంలో కాలమనేది ఒక్కొక్కవిధంగా ఉంటుందని చెబితే నమ్ముతున్నాము. అంతెందుకు? మన భూమిపైననే, ఒక్కొక్క దేశంలోని కాలం ఒక్కొక్కవిధంగా ఉంటుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే.

ఇప్పుడు మనుష్యులమైన మనకు, దేవతలకు, కాలంలో సామ్యం ఎలా ఉంటుందో వివరిస్తున్నారు.

మనుష్యలోకంలో ఒక సంవత్సరమైతే, దేవతాలోకంలో అది ఒక తిథి, అంటే, ఒక రోజు అవుతుంది. ఈ విధమైన లెక్కతో, 12,000 దేవతా సంవత్సరములు గడచినప్పుడు ఒక దేవతా చతుర్యుగము అవుతుంది. దానిలో, కృతయుగము 4000 సంవత్సరములు, త్రేతాయుగము 3000 సంవత్సరములు, ద్వాపరయుగము 2000 సంవత్సరములు, కలియుగము 1000 సంవత్సరములు ఉంటాయి. వాటికి ముందూ వెనుకలుగా 400, 300, 200, 100 సంవత్సరముల సంధ్యాకాలం ఉంటుంది. ఆ విధంగా 71 చతుర్యుగములు గడచినపుడు అది ఒక మన్వంతరమనబడుతుంది. స్థూలముగా చెప్పవలెనంటే, మానవుల కాలపరిణామము కంటే దేవతల కాలము 360 రెట్లు పెద్దదిగా ఉంటుంది.

యుగముల లెక్క

యుగము	సంవత్సరములు	సంధి
కృతయుగము	4000	400+400=800 సం
త్రేతాయుగము	3000	300+300=600 సం
ద్వాపరయుగము	2000	200+200=400 సం
కలియుగము	1000	100+100=200 సం
మొత్తము	10000	2000 సం

మనుష్య కాలము	దేవతల కాలము
1 సంవత్సరము	1 దేవతల రోజు
360 సం	1 దేవతా సంవత్సరము
360X 33. 33 = 12000 సం = ఒక చతుర్యుగము	33.33 దేవతా సంవత్సరములు
360 X 12000 సం = 360 చతుర్యుగములు = 4,32,000 సంవత్సరములు	12000 దేవతా సంవత్సరములు = ఒక దేవతా చతుర్యుగము
71x 360X 12000 సం = 360 మన్వంతరములు = 15 కోట్ల 55 లక్షల 20 వేల సంవత్సరములు	71 x 12000 దేవతా సంవత్సరములు(చతుర్యుగములు) = ఒక దేవతా మన్వంతరము

సృష్టికర్తయగు బ్రహ్మదేవుని ఆయుపు

ఆ విధముగా 14 మన్వంతరములు గడువగా, అది బ్రహ్మదేవునికి ఒక దినమౌతుంది. బ్రహ్మదేవుని ఒక రోజు చివరలో, చీకటిపడి, అంతే నిడివి గలిగిన రాత్రి వస్తుంది. అప్పుడు, స్వర్గము, భూమి, నరకము, లేదా, భూ, భువ, సువములనబడే మూడు లోకములూ కాలమనే అగ్నిలో కాలిపోతాయి. మిగతా లోకములన్నీ ఈ పొగవల్ల కమ్ముబడతాయి. ఆ అగ్నివేడిని, పొగను భరించలేక మిగతా లోకముల జీవులందరూ లోకములలో అయిదవది అయిన జనలోకమును చేరి ప్రళయకాలం వరకూ అక్కడ క్షేమంగా ఉంటారు. ప్రబుద్ధులైన కూష్మాండులు, హాటకులు, ఈశాదులు నాలుగవది అయిన మహాలోకంలో ఉంటారు. అప్పుడు రాత్రి సమాప్తమై బ్రహ్మదేవునియొక్క సృష్టి మళ్ళీ మొదలౌతుంది. అలాంటి లెక్కలో నూరు సంవత్సరములు

బ్రహ్మదేవుని ఆయువు.

బ్రహ్మదేవుని ఆయుర్దాయము

బ్రహ్మదేవుని కాలము బ్రహ్మకాలమానములో	దేవతల కాలము దేవతా సంవత్సరములలో	మానవుల కాలము మానవ సంవత్సరములలో
ఒక పగలు	14 X 71x 12000 = 1,19,28,000 = 1.19 కోట్లు	14 X 71x 360X 12000 = 429,40,80,000 = 429.4 కోట్లు
ఒక రాత్రి	14 X 71x 12000 = 1,19,28,000 = 1.19 కోట్లు	360 (14 X 71x 12000) = 429,40,80,000 = 429.4 కోట్లు
ఒక దినము	2 X 1,19,28,000 = 2,38,56,000 = 2.38 కోట్లు	2 X 429,40,80,000 = 858,81,60,000 = 858.8 కోట్లు
ఆయువు = నూరేళ్లు = 36000 దినములు	36000 X 2,38,56,000 = 85881 కోట్ల 60 లక్షలు	36000 X 858,81,60,000 = 3,09,17,376 కోట్లు = 309 లక్షల కోట్లు

త్రిమూర్తుల జీవిత కాలములు

బ్రహ్మదేవుని జీవితకాలం, విష్ణుదేవునకు ఒక పగలు అవుతుంది. అలాంటిదే ఒక రాత్రి. ఆయనకు కూడా నూరేళ్లు ఆయువు. కనుక ఆయన జీవితకాలం ఊహాకందదు.

దానిపైనున్న రుద్రలోకప్రభువైన రుద్రునకు, విష్ణుదేవుని జీవితకాలం ఒక దినమౌతుంది, అలాంటిదే రాత్రి కూడా. ముందువలెనే సంవత్సరము, అలాంటి నూరు సంవత్సరములు ఆయన ఆయుస్సు. ఇదీ మన ఊహాకందదు. ఈ పైలెక్కలేవీ మానవమేధస్సుకు అందే లెక్కలు కావు. ఉత్సాహమున్నవారు ప్రయతించవచ్చు.

ఉదాహరణ పట్టిక

బ్రహ్మదేవుని ఆయుస్సు	-	3,09,17,376 కోట్ల మానవ సంవత్సరములు
విష్ణుదేవుని ఆయుస్సు	బ్రహ్మ ఆయువుx 2 X 36000	2,20,625 కోట్ల కోట్ల మానవ సంవత్సరములు
రుద్రుని ఆయుస్సు	విష్ణువు ఆయుస్సు x 2 X 36000	15,885 కోట్ల కోట్ల కోట్ల మానవ సంవత్సరములు
శతరుద్రుల ఆయుస్సు	రుద్రుని ఆయుస్సు X 2 X 36000	11,43,720 కోట్ల కోట్ల కోట్ల మానవ సంవత్సరములు

ఒక్కొక్క బ్రహ్మాండములోని నూరుమంది రుద్రులు వివిధవిభాగములకు అధిపతులుగా ఉంటారు. అందుకే వారిని శతరుద్రులంటారు. రుద్రుని యొక్క ఒక జీవితకాలం, బ్రహ్మాండమునకు అధిపతులైన శతరుద్రులకు ఒక దినము అవుతుంది, రాత్రికూడా అంతే. వారికి కూడా నూరేళ్లు ఆయువుంటుంది. శతరుద్రుల ఆయుస్సు

తీరినప్పుడు ఆ బ్రహ్మాండం నాశనమౌతుంది. బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు ముగ్గురూ ఒక బ్రహ్మాండంలో ఉంటారు. ప్రతియొక్క బ్రహ్మాండమునకూ త్రిమూర్తులు వేర్వేరుగా ఉంటారు. దానివరకూ సృష్టి, స్థితి, లయములకు వారు అధిపతులుగా ఉంటారు. అలాంటి బ్రహ్మాండములు లెక్కలేనన్నిగా ఈ సృష్టిలో ఉంటాయి.

ఈ విధంగా జలతత్త్వం నుండి అవ్యక్తము వరకూ రుద్రులుంటారు. 36 తత్వములలో జలతత్వం 35 వది. అవ్యక్తమనే ప్రకృతి 13 వది. ఈ మధ్యలో 23 తత్త్వములున్నాయి. వాటికి అధిపతులైన రుద్రుల ఆయుస్సు ఎలా ఉంటుందంటే, వెనుకటివారి ఆయుస్సు తరువాతివారికి ఒక దినమౌతుంది. (ప్రళయసమయంలో) జలము మొదలైనవాటి అధిపతులైన బ్రహ్మ, రుద్రుడు మొదలైనవారు అవ్యక్తము (ప్రకృతిస్వరూపిణియైన శక్తి) లో లీనమౌతారు. అప్పుడు శ్రీకంఠనాథుడు సంహారకుడౌతాడు.

ఈ విధమైన ప్రళయం జరిగిన తరువాత, కొంతకాలానికి, మళ్ళీ సృష్టి మొదలౌతుంది. అప్పుడు ఇతరశాస్త్రములననుసరించి ముక్తులైనవారు కూడా మళ్ళీ సృష్టింపబడతారు. అంటే, సాంఖ్యము మొదలైన శాస్త్రముల ప్రకారము, ఆయా తత్త్వములను దాటి ప్రకృతిలో లీనమైన ఆత్మలకు, ఆయా శాస్త్రముల ప్రకారం, అదే ముక్తి అనుకుంటారు. కానీ, త్రికశాస్త్రం ప్రకారం, అది అంతిమమైన ముక్తి కాదు. ఎందుకంటే, వారు 13 వ తత్త్వమైన ప్రకృతివరకే పురోగమించి ఉంటారు. ఆ పైన, ఇంకా 12 తత్త్వములను దాటితేనే గాని పరిపూర్ణముక్తి వారికి లభించదు. కనుక, ప్రకృతితో లయమై, మళ్ళీ ప్రకృతితో బాటు వారు జన్మిస్తారు.

శ్రీకంఠనాథుని ఆయుస్సు, కంచుకవాసులైన రుద్రుల ఒక్క దినము. కంచుకములంటే ఆవరణలు. అవి - మాయ, కాలము, నియతి, కళ, విద్య, రాగము. వారి రాత్రి కూడా అంతే నిడివితో ఉంటుంది. వారి జీవితకాలం, గహనేశునికి ఒక దినమౌతుంది. వారి రాత్రికూడా అంతే నిడివితో ఉంటుంది. అప్పుడీ సమస్తమూ మాయలో లీనమైపోతుంది. మళ్ళీ గహనేశుడు సృష్టిని మొదలుపెడతాడు. ఈ అవ్యక్తకాలమును పది పరార్థములతో గుణించగా, మాయకు ఒక దినమౌతుంది, దాని రాత్రి కూడా అంతే ప్రణామము కలిగినది. ఆ రాత్రినే ప్రళయమంటాము. మాయాకాలమును పరార్థశతంతో గుణించగా ఈశ్వరుని యొక్క ఒక దినమౌతుంది. అప్పుడు ప్రాణము మళ్ళీ సృష్టిని చేస్తుంది. అంతే కాలం రాత్రి. దానిలో ప్రాణం విశ్రాంతి తీసుకుంటుంది. ప్రాణము బ్రహ్మబిలంలో (బ్రహ్మరంధ్రంలో) విశ్రాంతిని పొందిన స్థితిలో ఉన్నప్పుడు కూడా, ఇదే క్రమం జరుగుతుంది. ఈశ్వరకాలమును పరార్థశతంతో గుణించగా, అది సదాశివుని ఒక దినమౌతుంది, అంటే రాత్రి. అది మహాప్రళయం అనబడుతుంది. సదాశివుని కాలము క్షయమైనప్పుడు బిందువును అర్ధచంద్రుని, నిరోధికను ఆక్రమించి నాదంలో లీనమౌతాడు. నాదం శక్తితత్వంలో లీనమౌతుంది. అది వ్యాపినిలో కలుస్తుంది. అది అనాశ్రిత శివునిలో లయమౌతుంది. అనాశ్రితశివుని కాలమును పరార్థకోటిగుణితం చేస్తే శక్తి యొక్క దినమౌతుంది. అనాశ్రితము సమనస్సులో విశ్రాంతిని పొందుతుంది. ఈ సామనస్యమునే 'బ్రహ్మము' అంటాము. దీనికి, కన్ను మూసి తెరచుట వంటి లెక్కలేనన్ని కాలములు నడుస్తూ, సృష్టి- ప్రళయరూపమైన చక్రభ్రమణం నిరంతరమూ నడుస్తూ ఉంటుంది.

ఈ కాలప్రమాణములను లెక్కవేసే పద్ధతులు

1	ఏకం	1

2	దశ	10
3	శతం	10x10
4	సహస్రమ్	100x10
5	అయుతం	1000x10
6	లక్షం	10000x10
7	నియుతం	100000x10
8	కోటిః	1000000x10
9	అర్బుదం	పదికోట్లు
10	వృన్దం	నూరుకోట్లు
11	ఖర్వం	వెయ్యికోట్లు
12	నిఖర్వం	పదివేలకోట్లు
13	పద్మం	లక్షకోట్లు
14	శఙ్ఖః	పదిలక్షలకోట్లు
15	సముద్రం	కోటికోట్లు
16	అన్త్యం	పదికోట్లకోట్లు
17	మధ్యము	నూరుకోట్లకోట్లు
18	పరార్థము	వెయ్యికోట్ల కోట్లు

ఈ క్రమంలో ఒకదానికొకటి పదిపది రెట్లుగా, పద్దెనిమిది మెట్లుగా ఈ లెక్క ఉంటుంది.

ఈ విధంగా లెక్కలేనన్ని సృష్టిప్రళయములు, ప్రతినిత్యమూ జరుగుతూ ఉంటాయి. ఈ మహాసృష్టి రూపంలో ఉన్నదానినే 'ప్రాణ' మని అంటాము. అది సంవిత్తులో నిలుస్తుంది. అది ఉపాధులలో, అది చిన్మాత్రములో లయిస్తాయి. చిన్మాత్రము యొక్క స్పందనే కాలము. కనుక, స్వప్నములు, సంకల్పములు మొదలైన ప్రాణవిచిత్రమంతా చిన్మాత్రముతో ఏ మాత్రమూ విరోధించదు.

ఈ విధంగా, ప్రాణవాయువులో కాలమెలా ఉంటుందో, అదేవిధంగా హృదయము నుండి మూలాధారం వరకూ అపానవాయువులో కూడా జరుగుతుంది. ప్రాణము హృదయమునుండి ఊర్ధ్వద్వాదశాంతం వరకూ పనిచేస్తే, అపానం హృదయము నుండి అధోద్వాదశాంతం వరకూ పనిచేస్తుంది. మొదటిదానిని శివద్వాదశాంతమని, రెండవదానిని శక్తిద్వాదశాంతమని తంత్రశాస్త్రంలో పిలుస్తారు.

ప్రాణసంచారమార్గంలో, హృదయము, కంఠము, తాలువు, లలాటము, బ్రహ్మరంధ్రము మరియు ఊర్ధ్వద్వాదశాంతములకు వరుసగా బ్రహ్మ, విష్ణువు, రుద్ర, ఈశ్వర, సదాశివుడు, అనాశ్రితుడు ఆరుగురు అధిపతులై ఉన్నారు. అదే విధంగా అపానసంచార మార్గంలో కూడా, హృదయము, కందము, ఆనందము, సంకోచము, వికాసము, మరియు అధోద్వాదశాంతములలో ఉన్నారు. వీరు వరుసగా, బాల్యము, యౌవనము,

వార్ధక్యము, మరణము, పునర్భవము, ముక్తి వీటికి అధిపతులై ఉంటారు.

అధిపతులు	ప్రాణ సంచార మార్గము	అపాన సంచార మార్గము
బ్రహ్మ	హృదయము	హృదయము
విష్ణువు	కంఠము	కందము
రుద్రుడు	తాలువు	ఆనందము
ఈశ్వరుడు	లలాటము	సంకోచము
సదాశివుడు	బ్రహ్మరంధ్రము	వికాసము
అనాశ్రిత శివుడు	ఊర్ధ్వ ద్వాదశాంతము	అధో ద్వాదశాంతము

సమానవాయువులో కాలము యొక్క నడక

ఇప్పటివరకూ ప్రాణము, అపానములలో కాలము యొక్క అమరిక చెప్పబడింది. ఇప్పుడు, సమానవాయువులో కాలోదయము గురించి చెప్పబడుచున్నది.

ప్రాణాపానములు సమానములైనప్పుడు, యోగి తనలోనే ఉన్న సమానవాయువును తెలుసుకుంటాడు. సమానవాయువు హృదయం నుండి దశవిధనాడులలో సంచరిస్తూ సమస్తదేహంలోనూ రసములను ప్రవహింపజేస్తూ ఉంటుంది. దశనాడులనేవి యోగశాస్త్రములలో చెప్పబడినాయి. అవి - ఇడ, పింగళ, సుషుమ్న, గాంధారి, హస్తిజిహ్వ, పూష, యశ, ఆలంబుస, కుహు, శంఖినులు. ఇవి కందము నుండి పుట్టి, దేహంలోని అన్ని అవయవాలకూ ప్రాణమును సరఫరా చేస్తూ ఉంటాయి. కందమంటే నాభి క్రిందుగా ఉన్న దుంపవంటి ప్రదేశము.

ఈ సమానవాయువనేది దేహంలోని నాడులగుండా ఎనిమిది దిక్కులలో సంచరిస్తూ, ఆ దిక్పాలకుడైన దేవత యొక్క చేష్టను, ఆత్మచేత అనుకరింపజేస్తూ ఉంటుంది. అష్టదిక్కుల అధిపతులు ఈ విధంగా ఉన్నారు.

సంఖ్య	దిక్కు	దేవత
1	తూర్పు	ఇంద్రుడు
2	ఆగ్నేయము	అగ్ని
3	దక్షిణము	యముడు
4	నైరుతి	నిర్రుతి
5	పశ్చిమము	వరుణుడు
6	వాయవ్యము	వాయుదేవుడు
7	ఉత్తరము	కుబేరుడు
8	ఈశాన్యము	ఈశానుడు

దిగ్దేవతలు - వారి పనులు

వీరిలో అగ్ని, యముడు, నిర్ఋతి క్రూరమైన పనులను చేస్తారు. వాయువు క్రూర, సౌమ్య కర్మలను రెంటినీ చేస్తాడు. మిగతా దేవతలు, సౌమ్యకర్మలను చేస్తారు. సమానప్రాణము ఏ దిక్కులో సంచరిస్తున్నదన్న దానిని బట్టి, ఆ మనిషి, క్రూర, సౌమ్య, మిశ్రమ కర్మలలో ఏదో ఒకదానిని చేస్తూ ఉంటాడు. ఉదాహరణకు, కోపము, దూకుడు మొదలైనవి అగ్ని చేసే పనులు. చంపడం, భయపెట్టడం యముని పనులు. హాని కలిగించడం, మాయచెయ్యడం మొదలైనవి నిర్ఋతి పనులు. అధికారం చెలాయించడం ఇంద్రుని లక్షణం. ధనసంపాదన కుబేరుని లక్షణం. దైవభక్తి మొదలైనవి ఈశానుని పనులు. ఈ విధంగా మనుషులు చేసే పనులు, వారి నాడులలో సమానవాయువు ఎటు ప్రవహిస్తున్నదన్న దానిని బట్టి ఉంటాయి. హృదయం యొక్క పైభాగంలో సంచరిస్తున్నపుడు ధర్మచింతననూ, క్రిందభాగంలో సంచరిస్తున్నపుడు అధర్మచింతననూ సమానవాయువు కలుగజేస్తుంది.

ఈ విధంగా, పైకీ క్రిందకూ, చుట్టూ ఉన్న ఎనిమిది దిక్కులలోనూ, మూడునాడులలో ఈ వాయువు సంచరిస్తూ ఉంటుంది. విషువత్ దినమున దీని సంచారం ప్రత్యేకంగా ఉంటుంది. ఎందుకనగా, ఆ రోజున, భూమిపైన ఎక్కడ చూచినా, పగలూ రాత్రీ సమానంగా ఉండటం వలన, సమానవాయువుకు ప్రాముఖ్యత కలుగుతుంది. ఇదే కారణంచేత, యోగిదేహంలో ప్రాణాపానవాయువులు (ఇడా, పింగళా నాడీ ప్రవాహములు) ఎప్పుడు సమానంగా ఉంటాయో, అప్పుడు అతనిలో సమానవాయువు తలయెత్తి, 'విషువత్' ను అతనిలో కల్పిస్తుందని అర్థం చేసుకోవాలి.

విషువత్ దినమున యోగిలోని ప్రాణచలనం ఈ విధంగా ఉంటుంది.

ఒక్క అహోరాత్రం (రోజు)లో, 21,600 శ్వాసలను మానవుడు తీసుకుంటాడు. అంటే, పగటిపూట 10,800 శ్వాసలను, రాత్రిపూట మళ్ళీ 10,800 శ్వాసలను తీసుకుంటాడు. విషువత్ దినమునాడు, పగలూ రాత్రీ ఒక్కొక్కటి సరిగ్గా 12 గంటల నిడివిలో ఉంటాయి. కనుక, పగటిలో ఉన్న 12 గంటలలో, ఒక్కొక్క గంటకు 900 శ్వాసలు కలుగుతాయి. అప్పుడు 12X900 = 10,800 శ్వాసలు పగటిపూట సాగుతాయి. అవి ఈ క్రింది విధంగా ఉంటాయి.

పగలు 30 ఘడియలు, రాత్రి 30 ఘడియలు మొత్తం ఒక్క రోజులో 60 ఘడియలుంటాయి.

సూర్యోదయసమయంలో, ఘటికంబావు కాలంపాటు, మధ్యమార్గమైన సుషుమ్నలో సమానవాయువు నడుస్తుంది. అప్పుడు 450 శ్వాసలౌతాయి.

రెండున్నర ఘటికలపాటు ఎడమ-కుడి, ఎడమ-కుడి, ఎడమదారులలో ప్రాణసంచారం నడిస్తే, అయిదుసార్లు సూర్యుడు రాశిమారినట్లు, అయిదు సంక్రాంతులౌతాయి. దీనికి పన్నెండున్నర ఘడియలౌతాయి. ఈ విధంగా అయిదుసంక్రాంతులు అవృత్తములతో, పదమూడుమ్ముప్పాతిక ఘటికల కాలం గడచి దక్షిణాయనప్రవేశంతో శరత్విషువత్ ఏర్పడుతుంది. మధ్యాహ్నమునకు 900 ప్రాణములౌతాయి. మళ్ళీ ఎడమ, కుడి, ఎడమ, కుడి, ఎడమలుగా అయిదు సంక్రాంతులౌతాయి. సాయంసంధ్యలో మళ్ళీ ఘటికంబావు

కాలంపాటు, మధ్యమార్గమైన సుషుమ్నలో సమానవాయువు నడుస్తుంది. అప్పుడు 450 శ్వాసలౌతాయి. ఈ విధంగా పగటిపూట 30 ఘటికలలో 10,800 శ్వాసలు, పన్నెండు సంక్రాంతులౌతాయి.

సమయం	ఘటికలు	గంటలు	సంక్రాంతులు	శ్వాసలు
ప్రభాతం	1.25	6.00 నుండి 6.30 వరకు	0.5	450
పూర్వాహ్నము	12.50	6.30 నుండి 11.30 వరకు	5	4500
మధ్యాహ్నము	2.50	11.30 నుండి 12.30 వరకు	1	900
పరాహ్నము	12.50	12.30 నుండి 5.30 వరకు	5	4500
సాయంసంధ్య	1.25	5.30 నుండి 6.00 వరకు	0.5	450
మొత్తము	30	-	12	10,800

గంటలలో వివరిస్తే బాగా అర్థమౌతుంది.

వసంత విషువత్ మార్చ్ 21

గంటలు	శ్వాస నడిచే ముక్కు	నాడి	శ్వాసలు	సంక్రమణం	నెల
6. 00 నుండి 6. 30 వరకు	ఎడమ+ కుడి	సుషుమ్న	450	మేష వసంత విషువత్	మార్చి
6. 30 నుండి 7. 30 వరకు	ఎడమ	ఇడా	900	వృషభ	ఏప్రియల్
7. 30 నుండి 8. 30 వరకు	కుడి	పింగళ	900	మిథున	మే
8. 30 నుండి 9. 30 వరకు	ఎడమ	ఇడా	900	కర్కాటక	జూన్
9. 30 నుండి 10. 30 వరకు	కుడి	పింగళ	900	సింహ	జూలై
10. 30 నుండి 11. 30 వరకు	ఎడమ	ఇడా	900	కన్య	ఆగస్టు
11. 30 నుండి 12. 30 వరకు	ఎడమ+ కుడి	సుషుమ్న	900	తులా శరద్విషువత్	సెప్టెంబర్
12. 30 నుండి 1. 30 వరకు	ఎడమ	ఇడా	900	వృశ్చిక	అక్టోబర్

గంటలు	శ్వాస నడిచే ముక్కు	నాడి	శ్వాసలు	సంక్రమణం	నెల
1.30 నుండి 2.30 వరకు	కుడి	పింగళ	900	ధనుస్సు	నవంబర్
2.30 నుండి 3.30 వరకు	ఎడమ	ఇడా	900	మకరం	డిసెంబర్
3.30 నుండి 4.30 వరకు	కుడి	పింగళ	900	కుంభం	జనవరి
4.30 నుండి 5.30 వరకు	ఎడమ	ఇడా	900	మీనం	ఫిబ్రవరి
5.30 నుండి 6.00 వరకు	ఎడమ+ కుడి	సుషుమ్న	450	మేష శరద్విషువత్	మార్చి
మొత్తం 12 గంటలు			10,800		

ఇదే విధంగా రాత్రి కూడా అవుతుంది. ఈ విధంగా పగలూ రాత్రులలో విషువత్తులతో పన్నెండు పన్నెండు సంక్రాంతులౌతున్నవి.

వసంతవిషువత్ దినమునుండి పగటి నిడివి పెరుగుతూ, రాత్రి యొక్క నిడివి తగ్గుతూ ఉంటుంది. దీనినిబట్టి సంక్రాంతుల నిడివి కూడా మారుతూ ఉంటుంది. ఈ సమానవాయు సంచారంలో శ్వాసప్రశ్వాసలు కలవనందువలన, ఒక సమానవాయువు యొక్క సంచారంలో రెండుసంవత్సరములౌతాయి. ఈ విధంగా, మునుపు చెప్పిన విధముగా, పన్నెండు సంవత్సరములౌతాయి.

ఉదానవాయువులో ప్రాణసంచారము

ఉదానమంటే, ఊర్ధ్వమునకు ఎగసిపోయే ప్రాణవాయువు. దీని సంచారము ఊర్ధ్వద్వాదశాంతం వరకూ ఉంటుంది. ఇది స్పందనారూపమైనట్టిది. దీనిలో కాలపు నడక ప్రాణస్పందనారూపమై ఉంటుంది. మామూలుగా సాగే శ్వాస ఇక్కడ ఉండదు. ఎందుకంటే, శ్వాసయనినది శరీరం యొక్క లోపలే నడువగా. ఉదానవాయువు బ్రహ్మరంధ్రము నుండి ద్వాదశాంతము వరకూ నడుస్తుంది. దానికి కూడా, మునుపటి విధముగానే లెక్క వేయవలసి ఉంటుంది.

వ్యానవాయువులో ప్రాణసంచారము

వ్యానవాయువు సర్వవ్యాపి గనుక, అంతటా వ్యాపించి ఉంటుంది. ఇందులో ప్రాణస్పందన అక్రమరూపంలో ఉంటుంది. అంటే, సాధారణముగా మనకు తెలిసినట్టి ఉచ్ఛ్వాస నిశ్వాసములు దీనిలో ఉండవు. దానికి విరుద్ధమైన మార్గంలో ఉంటాయి. అందుకే దీనిని అక్రమమన్నారు. ఆ విధముగా, అక్రమమైనప్పటికీ, సూక్ష్మమైనట్టి స్పందనారూపంలో దీనిలో కాలోదయమౌతుంది.

వర్ణోదయము

విషువత్ దినమున, దినప్రమాణము పన్నెండు గంటలు, రాత్రిప్రమాణము పన్నెండు గంటలుగా ఉంటాయి. ప్రహరమంటే మూడుగంటల కాలవ్యవధి. అటువంటి ప్రహరములు పగటిలో నాలుగు, రాత్రిలో నాలుగు ఉంటాయి. అర్థప్రహరం ఒకటిన్నర గంట అవుతుంది. ఈ అర్థప్రహరములు పగటిలో ఎనిమిది, రాత్రిలో ఎనిమిది ఉంటాయి. ఈ ఎనిమిది విభాగములలో ఎనిమిది వర్ణముల యొక్క వర్గములుదయిస్తాయి.

వర్ణములంటే వర్ణమాలలోని అక్షరశబ్దములు. వర్గములంటే వాటి సమూహములు. వర్ణమాల మొత్తము 8 వర్గములుగా విభజింపబడి ఉంటుంది. అవి, అ, క, చ, ట, త, ప, య, శ లు.

1	అ వర్గము	అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ ౠ, ఌ, ౡ, ఏ, ఐ, ఓ, ఔ, అం, అః	16
2	క వర్గము	క, ఖ, గ, ఘ, ఙ	5
3	చ వర్గము	చ, ఛ, జ, ఝ, ఞ	5
4	ట వర్గము	ట, ఠ, డ, ఢ, ణ	5
5	త వర్గము	త, థ, ద, ధ, న	5
6	ప వర్గము	ప, ఫ, బ, భ, మ	5
7	య వర్గము	య, ర, ల, వ	4
8	శ వర్గము	శ, ష, స, హ, క్ష	5
	మొత్తము		50

వర్ణమాలలోని 8 వర్గములలో మొత్తము 50 వర్ణములున్నాయి. ఒక్కొక్క వర్ణమునకూ 216 ప్రాణములు (శ్వాసలు) ఉంటాయి. బయటకు మాత్రం, ఆరుశ్వాసలు ఒక చషకం గనుక, 36 చషకములుదయిస్తాయి. ఆ విధముగా, దినములో మొత్తము 10,800 శ్వాసలౌతాయి. రాత్రికూడా అంతే. ఈ విధంగా, యోగి యొక్క ప్రయత్నం ఏమాత్రమూ లేకుండానే, సహజంగా సాగుతున్న శ్వాసతోనే, వర్ణశబ్దములు ఉదయిస్తూ ఉంటాయి. అయితే, వర్ణములను మంత్రములుగా మార్చవలెనంటే మాత్రం, తనదైన ప్రయత్నం అవసరమౌతుంది. అంటే, ప్రయత్నంతోనే మంత్రములుదయిస్తాయి. అంటే, సహజంగా సాగుతున్న శ్వాసలో, ప్రయత్నపూర్వకంగా మంత్రములను అనుసంధానం చేసి దానిని నడిపించవలసి ఉంటుంది.

దేహములో పంచప్రాణముల నడక

1	ప్రాణము	హృదయం నుండి ఊర్ధ్వ ద్వాదశాంతం వరకు
2	అపానము	హృదయం నుండి అధో ద్వాదశాంతం వరకు
3	సమానము	దేహంలోని పది దిక్కులలో
4	ఉదానము	బ్రహ్మరంధ్రము నుండి ద్వాదశాంతము వరకు
5	వ్యానము	సర్వవ్యాపి

'అరఘట్ట ఘటీయంత్రము' అనేదాని గురించి ఇక్కడ ప్రస్తావన వచ్చింది. దీనిని ఎత్తిపోతల యంత్రమనీ,

'ఏతం' అనీ రైతులంటారు. ప్రాచీన భారతదేశంలో, బావులు మరియు నదుల నుండి, నీటిని ఎత్తి, పొలములకు పారించే పనికి ఈ యంత్రములను వాడేవారు. ఎద్దులను ఈ యంత్రమునకు కట్టి, వాటిని తోలుతూ ఈ యంత్రసహాయంతో నీటిని తోడేవారు. ఈ యంత్రంలో, ఒక కుండ వంటిది, బావిలోపలనుంచి పైకీక్రిందకూ వస్తూపోతూ, నీటిని తోడుతూ ఉంటుంది. అదే విధంగా, రాత్రీపగలూ, మంత్రములను శ్వాసతో అనుసంధానం చేసి జపించడం వలన, యోగికి మంత్రదేవతతో తాదాత్మ్యత ఏర్పడుతుంది.

ఈ సాధనలో, శ్వాసతో మంత్రము అనుసంధానమై ఉన్నది గనుక, ఎన్ని ప్రాణములు (శ్వాసలు) ఉదయిస్తున్నవో, అన్నిసార్లు మంత్రం కూడా ఉదయిస్తుంది. రెండు శ్వాసలకు ఒక మంత్రమైతే, మంత్రసంఖ్య సగమౌతుంది. అంటే, ఒక్కరోజులో 21,600 శ్వాసలు గనుక, 21,600 సార్లు బీజమంత్రజపం చెయ్యవచ్చు. కొన్ని పెద్ద మంత్రములుంటాయి. వాటిని ఉచ్ఛ్వాసంలో సగం, నిశ్వాసంలో సగం జపించడానికి వీలుపడుతుంది. అప్పుడు రోజుకు జపసంఖ్య 10,800 అవుతుంది. నిద్రిస్తున్న 6 గంటల కాలం తీసివేస్తే, జపసంఖ్య 16,200 అవుతుంది. ఈ విధంగా, ఒక మంత్రజపమునకు పట్టే శ్వాసల సంఖ్య పెరిగితే, దానికి అనుగుణంగా మంత్ర జపసంఖ్య తగ్గుతుంది.

ఈ క్రమంలో, 108 x 200=21,600 గనుక, 108 శ్వాసలకొక జపమాల చొప్పున 200 మాలల జపం ఒక్కరోజులో అవుతుంది. స్థూలశ్వాసలో గాని, సూక్ష్మశ్వాసలో గాని, ఈ విధంగా జపం చేస్తూ, దానిలోనే ఉండేవాడికి, దేహంలోని ప్రాణసంచారము క్రమేణా క్షీణిస్తుంది. ఈ విధముగా కాలోపాసన చేత ఆలోచనలు మ్రింగబడగా, అంతా సంపూర్ణమౌతుంది. చిత్రములైన శక్తిభేదములతో ప్రకాశించే సంవిత్తు ఒక్కటే వెలుగుతూ గోచరిస్తుంది.

కాలము - అనుభవము

కాలమును బట్టి, జీవులకు వారివారి అనుభవములలో భేదం వస్తుంది. ఒకే అనుభవం, కాలమును బట్టి వేర్వేరు రకములుగా మారిపోతూ అనుభవానికి వస్తుంది. కనుక, కాలభేదమే సంవేదనలో భేదమును సృష్టిస్తుందిగాని, తెలిసికొంటున్నవానిలో ఏ విధమైన భేదమూ ఉండదు. ఒకడు ఒక కొండశిఖరంపైన నిలుచుని, క్రింద ఉన్నవారిని చూస్తున్నపుడు, వారతనికి చీమలలాగా కన్పిస్తారు. అతడు క్రిందకు దిగి వచ్చే కొద్దీ, వారి ఎత్తు పెరుగుతూ వస్తుంది. చివరకు నేలపైకి దిగినప్పుడు, వారు మనుషులలాగా కనిపిస్తారు. అదే విధంగా, అంతరికంగా మనమున్న స్థితిని బట్టి, ప్రపంచం కనిపించే తీరు మారిపోతూ ఉంటుంది. ఈ అంతరికస్థితులు, పంచప్రాణముల స్థితులను బట్టి ఉంటాయి. యోగికి అనుభవజ్ఞానము కలుగుతున్న సమయమే 'క్షణము' అనబడుతుంది. ఒక్క శ్వాసలో ఒక్కవిషయం యొక్క జ్ఞానం మాత్రమే ఉంటుంది. అలా కాకపోతే, ఆలోచనా, జ్ఞానమూ, రెండూ కలిపి ఒకటే ఎట్లా అవుతుంది? క్రమములైన శబ్దముల వల్లనే మాత్రలకు కూడా క్రమత్వం కలుగుతోంది. పాణినీమహర్షి రచించిన వ్యాకరణ గ్రంథమైన అష్టాధ్యాయిలో, ఈ విధంగా చెప్పబడింది ...

['తస్యాదిత ఉదాత్తమర్ధహ్రస్వమ్'] (పాతంజల వ్యాఖ్య 1-2-34)

కనుక, ఇంకొక స్పందము ఉదయించేవరకూ, ఒకటే విధమైన జ్ఞానము మనసులో కొనసాగుతూ

ఉంటుంది. అందుకనే 81 వికల్ప పదముల ధ్యానసమయములో, వాటి వివిధములైన శక్తులయొక్క జ్ఞానం ద్వారా, వాటన్నిటికీ ఆధారమైనట్టి పరమేశ్వర చింతనము, అవికల్పాత్మకమై భాసిస్తుంది. కాలము ఈ అన్ని శబ్దములనూ మ్రింగడం చేత ఈ అంతరిక ప్రక్రియ జరుగుతుంది.

ఈ సాధనద్వారా, ఈ అఖిలమైన కాలాధ్వము మొత్తమునూ, తన ప్రాణము యొక్క ఉదయముగానే చూస్తూ, లెక్కలేనన్ని చిత్రవిచిత్రములైన సృష్టి-సంహార-స్థితులను తనయొక్క ప్రాణములోనే దర్శిస్తూ, తనలోనే అనుభవమౌతున్న పరమేశ్వరునిస్వరూపం యొక్క ప్రత్యక్షజ్ఞానం ద్వారా, సమస్తసృష్టినీ, దానికతీతమైన స్థితినీ, తనలోనే ఉన్నట్లుగా గ్రహించిన యోగి, అదే క్షణములో మోక్షమును అందుకుంటున్నాడు.

ఆ// సంవిదాత్మ యందు చక్కనౌ ప్రాణమ్ము
కాలమందు; దాని కదమ సీమ;
సృష్టులెన్నొ బుట్టి సాగంగ నీల్గంగ
బాగఁజూచు వాడె భైరవుండు //

కం// తనలో ప్రాణస్పందము
తనలో కాలమ్ము దాని కదమయు గనుచున్
తనలో సృష్టియు స్థితియున్
తనలో సంహారమెంచ తానే శివుడౌ //

తన ఆత్మయే చిదానందస్వరూపమైన సంవిత్తనే ధ్యానములో ఉంటూ, దానియొక్క ప్రాణస్పందనములోనే సమస్తకాలమునూ, కాలాతీతమునూ చూస్తూ, అనేక సృష్టి స్థితి లయములు తనలో గడచిపోతూ ఉండటాన్ని నిత్యం చూస్తూ ఉండేవాడు, భైరవస్థితిని అందుకుంటున్నాడు.

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే కాలాధ్వప్రకాశనం నామ షష్ఠమాహ్నికమ్ || 6 ||

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని కాలాధ్వప్రకాశనమనే ఆరవ ఆహ్నికము.

ఏడవ ఆహ్నికము

దేశాధ్వ ప్రకాశనము

యదార్థః - యదార్థము

అథ దేశాధ్వా |

ఇప్పుడు దేశాధ్వము చెప్పబడుచున్నది.

తత్ర సమస్త ఏవ అయం మూర్తివైచిత్ర్యాభాసనశక్తిజో దేశాధ్వా సంవిది విశ్రాన్తః, తద్వారేణ శూన్యే బుద్ధౌ ప్రాణే నాడీచక్రానుచక్రేషు బహిః శరీరే యావల్లిఙ్గస్థణ్డిలప్రతిమాదౌ సమస్తోఽధ్వా పరినిష్ఠితః, తం సమస్తమ్ అధ్వానం దేహే విలాప్య, దేహం చ ప్రాణే, తం ధియి, తాం శూన్యే, తత్సంవేదనే, నిర్భరపరిపూర్ణసంవిత్ సంపద్యతే షట్త్రింశత్తత్త్వస్వరూపజ్ఞః, తదుత్తీర్ణాం సంవిదం పరమశివరూపాం పశ్యన్ విశ్వమయీమపి సంవేదయేత, అపరథా వేద్యభాగమేవ కంచిత్ పరత్వేన గృహ్ణీయాత్ మాయాగర్భాధికారిణం విష్ణుబ్రహ్మాదికం వా, తస్మాత్ అవశ్యం ప్రక్రియాజ్ఞానపరేణ భవితవ్యమ్ | తదుక్తం 'న ప్రక్రియాపరం జ్ఞానమ్ .... |' ఇతి |

శక్తినుండి పుట్టి, విచిత్రమూర్తులతో భాసించుచున్న దేశాధ్వము కూడా సంవిత్ లోనే విశ్రాంతమై ఉన్నది. దానిద్వారా బయటకు ప్రసరిస్తూ, శూన్యము, బుద్ధి, ప్రాణము, నాడీచక్రములు, అనుచక్రములు, శరీరము, బాహ్యలింగము, స్థణ్డిలము, ప్రతిమలు మొదలైన సమస్తాధ్వములుగా ఉన్నది. ఈ అధ్వములనన్నింటినీ దేహంలో లయింపజేసి, దేహమును ప్రాణములోను, దానిని బుద్ధిలోను, దానిని శూన్యములోను, దానిని సంవేదనలోను కలుపగా, 36 తత్త్వముల స్వరూపజ్ఞమైన నిర్భరపరిపూర్ణసంవిత్ లభిస్తుంది. దానిని కూడా దాటి విశ్వమయమైన పరమశివరూపసంవిత్ ను దర్శించుతాడు. లేదా మాయాగర్భములో ఉంటూ బ్రహ్మవిష్ణువులను పరతత్త్వములని గ్రహిస్తాడు. కనుక తప్పకుండా ప్రక్రియాజ్ఞానపరుడవ్వాలి. ఈ విధంగా చెప్పబడింది, 'ప్రక్రియకు పరమైన జ్ఞానము లేదు .... '

తత్ర పృథివీతత్త్వం శతకోటిప్రవిస్తీర్ణం బ్రహ్మాణ్డగోలకరూపమ్ | తస్య అన్తః కాలాగ్నిర్నరకాః పాతాలాని పృథివీ స్వర్గా యావద్బ్రహ్మలోక ఇతి | బ్రహ్మాణ్డబాహ్యే రుద్రాణాం శతం | న చ బ్రహ్మాణ్డానాం సంఖ్యా విద్యతే | తతో ధరాతత్త్వాత్ దశగుణం జలతత్త్వం | తత ఉత్తరోత్తరం దశగుణమ్ అహంకారాన్తం | తద్యథా జలం తేజో వాయుర్నభః తన్మాత్రపఞ్చకాక్షైకాదశగర్భోఽహంకారశ్చేతి |

పృథివీతత్త్వము శతకోటిప్రవిస్తీర్ణమై బ్రహ్మాణ్డగోలకరూపమై ఉన్నది. దానిలోపల కాలాగ్ని, నరకములు, పాతాళము, పృథివి, స్వర్గము ఈ విధంగా బ్రహ్మలోకం వరకూ ఉన్నది. బ్రహ్మాణ్డపు బయట శతరుద్రులున్నారు. బ్రహ్మాండముల సంఖ్యను చెప్పలేము. ధరాతత్త్వమునకు పదిరెట్లు జలతత్త్వము. దాని ఉత్తరోత్తరా పదిపదిరెట్లతో అహంకారంవరకూ ఉంటుంది. అవి ఈ విధంగా ఉన్నాయి. జలము, తేజము, వాయువు, ఆకాశము, అయిదు తన్మాత్రలు, ఏకాదశ ఇంద్రియములను తన గర్భంలో దాల్చి అహంకారమున్నది.

అహంకారాత్ శతగుణం బుద్ధితత్త్వం | తతః సహస్రధా ప్రకృతితత్త్వం, ఏతావత్ప్రకృత్యణ్డమ్ | తచ్చ

బ్రహ్మాణ్డవత్ అసంఖ్యమ్ | ప్రకృతితత్త్వాత్ పురుషతత్త్వం చ దశసహస్రధా | పురుషాత్ నియతిః లక్షధా | నియతేరుత్తరోత్తరం దశలక్షధా కలాతత్త్వాన్తమ్ | తద్యథా నియతిః రాగః అశుద్ధవిద్యా కాలః కలా చేతి | కలాతత్త్వాత్ కోటిధా మాయా, ఏతావత్ మాయాణ్డమ్ |

అహంకారమునకు నూరురెట్లు బుద్ధితత్త్వము. దానికి వెయ్యిరెట్లు ప్రకృతితత్త్వము. ఇక్కడవరకూ ప్రకృతి అండము. వాటికి కూడా బ్రహ్మాండములవలె సంఖ్యను చెప్పలేము. ప్రకృతితత్త్వం కంటే పురుషతత్త్వం పదివేలరెట్లు ఉన్నది. పురుషుని కంటే నియతి లక్ష రెట్లు. నియతి పైన ఉత్తరోత్తరము పదిలక్షల వరకూ కళాతత్త్వముయొక్క అంతము వరకూ ఉన్నవి. అవి నియతి, రాగము, అశుద్ధవిద్య, కాలము, కళలై ఉన్నవి. కళాతత్త్వం కంటే కోటిరెట్లు ఎక్కువైనది మాయ. ఇంతవరకూ మాయాండము.

మాయాతత్త్వాత్ శుద్ధవిద్యా దశకోటిగుణితా | విద్యాతత్త్వాత్ ఈశ్వరతత్త్వం శతకోటిధా | ఈశ్వరతత్త్వాత్ సాదాఖ్యం సహస్రకోటిధా | సాదాఖ్యాత్ వృన్దగుణితం శక్తితత్త్వమ్, ఇతి శక్త్యణ్డమ్ | సా శక్తిర్వ్యాప్య యతో విశ్వమధ్వానమ్ అన్తర్బహిరాస్తే తస్మాత్ వ్యాపినీ |

మాయాతత్త్వం కంటే శుద్ధవిద్య పదికోట్ల రెట్లు పెద్దది. విద్యాతత్త్వం కంటే ఈశ్వరతత్త్వం నూరుకోట్ల రెట్లు పెద్దది. ఈశ్వరతత్త్వం కంటే సాదాఖ్యము వెయ్యికోట్లు. సాదాఖ్యము కంటే శక్తితత్త్వము వృందగుణితము. ఇది శక్తి అండము. విశ్వములోని అన్ని అధ్వములకు లోపలా బయటా వ్యాపించడంతో దీనిని వ్యాపిని అంటారు.

ఏవమేతాని- ఉత్తరోత్తరమ్ ఆవరణతయా వర్తమానాని తత్త్వాని-ఉత్తరం వ్యాపకం పూర్వం వ్యాప్యమ్ ఇతి స్థిత్యా వర్తన్తే | యావదశేషశక్తితత్త్వాన్తోఽధ్వా శివతత్త్వేన వ్యాప్తః | శివతత్త్వం పునరప్రమేయం సర్వాధ్వోత్తీర్ణం సర్వాధ్వవ్యాపకం చ |

ఇవన్నీ కూడా ఒకదానికంటే ఒకటి ఆవరణల వలె ఉంటాయి. ముందున్నదానిని తరువాతది ఆవరించి ఉంటుంది. యావత్తు అశేష శక్తితత్త్వముల అంతమువరకూ ఉన్న అధ్వములన్నీ శివతత్త్వంతో వ్యాపింపబడి ఉంటాయి. శివతత్త్వము అప్రమేయమై అన్ని అధ్వములనూ మించి అన్ని అధ్వములలో వ్యాపించి ఉంటుంది.

ఏతత్తత్త్వాన్తరాలవర్తీని యాని భువనాని తత్పతయ ఏవ అత్ర పృథివ్యాం స్థితా ఇతి | తేషు ఆయతనేషు యే మ్రియన్తే తేషాం తత్ర తత్ర గతిం తే వితరన్తి | క్రమాచ్చ ఊర్ధ్వోర్ధ్వం ప్రేరయన్తి దీక్షాక్రమేణ | తద్యథా-

ఈ తత్త్వములయొక్క అంతరాళములో ఏయే భువనములున్నాయో వాటి అధిపతులందరూ ఈ భూమిపైనే ఉన్నారు. ఆయా లోకములలో ఎవరైతే మరణిస్తారో వారికి అక్కడక్కడా గతులను ప్రసాదిస్తారు. దీక్షాక్రమమును బట్టి పైపై లోకములకు పంపిస్తూ ఉంటారు. అవి ఈ విధంగా ఉంటాయి ---

శ్లో|| కాలాగ్నిః కూష్మాణ్డో నరకేశో హాటకోఽథ భూతలపః |
బ్రహ్మా మునిలోకేశో రుద్రః పఞ్చాణ్డమధ్యగతః ||

కాలాగ్ని, కూష్మాండ నరకాధిపతి, భూతలాధిపతి హాటకుడు, బ్రహ్మా, మునిలోకాధిపతి (విష్ణువు), రుద్రుడు - ఈ ఆరుగురు, పంచాండముల మధ్యలో ఉన్నారు.

శ్లో|| అధరేఽనన్తః ప్రాచ్యాః కపాలివహ్న్యన్తనిర్ఋతిబలాఖ్యాః |

లఘునిధిపతివిద్యాధిప-శమ్భూర్ధ్వాన్తం స వీరభద్రపతిః ||

అధోలోకంలో అనంతుడు, తూర్పునుండి వరుసగా కపాలి, అగ్ని, యముడు, నిరృతి, బాల, లఘువు, నిధిపతి, విద్యాధిపుడైన శంభువు, వీరిపైన వీరభద్రుడు.

శ్లో|| ఇతి షోడశపురమేతత్-పార్థివమణ్డం నివృత్తికలా |
లకులీశభారభూతి-ర్దిణ్డ్యాషాఢీ చ పుష్కరనిమేషౌ ||

ఈ పదహారు పురములు కలసి, నివృత్తికళతో నిండిన పృథివీ అండము. లకులీశ, భారభూతి, దిండి, ఆషాఢి, పుష్కరుడు, నిమేషుడు,

శ్లో|| ప్రభాససురేశావితి సలిలే ప్రత్యాత్మకాష్టకం ప్రోక్తమ్ |
భైరవకేదారమహాకాలా మధ్యామ్రజల్పాఖ్యాః ||

ప్రభాసుడు, సురేశుడు, జలతత్త్వమునకు అష్టాధిపతులు. భైరవుడు, కేదారుడు, మహాకాళుడు, మధ్యుడు, ఆమ్రుడు, జల్పుడు,

శ్లో|| శ్రీశైలహరిశ్చన్ద్రావితి గుహ్యాష్టకమిదం మహసి |
భీమేన్ద్రాట్టాః సవిమల కనఖలనాఖలకురుస్థిగయాఖ్యాః ||

శ్రీశైలుడు, హరిశ్చన్ద్రుడు ఈ గుహ్యాష్టకము మహస్సులో ఉన్నారు. భీముడు, ఇంద్రుడు, అట్టహాసుడు, సవిమల, కనఖల, నాఖల, కురుక్షేత్ర, గయ -

శ్లో|| అతిగుహ్యాష్టకమేతన్మరుతి సతన్మాత్రకే సాక్షే |
స్థాణుసువర్ణాఖ్యౌ కిలభద్రో గోకర్ణకో మహాలయకః ||

ఇవి అతిగుహ్యాష్టకములై వాయుతత్త్వములో, సతన్మాత్రకములై సాక్షులై ఉన్నాయి. స్థాణువు, సువర్ణము, భద్రము, గోకర్ణము, మహాలయము,

శ్లో|| అవిముక్తరుద్రకోటీవస్త్రాపద ఇత్యదః పవిత్రం ఖే |
స్థూలస్థూలేశశఙ్కు శ్రుతికాలాశ్చాథ మణ్డలభృత్ ||

అవిముక్త, రుద్రకోటి, వస్త్రాపద, ఇవి పవిత్రములైన ఆకాశములో ఉన్నవి. స్థూల, స్థూలేశ, శంకుశ్రుతి, కాల, మండల,

శ్లో|| మాకోటాణ్డద్వితయచ్ఛగలాణ్డాష్టకం త్వహఙ్కారే |
అన్యే త్వహఙ్కారాన్తాస్తన్మాత్రాణీన్ద్రియాణి చేత్యాహుః ||

మాకోట, ద్వితయములు చగలాండాష్టకములై అహంకారములో ఉన్నవి. ఇతరులను బట్టి, అహంకారములోనే తన్మాత్రలు, ఇంద్రియములుంటాయి.

శ్లో|| ధియి దేవయోనయోఽష్టౌ ప్రకృతౌ యోగాష్టకం కిలాకృతప్రభృతి |

ఇతి సప్తాష్టకభువనా ప్రతిష్ఠితిః సలిలతస్తు మూలాన్తా ||

బుద్ధిలో అష్టదేవయోనులు, ప్రకృతిలో యోగాష్టకములున్నాయి. ఈ సప్తాష్టక భువనములు జలమునుండి మూలమువరకు ప్రతిష్ఠితములై ఉన్నాయి.

శ్లో|| నరి వామాద్యా రుద్రా ఏకాదశ విత్కలానియతిషు స్యాత్ |
ప్రత్యేకం భువనద్వయమథ కాలే త్ర్త్రయం నిశాయాం స్యుః ||

నరతత్త్వములో, వామాదులైన ఏకాదశరుద్రులు, అశుద్ధవిద్య, కళ, నియతులలో ప్రత్యేకంగా రెండు రెండు భువనములు, కాలములో మూడు, నిశలో ఎనిమిది -

శ్లో|| అష్టావష్టావింశతిభువనా విద్యా నరాన్ని శాన్తమియమ్ |
విద్యాయాం పఞ్చ స్యుర్విద్యేశాష్టకమథేశ్వరే తత్త్వే ||

మొత్తము ఇరువది ఎనిమిది భువనములు పురుషునినుండి నిశాంతము వరకూ ఉన్నాయి. విద్యలో అయిదు, ఈశ్వరునిలో విద్యేశాష్టకములున్నాయి.

శ్లో|| సాదాఖ్యే పఞ్చకమితి అష్టాదశభువనికా శాన్తా |
అధ్వానమిమం సకలం దేహే ప్రాణేఽథ ధియి మహానభసి ||

శ్లో|| సంవిది చ పరం పశ్యన్ పూర్ణత్వాద్భైరవీభవతి ||

సాదాఖ్యములో అయిదు, శాంతములో పద్దెనిమిది. ఈ విధంగా అన్ని అధ్వములను దేహము, ప్రాణము, బుద్ధి, మహాకాశము, పరసంవిత్ లలో చూడగా పూర్ణత్వమును పొంది భైరవుడగుచున్నాడు.

వ్యాఖ్యానము

ఇంతకు ముందరి అధ్యాయములో కాలాధ్వమును గూర్చి వివరించిన అభినవగుప్తులవారు, ఈ అధ్యాయములో దేశాధ్వమును గురించి వివరిస్తున్నారు. దేశమంటే ప్రదేశము, లోకము, ప్రపంచము, దానిలోని జీవులు, వస్తువులు మొదలైన తారతమ్య భేదములు. నానావిధములైన ఇవియన్నీ కూడా చిదానందస్వరూపుడైన పరమశివునిలోనే నెలకొని ఉన్నాయి. వీటిని ఈ విధముగా గుర్తించడం ద్వారా కూడా, యోగికి పరమశివసమావేశం లభిస్తుంది. కనుక 'దేశం' కూడా ఒక సాధనా మార్గమే.

దేశాధ్వ ప్రక్రియ

పరమశివుడు సంవిత్ స్వరూపుడు. అనగా, చిత్, ఆనందములే తానైనవాడు. శుద్ధచైతన్యము, శుద్ధానందములే ఆయన స్వరూపము. ఆయన నుండి శక్తి ఉద్భవించినది. ఆ శక్తినుండి, నానా విధములైన భువనములతో, వాటిలో ఉన్న రకరకములైన తత్త్వములతో, విచిత్రములైన ఆకారములతో వెలుగుతున్న దేశాధ్వము పుట్టినది. కనుక దేశాధ్వము కూడా పరమశివస్వరూపమైన సంవిత్ లోనే నిలబడి ఉన్నది. సంవిత్తే దానికి కూడా ఆధారమై ఉన్నది.

సంవిత్ అనేది, శక్తి యనే ద్వారం నుండి బాహ్యమునకు ప్రసరిస్తూ ఉన్నందువల్లనే సృష్టి ఉద్భవించింది. ఈ సంవిత్ - శూన్యము, బుద్ధి, ప్రాణము, నాడీచక్రములు, అనుచక్రములు, శరీరముగా బయటకు ప్రసరిస్తూ ఉన్నది. తరువాత, బయట మనకు గోచరిస్తున్న శివలింగము, పూజావేదిక, దేవతాప్రతిమలు మొదలైన సమస్తార్థ్వములుగా కూడా అదే వ్యాపించి ఉన్నది. యోగియైనవాడు, ఈ అర్థ్వములనన్నింటినీ మొదటగా తన దేహంలోనే లయింపజేయాలి. తరువాత, దేహమును ప్రాణములోను, దానిని బుద్ధిలోను, దానిని శూన్యములోను, దానిని సంవిత్ లోను కలుపుతూ పోగా, 36 తత్త్వముల స్వరూపమైన శివశక్తుల పరిపూర్ణసంవిత్ లో ప్రవేశిస్తాడు. దానిని కూడా దాటినప్పుడు విశ్వమయమైన పరమశివసంవిత్ ను దర్శించుతాడు.

ఈ ప్రక్రియ మొత్తమూ, అవరోహణ ఆరోహణల క్రమముగా ఉంటుంది. అంటే, పరమశివుడు, ముప్పైఆరు తత్త్వములుగా దిగి వచ్చి సృష్టిలోని సమస్తముగా మారడం అవరోహణా ప్రక్రియయైతే, యోగి, సృష్టిలోని చిట్టచివరి తత్త్వమునుండి వెనుకకు ప్రయాణిస్తూ, ఈ స్థాయిలన్నింటినీ దాటి, పరమశివచైతన్యములో లీనం కావడం ఆరోహణమౌతుంది. దీనినే శ్రీవిద్యలో సృష్టి, సంహారక్రమములంటారు.

ఈ సాధనలో యోగి ఉత్తీర్ణుడు కాలేనప్పుడు, అంటే, ఇంతగా సాధన చెయ్యగలిగిన సమర్థత లేనప్పుడు, మాయాభువనములో ఆగిపోయి, అక్కడున్న బ్రహ్మ, విష్ణువు మొదలైన దేవతలనే పరతత్త్వములని అనుకుంటాడు. ఈ క్రమమును 'అర్థ్వప్రక్రియ' లేదా 'ప్రక్రియ' అంటారు. కనుక, సాధనామార్గం మొత్తములో ప్రక్రియాజ్ఞానము ఉత్తమమైనది. ఇది తెలియకపోతే, సాధకునకు సరియైన దారి తెలియదు. కనుక, యోగియైనవాడు, తప్పకుండా ప్రక్రియాజ్ఞానమును పొందాలి. ఈ విషయమై, 'ప్రక్రియాజ్ఞానముకంటే ఉత్తమమైన జ్ఞానము లేద'ని ఇతర గ్రంథములలో చెప్పబడింది.

ప్రక్రియాజ్ఞానము

సృష్టి మొత్తము నాలుగు అండములుగా ఉన్నదని కాశ్మీరశైవం అంటుంది. అవి, బ్రహ్మాండము, ప్రకృత్యండము, మాయాండము, శక్త్యండములు. అంటే, బ్రహ్మ, ప్రకృతి, మాయ, శక్తి అనబడే నాలుగు, అధిపతులుగా ఉన్నట్టి విశ్వగోళములు. అండమంటే గోళము. విశ్వం గోళాకారంగా ఉన్నదని మనకు తెలుసు. ఇటువంటి విశ్వములు సృష్టిలో లెక్కలేనన్ని ఉన్నాయని నేడు సైన్సు కూడా చెబుతున్నది. విశ్వమును బ్రహ్మాండమని, బ్రహ్మయొక్క గోళమని, అంటాము. ఇలాంటివి మొత్తము నాలుగంచెలలో, ఒకదానికంటే మరొకటి ఎంతో పెద్దవైన, నాలుగు విశ్వగోళములుగా ఉన్నాయని త్రికశాస్త్రము చెబుతున్నది. సృష్టిలోని మొత్తము 36 తత్త్వములూ వీటిలో ఇమిడి ఉంటాయి. ఈ క్రింది అమరికను చూస్తే, సులభంగా అర్థమౌతుంది.

1. శివుడు 2. శక్తి 3. సదాశివుడు 4. ఈశ్వర 5. శుద్ధవిద్య 6. మాయ 7. కాలము 8. నియతి 9. కళ 10. విద్య 11. రాగము 12. పురుషుడు 13. ప్రకృతి 14. బుద్ధి 15. అహంకారము 16. మనస్సు 17. శ్రోత్రము 18. త్వక్ 19. నేత్రము 20. రసన 21. నాసిక 22. వాక్కు 23. పాణి 24. పాదము 25. పాయువు 26. ఉపస్థ 27. శబ్దము 28. స్పర్శ 29. రూపము 30. రసము 31. గంధము 32. ఆకాశము 33. వాయువు 34. అగ్ని

35. జలము 36. పృథివి

పరమశివుడు	సర్వాతీతుడు, సర్వస్వతంత్రుడు, సర్వశక్తి సంయుతుడు, కేవల చిదానంద స్వరూపుడు	
శక్తి - అండము	శుద్ధవిద్యనుండి నుండి శివుని వరకు	5 తత్త్వములు
మాయ - అండము	పురుషుని నుండి మాయవరకు	7 తత్త్వములు
ప్రకృతి - అండము	జలము నుండి ప్రకృతి వరకు	23 తత్త్వములు
బ్రహ్మ - అండము	పృథివీ తత్త్వము	1
మొత్తము 4 అండములు	-	36 తత్త్వములు

బ్రహ్మాండము

ఇది పృథివీతత్త్వముతో నిండి యుంటుంది. అంటే, ఘనపదార్థమైన భూమి, రాళ్లు, రప్పలు, కొండలు మొదలైనవాటిలో ఉండే గ్రహములు, గోళములని అర్థము. ఇది శతకోటి ప్రవిస్తీర్ణమైన బ్రహ్మాణ్డగోళక రూపంలో ఉన్నది. దాని అమరిక ఈ విధంగా ఉంటుంది.

మొదట కాలాగ్ని, దానిపైన నరకము, దానిపైన పాతాళము, దానిపైన భూమి, దానిపైన స్వర్గము, ఆపైన బ్రహ్మలోకము ఉంటాయి. అంటే, భూగోళమునకు క్రిందుగా పాతాళ, నరకములనే రెండు లోకములు, పైన స్వర్గము, బ్రహ్మలోకములనే రెండు లోకములు ఉన్నాయి. అట్టడుగున కాలాగ్ని ఉన్నది. ఈ మొత్తము గోళమును ఒక బ్రహ్మాండమని అంటున్నాము.

దీని బయట శతరుద్రులున్నారు. అష్టదిక్కులకు, పైనా క్రిందా రెండు దిక్కులను కలుపగా, మొత్తము పది దిక్కులౌతాయి. ఒక్కొక్క దిక్కులో, ఒక అధిపతి, ఆయనకు తొమ్మిదిమంది అనుచరులైన రుద్రులు, మొత్తము పదిమంది రుద్రులుంటారు. పదిదిక్కులకు కలిపి శతరుద్రులౌతారు. ఈ నూరు మంది రుద్రులు, ఒక బ్రహ్మాండమును అన్ని దిక్కులనుండి పరిపాలిస్తూ రక్షిస్తూ ఉండే శక్తులని అర్థం చేసుకోవాలి. ఇటువంటి బ్రహ్మాండములు (Universes) ఈ సృష్టిలో ఎన్నున్నాయో లెక్కించడం సాధ్యం కాదు.

ప్రకృత్యండము

దీనిలో 23 తత్త్వములుంటాయి. భూతత్త్వమునకు పదిరెట్లు పెద్దదైనది జలతత్త్వము. దానికంటే పైనున్నవి ఒక్కొక్కటీ, క్రిందనున్నదానికంటే పదిరెట్లు పెద్దదిగా, అహంకారము వరకూ ఉంటాయి. అవి ఈ విధంగా ఉన్నాయి. జలము, అగ్ని, వాయువు, ఆకాశము, అయిదు తన్మాత్రలు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు), ఏకాదశ ఇంద్రియములు (అయిదు జ్ఞానేంద్రియములు, అయిదు కర్మేంద్రియములు, మనస్సు) లను తన గర్భంలో దాల్చి అహంకారముంటుంది. ఇంతవరకూ, ఒక్కొక్కటీ ముందుదానికంటే పదిరెట్లు పెద్దదై ఉంటుంది.

ఈ అహంతత్త్వమునకు నూరురెట్లు పెద్దదిగా బుద్ధితత్త్వముంటుంది. దానికి వెయ్యిరెట్లు పెద్దదిగా ప్రకృతితత్త్వముంటుంది. ఇక్కడవరకూ ప్రకృతియొక్క అండము (విశ్వము) అనబడుతుంది. వీటికి కూడా

బ్రహ్మాండములవలె, 'ఇన్ని' అంటూ సంఖ్యను చెప్పలేము. అంటే, ఇవి కూడా అసంఖ్యాకములుగా ఉంటాయి.

మాయాండము

దీనిలో 7 తత్త్వములుంటాయి. పురుషుడు, అరుకంచుకములు కలసి ఈ ఏడు తత్త్వములూ ఏర్పడతాయి. ప్రకృతితత్త్వం కంటే పురుషతత్త్వం పదివేలరెట్లు పెద్దదిగా ఉంటుంది. పురుషతత్త్వం కంటే నియతి లక్షరెట్లు పెద్దది. నియతి పైన ఒకదానికంటే మరొక పదిలక్షల పెద్దదిగా ఉంటూ, కళాతత్త్వము వరకూ మిగతా తత్త్వములు వ్యాపించి ఉన్నాయి. అవి నియతి, రాగము, అశుద్ధవిద్య, కాలము, కళలై ఉన్నవి. వీటిని కంచుకములంటారు. కళాతత్త్వం కంటే కోటిరెట్లు ఎక్కువైనది మాయ. ఇంతవరకూ మాయాండము.

శక్త్యండము

దీనిలో 5 తత్త్వములున్నాయి. అవి, శుద్ధవిద్య, ఈశ్వర, సదాశివ, శక్తి, శివ తత్త్వములు. మాయాతత్త్వం కంటే శుద్ధవిద్య పదికోట్లరెట్లు పెద్దదిగా ఉంటుంది. విద్యాతత్త్వం కంటే ఈశ్వరతత్త్వం నూరుకోట్ల రెట్లు పెద్దదై ఉంటుంది. ఈశ్వరతత్త్వం కంటే సాదాఖ్యము వెయ్యికోట్లు పెద్దది. సాదాఖ్యము కంటే శక్తితత్త్వము పదివేలకోట్లు పెద్దదిగా ఉంటుంది. ఇదంతా కలిపి శక్త్యండము అనబడుతుంది.

శక్తి లేనిదే సృష్టి లేదు. శక్తి విశ్వంలో అంతటా వ్యాపించి ఉంటుంది. ఈ విధంగా, అన్ని అధ్వములకు లోపలా, బయటా, రకరకములైన ఆకారములలో వ్యాపించడంతో, దీనిని 'వ్యాపిని' అంటారు. ఈ విషయాన్ని చెబుతూ, '**వ్యాపినీ వివిధాకారా విద్యా-అవిద్యా స్వరూపిణీ**' అంటూ లలితా సహస్రనామస్తోత్రం, శక్తిని స్తుతిస్తుంది. ఈ తత్త్వములన్నీ ఒకదానిపైన మరొకటి ఆవరించుకుని ఉంటాయి. ముందున్నదానిని తరువాతది ఆవరించి ఉంటుంది.

ఈ విధంగా, భూతత్త్వం నుండి శక్తితత్త్వము వరకూ ఉన్న అధ్వములన్నీ చివరిదైన శివతత్త్వంతో వ్యాపింపబడి ఉంటాయి. శివతత్త్వము లెక్కించరానిది. పోలికలేనిది. ఇది అన్ని అధ్వములనూ మించినప్పటికీ, అదే సమయంలో అన్ని అధ్వములలోనూ వ్యాపించి కూడా ఉంటుంది.

ఈ తత్త్వముల యొక్క లోలోపల ఏయే భువనములైతే ఉన్నాయో, వాటి అధిపతులందరూ ఎక్కడో ఉండరు. వారందరూ ఈ భూమిపైనే సూక్ష్మరూపములలో ఉంటారు. అందుకనే, అన్ని లోకములకూ భూమి కేంద్రమని చెప్పబడింది. ఆయా లోకములలో ఉన్నట్టి జీవులు కూడా, పరమశివునివైపు పురోగమించాలంటే, భూలోకంలో జన్మను తీసుకొనక తప్పదు. ఆయా లోకములలో ఎవరైతే మరణిస్తారో వారికి ఆయా కర్మలను బట్టి, ఈ అధిపతులు వారి లోకములలోని గతులను ప్రసాదిస్తారు. వారివారి స్థాయిలను బట్టి, అందుకున్న దీక్షలను బట్టి, పొందిన అర్హతలను బట్టి, పైపై లోకములకు వారిని పంపిస్తూ ఉంటారు.

నరకము, హాటకము, భూమి, బ్రహ్మలోకము, విష్ణులోకము ఈ అయిదు భువనముల మధ్యలో, అనగా భూలోకంలో, రుద్రుని యొక్క స్థిరనివాసం ఉన్నది.

పదిదిక్కులకు పదిమంది అధిపతులున్నారు. వారు - అధోలోకంలో అనంతుడు, తూర్పుకు కపాలి,

ఆగ్నేయమునకు అగ్ని, దక్షిణమునకు యముడు, నైరుతీ దిక్కులో నిర్ఋతి, పశ్చిమమునకు బాలాఖ్యుడు, వాయవ్యమునకు లఘువు, ఉత్తరమునకు నిధిపతి (కుబేరుడు), ఈశాన్యమునకు విద్యాధిపుడు, పైన శంభువు, ఈ అందరిపైన వీరభద్రుడు. వీరు పదకొండుమంది. మొత్తం, ఈ పదహారు పురములు కలసి, పృథివీ అండము. ఇది నివృత్తి కళ నుండి పుట్టింది.

శివునకు అయిదు కళలున్నాయి. అవి - 1. నివృత్తి కళ 2. ప్రతిష్ఠా కళ 3. విద్యాకళ 4. శాంతి కళ 5. శాంత్యతీత కళ. వాటిలో ఒక్కొక్కటి ఈ విధంగా ఉంటాయి.

నివృత్తి కళ

ప్రవృత్తి యనగా, ఇంద్రియముల పరిధిలో, మాయలో పడి ఉంటూ అఘోరించడం. దీనికి వ్యతిరేకమైనది నివృత్తి. అనగా, ఇంద్రియముల పట్టులోనుండి, మాయయొక్క పట్టులోనుండి బయటపడి, మోక్షమును అందుకోవాలనినట్టి ప్రయత్నం. శివునియొక్క ఈ 'నివృత్తి కళ' నుండి భూమి పుట్టింది. కనుక, భూమిపైన మాత్రమే, సాధన చేసి మోక్షమును పొందే అవకాశం జీవులకున్నది. మిగతా లోకములలో, జీవులకు ఈ అవకాశం లేదు.

ప్రతిష్ఠా కళ

అలాంటి జీవులను సాధనలో చక్కగా కుదురుకునేటట్లు చేసే, శివుని శక్తికి ఈ పేరున్నది.

విద్యాకళ

అవిద్యను దాటించి విద్యను కలిగించే శక్తి ఇది. అంటే, అజ్ఞానమును దాటించి జ్ఞానమును అందిస్తుంది. కనుక విద్యయైనది.

శాంతి కళ

ఆత్మజ్ఞానమును పొందిన ఫలితంగా శాంతి లభిస్తుంది. శాంతిని అందించే శివుని శక్తికి ఈ పేరున్నది.

శాంత్యతీత కళ

ఆత్మజ్ఞానమును కూడా దాటి, పరమశివునిలో లీనమైన స్థితి ఇది. కనుక దీనిని శాంత్యతీత కళ అంటారు.

లలితాసహస్రం దీనినే, **సర్వోపనిషదుద్ఘుష్ట శాంత్యతీత కళాత్మికా** అంటుంది. అనగా, "అన్ని ఉపనిషత్తులలోను విశిష్టంగా చెప్పబడుతున్న శాంత్యతీతకళ వైన పరబ్రహ్మమువు నీవే" యని దేవిని కీర్తిస్తుంది.

ఈ క్రింది పట్టికను చూడండి.

పరమశివుడు	శాంత్యతీత కళ	-	-
శక్తి - అండము	శాంతి కళ	5 తత్త్వములు	18 భువనములు

మాయ - అండము	విద్యా కళ	7 తత్త్వములు	28 భువనములు
ప్రకృతి - అండము	ప్రతిష్ఠా కళ	23 తత్త్వములు	56 భువనములు
బ్రహ్మ - అండము	నివృత్తి కళ	1	16 భువనములు
మొత్తము	5 కళలు	36 తత్త్వములు	118 భువనములు

లకులీశుడు, భారభూతి, దిండి, ఆషాఢి, పుష్కరుడు, నిమేషుడు, ప్రభాసుడు, సురేశుడు, ఈ ఎనిమిదిమంది జలతత్త్వమునకు అధిపతులు. వీరిని **ప్రత్యాత్మకాష్టకము** అంటారు.

భైరవుడు, కేదారుడు, మహాకాళుడు, మధ్యుడు, అమ్రుడు, జల్పుడు, శ్రీశైలుడు, హరిశ్చంద్రుడు, ఈ ఎనిమిదిమంది అగ్నితత్త్వంలో ఉన్నారు. వీరిని **గుహ్యాష్టకము** అంటారు. అంటే, రహస్యశక్తులని అర్థం.

భీముడు, ఇంద్రుడు, అట్టహాసుడు, సవిమల, కనఖల, నాఖల, కురుక్షేత్ర, గయ - వీరు ఎనిమిదిమంది వాయుతత్త్వములో ఉన్నారు. వీరిని **అతిగుహ్యాష్టకము** అంటారు. అంటే, అతిరహస్య శక్తులని అర్థం. ఇవి తన్మాత్రకములై, ఇంద్రియముల చర్యలకు సాక్షులై ఉన్నాయి.

స్థాణువు, సువర్ణము, భద్రము, గోకర్ణము, మహాలయము, అవిముక్త, రుద్రకోటి, వస్త్రాపద, ఇవి ఆకాశములో ఉన్నవి. వీటిని **పవిత్రాష్టకము** అంటారు.

స్థూల, స్థూలేశ, శంకుశృతి, కాల, మండల, మాకోట, దురండ, చగలాండములు ఎనిమిది, అహంకారములో ఉన్నవి. దీనిని **ఛగలాండాష్టకము** అంటారు. అహంకారము వరకూ తన్మాత్రలు మరియు ఇంద్రియములుంటాయని మరికొందరంటారు.

బుద్ధి తత్త్వములో ఎనిమిది లోకములున్నాయి. అవి, పిశాచ, రాక్షస, యక్ష, గంధర్వ, ఇంద్ర, సోమ, ప్రజాపతి, బ్రహ్మలోకములు. వీరిని అష్టదేవయోనులని, **యోన్యష్టకము** అనీ అంటారు.

ప్రకృతిలో అకృతము మొదలైన లోకములున్నాయి. అవి, అకృతము, కృతము, వైభవ, బ్రహ్మ, వైష్ణవ, కౌమార, ఔమ, శ్రీకంఠలోకములు. వీటిని **యోగాష్టకము** అంటారు.

ఈ విధముగా ఒక్కొక్కదానిలో ఎనిమిది లోకములు కలిగిన ఏడు భువనములున్నాయి. ఈ క్రింది పట్టికనుండి, ఈ వివరమంతా తేలికగా అర్థమౌతుంది.

ప్రకృత్యండము - ప్రతిష్ఠాకళలోని 56 భువనములు

1	పత్యష్టకము	లకులీశ, భారభూతి, దిండి, ఆషాఢి, పుష్కర, నిమేష, ప్రభాస, సురేశ = 8
2	గుహ్యాష్టకము	భైరవ, కేదార, మహాకాళ, మధ్య, అమ్రుడు, జల్ప, శ్రీశైల, హరిశ్చంద్ర = 8
3	అతిగుహ్యాష్టకము	భీమ, ఇంద్ర, అట్టహాస, సవిమల, కనఖల, నాఖల, కురుక్షేత్ర, గయ = 8
4	పవిత్రాష్టకము	స్థాణువు, సువర్ణము, భద్రము, గోకర్ణము, మహాలయము, అవిముక్త, రుద్రకోటి, వస్త్రాపద = 8
5	చగలాండాష్టకము	స్థూల, స్థూలేశ, శంకుశృతి, కాల, మండల, మాకోట, దురండ, చగలాండ = 8

6	యోన్యష్టకము	పిశాచ, రాక్షస, యక్ష, గంధర్వ, ఇంద్ర, సోమ, ప్రజాపతి, బ్రహ్మ = 8
7	యోగాష్టకము	అకృతము, కృతము, వైభవ, బ్రహ్మ, వైష్ణవ, కౌమార, ఔమ, శ్రీకంఠ = 8
	మొత్తం	56

ఈ ఏబది యారు భువనములు, జలతత్త్వము నుండి ప్రకృతివరకు ఉన్న 23 తత్త్వములలో కుదురుకుని ఉన్నాయి. ఈ స్థాయికి పరమశివుని ప్రతిష్ఠాకళ ఆధారంగా ఉంటుంది.

పురుషతత్త్వంలో, 'వామ' మొదలైన ఏకాదశరుద్రలోకములున్నాయి. అవి - వామ, భీమ, ఉగ్ర, భవ, ఈశ, ఏకవీర, ప్రచండ, గౌరి, అజ, అనంత, ఏకశివులని చెప్పబడతాయి. అశుద్ధవిద్యలో రెండు భువనములున్నాయి. అవి - క్రోధేశము, చండము. కాలములో రెండు భువనములున్నాయి. అవి - సంవర్తము, జ్యోతి. నియతిలో రెండు భువనములున్నాయి. అవి - శూరము, పంచాంతము. కళలో మూడు భువనములున్నాయి. అవి - ఏకవీర, శిఖండి, శ్రీకంఠము. మాయలో ఎనిమిది భువనములున్నాయి. అవి - మహాతేజ, వామ, భవ, ఉద్భవ, ఏకపింగళ, ఈశాన, భువనేశ, అంగుష్ఠములు. ఈ విధముగా, మొత్తము ఇరవై యెనిమిది భువనములు, పురుషతత్త్వము నుండి మాయ వరకూ కుదురుకుని ఉన్నాయి.

శుద్ధవిద్యలో అయిదు భువనములున్నాయి. అవి - హాలాహల, రుద్ర, క్రోధ, అంబిక, అఘోరములనేవి. ఈశ్వరునిలో విద్యేశుల లోకములు ఎనిమిదున్నాయి. సాదాఖ్యము (సదాశివుని) లో అయిదు లోకములున్నాయి. ఈ విధముగా, శాంతకళలో పద్దెనిమిది లోకములున్నాయి.

ఈ విధంగా ఉన్నట్టి, అన్ని భువనములను (భువనాధ్వమును) తనయొక్క దేహము, ప్రాణము, బుద్ధి, మహాకాశము, పరసంవిత్ లలో ధ్యానించినట్టి యోగి, పరిపూర్ణత్వమును పొంది, తానే భైరవస్వరూపుడౌతున్నాడు.

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే దేశాధ్వప్రకాశనం నామ సప్తమమాహ్నికమ్ || 7 ||

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని దేశాధ్వప్రకాశనమనే ఏడవ ఆహ్నికము.

ఎనిమిదవ ఆహ్నికము

తత్త్వస్వరూప ప్రకాశనము

యదార్థః - యదార్థము

అథ తత్త్వాధ్వా నిరూప్యతే।

ఇప్పుడు తత్త్వాధ్వము నిరూపింపబడుచున్నది.

యదిదం విభవాత్మకం భువనజాతముక్తం గర్భీకృతానన్తవిచిత్రభోక్తృభోగ్యం, తత్ర యదనుగతం మహాప్రకాశరూపం తత్ మహాసామాన్యకల్పం పరమశివరూపమ్। యత్తు కతిపయ కతిపయ భేదానుగతం రూపం తత్తత్త్వం, యథా పృథివీ నామ ధృతి-కాఠిన్య-స్థౌల్యాది-రూపా కాలాగ్నిప్రభృతి వీరభద్రాన్త భువనేశాధిష్ఠిత సమస్త బ్రహ్మాణ్డానుగతా।

ఇప్పటివరకూ చెప్పబడిన విభవాత్మకమైన భువనములేవైతే ఉన్నాయో, వానిలో అనంతములైన విచిత్రములైన భోక్తృభోగ్యవిషయములున్నాయి. వాటన్నిటిలో మహాప్రకాశరూపమైన పరమశివరూపము మహాసామాన్యమై ఉన్నది. వానిలో కొన్నింటిలో కొన్నికొన్ని భేదములతో కూడిన రూపములు వాటి తత్త్వములున్నవి. కాలాగ్ని నుండి వీరభద్రభువనము వరకూ ఉన్నట్టి సమస్త బ్రహ్మాండములలోను ధృతి, కాఠిన్యము, స్థౌల్యముల నామకమైన పృథివిలాగా అవి ఉన్నవి.

తత్ర ఏషాం తత్త్వానాం కార్యకారణభావో దర్శ్యతే, స చ ద్వివిధః - పారమార్థికః సృష్టశ్చ। తత్ర పారమార్థిక ఏతావాన్ కార్యకారణభావో-యదుత కర్తృస్వభావస్య స్వతన్త్రస్య భగవత ఏవం-విధేన శివాదిధరాన్తేన వపుషా స్వరూపభిన్నేన స్వరూపవిశ్రాన్తేన చ ప్రథనం। కల్పితస్తు కార్యకారణభావః పరమేశేచ్ఛయా నియతిప్రాణయా నిర్మితః, స చ యావతి యదా నియతపౌర్వాపర్యావభాసనం సత్యపి అధికే స్వరూపానుగతమ్ ఏతావత్యేవ, తేన యోగీచ్ఛాతోఽపి అఙ్కురో బీజాదపి, స్వప్నాదౌ ఘటాదేరపీతి। తత్రాపి చ పరమేశ్వరస్య కర్తృత్వానపాయ ఇతి అకల్పితోఽపి అసౌ పారమార్థికః స్థిత ఏవ। పారమార్థికే హి భిత్తిస్థానీయే స్థితే రూపే సర్వమ్ ఇదమ్ ఉల్లిఖ్యమానం ఘటతే న అన్యథా, అత ఏవ సామగ్ర్యా ఏవ కారణత్వం యుక్తం।

ఆ తత్త్వముల కార్యకారణ భావములను దర్శింపజేస్తున్నాను. ఇవి, పారమార్థికములు, సృష్టింపబడినవి యని రెండు విధములు. వీనిలో పారమార్థిక కార్యకారణభావము ఎంతవరకంటే, కర్తృస్వభావియై, స్వతంత్రుడైనట్టి, భగవంతుడు, శివునినుండి భూమివరకూ నానా రూపములను ధరించినప్పటికీ, స్వస్వరూపములోనుండి కదలనివాడై, స్వరూపములో విశ్రాంతుడై ఉంటాడు. కల్పిత కార్యకారణభావం కూడా పరమేశ్వరుని ఇచ్ఛతో నియంత్రించబడే ప్రాణముతో నిర్మితమైనది. ఇవన్నీ కూడా నియతి యొక్క పూర్వాపరావభాసనములుగా అధికములుగా ఉన్నప్పటికీ స్వరూపానుగతములే. అందుకనే యోగియొక్క ఇచ్ఛవల్ల అవుతుంది, బీజంలో అంకురంలాగా, స్వప్నములో ఘటముల మాదిరిగా. అక్కడకూడా పరమేశ్వరుని కర్తృత్వము అపాయరహితమై అకల్పితమైన పారమార్థిక స్థితిలోనే ఉంటుంది. పారమార్థికము

మూలంలో ఉండటం వల్లనే ఈ సర్వమూ ఘటిస్తున్నది. వేరే విధంగా కాదు. కనుకనే సామాగ్రికి కారణత్వము యుక్తమైనది.

సా హి సమస్తభావసందర్భమయీ స్వతన్త్రసంవేదనమహిమ్నా, తథా నియత నిజనిజ దేశ-కాల-భావ-రాశిస్వభావా ప్రత్యేకం వస్తుస్వరూపనిష్పత్తిసమయే తథాభూతా, తథాభూతాయా హి అన్యథాభావో యథా యథా అధికీభవతి తథా తథా కార్యస్యాపి విజాతీయత్వం తారతమ్యేన పుష్యతి, -ఇత్యేవం సంవేదనస్వాతన్త్ర్యస్వభావః పరమేశ్వర ఏవ విశ్వభావశరీరో ఘటాదేర్నిర్మాతా-కుమ్భకారసంవిదస్తతోఽనధికత్వాత్ కుమ్భకారశరీరస్య చ భావరాశిమధ్యే నిక్షేపాత్ కథం కుమ్భకారశరీరస్య కర్తృత్వాభిమానః? ఇతి చేత్ - పరమేశ్వరకృత ఏవాసౌ ఘటాదివత్ భవిష్యతి | తస్మాత్ సామగ్రీవాదోఽపి విశ్వశరీరస్య సంవేదనస్యైవ కర్తృతాయామ్ ఉపోద్బలకః | మేరౌ హి తత్రస్థే న భవేత్ తథావిధో ఘటః | ఏవం కల్పితేఽస్మిన్ కార్యత్వే శాస్త్రేషు తత్త్వానాం కార్యకారణభావం ప్రతి యత్ బహుప్రకారత్వం తదపి సంగతం, గోమయాత్ కీటాత్ యోగీచ్ఛాతో మన్త్రాదౌషధాత్ వృశ్చికోదయవత్ | తత్ర నిజతన్త్రదృశా తం కల్పితం దర్శయామః |

స్వతంత్ర సంవేదన మహిమచేత సమస్తభావసందర్భమయమై, నియతిలో తమతమ దేశకాలరాశి స్వభావములనుబట్టి ఆయా వస్తుస్వరూపనిష్పత్తి సమయములను బట్టి ఆ విధముగా అవుతుంది. ఒకటిగా ఉండికూడా అన్యభావములు ఏయే విధములుగా ఎక్కువలౌతాయో ఆయా విధములుగా కార్యము కూడా తారతమ్యమయమై విజాతీయతను సంతరించుకుంటుంది. ఈ విధంగా స్వాతంత్ర్యస్వభావుడైన పరమేశ్వరుడు విశ్వభావశరీరమును ధరించి ఘటాది నిర్మాణములు చేయుచున్నాడు. కుమ్భకారుని సంవిత్ కూడా దానికంటే అధికం కాదు. కుంభకరుని శరీరంకూడా అదే భావరాశిమధ్యంలో ఉన్నది. అలాంటప్పుడు కుంభకారునిలో కర్తృత్వాభిమానమెలా వచ్చింది? దీనికి జవాబు - పరమేశ్వరకృతమైన ఘటములవలెనే ఇది కూడా వచ్చింది. కనుక సామగ్రీవములు మొదలైనవి కూడా విశ్వశరీరము యొక్క సంవేదనలయొక్క కర్తృత్వమునకే బలమునిస్తున్నాయి. మేరువులో ఉండి ఈ విధంగా ఘటమును చేయడం జరుగదు. ఈ విధంగా కల్పింపబడిన కార్యములలో శాస్త్రతత్వములప్రకారము కార్యకారణభావము బహుప్రకారములుగా ఉన్నది. పేడనుండి, కీటమునుండి, యోగియొక్క ఇచ్ఛనుండి, మంత్రము నుండి, ఔషధమునుండి, తేలు పుట్టినట్లుగా. కనుక నిజతంత్రదృష్టితో దానిని కల్పితమనియే దర్శిస్తున్నాను.

తత్ర పరమేశ్వరః పఞ్చభిః శక్తిభిః నిర్భర ఇత్యుక్తమ్, స స్వాతన్త్ర్యాత్ శక్తిం తాం తాం ముఖ్యతయా ప్రకటయన్ పఞ్చధా తిష్ఠతి | చిత్ప్రాధాన్యే శివతత్త్వమ్, ఆనన్దప్రాధాన్యే శక్తితత్త్వమ్, ఇచ్ఛాప్రాధాన్యే సదాశివతత్త్వమ్-ఇచ్ఛాయా హి జ్ఞాన-క్రియయోః సామ్యరూపాభ్యుపగమాత్మకత్వాత్, జ్ఞానశక్తిప్రాధాన్యే ఈశ్వరతత్త్వమ్, క్రియాశక్తిప్రాధాన్యే విద్యాతత్త్వమ్ ఇతి | అత్ర చ తత్త్వేశ్వరాః శివ-శక్తి-సదాశివేశ్వరానన్తాః-బ్రహ్మేవ నివృత్తౌ, ఏషాం సామాన్యరూపాణాం విశేషా అనుగతివిషయాః పఞ్చ, తద్యథా-శామ్భవాః శాక్తాః మన్త్రమహేశ్వరాః మన్త్రేశ్వరాః మన్త్రా, -ఇతి శుద్ధోధ్వా |

పరమేశ్వరుడు పంచశక్తినిర్భరుడని చెప్పబడినది. ఆ స్వాతంత్ర్యముతో శక్తులను వానివాని ముఖ్యరూపములలో ప్రకటిస్తూ అయిదు విధములుగా ఉంటాడు. చిత్ ప్రాధాన్యము శివతత్త్వము, ఆనందప్రాధాన్యము శక్తితత్వము, ఇచ్ఛాప్రాధాన్యము సదాశివతత్వము. ఇచ్ఛయే జ్ఞానక్రియల అభ్యుపగమ

స్వభావమై సామ్యరూపమైనది. జ్ఞానప్రాధాన్యము ఈశ్వరతత్త్వము, క్రియాప్రాధాన్యము విద్యాతత్త్వము. ఈ తత్త్వములకు అధిపతులు - శివ, శక్తి, సదాశివ, ఈశ్వర, అనంతులు. నివృత్తికళకు బ్రహ్మ అధిపతి. ఇవి సామాన్యరూపములు. అనుగతి విషయములు కూడా అయిదే - శాంభవ, శాక్త, మంత్రమహేశ్వర, మంత్రేశ్వర, మంత్రములు. ఇవి శుద్ధ అధ్వములు.

ఇయతి సాక్షాత్ శివః కర్తా, అశుద్ధం పునరధ్వాన మనన్తాపరనామా ఘోరేశః సృజతి, ఈశ్వరేచ్ఛావశేన ప్రక్షుబ్ధభోగలోలికానామణూనాః భోగసిద్ధ్యర్థమ్ । తత్ర లోలికోఽపూర్ణమ్మన్యతారూపః పరిస్పన్దః అకర్మకమభిలాషమాత్రమేవ భవిష్యదవచ్ఛేద యోగ్యతేతి న మలః పుంసస్తత్త్వాన్తరమ్ । రాగతత్త్వం తు కర్మావచ్ఛిన్నోఽభిలాషః । కర్మ తు తత్ర కర్మమాత్రం, బుద్ధిధర్మస్తు రాగః కర్మభేదచిత్ర ఇతి విభాగో వక్ష్యతే ।

ఇక్కడివరకూ సాక్షాత్ శివుడే కర్త. అశుద్ధాధ్వమును ఘోరేశుడని అపరనామం కలిగిన అనంతుడు సృజిస్తున్నాడు. ఈశ్వరేచ్ఛకు వశమై భోగలాలసులైన వారి భోగసిద్ధికోసం అది సృష్టించబడింది. లోలికమంటే పూర్ణత్వము లేదన్న పరిస్పందము. ఇది అకర్మకము కేవలమైన అభిలాష మాత్రమే. భవిష్యతులో కూడా అవచ్ఛేదయోగ్యుడనే అనేది. ఇది పురుషతత్త్వంలో లేదు. రాగతత్త్వమో, యావచ్ఛిన్నమైన కర్మయందభిలాష. అక్కడ కర్మ కేవలకర్మమాత్రమే. బుద్ధిధర్మమైన రాగము కర్మభేదముచే విభాగములుగా ఉంటుంది.

సోఽయం మలః పరమేశ్వరస్య స్వాత్మప్రచ్ఛాదనేచ్ఛాతః నాన్యత్ కించిత్, వస్త్వపి చ తత్-పరమేశ్వరేచ్ఛాత్మనైవ ధరాదేరపి వస్తుత్వాత్ । స చ మలో విజ్ఞానకేవలే విద్యమానో ధ్వంసోన్ముఖ ఇతి న స్వకార్యం కర్మ ఆప్యాయయతి । ప్రలయకేవలస్య తు జృమ్భమాణ ఏవ ఆస్త ఇతి మలోపోద్బలితం కర్మ సంసారవైచిత్ర్యభోగే నిమిత్తమ్-ఇతి తద్భోగవాసనానువిద్ధానామణూనాం భోగసిద్ధయే శ్రీమాన్ అఘోరేశః సృజతి ఇతి యుక్తముక్తం, మలస్య చ ప్రక్షోభ ఈశ్వరేచ్ఛాబలాదేవ జడస్య స్వతః కుత్రచిదపి అసామర్థ్యాత్ ।

ఈ మలములు తనను తాను కప్పుకోవాలన్న పరమేశ్వరుని ఇచ్ఛనుండి పుడతాయి, వేరే దేనినుంచి కాదు. అది ప్రత్యేక వస్తువూ కాదు. భూమి మొదలైనవి కూడా అదే విధముగా వస్తువులుగా ఉన్నాయి. విజ్ఞానకేవలులలో ఈ మలము ఉంటుంది కానీ ధ్వంసోన్ముఖమై, స్వకార్యమును ఆశించదు. ప్రళయకేవలులలో మాత్రం విజృంభించి ఉంటుంది. మలముతో కలసిన కర్మ, సంసారంలోని విచిత్రభోగములకు నిమిత్తమౌతుంది. ఆ భోగవాసనానువిద్ధులైన అణువులకు భోగసిద్ధికొరకు శ్రీమాన్ అఘోరేశుడు సృష్టిని చేస్తున్నాడన్నది యుక్తియుక్తము. ఈశ్వరేచ్ఛాబలంతోనే మలమునకు క్షోభ కలుగుతుందిగాని స్వతహాగా జడంవల్ల కలుగదు, దానికంతటి సామర్థ్యం ఉండదు.

అణుర్నామ కిల చిదాచిద్రూపావభాస ఏవ, తస్య చిద్రూపమైశ్వర్యమేవ, అచిద్రూపతైవ మలః, తస్య చ సృజతః పరమేశ్వరేచ్ఛామయం తత ఏవ చ నిత్యం వక్ష్యమాణవస్తుగతస్య రూపస్య జడతయాభాసయిష్యమాణత్వాత్ జడం సకలకార్యవ్యాపనాదిరూపత్వాచ్చ వ్యాపకం మాయాఖ్యం తత్త్వమ్ ఉపాదానకారణం, తదవభాసకారిణీ చ పరమేశ్వరస్య మాయా నామ శక్తిస్తతోఽన్యైవ । ఏవం కలాదితత్త్వానాం ధరాన్తానామపి ద్వైరూప్యం నిరూప్యమ్ । అత్ర చ ద్వైరూప్యే ప్రమాణమపి ఆహురభినవగుప్తగురవః ।

అణువనగా, చిత్ అచిత్తుల అవభాసమే. దాని చిద్రూపమే ఈశ్వరుడు, అచిద్రూపము మలము. దానిని

సృష్టించడం పరమేశ్వరేచ్ఛ ప్రకారం జరుగుతుంది. దానినుండి నిత్యమూ సృష్టింపబడుచున్న వస్తువుల రూపము జడము. సకలకార్యవ్యాపనాది రూపమువలన అది సర్వవ్యాపకమై మాయాతత్త్వమై, ఉపాదానకారణం కూడా అవుతున్నది. దానిని ప్రకాశింపజేయుచున్న పరమేశ్వరుని మాయా నామక శక్తి వేరు. ఈ విధముగా కళనుండి ధరాంతము వరకు రెండు రూపములలో ఉంటాయి. ఈ ద్వైరూప్యమునకు ప్రమాణమును అభినవగుప్తుల గురువులిచ్చియున్నారు.

యత్ సంకల్పే భాతి తత్పృథగ్భూతం బహిరపి అస్తి స్ఫుటేన వపుషా ఘట ఇవ / తథా చ మాయాకలాదిఖపుష్పాదేరపి ఏష్యేవ వర్తనీ ఇతి కేవలాన్వయీ హేతుః / అనేన చ మాయాకలాప్రకృతిబుద్ధ్యాదివిషయం సాక్షాత్కారరూపం జ్ఞానం యే భజన్తే తేఽపి సిద్ధాః సిద్ధా ఏవ / ఏవం స్థితే మాయాతత్త్వాత్ విశ్వప్రసవః / స చ యద్యపి అక్రమమేవ తథాపి ఉక్తదృశా క్రమోఽవభాసతే ఇతి / సోఽపి ఉచ్యతే, తత్ర ప్రత్యాత్మ కలాదివర్గో భిన్నః -తత్కార్యస్య కర్తృత్వోపోద్బలనాదేః ప్రత్యాత్మభేదేన ఉపలమ్భాత్, స తు వర్గః కదాచిత్ ఏకీభవేత్ అపి ఈశ్వరేచ్ఛయా సామాజికాత్మనామివ, తత్ర సర్వోఽయం కలాదివర్గః శుద్ధః యః పరమేశ్వర విషయతయా తత్స్వరూప లాభానుగుణ నిజకార్యకారీ - సంసార ప్రతిద్వన్ద్విత్వాత్ / స చ పరమేశ్వరశక్తిపాతవశాత్ తథా భవతి ఇతి వక్ష్యామస్తత్ప్రకాశనే /

ఏదైతే సంకల్పంలో ప్రకాశిస్తున్నదో అదే బాహ్యంగా కూడా స్ఫుటంగా ఉన్నది, కుండ అనే భావన, దాని భౌతికరూపం వలె. అదేవిధంగా మాయ, కళ, ఆకాశపుష్పము మొదలైనవాటికి కూడా ఇదే వర్తిస్తుంది. కేవలాన్వయమే హేతువు అనడం వల్ల మాయ, కళ, ప్రకృతి, బుద్ధ్యాదివిషయములను సాక్షాత్కరించుకున్న జ్ఞానము ఎవరికైతే ఉంటుందో అతడు సిద్ధుడన్నది సిద్ధమైనది. ఈ స్థితిలోనున్న మాయాతత్త్వంలో నుంచి విశ్వము ఉదయిస్తుంది. ఇది అక్రమమైనప్పటికీ ఇంతకుముందు చెప్పబడినదాని (కార్యకారణ నియతి) కోసం ఈ అవభాసం జరుగుతుందని చెప్పబడింది. ప్రతిఆత్మలోను కళాది వర్గములు భిన్నములై ఉంటాయి. అయినప్పటికీ అవన్నీ ఈశ్వరేచ్ఛవలన ఒక్కొక్కసారి ఒక్కటౌతాయి, సామాజికాత్మలో వలే, పరమేశ్వరవిషయములైనప్పుడు అన్ని కళావర్గములూ శుద్ధములౌతాయి. తత్స్వరూపలాభానుగుణములై తమతమ పనులను చేసినప్పుడు సంసారమునకు ప్రతిద్వన్ద్వములౌతాయి. అదికూడా పరమేశ్వర శక్తిపాతవశమున అట్లా అవుతుంది, దానిగురించి చెప్పునపుడు వివరించెదను.

అశుద్ధస్తు తద్విపరీతః / తత్ర మాయాతః కలా జాతా, యా సుప్తస్థానీయమ్ అణుం కించిత్కర్తృత్వేన యునక్తి, సా చ ఉచ్ఛూనతేవ సంసారబీజస్య, మాయాణ్వోరుభయోః సంయోగాత్ ఉత్పన్నాపి మాయాం వికరోతి, న అవికార్యమణుమ్-ఇతి మాయాకార్యత్వమ్ అస్యాః / ఏవమ్ అన్యోన్యశ్లేషాత్ అలక్షణీయాన్తరత్వం పుంస్కలయోః / మాయాగర్భాధికారిణస్తు కస్యచిదీశ్వరస్య ప్రసాదత్ సర్వకర్మక్షయే మాయాపురుషవివేకో భవతి, యేన మాయోర్ధ్వే విజ్ఞానాకల ఆస్తే, న జాతుచిత్ మాయాధః, కలపుంవివేకో వా యేన కలోర్ధ్వే తిష్ఠతి / ప్రకృతిపురుషవివేకో వా యేన ప్రధానాధో న సంసరేత్ / మలపురుషవివేకే తు శివసమానత్వం / పురుషపూర్ణతాదృష్టౌ తు శివత్వమేవేతి /

అశుద్ధకళ దీనికి విపరీతమైనట్టిది. మాయనుండి కళపుడుతుంది. అది నిద్రిస్తున్న అణువులో కొంచం కర్తృత్వభావమును పుట్టిస్తుంది. ఇది పొంగడమే, నంసారబీజము కొంచం అంకురించడానికి కారణం. మాయ అణువు ఈ రెండింటి సంయోగము వలన పుట్టినది మాయను వికారపరుస్తుంది. అణువులో వికారం లేదు.

అది మాయ చేసే పని. వీని అన్యోన్యమైన కలయికవల్ల పురుష కళలలో అలక్షణీయాంతరత్వం కలుగుతుంది. మాయాగర్భములో ఉన్న అధికారికి ఎవరికో ఈశ్వరప్రసాదమువలన సర్వకర్మక్షయమై మాయాపురుషవివేకం కలుగుతుంది, దానివల్ల మాయోర్ధ్వంలో విజ్ఞానకల కలుగుతుంది. వాడెప్పుడు మాయ యొక్క క్రిందకు పోడు. కళ, పురుషుల వివేకము కలిగినవాడు కళోర్ధ్వమున మాత్రమే ఉంటాడు. ప్రకృతిపురుష వివేకము కలిగినవాడు ప్రధానము క్రిందకు దిగడు. మలము, పురుషుల వివేకము కలిగినవాడు శివసమానుడౌతాడు. పురుషుని యొక్క పూర్ణతను దర్శించడము శివత్వమే.

ఏవం కలాతత్త్వమేవ కించిత్కర్తృత్వదాయి, న చ కర్తృత్వమ్ అజ్ఞస్య ఇతి । కించిజ్జ్ఞత్వదాయిన్యశుద్ధవిద్యా కలాతో జాయా, సా చ విద్యా బుద్ధిం పశ్యతిమ్, తద్గతాంశ్చ సుఖాదీన్ వివేకేన గృహ్ణాతి । బుద్ధేర్గుణసంకీర్ణాకారాయా వివేకేన గ్రహీతుమసామర్థ్యాత్ । తస్మాత్ బుద్ధిప్రతిబిమ్బితో భావో విద్యయా వివిచ్యతే । కించిత్కర్తృత్వం కించిద్భాగసిద్ధయే క్వచిదేవ కర్తృత్వమ్ ఇత్యత్ర అర్థే పర్యవస్యతి, క్వచిదేవ చ ఇత్యత్ర భాగే రాగతత్త్వస్య వ్యాపారః । న చ అవైరాగ్యకృతం తత్ - అవైరాగ్యస్యాపి అరక్తిదర్శనాత్ । వైరాగ్యే ధర్మాదావపి రక్తిర్దృశ్యతే । తృప్తస్య చ అన్నాదౌ - అవైరాగ్యాభావేఽపి అన్తఃస్థరాగానపాయాత్ । తేన వినా పునరవైరాగ్యానుత్పత్తిప్రసఙ్గాత్ ।

ఈ కళాతత్త్వమే కించిత్ కర్తృత్వమును కలిగిస్తుంది. అజ్ఞానికి కర్తృత్వము లేదు. కానీ కళనుండి పుట్టి, కొంచం అజ్ఞానమును కలిగించే అశుద్ధవిద్య ఏదైతే ఉన్నదో అది బుద్ధిని దర్శించి, దానిలో ఉన్న సుఖాదులను వివేకముచే గ్రహిస్తుంది. బుద్ధి గుణసంకీర్ణాకారమై వివేకంతో వాటిని తెలిసికోలేదు. కనుక బుద్ధిప్రతిబిమ్బిత భావములు విద్యతో గ్రహింపబడతాయి. కించిత్ కర్తృత్వము, పరిమితమైన ఏదో ఒక ప్రదేశంలో ఉన్నట్టి, సిద్ధికొరకు పర్యవసిస్తుంది. మరికొంచెము కర్తృత్వం కలగడం రాగతత్త్వ వ్యాపారము. అది వైరాగ్యంలేనితనం కాదు. వైరాగ్యములేన్నప్పటికీ అరక్తి దర్శనమౌతుంది. వైరాగ్యమున్నప్పటికీ ధర్మాదులలో రక్తి కనిపిస్తున్నది. అన్నం వలన తృప్తి కలిగినవారిలో వైరాగ్యము ఉన్నప్పటికీ, లోలోపల అరాగముండదు. అది లేనప్పుడు అవైరాగ్యమూ ఉండదు.

కాలశ్చ కార్యం కలయంస్తదవచ్ఛిన్నం కర్తృత్వమపి కలయతి, తుల్యే క్వచిత్త్వే అస్మిన్నేవ కర్తృత్వమ్ ఇత్యత్రార్థే నియతేర్వ్యాపారః । కార్యకారణభావేఽపి అస్యా ఏవ వ్యాపారః తేన కలాత ఏవ ఏతచ్చతుష్కం జాతమ్, ఇదమేవ కించిదధునా జానన్ అభివ్యక్తః కరోమి ఇత్యేవంరూపా సంవిద్ దేహపుర్యష్టకాదిగతా పశురిత్యుచ్యతే । తదిదం మాయాదిషట్కం కఞ్చుకషట్కమ్ ఉచ్యతే ।

కాలము కార్యకలయమును అవిచ్ఛిన్నముగా చేస్తూ, కర్తృత్వములో కూడా కలనం కలిగిస్తుంది. కాలంలోనూ నియతిలోనూ ఇది సమానమే. కర్తృత్వమును నియంత్రించడమే నియతి యొక్క వ్యాపారము. కార్యకారణసంబంధములో కూడా నియతిదే వ్యాపారము. కళనుండే ఈ నాలుగు పుట్టినవి. దీనిలో కొంచము గ్రహించి ఈ విధంగా చేస్తాను అనుకునే దేహపుర్యష్టకమ్ లో ఉన్న వాడిని పశువు అంటారు. ఈ మాయాషట్కమును కంచుకషట్కమంటారు.

సంవిదో మాయయా అపహస్తితత్వేన కలాదీనామ్ ఉపరిపాతినాం కఞ్చుకవత్ అవస్థానాత్ । ఏవం కించిత్కర్తృత్వం యత్ మాయాకార్యం తత్ర కించిత్త్వవిశిష్టం యత్ కర్తృత్వం విశేష్యం, తత్ర వ్యాప్రియమాణా

కలా విద్యాదిప్రసవహేతుః ఇతి నిరూపితమ్ । ఇదానీం విశేషణభాగో యః కించిదిత్యుక్తో జ్ఞేయః కార్యశ్చ తం యావత్ సా కలా స్వాత్మనః పృథక్ కురుతే తావత్ ఏష ఏవ సుఖదుఃఖమోహాత్మక భోగ్య విశేషానుస్యూతస్య సామాన్యమాత్రస్య తద్గుణసామ్యాపరనామ్నః ప్రకృతితత్త్వస్య సర్గః, ఇతి భోక్తృభోగ్య యుగలస్య సమమేవ కలాతత్త్వాయత్తా సృష్టిః । అత్ర చైషాం వాస్తవేన పథా క్రమవన్త్యైవ సృష్టిరిత్యుక్తం, క్రమావభాసోఽపి చాస్తీత్యపి ఉక్తమేవ ।

సంవిత్తు మాయతో కప్పబడినప్పుడు కలాదులన్నీ దానిపైన కంచుకములవలె ఉంటాయి. కొంచము కర్తృత్వమును కలిగించడం ఏ మాయయొక్క పనియైతే అయి ఉన్నదో ఆ కర్తృత్వ విశేష్యములో వ్యాపించియున్న కళ విద్యాదిప్రసవహేతువన్నది నిరూపితము. దీనిలో విశేషణభాగం ఏదైతే ఉన్నదో అదే జ్ఞేయమై కార్యరూపమౌతున్నది. అప్పుడది తనను తానే వేరు చేసుకుని, సుఖదుఃఖమోహాత్మకమై భోగ్యవిశేషానుస్యూతమై సామాన్యమాత్రమై తద్గుణసామ్యము వల్ల ప్రకృతితత్త్వములలో మునుగుతుంది. ఈ విధంగా భోక్తృభోగ్యయుగళములు సమముగా కలాతత్త్వముచేత సృష్టింపబడుచున్నవి. వాస్తవమునకు దీనిలో క్రమము లేదని చెప్పబడినప్పటికీ ఉన్నదని చెప్పటమే యుక్తము.

క్రమశ్చ విద్యారాగాదీనాం విచిత్రోఽపి దృష్టః కశ్చిద్రజ్యన్ వేత్తి కోఽపి విదన్ రజ్యతే ఇత్యాది । తేన భిన్నక్రమనిరూపణమపి రౌరవాదిషు శాస్త్రేషు అవిరుద్ధం మన్తవ్యం, తదేవ తు భోగ్యసామాన్యం ప్రక్షోభగతం గుణతత్త్వమ్ । యత్ర సుఖం భోగ్యరూపప్రకాశః సత్త్వమ్, దుఃఖం ప్రకాశాప్రకాశాన్దోలనాత్మకమ్ అత ఏవ క్రియారూపం రజః, మోహః ప్రకాశాభావరూపస్తమః । త్రితయమపి ఏతత్ భోగ్యరూపమ్ । ఏవం క్షుబ్ధాత్ ప్రధానాత్ కర్తవ్యాన్తరోదయః, న అక్షుబ్ధాదితి । క్షోభః అవశ్యమేవ అన్తరాలే అభ్యుపగన్తవ్య ఇతి సిద్ధం సాంఖ్యాపరిదృష్టం పృథగ్భూతం గుణతత్త్వం । న చ క్షోభః ప్రకృతేస్తత్త్వేశాధిష్ఠానాదేవ, అన్యథా నియతం పురుషం ప్రతి ఇతి న సిద్ధ్యేత్ ।

విద్యారాగములలో విచిత్రమైన క్రమము కన్పిస్తుంది. ఒకడు రక్తిని పొంది తెలుసుకుంటాడు, ఇంకొకడు తెలుసుకుని రక్తిని పొందుతాడు, ఆ విధంగా. దీనికి భిన్నమైన క్రమనిరూపణము రౌరవాది శాస్త్రములలో ఉన్నప్పటికీ, అది విరుద్ధము కాదు. దానిలో భోగ్యసామాన్యమైనది ప్రధానము, ప్రక్షోభగతమైనది గుణతత్త్వము. దానిలో సుఖము, భోగ్యరూపప్రకాశమైన సత్త్వమే. దుఃఖము ప్రకాశ-అప్రకాశ అందోళనాత్మకము. దాని క్రియారూపమే రజము, మోహము ప్రకాశ అభావరూపమైన తమస్సు. త్రితయమైనదే భోగ్యరూపము. ఈ క్షుబ్ధప్రధానమువల్ల కర్తవ్యాన్తరోదయమౌతుంది. అక్షుబ్ధముతో కాదు. క్షోభమును అంతరాళములో అవశ్యము అంగీకరించవలసినదే. సాంఖ్యాపరిదృష్టమైన పృథగ్భూతము గుణతత్త్వము. ఈ క్షోభము ప్రకృతి తత్త్వమునకు అధిష్ఠానమైన ఈశ్వరుని వల్ల కలుగుతుంది. అట్లా కాకపోతే, ప్రతి పురుషునితోనూ ప్రకృతి కలయిక సంభవించదు.

తతో గుణతత్త్వాత్ బుద్ధితత్త్వం యత్ర పుంప్రకాశో విషయశ్చ ప్రతిబిమ్బమ్ అర్పయతః । బుద్ధితత్త్వాత్ అహఙ్కారో యేన బుద్ధిప్రతిబిమ్బితే వేద్యసంపర్కే కలుషే పుంప్రకాశే అనాత్మని ఆత్మాభిమానః శుక్తౌ రజతాభిమానవత్ । అత ఏవ కార ఇత్యనేన కృతకత్వమ్ అస్య ఉక్తం, సాంఖ్యస్య తు తత్ న యుజ్యతే, స హి న ఆత్మనోఽహంవిమర్శమయతామ్ ఇచ్ఛతి, వయం తు కర్తృత్వమపి తస్య ఇచ్ఛామః । తచ్చ శుద్ధం విమర్శ ఏవ అప్రతియోగి స్వాత్మచమత్కారరూపోఽహమితి । ఏషోఽస్య అహంకారస్య కరణస్కన్ధః ।

దీనిలో గుణతత్త్వము నుండి బుద్ధితత్త్వము పుట్టి, దానిలో పురుషుని యొక్క ప్రకాశము విషయప్రతిబిమ్బమై అర్పింపబడుతుంది. బుద్ధితత్త్వము నుండి అహంకారము పుడుతుంది. బుద్ధి ప్రతిబింబితమైన విషయసంపర్కమువల్ల పుంప్రకాశము కలుషితమై అనాత్మలో ఆత్మాభిమానము, శుక్తములో రజతమట్లు గోచరిస్తుంది. కనుకనే 'కార' శబ్దముతో ఇది కృతకత్వమౌతుందని చెప్పబడింది. సాంఖ్యములో ఇది లేదు. ఆత్మలోని అహంవిమర్శను సాంఖ్యము అంగీకరించదు. మేము కర్తృత్వమును కూడా స్వీకరిస్తాము. ఈ శుద్ధవిమర్శకు ప్రతియోగి లేదు. ఇది స్వాత్మచమత్కారరూపమై ఉన్నది. ఇదియే అహంకారముయొక్క కరణ స్వరూపము.

ప్రకృతిస్కన్ధస్తు తస్యైవ త్రివిధః సత్త్వాదిభేదాత్ । తత్ర సాత్త్వికో యస్మాత్ మనశ్చ బుద్ధీన్ద్రియపఞ్చకం చ, తత్ర మనసి జన్యే సర్వతన్మాత్రజననసామర్థ్యయుక్తః స జనకః । శ్రోత్రే తు శబ్దజననసామర్థ్యవిశిష్ట ఇతి, యావత్ ఘ్రాణే గన్ధజననయోగ్యతాయుక్త ఇతి, భౌతికమపి న యుక్తమ్ 'అహం శృణోమి' ఇత్యాద్యనుగమాచ్చ స్ఫుటమ్ ఆహఙ్కారికత్వమ్, కరణత్వేన చ అవశ్యం కర్త్రంశస్పర్శిత్వమ్, అన్యథా కరణాన్తరయోజనాయామ్ అనవస్థాద్యాపాతాత్ । కర్త్రంశశ్చ అహఙ్కార ఏవ, తేన ముఖ్యే కరణే ద్వే పుంసః, జ్ఞానే విద్యా, క్రియాయాం కలా, అన్ధస్య పఙ్గోశ్చ అహన్తారూపజ్ఞానక్రియానపగమాత్, ఉద్రిక్తతన్మాత్రభాగవిశిష్టాత్ తు సాత్త్వికాదేవ అహఙ్కారాత్ కర్మేన్ద్రియపఞ్చకమ్ 'అహం గచ్ఛామి' ఇతి అహఙ్కారవిశిష్టః కార్యకరణక్షమః పాదేన్ద్రియం, తస్య ముఖ్యాధిష్ఠానం బాహ్యమ్ అన్యత్రాపి తదస్త్యేవ ఇతి రుగ్ణస్యాపి న గతివిచ్ఛేదః ।

సత్త్వాదిభేదములవల్ల ప్రకృతిస్కన్ధము కూడా త్రివిధమే. మనస్సు, బుద్ధీన్ద్రియపఞ్చకము సాత్త్వికము. మనను జన్మించే సమయంలో సర్వతన్మాత్రలను జనింపజేసే సామర్థ్యముతో జన్మించినది. మనస్సనేది, శ్రోత్రములో శబ్దజనన సామర్థ్యవిశిష్టతగా ఉన్నది. ముక్కులలో గన్ధజననయోగ్యతాయుక్తమౌతున్నది. దానిని భౌతికమనడం యుక్తము కాదు, 'నేను వినుచున్నాను' అనుటలో అనుగమం వలన ఆహఙ్కారికత్వము స్ఫుటమౌతున్నది. కరణత్వమునకు అవశ్యము కర్తతో స్పర్శ ఉంటున్నది. లేదా కరణాన్తరయోజన వల్ల అనవస్థ కలుగుచున్నది. కర్తయొక్క అంశమే అహంకారము. పురుషునకు దానిద్వారా రెండు ముఖ్యములైన కరణములుంటాయి. జ్ఞానముచే విద్య, క్రియలతో కళ. అంధునకు పంగునకు అహంతారూపమైన జ్ఞానక్రియల అభావము లేనట్లుగా. ఉద్రిక్తములైన తన్మాత్రభాగములచేత సాత్త్విక అహఙ్కారములో కర్మేన్ద్రియపఞ్చకము తలెత్తుతుంది. 'నేను పోతున్నాను' అనే అహఙ్కారవిశిష్టరూపమై కార్యకరణయుక్తమైనదే పాదేన్ద్రియము. దాని ముఖ్యాధిష్ఠానమే బాహ్యము. అన్యత్రా కూడా అవియే. పాదములు లేనివాడికి కూడా గతివిచ్ఛేదం లేదు.

న చ కర్తవ్యసాంకర్యముక్తాదేవ హేతోః క్రియా కరణకార్యా, ముఖ్యం చ గమనాదీనాం క్రియాత్వం న రూపాద్యుపలమ్భస్య, తస్య కాణాదతన్త్రే గుణత్వాత్, తస్మాత్ అవశ్యాభ్యుపేయః కర్మేన్ద్రియవర్గః । స చ పఞ్చకః అనుసన్ధేస్తావత్త్వాత్ । తథాహి బహిస్తావత్త్యాగాయ వా అనుసన్ధిః ఆదానాయ వా ద్వాయాయ వా, ఉభయరహితత్వేన స్వరూపవిశ్రాన్తయే వా, తత్ర క్రమేణ పాయుఃపాణిః పాద ఉపస్థ ఇతి । అన్తః ప్రాణాశ్రయకర్మానుసన్ధేస్తు వాగిన్ద్రియమ్, తేన ఇన్ద్రియాధిష్ఠానే హస్తే యత్ గమనం తదపి పాదేన్ద్రియ స్యైవ కర్మ ఇతి మన్తవ్యమ్, తేన కర్మానన్త్యమపి న ఇన్ద్రియానన్త్యమ్ ఆవహేత్, ఇయతి రాజనస్య ఉపశ్లేషకత్వమ్ ఇత్యాహుః।

కర్తవ్యసాంకర్యము లేని హేతువు సాధ్యము కాదు. క్రియ కరణకార్యము. రూపాదులలో అది ముఖ్యము

కాదు. కాణాదుని తన్త్రములో దీనిని గుణమంటారు. కనుక కర్మేంద్రియ వర్గమును తప్పక ఒప్పుకొనవలసినదే. అవి అయిదు, అనుసంధులు కూడా అన్నియే. ఆ విధముగా బాహ్యంగా త్యాగం చేయడం లేదా అనుసంధానం అవడం లేదా రెండూ చేయడం లేదా రెండూ లేకుండా ఉండటంతో స్వరూపవిశ్రాన్తమై ఉండటం, ఈ క్రమంలో పాయు, పాణి, పాద, ఉపస్థ ఇత్యాదిగా ఏర్పడతాయి. లోపల అన్తః ప్రాణాశ్రయకర్మానుసంధియైనప్పుడు వాగింద్రియము. అది ఇన్ద్రియాధిష్ఠానమైనప్పుడు హస్తములు గమనములాదిగా గల పాదేన్ద్రియకర్మ అవుతుంది. ఈ విధముగా కర్మ అనన్తమైనప్పటికీ ఇంద్రియములు అనంతములు కావు. ఇంతవరకూ రాజసం యొక్క ఉపశ్లేషకత్వమౌతుంది.

అన్యే తు రాజసాన్మన ఇత్యాహుః । అన్యే తు సాత్త్వికాత్ మనో రాజసాచ్చ ఇన్ద్రియాణి ఇతి । భోక్తృంశాచ్ఛాదకాత్ తు తమఃప్రధానాహంకారాత్ తన్మాత్రాణి వేద్యైకరూపాణిపఞ్చ । శబ్దవిశేషాణాం హి క్షోభాత్మనాం యదేకమ్ అక్షోభాత్మకం ప్రాగ్భావి సామాన్యమ్ అవిశేషాత్మకం తత్ శబ్దతన్మాత్రం । ఏవం గన్ధాన్తేఽపి వాచ్యం । తత్ర శబ్దతన్మాత్రాత్ క్షుభితాత్ అవకాశదానవ్యాపారం నభః - శబ్దస్య వాచ్యాధ్యాసావకాశసహత్వాత్ । శబ్దతన్మాత్రం క్షుభితం వాయుః శబ్దస్తు అస్య నభసా విరహాభావాత్ । రూపం క్షుభితం తేజః పూర్వగుణౌ తు పూర్వవత్ । రసః క్షుభిత ఆపః పూర్వే త్రయః పూర్వవత్ । గన్ధః క్షుభితో ధరా పూర్వే చత్వారః పూర్వవత్ । అన్యే శబ్దస్పర్శాభ్యాం వాయుః, ఇత్యాదిక్రమేణ పఞ్చభ్యో ధరణీ ఇతి మన్యన్తే ।

అన్యములో రజస్సునుండి మనస్సు పుడుతుంది అంటారు. మరికొందరు సత్వము నుండి మనస్సు, రాజసం నుండి ఇంద్రియములు పుడతాయంటారు. భోక్త్రంశ ఆచ్ఛాదకమైనందువల్లను, తమఃప్రధానమైన అహంకారము నుండియు, అయిదు తన్మాత్రలు రూపమును ధరిస్తున్నవి. క్షోభాత్మకములైన శబ్దవిశేషములలో ఒక్కటిగా ఉంటూ, అక్షోభాత్మకమై, వాటికంటే ముందే, సామాన్యమై అవిశేషాత్మకమై ఏదైతే ఉన్నదో, అది శబ్దతన్మాత్రము. ఈ విధముగా గంధమువరకూ చెప్పబడుతుంది. క్షుభితమైన శబ్దతన్మాత్ర వల్ల అవకాశదానవ్యాపార రూపమైన నభము పుడుతుంది. శబ్దమునకు వాచ్యాధ్యాసావకాశ సహత్వమున్నది. శబ్దతన్మాత్ర క్షుభితమైనప్పుడు వాయువు. దానికి శబ్దముతోను నభముతోను విరహము ఉండదు. రూపము క్షుభితమైనప్పుడు తేజము. పూర్వగుణములు పూర్వమువలెనే. రసము క్షుభితమైనప్పుడు జలము. ముందటి మూడు ముందటివలెనే. గన్ధము క్షుభితమైనప్పుడు ధర. ముందటి నాలుగు ముందటివలెనే. అన్యుల భావము ప్రకారము, శబ్దస్పర్శలవలన వాయువు ఉద్భవిస్తున్నది. ఈ విధముగా ధరణి మొదలైన పంచభూతములు పుట్టుచున్నాయని గ్రహించాలి.

గుణసముదాయమాత్రం చ పృథివీ, నాన్యో గుణీ కశ్చిత్ । అస్మింశ్చ తత్త్వకలాపే ఊర్ధ్వోర్ధ్వగుణం వ్యాపకం, నికృష్టగుణం తు వ్యాప్యం । స ఏవ గుణస్య ఉత్కర్షో - యత్ తేన వినా గుణాన్తరం న ఉపపద్యతే, తేన పృథివీతత్త్వం శివతత్త్వాత్ ప్రభృతి జలతత్త్వేన వ్యాప్తమ్, ఏవం జలం తేజసా ఇత్యాది యావచ్ఛక్తితత్త్వమ్ ॥

గుణసముదాయమాత్రము పృథివియే. వేరేది కాదు. ఈ తత్త్వకలాపములో ఊర్ధ్వోర్ధ్వగుణములు వ్యాపకములు, నికృష్టగుణములు వ్యాప్యములు. ఏది లేకుండా గుణముల అంతరము ఉండదో, అదియే గుణముల ఉత్కర్ష. పృథివీతత్త్వము, శివతత్త్వమునుండి జలతత్త్వమువరకూ ఉన్న అన్నింటితోను వ్యాప్తమౌతున్నది. జలము, తేజస్సువరకూ ఉన్న అన్నింటితోనూ. ఈ విధముగా శక్తితత్త్వము వరకూ

జరుగుతుంది.

శ్లో|| భూతాని తన్మాత్రగణేన్ద్రియాణి మూలం పుమాన్కఞ్చుకయుక్తసుశుద్ధమ్ |
విద్యాదిశక్త్యన్తమియాన్స్వసంవిత్-సిన్ధోస్తరఙ్గప్రసరప్రకారః ||

భూతములు, తన్మాత్రలు, ఇంద్రియగణములు, మూలము, కంచుకయుక్తుడైన పురుషుడు, శుద్ధవిద్య మొదలుకొని శక్తివరకూ ఉన్నవన్నియు, స్వసంవిత్ సింధువులో ప్రసరిస్తున్న తరంగములై ఉన్నవి.

వ్యాఖ్యానము

ఇప్పటివరకూ 118 భువనముల గురించిన వివరమంతా చెప్పబడింది. ఈ భువనములన్నీ, వాటికే ప్రత్యేకములైన, రకరకములైన వైభవములతో కూడి ఉంటాయి. వానిలో లెక్కలేనంతమంది భోక్తలున్నారు, భోగ్యములు కూడా అదే విధంగా ఉన్నాయి. అంటే, ఒక్కొక్క భువనములోనూ, దానికే ప్రత్యేకమైన వస్తువులు, అనుభవములు, వాటిని పొందే జీవులు ఉంటారు. కానీ, వాటన్నిటిలో ఒకే ఒక్కటి మాత్రం, దండలో దారంలాగా అంతస్సూత్రంగా ఉంటుంది. అది పరమశివతత్త్వము. అది అనంతమైన గొప్ప వెలుగుగా ఉంటుంది. కానీ, ఎటువంటి ప్రత్యేకతా లేకుండా, అతి సామాన్యంగా ఉంటుంది.

ఉదాహరణకు, కుండలన్నింటిలోనూ మట్టి అంతస్సూత్రమై ఉంటుంది. ద్రవపదార్థములన్నింటిలోనూ జలతత్త్వం అంతస్సూత్రంగా ఉంటుంది. కానీ ఘనపదార్థములలో జలము, ద్రవపదార్థములలో ఘనత్వములుండవు. కానీ, 'ఉండటం' అనేది రెంటిలోనూ సమానముగా ఉంటుంది. ఈ విధముగా 36 తత్త్వములూ వేటికవి ప్రత్యేకములై ఉన్నప్పటికీ, ఆ 36 తత్త్వములలోనూ, వాటియొక్క అంతస్సూత్రంగా ఉన్నదే పరమశివస్వరూపమని అర్థం చేసుకోవాలి.

కనుక, ఆయా భువనములలో, వాటికి తగినట్టి భేదములతో కూడిన రూపములు, వాటి తత్త్వములు ఉన్నాయి. కాలాగ్ని నుండి వీరభద్రభువనం వరకూ ఉన్నట్టి 16 భువనములతో కూడిన మొత్తము బ్రహ్మాణ్డములోనూ, భౌతికమైన రూపము, కఠినత్వము, బరువు మొదలైన లక్షణములుంటాయి. ఇదే విధముగా మిగతా 102 భువనములలో కూడా రకరకములుగా ఇవి ఉంటాయి. ఆయా తత్త్వముల యొక్క కార్యకారణ సంబంధములు ఏ విధముగా ఉంటాయో ఇప్పుడు వివరిస్తున్నారు.

ఈ తత్త్వములన్నీ - పారమార్థికములు, సృష్టింపబడినవి - యని రెండు విధములుగా ఉంటాయి. వీనిలో పారమార్థిక కార్యకారణభావము ఎలా ఉంటుంది? పరమశివుడే సమస్తానికీ కర్త. ఆయననుండే సమస్తమైన సృష్టీ ఉద్భవించింది. శివుని నుండి భూమి వరకూ ఉన్న 36 తత్త్వములుగా ఆయనే మారి, సృష్టిగా వ్యాపించినప్పటికీ, అదే సమయంలో తన స్వస్వరూపములో నుండి ఏ మాత్రమూ కదలనివాడై, స్వస్వరూపములోనే విశ్రాంతుడై ఉంటాడు. అంటే, సృష్టి, స్థితి, లయములనేవి ఆయనలోనే జరుగుతున్నాయి. కనుక, ఆయనలో ఎటువంటి మార్పూ ఉండదు.

ఇక, రెండవదియైన, సృష్టిపరమైన కల్పిత కార్యకారణభావం సంగతి చూద్దాము. ఇదికూడా,

పరమేశ్వరుని ఇచ్ఛతో నియంత్రించబడే ప్రాణముతో నిర్మితమైనట్టిదే గాని అన్యము కాదు. దీనిని ఆయన యొక్క 'నియతి' అనే శక్తి అదుపు చేస్తుంది. 'నియతి' అంటే కర్మ నియమమని అర్థం. కర్మ, తనయొక్క పనిని చేయాలంటే, వస్తువులు, క్రియ, కర్త అంటే మూడు దినుసులు అవసరములౌతాయి.

ఉదాహరణకు, కుండను తయారు చేయాలంటే, మట్టి, నీరు, చక్రము, ఇతర పనిముట్లు, కుండను చేసే వ్యక్తి, ఈ విధమైన ఉపకరణముల అవసరం ఉంటుంది. వీటిలో కూడా మళ్ళీ కార్య - కారణ సంబంధం ఉంటుంది. అంటే, మట్టి లేకుండా కుండ తయారు కాదు. కనుక, మట్టి కారణం, కుండ కార్యం. కానీ, మట్టి ఉన్నప్పటికీ, తయారు చేసే మనిషి లేకుండా, కుండ తయారీ జరుగదు. కనుక, కర్త అనేవాడి ప్రాముఖ్యత వెలుగులోకి వస్తున్నది.

అదే విధంగా, సృష్టికి కావలసిన తత్త్వములన్నీ ఉన్నప్పటికీ, వాటిని ఉపయోగించి సృష్టిని చేసే ఒక అంతిమశక్తి అవసరమౌతుంది. ఆ తత్వములన్నీ వాటంతట అవే ఆయా నిష్పత్తులలో కుదురుకొని, ఇన్ని లోకములుగా తయారు కావు. కనుక ఒక అనిర్వచనీయమైన శక్తియున్నది, ఈ అన్నిటికీ పరమకారణమౌతుంది. దానిలోనే ఇవన్నీ ఉండవలసి వస్తుంది. ఈ విధముగా, పరమేశ్వరుని ఇచ్ఛాశక్తిలోనే సృష్టి మొత్తమూ ఇమిడిపోయి ఉన్నది. అందుకనే, సిద్ధత్వాన్ని పొందిన యోగి, పరమేశ్వర స్వరూపుడవుతున్నాడు గనుక, తన ఇచ్ఛామాత్రంతో ఒక మొక్కను సృష్టించగలుగుతాడు. అదే మొక్క, విత్తనం నుండి కూడా వస్తుంది. యోగియొక్క ఇచ్ఛతో కూడా అది వస్తుంది. సామాన్య మానవులలో కూడా ఈ ప్రక్రియయే జరుగుతుంది.

ఎలా? అన్నపుడు, "స్వప్నంలో కనిపించే మరొక్క ప్రపంచం లాగా" అని చెప్పవచ్చు. స్వప్నంలో ఉన్నపుడు, లోకంలో ఉన్న వస్తువులన్నీ స్వప్నస్థితిలో కూడా సృష్టించబడి నిద్రపోతున్నవానికి కనిపించడం లేదూ? అది కూడా 'ఇచ్ఛాశక్తి' వల్లనే అవుతుంది. కానీ, తాను స్వప్నంలో ఉన్నప్పటికీ, ఇచ్ఛామాత్రంతో అనేక దృశ్యములను సృష్టించి వాటిని చూస్తున్నప్పటికీ, చూచేవానిలో మాత్రం ఏ విధమైన మార్పూ లేదు కదా. అదే విధంగా, తన అమేయమైన ఇచ్ఛాశక్తితో ఈ సమస్త భువనములతో కూడిన సృష్టిని చేసినప్పటికీ, పరమేశ్వరునియొక్క సహజస్థితిలో మాత్రం ఏమార్పూ ఉండదని అర్థం చేసుకోవాలి.

ఈశ్వరుని యొక్క ఈ పరమార్థ రూపము, ఒక గోడలాగా ఉన్నందువల్లనే దానిపైన నానారూపములతో కూడిన ఈ సృష్టి అంతా బొమ్మలలాగా లిఖించబడుతున్నది. ఇతరత్రా అయితే కాదు. కనుక సృష్టిసామగ్రికి అదే కారణమౌతున్నది. సంవిత్ రూపమైన పరమశివునిలోనే సృష్టికి అవసరమైన సమస్తభావములూ ఉన్నాయి. ఆయన తన స్వాతంత్ర్యశక్తి చేత, దేశము, కాలము, భావము, రాశి, మొదలైన వాటి రకరకములైన కూడికలచేత ఆయా వస్తువులుగా, జీవులుగా, మారుతున్నాడు. కనుక వాటిలో ఆయా తారతమ్యములు కలుగుతాయి. అన్నింటికీ మూలకారణం ఒక్కటే అయినప్పటికీ, రకరకములైన హెచ్చుతగ్గులతో కూడిన కారణములుగా అది మారడంతో, వాటిననుసరించి కార్యములు కూడా హెచ్చుతగ్గులతో ఏర్పడతాయి. ఈ విధంగా సృష్టి మొత్తమూ కార్యకారణ రూపమై రూపుదిద్దుకుంటుంది.

విశ్వమయుడు - ఇచ్ఛామయుడు

ఈ విధంగా, పరమ స్వాతంత్ర్యస్వభావము కలిగిన పరమేశ్వరుడు, విశ్వమంతా నిండిన భావశరీరమును ధరించి, సృష్టిలోని 'కుంభము' మొదలైన ఊహాలను నిర్మిస్తున్నాడు. వాటికి రూపములనిస్తున్నాడు. కుండలను తయారు చేసే కుమ్మరి యొక్క ఉనికి కూడా, ఈ విశ్వప్రణాళిక లోనిదే. దానికంటే అధికమైనదేమీ కాదు. కుంభకారుని శరీరం కూడా అదే భావరాశిమధ్యంలో ఉన్నది. అనగా, కర్త, కర్మ, క్రియలు మూడూ పరమేశ్వరుని 'ఇచ్ఛ' లోనివే యని తేలుతున్నది.

అలాంటప్పుడు, కుంభకారునిలో 'నేనొక ప్రత్యేకమైన జీవుడను' అనిన కర్తృత్వాభిమానమెలా వచ్చింది? అనే ప్రశ్న ఉదయిస్తుంది. దానికి సమాధానమేమిటంటే - పరమేశ్వరునిచేత సృష్టింపబడిన మిగతావాటిలాగే ఇదీ వచ్చింది. అంతే. ఆ కర్తృత్వాభిమానం కూడా పరమేశ్వర కృతమే. అది మాయ కాదని శివాద్వైతం అంటుంది. ఒకవేళ, వేదాంతము చెప్పునట్లుగా, అది మాయయే అయితే, ఆ మాయను సృష్టించినది ఎవరు? మాయ, తనను తానుగా సృష్టించుకోలేదు కదా? కనుక, అంతిమ విశ్లేషణలో, మాయకూడా ఈశ్వరేచ్ఛకు వశమై యున్నదే యని తేలుతున్నది.

కనుక సృష్టి మొత్తమూ, కొంత సామగ్రి వలన తయారైనది అనే వాదములు కూడా, చివరకు, ఆ సామాగ్రిని ఉపయోగించి సృష్టిని చేసేటటువంటి విశ్వచైతన్యపూర్ణమైన ఒక కర్త ఉండవలెనని సిద్ధాంతీకరించక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. మట్టి, చక్రము, ఇతర సామగ్రి అంతా ఉన్నప్పటికీ, కుమ్మరి లేకుండా కుండ తయారీ జరుగనట్లుగా ఇది కూడా ఉంటుంది.

సృష్టిలోని అనేకత్వం

కానీ, ఇక్కడ మరొక్క సమస్య తలెత్తుతుంది. సృష్టి మొత్తమూ ఏకస్వరూపముగా, ఏకస్థాయిలో, భేదరహితముగా లేదు. సృష్టిలో అనేకములైన భేదములున్నాయి. మేరుపర్వతమూ, మన ఇంటిలోని కుండా ఒక్కటి కావు. కనుక ఎక్కడో ఉన్న మేరుపర్వతమే, మన ఎదురుగా ఉన్న కుండకు కారణమని చెప్పలేము. అంటే, పరమశివుడు ఎక్కడో ఉంటూ, ఈ సృష్టిని తనకంటే విడిగా చేశాడని చెప్పడం వీలుకాదు. కనుక, కల్పింపబడిన కార్యములలో, అంటే, సృష్టిలో ఉన్న భిన్నత్వములో, కార్యకారణభావము బహుప్రకారములుగా ఇమిడియున్నదని శాస్త్రములు అంటున్నాయి. ఇదెలా ఉంటుందంటే, 'తేలు' అనే కీటకము, పేడనుండి, మరొక తేలు నుండి, యోగియొక్క బలమైన ఇచ్ఛనుండి, మంత్రప్రయోగం ద్వారా, ఔషధముల నుండి, ఈ విధముగా రకరకములుగా పుట్టవచ్చు. కనుక తనయొక్క తంత్రము వలన అది కల్పించబడిందన్నది సత్యమౌతుంది.

పరమేశ్వరుని అయిదు శక్తులు

పరమేశ్వరునిలో అయిదు విధములైన శక్తులున్నాయని మునుపు చెప్పబడినది. తన పరమస్వాతంత్ర్యముతో ఆయా శక్తులను వానివాని ముఖ్యములైనట్టి రూపములలో ప్రకటిస్తూ అయిదు విధములుగా ఆయన తనను తాను ప్రత్యక్షపరుచుకుంటూ ఉంటాడు. ఆ అయిదు శక్తులే - 1. చిత్ 2. ఆనందము. 3. ఇచ్ఛ 4. జ్ఞాన 5. క్రియలు.

శుద్ధాధ్వము

చిత్ ప్రాధాన్యతలో శివతత్త్వము గాను, ఆనందప్రాధాన్యతలో శక్తితత్త్వము గాను, ఇచ్ఛాప్రాధాన్యతలో సదాశివతత్త్వము గాను, జ్ఞానశక్తి ప్రాధాన్యతలో ఈశ్వరతత్త్వము గాను, క్రియాశక్తిప్రాధాన్యతలో విద్యాతత్త్వము గాను ఆయన వెలుగుతుంటాడు. ఇచ్ఛవల్లనే, సదాశివునిలోని జ్ఞాన-క్రియాశక్తుల మధ్యన సమత్వముంటుంది. ఈ తత్త్వములకు అధిపతులుగా, శివుడు, శక్తి, సదాశివుడు, ఈశ్వరుడు, అనంతులుంటారు. నివృత్తికళకు బ్రహ్మ అధిపతిగా ఉంటాడు. వీరు విశ్వశక్తులుగా, సర్వసామాన్య రూపములలో ఉంటారు. వీరిని అనుసరించే ఆయా లోకవాసుల కూడా ఈ విధంగానే ఉంటారు. వారు, శాంభవ, శాక్త, మంత్రమహేశ్వర, మంత్రేశ్వర, మంత్రములనబడతారు. ఇంతవరకూ, అంటే, శివుని నుండి శుద్ధవిద్య వరకూ ఉన్న అయిదు తత్త్వములకూ (శివుడు, శక్తి, ఈశ్వర, సదాశివ, శుద్ధవిద్యా తత్త్వములకు) సాక్షాత్ శివుడే కర్తయై ఉంటాడు. ఇంతవరకూ, శుద్ధ-అధ్వము (శుద్ధమైన మార్గము) అనబడుతుంది.

అశుద్ధాధ్వము

దీని తరువాత ఉన్న అశుద్ధ-అధ్వమును అనంతుడు సృష్టిస్తున్నాడు. ఈయనకు అఘోరేశుడని ఇంకొక పేరున్నది. ఈ స్థాయికూడా ఈశ్వరేచ్ఛకు వశమయ్యే ఉంటుంది. ఈశ్వరుని ఇచ్ఛకు బయటగా ఏదీ ఉండదు. భోగములను కోరుకునే జీవుల భోగసిద్ధికోసం ఈ అశుద్ధ-అధ్వము సృష్టించబడింది. అంటే, భోగేచ్ఛ ఎక్కడైతే తలెత్తిందో, అది అశుద్ధమైన లోకస్థాయిగా మారిపోతున్నది. దీనికి కారణము. లోలికమనే స్పందనము. లోలికమంటే ఊగిసలాట యని అర్థము. తాను పరిపూర్ణుడను కానన్న స్ఫు హనే లోలికమంటారు. ఇదే 'మాయ' అనబడుతుంది. ఇది ఉత్త అభిలాష మాత్రమేగాని, కర్మ అనేది ఇంకా ఈ స్థాయిలో ప్రవేశించలేదు. అంటే, ఉత్త సంకల్పమని అర్థం. భవిష్యతులో కూడా నేనిలా పరిమితుడిగానే ఉంటాసన్న నమ్మకమే ఇది. ఇది పురుషతత్త్వంలో, దానికంటే భిన్నమై, విడిగా ఉన్నటువంటి లక్షణం కాదు. దానికి స్వతస్సిద్ధముగా ఉన్నట్టిదే.

రాగము - మూడు మలములు

ఇక రాగతత్త్వమును గమనించగా, అది 'ఇంకొకదానిని పొందాల' నిన అభిలాషయై ఉంటున్నది. ఈ స్థితిలో ఉన్న కర్మ, కేవలకర్మ మాత్రమే అయియున్నది. అనగా, "ఏమి కావాలో తనకు స్పష్టంగా తెలియకపోయినా, ఏదో కావాలన్న కోరిక మాత్రం తనలో ఉదయించడమే" రాగమనే స్థాయి. తాను పరిపూర్ణుడను కాను గాబట్టి, వేరే దేనితోనో పరిపూర్ణుడనౌతానని భావించి, ఆ వేరేదానిని ఆశించడం జరుగుతుంది. కానీ, దీనికి భిన్నంగా, బుద్ధిస్థాయిలో ఉండే రాగము, కర్మభేదముల వల్ల, మూడు విభాగములుగా ఉంటుంది. అవి, అణవ, కర్మ, మాయీయ మలములనబడతాయి. ఈ మలములు, తనను తాను గుప్తపరచుకోవాలనిన పరమేశ్వరుని ఇచ్ఛనుండి పుడతాయిగాని, వేరే దేనినుండీ ఉద్భవించవు. ఈ మలములు వాటికవి ప్రత్యేకమైన వస్తువులూ కావు. భూమి మొదలైనవి కూడా, ఇదే విధముగా, పరమేశ్వరుని ఇచ్ఛ వల్లనే, ప్రత్యేకములైన రూపములతో, ప్రత్యేకములైన వస్తువులుగా విరాజిల్లుతున్నాయి.

విజ్ఞానకేవలులు - ప్రళయకేవలులు

విజ్ఞానకేవలులైన ఆత్మలలో కూడా ఈ విధమైన మలము ఉంటుంది. అది నాశనం అయ్యే దిశగా (నివృత్తి మార్గములో) పోతూ ఉంటుంది గాని, భోగేచ్ఛతో కూడుకుని, లోకమును దాని వస్తువులను అనుభవించుదామనిన దిశగా (ప్రవృత్తి మార్గములో) పోతూ ఉండదు. అగ్నిలో వేపబడుతున్న విత్తనం లాగా దాని స్థితి ఉంటుంది. మొలకెత్తే స్థితిలో ఉండదు. తనకంటూ ఏ విధమైన భోగానుభవమునూ అది ఆశించదు. ప్రళయకేవలులైన ఆత్మలలో మాత్రమే, ఈ స్థితి విజృంభించి ఉంటుంది. మరియు గట్టిగా పనిచేస్తూ ఉంటుంది. ఆణవమలముతో, కర్మమలము కలసినప్పుడు, అది సంసారంలోని రకరకములైన విచిత్రభోగములకు కారణమౌతుంది. అటువంటి, "ప్రపంచమును నేను అనుభవించాలి" అనిన కోరిక కలిగిన అణువుల (జీవుల) కొరకు, అఘోరేశుడు ఈ సృష్టినంతా చేస్తూ ఉంటాడు. ఇది తర్కసమ్మతము కూడా. ఎందుకనగా, ఈ మలములకు బలం ఎక్కడనుంచి కలుగుతుంది? ఈశ్వరేచ్ఛవల్లనే వాటికి బలము సమకూరుతుంది గాని, స్వతహాగా జడమైన ప్రపంచం వల్ల అది కలుగదు. ఏమనగా, జడవస్తువులకు, మలమును కలిగించే సామర్థ్యం ఉండదు.

అణువు - జడత్వము

'అణువ'నిన పదం ఇక్కడ వాడబడింది. అణువంటే, జీవాత్మ. సృష్టిలో అణువులెన్ని ఉన్నాయో, జీవాత్మలన్నిగా ఉన్నాయి. అణువులో చిత్ మరియు అచిత్ లు రెండూ ఉంటాయి. అంటే, చైతన్యము, జడత్వము రెండూ ఉంటాయి. దానిలో ఉన్న చిద్రూపమే ఈశ్వరుడు, అచిద్రూపము మలము. దానిని పరమేశ్వరుడే తన ఇచ్ఛప్రకారం సృష్టిస్తాడు. ఆ స్థితినుండి, నిత్యమూ సృష్టింపబడుచున్న వస్తువులకున్న జడత్వము వలన, అదికూడా జడమౌతుంది. అన్నింటిలో వ్యాపించే తత్త్వం తనకుండటం వలన, మాయాతత్త్వమై, సృష్టియొక్క ఉపాదానకారణం కూడా అవుతున్నది. కానీ, దానిని ప్రకాశింపజేయుచున్న పరమేశ్వరుని యొక్క మాయ అనబడే శక్తి వేరుగా ఉంటుంది. ఈ విధముగా, కళనుండి పృథివి వరకూ ఉన్న తత్త్వములలోని, అన్నీకూడా, రెండురెండు రూపములలో ఉంటాయి. ఈ విధముగా అన్నీ రెండురెండుగా ఉండటమును మా గురువులు ఈ విధముగా వివరించి యున్నారు.

అంతరికము - బాహ్యము

ఏదైతే లోలోపల సంకల్పంగా ప్రకాశిస్తున్నదో, అదే బాహ్యరూపంలో కూడా ప్రస్ఫుటంగా ఉన్నది. ఉదాహరణకు, కుండ అనేది మొదటగా ఒక సంకల్పరూపంలో మనస్సులో ఉంటుంది. మరలా భౌతికరూపంలో భౌతికంగా కూడా ఉంటుంది. అదేవిధంగా మాయ, కళ, ఆకాశపుష్పము మొదలైనవాటికి కూడా ఇదే వర్తిస్తుంది. హేతువంటే ఏమిటి? ఒక విషయము యొక్క మూలకారణమును అన్వేషించడమే హేతువు. కనుక, మూలంతో అన్వయమే హేతువనిన కారణం చేత, మాయ, కళ, ప్రకృతి, బుద్ధి మొదలైన విషయములను స్పష్టముగా సాక్షాత్కరించుకున్న జ్ఞానము ఎవరికైతే ఉంటుందో అతడు, మూలకారణమును దర్శించినవాడై, సిద్ధుడనబడుతున్నాడు.

ఈ స్థితిలోనున్న మాయాతత్త్వంలో నుంచి విశ్వము ఉదయిస్తుంది. దీనికొక క్రమం లేకున్నప్పటికీ, ఇంతకుముందు చెప్పబడిన కార్యకారణ నియమపు దృష్టితో చూచినప్పుడు అది ఉన్నట్లుగా కనిపిస్తుంది.

అంటే, మాయ పనిచేసే విధానమునకు ఒక క్రమం లేదు. కానీ, అది ఉన్నట్లుగా మనకు గోచరిస్తుంది. ఏమనగా, ప్రతిదానికీ హేతువును వెదుకుతూ, కార్యకారణ దృష్టితో ప్రతిదానినీ చూచే అలవాటు మనకు ఏర్పడి యున్నది కాబట్టి, ఆ విధంగా గోచరిస్తుంది గాని, నిజమునకు మాయలో ఒక క్రమమంటూ లేదు.

ప్రతి ఆత్మలోనూ, ఈ 'కళ' మొదలైన కంచుకతత్త్వముల వర్గములు భిన్నభిన్నములైన నిష్పత్తులలో కలగలసి ఉంటాయి. ఒక్కొక్క ఆత్మలోనూ, ఇవి ఒక్కొక్క విధముగా పనిచేస్తూ, భిన్నభిన్నములైన అనుభవములను ఆయా ఆత్మలకు కలిగిస్తాయి. అయినప్పటికీ, అవన్నీ ఈశ్వరేచ్ఛవలన ఒక్కొక్కసారి సామాజికాత్మలో లాగా ఒక్కటైపోతాయి. ఈ విధముగా ఎప్పుడు జరుగుతుంది? అంటే, అవన్నీ పరమేశ్వరుని వైపు తిరిగినప్పుడు ఆ విధంగా ఏకములైపోతాయి. ప్రవృత్తి వశములై, భోగం వైపు తిరిగి యున్నప్పుడు, అవి ఒక్కొక్కటి ఒక్కొక్క విధముగా ప్రవర్తిస్తూ, భిన్నభిన్నములుగా ఉంటాయి. లోకం నుండి పరమేశ్వరుని వైపు తిరిగి, నివృత్తివశములైనప్పుడు, ఇవియన్నీ ఒకే స్వరూపమును ధరిస్తాయి. సముద్రమును చేరుకొనబోయే ముందు, చిన్న చిన్న వాగులూ వంకలూ అన్నీ కలసి, ఒకే పెద్ద నదిగా మారినట్లుగా ఇది కూడా జరుగుతుంది.

అప్పుడు, ఈ కళావర్గములన్నీ శుద్ధములౌతాయి. పరమేశ్వరుని చేరుకోవాలన్న ఆకాంక్షతో నిండినప్పుడు, ఇవే కంచుకతత్త్వములు, అప్పటిదాకా సంసారములో జీవుని ముంచుతున్నవల్లా, అప్పటినుండీ సంసారమునకు ఎదురౌతాయి. ఈ విధముగా జరుగవలెనంటే కూడా, అది పరమేశ్వరుని శక్తిపాతం వల్లనే జరుగుతుంది. శక్తిపాతం గురించి, ముందుముందు వివరిస్తాను.

ఈశ్వరేచ్ఛ - శక్తిపాతము

పరమేశ్వరుని ఇచ్ఛ లేనిదే ప్రవృత్తీ లేదు, నివృత్తీ లేదు. మాయా లేదు, మోక్షమూ లేదు. కానీ, ప్రవృత్తి నివృత్తిగానూ, మాయ బంధవిముక్తిగానూ మారవలెనంటే మాత్రం, శక్తిపాతమనేది తప్పనిసరిగా ఉండాలి.

అశుద్ధకళ, శుద్ధకళకు భిన్నంగా ఉంటుంది. అంటే, అది జీవుని సంసారములో ముంచుతూనే ఉంటుంది గాని, పరమేశ్వరునివైపు నడిపించదు. మాయనుండి కళ పుడుతుంది. అది నిద్రిస్తున్న స్థితివంటి స్థితిలో ఉన్న అణువు (జీవుని) లో, కొంచమైన కర్తృత్వభావమును పుట్టిస్తుంది. ఈ కర్తృత్వభావము ఒకనితో పొంగడమే, సంసారబీజం అంకురించడానికి కారణమౌతుంది. అంటే, 'నేను చేస్తున్నాను' అనుకున్న క్షణంలో, జీవుని మాయ కమ్మివేస్తుంది. సంసారబీజములు అతనిలో నాటుకోవడం మొదలైపోతుంది. మాయ, అణువు (జీవుడు) ఈ రెండింటి సంయోగము వలన పుట్టినది మాయను వికారపరుస్తుంది. జీవునిలో స్వతహాగా వికారం లేదు. వికారమనేది మాయ వల్ల జీవునిలో కలుగుతుంది. పురుషుడు, కళ ఈ రెండూ ఒకదానికొకటి చాలా దగ్గరగా, దాదాపు కలసిపోయినట్లుగా ఉండటం వల్ల, ఒకదానినుంచి మరొకదానిని విడిగా చూడటం, సాధారణంగా సాధ్యం కాదు. మాయయొక్క పట్టులో చిక్కి, దానిలో మునిగియున్న అధికారికెవరికో ఒకరికి, ఈశ్వరప్రసాదము వలన సర్వకర్మ క్షయమై మాయ-పురుషుల మధ్యన వ్యత్యాసం గ్రహింపులోకి వస్తుంది. దానివల్ల, మాయయొక్క పైభాగంలో విజ్ఞానాకల కలుగుతుంది. అటువంటివాడు, మాయాస్థాయినుండి జారి, క్రిందకు పడిపోడు. కళ, పురుషుల వివేకము కలిగినవాడు, కళ యొక్క పైభాగంలో స్థితుడై ఉంటాడు. ప్రకృతిపురుష వివేకము కలిగినవాడు ప్రధానము (ప్రకృతి తత్త్వము) నుండి క్రిందకు దిగడు. మలము,

పురుషుల వివేకము కలిగినవాడు శివసమానుడౌతాడు.

పురుషుని యొక్క పూర్ణతను దర్శించడము శివత్వమే. ఈ కళాతత్త్వమే కొలదిగా కర్తృత్వమును జీవునిలో కలిగిస్తుంది. అజ్ఞానికి కర్తృత్వము లేదు. కానీ కళనుండి పుట్టి, కొంచం అజ్ఞానమును కలిగించే అశుద్ధవిద్య ఏదైతే ఉన్నదో అది బుద్ధిని దర్శించి, దానిలో ఉన్న సుఖాదులను వివేకముచే గ్రహిస్తుంది. బుద్ధి యనేది, త్రిగుణములతో కూడి ఉండటం వలన, వివేకంతో విషయములను తెలిసికోలేదు. కనుక, బుద్ధిలో ఊరకే ప్రతిబింబిస్తున్న భావపరంపరలు, 'విద్య' ద్వారా జీవునిచేత గ్రహింపబడతాయి.

కొంచము కర్తృత్వమనేది, ఏదైనా ఒక ప్రత్యేక ప్రదేశములోని ఒక చిన్న విషయము వైపు మాత్రమే ప్రసరిస్తుంది. దాని అనుభవాన్ని మాత్రం కలిగిస్తుంది. అంతకంటే మించిన మరికొంచెము కర్తృత్వం కలగడమనేది, రాగమనే తత్త్వము యొక్క వ్యాపారము. అది వైరాగ్యం లేనితనమని అర్థం చేసుకోకూడదు. వైరాగ్యము లేనివారిలో కూడా, అరక్తి గోచరిస్తుంది. కొందరిలో ఇతరత్రా వైరాగ్యమున్నప్పటికీ, ధర్మకార్యములలో రక్తి కనిపిస్తున్నది. ఉదాహరణకు, అన్నం తినడంవలన తృప్తి కలిగినవారిలో, తాత్కాలికంగా రాగం నశించినప్పటికీ, లోలోపల మాత్రం వారికి అన్నమంటే వైరాగ్యముండదు. కనుక లోపల రాగము లేనప్పుడు మాత్రమే, బయట వైరాగ్యము ఉదయిస్తుంది.

రక్తి, విరక్తి యనేవి అన్ని విషయముల పట్లా, అన్ని సందర్భములలోనూ సమానములుగా ఉండవు. కొన్నింటిపైన రక్తి, కొన్నింటి పైన విరక్తి ఉండవచ్చు. కొన్ని సమయాలలో విరక్తిగా ఉన్నది, మరికొన్ని సమయాలలో రక్తిగా మారవచ్చు. కనుక, సంపూర్ణ విరక్తి యున్నది కలగడం చాలా అరుదని చెప్పాలి.

కాలమనేది, కార్యమును సంకోచపరుస్తూ, అదే సమయంలో కర్తను కూడా సంకోచపరుస్తుంది. ఈ విధంగా సంకోచపరచడం అనేది కాలమునకూ, నియతికీ సమానమే. కర్తృత్వమును కూడా నియంత్రించడం నియతి యొక్క వ్యాపారము. కార్యకారణభావములో కూడా నియతియే పనిచేస్తూ ఉంటుంది. కళనుండే ఈ నాలుగు కంచుకములూ, అనగా, విద్య, రాగము, కాలము, నియతి అనునవి జన్మిస్తాయి.

ఇదం (ఇంతే) అనుకోవడం మాయ. కొలది అవడం కళ. ఆ క్షణాన్ని నడపడం కాలం. జ్ఞానము, విద్యయొక్క పని. బంధింపబడటం, రాగం. 'నేను చేస్తున్నాను' అనుకోవడం నియతి. ఈ విధంగా, సంవిత్ అనేది, పుర్యష్టకదేహంలో ఎవరిలో అయితే పనిచేస్తున్నదో, వాడిని 'పశువు' అంటారు. వీటిని దాటినవాడు 'పశుపతి' అవుతున్నాడు.

పుర్యష్టకము

పుర్యష్టకమంటే, అయిదువాయువులు, జ్ఞానేంద్రియపంచకము, కర్మేంద్రియపంచకము, మనస్సు - మొత్తము ఈ ఎనిమిదింటితో కూడిన సూక్ష్మశరీరము. స్థూలశరీరమునకున్నట్లే, సూక్ష్మశరీరానికి కూడా, పంచప్రాణములు, దశేన్ద్రియములు, మనస్సు (ప్రాణ - ఇంద్రియ - మనస్సు) లనే మూడు విభాగములూ ఉంటాయి.

కంచుక షట్కము

మాయతో మొదలయ్యే ఆరు తత్త్వములను - మాయ, విద్య, కళ, రాగము, కాలము, నియతి - వీటిని కంచుకషట్కమంటారు. సంవిత్తు మాయతో కప్పబడినప్పుడు కళ మొదలైన తత్త్వములన్నీ, దానిపైన కంచుకము (కవచము) ల వలె ఆవరించి ఉంటాయి. పురుషుడు, ఈ కంచుకములను (ఆవరణలను) దాటనిదే శుద్ధ సంవిత్ స్థితి అతనికి లభించదు.

స్వల్పమైన కర్తృత్వమును కలిగించడం మాయయొక్క పనియని చెప్పబడింది. కారును నడపడానికి ముందు, దాని ఇంజన్ ను నిద్రలేపవలసి ఉంటుంది. మాయ కూడా ఇలాంటి పనినే జీవునిలో చేస్తుంది. దానిలో 'నేను చేస్తున్నాను, నేను చెందుతున్నాను' అనే భావనను కొద్దిగా కలిగించడమే మాయ యొక్క పని. దీనినే కర్తృత్వభావన అంటారు. ఈ కర్తృత్వమనే దానిలో విశేష్యము, విశేషణములని రెండు భాగములుంటాయి. విశేష్యమంటే, దాని మూలతత్త్వము. విశేషణమంటే, దాని లక్షణము. ఉదాహరణకు, 'రాముడు సుందరుడు' అనినప్పుడు, రాముడు 'విశేష్యము', సుందరత్వము 'విశేషణము' అవుతాయి. మరియొక విధముగా చెప్పవలెనంటే, మూలము విశేష్యము కాగా, దానిపైన ఆరోపింపబడినది విశేషణము అవుతుంది. ఉదాహరణకు, పైన చెప్పబడిన 'నేను చేయుచున్నాను' అనిన మాయా భావనలో, 'నేను' అనునది విశేష్యముగాను, 'చేయుచున్నాను' అనునది విశేషణముగాను ఉంటాయి.

విశేష్యములో వ్యాపించియున్న కళాతత్త్వము నుండి విద్య మొదలైన ఇతర తత్త్వములు పుడుతున్నాయని చెప్పబడింది. అంటే, 'నేను' అనబడే భావన కలిగినప్పుడు, దానికి 'కళ' లేదా వెలుగు సోకినప్పుడు, దానినుండి 'విద్య (గ్రహింపు, జ్ఞానము) మొదలైన ఇతర తత్త్వములు ఉద్భవిస్తున్నాయి. ఇకపోతే, 'నేను' అనబడే కర్తృత్వములోని విశేషణాభాగం ఏదైతే ఉన్నదో ('చేయుచున్నాను' అనునది), అది జ్ఞేయవస్తువై కార్యరూపమును ధరిస్తున్నది. ఈ విధముగా, తనను తానే జ్ఞాత, జ్ఞేయములుగా వేరు చేసుకుంటున్నది. అప్పుడది, ఆ కర్మఫలములైన, సుఖము, దుఃఖము, మోహములలో తగులుకుని, భోగ్యవస్తువులను అనుసరించి, గుణసామ్యము వల్ల, ఆయా ప్రకృతితత్త్వములలో మునుగుతుంది. తనను తాను మరచి, కర్మలో చిక్కుకున్నప్పుడు, ఆ కర్మ ద్వారా తనకు కలుగుతున్న అనుభవం యొక్క లక్షణమును, గుణమును బట్టి, ప్రకృతి బంధములలో చిక్కుకుంటుంది. ఈ విధంగా, భోక్త-భోగ్యములనబడే రెండూ కూడా, కళాతత్త్వముచేత సమానముగా సృష్టింపబడుచున్నవి. వాస్తవమునకు ఈ సృష్టిలో ఒక క్రమము లేదని చెప్పబడినప్పటికీ, దీనినిబట్టి చూచినపుడు, ఉన్నదని చెప్పటమే సరియైనది.

విద్యా, రాగతత్త్వములలో ఒక విచిత్రమైన క్రమము కన్పిస్తుంది. కొందరు ముందుగా ఒక విషయములో రక్తిని పొంది, తరువాత దానిని తెలుసుకుంటారు. ఇక్కడ, రక్తి ముందు, విద్య తరువాత తలలెత్తుతాయి. అయితే, మరికొందరు, ముందు విషయమును తెలుసుకుని, ఆ తరువాత దానిపైన రక్తిని పొందుతారు. ఇక్కడ, ముందుగా విద్య, తరువాత రక్తి ఉదయిస్తాయి. ఈ విధముగా విద్యా(జ్ఞాన), రాగము(అనురక్తి)లకు విచిత్రమైన నడక ఉంటుంది. దీనికి భిన్నమైన నడకలు, రౌరవము మొదలైన తంత్రశాస్త్రములలో చెప్పబడి ఉన్నప్పటికీ, అవి మన సిద్ధాంతమునకు విరుద్ధములైనవి కావు గనుక, వాటిని మరలా తర్కించబోవడం లేదు.

అణువుచేత తెలియబడుతూ, భోగ్యవస్తురూపంగా ఉండేది, ప్రకృతి. జీవుడు దేనినైతే అనుభవరూపంలో గ్రహిస్తున్నాడో అదే ప్రకృతి. ఇది త్రిగుణాత్మికయై ఉంటుంది. ఆయా అనుభవములలోని క్షోభరూపంలో

ఉందేది, దాని యొక్క గుణము. వీటిలో సుఖము, దుఃఖము, మోహము అని మూడున్నాయి. వీనిలోని సత్త్వగుణమేమో, భోగ్యవస్తువులోని ప్రకాశ (వెలుగు) రూపము. అది జీవునకు సుఖముగా గోచరిస్తుంది. దుఃఖమేమో భోగ్యవస్తువులోని వెలుగూ చీకటుల సమ్మేళనస్వరూపమైన క్షోభగా ఉంటుంది. దాని క్రియారూపమే రజోగుణము. ఇక మోహమేమో, వెలుగన్నదే లేనిది, చీకటి వంటిది. మోహములో చిక్కుకున్న వానికి, దారీ తెన్నూ గోచరించదు. కనుక, ఇది తమోగుణము. ఈ విధముగా మూడుగుణములతో కూడిన ప్రకృతియే భోగ్యరూపమౌతున్నది. ప్రకృతిలోని ఈ క్షోభ వల్లనే సత్త్వ, రజో, తమోగుణములు, వాటినుండి సుఖ, దుఃఖ, మోహములు పుట్టుకొస్తాయి. క్షోభ (కదలిక) లేని స్థితిలో ఉన్నట్టి ప్రకృతి నుండి సృష్టి జరుగదు. కనుక, చలనము లేని స్థితిలో ఉన్న ప్రకృతికి, నిరంతరమూ చలిస్తూ సృష్టిని నడిపిస్తూ ఉన్న త్రిగుణములకు మధ్యలో, క్షోభ (కదలిక, చలనము) ను తప్పక అంగీకరించవలసి ఉంటుంది. కనుక సాంఖ్యసిద్ధాంతములో లేనట్టి 'గుణతత్త్వము'నే ఒక క్రొత్త విషయము ఈ శాస్త్రములో మనకు గోచరిస్తుంది. దీనిలోని 36 తత్త్వములలో, ప్రకృతితత్త్వమునకు, బుద్ధితత్త్వమునకు మధ్యలో 'గుణతత్త్వము'నే ఒక స్థాయి చెప్పబడింది. అయితే, ఇది ప్రకృతిలోని భాగమేగాని, ప్రత్యేకమైన తత్త్వము కాదు. ప్రకృతిని భోగించాలని కోరుకునే జీవులకు మాత్రం ఈ 'క్షోభ' కలుగుతుంది. అలా కోరుకొనని జీవులలో ఇది ఉండదు. ఈ క్షోభము, ప్రకృతి తత్త్వమునకు అధిష్ఠాతమైన ఈశ్వరుని వల్ల, జీవునిలో కలుగుతుంది.

ప్రకృతి - పురుష వివేకమన్నది ప్రాచీన సాంఖ్యసిద్ధాంతములో ఉన్నది. అయితే, దాని ప్రకారము, ప్రకృతి జడమైనది. పురుషుడు జ్ఞానస్వరూపుడైనప్పటికీ కదలిక లేనివాడు. అలాంటప్పుడు, ప్రకృతిలో కదలిక ఎలా వస్తున్నదన్న ప్రశ్న ఉద్భవిస్తుంది. త్రికశాస్త్రము ఈ సమస్యను పరిష్కరిస్తూ, ప్రకృతిలో గోచరించే క్షోభము, దాని అధిష్ఠాతయైన ఈశ్వరుని వల్లనే కలుగుతుందని చెబుతుంది. అట్లా జరగకపోతే, ప్రతి పురుషుని (జీవుని) తోనూ, ప్రకృతి కలవడమనేది సంభవం కాదు కదా !

అప్పుడు, క్షోభరూపమైన గుణతత్త్వము నుండి బుద్ధితత్త్వము పుడుతుంది. పురుషుని యొక్క వెలుగు, విషయములలో ప్రతిబింబించి, అది బుద్ధిలో ప్రసరిస్తుంది. బుద్ధితత్త్వము నుండి అహంకారము పుడుతుంది. బుద్ధిలో ప్రతిబింబిస్తున్న విషయములతో కలసినందువలన, పురుషుని వెలుగు కలుషితమై, అనాత్మలో ఆత్మాభిమానము గోచరిస్తుంది. అంటే, ప్రకృతి విషయములలో ఆసక్తి పురుషునిలో జనిస్తుంది. ఇది, ముత్యపుచిప్పలో వెండిని భ్రమించిన తీరులో ఉంటుంది. నిజమునకు, ముత్యపుచిప్పలో వెండి లేదు. కానీ ఉన్నట్లు అనిపిస్తుంది. ఈ విధమైన భ్రమకు గురిచేస్తుంది గనుకనే, 'అహం' అనిన శబ్దమునకు కర్మసూచకమైన 'కార' మనే శబ్దమును కలపడం జరుగుతుంది. 'కారము' అనగా, 'చేయునది' అని అర్థం. కర్మసూచకమైనది కారము. కనుక, నిష్క్రియమైన 'అహం' భావనకు, కారమును కలిపినప్పుడు, క్రియాత్మకమైన 'అహంకారము' ఉదయిస్తున్నది. అయితే, దీనిని సాంఖ్యము ఒప్పుకొనదు. ఆత్మలోని అహంవిమర్శను సాంఖ్యము అంగీకరించదు. కానీ, శివాద్వైతవాదులైన అభినవగుప్తాదులు ఆత్మకు కర్తృత్వమున్నదని ఒప్పుకుంటున్నారు. ఈ అహంకర్తృత్వమనేది శుద్ధవిమర్శయై ఉండటంవల్ల దీనికి ఎదురైనది ఏదీ సృష్టిలో లేదు. ఇది తన ఆత్మలో తానే ఆనందిస్తూ, తనలో తానే వెలుగుతూ ఉన్నది. ఈ శుద్ధాహంకారము నుండి జ్ఞానేంద్రియ కర్మేంద్రియ పంచకములు పుడుతున్నాయి. వీటిని కరణస్కంధములంటారు. కరణములంటే పనిముట్లు, ఉపకరణములు. సత్త్వ రజస్తమో గుణములు ప్రకృతిలో

ఉన్నందువలన, వాటిననుసరించి ఈ పనిముట్లు కూడా మూడు విధములుగానే పనిచేస్తాయి. వీటిలో, మనస్సు, అయిదు జ్ఞానేంద్రియములు సాత్వికములు. మనసును సృష్టించే సమయంలో, అయిదు తన్మాత్రలను తనలో మననం చేయగలిగే సామర్థ్యముతో అది పుట్టించబడింది. చెవులలో శబ్దమును పుట్టించగల సామర్థ్యముగా మనస్సక్కడ ఉన్నది. ముక్కులో వాసనను పుట్టించగల శక్తితో ఉన్నది. మనస్సు గనుక తన్మాత్రలను గ్రహించలేకపోతే, 'అనుభూతి' కలుగదు. చాలాసార్లు, మనస్సు వేరే చోట ఉన్నపుడు, తింటున్న పదార్థం యొక్క రుచి మనకు తెలియదు. ఇది అందరికీ అనుభవమే కదా ! ఇటువంటిదే, అన్ని ఇంద్రియములకూ జరుగుతుంది. దీనినే మనం పరధ్యానమని అంటాము.

మనస్సును భౌతికమనడం సరియైన భావన కాదు. ఎందుకనగా, 'నేను వినుచున్నాను' అనుటలో 'నేనన్న' అహంభావము స్పష్టంగా కనిపిస్తున్నది. కనుక, కరణములనబడే ఇంద్రియములకు, వాటియొక్క కర్తతో స్పర్శ తప్పకుండా ఉంటున్నది. అట్లా కాకుండా, అవి ఒకదానిపైన మరొకటి ఆధారపడి ఉన్నాయని అనుకుంటే, ఈ గొలుసు అనంతంగా సాగుతూ, అంతూ పొంతూ లేని ఇంద్రియసమూహములను సృష్టిస్తూ పోతుంది. కనుక ఈ తర్కము అసంబద్ధమని తేలుతున్నది.

ఇది బౌద్ధంలో చెప్పబడిన భావన. దానిలో, ఇంద్రియానుభూతులకు వెనుక 'నేను' అనిన ఆత్మభావన లేదని, వాటితో బాటే పుట్టి వాటితో బాటే అది కూడా అంతరిస్తుందని అంటారు. దీనిని 'ప్రతీత్య సముత్పాద' మంటారు. కనుక అది అనాత్మవాదమైంది. ఈ వాదము సరియైనది కాదని వేదాంతము నిరూపించి, బౌద్ధాన్ని సతార్కికంగా ఖండించింది. అభినవగుప్తులవారు కూడా దీనినే చెబుతున్నారు.

కర్త (పురుషుని) యొక్క అంశమే అహంకారము. అది, అతని యొక్క విశేష్య-విశేషణల సమ్మిళితరూపమని చెప్పబడింది. పురుషునకు అహంకారము ద్వారా రెండు ముఖ్యములైన స్థితులు సంభవిస్తాయి. అవి, జ్ఞానము, క్రియ. వీనిలో, జ్ఞానము కొరకు అశుద్ధవిద్య, క్రియకొరకు కళ, పురుషునకు ఉపయోగిస్తాయి. ప్రకృతిజ్ఞానమును పొందించునది అశుద్ధవిద్య. శుద్ధవిద్యాతత్త్వముతో దీనికి గల భేదమును స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

అందుకనే, గ్రుడ్డివారు, కుంటివారు కూడా, అహంభావ విషయంలో ఏ విధమైన లోటునూ పొందరు. వస్తువులను చూడలేదు గనుక, వాటిని గురించిన సత్యమైన జ్ఞానము గ్రుడ్డివానికి ఉండదు. కనుక, 'జ్ఞాన' మనేది గ్రుడ్డివానిలో లోపిస్తుంది. నడవలేదు గనుక, కుంటివానిలో 'క్రియ' లోపిస్తుంది. కానీ 'అహంభావం' విషయంలో మాత్రం, వారికేమీ లోటు ఉండదు.

కళ మరియు విద్యలతో ఉద్రేకమును పొందిన ఆయా తన్మాత్రలచేత, సాత్త్వికరూపమైన అహంకారములో అయిదు కర్మేంద్రియములు తలలెత్తుతున్నవి. ఉదాహరణకు, 'నేను నడుస్తున్నాను' అనే అహంభావంతో కూడియుండి, పాదేంద్రియములు పనిచేస్తాయి. దానికి భౌతికమైన ఆధారముగా, దేహములో పాదము ఉంటుంది. ఈ విధంగా మిగతా అన్ని ఇంద్రియములలోనూ జరుగుతుంది. అందుకనే, పాదములు లేనివాడికి కూడా, అంతరికమైన కదలిక లేకుండా పోలేదు. ఎందుకంటే, కర్తృత్వముతో సంబంధము లేని హేతువు సాధ్యము కాదు కదా! క్రియయన్నది కర్మేంద్రియముల పని మాత్రమే. జ్ఞానేంద్రియచర్యలలో క్రియ అన్నది

ముఖ్యమైనది కాదు. అక్కడ భావమే ముఖ్యమైనది. కణాదమహర్షి సిద్ధాంతమైన వైశేషికములో దీనిని 'గుణ'మంటారు. కనుక కర్మేంద్రియ వర్గమును తప్పక ఒప్పుకొనవలసినదే. అవి అయిదుగా ఉన్నాయి. వాటి, ఇంద్రియచర్యలు కూడా అన్నియే. ఈ విధముగా, విసర్జించడం, ఇవ్వడం, తీసుకోవడం లేదా రెండూ చేయడం లేదా రెండూ లేకుండా తనలోతానుగా ఉండటం, ఈ క్రమములలో వాక్కు, పాయు, పాణి, పాద, ఉపస్థ ఇత్యాది ఇంద్రియచర్యలు ఏర్పడతాయి. ప్రాణముతో అనుసంధానమైనప్పుడే నోరు పనిచేస్తున్నది. అదే ప్రాణము, మిగిలిన ఇంద్రియముల ద్వారా పనిచేస్తున్నప్పుడు, చేతులు, కాళ్ళు, మొదలైన మిగతా ఇంద్రియచర్యలు జరుగుతున్నాయి. ఈ విధముగా, అయిదు ఇంద్రియములతోనే అనేకములైన కర్మలు జరుగుతున్నాయి.

ఇదంతయూ రజస్సు యొక్క పనియని కొందరంటారు. ఇంకొందరు, "రజస్సునుండి మనస్సు పుడుతుంది" అంటారు. మరికొందరు "సత్వము నుండి మనస్సు, రజస్సు నుండి ఇంద్రియములు" పుడతాయంటారు. "పంచభూతముల యొక్క సూక్ష్మరూపములైన పంచతన్మాత్రలు, అహంకారముయొక్క తమోభాగము నుండి పుడుతున్నాయి. ఇవి భోక్తను (పురుషుని) తమ తమస్సుతో కప్పివేస్తున్నాయి. ఆ విధంగా, అతని స్వరూపజ్ఞానమును ఆచ్ఛాదిస్తున్నాయి" అని మరికొందరంటారు.

తన్మాత్రలు

శబ్దములన్నీ క్షోభాత్మకములుగా ఉంటాయి. అంటే, స్పందనాత్మకములై, శబ్దతరంగములతో స్పందిస్తూ ఉంటాయి. వాటన్నిటి లోలోపల ఉంటూ, క్షోభము, స్పందము లేకుండా ఉంటూ, ఎటువంటి విశేషమూ తనలో లేనట్టి సామాన్యశబ్దమేదైతే ఉన్నదో, అది శబ్దతన్మాత్రమనబడుతుంది. అంటే, విశేషణములేమీ లేని ఉత్త శబ్దమని అర్థము. ఇదేవిధముగా స్పర్శ, రూప, రస, గంధములకు కూడా తన్మాత్రలుంటాయి.

ఈ విధంగా ఉన్న శబ్దతన్మాత్రలో క్షోభ కలగడం వలన, దానినుండి ఆకాశము పుడుతుంది. ఉండటానికై వేరేవాటికి చోటును కల్పించడము, వాటి రాకపోకలు మొదలైన చర్యలకు అవకాశమును కల్పించడమే ఆకాశము యొక్క ధర్మము. శబ్దమునకు వాక్కును కల్పించే శక్తి ఉన్నది. ఈ విధముగా, శబ్దతన్మాత్ర క్షుభితమైనప్పుడు వాయువు పుడుతుంది. అది, శబ్దముతోను, ఆకాశముతోను, విడిగా ఏమీ ఉండదు. వాటితో కలసియే ఉంటుంది. ఇదే విధముగా, రూపతన్మాత్ర క్షోభను పొందినపుడు, అగ్ని పుడుతుంది. దానిలో, దాని పూర్వతన్మాత్రల గుణములైన, శబ్దము, రూపము కలసి ఉంటాయి. రసతన్మాత్ర క్షోభను పొందినపుడు జలము పుడుతుంది. దానిలో ముందటి తన్మాత్రలైన అగ్ని, వాయువు, ఆకాశము కలసి ఉంటాయి. గంధతన్మాత్ర క్షోభను పొందినపుడు, భూమి పుడుతుంది. ముందటి నాలుగు తన్మాత్రలూ దీనిలో కలసి ఉంటాయి. శబ్దస్పర్శల వలన వాయువు పుడుతుందని ఇతరులంటారు. ఈ విధముగా భూమి మొదలైన పంచభూతములు పుట్టుచున్నాయని గ్రహించాలి. పై నాలుగు భూతముల యొక్క గుణముల సముదాయరూపమే భూమిగాని, వేరైనది కాదు.

ముప్పదియారు తత్త్వముల యొక్క ఈ విధమైన కలాపములో, పైనున్న గుణములు వ్యాపకములు, క్రిందనున్న గుణములు వ్యాప్యములు అవుతున్నాయి. అనగా, పై గుణములు, క్రింది గుణములలోనికి

వ్యాపిస్తాయి. సృష్టి యన్నది ఈశ్వరుని నుండి భూమిపరకూ వ్యాపిస్తుంది గనుక, ఈ ప్రక్రియ కూడా ఊర్ధ్వం నుండి నిమ్నానికి వ్యాపిస్తూ ఉంటుంది. ఏది లేకుండా, ఇతర గుణములు ఉండవో, అ గుణము వాటికంటే ఉత్తమమైనదని గ్రహించాలి. ఈ విధముగా, పృథివీతత్త్వమనేది, శివతత్త్వమునుండి జలతత్త్వమువరకూ ఉన్న అన్ని తత్త్వములతోను నిండి యున్నది. జలతత్త్వము, దానికంటే పైనున్న అగ్నితత్త్వమువరకూ ఉన్న అన్ని తత్త్వములతోను నిండి యున్నది. ఈ విధముగా పైపైకి శక్తితత్త్వము వరకూ ఇదే విధానం గోచరిస్తుంది.

ఆ// పంచభూత తతులు బరగి తన్మాత్రలై
ఇంద్రియాది గణము లిందు జేరి
ప్రకృతి; కంచుకములు; ప్రఖ్యాత పురుషుండు
శుద్ధవిద్య మొదలు శక్తి దనుక

ఆ// శివుని యాత్మ మిగుల చిత్రమౌ సంద్రమ్ము
చిరము; ఆత్మమయము; చిన్మయమ్ము
తత్త్వతతులు దాని తరగలై భాసిల్లు
అవధి లేని పదము; అద్వయమ్ము;

పంచభూతములు, పంచతన్మాత్రలు, జ్ఞానేంద్రియ, కర్మేంద్రియగణములు, అహంకారము, ఆరు కంచుకములతో కప్పబడియున్న పురుషుడు, శుద్ధవిద్య మొదలుకొని శక్తి వరకూ ఉన్న అన్ని తత్త్వములూ, 'నేను' అనే సంవిత్ సముద్రములో లేచుచున్న అలలేనన్నది ఈ అధ్యాయపు సారాంశము.

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే తత్త్వస్వరూపప్రకాశనం నామాష్టమమాహ్నికమ్ || 8 ||

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని తత్త్వస్వరూప ప్రకాశనమనే ఎనిమిదవ ఆహ్నికము.

తొమ్మిదవ ఆహ్నికము

తత్త్వభేద ప్రకాశనము

యదార్థః - యదార్థము

అథ తత్త్వానాం భేదో నిరూప్యతే।

ఇప్పుడు తత్త్వభేదములు నిరూపింపబడుచున్నవి.

స చ సప్తధా షడర్ధశాస్త్ర ఏవ పరం పరమేశేన ఉక్తః । తత్ర శివాః మన్త్రమహేశాః మన్త్రేశాః మన్త్రాః విజ్ఞానాకలాః ప్రలయాకలాః సకలా ఇతి సప్త శక్తిమన్తః । ఏషాం సప్తైవ శక్తయః, తద్భేదాత్ పృథివ్యాదిప్రధానతత్త్వాన్తం చతుర్దశభిర్భేదైః ప్రత్యేకం స్వం రూపం పఞ్చదశం।

షడర్ధశాస్త్రము ఏడు విధములుగా పరమేశునిచేత చెప్పబడినది. శివులు, మన్త్రమహేశులు, మన్త్రేశులు, మన్త్రములు, విజ్ఞానాకలులు, ప్రలయాకలులు, సకలులు - ఈ ఏడుగురును శక్తిమంతులు. వీరికి ఏడుగురు శక్తులు. వీరి భేదములచేత పృథివి నుండి ప్రధానతత్త్వము వరకు పదునాలుగు భేదములతో, స్వరూపప్రత్యేకతతో, మొత్తము పదిహేను రూపములౌతాయి.

తత్ర స్వం రూపం ప్రమేయతాయోగ్యం స్వాత్మనిష్ఠమ్ - అపరాభట్టారికానుగ్రహాత్, ప్రమాతృషు ఉద్రిక్తశక్తిషు యత్ విశ్రాన్తిభాజనం తత్ తస్యైవ శాక్తం రూపం శ్రీమత్పరాపరానుగ్రహాత్ । తచ్చ సప్తవిధం శక్తీనాం తావత్త్వాత్ । శక్తిమద్రూపప్రధానే తు ప్రమాతృవర్గే యత్ విశ్రాన్తం తచ్ఛక్తిమచ్ఛివరూపం శ్రీమత్పరాభట్టారికానుగ్రహాత్, తదపి సప్తవిధం - ప్రమాతృణాం శివాత్ప్రభృతి సకలాన్తానాం తావతామ్ ఉక్తత్వాత్ । తత్ర శక్తిభేదాదేవ ప్రమాతృణా భేదః, స చ స్ఫుటీకరణార్థం సకలాదిక్రమేణ భణ్యతే, తత్ర సకలస్య విద్యాకలే శక్తిః తద్విశేషరూపత్వాత్ బుద్ధికర్మాక్షశక్తీనాం, ప్రలయాకలస్య తు తే ఏవ నిర్విషయత్వాత్ అస్ఫుటే ।

వానిలో, స్వరూపము, ప్రమేయతాయోగ్యమై స్వాత్మనిష్ఠమై ఉండటం అపరాభట్టారికానుగ్రహము వల్ల అవుతుంది. ప్రమాతలలో ఉద్రిక్తశక్తుల విశ్రాన్తిభాజనమైనది దానియొక్క శాక్తరూపము, ఇది శ్రీమత్పరాపరానుగ్రహము వల్ల జరుగుతుంది. శక్తులు కూడా ఏడు విధములే. శక్తిమంతునకు ప్రమాతృవర్గములో రూపప్రధానమైనప్పుడు, ఏది విశ్రాన్తమౌతున్నదో, ఆ శక్తిమత్ శివరూపం శ్రీమత్పరాభట్టారికానుగ్రహముతో అవుతుంది. శివుని నుండి సకల వరకు అన్నియే తత్త్వములున్నాయి గనుక, అవికూడా ఏడు విధములే. శక్తిభేదమువల్లనే ప్రమాతృభేదము కలుగుతుంది. వీటి స్ఫుటీకరణార్థమై సకలాదిక్రమములో విభజింపబడుచున్నది. సకలులకు విద్యా, కళలు శక్తులు. వాటి విశేషరూపములే బుద్ధి మరియు కర్మశక్తులు. ప్రలయాకలులలో ఇవియే నిర్విషయములై అస్ఫుటములై ఉన్నాయి.

విజ్ఞానాకలస్య తే ఏవ విగలత్కల్పే తత్సంస్కారసచివా ప్రబుధ్యమానా శుద్ధవిద్యా మన్త్రస్య । తత్సంస్కారహీనా సైవ ప్రబుద్ధా మన్త్రేశస్య । సైవ ఇచ్ఛాశక్తిరూపతాం స్వాతన్త్ర్యస్వభావాం జిఘృక్షన్తీ మన్త్రమహేశ్వరస్య । ఇచ్ఛాత్మికా స్ఫుటస్వాతన్త్ర్యాత్మికా శివస్య ఇతి శక్తిభేదాః సప్త ముఖ్యాః । తదుపరాగకృతశ్చ

శక్తిమత్సు ప్రమాతృషు భేదః - కరణభేదస్య కర్మభేదపర్యవసానాత్, శక్తేరేవ చ అవ్యతిరిక్తాయాః కరణీకర్తుం శక్యత్వాత్ న అన్యస్య - అనవస్థాద్యాపత్తేః।

విజ్ఞానాకలులలో ఇవి క్షీణములై, సంస్కారరూపములలో ఉన్నాయి. మన్త్రములలో నిద్రలేచుచున్న స్థితిలో శుద్ధవిద్య ఉన్నది. ఆ సంస్కారములు లేకపోవడం వలన, మన్త్రేశులలో అది ప్రబుద్ధమై ఉన్నది. మన్త్రమహేశ్వరులలో, ఇదే శుద్ధవిద్య, ఇచ్ఛాశక్తిరూపమై స్వాతన్త్ర్యస్వభావముతో ప్రబుద్ధమై ఉన్నది. శివులలో, ఇదే శక్తి, ఇచ్ఛాత్మికయై, స్ఫుటమైన స్వాతన్త్ర్యరూపంగా ఉన్నది. ఈ ఏడు ముఖ్యములైన విధములుగా శక్తి ఉన్నది. వీని ఉపరాగమువల్ల శక్తిమంతునిలో ప్రమాతలలో భేదములు వస్తున్నాయి. కరణభేదములవల్ల కర్మభేదములు కలుగుతాయి. అవ్యతిరిక్తమైన శక్తియే కరణముగాని అన్యముకాదు, లేదా అనవస్థ కలుగుతుంది.

వస్తుతః పునరేక ఏవ చిత్స్వాతన్త్ర్యానన్దవిశ్రాన్తః ప్రమాతా, తత్ర పృథివీ స్వరూపమాత్రవిశ్రాన్తా యదా వేద్యతే తదా స్వరూపమ్ అస్యాః కేవలం భాతి చైత్రచక్షుర్దృష్టం చైత్రవిదితం జానామీతి, తత్ర సకలశక్తికృతం సకలశక్తిమద్రూపకృతం స్వరూపాన్తరం భాత్యేవ, ఏవం శివాన్తమపి వాచ్యం, శివశక్తినిష్ఠం శివస్వభావవిశ్రాన్తం చ విశ్వం జానామి ఇతి ప్రత్యయస్య విలక్షణస్య భావాత్।

నిజమునకు చిత్-స్వాతన్త్ర్య-ఆనన్దములలో విశ్రాన్తమైన ప్రమాత ఒక్కటే. స్వరూపమాత్రవిశ్రాన్తమైన పృథివి ఏ విధముగా తెలియబడుతుందో అప్పుడది ఆ స్వరూపమై ఉంటుంది. 'చైత్రచక్షువులచే చైత్రవిదితమైనదానిని గ్రహిస్తున్నాను' అన్నట్లుగా. అప్పుడు సకల శక్తులతో చేయబడినది, సకల శక్తిమతులతో చేయబడినది అంటూ, స్వరూపము రెండు భేదములతో ప్రకాశిస్తుంది. ఈ విధముగా శివాన్తము వరకు చెప్పబడుతుంది. శివశక్తినిష్ఠమై, శివస్వభావవిశ్రాన్తమైన విశ్వమును నేను గ్రహిస్తున్నాను, అన్నట్లు ప్రత్యయముయొక్క విలక్షణభావమౌతుంది.

నను భావస్య చేత్ వేద్యతా స్వం వపుః తత్సర్వాన్ప్రతి వేద్యత్వం, వేద్యత్వమపి వేద్యమ్ ఇత్యనవస్థా, తథా చ జగతోఽన్ధసుప్తత్వం సుప్రకాశమేవ, తయా చ వేద్యత్వావేద్యత్వే విరుద్ధధర్మయోగ ఇతి దోషః ? అత్ర ఉచ్యతే - న తత్ స్వం వపుః స్వరూపస్య పృథగుక్తత్వాత్, కిం తర్హి తత్ ప్రమాతృశక్తౌ ప్రమాతరి చ యత్ విశ్రాన్తిభాజనం యత్ రూపం తత్ ఖలు తత్, తత్ స్వప్రకాశమేవ తత్ ప్రకాశతే న తు కించిదపి ప్రతి ఇతి సర్వజ్ఞత్వమ్ అనవస్థావిరుద్ధధర్మయోగశ్చ ఇతి దూరాపాస్తమ్।

భావములలో వేద్యత స్వయముగా ఉన్నపుడు, అన్నీ ఎందుకు తెలియబడవు? వేద్యత్వము కూడా వేద్యమౌతున్నది కదా అనిన సమస్య ఉదయిస్తున్నది. అప్పుడు జగత్తు యొక్క అంధసుప్తత్వము సుప్రకాశమౌతున్నది. దీనివలన వేద్యత్వ-అవేద్యత్వములలో విరుద్ధ ధర్మయోగ దోషమౌతున్నది కదా? దానికీ విధముగా చెప్పబడుచున్నది - వేద్యత్వము స్వయముగా పురుషుని స్వరూపము కానప్పటికీ అట్లా చెప్పబడుచున్నది. ఎలా అన్నపుడు, ప్రమాతృశక్తిలోను, ప్రమాతలలోను ఏదైతే విశ్రాన్తిభాజనమౌతున్నదో, అదే అవుతున్నది. దాని స్వప్రకాశమే దానిని వెలిగిస్తున్నది. కనుక సర్వజ్ఞమౌతున్నది. ఈ విధముగా అనవస్థయు విరుద్ధధర్మయోగమును దూరములౌతున్నవి.

అనన్తప్రమాతృసంవేద్యమపి ఏకమేవ తత్ తస్య రూపం తావతి తేషామేకాభాసరూపత్వాత్ ఇతి న

ప్రమాత్రన్తరసంవేదనానుమానవిఘ్నః కశ్చిత్, తచ్చ తస్య రూపం సత్యమ్ అర్థక్రియాకారిత్వాత్ తథైవ, పరదృశ్యమానాం కాన్తాం దృష్ట్వా తస్యై సమీర్ష్యతి, శివస్వభావం విశ్రాన్తికుమ్భం పశ్యన్ సమావిశతి సమస్తానన్తప్రమాతృవిశ్రాన్తం వస్తు పశ్యన్ పూర్ణీభవతి నర్తకీప్రేక్షణవత్, తస్యైవ నీలస్య తద్రూపం ప్రమాతరి యత్ విశ్రాన్తం తదైవ స్వప్రకాశస్య విమర్శస్యోదయాత్ - ఇతి పాఞ్చదశాత్మకత్వం పృథివ్యాః ప్రభృతి ప్రధానతత్త్వపర్యంతం । తావద్వ్యక్తరాగాది కంచుకస్య సకలస్య ప్రమాతృత్వాత్, సకలస్యాపి ఏవం పాంచదశ్యం తస్యాపి తావద్వేద్యత్వాత్ । వితత్య చైతత్ నిర్ణీతం తన్త్రాలోకే ।

అనన్తములైన ప్రమాతృలచేత సంవేద్యమైనప్పటికీ, అది ఒక్కటే. ప్రమాత్రలచే కలుగునట్టి సంవేదనవలన దానికి విఘ్నము లేదు. దానిరూపము సత్యమే. ఏమనగా, లౌకికములైన పనులలో అది ఉపయోగపడుతున్నందువలన కూడా, ఇది నిజమని తేలుతున్నది. పరులచే ఒక వనిత చూడబడినపుడు, మరొక్క వనితలో ఈర్ష్య జనిస్తుంది, ఆ విధంగా. శివస్వభావమునందు విశ్రాన్తిని పొందినప్పుడు సమావేశముద్భవిస్తుంది. సమస్తములైన అనన్తప్రమాతృవిశ్రాన్తములైన వస్తువును చూచినప్పుడు పూర్ణమౌతుంది. నర్తకి యొక్క నర్తనను చూచినట్లుగా. లేదా, నీలము దానిరూపమైన ప్రమాతలో విశ్రాన్తమైనప్పుడు లాగా. స్వప్రకాశముతో విమర్శ యొక్క ఉదయమౌతున్నది. ఈ విధముగా పదిహేనింటిని గ్రహించాలి. రాగము మొదలైన కంచుకములు తలలెత్తినందున, ఈ పదిహేను విభాగములూ తమలో ఉన్నందున, సకలలు కూడా ప్రమేయములౌతున్నవి. విస్తారముగా తంత్రాలోకమున చెప్పబడినది.

పుంసః ప్రభృతి కలాతత్త్వాన్తం త్రయోదశధా - సకలస్య తత్ర ప్రమాతృతాయోగేన తచ్ఛక్తిశక్తిమదాత్మనో భేదద్వయస్య ప్రత్యస్తమయాత్, తథా చ సకలస్య స్వరూపత్వమేవ కేవలం, ప్రలయాకలస్య స్వరూపత్వే పఞ్చానాం ప్రమాతృత్వే ఏకాదశ భేదాః । విజ్ఞానాకలస్య స్వరూపత్వే చతుర్ణాం ప్రమాతృత్వే నవ భేదాః । మన్త్రస్య స్వరూపత్వే త్రయాణాం ప్రమాతృత్వే సప్త । మన్త్రేశస్య స్వరూపత్వే ద్వయోః ప్రమాతృత్వే పఞ్చ । మన్త్రమహేశస్య స్వరూపత్వే భగవత ఏకస్యైవ ప్రమాతృత్వే శక్తిశక్తిమద్భేదాత్ త్రయః । శివస్య తు ప్రకాశైకచిత్స్వాతన్త్ర్యనిర్భరస్య న కోఽపి భేదః పరిపూర్ణత్వాత్ ।

పురుషుని నుండి కలాతత్త్వాన్తము వరకూ పదమూడు తత్త్వములు. సకలులలో ప్రమాతృతా అయోగము వలన శక్తి-శక్తిమంతుల భేదద్వయము ప్రత్యస్తమౌతుంది. అక్కడ సకలులది కేవల స్వరూపమే. ప్రలయాకలయొక్క స్వరూపముతో, అయిదు ప్రమాతృ భేదములతో పదకొండవుతాయి. విజ్ఞానాకలయొక్క స్వరూపముతో, నాలుగు ప్రమాతలతో తొమ్మిది భేదములౌతాయి. మన్త్రస్వరూపముతో, మూడు ప్రమాతలతో ఏడౌతాయి. మన్త్రేశస్వరూపముతో, రెండు ప్రమాతలతో ఐదౌతాయి. మన్త్రమహేశస్వరూపముతో, ఏక భగవత్ ప్రమాతతో, శక్తి-శక్తిమంతుల భేదముతో మూడవుతాయి. ప్రకాశ - ఏకచిత్- స్వాతన్త్ర్య నిర్భరత్వమువలన, పరిపూర్ణుడవటం వలన, శివునిలో ఏ విధమైన భేదమూ లేదు.

ఏవమ్ అయం తత్త్వభేద ఏవ పరమేశ్వరానుత్తరనయైకాఖ్యే నిరూపితః భువనభేదవైచిత్ర్యం కరోతి, నరక స్వర్గ రుద్రభువనానాం పార్థివత్వే సమానేఽపి దూరతరస్య స్వభావభేదస్య ఉక్తత్వాత్ । అత్ర చ పరస్పరం భేదకలనయా అవాన్తరభేదజ్ఞానకుతూహలీ తన్త్రాలోకమేవ అధారయేత్ ।

ఈ విధముగా తత్త్వభేదములేవైతే పరమేశ్వరానుత్తరనయమనే గ్రంథములో నిరూపితమైనవో, అవియే

భువనభేదవైచిత్ర్యమును కలిగిస్తున్నవి. నరక, స్వర్గ, రుద్ర భువనములన్నీ పార్థివత్వములో సమానములైనప్పటికీ దూరదూరములుగా ఉండటమే వాటి స్వభావభేదమని చెప్పబడుచున్నది. అక్కడ పరస్పరభేదముల వలన ఎంత అవాన్తరమేర్పడుతున్నదో తెలిసికొనగోరినచో తన్త్రాలోకమును అవలోకించాలి.

ఏవమ్ ఏకైకఘటాద్యనుసారేణాపి పృథివ్యాదీనాం తత్త్వానాం భేదో నిరూపితః | అధునా సమస్తం పృథివీతత్త్వం ప్రమాతృప్రమేయరూపమ్ ఉద్దిశ్య నిరూప్యతే - యో ధరాతత్త్వాభేదేన ప్రకాశః స శివః | యథా శ్రుతిః 'పృథివ్యేవేదం బ్రహ్మ' ఇతి | ధరాతత్త్వసిద్ధిప్రదాన్ ప్రేరయతి స ధరామన్త్రమహేశ్వరః, ప్రేర్యో ధరామన్త్రేశః, తస్యైవాభిమానికవిగ్రహాత్మకో వాచకో మన్త్రః, సాంఖ్యాది పాశవవిద్యోత్తీర్ణ శివవిద్యాక్రమేణ అభ్యస్తపార్థివయోగోऽప్రాప్తధ్రువపదః ధరావిజ్ఞానాకలః | పాశవవిద్యా క్రమేణ అభ్యస్తపార్థివయోగః కల్పాన్తే మరణే వా ధరాప్రలయకేవలః | సౌషుప్తే హి తత్త్వావేశవశాదేవ చిత్రస్య స్వప్నస్య ఉదయః స్యాత్ గృహీతధరాభిమానస్తు ధరాసకలః | అత్రాపి శక్త్యుద్రేకన్యగ్భావాభ్యాం చతుర్దశత్వమ్ ఇతి ప్రమాతృతాపన్నస్య ధరాతత్త్వస్య భేదాః, స్వరూపం తు శుద్ధం ప్రమేయమ్ ఇతి, ఏవమ్ అపరత్రాపి |

ఒక్కొక్క ఘటమును అనుసరించినప్పటికీ పృథివ్యాది తత్త్వములలో భేదము నిరూపితమౌతున్నది. సమస్త పృథివీతత్త్వము ప్రమాతృప్రమేయరూపమని చెప్పబడినది. ఏదైతే ధరాతత్త్వముతో అభేదమై ప్రకాశిస్తున్నదో అదే శివుడు. 'పృథివ్యేవేదం బ్రహ్మ' యని వేదము చెప్పుచున్నది. ధరాతత్త్వసిద్ధిప్రదులను ప్రేరేపించునది ధరామన్త్రమహేశ్వరుడు, ప్రేరితము ధరామన్త్రేశుడు, దాని అహంకారస్వరూపము మన్త్రము. సాంఖ్యాది పశువిద్యోత్తీర్ణుడై శివవిద్యాక్రమముతో అభ్యస్తమైన పార్థివయోగముద్వారా అప్రాప్తమగు ధ్రువపదము ధరావిజ్ఞానాకలము. పశువిద్యలద్వారా అభ్యస్తమైన పార్థివయోగము కల్పాన్తములోగాని మరణములోగాని ధరాప్రలయ కేవలమౌతుంది. సుషుప్తిలో తత్త్వావేశముల వలన చిత్రములైన స్వప్నములేవైతే ఉదయిస్తున్నవో వాటిని గ్రహించే ధరాభిమానము ధరాసకలము. దానిలోకూడా శక్త్యుద్రేక న్యగ్భావము వలన చతుర్దశత్వము కలుగుచున్నది. ఈ విధముగా ప్రమాతృతలో ధరాతత్త్వముల భేదములుంటాయి. వాటి స్వరూపం మాత్రం శుద్ధమైన ప్రమేయమే. దీనిని ఇతరత్రా కూడా గ్రహించాలి.

అథ ఏకస్మిన్ ప్రమాతరి ప్రాణప్రతిష్ఠితతయా భేదనిరూపణమ్ - ఇహనీలం గృహ్ణతః ప్రాణః తుటి షోడశకాత్మా వేద్యావేశపర్యన్తమ్ ఉదేతి, తత్ర ఆద్యా తుటిరవిభాగైకరూపా, ద్వితీయా గ్రాహకోల్లాసరూపా, అన్త్యా తు గ్రాహ్యాభిన్నా తన్మయీ, ఉపాన్త్యా తు స్ఫుటీభూత గ్రాహకరూప, మధ్యే తు యత్ తుటిద్వాదశకం తన్మధ్యాత్ ఆద్యం షట్కం నిర్వికల్పస్వభావం వికల్పాచ్ఛాదకం, షట్త్వం చ అస్య స్వరూపేణ ఏకా తుటిః, ఆచ్ఛాదనీయే చ వికల్పే పఞ్చరూపత్వమ్, ఉన్మిమిషా ఉన్మిషత్తా, సా చ ఇయం స్ఫుటక్రియారూపత్వాత్ తుటిద్వయాత్మికా - స్పన్దనస్య ఏకక్షణరూపత్వాభావాత్, ఉన్మిషితతా స్వకార్యకర్తృత్వం చ ఇత్యేవమాచ్ఛాదనీయ వికల్పపాఞ్చవిధ్యాత్ స్వరూపాచ్చ షట్ క్షణా నిర్వికల్పకాః, తతోऽపి నిర్వికల్పస్య ధ్వంసమానతా, ధ్వంసో వికల్పస్య, ఉన్మిమిషా ఉన్మిషత్తా తుటిద్వయాత్మికా ఉన్మిషితతా చ ఇతి షట్ తుటయః | స్వకార్యకర్తృతా తు గ్రాహకరూపతా ఇతి ఉక్తం న సా భూయో గణ్యతే, ఇత్యేవం వివేకధనా గురూపదేశానుశీలినః సర్వత్ర షాడ్గుణ్యం ప్రవిభాగేన వివిఞ్చతే |

ఇప్పుడు, ఒక్కటే అయినట్టి ప్రమాతలో ప్రాణప్రతిష్ఠిత వలన కలిగే భేదనిరూపణము. నీలమును గ్రహించే సమయంలో ప్రాణము షోడశతుటుల రూపమును ధరించి వేద్యమువరకు ఉదయిస్తుంది. వీటిలో మొదటి తుటి

విభాగములేనిది. రెండవది గ్రాహకోల్లాసరూపము, చివరిది గ్రాహ్యముతో అభిన్నమైనది, తన్మయి. ఉపాన్త్యము స్ఫుటీభూతగ్రాహకరూపము. మధ్యలో నున్న పన్నెండులో, మొదటిది ఆరు నిర్వికల్పస్వభావములు, వికల్పాచ్ఛాదకములు, వీనిలో ఒకటి స్వరూపము. మిగిలిన అయిదును, వికల్పమును ఆచ్ఛాదించుచూ, అయిదురూపములను ధరిస్తున్నాయి. స్పందనకు ఏకక్షణరూపత్వము ఉండదు గనుక, ఉన్మిమిషా ఉన్మిషత్తా ఈ విధముగా స్ఫుటక్రియారూపములతో రెండు తుటులౌతున్నాయి. ఉన్మిషితత, స్వకార్యకర్తృత్వము మొదలుగాగల అయిదు వికల్పముల వలన, మరియు తన స్వరూపము వలన, ఆరుక్షణముల రూపమై నిర్వికల్పకమౌతున్నది. ఆ తరువాత నిర్వికల్పము యొక్క ధ్వంసస్వభావము, వికల్పము యొక్క ధ్వంసము, ఉన్మిమిష, ఉన్మిషత్త, తుటిద్వయాత్మకమైన ఉన్మిషితత, ఇవన్నీ కలిపి ఆరు తుటులు. గ్రాహకరూపమైన స్వకార్యకర్తృత్వము గణింపబడదు. ఈ విధముగా వివేకధనియైనవాడు, గురూపదేశానుశీలుడు, ప్రతిచోటను పదిహేను విభాగములను వివేచనగావిస్తాడు.

వికల్పన్యూనత్వే తు తుటిన్యూనతా సుఖాదిసంవిత్తావివ యావత్ అవికల్పతైవ / లోకాస్తు వికల్పవిశ్రాన్త్యా తామ్ అహన్తామయీామ్ అహన్తాచ్ఛాదితేదంభావ వికల్పప్రసరాం నిర్వికల్పాం విమర్శభువమ్ అప్రకాశితామివ మన్యన్తే - దుఃఖావస్థాం సుఖవిశ్రాన్తా ఇతి, వికల్పనిర్హ్రాసేన తు సా ప్రకాశత ఏవ ఇతి ఇయమ్ అసౌ సంబన్ధే గ్రాహ్యగ్రాహకయోః సావధానతా ఇతి అభినవగుప్తగురవః /

వికల్పన్యూనత్వమే తుటిన్యూనత. సుఖమును అనుభవించే సమయంలోవలె వికల్పము లేకపోవడం అవికల్పమౌతుంది. లోకులు వికల్పవిశ్రాంతిని అహన్తామయముగాను, నిర్వికల్పముగాను తలచుచూ, అహన్తాచ్ఛాదిత ఇదంభావ వికల్పప్రసరమును, అప్రకాశితమని తలచుదురు, సుఖవిశ్రాంతియే దుఃఖావస్థ యన్నట్లుగా. వికల్పహ్రాసము వలన అది ప్రకాశిస్తుంది, ఈ విధముగా గ్రాహ్యగ్రాహక సంబంధమును విచారించవలెనని అభినవగుప్త గురువులనినారు.

ఏవం చ పాఞ్చదశ్యే స్థితే యావత్ స్ఫుటేదన్తాత్మనో భేదస్య న్యూనతా తావత్ ద్వయం ద్వయం హ్రాసతి యావత్ ద్విత్రుటికః శివావేశః, తత్ర ఆద్యా తుటిః సర్వతః పూర్ణా, ద్వితీయా సర్వజ్ఞానకరణావిష్టాభ్యస్యమానా సర్వజ్ఞత్వసర్వకర్తృత్వాయ కల్పతే న తు ఆద్యా / యదాహ శ్రీకల్లటః 'తుటిపాత ఇతి' అత్ర పాతశబ్దం సైవ భగవతీ శ్రీమత్కాలీ మాతృసద్భావో భైరవః ప్రతిభా ఇత్యలం రహస్యారహస్యనేన / ఏవం మన్త్రమహేశతుటేః ప్రభృతి తత్తదభ్యాసాత్ తత్తత్సిద్ధిః /

ఈ పంచదశ స్థితులు, స్ఫుటమైన ఇదంతాత్మకమై యున్నవి, రెండురెండుగా తగ్గుతూ రాగా, చివరి రెండు తుటికలు శివావేశమును యోగికి కలిగిస్తున్నవి. ఈ రెండు తుటులలో, మొదటిది, ఎల్లప్పుడూ పూర్ణముగా ఉంటున్నది. రెండవది, సర్వజ్ఞానము, సర్వకరణ స్వరూపముగా ధ్యానింపబడి, సర్వజ్ఞత్వమును, సర్వకర్తృత్వమును పొందుచున్నది. కానీ మొదటి తుటి ఇటువంటిది కాదు. కనుక శ్రీ కల్లటాచార్యులు దీనిని తుటిపాతమన్నారు. దానిద్వారా, 'పాత' శబ్దముతో, భగవతియైన శ్రీమత్ కాళికాదేవిని, మాతృసద్భావము, భైరవము, ప్రతిభ లనే మూడుగా గ్రహించమనిరి. ఈ రహస్యమును వివరించి చెప్పడం ప్రస్తుతం వీలుకాదు. ఈ విధముగా మన్త్రమహేశతుటి నుండి మిగతా తుటుల వరకు ఆయా అభ్యాసములవలన ఆయా సిద్ధులు కలుగుతాయి.

అథాత్రైవ జాగ్రదాద్యవస్థా నిరూప్యన్తే, - తత్ర వేద్యస్య తద్విషయాయాశ్చ సంవిదో యత్ వైచిత్ర్యమ్ అన్యోన్యాపేక్షం సత్ సా అవస్థా, న వేద్యస్య కేవలస్య న చాపి కేవలాయాః సంవిదో న చాపి పృథక్ పృథక్ ద్వే / తత్ర యదాధిష్ఠేయతయా బహీరూపతయా భానం తదా జాగ్రదవస్థా మేయే మాతరి మానే చ / యదా తు తత్రైవ అధిష్ఠానరూపతయా భానం సంకల్పః తదా స్వప్నావస్థా / యదా తు తస్మిన్నేవ తద్ద్వారేణ త్రైవ బీజాత్మతయైవ భానం తదా సుషుప్తావస్థా / ఇమా ఏవ తిస్రః ప్రమేయప్రమాణప్రమాత్రవస్థాః ప్రత్యేకం జాగ్రదాదిభేదాత్ చతుర్విధా ఉక్తాః /

ఇప్పుడు జాగ్రదాద్యవస్థల నిరూపణము. వేద్యము యొక్కయు, విషయములయొక్కయు, ఏ వైచిత్రి అయితే సంవిత్ లో కలుగుచున్నదో, వాని అన్యోన్యాపేక్షతయే అవస్థ. అది కేవలము వేద్యమూ కాదు, కేవలము సంవిత్తూ కాదు. రెండునూ కాదు. అధిష్ఠేయమై బాహ్యరూపమై ఉన్నభావమే జాగ్రదవస్థ. అది మేయము, మాత, మానము అవుతున్నది. అధిష్ఠానరూపమై, సంకల్పముగా ప్రకాశించడమే స్వప్నావస్థ. అధిష్ఠాతృరూపంలో, బీజాత్మతగా భాసించేది సుషుప్తావస్థ. ఈ మూడును ప్రమేయ, ప్రమాణ, ప్రమాత్రావస్థలుగా, జాగ్రదాదిభేదములతో చతుర్విధములని చెప్పబడుచున్నవి.

యదా తు తస్మిన్నేవ ప్రమాతృవిశ్రాన్తిగతే ప్రమాతుః పూర్ణతౌన్ముఖ్యాత్ తద్వారేణ పూర్ణతోన్ముఖతయా భానం తదా తుర్యావస్థా, సా చ రూపం దృశామిత్యేవం-విధమ్ అంశత్రయమ్ ఉత్తీర్య పశ్యామీతి అనుపాయికా ప్రమాతృతా స్వాతన్త్ర్యసారా, నైకట్యమధ్యత్వదూరత్వైః ప్రమాతృప్రమాణప్రమేయతాభిషేకం దదతీ తదవస్థాత్రయానుగ్రాహకత్వాత్ త్రిభేదా / ఏతదేవ అవస్థాచతుష్టయం పిణ్డస్థపదస్థరూపస్థరూపాతీతశబ్దైర్యోగినో వ్యవహరన్తి, ప్రసంఖ్యానధనాస్తు సర్వతోభద్రం వ్యాప్తిః మహావ్యాప్తిః ప్రచయ ఇతి శబ్దైః / అన్వర్థం చాత్ర దర్శితం తన్త్రాలోకే శ్లోకవార్తికే చ /

వానిలో, ప్రమాతృవిశ్రాన్తిగతమైన ప్రమాత, పూర్ణతగా ఉన్ముఖమైనప్పుడు, దానిద్వారా పూర్ణతోన్ముఖతయైన భావమే తుర్యావస్థ. రూపమును ఈ విధముగా అంశత్రయమును దాటి, అనుపాయముగా చూచుచున్నాననేది స్వాతంత్ర్యసారమైన ప్రమాతృత. ఇది, దగ్గర, మధ్య, దూరముల ద్వారా ప్రమాతృ-ప్రమాణ-ప్రమేయతాభిషేకమును కలిగించేదిగా, ఆయా అవస్థలను అనుగ్రహించేదిగా, మూడు భేదములతో కూడి యున్నది. ఈ అవస్థాచతుష్టయమునే పిణ్డస్థ, పదస్థ, రూపస్థ, రూపాతీతశబ్దములతో యోగులు వ్యవహరిస్తారు. ప్రసంఖ్యాన ధనులు వీటిని సర్వతోభద్రము, వ్యాప్తి, మహావ్యాప్తి, ప్రచయము అనే శబ్దములతో పిలుస్తారు. వీని అర్థములను తన్త్రాలోకములోను, శ్లోకవార్తికములోను చూడవలెను.

యచ్చ సర్వాన్తర్భూతం పూర్ణరూపం తత్ తుర్యాతీతం సర్వాతీతం మహాప్రచయం చ నిరూపయన్తి / కిం చ యస్య యద్యదా రూపం స్ఫుటం స్థిరమ్ అనుబన్ధి తత్ జాగ్రత్, తస్యైవ తద్విపర్యయః స్వప్నః, యః లయాకలస్య భోగః సర్వావేదనం సుషుప్తం, యో విజ్ఞానాకలస్య భోగః భోగ్యాభిన్నీకరణం తుర్యం మన్త్రాదీనాం స భోగః, భావానాం శివాభేదస్తుర్యాతీతం సర్వాతీతమ్, తత్ర స్వరూపసకలౌ ౧ ప్రలయాకలః ౨ విజ్ఞానాకలః ౩ మన్త్రతదీశతన్మహేశవర్గః ౪ శివః ౫ ఇతి పఞ్చదశభేదే పఞ్చ అవస్థాః /

ఏదైతే సర్వాన్తర్భూతమై పూర్ణరూపమై తుర్యాతీతమై సర్వాతీతమై ఉన్నదో దానిని మహాప్రచయమని అనుచున్నారు. దేని రూపమైతే స్ఫుటము, స్థిరము, అనుబంధము అగుచున్నదో అది జాగ్రత్తు, దాని విపర్యయము స్వప్నము. ప్రలయాకలుల యొక్క భోగమై, సర్వావేదనమైనది సుషుప్తి. ఏదైతే విజ్ఞానాకల

యొక్క భోగమో, భోగ్యముతో అభిన్నమో అది తుర్యము, అదియే మన్త్రాదుల భోగము. భావములతో శివాభేదమన్నది తుర్యాతీతము, సర్వాతీతము. దానిలో 1. స్వరూప సకలులు, 2. ప్రలయాకలులు, 3. విజ్ఞానాకలులు, 4. మన్త్ర, మంత్రేశ, మంత్రమహేశవర్గము, 5. శివము - ఈ విధముగా పదిహేను భేదములతో, అయిదు అవస్థలున్నవి.

స్వరూపం ప్రలయాకల ఇత్యాదిక్రమేణ త్రయోదశభేదే, స్వరూపం విజ్ఞానకలశక్తిః విజ్ఞానాకల ఇత్యేకాదశభేదే, స్వరూపం మన్త్రాః తదీశాః మహేశాః శివః ఇతి నవభేదే, స్వరూపం మన్త్రేశాః మహేశః శక్తి శివ ఇతి సప్తభేదే, స్వరూపం మహేశశక్తిః మహేశః శక్తిః శివ ఇతి పఞ్చభేదే, స్వరూపం క్రియాశక్తిః జ్ఞానశక్తిః ఇచ్ఛాశక్తిః శివ ఇతి త్రిభేదే, అభిన్నేఽపి శివతత్త్వే క్రియాజ్ఞానేచ్ఛానన్దచిద్రూపకో౽ప్త్వా ప్రసంఖ్యానయోగధనాః పఞ్చపదత్వమ్ ఆహుః ||

స్వరూపము, ప్రలయాకల మొదలగు భేదములతో పదమూడుగా ఉన్నవి. స్వరూపము, విజ్ఞానాకలశక్తి, విజ్ఞానాకల మొదలగు భేదములతో పదకొండుగా ఉన్నవి. స్వరూపము, మన్త్ర, మంత్రేశ, మహేశ, శివా, శివులుగా తొమ్మిది. స్వరూపము, మన్త్రేశ, మహేశ, శక్తి, శివులుగా ఏడు. స్వరూపము, మహేశశక్తి, మహేశ, శక్తి, శివులుగా అయిదు. స్వరూపము, క్రియాశక్తి, జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి, శివుడు ఇవి మూడు భేదములు. శివతత్త్వము అభిన్నమైనప్పటికీ క్రియా-జ్ఞాన- ఇచ్ఛా- ఆనన్ద- చిద్రూపములుగా జ్ఞానులు యోగులు అయిదు భేదములను చెప్పుచున్నారు.

శ్లో|| భూమ్యాదౌ తత్త్వజాలే న హి భవతి వపుస్తాదృశం యత్ప్రమాతుః
సంవిద్విశ్రాన్తివన్ధ్యం స్ఫురతి స బహుధా మాతృభావోఽస్య యస్మాత్ |
తేనాస్మిన్వేద్యజాలే క్రమగతకలానాం నిర్వికల్పామహన్తా-
స్వాతన్త్ర్యామర్శసారాం భువమధివసత ప్రాప్నుత స్వాత్మసత్తామ్ ||

భూమ్యాది తత్త్వజాలములలో పురుషుడు లేడు, కానీ సంవిత్ లో విశ్రాంతిని విడచి ప్రమాతృభావముతో బహుధా దృశ్యమౌతాడు. ఈ వేద్యజాలములో క్రమగత కళలుగా ఉన్న నిర్వికల్పకమైన అహంత, స్వాతంత్ర్యసారమై, భువమునధివసించి ఉన్నది. దీనిని పొందినవాడు స్వాత్మ తత్త్వమును అందుకొనుచున్నాడు.

వ్యాఖ్యానము

త్రికశాస్త్రమును షడర్ధశాస్త్రమనే పేరుతో కూడా పిలుస్తారు. అంటే, ఆరులో సగమని అర్థం. ఇది, ఏడు విధములుగా పరమేశ్వరునిచేత బోధింపబడినది. శివుడు, మన్త్రమహేశ్వరులు, మన్త్రేశ్వరులు, మన్త్రములు, విజ్ఞానాకలులు, ప్రలయాకలులు, సకలులు - అనబడే ఈ ఏడు స్థాయిలలో ఇది గ్రహించి, ధ్యానింపబడుతుంది. ఈ ఏడుగురూ శక్తిమంతులు. అనగా, శక్తిని ధరించువారు. వీరిలో ఒక్కొక్కరికీ, ఒక్కొక్కరు చొప్పున, ఏడుగురు శక్తులుంటారు. వీరి పరస్పరములైన భేదములచేత, భూమి నుండి, ప్రధానమనబడే శక్తితత్త్వము వరకూ, శక్తిమంతుడు, శక్తియనే విధంగా, పదునాలుగు రకములైన భేదములు కలుగుతున్నాయి. ఆ తత్త్వము యొక్క స్వరూపముతో కలిపి మొత్తము పదిహేను రూపములౌతాయి. దీనినే

'పంచదశ విధి' యంటారు.

ఇది ఏ విధముగా ఉంటుందో వివరిస్తాను.

శివుని నుండి, సకలుల వరకూ, సృష్టిలో ఏడు స్థాయిున్నాయి. అన్నింటికంటే పైన శివులున్నారు. అన్నింటికంటే క్రింద సకలులున్నారు. మధ్యలో, మంత్రమహేశ్వర, మంత్రేశ్వర, మంత్ర, విజ్ఞానాకల, ప్రళయాకలలనబడే అయిదు స్థాయిలున్నాయి. అన్నిటికంటే క్రిందనున్న సకలుల స్థాయిని తీసుకుంటే, భూమినుండి ప్రకృతివరకూ ఉన్న 24 తత్త్వములను వారు మాత్రమే అనుభూతి చెందగలుగుతారు. వారికా సామర్థ్యం మాత్రమే ఉంటుంది. దానిపైనున్న ప్రలయాకలుల స్థాయిలోని వారు, పురుషుని నుండి, మాయ వరకూ ఉన్న తత్త్వములను మాత్రమే అనుభూతి చెందగలుగుతారు. ఆ సామర్థ్యం వారికి మాత్రమే ఉంటుంది. విజ్ఞానాకల స్థాయిలోని వారు, మాయపైనున్న స్థితిని అనుభూతి చెందగలరు. తరువాతవైన, శుద్ధ్యవిద్య (మంత్ర) స్థాయిలోని వారు, తమ పైనున్న మూడు స్థాయిలను అనుభూతి చెందగలరు. అదే విధముగా, ఈశ్వర (మంత్రేశ్వర), సదాశివ (మంత్ర మహేశ్వర) స్థాయిలలోని వారు, తమకంటే పైస్థాయిలైన రెండు, ఒకటి స్థాయిలను మాత్రమే అనుభూతి చెందగలరు. శివుని స్థాయిలో ఏ విధమైన విభజనా లేదు. ఈ విధంగా ఒక్కొక్కస్థాయిలోనూ, స్వరూపముతో కలిపి, 15 గా ఈ లెక్క ఉంటుంది. అంటే, ఈ ఏడు స్థాయిలను ఇప్పటి సైన్స్ చెబుతున్నట్టి, సెవన్ డైమెన్షన్స్ అనుకోవచ్చు. ఏ డైమెన్షన్ లో ఉన్న వారికి, ఆ డైమెన్షన్ ఒక్కటే మొదటిమెట్టు అవుతుంది. అక్కడనుండి పైకి, వారు ప్రయాణించవలసి ఉంటుంది. వారికంటే క్రింది స్థాయిలకు వారు దిగరు.

వీనిలో ప్రమేయతాయోగ్యమైన స్వరూపము స్వాత్మనిష్ఠమై ఉంటుంది. అంటే, అది జ్ఞానమూ కాదు, జ్ఞాతాకాదు, కనుక తనకు తాను స్వతంత్రముగా, జ్ఞేయముగా ఉంటుంది. సులభముగా చెప్పవలెనంటే, భౌతికమైన వస్తు ప్రపంచమేదైతే ఉన్నదో, అది జగత్తు యొక్క స్వరూపము. జ్ఞేయమని, ప్రమేయమని దానిని వ్యవహరిస్తాము. జ్ఞాత (ప్రమాత) దానిని గ్రహించడమన్నది, అపరాశక్తి అనుగ్రహము వల్ల జరుగుతుంది. ఇది ఆణవము. రెండవదిగా, ప్రమాతలలో శక్తులు కొద్దిసేపు విజృంభిస్తూ, కొద్దిసేపు విశ్రాంతిని తీసుకుంటూ ఉండే స్వరూపమేదైతే ఉన్నదో, అది శక్తి అనబడుతుంది. ఇది పరాపరశక్తి అనుగ్రహము వల్ల జరుగుతుంది. దీనిని శాక్తమని అంటారు. ఈ శక్తులు కూడా ముందుగా చెప్పినట్లుగా, సకల నుండి శివుని వరకూ, ఏడువిధములుగా ఉంటాయి. పై రెంటికీ విరుద్ధముగా, శక్తిమంతుడు ముఖ్యత్వమును సంతరించుకుని, ప్రమేయములను, శక్తులను తనలోకి గ్రహించుచున్నపుడు, అది శివరూపమౌతుంది. అది తెలియబడటం పరాశక్తి అనుగ్రహముతో జరుగుతుంది. దీనిని శాంభవమని అంటారు. శివునినుండి, సకలవరకు ఉన్న తత్త్వములన్నీ ఈ విధముగా, ఏడు విధములే.

శక్తులలోని ఏడు విధములైన భేదముల వల్లనే, ప్రమాతృలలో కూడా ఏడు భేదములు కలుగుతున్నాయి. వీటిని చక్కగా వివరించడం కోసం, 'సకల, ప్రళయాకల, విజ్ఞానాకల' మొదలైన క్రమములో విభజించి చెప్పబడింది. సకలులకు విద్య మరియు కళలు శక్తులుగా ఉంటాయి. వాటియొక్క విశేషములైన రూపములే జ్ఞానశక్తి మరియు క్రియాశక్తులు. ప్రళయాకలులలో చూచినప్పుడు, జ్ఞాన-క్రియాశక్తులు నిర్విషయములై స్ఫుటత్వము లేకుండా ఉన్నాయి. విజ్ఞానాకలులలో చూచేసరికి, ఇవి బాగా క్షీణించిన స్థితిలో, కేవలము

సంస్కారరూపములై ఉంటాయి. మన్త్రములలో అయితే, నిద్రలేచుచున్న స్థితిలో మాత్రమే, శుద్ధవిద్య ఉన్నది. మన్త్రేశుల స్థాయిలో - ఆ సంస్కారములు కూడా లేకపోవడం వలన, పూర్తిగా నిద్రలేచిన స్థితిలో శుద్ధవిద్య ఉన్నది. మన్త్రమహేశ్వరులలో చూచినప్పుడు, ఇదే శుద్ధవిద్య, ఇచ్ఛాశక్తిరూపమును ధరించి, పరమ స్వాతంత్ర్యరూపంలో బాగా మేల్కొనిన స్థితిలో ఉన్నది. శివులలో అయితే, ఇదే శక్తి, ఇచ్ఛాత్మికగా మారి, బాగా స్ఫుటమైన స్వాతంత్ర్యరూపంగా ఉన్నది. ఈ ఏడు ముఖ్యములైన విధములుగా శక్తి ఉంటున్నది. ఈ క్రింది పట్టిక ద్వారా సులభముగా అర్థమౌతుంది.

సంఖ్య	ఏడు స్థాయిలు	శక్తులు
1	సకల ఆత్మలు	విద్య, కళలు (జ్ఞాన, క్రియాశక్తులు)
2	ప్రళయాకల ఆత్మలు	విద్యా, కళలు నిర్విషయములై, స్పష్టత లేకుండా ఉంటాయి
3	విజ్ఞానాకల ఆత్మలు	విద్యాకళలు సంస్కారరూపములుగా ఉంటాయి
4	మంత్ర ఆత్మలు	శుద్ధవిద్య నిద్రలేస్తూ ఉంటుంది
5	మంత్రేశ ఆత్మలు	శుద్ధవిద్య పూర్తిగా మేల్కొని ఉంటుంది
6	మంత్రమహేశ్వర ఆత్మలు	శుద్ధవిద్య ఇచ్ఛాశక్తిగా మారింది
7	శివాత్మలు	ఇచ్ఛాశక్తి పరమస్వాతంత్ర్య శక్తిగా ఉన్నది

శక్తులతో కలసినందువలన, శక్తిమంతులలో (ప్రమాతలలో) ఆయా శక్తిలక్షణములు ద్యోతకములై, నానావిధములైన భేదములు కలుగుతున్నాయి. ఉపకరణములు మారినందువలన, కర్తలో కూడా భేదములు కలుగుతాయి. ఇంతకూ కరణమంటే ఏమిటి? ఒక పనిని చేయడంలో, కర్తకు అనువుగా ఉన్నట్టి శక్తియే కరణముగాని వేరేది కాదు. అట్లా కాదన్నపుడు, క్రియతో సంబంధము లేని అసంఖ్యాకములైన శక్తులున్నట్లు ఒప్పుకొనవలసి వస్తుంది. దీనిని అనవస్థా దోషమంటారు. అసలుగా చూస్తే, చిత్-స్వాతంత్ర్య-ఆనందములలో విశ్రాంతిగా ఉన్న ప్రమాత ఒక్కడే. ఇంతమంది ప్రమాతృలు లేరు. తన స్వరూపములో తానున్న భూమి, ఏ విధముగా మనకు తెలియబడుతుందో, అప్పుడది ఆ స్వరూపములోనే ఉంటుంది కదా ! 'చైత్ర అనే యువతి తన కన్నులతో చూచి, గ్రహించినరీతిలో నేను కూడా గ్రహిస్తున్నాను' అన్నట్లుగా ఇది ఉంటుంది. అప్పుడు, సకల శక్తులతో చేయబడినది, సకల శక్తిమతులతో చేయబడినది అంటూ, స్వరూపము రెండు భేదములతో ప్రకాశిస్తుంది. ఈ విధముగా, భూమినుండి శివుని వరకూ, ఇదేవిధంగా ఉంటుంది. "శివశక్తులలో స్థిరమై ఉండి, శివస్వభావములో విశ్రాంతిగా ఉన్న విశ్వమును నేను గ్రహిస్తున్నాను", అన్నట్లుగా అవుతుంది.

ఇప్పుడొక సమస్య తలెత్తుతున్నది. భావములో తెలియబడే తత్త్వమున్నపుడు, అందరికీ అది ఎందుకు తెలియబడటం లేదు? అదీగాక, వేద్యత్వము కూడా మరలా ఇంకొకదానికి వేద్యమౌతున్నది కదా అనిన సమస్య ఉదయిస్తున్నది. కనుక, మరలా అది అనవస్థా దోషమౌతున్నది. అప్పుడు జగత్తు యొక్క చీకటిలో ఉన్న స్థితియే, వెలుగౌతున్నది. దీనివలన, తెలియబడటము (జ్ఞానము), తెలియబడకపోవడము (అజ్ఞానము)లు ఒకే చోట ఉన్నట్లుగా అయి, అది అసంబద్ధమని తెలుస్తున్నది కదా? దీనికి సమన్వయమెలా? అన్నపుడు,

వేద్యత్వము స్వయముగా పురుషుని స్వరూపము కానప్పటికీ అట్లా చెప్పబడుచున్నది. ఎలా అన్నపుడు, ప్రమాతృ శక్తిలోను, ప్రమాతలలోను ఏదైతే విశ్రాన్తి భాజనమౌతున్నదో, అదే దాని స్వరూపమౌతున్నది. దాని స్వప్రకాశమే దానిని వెలిగిస్తున్నది. కనుక అది సర్వజ్ఞమౌతున్నది. ఈ విధముగా అనవస్థయు విరుద్ధధర్మయోగమును దూరములౌతున్నవి. అనన్తములైన ప్రమాతృలచేత సంవేద్యమైనప్పటికీ, అది ఒక్కటే. ప్రమాత్రలచే కలుగునట్టి సంవేదనవలన దానికి విఘ్నము లేదు. దానిరూపము సత్యమే. ఏమనగా, లౌకికములైన పనులలో అది ఉపయోగపడుతున్నందువలన కూడా, ఇది నిజమని తేలుతున్నది. పరులచే ఒక వనిత చూడబడినపుడు, మరొక్క వనితలో ఈర్ష్య జనిస్తుంది, ఆ విధంగా ఇక్కడ కూడా జరుగుతుంది. అంటే, వనితలో ఈర్ష్య లేనప్పటికీ, చూచేవారిలో అది పుట్టినట్లుగా అన్నమాట.

సమస్తమూ శివస్వభావమునందు విశ్రాన్తిని పొందినప్పుడు శివసమావేశము ఉదయిస్తున్నది. దానికి విరుద్ధంగా, ఎన్నో ప్రమాత్రులచేత చూడబడుతున్న వస్తువును చూచినప్పుడు పూర్ణత్వముదయిస్తున్నది. ఇది, నర్తకి యొక్క నర్తనను చూచినట్లుగా ఉంటుంది. నర్తకి యొక్క నాట్యమును వీక్షిస్తున్న అందరూ రసావేశమును పొందినప్పుడు కలిగిన అనుభూతిలాగా ఇది ఉంటుంది. లేదా, నీలము దానిరూపమైన ప్రమాతలో విశ్రాన్తమైనప్పుడు లాగా. కనుక, స్వప్రకాశముతోనే విమర్శ యొక్క ఉదయమౌతున్నది. ఈ విధముగా, భూమినుండి ప్రకృతి వరకూ ఉన్నట్టి పదిహేనింటిని గ్రహించాలి. రాగము మొదలైన కంచుకములు సకలులలో తలలెత్తి ఉంటాయి. ఈ పదిహేను విభాగములూ సకలులలో ఉండటం వలన అవికూడా ప్రమేయములౌతున్నాయి. ఈ విషయమంతా, బహు విస్తారముగా 'తంత్రాలోకము' న చెప్పబడినది.

పురుషుని నుండి కళ వరకూ పదమూడు తత్త్వములున్నాయి. సకలులలో ప్రమాతృత్వము లేనందువలన, శక్తి–శక్తిమంతుల భేదద్వయము ఇక్కడ ఉండదు. సకలులది కేవలస్వరూపమే. ప్రలయాకలయొక్క స్థాయిలో, దాని స్వరూపముతో, అయిదు ప్రమాతృభేదములతో కలిపి మొత్తము పదకొండవుతాయి. విజ్ఞానాకలయొక్క స్థాయిలో, దాని స్వరూపముతోను, నాలుగు ప్రమాతలతోను కలిపి మొత్తము తొమ్మిది భేదములౌతాయి. మన్త్రస్థాయిలో, దాని స్వరూపముతోను, మూడు ప్రమాతలతోను కలిపి మొత్తము ఏడౌతాయి. మన్త్రేశస్థాయిలో, దాని స్వరూపముతోను, రెండు ప్రమాతలతోను కలిపి, ఐదౌతాయి. మన్త్రమహేశస్థాయిలో, దాని స్వరూపముతోను, ఒక్కటే అయినట్టి భగవత్ ప్రమాతతో, శక్తి–శక్తిమంతుల భేదముతో మూడవుతాయి. ప్రకాశ - ఏకచిత్- స్వాతన్త్ర్యనిర్భరత్వమువలన, పరిపూర్ణుడవటం వలన, శివునిలో ఏ విధమైన భేదమూ లేదు. ఈ క్రింది పట్టిక చూస్తే, ఇదంతా సులభముగా అర్థమౌతుంది.

ప్రమేయము	ప్రమాణము	ప్రమాత	మొత్తము
పృథివి నుండి ప్రకృతి వరకు	విద్యా కళలు	సకల నుండి శివుని వరకు - ఏడు	7+7+1 = 15
పురుషుని నుండి కళ వరకు	విద్యాకళల సుప్తస్థితి	ప్రళయాకల నుండి శివుని వరకు	6+6+1 = 13
ప్రళయాకల ఆత్మ	జ్ఞేయము లేదు, సుప్తస్థితి	విజ్ఞానాకల నుండి శివుని వరకు	5+5+1 = 11
విజ్ఞానాకల ఆత్మ	జ్ఞేయము మాయమౌతున్నది	మంత్రము నుండి శివుని వరకు	4+4+1 = 9
మంత్ర	శుద్ధవిద్యోదయం	మంత్రేశుని నుండి శివుని వరకు	3+3+1 = 7

ప్రమేయము	ప్రమాణము	ప్రమాత	మొత్తము
మంత్రేశ	శుద్ధవిద్య	మంత్రమహేశ్వర, శివుడు	2+2+1 = 5
మంత్రమహేశ్వర	ఇచ్ఛాశక్తి	శివ శక్తులు	1+1+1 = 3
శివుడు	పరమస్వాతంత్ర్యము		

ఈ విధముగా ఉన్నట్టి తత్త్వభేదములన్నీ, 'పరమేశ్వరానుత్తరనయమ' నే గ్రంథములో చక్కగా వివరించబడినవి. వీటివల్లనే రకరకములైన భువనములు(లోకములు) కలుగుతున్నాయి. నరక, స్వర్గ, రుద్ర భువనములన్నీ భూతత్త్వముతో కూడినట్టివే, కానీ ఒకదానికొకటి చాలా దూరములలో ఉండటం వలన, వాటి స్వభావములలో భేదం వస్తున్నది. ఆయా భేదములు ఎలా ఉంటాయో, ఆయా లోకములు ఎలా ఉంటాయో, తెలియాలంటే, తంత్రాలోక గ్రంథములో విపులముగా వివరించబడినది.

ఈ విధముగా, ఒక కుండను పరిశీలిస్తే భూతత్త్వము మొత్తమూ అర్థమైనట్లు, భూతత్త్వము ద్వారా మిగిలిన తత్త్వములన్నీ వివరింపబడుచున్నవి.

మొత్తము పృథివీతత్త్వములో ఉన్నట్టి ప్రమాతృ-ప్రమేయరూపములు ఈ విధముగా ఉంటాయి. శివుడే ధరాతత్త్వముతో ఒక్కటిగా ప్రకాశిస్తున్నాడు. ఏలాగనగా, 'పృథివ్యేవేదం బ్రహ్మ' (పృథివియే బ్రహ్మ) మని వేదము చెప్పుచున్నది కదా! ధరాతత్త్వసిద్ధిప్రదులను ప్రేరేపించునది, ధరామన్త్రమహేశ్వరుడౌతుంది. ప్రేరితమయ్యేది ధరామన్త్రేశుడు అవుతుంది. దాని అహంకారస్వరూపము మన్త్రము అవుతుంది. అంటే, జ్ఞాతృ, జ్ఞాన, జ్ఞేయము (ప్రమాతృ, ప్రమాణ, ప్రమేయము)లు మంత్రమహేశ్వరుడు, మంత్రేశ్వరుడు, మంత్రములౌతాయి. సాంఖ్యము మొదలైన సిద్ధాంతములు పశుమతములు. వీటిని చిరకాలము అభ్యసించిన తరువాత, శివవిద్యాదీక్షితుడై, పార్థివయోగమును అభ్యసించినప్పటికీ, దానిలో స్థిరమైన సిద్ధిని పొందలేకపోతే, అనగా, భూతత్త్వములోని శివత్వమును స్థిరముగా అనుభూతి చెందలేకపోతే, అట్టి యోగి 'ధరావిజ్ఞానాకలము' అనే స్థితిని పొందుతాడు. సాంఖ్యము మొదలైన పశువిద్యలద్వారా అభ్యసింపబడినట్టి పార్థివయోగము కల్పాంతములోగాని, ఉపాసకుని మరణములోగాని, 'ధరాప్రలయకేవల' మౌతుంది. అట్టి యోగులు ధరాతత్త్వమునుండి ముక్తిని పొందుతారు. సుషుప్తి అవస్థలో, రకరకములైన తత్త్వముల ఉద్రేకమువలన, చిత్రవిచిత్రములైన స్వప్నములేవైతే ఉదయిస్తున్నవో, వాటిని గ్రహించే అహంకారము 'ధరాసకలము' అవుతుంది. అట్టి స్థితిలోకూడా, శక్తి అనేది ఉన్నందువలనా, దాని విభాగములవలనా, మళ్ళీ పద్నాలుగు విధములైన భేదములు కలుగుచున్నది. ఎలాగంటే, సకల నుండి శివునివరకు ఉన్న ఏడు ప్రమాతృలు స్పందమునకు లేదా క్షోభకు లోనైనప్పుడు వారి వారి చర్యలు ప్రారంభములౌతాయి. ఇవి ఏడు శక్తులుగా ఉంటాయి. కనుక మొత్తము పద్నాలుగౌతాయి. ఈ విధముగా ధరాతత్త్వముల ప్రమాతృతా భేదములుంటాయి. కానీ వాటి స్వరూపం మాత్రం శుద్ధమైన ప్రమేయమై ఉంటుంది. ఎందుకనగా, ప్రమాతలతో పూర్తిగా ఒక్కటి కానట్టి, స్వతంత్రమైన ఉనికి వాటికి ఉంటుంది గనుక. పృథివీతత్త్వమునకు చెప్పబడిన ఈ విధానమే, మిగిలిన తత్త్వములకు కూడా వర్తిస్తుంది.

ఇప్పుడు ప్రాణములో తత్త్వనిరూపణము వివరించబడుచున్నది. ప్రమేయములు అనేకములైనప్పటికీ

ప్రమాత ఒక్కటిగానే ఉంటుంది. దీనిలో ప్రాణస్థితి వలన కలిగే భేదములు ఈ విధముగా ఉంటాయి.

ప్రాణము - తత్త్వములు

బాహ్యావస్తువులను గ్రహించే సమయంలో ప్రాణము, పదహారు తుటుల రూపములను ధరించి వేద్యవస్తువు వరకూ వ్యాపిస్తుంది. ఆయా తుటులలో ఏమి జరుగుతుంది? వీటిలో, మొదటి తుటి యన్నది, దేనికీ చెందదు. రెండవ తుటి, గ్రాహకుని యొక్క ఉల్లాసరూపముగా ఉన్నది. చివరిది, గ్రాహ్యావస్తువుతో అభిన్నరూపంలో ఉంటూ, దానిగా మారి ఉంటుంది. దానికంటే ముందున్నది, గ్రాహ్యావస్తువుయొక్క ప్రారంభరూపములు. ఈ మధ్యలో నున్న పన్నెండు తుటులలో, మొదటి ఆరును నిర్వికల్పస్వభావములై ఉంటాయి. ఇవి, ఆలోచనను కప్పుతూ ఉంటాయి. ఆరవది స్వరూపమై ఉండగా, మిగతా అయిదును, ఆలోచనలను కప్పుతున్నాయి. కన్నులను తెరవాలన్న కోరిక, కన్నులను తెరవడము, ఈ విధముగా స్ఫుటమైన క్రియారూపములలో రెండు తుటులౌతున్నాయి. ఎందుకనగా, స్పందన యనునది, ఒక్క క్షణం కంటే ఎక్కువసేపుగా ఉంటుంది గనుక. కళ్ళను తెరవడము, గ్రహించడము మొదలైన అయిదు వికల్పముల వలన, ఆరవదియైన తన స్వరూపము వలన, ఆరుక్షణముల రూపమై నిర్వికల్పకమౌతున్నది. నిర్వికల్పము యొక్క ధ్వంసస్వభావము, వికల్పము యొక్క ధ్వంసము, ఉన్మిమిష, ఉన్మిషత్త, తుటిద్వయాత్మకమైన ఉన్మిషితత, ఇవన్నీ కలిపి ఆరు తుటులౌతున్నాయి. ఏదైతే తెలిసికొంటున్నదో అది లెక్కలోనికి రాదు. ఈ విధముగా వివేకధనియైనవాడు, గురూపదేశానుశీలుడు, ప్రతిచోటను ఈ పదిహేను విభాగములను వివేచన గావిస్తాడు.

వికల్పములు తగ్గిపోవడము, తుటులు తగ్గిపోవడము రెండూ సమానముగా జరుగుతాయి. మానవుడు సుఖమును అనుభవించే సమయంలో వికల్ప సహాయంతోనే సుఖానుభూతిని పొందుతాడు. వికల్పము లేకపోవడం అవికల్పమౌతుంది. అది జరిగినప్పుడు సుఖం మాయమౌతుంది. సాధారణముగా లోకులు, వికల్పములు విశ్రాంతిని తీసుకొనడాన్ని, అహంయొక్క స్వరూపముగా అనుకుంటారు. దానినే నిర్వికల్పమని కూడా అనుకుంటారు. అహంత చేత కప్పబడిన, 'ఇది' అనిన స్పష్టమైన వికల్పమువరకూ వెలుగులేనిదని తలుస్తారు. ఎలాగంటే, సుఖము లేకపోవడమే దుఃఖమని అన్నట్లుగా ఇది ఉంటుంది. వికల్పములు తగ్గితే అది పెరుగుతుంది. ఈ విధముగా గ్రాహ్యము - గ్రాహకముల మధ్యనగల సంబంధమును విచారించవలెనని అభినవగుప్తుల గురువులు చెప్పినారు.

ఈ పదిహేను తుటులూ కలసి, 'ఇది' అనిన స్ఫుటమైన జ్ఞేయానుభవమును యోగికి కలిగిస్తున్నవి. ఇవి రెండురెండుగా తగ్గుతూ రాగా, చివరి రెండు తుటులు, శివావేశమును యోగికి కలిగిస్తున్నవి. ఈ రెండు తుటులలో, మొదటిది, ఎల్లప్పుడూ పూర్ణముగా ఉంటున్నది. రెండవది, సర్వజ్ఞానము, సర్వకరణ స్వరూపముగా ధ్యానింపబడి, సర్వజ్ఞత్వమును, సర్వకర్తృత్వమును పొందుచున్నది. కానీ మొదటి తుటి ఇటువంటిది కాదు. కనుక శ్రీ కల్లటాచార్యులు దీనిని తుటిపాతమన్నారు. దానిద్వారా, 'పాత' శబ్దముతో, భగవతియైన శ్రీమత్ కాళికాదేవిని, మాతృసద్భావము, భైరవము, ప్రతిభలనే మూడుగా గ్రహించమని చెప్పినారు. ఈ రహస్యమును ఇంతకంటే వివరించి చెప్పడం ప్రస్తుతం వీలుకాదు. ఈ విధముగా మన్త్రమహేశతుటి నుండి, మిగతా తుటుల వరకు, ఆయా అభ్యాసములవలన ఆయా సిద్ధులు కలుగుతాయి.

మంత్రమహేశ్వర, మంత్రేశ్వర, మంత్ర తుటులపైన ధ్యానములవలన, ఆయా లోకములకు, స్థితులకు చెందిన సిద్ధులు యోగికి కలుగుతాయని అర్థము.

జాగ్రదాది అయిదు అవస్థలు

ఇప్పుడు జాగ్రత్ మొదలైన అవస్థలు వివరించబడుచున్నాయి. వేద్యము, విషయములు, వీటిని గ్రహించడమనే విచిత్రము సంవిత్ లో కలుగుచున్నది. వీని అన్యోన్య సంబంధమునే 'అవస్థ' అని చెప్పవచ్చును. అది పూర్తిగా తెలియబడేదీ కాదు, పూర్తిగా సంవిత్తూ కాదు, కొంత అదీ, కొంత ఇదీ కూడా కాదు. వీటి వివరణ ఈ విధంగా ఉంటుంది. అధిష్ఠింపబడుతూ, బాహ్యరూపమై ఉన్నదే జాగ్రదవస్థ. అది ప్రమేయము, ప్రమాత, ప్రమాణము అనబడుతుంది. అధిష్ఠానరూపముగా, సంకల్పముగా ఉన్నది స్వప్నావస్థ. అధిష్ఠాతగా, బీజరూపంలో వెలిగేది సుషుప్తావస్థ. ఈ మూడును ప్రమేయ, ప్రమాణ, ప్రమాతలుగా ఉంటాయి. జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయములనబడే నాలుగు భేదములతో ఇవి ఉంటాయి.

తురీయావస్థ లేదా తుర్యావస్థ అంటే ఏమిటి? తనలో తానుగా, విశ్రాంతిస్థితిలో ఉన్న ప్రమాత (జ్ఞాత), పూర్ణమై, సర్వతోముఖముగా అంతటా వ్యాపించినపుడు, ఏ భావము వెలుగుతున్నదో దానినే 'తుర్యావస్థ' అంటారు. అంటే, జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలలో సమానంగా వ్యాపించి ఏదైతే ఉన్నదో అది ఆ మూడింటికి అతీతమైనది. కనుక, నాలుగవ అవస్థ అవుతున్నది. 'చూచువాడు, చూడబడుట, చూడబడుచున్నది అనిన త్రిపుటిని దాటి, ఏ ఉపాయము లేకుండా సూటిగా చూచుచున్నాను' అనే స్థితి, సంపూర్ణమైన స్వాతంత్ర్యముతో కూడినట్టిది. ఇది ప్రమాతృత, లేదా తురీయాతీతము అనబడుతుంది. దీనికి దగ్గరగా ఉన్నది, ప్రమాత (జ్ఞాత), మధ్యస్థమైన దూరంలో ఉన్నది ప్రమాణము (జ్ఞానము), దూరంగా ఉన్నది ప్రమేయము (జ్ఞేయము). ఈ నాలుగు అవస్థలనే, పిణ్డస్థము, పదస్థము, రూపస్థము, రూపాతీతములనే పదములతో యోగులు వ్యవహరిస్తారు. జ్ఞానధనులైనవారు, వీటిని సర్వతోభద్రము, వ్యాప్తి, మహావ్యాప్తి, ప్రచయము అనే పదములతో పిలుస్తారు. ఏదైతే అన్నింటిలోనూ ఉంటూ, పూర్ణమై, తురీయమునకు కూడా అతీతమై ఉన్నదో దానిని మహాప్రచయమని పిలుస్తారు. వీని వివరముల కొరకు, తన్త్రాలోకము, శ్లోకవార్తికములనబడే ఇతర గ్రంథములలో చూడవలెను.

దేని రూపమైతే స్ఫుటముగా గోచరిస్తూ, స్థిరమైన భౌతికరూపంలో ఉంటూ, ఇంకొకదానితో అనుబంధముగా ఉంటున్నదో, అది జాగ్రత్తు అవుతుంది. దానికి వ్యతిరేకమై, అది లేని స్థితి, 'స్వప్నము' అనబడుతుంది. ఇది ప్రలయాకలులైన ఆత్మల లోకము. అన్నింటినీ తనలో ఇముడ్చుకునేది సుషుప్తి. ఇది విజ్ఞానాకలులైన ఆత్మల యొక్క లోకము. జ్ఞేయము, జ్ఞాతలు ఒక్కటైన స్థితి తురీయము. అది మన్త్ర, మంత్రేశ, మంత్రమహేశ్వరుల లోకము. అన్ని భావములకూ, శివునితో అభేదముగా ఉండే స్థితి తుర్యాతీతము, సర్వాతీతము. దానిలో 1. సకలులు, 2. ప్రలయాకలులు, 3. విజ్ఞానాకలులు, 4. మన్త్ర, మంత్రేశ, మంత్రమహేశవర్గము, 5. శివము – ఈ విధముగా అయిదు అవస్థలున్నవి.

ఈ క్రింది పట్టిక నుండి సులభముగా అర్థమౌతుంది.

1	2	3	4	5

సకలాత్మలు	ప్రళయ కలాత్మలు	విజ్ఞాన కలాత్మలు	మంత్ర, మంత్రేశ, మంత్ర-మహేశ్వరులు	శివుడు
ప్రమేయము	ప్రమాణము	ప్రమాత	ప్రమితి	అనిర్వచనీయము
జాగ్రత్	స్వప్నము	సుషుప్తి	తురీయము	తురీయాతీతము
పిండస్థము	పదస్థము	రూపస్థము	రూపాతీతము	సర్వాతీతము
సర్వతోభద్రము	వ్యాప్తి	మహావ్యాప్తి	ప్రచయము	మహాప్రచయము

వీటిలో పదిహేను భేదములున్నవి. అవి, పైన వివరించిన విధముగా, ఏడుగురు శక్తిమంతులు, వారియొక్క ఏడుగురు శక్తులు మరియు తత్త్వస్వరూపముగా ఈ పదిహేను భేదములూ ఉంటాయి.

స్వరూపము, ప్రలయాకల మొదలగు భేదములతో పదమూడుగా ఉన్నవి. స్వరూపము, విజ్ఞానాకలశక్తి, విజ్ఞానాకల మొదలగు భేదములతో పదకొండుగా ఉన్నవి. స్వరూపము, మన్త్ర, మంత్రేశ, మహేశ, శివా, శివులుగా తొమ్మిది. స్వరూపము, మన్త్రేశ, మహేశ, శక్తి, శివులుగా ఏడు. స్వరూపము, మహేశశక్తి, మహేశ, శక్తి, శివులుగా అయిదు. స్వరూపము, క్రియాశక్తి, జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి, శివుదు ఇవి మూడు భేదములు. శివతత్త్వము అన్నింటితో అభిన్నమైనప్పటికీ క్రియా- జ్ఞాన - ఇచ్ఛా - ఆనంద - చిద్రూపములుగా, జ్ఞానులు, యోగులు, అయిదు విధములైన భేదములను చెప్పుచున్నారు.

ఆ|| పృథివి యందు జూడ బురుషుందు తాలేదు
తత్త్వజాలమందు తథ్యమల్లె
తనదు పదము వీడి తద్రూపుడై నిల్చి
గోచరించు భువన కోటులందు

ఆ|| లోకజాలమందు లోనున్న కళలన్ని
నిర్వికల్పమైన నిశ్చలంబె
దానినెరిగినంత దనరూపు తాదాల్చు
అడ్డు లేని ఇచ్ఛ; యోను గాదె?

భూమ్యాది తత్త్వజాలములలో పురుషుడు లేదు, కానీ సంవిత్ లోపలి తన విశ్రాంతిని విడచి, ప్రమాతృభావమును ధరించి, అనేకవిధములుగా గోచరిస్తూ ఉంటాడు. ఈ మొత్తము వేద్యజాలములో, క్రమగతములైన కళలుగా ఉన్నది నిర్వికల్పకమైన అహంతయే. అది, స్వాతంత్ర్యసారమై, భువములో అధివసించి ఉన్నది. దీనిని పొందినవాడు స్వాత్మ తత్త్వమును అందుకొనుచున్నాడు.

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే తత్త్వభేదప్రకాశనం నామ నవమమాహ్నికమ్ || 9 ||

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని తత్త్వభేద ప్రకాశనమనే

తొమ్మిదవ ఆహ్నికము.

పదవ ఆహ్నికము

కలాద్యధ్వ ప్రకాశనము

యదార్థః - యదార్థము

ఉక్తస్తావత్ తత్త్వాధ్వా । కలాద్యధ్వా తు నిరూప్యతే, తత్ర యథా భువనేషు అనుగామి కించిద్రూపం తత్త్వమ్ ఇత్యుక్తమ్, తథా తత్త్వేషు వర్గశో యత్ అనుగామి రూపం తత్ కలా-ఏకరూపకలనాసహిష్ణుత్వాత్ ।

ఇప్పటివరకూ తత్త్వాధ్వము చెప్పబడినది. ఇప్పుడు కలాధ్వము నిరూపింపబడుచున్నది. భువనములలో అనుగామియైన రూపమేదైతే ఉన్నదో అదే తత్త్వమని చెప్పబడుతుంది. ఒకేరూపముగా కలనమును చేయగలుగుతుంది గనుక, ఆయా తత్త్వవర్గములలో అనుగామిమయ్యే రూపమే కల.

తద్యథా పృథివ్యాం నివృత్తిః-నివర్తతే యతస్తత్త్వసర్గ ఇతి । జలాదిప్రధానాన్తే వర్గే ప్రతిష్ఠా-కారణతయాప్యాయనపూరణ కారిత్వాత్ । పుమాదిమాయాన్తే విద్యా-వేద్యతిరోభావే సంవిదాధిక్యాత్ । శుద్ధవిద్యాదిశక్త్యన్తే శాన్తాకఞ్చుకతరఙ్గోపశమాత్ । ఏతదేవ అణ్డచతుష్టయం పార్థివ-ప్రాకృత-మాయీయ-శాక్తాభిధమ్ । పృథివ్యాదిశక్తీనామ్ అత్ర అవస్థానేన శక్తితత్త్వే యావత్ పరస్పర్శో విద్యతే స్పర్శస్య చ సప్రతిఘత్వమితి తావతి యుక్తమ్ అణ్డత్వమ్ । శివతత్త్వే శాన్తాతీతా-తస్యోపదేశ భావనార్చాదౌ కల్యమానత్వాత్ । స్వతన్త్రం తు పరం తత్త్వం, తత్రాపి యత్ అప్రమేయం తత్కలాతీతమ్ । ఏవం పఞ్చైవ కలాః షట్త్రింశత్తత్త్వాని ।

పృథివ్యాదులలో నివృత్తిగా ఉంటుంది, అక్కడనుండి అన్నీ వెనుకకు మరలుతాయి గనుక. జలం నుండి ప్రధానమువరకు ప్రతిష్ఠాకల ఉంటుంది, ఆప్యాయనము, పూరణము చేస్తుంది గనుక. పురుషునినుండి మాయవరకూ, విద్యాకళ ఉంటుంది, వేద్యము తిరోగమించడము, సంవిత్ యొక్క ఆధిక్యముల వలన. శుద్ధవిద్య నుండి శక్తివరకూ శాంతకళ ఉంటుంది, కంచుకతరంగములు ఉపశమిస్తాయి గనుక. ఇవియే పార్థివ-ప్రాకృత-మాయీయ-శాక్తములనబడే అణ్డచతుష్టయములు. పృథివ్యాదిశక్తుల అవస్థానము శక్తితత్త్వము వరకూ ఉంటుంది, పరస్పర్శను తెలుసుకుంటుంది. స్పర్శతో ప్రతిఘాతమౌతుంది కనుక ఇంతవరకు అండత్వముంటుంది. శివతత్త్వములో శాన్తాతీతకళ ఉంటుంది. అది, ఉపదేశము, భావన, అర్చనాదుల కల్యము వలన. పరతత్త్వము స్వతన్త్రము. దానిలోకూడా అప్రమేయమైనది దానియొక్క కళాతీతము. ఈ విధముగా అయిదు కళలు, ముప్పదియారు తత్త్వములు అవుతాయి.

తథాహి-ప్రమేయత్వం ద్విధా-స్థూలసూక్ష్మత్వేన ఇతి దశ । కరణత్వం ద్విధా-శుద్ధం కర్తృతాస్పర్శి చ ఇతి దశ । కరణతోపసర్జనకర్తృభావస్ఫుటత్వాత్ పఞ్చ, శుద్ధకర్తృభావాత్ పఞ్చ, విగలితవిభాగతయా వికాసోన్ముఖత్వే పఞ్చ, సర్వావచ్ఛేదశూన్యం శివతత్త్వం షట్త్రింశమ్ । తద్యదా ఉపదిశ్యతే భావ్యతే వా యత్ తత్ప్రతిష్ఠాపదమ్, తత్ సప్తత్రింశమ్, తస్మిన్నపి భావ్యమానే అష్టాత్రింశమ్, న చ అనవస్థా-తస్య భావ్యమానస్య అనవచ్ఛిన్నస్వాతన్త్ర్యయోగినో వేద్యీకరణే సప్తత్రింశ ఏవ పర్యవసానాత్, షట్త్రింశం తు సర్వతత్త్వోత్తీర్ణతయా సంభావ్యావచ్ఛేదమ్ ఇతి పఞ్చకలావిధిః ।

ప్రమేయత్వము రెండు విధములు, స్థూలము సూక్ష్మమని. ప్రమేయములు పదౌతాయి. కరణత్వము కూడా రెండు విధములు, శుద్ధము, కర్తృతాస్పర్శమని, కనుక అవి కూడా పదౌతాయి. కరణత్వము ఉపసర్జనమై, కర్తృభావము స్ఫుటమైనప్పుడు అయిదు. శుద్ధకర్తృభావముతో అయిదు. విభాగములు విగలితములై వికాసోన్ముఖత్వమవడం ద్వారా అయిదు. సర్వావచ్ఛేదములు శూన్యమైన శివతత్త్వము, ముప్పదియారవది. ఎప్పుడిది ఉపదేశింపబడుతుందో, భావింప బడుతుందో, ఆ ప్రతిష్ఠాపదము ముప్పది ఏడవది. దానిలో భావ్యమానమైనది ముప్పది ఎనిమిదవది. దీనిలో అనవస్థ లేదు. దానిని భావించడం ద్వారా అనవచ్ఛిన్నస్వాతన్త్ర్యమును దేనినైతే యోగులు తెలుసుకుంటారో, అది కూడా పర్యవసానం వలన ముప్పదిఏడవదే అవుతుంది. ముప్పది యారవది సర్వతత్త్వోత్తీర్ణతవలన, సంభావ్యావచ్ఛేదమగుట వలన, ఇంతటితో పంచకళావిధి పూర్తి అవుతున్నది.

విజ్ఞానాకలపర్యన్తమ్ ఆత్మకలా, ఈశాన్తం విద్యాకలా, శిష్టం శివకలా ఇతి త్రితత్త్వవిధిః । ఏవం నవతత్త్వాద్యపి ఊహయేత్ ఇతి । మేయాంశగామీ స్థూలసూక్ష్మపరరూపత్వాత్ త్రివిధో భువనతత్త్వకలాత్మాధ్వభేదః, మాతృవిశ్రాన్త్యా తథైవ త్రివిధః, తత్ర ప్రమాణతాయాం పదాధ్వా, ప్రమాణస్యైవ క్షోభతరఙ్గశామ్యత్తాయాం మన్త్రాధ్వా, తత్ప్రశమే పూర్ణప్రమాతృతాయాం వర్ణాధ్వా, స ఏవ చ అసౌ తావతి విశ్రాన్త్యా లబ్ధస్వరూపో భవతి ఇతి ఏకస్యైవ షడ్విధత్వం యుక్తమ్ ।

విజ్ఞానాకలపర్యన్తము ఆత్మకల, ఈశాన్తము వరకు విద్యాకల, మిగిలినది శివకల - ఇది త్రితత్త్వవిధి. ఇదే విధముగా నవతత్త్వములను కూడా ఊహించాలి. ప్రమేయాంశగామి, స్థూల - సూక్ష్మ - పరరూపత్వములతో, మూడువిధములుగా భువన- తత్త్వ - కలాధ్వ భేదములుగా ఉన్నది. ప్రమాతృవిశ్రాన్తమైనప్పుడు కూడా, ఇదే విధముగా మూడు విధములు. ప్రమాణతతో పదాధ్వమౌతున్నది. ప్రమాణము యొక్క క్షోభితరఙ్గముల శామ్యతవలన మన్త్రాధ్వమౌతున్నది. అదికూడా శమించగా, పూర్ణప్రమాతృత కలిగినప్పుడు వర్ణాధ్వమౌతున్నది. అది తనలోనే విశ్రాంతిని పొందినప్పుడు ఏకమౌతున్నది, ఈ విధముగా, ఒక్కటే, ఆరు విధములుగా ఉన్నదని చెప్పుట యుక్తము.

శ్లో|| పదమన్త్రవర్ణమేకం పురషోడశకం ధరేతి చ నివృత్తిః |
తత్త్వార్ణమగ్నేనయనం రసశరపురమన్త్రమన్త్రపదమన్యా ||

పదము, మంత్రము, వర్ణములు ఒక్కొక్కటి, పురములు పదహారు, ధరలో నివృత్తి. దాని వర్ణము క్ష. ఇరువదిమూడు తత్త్వములలో రస *6*, శర *5*, పుర *56*, మంత్రములు *5*, పదములు *5*. అన్యా ఆప్యాయనీ కల.

శ్లో|| మునితత్త్వార్ణం ద్వికపద- మన్త్రం వస్వక్షిభువనమపరకలా |
అగ్న్యర్ణతత్త్వమేకక- పదమన్త్రం సైన్యభువనమితి తుర్యా ||

మునితత్త్వములు *7*, పదములు, మంత్రములు *5*, వసు *8*, అక్షులు *2*, భువనములు *28*, అపరకల. అగ్ని *3*, తత్త్వములు *3*, భువనములు *18*, తుర్యా కల.

శ్లో|| షోడశ వర్ణాః పదమన్త్ర- తత్త్వమేకం చ శాన్త్యతీతేయమ్ |
అభినవగుప్తేనార్యా- త్రయముక్తం సంగ్రహాయ శిష్యేభ్యః ||

వర్ణములు 16, పదము, మంత్రము, తత్త్వములు ఒక్కొక్కటి. శాంత్యతీతకల. అభినవగుప్తునిచే ఆర్యచందస్సులో ఈ మూడు శ్లోకములు శిష్యులకొరకై సంగ్రహముగా చెప్పబడినవి.

వ్యాఖ్యానము

ఇప్పటివరకూ తత్త్వాధ్వము చెప్పబడినది. ఇప్పుడు కళాధ్వము గురించి వివరించబడుతుంది.

తత్త్వము - కళ

అన్ని లోకములలోను (భువనములలోను) వ్యాపించియున్న రూపమేదైతే ఉన్నదో, అదే తత్త్వమని చెప్పబడుతుంది. ఈ తత్త్వముల లోలోపల, అనుస్యూతముగా, ఏకత్వముగా ఉండేదే కళ. కళ అని పేరెందుకు వచ్చినదంటే, తత్వములనన్నింటినీ ఒకే రూపముగా 'కల్పించగలుగుతుంది గనుక, దానిని 'కళ' అన్నారు.

నివృత్తికళ

భూతత్త్వములో ఉన్నది నివృత్తికళ అనబడుతుంది. ఏమనగా, తత్త్వములన్నీ అక్కడితో ఒక క్రింది స్థాయిని అందుకుని, అంతములౌతున్నాయి, అక్కడనుండి వెనుకకు మరలిపోవడమే గాని, వేరేదారి ఉండదు గనుక, భూతత్వములో ఉన్న దానిని 'నివృత్తికళ' అంటారు.

ప్రతిష్ఠాకళ

జలతత్త్వము నుండి ప్రధానము అనబడే ప్రకృతితత్త్వము వరకు ప్రతిష్ఠాకళ ఉంటుంది, జలములో ఉన్న కళ లేదా స్వభావము - వేరేవాటిని తడపడము, నింపడములను చేస్తుంది గనుక, జీవంతో ప్రతిష్ఠిస్తుంది గనుక, దీనికి 'ప్రతిష్ఠాకళ' అని పేరు.

విద్యాకళ

పురుషునినుండి మాయవరకూ, విద్యాకళ ఉంటుంది. దీనికా పేరెందుకు వచ్చినది? ఇక్కడనుండి వేద్యము (తెలుసుకోవడం) అనేది, తిరోగమిస్తుంది, అంటే, వెనుకకు మరలిపోతుంది. ఆ తరువాత, తెలుసుకొనేది ఉండదు. అక్కడనుండి, ఉత్త సంవిత్ యొక్క ఆధిక్యము మాత్రమే ఉంటుంది. అందువల్ల అది 'విద్యాకళ' అనబడుతుంది.

శాంతకళ

శుద్ధవిద్య నుండి శక్తివరకూ శాంతకళ ఉంటుంది. ఈ స్థాయిలో, కంచుకతరంగములు ఉపశమిస్తాయి మరియు శాంతిస్తాయి గనుక అది 'శాంతకళ' అనబడుతుంది.

పృథివీ అండము	పృథివి	నివృత్తికళ	ఇక్కడనుండి తత్త్వములు నివృత్తి అవుతాయి
ప్రకృత్యండము	జలము నుండి ప్రధానము వరకు	ప్రతిష్ఠా కళ	తడిపి, జీవంతో నింపుతుంది గనుక

మాయాండము	పురుషుని నుండి మాయ వరకు	విద్యాకళ	జ్ఞానమునిస్తుంది గనుక
శక్త్యండము	శుద్ధవిద్య నుండి శక్తి వరకు	శాంతికళ	కంచుకములు శాంతిస్తాయి గనుక

వీటినే నాలుగు అండములు (గోళాకారములో ఉన్న లోకములు) అంటారు. అవి పృథివీ అండము, ప్రకృత్యండము, మాయాండము, శక్త్యండములు. పృథివి మొదలైన శక్తుల ఉనికి శక్తితత్త్వము వరకూ వ్యాపించి ఉంటుంది. అది ఇంకొక తత్త్వపుస్పర్శను తెలుసుకోగలుగుతుంది. ఒకదాని స్పర్శను మరొకటి తెలుసుకుని, అదే సమయంలో ఒకదానితో మరొకటి కలువకుండా ఆగుతాయి గనుక, ఆయా అండములు లేదా లోకములు, విడివిడిగా, వాటివాటి ప్రత్యేకములైన ఉనికితో ఉండగలుగుతాయి.

శాంత్యతీత కళ

శివతత్త్వములో శాంత్యతీతకళ ఉంటుంది, ఉపదేశము, భావన, అర్చనాదుల కొరకే అది ఉంటున్నది. అనగా, ఊహాతీతుడైన శివుని మనము ఊహించుటకు, గ్రహించుటకు, మన మనస్సులకు ఒక ఆధారము అవసరమౌతుంది. భావన అంటే ధ్యానము, అర్చన అంటే బాహ్యాపూజ. ఉపదేశమంటే ఇతరులకు వివరించడం. ఈ మూడు పనులూ జరుగవలెనంటే, ఒక ఆధారపు సహాయముతోనే ఈ పనులను మానవులు చేయగలుగుతారు. కనుక, దీనిని 'శాంతాతీత కళ' లేదా 'శాంత్యతీత కళ' అని పిలుస్తారు. శాంతికళ వరకూ మనము ఊహించగలము. కనుక దానికంటే అతీతమైన శివతత్త్వమును దానితో పోల్చి 'శాంతిని మించినది' అని మాత్రమే చెప్పడం వీలౌతుంది గాని, వేరే విధంగా వీలుపడదు. పరతత్త్వము సర్వస్వతంత్ర రూపముగా ఉంటుంది. దానిలోకూడా, పోల్చి తెలుసుకొనుటకు వీలుకానిది, జ్ఞానాతీతమైనది, 'కళాతీతము' అనబడుతుంది.

ఈ విధముగా అయిదు కళలు, ముప్పదియారు తత్త్వములు అవుతాయి.

ప్రమేయము (జ్ఞేయము, తెలిసికొనబడునది) రెండు విధములుగా ఉన్నది. అవి, స్థూలము, సూక్ష్మము. పంచేంద్రియములతో తెలిసి కొనబడే సృష్టి స్థూలము, సూక్ష్మములని ఐదైదు విధములుగా ఉంటుంది గనుక, మొత్తము ప్రమేయములు పదౌతాయి. కరణత్వము కూడా, శుద్ధము, కర్మృతాస్పర్శమని రెండు విధములు. కరణత్వమంటే, ఇంద్రియసమూహము. వీనిలో, జ్ఞానేంద్రియములు శుద్ధములు. అనగా, కర్మస్పర్శ లేనివి. వీటికి బుద్ధిస్పర్శ మాత్రమే ఉంటుంది. కర్మేంద్రియములు కర్మృత్వస్పర్శను కలిగినట్టివి. కనుక, ఇవి మొత్తము పదికళలు అవుతున్నాయి. ఇంద్రియముల ద్వారా కర్మను చేసే భాగము తగ్గిపోయి, కర్మృభావము స్ఫుటముగా మారే స్థితిలో అయిదు కళలౌతున్నాయి. శుద్ధమైన కర్మృభావము మాత్రమే ఉన్నపుడు అయిదు కళలౌతున్నాయి. ఇవన్నీ కూలిపోయి, శివునివైపుగా పయనించడం వల్ల, మళ్ళీ అయిదు కళలౌతున్నాయి.

ఈ విధముగా, మొత్తము కళలు ముప్పది అయిదు అవుతున్నాయి. అన్ని కంచుకములు, తెరలు తొలగిపోయినది, శివతత్త్వము. ఇది ముప్పదియారవ కళ. ఎప్పుడిది ఉపదేశింపబడుతుందో, భావింపబడుతుందో, ఆ స్థాయి ముప్పది ఏడవ కళ. దానిలో ఏది ధ్యానింపబడుతుందో, అది ముప్పది ఎనిమిదవ కళ. ఇక ఆపైన, ఏదీ లేదు. దీనిని ధ్యానించడం ద్వారా అంతులేని స్వాతంత్ర్యమును యోగులు అందుకుంటారు. అది కూడా, ముప్పదిఏడవదే అవుతుంది. ముప్పది యారవది అన్ని తత్త్వములను

దాటినందువలన, అన్ని భావములను మించినదైనందువలన, అక్కడివరకే 'పంచకళావిధి' ఉంటుంది.

ఈ క్రింది పట్టికను గమనించండి.

పంచకళావిధి

ప్రమేయము (తెలిసికొనబడునది)	స్థూలము - 5	సూక్ష్మము - 5	10
కరణత్వము (ఇంద్రియములు)	జ్ఞానేంద్రియములు - 5	కర్మేంద్రియములు - 5	10
ఇంద్రియకర్మ తగ్గి, కర్మభావము పెరిగే స్థితులు			5
శుద్ధమైన కర్మభావమున్న స్థితులు			5
ఇవన్నియు శివునివైపు ప్రయాణించడం			5
శివతత్త్వము			1
మొత్తము			36 కళలు

విజ్ఞానాకల పర్యన్తము 'ఆత్మకళ' ఉంటుంది. అక్కడనుండి ఈశాన్తము వరకు 'విద్యాకళ' ఉంటుంది. మిగిలినది 'శివకళ' - ఈ విధముగా భావించడాన్ని 'త్రి - తత్త్వవిధి' అంటారు. ఇదే విధముగా నవతత్త్వములను కూడా ఊహించాలి.

ప్రకృతి, పురుషుడు, నియతి, కళ, మాయ, విద్య, ఈశ్వరుడు, సదాశివుడు, శివుడు - ఇవి నవతత్త్వములు.

షడధ్వ విధి

ప్రమేయము (జ్ఞేయము), స్థూల - సూక్ష్మ - పరములనే మూడు రూపములతో, భువన - తత్త్వ - కళలనే అధ్వభేదములుగా ఉన్నది. ప్రమాతలో లీనమైనప్పుడు కూడా, ఇదే విధముగా మూడువిధములుగా ఉంటుంది. ప్రమాణముగా ఉన్నపుడు పదమనే అధ్వమౌతున్నది. ప్రమాణము యొక్క క్షోభతరంగములు శాంతించినపుడు, మన్త్రాధ్వమౌతున్నది. అదికూడా ఉపశమించగా, పూర్ణప్రమాతృత కలిగినప్పుడు వర్ణాధ్వమౌతున్నది. అదికూడా, తనలోనే విశ్రాంతిని పొందినప్పుడు ఏకమౌతున్నది, ఈ విధముగా, ఒక్కటే, ఆరు విధములైన అధ్వములుగా ఉన్నదని చెప్పుట సరియనవచ్చును.

మన ఇంద్రియముల ద్వారా, సృష్టి మనకు అనుభూతిలోనికి వచ్చుచున్నది. సృష్టి యనగా ప్రమేయము, అనగా తెలిసికొనబడునది. దీని యొక్క స్థూలమైన రూపము, భువనములు. అనగా లోకములు. ఇవి 118 యై ఉన్నాయి. సూక్ష్మరూపము తత్త్వములు. భువనములన్నీ తత్త్వములతో నిండియున్నాయి. ఇవి 36. దీని పరారూపము కళలు. తత్త్వములు కళలతో నిండియున్నాయి. ఇవి 5. ఆ వివరమంతా పైన ఇవ్వబడింది.

ప్రమాణమంటే, తెలియబడే ప్రక్రియ. భువనము, తత్త్వము, కళలనేవి పదములుగానే మనకు తెలియవస్తాయి. కనుక, ఇవన్నియూ పదములుగా కుదించబడతాయి. ఈ ప్రక్రియ యొక్క క్షోభ లేదా కల్లోలము శాంతించినపుడు, పదమనేది మంత్రముగా అణగిపోతుంది. మంత్రము కూడా శాంతించినపుడు వర్ణమౌతున్నది. వర్ణము కూడా తనలో తానై అణగినపుడు, శివాత్మకమై, ఏకరూపమును ధరిస్తున్నది. ఈ

విధముగా, షడధ్వములూ క్రమేణా ఒకదానిలో మరొకటి కరగిపోతూ, చివరకు శివస్వరూపమును పొందుతాయి. ఇది షడధ్వముల ధ్యానప్రక్రియయై ఉన్నది.

పదమన్త్రవర్ణమేకం పురషోడశకం ధరేతి చ నివృత్తిః

కం|| పదవర్ణమంత్ర మొక్కటి
పదపడి పదునారు లోక పదములు ధరలో
నదమౌ నివృతి వీనిన్
పదముగ యన్యాక్షరమది బరగును గాదే !

ఆ|| వరగి యొక్కటౌను పదమంత్ర వర్ణంబు
పట్టి పురములెంచ పదియు నారు
మరలిపోవు కతన మరియంద్రు భువియంచు
కళగ నివృతమ్ము గలుగు నిచట

పదము, మంత్రము, వర్ణములు ఒక్కొక్కటిగా ఉన్నాయి. పురములు (లోకములు, భువనములు) పదహారుగా ఉన్నాయి. భూతత్త్వములో నివృత్తికళ ఉన్నదని చెప్పినారు కదా! దాని వర్ణము 'క్ష'. తత్త్వములలో భూమి చివరిది, అక్షరములలో క్షకారము చివరిది. కనుక భూతత్త్వమునకు ఇది సూచకమౌతున్నది.

తత్త్వార్ణమగ్నినయనం రస-శర-పుర-మంత్ర-మన్త్రపదమన్యా

తత్త్వార్ణమగ్నినయనం - అగ్నులు మూడు, నయనములు రెండు. కనుక, జలతత్త్వమునుండి ప్రకృతి తత్త్వమువరకూ ఇరువదిమూడు తత్త్వములున్నాయి.

రస, శర, పుర; మంత్ర, మంత్రపదమన్యా -

రసములు (షడ్రుచులు) 6, శరములు (పంచబాణములు) 5, కనుక పురముల సంఖ్య 56 అవుతున్నది. మంత్రములు 5, పదములు 5 అవుతున్నాయి. వీటిలో ఉన్న కళ పేరు అప్యాయని, దీనికే మరియొక పేరు 'ప్రతిష్ఠ' అనబడుతుంది.

కం|| ఇరువది మూడగు మెట్లై
అరువదిలో నాలుగణగ యమరున్ పురముల్
మరియైదౌ మంత్ర పదము
లరయగ యాప్యాయని యని యందురు కళనే

ఆ|| ఐదు నాళ్ళ మూళ్లు; యగువర్ణ తత్త్వముల్
పురము లేబదారు; పుణికిజూడ
మంత్ర పదములారు మరియైదు జూడంగ

తిష్ఠమౌను కళయు తీరుగాను

మునితత్త్వార్ణం ద్వికపదమంత్రం వస్వక్షి భువనమపరకలా -

ఆ// వర్ణతత్త్వతతులు వరుసగా ఏడేడు
ఎంచ పురము లిరువ దెనిమిదౌను
మంత్రపదములౌను మరి రెండు రెండ్లుగా
అపర కళగ దీని ననగవచ్చు

మునులు ఏడుగురు (సప్తఋషులు) గనుక మునితత్త్వములంటే 7 తత్త్వములు. కనుక, పురుషుని నుండి మాయవరకూ ఉన్నవి 7 తత్త్వములు. వర్ణములు కూడా ఏడే. పదములు, మంత్రములు 2 గా ఉన్నాయి. వసువులు (అష్టవసువులు) 8 మంది, అక్షులు (కన్నులు) 2, కనుక భువనములు 28 అవుతున్నాయి. అపర కళ.

అగ్న్యర్ణతత్త్వమేకక పదమన్త్రం సైన్యభువనమితి తుర్యా -

అగ్నులు మూడు గనుక తత్త్వములు, వర్ణములు మూడు. మంత్రము పదములు ఒక్కొక్కటి, సైన్యమంటే పద్దెనిమిది అక్షౌహిణులు గనుక, 18 భువనములు - ఇవన్నీ తుర్యకళతో నిండి ఉంటాయి.

ఆ// తత్త్వ వర్ణతతుల దలచగా మూడౌను
పరగ పురములొకటి పదియు నేడు
ఒక్కటౌను పదము నోపగా మంత్రమ్ము
తుర్యకళను బట్టి దూలునిన్ని

షోడశ వర్ణాః పదమన్త్ర - తత్త్వమేకం చ శాన్త్యతీతేయమ్
అభినవగుప్తేనార్యా - త్రయముక్తం సంగ్రహాయ శిష్యేభ్యః

వర్ణములు 16, పదము, మంత్రము, తత్త్వములు ఒక్కొక్కటి. వీటిలో శాంత్యతీతకళ నిండి ఉంటుంది.

ఆ// వర్ణతతులనెంచ వానిగా పదునాఱు
మంత్రపదము లౌను మరియు నొకటి
భువనమేకమగుచు భూరిరూపము నందు
శాంత్యతీత కళను చక్కదాల్చి

ఈ విధముగా, ఆర్యచందస్సులోని ఈ మూడుశ్లోకములు శిష్యులకొరకై అభినవగుప్తునిచే సంగ్రహముగా చెప్పబడినవి.

ఈ క్రింది పట్టికను గమనిస్తే తేలికగా అర్థమౌతుంది.

షడధ్వములు (ఆరు అధ్వములు లేదా మార్గములు)

తత్త్వము	వర్ణము	భువనము	మంత్రము	పదము	కళ
పృథివి	1 (క్ష)	16	1	1	నివృత్తి
జలము (జలము నుండి ప్రకృతి వరకు)	23 (ట నుంచి హ వరకు 23 వర్ణములు)	56	6	5	ప్రతిష్ఠా
పురుషుని నుండి మాయ వరకు	7 (ఘ నుంచి ఞ వరకు)	28	2	2	విద్యా (అపర) కళ
శుద్ధవిద్య, ఈశ్వర, సదాశివ	3 (క, ఖ, గ)	18	1	1	శాంత (తురీయ) కళ
శివుడు	16 (అచ్చులు)	1	1	1	శాంత్యతీత (తురీయాతీత) కళ
మొత్తము	50	118	11	10	5

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే కలాద్యధ్వప్రకాశనం నామ దశమమాహ్నికమ్ ‖ 10 ‖

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని కలాద్యధ్వ ప్రకాశనమనే పదవ ఆహ్నికము.

పదకొండవ ఆహ్నికము

శక్తిపాత ప్రకాశనము

యదార్థః - యదార్థము

తత్ర యావత్ ఇదమ్ ఉక్తమ్ తత్ సాక్షాత్ కస్యచిత్ అపవర్గాప్తయే యథోక్తసంగ్రహణీత్యా భవతి, కస్యచిత్ వక్ష్యమాణదీక్షాయామ్ ఉపయోగగమనాత్ ఇతి దీక్షాదికం వక్తవ్యమ్ । తత్ర కః అధికారీ ఇతి నిరూపణార్థం శక్తిపాతో విచార్యతే।

ఇప్పటివరకూ చెప్పబడినట్టిదంతయు, మోక్షప్రాప్తికొరకు సంగ్రహరూపంలో ఉపయోగిస్తుంది. ఇంతకుముందు దీక్షలగురించి ప్రస్తావన వచ్చింది గనుక, ఇప్పుడు దీక్షల గురించి చెప్పబడుచున్నది. వీటికెవరు అధికారి?యని నిరూపించడం కోసం శక్తిపాతమును విచారించాలి.

తత్ర కేచిత్ ఆహుః జ్ఞానాభావాత్ అజ్ఞానమూలః సంసారః తదపగమే జ్ఞానోదయాత్ శక్తిపాత ఇతి తేషాం సమ్యక్ జ్ఞానోదయ ఏవ కింకృత ఇతి వాచ్యమ్, కర్మజన్యత్వే కర్మఫలవత్ భోగత్వప్రసక్తే భోగిని చ శక్తిపాతాభ్యుపగతౌ అతిప్రసక్తిః, ఈశ్వరేచ్ఛానిమిత్తత్వే తు జ్ఞానోదయస్య అన్యోన్యాశ్రయతా నైయర్థ్యం చ, ఈశ్వరే రాగాదిప్రసక్తిః, విరుద్ధయోః కర్మణోః సమబలయోః అన్యోన్యప్రతిబన్ధే కర్మసామ్యం, తతః శక్తిపాత ఇతి చేత్, న-క్రమికత్వే విరోధాయోగాత్, విరోధేఽపి అన్యస్య అవిరుద్ధస్య కర్మణో భోగదానప్రసక్తాత్, అవిరుద్ధకర్మాప్రవృత్తౌ తదైవ దేహపాతప్రసక్తాత్, జాత్యాయుష్ప్రదం కర్మ న ప్రతిబధ్యతే భోగప్రదమేవ తు ప్రతిబధ్యతే ఇతి చేత్, కుతః -తత్కర్మసద్భావే యది శక్తిః పతేత్ తర్హి సా భోగప్రదాత్ కిం బిభియాత్ । అథ మలపరిపాకే శక్తిపాతః సోఽపి కింస్వరూపః? కిం చ తస్య నిమిత్తమ్? ఇతి, ఏతేన వైరాగ్యం ధర్మవిశేషో వివేకః సత్సేవా సత్ప్రాప్తిః దేవపూజా ఇత్యాదిహేతుః ప్రత్యుక్త ఇతి భేదవాదినాం సర్వమ్ అసమఞ్జసమ్ ।

దీనివిషయమై కొందరి ప్రకారము - జ్ఞానము లేకపోవడం వలన అజ్ఞానమూలకమైన సంసారమున్నది, అది తొలగినప్పుడు, జ్ఞానోదయం అయినప్పుడు, శక్తిపాతము సంభవిస్తుంది. వీరు, సమ్యక్ జ్ఞానోదయము ఏ విధముగా లభిస్తుందో చెప్పవలసి వస్తుంది. కర్మవల్ల అవుతుందంటే, దానివల్ల కర్మఫలము కలుగుతుంది, భోగత్వ ప్రసంగమౌతుంది. భోగులకు శక్తిపాతమన్నది అతిప్రసంగము. ఈశ్వరేచ్ఛానిమిత్తముగా జ్ఞానోదయమౌతుందంటే అన్యోన్యాశ్రయత వలన విరుద్ధమైన అర్థం వస్తుంది. ఈశ్వరునిలో రాగాదిదోషముల ప్రసక్తము కలుగుతుంది. పోనీ, విరుద్ధములైన రెండుకర్మలు సమబలములైనవి అన్యోన్యప్రతిబంధకములైనప్పుడు కర్మసామ్యమౌతుంది, అదే శక్తిపాతమని అనేవారికి, విరోధాయోగమువలన అలా జరుగదని సమాధానమౌతుంది. పోనీ, విరోధములైనప్పటికీ, అన్యములైన అవిరుద్ధమైన కర్మలలో భోగదానప్రసంగమువలన అలా జరుగదని సూచితము.

అవిరుద్ధకర్మప్రవృత్తి లేనప్పుడు అక్కడే దేహపాత ప్రసంగముదయిస్తుంది. జాతిని ఆయుష్షుని ఇచ్చే కర్మ బంధించదు, భోగప్రదమైనదే బంధిస్తుందని అంటే, అదెట్లు? అయా కర్మసద్భావములోనే శక్తిపాతము జరుగుతుందని అంటే, భోగప్రదమైన దానిపట్ల దానికి భయమేమున్నది? మలపరిపాకము వల్లనే

శక్తిపాతమంటే, దాని స్వరూపమేమి? దాని నిమిత్తమేమి? దీనివల్ల వైరాగ్యము, ధర్మవిశేషము, వివేకము, సత్సేవ, సత్ప్రాప్తి, దేవపూజ ఇవన్నీ హేతువులని అనడం సరికాదు, కనుక, ఇన్ని భేదవాదములూ అసమంజసములౌతున్నవి. స్వతన్త్ర పరమేశాద్వయవాదమున ఇవన్నీ ఉపయోగపడవు.

స్వతన్త్రపరమేశాద్వయవాదే తు ఉపపద్యతే ఏతత్. యథాహి - పరమేశ్వరః స్వరూపాచ్ఛాదనక్రీడయా పశుః పుద్గలోఽణుః సంపన్నః, న చ తస్య దేశకాలస్వరూపభేదవిరోధః తద్వత్ స్వరూపస్థగనవినివృత్త్యా స్వరూపప్రత్యాపత్తిం ఝటితి వా క్రమేణ వా సమాశ్రయన్ శక్తిపాతపాత్రమ్ అణుః ఉచ్యతే, స్వాతన్త్ర్యమాత్రసారశ్చ అసౌ పరమశివః శక్తే పాతాయితా ఇతి నిరపేక్ష ఏవ శక్తిపాతో యః స్వరూపప్రథాఫలః, యస్తు భోగోత్సుకస్య స కర్మాపేక్షః, లోకోత్తరరూపభోగోత్సుకస్య తు స ఏవ శక్తిపాతః పరమేశ్వరేచ్ఛాప్రేరితమాయాగర్భాధికారీయరుద్రవిష్ణుబ్రహ్మాదిద్వారేణ, మన్త్రాదిరూప త్వం మాయాపుంవివేకం పుంస్కలావివేకం పుంప్రకృతివివేకం పుంబుద్ధివివేకమన్తచ్చ ఫలం ప్రస్నువానః తదధరతత్త్వభోగం ప్రతిబధ్నాతి, భోగమోక్షోభయోత్సుకస్య భోగే కర్మాపేక్షో, మోక్షే తు తన్నిరపేక్షః ఇతి సాపేక్షనిరపేక్షః । న చవాచ్యం - కస్మాత్ కస్మింశ్చిదేవ పుంసి శక్తిపాత ఇతి, స ఏవ పరమేశ్వరః తథా భాతి ఇతి సతత్త్వే కోఽసౌ పుమాన్ నామ యదుద్దేశేన విషయకృతా చోదనా ఇఅయమ్ ।

ఏ విధముగానైతే పరమేశ్వరుడు స్వరూపాచ్ఛాదనక్రీడగా పశువు, పుద్గలము, అణువు, అగుచున్నాడో, ఆయనలో దేశ-కాల-స్వరూప-భేద-విరోధములు లేవో, అదేవిధముగా, ఆ స్వరూపము యొక్క స్థగన వినివృత్తి ద్వారా, స్వరూప ప్రత్యాపత్తిని అకస్మాత్తుగా గాని, క్రమముగా గాని పొందునపుడు, ఆ అణువుకు శక్తిపాతమౌతుందని చెప్పబడినది. స్వాతన్త్ర్యమాత్ర సారభూతుడైన పరమశివుడే శక్తిపాతమును చేసేవాడు. కనుక శక్తిపాతము నిరపేక్షము. దాని ఫలితము స్వరూపప్రథ. ఎవడైతే భోగోత్సుకుడో వానిలో కర్మాపేక్షపరంగా ఇది ఉంటుంది. లోకోత్తరరూప భోగోత్సుకులలో అయితే, పరమేశ్వరేచ్ఛాప్రేరిత మాయాగర్భాధికారులైన రుద్ర-విష్ణు-బ్రహ్మాదులద్వారా కలిగిస్తుంది. మన్త్రాదిరూపములు ప్రాప్తించుట, మాయాపుంవివేకము, పుంస్కలావివేకము, పుంప్రకృతివివేకము, పుంబుద్ధివివేకము వంటి ఫలములను అది కలిగిస్తుంది. వాటి క్రిందనున్న తత్త్వభోగములను బంధిస్తుంది. భోగము మోక్షము రెండింటినీ కోరుకునేవారిలో భోగులకు కర్మాపేక్షను, మోక్షకాములకు దాని నిరపేక్షను కలిగిస్తుంది. కనుక ఇది సాపేక్షము, నిరపేక్షము కూడా. ఇలా కూడా అనకూడదు - ఎక్కడో ఒక జీవునిపైన శక్తిపాతము పడుతుందని. పరమేశ్వరుడే ఆ విధముగా భాసిస్తున్నాడనినప్పుడు, ఒక పురుషునినుద్దేశించి ఈ చోదన కలుగుతుందని ఎలా చెప్పడం?

స చాయం శక్తిపాతో నవధా, - తీవ్ర-మధ్య-మన్దస్య ఉత్కర్ష-మాధ్యస్థ్య-నికర్షైః పునస్త్రైవిధ్యాత్, తత్ర ఉత్కృష్టతీవ్రాత్ తదైవ దేహపాతే పరమేశతా, మధ్యతీవ్రాత్ శాస్త్రాచార్యానపేక్షిణః స్వప్రత్యయస్య ప్రాతిభజ్ఞానోదయః యదుదయే బాహ్యసంస్కారం వినైవ భోగాపవర్గప్రదః ప్రతిభో గురురిత్యుచ్యతే తస్య హి న సమయ్యాదికల్పనా కాచిత్, అత్రాపి తారతమ్యసద్భావః-ఇచ్ఛావైచిత్ర్యాత్ ఇతి, సత్యపి ప్రాతిభత్వే శాస్త్రాద్యపేక్షా సంవాదాయ స్యాదపి, ఇతి నిర్ఘృత్తిసభత్ర్యాదిబహుభేదత్వమ్ ఆచార్యస్య ప్రాతిభస్యాగమేషు ఉక్తమ్, సర్వథా ప్రతిభాంశో బలీయాన్ - తత్సంనిధౌ అన్యేషమ్ అనధికారాత్ । భేదదర్శన ఇత్ అనాదిశివసంనిధౌ ముక్తశివానాం సృష్టిలయాదికృత్యేషు మన్దతీవ్రాత్ శక్తిపాతాత్ సద్గురువిషయా యియాసా భవతి, అసద్గురు విషయాయాం తు తిరోభావ ఏవ, అసద్గురుతస్తు సద్గురుగమనం శక్తిపాతాదేవ ।

శక్తిపాతము తొమ్మిదివిధములని చెప్పబడినది. తీవ్ర-మధ్య-మన్ద భేదములతో ఉత్కర్ష-మధ్యస్థ-నికృష్టములనబడే మూడు విధములుగా ఇది ఉంటుంది. వీనిలో, ఉత్కృష్టతీవ్రము వలన అక్షణమే దేహపాతమౌతుంది, పరమేశత ప్రాప్తిస్తుంది. మధ్యస్థతీవ్రము వలన, శాస్త్రము, ఆచార్యుల సహాయము లేకుండానే, స్వయముగా, ప్రతిభాజ్ఞానోదయమౌతుంది. అది ఉదయించినప్పుడు, బాహ్యాసంస్కారములు లేకుండానే, భోగమోక్షములనిచ్చే ప్రతిభాగురువని చెప్పబడతాడు. అటువంటి యోగికి సమయపరములైన విధులుండవు. అయినప్పటికీ, వారిలోకూడా, ఇచ్ఛావైచిత్ర్యముచేత తారతమ్యసద్భావముంటుంది. ప్రాతిభత్వమువలన శాస్త్రాద్యపేక్ష ఉంటుంది. నిర్భిత్తి, సభిత్తి మొదలుగాగల బహుభేదములుగా అట్టి ఆచార్యుని ప్రతిభ ఆగమములలో చెప్పబడినది. సర్వధా ప్రతిభాంశము బలీయమైనది. అతని సన్నిధిలో ఇతరులకు అధికారములు లేవు. ఇతర దర్శనముల ప్రకారము, అనాది శివసన్నిధిలో, ముక్తశివులకు సృష్టి - స్థితి - లయాది- కార్యముల శక్తులు లేనట్లు. మన్దతీవ్ర శక్తిపాతములో సద్గురువిషయములలో అభిలాష కలుగుతుంది, అసద్గురు విషయములలో తిరోభావము. అసద్గురువులనుండి శక్తిపాతము ద్వారా సద్గురుగమనం కలుగుతుంది.

సద్గురుస్తు సమస్తైతచ్ఛాస్త్రతత్త్వజ్ఞానపూర్ణః సాక్షాత్ భగవద్భైరవభట్టారక ఏవ, యోగినోఽపి స్వభ్యస్తజ్ఞానతయైవ మోచకత్వే తత్ర యోగ్యత్వస్య సౌభాగ్యలావణ్యాదిమత్త్వస్యేవానుపయోగాత్ | అసద్గురుస్తు అన్యః సర్వ ఏవ |

సద్గురువంటే ఈ సమస్త శాస్త్రతత్త్వముల పూర్ణజ్ఞానము కలిగిన సాక్షాత్ భగవద్భైరవభట్టారకుడే. యోగులుకూడా అభ్యస్తజ్ఞానము వలననే మోక్షమును పొందుతారు. వారి యోగ్యతలో సౌభాగ్యము, లావణ్యము మొదలైనవి అనుపయోగములు. మిగతా సర్వమూ అసద్గురువులలో ఉంటుంది.

ఏవం యియాసుః గురోః జ్ఞానలక్షణాం దీక్షాం ప్రాప్నోతి యయా సద్య ఏవ ముక్తో భవతి జీవన్నపి, అత్ర అవలోకనాత్ కథనాత్ శాస్త్రసంబోధనాత్ చర్యాదర్శనాత్ చరుదానాత్ ఇత్యాదయో భేదాః | అభ్యాసవతో వా తదానీం సద్య ఏవ ప్రాణవియోజికాం దీక్షాం లభతే, సా తు మరణక్షణ ఏవ కార్యా ఇతి వక్ష్యామ్ ఇతి |

ఇటువంటి జ్ఞానలక్షణములు కలిగిన గురువు ద్వారా ఎవరైతే దీక్షను పొందుతారో వారు సద్యముక్తులవుతారు లేదా జీవన్ముక్తులౌతారు. అవలోకనము ద్వారా, కథనము ద్వారా, శాస్త్రసంబోధన ద్వారా, చర్యాదర్శనము ద్వారా, చరుదానము ద్వారా ఇట్లా చాలా భేదములున్నవి. అభ్యాసవంతునికి ఆ క్షణమే ప్రాణవియోజిక దీక్ష లభిస్తుంది. దానిని మరణసమయంలో మాత్రమే ఇవ్వవలెను. దాని వివరమును మున్ముందు చెబుతాను.

తీవ్రస్త్రిధా ఉత్కృష్టమధ్యాత్ శక్తిపాతాత్ కృతదీక్షాకోఽపి స్వాత్మనః శివతాయాం న తథా దృఢప్రతిపత్తిః భవతి, ప్రతిపత్తిపరిపాకక్రమేణ తు దేహాన్తే శివ ఏవ, మధ్యమధ్యాత్ తు శివతోత్సుకోఽపి భోగప్రేప్సుః భవతి ఇతి తథైవ దీక్షాయాం జ్ఞానభాజనమ్, స చ యోగాభ్యాసలబ్ధామ్ అనేనైవ దేహేన భోగం భుక్త్వా దేహాన్తే శివ ఏవ | నికృష్టమధ్యాత్తు దేహాన్తరేణ భోగం భుక్త్వా శివత్వమ్ ఏతి, ఇతి | మధ్యస్తు త్రిధా-భోగోత్సుకతా యదా ప్రధానభూతా తదా మన్త్రత్వం-పారమేశ్వరమన్త్రయోగోపయతయా యతస్తత్ర ఔత్సుక్యమ్, పారమేశ మన్త్రయోగాదేశ్చ యతో మోక్షపర్యన్తత్వమ్ అతః శక్తిపాతరూపతా | తత్రాపి తారతమ్యాత్ త్రైవిధ్యమ్, ఇత్యేష

ముఖ్యః శక్తిపాతః ।

ఈ విధముగా, తీవ్రమైన దీక్ష మూడు విధములు. ఉత్కృష్టమధ్య శక్తిపాతదీక్షను పొందినవానికి, ఎవరికైతే, ఆత్మలో శివత్వ దృఢప్రతిపత్తి కలుగదో, అతడు కూడా ప్రతిపత్తి పరిపాకక్రమములో దేహాంతములో శివుడే అవుతాడు. మధ్యమధ్యదీక్షలో శివత్వభావోత్సుకుడైనప్పటికీ భోగకాంక్ష ఉన్నట్లయితే అతనికి కూడా దీక్ష వల్ల జ్ఞానము లభిస్తుంది. యోగాభ్యాసలబ్ధమైన దేహముతో భోగములను అనుభవించి దేహాంతములో శివుడే అవుతాడు. నికృష్టమధ్య దీక్షలో మరణం తర్వాత ఇంకొక జన్మలో భోగములననుభవించి చివరలో శివత్వమును పొందుతాడు. ఈ విధముగా, మధ్యమదీక్ష కూడా మూడు విధములు. ఎవరిలో భోగోత్సుకత ఎక్కువగా ఉంటుందో అది మందము. పరమేశ్వర మన్త్రయోగము వల్లనే అతనిలో ఉత్సుకత కలుగుతుంది. పరమేశమన్త్రయోగము వలన అతనికి మోక్షము కలిగే విధంగా ఆ శక్తిపాతముంటుంది. దానిలో కూడా మూడు విధములైన తారతమ్యములుంటాయి. ఇవి ముఖ్యములైన మూడు శక్తిపాతములు.

వైష్ణవాదీనాం తు రాజానుగ్రహవత్ న మోక్షాన్తతా ఇతి న ఇహ వివేచనమ్ । శివశక్త్యధిష్ఠానం తు సర్వత్ర ఇతి ఉక్తమ్, సా పరం జ్యేష్ఠా న భవతి అపి తు ఘోరా ఘోరతరా వా, స ఏష శక్తిపాతో విచిత్రోఽపి తారతమ్యాదిచిత్ర్యాత్ భిద్యతే, క్వచిత్ వైష్ణవాదిస్థః సమయ్యాదిక్రమేణ స్రోతఃపఞ్చకే చ ప్రాప్తపరిపాకః సర్వోత్తీర్ణభగవత్షడర్ధశాస్త్రపరమాధికారితామ్ ఏతి, అన్యస్తు ఉల్లఙ్ఘనక్రమేణ అనన్తభేదేన, కోఽపి అక్రమమ్ ఇతి అత ఏవ అధరాధరశాసనస్థా గురవోఽపి ఇహ మణ్డలమాత్రదర్శనేఽపి అనాధికారిణః, ఊర్ధ్వశాసనస్థస్తు గురుః అధరాధరశాసనం ప్రత్యుత ప్రాణయతి - పూర్ణత్వాత్ ఇతి సర్వాధికారీ । స చ దైశికో గురుః ఆచార్యో దీక్షకః చిమ్బకః, స చాయం పూర్ణజ్ఞాన ఏవ సర్వోత్తమః - తేన వినా దీక్షాద్యసంపత్తేః ।

వైష్ణవదీక్షలు రాజానుగ్రహము వంటివి, వాటి గమ్యము మోక్షం కాదు. కనుక వాటిని వివరించడం లేదు. అన్ని దీక్షలలోను శివశక్త్యధిష్ఠానముంటుంది. అది పరము, జ్యేష్ఠము కాదు గాని, ఘోరము, ఘోరతరము అవుతుంది. ఈ విధముగా శక్తిపాతము విచిత్రమైన తారతమ్యభేదములతో ఉంటుంది. వైష్ణవదీక్షలలో సమయాది క్రమములో స్రోతపంచక శాస్త్రములలో లభించిన పరిపాకముతో, అన్నింటినీ మించినట్టి త్రికశాస్త్ర పరమాధికారముగా పరిణమిస్తుంది. అన్యమైనది అనన్తభేదములతో, కొన్నింటిని వదలి దూకుతూ, ఏదో ఒక మార్గంలో పరమార్థమును పొందుతుంది. ఇతరశాస్త్రములలో చెప్పబడిన గురువులు ఈ మండలముల దర్శనమునకు కూడా అధికారులు కారు. ఊర్ధ్వశాసనములలో ఉన్న గురువులు క్రిందివారికి శాసకులౌతారు. పూర్ణత్వమువలన వారు సర్వాధికారులవుతారు. వీరు దేశిక, గురు, ఆచార్య, దీక్షక, చుంబకులనేవారు. వారందరిలో పూర్ణజ్ఞానియే సర్వోత్తముడు. అతడుగాక, దీక్షకు పూర్ణత్వము లేదు.

యోగీ తు ఫలోత్సుకస్య యుక్తో యది ఉపాయోపదేశేన అవ్యవహితమేవ ఫలం దాతుం శక్తః ఉపాయోపదేశేన తు జ్ఞానే ఏవ యుక్తో మోక్షేఽపి అభ్యుపాయాత్ జ్ఞానపూర్ణతాకాఙ్క్షీ చ బహూనపి గురూన్ కుర్యాత్ । ఉత్తమోత్తమాదిజ్ఞానభేదాపేక్షయా తేషు తు వర్తేత, సంపూర్ణజ్ఞానగురుత్యాగే తు ప్రాయశ్చిత్తమేవ । నను సోఽపి అబ్రువన్ విపరీతం వా బ్రువన్ కిం న త్యాజ్యః, నైవ ఇతి బ్రూమః, తస్య హి పూర్ణజ్ఞానత్వాత్ ఏవ రాగాద్యభావ ఇతి అవచనాదికం శిష్యగతేనైవ కేనాచిత్ అయోగ్యత్వానాశ్వస్తత్వాదినా నిమిత్తేన స్యాత్ ఇతి, తదుపాసనే యతనీయం శిష్యేణ, న తత్త్యాగే । ఏవమ్ అనుగ్రహనిమిత్తం శక్తిపాతో నిరపేక్ష ఏవకర్మాదినియత్యపేక్షణాత్ ।

ఫలోత్సుకులైనవారికి యుక్తమైన ఉపాయమును ఉపదేశించడం ద్వారా యోగులు అవ్యవహిత ఫలములను ఇవ్వగల శక్తిని కలిగి ఉంటారు. మోక్షమును కూడా ఇవ్వగలరు. జ్ఞానపూర్ణతను కోరువాడు బహుగురువులను సేవించవచ్చు. ఉత్తమోత్తమాది జ్ఞానభేదములను కోరేవాడు ఆ విధముగా చేయవచ్చును. సంపూర్ణజ్ఞానము కలిగిన గురువును వదలడం ప్రాయశ్చిత్తమౌతుంది. చెప్పనివారిని, విపరీతముగా చెప్పువారిని కూడా వదలకూడదా? అంటే, కూడదని చెబుతాము. అతనిలో పూర్ణజ్ఞానము వలన రాగాదులుండవు. అతడు ఉపదేశించకపోవడం, శిష్యునిలో ఉన్న అయోగ్యత, విశ్వాసలేమి మొదలైన కారణములవల్ల కావచ్చు. కనుక ఆ ఉపాసననే శిష్యుడు చేయవలెను గాని, గురువును వదలకూడదు. ఈ విధముగా శక్తిపాతమన్నది అనుగ్రహనిమిత్తమై, నిరపేక్షమై ఉన్నది.

తిరోభావ ఇతి, తిరోభావో హి కర్మాద్యపేక్షగాఢదుఃఖమోహభాగిత్వఫలః, యథాహి - ప్రకాశస్వాతన్త్ర్యాత్ ప్రబుద్ధోఽపి మూఢవత్ చేష్టతే హృదయేన చ మూఢచేష్టాం నిన్దతి, తథా మూఢోపి ప్రబుద్ధచేష్టాం మన్త్రారాధనాదికాం కుర్యాత్, నిన్దేచ్చ, యథా చ అస్య మూఢచేష్టా క్రియమాణాపి ప్రబుద్ధస్య ధ్వంసమ్ ఏతి తథా అస్య ప్రబుద్ధచేష్టా, సా తు నిన్ద్యమానా - నిషిద్ధాచరణరూపత్వాత్ స్వయం చ తథైవ విశఙ్క్యమానత్వాత్ ఏనం దుఃఖమోహపఙ్కే నిమజ్జయతి, న తు ఉత్పన్నశక్తిపాతస్య తిరోభావోఽస్తి, స్తాపి చ కర్మాద్యపేక్షా పూర్వవత్ నిషేధ్యా, తత్రాపి చ ఇచ్ఛావైచిత్ర్యాత్ ఏతద్దేహమాత్రోపభోగ్యదుఃఖఫలత్వం వా దీక్షాసమయచర్యాగురుదేవాజ్ఞ్యాదౌ సేవానిందనోభయప్రసక్తానామివ ప్రాక్ శివశాసనస్థానాం తత్త్యాగినామివ | తత్రాపి ఇచ్ఛావైచిత్ర్యాత్ తిరోభూతోఽపి | తత్రాపి ఇచ్ఛావైచిత్ర్యాత్ తిరోభూతోఽపి స్వయం వా శక్తిపాతేన యుజ్యతే, మృతో వా బంధుగుర్వాదికృపాముఖేన, ఇత్యేవం పఞ్చకృత్యభాగిత్వం స్వాత్మని అనుసందధత్ పరమేశ్వర ఏవ, ఇతి న ఖణ్డితమాత్మానం పశ్యతే |

తిరోభావము నియతితో కూడి ఉంటుంది. తిరోభావము కర్మలయందు అభిమానంతో, గాఢమైన దుఃఖము, మోహము మొదలైనవాటిలో ముంచి, ఆయా ఫలములనిస్తుంది. ఎలాగంటే, ప్రకాశము స్వాతన్త్ర్యములతో ప్రబుద్ధుడైనప్పటికీ, మూఢమానవుని లాగా చేష్టలు చేస్తూ, హృదయములో ఆ మూఢచేష్టలను నిందిస్తాడు. అదే విధముగా మూఢుడైనప్పటికీ, మన్త్రారాధనలు మొదలైన ప్రబుద్ధచేష్టలను చేస్తాడు. నిందిస్తాడు కూడా. ఈ విధముగా ప్రబుద్ధుని మూఢచేష్టలు కొనసాగుచున్నప్పటికీ అవి ధ్వంసములౌతూ ఉంటాయి. ఆ ప్రబుద్ధచేష్టలు నిన్ద్యమానములై, నిషిద్ధాచరణరూపములై స్వయముగా శంకామనస్కుడౌతాడు. అతడిని తిరోభావము దుఃఖ, మోహ, పంకములో పడవేస్తుంది. శక్తిపాతమును పొందినవాడికి ఈ విధమైన తిరోభావముండదు. ఇతనిలో కూడా కర్మలయందపేక్ష ముందువలెనే నిషిద్ధమైనప్పటికీ, దానిలోకూడా ఇచ్ఛావైచిత్ర్యము వలన, ఆ దేహమున్నంతవరకు దుఃఖము మొదలైన ఫలితములను పొందటమే అవుతుంది. లేదా, దీక్షాసమయమున చేయు సాధనలు, గురువు, దైవము, అగ్ని మొదలైనవారి సేవ, నింద రెండునూ చేయువానివలె. మొదట్లో శివశాసనములో ఉన్నప్పటికీ తరువాత త్యజించువాని లాగా. అటువంటివారిలో కూడా, తిరోభూతుడైనప్పటికీ, పరమేశ్వరుని ఇచ్ఛావైచిత్ర్యము వలన, శక్తిపాతము కలుగుతుంది. మృతుడైనప్పటికీ బంధువులు, గురువులు మొదలైనవారి కృపవలన కలుగుతుంది. ఈ విధముగా పంచకృత్యములను తన ఆత్మలో అనుసంధానము చేయువాడు పరమేశ్వరుడే అగుచున్నాడు. తననుతాను ఖండితుడైన ఆత్మగా అనుకోకూడదు.

శ్లో|| యథా నిరర్గలస్వాత్మస్వాతన్త్ర్యాత్పరమేశ్వరః |
ఆచ్ఛాదయేన్నిజం ధామ తథా వివృణుయాదపి ||
అప్రబుద్ధేఽపి వా ధామ్ని స్వస్మిన్బుద్ధవదాచరేత్ |
భూయో బుధ్యేత్ వా సోఽయం శక్తిపాతోఽనపేక్షకః ||

అర్గలము లేని ఆత్మయై స్వతంత్రుడైన పరమేశ్వరుడు తనను తాను కప్పుకొని మళ్ళీ నిజరూపమును ధరిస్తాడు. ఆ స్థితిలో అప్రబుద్ధుడైనప్పటికీ, బుద్ధునివలె ఆచరిస్తాడు. మరలా బుద్ధుడే అవుతాడు. ఈ విధముగా శక్తిపాతమన్నది, దేనిపైనా ఆధారపడనిదై ఉన్నది.

వ్యాఖ్యానము

ఇంతకు ముందరి అధ్యాయములలో చెప్పబడినదంతా కూడా, జీవుడు మోక్షప్రాప్తిని పొందటం కోసం చేసే సాధనమార్గంలో కొందరికి మాత్రమే ఉపయోగిస్తుంది. ఎందుకంటే, ఒకేవిధమైన ధ్యాననిష్ఠ అందరికీ ఒకేసారిగా కుదరదు. కొందరికి అకస్మాత్తుగా ఇది లభించగా, మరికొందరిలో అయితే, క్రమపద్ధతిలో మెట్టుమెట్టుగా సాధన చేయవలసిన అగత్యం ఉంటుంది. ఇదంతా, వారివారిలోని మలముల తీవ్రతను బట్టి, వారికున్న భోగకాంక్షల యొక్క తీవ్రతను బట్టి జరుగుతుంది. మలములంటే మానసిక, ప్రాణిక శారీరకములైన దోషములు. వాటినిబట్టి, ప్రపంచసుఖములను అనుభవించాలన్న కాంక్షలు మానవునిలో ఉంటాయి. ఈ మలములు, కాంక్షల బలం ఎంత ఎక్కువగా ఉంటుందో, అంతగా సాధన కుంటుపడుతుంది. అవి బలహీనములైనప్పుడు, సాధనాబలం పెరుగుతుంది.

ఇంతకుముందు దీక్షల గురించి ప్రస్తావన వచ్చింది గనుక, ఇప్పుడు దీక్షల గురించి చెప్పబడుచున్నది. ఈ దీక్షలెన్ని రకములు? వీటికెవరు అధికారులు? ఏయే దీక్షలు ఎవరికి సరిపోతాయి? అన్నదానిని నిరూపించడం కోసం, ముందుగా, 'శక్తిపాతము' అనబడే విషయమును విచారించాలి.

శక్తిపాతమంటే, ఈశ్వరుని శక్తి, సాధకునిలోకి దిగివచ్చి పనిచేయడం. ఇది అనేకవిధములుగా జరుగుతుంది.

ఈ విషయములో, రకరకములైన సిద్ధాంతములున్నాయి. ఆయా సిద్ధాంతములను బట్టి, రకరకములైన వాదనలు, అభిప్రాయములు లోకప్రచారంలో ఉన్నాయి. అవి, జ్ఞానవాదము, కర్మవాదము, ఈశ్వరేచ్ఛావాదము మొదలైనవి. వాటిలో, ఒక్కొక్కదానిని విడివిడిగా ఇప్పుడు పరిశీలించడం జరుగుతుంది.

జ్ఞానవాదము

కొందరి వాదనల ప్రకారము - "అజ్ఞానమే సంసారపు యొక్క ఉనికికి కారణమౌతున్నది. అంటే, యదార్థమైన జ్ఞానము లేకపోవడం వలన, అజ్ఞానమూలకమైన సంసారము మనకు గోచరిస్తున్నది. అజ్ఞానము తొలగినప్పుడు, జ్ఞానోదయం అవుతుంది. అప్పుడు శక్తిపాతము సంభవిస్తుంది" అని వీరంటారు.

ఈ వాదనకు సమాధానమేమంటే - ఇట్లా వాదించేవారు - సంపూర్ణ జ్ఞానోదయమనేది ఏ విధముగా

మానవునికి లభిస్తుందో చెప్పవలసి వస్తుంది. అది, కర్మవల్ల లభిస్తుందని వారంటే, కర్మవల్ల, కర్మఫలము తప్పకుండా కలుగుతుంది. కర్మఫలితమున్నపుడు, దానిని అనుభవించడం కూడా ఉంటుంది, అప్పుడు భోగత్వము తప్పకుండా ఉంటుంది. కర్మలలో చిక్కుకుని ఉన్న భోగులకు శక్తిపాతం జరుగుతుందని అనడం హాస్యాస్పదంగా ఉంటుంది. కనుక ఈ వాదము చెల్లదని తేలుతున్నది.

ఈశ్వరేచ్ఛా వాదము

మరికొందరి వాదన ప్రకారము - 'ఈశ్వరేచ్ఛ వలన మానవునకు జ్ఞానోదయమౌతుంది' అంటారు. ఇది కూడా సరియైన వాదన కాదు. ఎలాగంటే, ఈశ్వరుని ఇచ్ఛ, మానవుని జ్ఞానము, ఈ రెంటికీ అవినాభావ సంబంధం ఉన్నదని అనుకుంటే, ఈ సంబంధం వలన వాటికి వ్యతిరేకమైన అర్థం కూడా, వెలుగు వెనుకనే చీకటి ఉన్నట్లుగా, నాణెమునకు రెండువైపులున్నట్లుగా, దాని వెంటనే ఉంటుంది. ఈ వాదనలో ఇంకొక దోషం కూడా ఉన్నది. అదేమంటే, దీనివల్ల, మానవులలో కొందరిపైన ప్రేమ, మరికొందరిపైన ద్వేషమూ, ఈశ్వరునిలో ఉన్నాయనిన అర్థం వస్తుంది. కొందరికి మేలును, మరికొందరికి కీడును, ఈశ్వరుడే కల్పిస్తున్నట్లు అవుతుంది. అప్పుడు ఈశ్వరునితో పక్షపాతం ఉన్నట్లు తేలుతుంది. ఈశ్వరునిలో రాగద్వేషములు ఉండటం సంభవం కాదు గనుక, ఈ వాదన కూడా సమంజసం కాదు.

కర్మ వాదము

మరికొందరి వాదన ప్రకారము - 'విరుద్ధములైన రెండుకర్మలు, సమానబలంతో ఉన్నపుడు, ఒకదానినొకటి ఖండించుకోవడం వల్ల, కర్మలలో సమానత్వం ఏర్పడి, కర్మసామ్యం జరిగి, కర్మశూన్యమై, జ్ఞానోదయం అవుతుంద'ని అంటారు. అదే శక్తిపాతమని వారంటారు.

అంటే, శక్తిపాతంలో ఈశ్వరశక్తి అవతరణం ఉండదని, మన సత్కర్మలు, దుష్కర్మలు రెండూ సమానములైనప్పుడు, అవి ఒకదానినొకటి నాశనం చేసుకున్నప్పుడు, ఏర్పడునట్టి స్థితియే శక్తిపాతమని కొందరి వాదన.

దీనికి సమాధానమేమంటే - కర్మలన్నీ ఒకేసమయంలో, ఒకేసారిగా జరుగవు. అవి ఒకదానివెంట ఒకటిగా, కాలక్రమంలో జరుగుతూ ఉంటాయి గనుక, ఎప్పుడో జరిగిన పూర్వకర్మను, ఇప్పుడు జరిగే ప్రస్తుతకర్మ నాశనం చెయ్యలేదు. ఎందుకంటే, కాలగమనంలో అది ఉన్నచోటు వేరు, ఇది ఉన్నచోటు వేరు. దానిఫలితం వేరు, దీని ఫలితం వేరు. పోనీ, ఒకదానికొకటి విరోధములై, ఒకదానినొకటి ఖండించుకుంటాయని ఒప్పుకున్నప్పటికీ, ఆ విధంగా అన్యోన్య విరోధములు కాని కర్మలేమౌతాయన్న ప్రశ్న ఉదయిస్తుంది. అవి, నాశనం కావు కదా! పైగా, కర్మ ఉన్నంతవరకే జీవితమనినప్పుడు, ఒకదానినొకటి విరోధించుకునే కర్మలు లేకుండా పోయినప్పుడు, జీవితం పరిసమాప్తి అవుతుంది కదా? జీవితమును ముందుకు తీసుకుపోయే కర్మగతి అక్కడ ఉండదు. కనుక వెంటనే మరణం సంభవించాలి. ఇక శక్తిపాతం ఎలా జరుగుతుంది? కనుక ఈ వాదమూ సమంజసం కాదు.

పరిమిత కర్మవాదం

మరికొంతమంది, 'జన్మను, ఆయుష్షుని ఇచ్చే కర్మ మాత్రమే మానవుని బంధించదు, మిగిలిన భోగప్రదమైన కర్మయే అతనిని బంధిస్తుందని' అంటారు. అదెట్లా వీలవుతుంది? మొదటికర్మ స్థాయిలో శక్తిపాతం జరుగదని, రెండవరకమైన కర్మస్థాయిలోనే శక్తిపాతము జరుగుతుందని వారంటే, భోగప్రదమైన కర్మపట్ల శక్తిపాతమునకు భయమని, అందుకే దానిని విడచిపెడుతుందని అనుకోవలసి వస్తుంది. కనుక ఈ వాదన కూడా అసమంజసమౌతున్నది.

మలపరిపాక వాదము

మరికొందరు, 'మలపరిపాకము వల్లనే శక్తిపాతము జరుగుతుంది' అని అంటారు. మలములు మూడని మనకు తెలుసును. అవి, అణవ, కర్మ, మాయీయ మలములు. ఈ మలముల స్వరూపములేమిటి? వాటి పరిపాకం ఎలా జరుగుతుంది? అనే ప్రశ్నలకు ముందుగా వారు సమాధానములను చెప్పవలసి ఉంటుంది. ఈ సమాధానములనుంచి మరికొన్ని అనుబంధ ప్రశ్నలు ఉద్భవిస్తాయి గాని, అంతిమములైన సమాధానములు మాత్రం మనకు లభించవు.

దీనివల్ల ఏమని తేలుతున్నది? వైరాగ్యము, ధర్మవిశేషము, వివేకము, సత్సేవ, సత్ప్రాప్తి, దేవపూజ - ఇవన్నీకూడా, శక్తిపాతమునకు హేతువులనడం సరికాదని తేలుతున్నది. ఇవి ఉన్నంత మాత్రమున శక్తిపాతం లభించదు. లేకున్నంతమాత్రమున అది రాకుండానూ పోదు. కనుక, ఈ భేదవాదములన్నీ కూడా అసమంజసములని తేలుచున్నది. ద్వైతపరములైన వారి వారి సిద్ధాంతముల వరకు, అవి సమంజసములే కావచ్చు. కానీ పరమేశ్వరాద్వయవాదములో ఇవన్నీ ఉపయోగపడవు. దీనినే త్రికశాస్త్రమని అంటారు. నేడు కాశ్మీరశైవమని అంటున్నారు. దీని ప్రకారం, ఇవేవీ శక్తిపాతమునకు హేతువులు కాలేవు. ఎందుకన్నది, పైన ఇవ్వబడిన వాదనలలో తర్కబద్ధంగా నిరూపించబడింది.

శక్తిపాత రహస్యం

పరమేశ్వరుడు తన స్వరూపమును తానే ఆచ్ఛాదించుకుంటూ ఒక ఆటను ఆడుతున్నాడు. దీనికి కారణం, పరమస్వాతంత్ర్యమనబడే ఆయనయొక్క ఇచ్ఛాశక్తి మాత్రమే. ఈ శక్తివల్ల తననుతాను ఆచ్ఛాదించుకుని, పశువుగా పరిమితుడౌతున్నాడు. పశువంటే పాశముతో బంధింపబడినది. అంటే, రాగద్వేషములకు బద్ధుడైన జీవుడని అర్థం. ఈ విధంగా, తన కర్మఫలితములను తానే అనుభవించే జీవునిగా మారుతున్నాడు. కానీ ఆయనలో దేశ, కాల, స్వరూప పరములైన, భేదవిరోధములు లేవు. అదేవిధముగా, పరిమితమైన జీవస్వరూపములో దాగుకొనడాన్ని విడచిపెట్టి, మరలా తన స్వరూపమును ఒక్కసారిగా గాని, లేదా క్రమముగా గాని, పొందడమే ఆ అణువు (జీవుడు), శక్తిపాతమును పొందటమౌతుందని ఈ సిద్ధాంతములో చెప్పబడుతుంది. పరమస్వాతన్త్ర్య స్వరూపుడైన పరమశివుడే శక్తిపాతమును కలిగించేవాడు. గురువులద్వారా శక్తిపాతమౌతుందని నమ్మడం సరియైన విధానం కాదు. దైవశక్తికి గురువు ఒక కాలువ మాత్రమే గాని, తనంతట తానుగా అతడేమీ చేయలేడు. కనుక శక్తిపాతమనేది, మనం కోరుకున్నంత మాత్రమున వచ్చునది కాదు. అర్హతలను చూచి ఇవ్వబడునదీ కాదు. దైవానుభూతి యన్నది చిన్నపిల్లవాని చేతిలోని మిఠాయని శ్రీరామకృష్ణులనేవారు. ఆ పిల్లవాడు దానిని ఎవరికి, ఎందుకిస్తాడో, అతనికే తెలుస్తుంది. లేదా, అతనికి కూడా

తెలియదని చెప్పవలసి వస్తుంది. అయితే, దాని ఫలితమేమిటి? అన్నపుడు, స్వరూపము తానై వెలగడమే దాని ఫలితము. అంటే, మబ్బులు విడిపోయినప్పుడు వెలిగే సూర్యబింబం లాగా, జీవుని స్వస్వరూపము తానై వెలుగుతుంది. అదే శక్తిపాతం యొక్క అసలైన ప్రయోజనం.

ఎవడైతే, లోక భోగములను అనుభవించాలన్న కోరికలతో నిండి ఉంటాడో, వాని కర్మల తీవ్రతను బట్టి, ఈ శక్తిపాతం ఉంటుంది. అంటే, ఆయా కర్మల ఛాయలే, అతడిమీద శక్తిపాతం పడటాన్ని తగ్గిస్తాయి. మంచికర్మలు చేసుకుని శుద్ధాత్ముడైన వానిపైన శక్తిపాతం బాగా వర్షిస్తుంది. అతనికి కర్మల అడ్డంకులేమీ ఉండవు గనుక. చెడుకర్మల బలం ఎక్కువగా ఉన్నపుడు, శక్తిపాతపుబలం తగ్గుతుంది. అది తగ్గినపుడు, ఇది పెరుగుతుంది.

ఇక, మరణానంతరం ప్రాప్తించే స్వర్గం మొదలైన లోకాలలోని భోగములను అనుభవించాలన్న కోరికలతో నిండి యున్న జీవులకు, బ్రహ్మ-విష్ణు-రుద్రాదుల ద్వారా శక్తిపాతం లభిస్తుంది. ఎందుకనగా, వారు, ఆయా లోకాధిపతులు గనుక, ఆయాలోకములలోకి ప్రవేశించేవారికి వారే శక్తిపాతమును ఇస్తారు. అయితే, ఆ లోకములన్నీ మాయాగర్భములో ఉన్నవే గాని మాయాతీతములు కావు. కానీ, బ్రహ్మ, విష్ణు, రుద్రాదుల అనుగ్రహము వెనుక కూడా, పరమేశ్వరానుగ్రహమే ఉంటుంది.

అటువంటి శక్తిపాతపు ఫలితములు ఏ విధంగా అంటాయి? అన్నపుడు, మంత్రము, మంత్రేశుడు, మంత్రమహేశ్వరుల రూపములను జీవుడు పొందటం, మాయ-పురుషుల మధ్యనున్న భేదము తెలియబడటం, పురుషుడు - కళల మధ్యనున్న భేదము తెలియబడటం, పురుషుడు - ప్రకృతుల మధ్యనున్న భేదం తెలియబడటం, పురుషుడు - బుద్ధుల మధ్యనున్న భేదము తెలియబడటం వంటి ఫలములను ఈ విధమైన శక్తిపాతము కలిగిస్తుంది. ఆయా స్థాయిల క్రిందనున్న తత్త్వములలోకి జీవుని పోనివ్వకుండా అది బంధిస్తుంది. అయితే, ఇదంతా కూడా, భోగేచ్ఛ లేని జీవులలో మాత్రమే జరుగుతుంది.

మరికొంతమంది జీవులు, భోగము, మోక్షము, రెండింటినీ కోరుకుంటారు. అటువంటివారిలో, భోగులలో అయితే, వారి వారి కర్మలపైన అది ఆధారపడుతుంది. వారిలో, ఇంకా ఇంకా కర్మలపట్ల ఆపేక్షను పెంచుతుంది. మోక్షమును కోరుకునేవారిలో దేనిపైనా ఆధారపడదు. వారిలో కర్మలపట్ల రక్తిని తగ్గించి, విరక్తిని పెంచుతుంది. కనుక ఇది సాపేక్షము (భోగములను కోరుకునేవారిలో, ఇంకొకదానిపైన ఆధారపడేది), నిరపేక్షము (మోక్షమును కోరేవారిలో, దేనిపైనా ఆధారపడనిది) కూడా అవుతుంది.

అంతేగాక, 'ఈశ్వరానుగ్రహమును బట్టి ఎక్కడో ఒక జీవునిపైన శక్తిపాతము పడుతుంద'ని కూడా అనకూడదు. పరమేశ్వరుడే ఆ విధముగా, శక్తిపాతరూపంలో భాసిస్తున్నాడు. అలాంటప్పుడు, ఆయనకు పక్షపాతమేముంటుంది? కనుక ఒక ప్రత్యేకజీవునిపైన శక్తిపాతం పడుతుందని, మిగతావారిపైన అలా పడదని అనడం కూడా సమంజసం కాదు.

శక్తిపాతము - తొమ్మిదివిధములు

శక్తిపాతము తొమ్మిదివిధములుగా ఉంటుందని, శైవశాస్త్రములలో చెప్పబడినది. తీవ్ర-మధ్య-

మందభేదములతో ఉత్కృష్ట-మధ్యస్థ-నికృష్టములనబడే మూడు విధములుగా అది ఉంటుంది. అవి, ఈ క్రింది విధములుగా ఉంటాయి.

1	ఉత్కృష్ట తీవ్రము
2	మధ్యస్థ తీవ్రము
3	నికృష్ట తీవ్రము
4	ఉత్కృష్ట మధ్యమము
5	మధ్యస్థ మధ్యమము
6	నికృష్ట మధ్యమము
7	ఉత్కృష్ట మందము
8	మధ్యస్థ మందము
9	నికృష్ట మందము

ఉత్కృష్ట - తీవ్ర - శక్తిపాతము

వీనిలో, ఉత్కృష్ట - తీవ్ర - శక్తిపాతము యోగిపైన పడినప్పుడు, ఆ క్షణమే అతని దేహం కూలిపోతుంది. అతడు పరమేశ్వరుని స్వరూపమును పొందుతాడు. భోగేచ్ఛ అతనిలో లేశమాత్రం కూడా ఉండదు. పైగా, ఉత్కృష్ట తీవ్ర శక్తిపాతము అతనిపైన దూకుతుంది. కనుక, బాగుగా ఎండిన గడ్డికి, మహాగ్ని అంటుకున్నట్లుగా ఇది జరుగుతుంది. ఆ ఎండుగడ్డి తత్క్షణమే భస్మమై పోతుంది.

మధ్యమ - తీవ్ర - శక్తిపాతము

మధ్యమ - తీవ్ర - శక్తిపాతము వలన, ఏ విధమైన శాస్త్రసహాయముగాని, గురువుల సహాయము గాని లేకుండానే, స్వయముగా, తనకుతానే, వెలుగుతో కూడిన జ్ఞానోదయమును యోగి పొందుతాడు. అటువంటి సిద్ధి కలిగినప్పుడు, బాహ్యసంస్కారములేవీ లేకుండానే, భోగ మోక్షములనిచ్చే శక్తిగలిగినట్టి ప్రతిభాగురువని, అట్టి యోగి పిలువబడతాడు. అతనికి, 'ఈ సమయమునకు దీనిని చేయాలి, దీనిని చేయకూడదు' మొదలైన, సమయపరములైన విధులు, నిషేధములు ఏవీ ఉండవు. అయినప్పటికీ, ఇచ్ఛాశక్తిలోని భేదములవలన, అతని శక్తిలో కూడా తారతమ్యములుంటాయి. ఇటువంటి సిద్ధిని పొందిన కొంతమంది యోగులలో, శాస్త్రములపట్ల అపేక్ష ఉంటుంది. మరికొందరిలో అది ఉండదు. ఇటువంటి ఆచార్యుల జ్ఞానమును, నిర్భిత్తి, సభిత్తి మొదలైన పేర్లతో ఆగమములలో పిలుస్తారు.

'భిత్తి' అంటే గోడ అని అర్థము. ప్రస్తుత సందర్భములో 'హద్దు' అని అనుకోవచ్చు. సభిత్తి అనగా, 'హద్దులతో కూడిన శక్తి' అని అర్థం. అంటే, శాస్త్రపాండిత్యపు శక్తితో బాటు, అనుభవశక్తి కూడా కలిగిన గురువని అర్థం. 'నిర్భిత్తి' అంటే, శాస్త్రపాండిత్యపు ఆసరా లేకుండా, ఉత్త అనుభవజ్ఞానం కలిగిన గురువని అర్థం.

సమయవిధులున్నా, లేకున్నా, శాస్త్రపాండిత్యమున్నా, లేకున్నా, అతడు పొందిన సిద్ధి, జ్ఞానములే అన్నింటిలోకీ ముఖ్యములైనవి. అటువంటి గురువు యొక్క సన్నిధిలో, ఇతరగురువులకు, బోధించే అధికారము ఉండదు. అతని సమక్షంలో వారు మౌనమును వహించవలసి ఉంటుంది. శైవాగమముల ప్రకారము, అనాదిశివుని (పరమశివుని) సన్నిధిలో ఉన్నప్పుడు, ముక్తశివులకు (శివస్వరూపమును పొందిన ముక్తజీవులకు) సృష్టి-స్థితి-లయము మొదలైన పనులను చేసే శక్తి ఉండదని చెబుతారు. ఆ విధంగా, ఇతర గురువులు కూడా, ప్రతిభాగురువు సమక్షంలో శక్తిహీనులౌతారు.

నికృష్ట (మంద) - తీవ్ర - శక్తిపాతము

ఇక, నికృష్ట (మంద) - తీవ్ర - శక్తిపాతములో అయితే, దానిని పొందిన జీవునిలో, సద్గురువును కలుసుకోవాలని, ఆయన వద్ద ఉపదేశమును పొందాలని, సాధనను చేయాలని, అభిలాష కలుగుతుంది, తత్ఫలితంగా, అసద్గురువుల నుండి అతడు దూరం జరుగుతాడు. శక్తిపాతము వల్లనే, ఒక జీవుడు, అసద్గురువులను వదలిపెట్టి, సద్గురువులవైపు ప్రయాణించడం జరుగుతుంది. సామాన్యంగా, గురువును చేరుకున్న తరువాత శక్తిపాతం జరుగుతుందని లోకంలో నమ్మకం ఉన్నది. ఇది సరియైనది కాదు. శక్తిపాతం కలగడం వల్లనే, దొంగగురువులను వదలి, సద్గురువును చేరుకుంటాడు. దొంగగురువుల వలలో చిక్కి ఉన్నవారికి ఇంకా శక్తిపాతం లభించలేదని అర్థం.

సద్గురువు

సద్గురువంటే ఎవరు? సమస్త శాస్త్రతత్త్వముల యొక్క పూర్ణమైన జ్ఞానము కలిగిన, భగవత్స్వరూపుడైన భైరవుడే సద్గురువు. అయితే, ఇతని కంటే తక్కువస్థాయి వారైన యోగులు కూడా, తమతమ సాధనల వల్ల తమకు కలిగిన సిద్ధి, జ్ఞానముల వలన, ఇతరులకు మోక్షమును ఇవ్వగలుగుతారు. వారిలో కొంతమందిలో, సౌభాగ్యము, లావణ్యము మొదలైన లక్షణములు ఉండవచ్చు, కొందరిలో అవి ఉండకపోవచ్చు. ఇవన్నీ, అసద్గురువులలో కూడా ఉంటాయి. కానీ, శివానుభవజ్ఞానమే వీరిద్దరిలోనూ ఉండే భేదం.

బాధ గురువులకూ, బోధ గురువులకూ మధ్యన ఉండే భేదం ఏమిటి? వైభవము, జనాకర్షణ మొదలైన లక్షణములు ఇద్దరిలోనూ ఉండవచ్చు, కొండొకచో ఉండకపోవచ్చు. వాటిని బట్టి, వారియొక్క అంతరికస్థితిని అంచనా వేయకూడదు. అనుభవపూర్వకమైన శివజ్ఞానమే వారిమధ్యన ఉండే ప్రధానమైన భేదం. అది బాధగురువులలో ఉండదు, బోధగురువులలో ఉంటుంది.

వాక్చాతుర్యంతో బాధగురువులు లోకమును వంచిస్తారు. ధనము, గౌరవము, పేరుప్రతిష్ఠలను పొందుతారు. అది వారి భ్రష్టత్వానికి దోహదమౌతుందే గాని, ఆత్మోన్నతికి కాదు. భోగములను వరములుగా కోరుకునే కపటజనులు కూడా, వీరి వాక్చాతుర్యమునకు, వైభవప్రదర్శనకు ఆకర్షితులై, మంట వద్దకు చేరే మిడుతల మాదిరి వారి చుట్టూ మూగుతారు. చివరకు ఇద్దరూ ఉభయభ్రష్టులౌతారు.

కనుక, శివానుభవం కలిగిన ఉత్తమగురువునే, శిష్యుడు ఆశ్రయించాలి. అటువంటి, ఉత్తమ జ్ఞానలక్షణములు కలిగిన గురువు ద్వారా ఎవరైతే దీక్షను పొందుతారో, వారు తక్షణమే ముక్తులవుతారు, లేదా

జీవన్ముక్తులౌతారు. నికృష్టగురువులను ఆశ్రయించేవారు పతితులౌతారు.

దీక్షాభేదములు

ఈ దీక్షలలో రకరకములైన భేదములున్నాయి. ఊరకే కన్నులతో చూడటం ద్వారా దీక్షనివ్వవచ్చు. విషయమును వివరించి చెప్పడం ద్వారా, సంభాషణ ద్వారా ఇవ్వవచ్చు. శాస్త్రవాక్యములను వివరించడం ద్వారా కూడా ఇవ్వవచ్చు. తంతులూ, క్రియలద్వారా కూడా ఇవ్వవచ్చు. చరుదానము ద్వారా కూడా ఇవ్వవచ్చు. చరువంటే, హోమప్రక్రియలో ప్రసాదముగా ఇవ్వబడే పాయసము. దీక్ష అనునది, గురువు యొక్క సంకల్పశక్తిమీద ఆధారపడి ఉంటుంది. భౌతికములైన ఉపకరణములు, తంతులు మొదలైనవి దానికి వాహకములుగా, సహాయకారులుగా ఉపయోగపడుతవి గాని, ముఖ్యమైనది గురుసంకల్పమే. ఈ విధముగా, దీక్షలలో, చాలా రకములైన భేదములున్నాయి.

ప్రాణవియోజిక దీక్ష

సాధనాభ్యాసశక్తి బాగా ఉన్నవానికి, ప్రాణవియోజిక దీక్ష లభిస్తుంది. దీనిలో, దీక్షను పొందిన వాని ప్రాణం, వాని దేహమును విడచి వెంటనే నిష్క్రమిస్తుంది. కనుక, దానిని, సాధకుని మరణసమయంలో మాత్రమే ఇవ్వవలెను. దాని వివరమును ముమ్మందు చెబుతాను. ఈ విధముగా, ఉత్కృష్టతీవ్రము, మధ్యతీవ్రము, మందతీవ్రమని మూడు విధములుగా 'తీవ్రదీక్ష' ఉంటుంది.

మధ్య - తీవ్ర - దీక్ష

మధ్య - తీవ్ర - దీక్షను పొందినవానిలో, ఎవరికైతే, తన ఆత్మలో దృఢమైన శివానుభూతి కలుగదో, అతనికి కూడా కాలక్రమేణా ఆ జ్ఞానము పరిపాకమై, దేహమును వదలిపెట్టే సమయంలో, అతడు కూడా శివుడే అవుతాడు.

మధ్య - మధ్య - దీక్ష

మధ్య - మధ్య - దీక్షలో అయితే, శివజ్ఞానమును పొందవలెనన్న ఉత్సాహమున్నప్పటికీ, దానిప్రక్కనే గట్టిదైన భోగకాంక్ష కూడా ఉన్నట్లయితే, అటువంటి వానికి కూడా, ఆ దీక్ష వల్ల జ్ఞానము తప్పకుండా లభిస్తుంది. అయితే, జీవితాంతం యోగాభ్యాసమును చేస్తూ, గట్టిదైన దేహముతో భోగములను అనుభవించి, మరణసమయంలో అతడు కూడా శివుడే అవుతాడు.

నికృష్ట(మంద) - మధ్య - దీక్ష

నికృష్ట(మంద) - మధ్య - దీక్షలో అయితే, మరణం తర్వాత, ఇంకొక జన్మలో కూడా భోగములననుభవించి, దాని చివరలో శివత్వమును పొందుతాడు. ఈ విధముగా, మధ్యమదీక్ష కూడా మూడు విధములుగా ఉంటుంది.

మంద దీక్ష

ఎవరిలో అయితే, భోగముల పట్ల ఉత్సాహము, ఆకర్షణలు బాగా ఎక్కువగా ఉంటాయో, అట్టివారిపైన కలిగే శక్తిపాతమును 'మందము' అంటారు. అటువంటి జీవులలో, పరమేశ్వర మన్త్రయోగము వల్లనే, అనగా, మంత్రోపాసన వల్లనే, సాధన ముందుకు సాగుతుంది. ఆ శక్తిపాతం వలన, అతనిలో, మంత్రసాధనపట్ల ఆకర్షణ ఎక్కువౌతుంది. దానిద్వారా ఎప్పటికో అతనికి మోక్షం అందుతుంది. దానిలో కూడా తీవ్రము, మధ్యమము, మందమని మూడు విధములైన తారతమ్యములుంటాయి.

మంద-తీవ్ర-దీక్షలో - భోగకాంక్ష బలముగా ఉన్నప్పటికీ, విడువని మంత్రసాధనతో కొన్ని జన్మలకు గాని, శివానుభవం ప్రాప్తిస్తుంది.

మంద-మధ్య-దీక్షలో - మంత్రోపాసనను మధ్యమధ్యలో వదిలివేస్తూ, మరలా కొంతకాలం తర్వాత కొనసాగిస్తూ ఉండటం జరుగుతుంది.

మంద-మంద-దీక్షలో - భోగముల ఉచ్చులో పడి, ఎన్నో ఏండ్లకొకసారి మంత్రోపాసనను చేస్తూ, మరలా దానిని మరచిపోతూ ఉండటం జరుగుతుంది.

ఇవి, ముఖ్యములైన మూడు శక్తిపాతములు. ఈ క్రింది పట్టికనుండి సులభముగా అర్థము చేసికొనవచ్చును.

ఉత్కృ ష్ట - తీవ్ర - దీక్షకు 200 మార్కులు, నికృష్ట - మంద - దీక్షకు 30 మార్కులు వచ్చినవి. మధ్యలోని వివిధ దీక్షలకు, ఆ మధ్యలోని మార్కులు వచ్చినవి. దీనినిబట్టి వారివారి సాధనలు ఎలా ఉంటాయో, వారికి కలిగే సిద్ధి ఎలా ఉంటుందో, అర్థం చేసికొనవచ్చును.

వైష్ణవ దీక్షలు

ద్వైతసంప్రదాయంలో వైష్ణవమతం ప్రసిద్ధమైనది. శైవంలో కూడా ద్వైతమున్నది. కానీ ప్రముఖంగా వైష్ణవమే చెప్పబడుతుంది. వైష్ణవము మొదలైన ద్వైతసాంప్రదాయములలో చెప్పబడిన దీక్షలు రాజానుగ్రహమును పొందటం వంటివి. రాజానుగ్రహము, ఒక వ్యక్తికి అనేక బహుమతులను, వరములను ఇస్తుందిగాని, అతడిని తనతో సమానుడైన రాజును చెయ్యలేదు. అదే విధముగా, ఆయా ద్వైతమతములలో చెప్పబడిన దీక్షల వలన, లౌకికములైన అనేక ప్రయోజనములు సిద్ధించవచ్చు, వరములు, సుఖసౌఖ్యములు, ప్రాప్తించవచ్చు. కానీ, వాటి పరమగమ్యమనేది, పరతత్త్వములో లయమైపోయే మోక్షం మాత్రము కాదు. అవి, పరమస్వాతంత్ర్య రూపమైన, పరమేశ్వరస్వరూపమైన మోక్షమును ఇవ్వనూ లేవు. కేవలం విష్ణుదేవుని ప్రార్థించి సుఖసౌఖ్యములను, భోగములను వరములుగా పొందటం మాత్రమే వాటి ఉపయోగమై ఉంటుంది. ఇదే విధముగా మిగిలిన మతములు కూడా ఉంటాయి. వారి పరమగమ్యం అద్వైతసిద్ధి కాదు. కనుక వాటినిక్కడ వివరించడం లేదు.

వైష్ణవము మొదలైన ఇతర మతముల దీక్షలలో కూడా, శివ-శక్తులు కలసియే ఉంటారు, సాధకుని అనుగ్రహిస్తారు. ఈ కలయిక, పరమూ, శ్రేష్ఠమూ, అఘోరమూ కాదుగాని, ఘోరము, ఘోరతరము అవుతుంది. అనగా, శుద్ధసాత్త్వికరూపమై ఉండదు. రజోగుణ, తమోగుణ మిశ్రితమై ఉంటుంది. అంటే,

కోరికలతో కూడి ఉంటుంది. వరములను పొందటమే పరమావధిగా ఉంటుంది. త్రికశాస్త్రంలో మాత్రము అది శుద్ధసాత్వికరూపంలో కూడా ఉంటుంది. అప్పుడది 'పరము' లేదా 'అఘోరము' అనబడుతుంది.

ఈ విధముగా శక్తిపాతమనేది, రకరకములైన, విచిత్రములైన తారతమ్యభేదములతో కూడి ఉంటుంది. ఎవరైతే, వైష్ణవదీక్షలను స్వీకరించి, సమయాది క్రమములో, పాంచరాత్రాది వైష్ణవాగమశాస్త్రములలో చెప్పబడిన నియమనిష్ఠలను పాటించుతారో, వారు, తద్వారా లభించిన పరిపాకముతో, ఆయా దీక్షలనన్నింటినీ మించినట్టి త్రికశాస్త్రదీక్షలను పొందటానికి క్రమముగా అర్హతలను సంపాదించుకుంటారు. ఇక, మిగిలిన మతములు, రకరకములైన దారులలో నడుస్తూ, పైన చెప్పబడిన దీక్షాక్రమముల మధ్యలోని మెట్లను కొన్నింటిని వదలిపెట్టి ముందుకు దూకుతూ, ఏదో ఒక మార్గంలో, చిట్టచివరకు పరమార్థమును పొందుతాయి. కనుక, ఇతరశాస్త్రములలో చెప్పబడిన గురువులు, ఈ శాస్త్రములో చెప్పబడినట్టి లోకముల యొక్క దర్శనమునకు కూడా అధికారులు కారు. వారికా దర్శనములు లభించవు. ఊర్ధ్వశాసనములలో ఉన్న గురువులు, క్రింది శాసనములలోని గురువులకు శాసకులౌతారు. ఇది లోకసహజం కదా ! ఇది ఎందుకంటే, వారికి కలిగిన పూర్ణత్వమువలన వారు సర్వాధికారులవుతారు. క్రిందివారికి ఆ పూర్ణత్వము ఉండదు గనుక వారు అనుచరులౌతారు.

గురువులలోని భేదములు

వీరిలో కూడా, దేశిక, గురు, ఆచార్య, దీక్షక, చుంబకులనే భేదములుంటాయి. దేశికుడనగా, నిర్దేశించేవాడు; గురువనగా, గుర్తుగా దారిచూపేవాడు; ఆచార్యుడనగా, ఆచారమును నేర్పించేవాడు; దీక్షకుడనగా, దీక్షనిచ్చేవాడు; చుంబకుడనగా, శాస్త్రములు చదవడాన్ని నేర్పించేవాడు; ఈ గురువులందరిలోనూ, పూర్ణజ్ఞానియైనవాడే సర్వోత్తముడు. అతడిచ్చిన దీక్షకే ఉత్తమఫలితముంటుంది. మిగతావారిచ్చిన దీక్షలకు పూర్ణత్వము లేదు.

1	దేశికుడు	నిర్దేశించువాడు
2	గురువు	గురుతుగా మార్గమును చూపువాడు
3	ఆచార్యుడు	ఆచారవిధులను నేర్పించువాడు
4	దీక్షకుడు	మంత్ర, ధ్యాన, యోగ దీక్షలనిచ్చువాడు
5	చుంబకుడు	శాస్త్రములను వివరించి చెప్పువాడు

భోగము - మోక్షము

యోగులకు కూడా దీక్షాశక్తి ఉంటుంది. సాధకులనేవారు సామాన్యముగా, లౌకికఫలితములను గాని, ఆధ్యాత్మికఫలితములను గాని, వారి గురువులనుండి, దీక్షలనుండి ఆశిస్తారు. వాటికి తగిన సాధనలను, ఉపాయములను, ఉపదేశించడం ద్వారా యోగులు ఆయా ఫలములను వారికివ్వగల శక్తిని కలిగి ఉంటారు. వారు, మోక్షమును కూడా ఇవ్వగలరు. కానీ, సాధకుడు దానినొక్కదానినే కోరుకునేవాడై ఉండాలి. భోగమును, మోక్షమును కలిపి కోరుకునేవారు మోక్షమును పొందలేరు.

ఒకనికి ఎందరు గురువులుండవచ్చు?

పూర్ణమైన జ్ఞానమును కోరుకునేవాడు ఎందరు గురువులనైనా సేవించవచ్చు. ఉన్నదానితో సంతృప్తిపడేవానికి ఒక్క గురువు చాలు. జ్ఞానసిద్ధిలోని ఉత్తమోత్తమాది భేదములను కోరుకునే శిష్యుడు ఆ విధముగా, ఒకరిని మించి ఎందరు గురువులనైనా సేవించవచ్చు. కానీ, సంపూర్ణజ్ఞానము కలిగిన గురువును వదలడం మంచిది కాదు. దానివల్ల, ప్రాయశ్చిత్తమును చేసికొనవలసి వస్తుంది. ఇప్పుడు రెండు ప్రశ్నలు ఉదయించవచ్చు. అవి,

1. ఎన్ని రోజులు గడచినా ఉపదేశం చెయ్యకుండా కాలక్షేపం చేస్తున్న గురువును వదలిపెట్టవచ్చునా?

2. ఉన్నదానిని ఉన్నట్లుగా కాక, విపరీతముగా బోధించుచున్న గురువును వదలిపెట్టవచ్చునా?

దీనికి జవాబుగా, అలా చేయకూడదని సమాధానం వస్తుంది. ఎందుకంటే, గురువు పూర్ణజ్ఞానప్రాప్తిని పొంది ఉంటే, అతనిలో రాగద్వేషాది దోషములుండవు. అడిగిన వెంటనే, శిష్యునకతడు ఉపదేశించకపోవడానికి కొన్ని బయటకు కనిపించని కారణాలుంటాయి. శిష్యునిలో తగినంత యోగ్యత లేకపోవడము, తగినంత విశ్వాసము లేకపోవడము, మొదలైన కారణములవల్ల, వెంటనే ఉపదేశించకుండా, గురువైనవాడు కొంతకాలం పాటు వేచిచూస్తూ ఉండవచ్చు. కనుక ఆ గురువు చెప్పిన ఉపాసననే శిష్యుడు అభ్యాసం చేస్తూ ఉండవలెను గాని, అట్టి గురువును వెంటనే వదలకూడదు. తాను ఆశిస్తున్న జ్ఞానము ఆయన వద్ద లభించనప్పుడు మాత్రమే, ఆయనను వదలిపెట్టవచ్చును.

ఈ విధముగా, శక్తిపాతమన్నది పూర్తిగా ఈశ్వరుని యొక్క అనుగ్రహముపైన మాత్రమే ఆధారపడినదై, కారణం లేనిదై, కర్మనియమములను దాటినదై ఉంటుంది.

తిరోభావము

ఇప్పుడు తిరోభావమును గురించి చెప్పబడుచున్నది. తిరోభావమంటే, దైవమునందు, గురువునందు గల విశ్వాసము సడలిపోవడం. తాను నడచుచున్న మార్గము నుండి వెనుకకు మరలిపోవడం. ఇది ఎవరికి సంభవిస్తుంది? శక్తిపాతమును పొందినవాడికి ఈ విధమైన తిరోభావము ఎన్నటికీ సంభవించదు. దానిని పొందనివానిలో మాత్రమే ఇది సంభవిస్తుంది. ఇతనిలో కూడా, ఈ మార్గమునకు విరుద్ధములైన ఇతరకర్మల యందు ఆపేక్షతో, వాటిలో పడిపోయి, వాటిని ఆచరించడం వల్ల, దుఃఖము మొదలైన ఫలితములను పొందటమే అవుతుంది. ఇలా జరగడానికి కారణమేమిటి? ఇదికూడా, పరమేశ్వరుని ఇచ్ఛావైచిత్ర్యము వలన మాత్రమే జరుగుతుంది.

లేదా, మరికొందరిలో ఒక విధమైన ఊగిసలాట ఉంటుంది. వారొకవైపున దీక్షాసాధనలు, గురువు, దైవము, అగ్ని మొదలైనవారి సేవలను చేస్తూ ఉంటారు.. మరియొకవైపున వారిని విమర్శిస్తూ, నిందిస్తూ ఉంటారు. ఇటువంటివారిలో కూడా తిరోభావముంటుంది. మొదట్లో శివశాసనములో ఉన్నప్పటికీ, తరువాత దానిని త్యజించి, దానిని విమర్శిస్తూ నిందించేవారిలో కూడా ఇది ఉంటుంది. అటువంటివారిలో కూడా, పరమేశ్వరుని ఇచ్ఛావైచిత్ర్యము వలన, శక్తిపాతము కలుగుతుంది. ఇంకొక విచిత్రమేమంటే, ఈ

శక్తిపాతమన్నది బ్రతికున్నవారికే కాదు, చనిపోయినవారికి కూడా కలుగుతుంది. అది, వారికోసం బంధువులు చేయించే శ్రాద్ధము మొదలైన కర్మలవల్లను, గురువులు మొదలైనవారి కృపవల్లను కలుగుతుంది.

పంచకృత్యములను తన ఆత్మలో అనుసంధానము చేయువాడు పరమేశ్వరుడే అగుచున్నాడు. కనుక, తననుతాను ఖండితుడైన ఆత్మగా అతడెన్నటికీ అనుకోకూడదు.

పంచకృత్యములనేవి పరమశివుని యొక్క అయిదు పనులు. అవి, సృష్టి, స్థితి, లయము, తిరోధానము మరియు అనుగ్రహములు. సృష్టి, స్థితి, లయములు మనకు తెలును. తిరోధానమంటే ప్రవృత్తినుండి, నివృత్తివైపుగాను, పరిమితాత్మభావన నుండి పరమశివాద్వైత భావనవైపుగాను వెనుకకు మరలిపోవడం. ఈశ్వరానుగ్రహము వల్ల శక్తిపాతం కలుగుతుంది. దానిని వివరించిన తర్వాత, తిరోధానస్థితిలో ఉన్న జీవులలో కూడా, అనుగ్రహమనేది ఏ విధంగా వర్తిస్తుందో ఇక్కడ చెప్పబడింది.

ఆ// శివునకద్దులేదు చిన్మాత్రరూపుండు
నిరతిశయుడు తాను నిజవిభుండు
తనదు ఇచ్ఛతోడ తననుదానై గప్పి
బద్ధుడైన యట్లు భ్రమలనందు

ఆ// బుద్ధిహీనుపగిది భువియందు నివసించు
జ్ఞానివోలె జెల్లు జగమునందు
మరల తనదు రూపు మక్కువన్ తాదాల్చు
శక్తిపాతమొసగు స్వేచ్ఛతోడ

పరమేశ్వరుడు సర్వస్వతంత్రుడు. ఆయనకు బంధములు, కట్టుబాట్లు లేవు. కేవలాత్మగా వెలుగుతున్నాడు. అట్టి పరమేశ్వరుడు, తన ఇచ్ఛతో, తనను తాను కప్పుకొని, జీవునిగా మారి, మళ్ళీ కొంతకాలమునకు నిజరూపమును ధరిస్తాడు. జీవునిగా ఉన్నప్పటి స్థితిలో, అజ్ఞానిగా ఉన్నప్పటికీ, జ్ఞానివలె ప్రవర్తిస్తాడు. తదుపరి, జ్ఞానియే అవుతాడు. అదే శక్తిపాతము. ఈ విధముగా శక్తిపాతమన్నది, దేనిపైనా ఆధారపడనిదై, పరమేశ్వరుని ఇచ్ఛాస్వాతంత్ర్యరూపమై ఉన్నది.

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే శక్తిపాతప్రకాశనం నామ ఏకాదశమాహ్నికమ్ || 11 ||

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని శక్తిపాతప్రకాశనమనే పదకొండవ ఆహ్నికము.

పన్నెండవ ఆహ్నికము

స్నాన ప్రకాశనము

యదార్థః - యదార్థము

దీక్షాదికం వక్తవ్యమ్ ఇతి ఉక్తమ్, అతో దీక్షాస్వరూపనిరూపణార్థం ప్రాక్ కర్తవ్యం స్నానమ్ ఉపదిశ్యతే।

దీక్షలను గురించి చెప్పబడినది గనుక, దీక్షాస్వరూపమును విస్తరించి చెప్పబోయే ముందుగా, స్నానమును గురించి చెప్పబడుచున్నది.

స్నానం చ శుద్ధతా ఉచ్యతే, శుద్ధతా చ పరమేశ్వరస్వరూపసమావేశః। కాలుష్యాపగమో హి శుద్ధిః, కాలుష్యం చ తదేకరూపేఽపి అతత్స్వభావరూపాన్తర సంవలనాభిమానః। తదిహ స్వతన్త్రానన్దచిన్మాత్రసారే స్వాత్మని విశ్వత్రాపి వా తదన్య రూపసంవలనాభిమానః అశుద్ధిః, సా చ మహాభైరవసమావేశేన వ్యపోహ్యతే, సోఽపి కస్యచిత్ ఝటితి భవేత్, కస్యాపి ఉపాయాన్తరముఖప్రేక్షీ। తత్రాపి చ ఏకద్విత్ర్యాదిభేదేన సమస్తవ్యస్తతయా క్వచిత్ కస్యచిత్ కదాచిత్ చ, తథా ఆశ్వాసోపలబ్ధేః విచిత్రో భేదః।

శుద్ధతయే స్నానము. పరమేశ్వరస్వరూప సమావేశమే శుద్ధత. కాలుష్యమును తొలగించుటయే శుద్ధి. కాలుష్యమనేది తత్ తో ఏకమైనప్పటికీ, అతత్ స్వభావ రూపాంతరముతో కలయికకై మోహమును కలిగి ఉంటుంది. స్వతంత్ర-ఆనంద-చిన్మాత్రసారమైన స్వాత్మనుగాని, విశ్వమునుగాని, దానికన్యమైన రూపములో చూడటమే అశుద్ధి. అది మహాభైరవసమావేశముతో మాత్రమే పోతుంది. కొందరికి తత్క్షణంలో కలుగుతుంది, మరి కొందరికి ఉపాయాంతరములతో కలుగుతుంది. దానిలోకూడా ఒకటి, రెండు, మూడు మొదలైన భేదములతో ఒక్కొక్కచోట, ఒక్కొక్కరికి, ఒక్కొక్కవిధముగా, విచిత్రములైన రీతులలో, సాధకుని విశ్వాసమును బట్టి లభిస్తుంది.

స చ అష్టధా-క్షితిజలపవనహుతాశనాకాశసోమసూర్యాత్మరూపాసు అష్టాసు మూర్తిషు మన్త్రన్యాసమహిమ్నా పరమేశ్వరరూపతయా భావితాసు తాదాత్మ్యేన చ దేహే పరమేశ్వరసమావిష్టే శరీరాదివిభాగవృత్తేః చైతన్యస్యాపి పరమేశ్వరసమావేశప్రాప్తిః, కస్యాపి తు స్నానవస్త్రాదితుష్టిజనకత్వాత్ పరమేశోపాయతామేతీతి, ఉక్తం చ శ్రీమదానన్దాదౌ-ధృతిః ఆప్యాయో వీర్యం మలదాహో వ్యాప్తిః సృష్టిసామర్థ్యం స్థితిసామర్థ్యమ్ అభేదశ్చ ఇత్యేతాని తేషు ముఖ్యఫలాని - తేషు తేషు ఉపాహితస్య మన్త్రస్య తత్తద్రూపధారిత్వాత్।

ఇది ఎనిమిది విధములుగా ఉంటుంది. అవి, క్షితి, జల, పవన, హుతాశన, ఆకాశ, సోమ, సూర్య, ఆత్మరూపములుగా ఉన్న అష్టమూర్తుల మంత్రన్యాసమహిమ వలన, పరమేశ్వరరూపముగా భావించడం వలన, తాదాత్మ్యము చెందగా, దేహములో పరమేశ్వరసమావిష్టమై, శరీరాది విభాగవృత్తుల చైతన్యములో కూడా, పరమేశ్వర సమావేశప్రాప్తి లభిస్తుంది. కొందరికి స్నానము, వస్త్రములు మొదలైనవి తుష్టిని కలిగించుట వలన పరమేశప్రాప్త్యుపాయములౌతాయి. శ్రీమదానన్దాది శాస్త్రములలో ఈ విధముగా చెప్పబడినది - ధృతి, ఆప్యాయము, వీర్యము, మలదాహము, వ్యాప్తి, సృష్టిసామర్థ్యము, స్థితిసామర్థ్యము, అభేదములు దీని

ముఖ్యఫలములు. ఆయా మంత్రముల ఉపాసనవలన, ఆయా రూపముల ధారణవల్ల సిద్ధిస్తాయి.

వీరోద్దేశేన తు విశేషః, తద్యథా-రణరేణుర్ఘు వీరామ్బుః మహామరుత్ వీరభస్మ శ్మశాననభః తదుపహితౌ చన్ద్రార్కౌ ఆత్మా నిర్వికల్పకః |

వీరోద్దేశులలో విశేషముగా జరుగుతుంది. ఏలాగనగా, రణరేణు, వీరామ్బుము, మహామరుత్, వీరభస్మ, శ్మశాననభము, వాటిలో ఉన్నటువంటి చంద్రుడు, సూర్యుడు, నిర్వికల్పక ఆత్మ ఇవి ఎనిమిది.

పునరపి బాహ్యాభ్యన్తరతయా ద్విత్వమ్, బహురుపాస్యమన్త్రతా-దాత్మ్యేన తన్మయీకృతే తత్ర తత్ర నిమజ్జనమ్ ఇత్యుక్తమ్ | విశేషస్తు ఆనన్దద్రవ్యం వీరాధారగతం నిరీక్షణేన శివమయీకృత్య తత్రైవ మన్త్రచక్రపూజనమ్, తతః తేనైవ దేహప్రాణోభయాశ్రితదేవతాచక్రతర్పణమ్ ఇతి ముఖ్యం స్నానమ్ | అభ్యన్తరం యథా - తత్తద్ధరాదిరూపధారణయా తత్ర తత్ర పార్థివాదౌ చక్రే తన్మయీభావః |

స్నానము, బాహ్యము అభ్యంతరమని రెండు విధములు. ఉపాసింపబడిన మంత్రముతో తాదాత్మ్యము వలన తన్మయుమైనపుడు, అక్కడికక్కడే నిమజ్జనం చేయవలెను. విశేషమేమనగా, వీరాధారగతమైన ఆనందద్రవ్యమును నిరీక్షించి, శివమయము గావించి, అక్కడే మన్త్రచక్రపూజ, దానిలోనే దేహప్రాణములు రెండింటిలో ఆశ్రయించిన దేవతాచక్రతర్పణము చేయుటయే ముఖ్యమైన స్నానము. అభ్యన్తరస్నానము ఈ విధము - పృథివి మొదలైన రూపములను ధారణ చేయడం వల్ల, ఆయా పార్థివాది చక్రములలో కలిగే తన్మయభావమే దాని రూపము.

శ్లో|| పరభైరవసంమజ్జనమాహుః స్నానం యథా తు తద్భవతి |
తదపి బాహ్యం స్నానం, న ముఖ్యముపచారతః కిం తు ||

పరభైరవునిలో సంమజ్జనమే స్నానము. అయినప్పటికీ బాహ్యస్నానమున్నది. అది ముఖ్యముకాదు. ఔపచారికమే.

వ్యాఖ్యానము

దీక్షలు మొదలైనవాటిని గురించి ఇంతకు ముందు సూచనాప్రాయముగా చెప్పబడినది. దానికిప్పుడు మరింత వివరణ ఇవ్వబడుచున్నది. దీక్షాస్వరూపమును వివరించడానికి ముందుగా, దానికవసరమైన స్నానమును గురించి చెప్పబడుచున్నది.

స్నానము

పరిశుద్ధతయే స్నానమని చెప్పబడుతుంది. అంటే, శుచిగా ఉండటం మాత్రమే. సత్యమైన దృష్టిలో చూచినప్పుడు, పరమేశ్వరుని యొక్క స్వరూపముతో ఏకత్వమును పొందటమే అసలైన శుద్ధత. ఇంకొక అర్థములో, కాలుష్యమును మననుండి తొలగించుకొనుటయే శుద్ధి అనబడుతుంది.

కాలుష్యమంటే ఏమిటి? 'తత్' అనునది పరమేశ్వరవాచకము. దానితో, అనగా పరమేశ్వరునితో తాను

ఏకమైనప్పటికీ, అట్లా కానని అనుకోవడములో మోహమును కలిగి ఉండటమే కాలుష్యము. పరమేశ్వరుని స్వరూపము ఎలా ఉన్నది? అని విచారించినపుడు, పరమ స్వాతంత్ర్యరూపమైన ఆనందము మరియు చిత్తె అది ఉన్నది. దాని స్వరూపమే అయినట్టి తన ఆత్మనుగాని, విశ్వమును గాని, అవి ఆ విధములుగా కానట్లుగా భావిస్తూ, వేరే రూపములుగా వాటిని చూడటమే అశుద్ధి యనబడుతుంది. అది ఎలా పోతుంది? అంటే, మహాభైరవుడైన పరమశివునితో సమావేశము (అభేదభావము) తోనే అది పోతుంది.

కొందరిలో, ఈ శివానుభవము తత్క్షణమే కలుగుతుంది, మరికొందరికి, అనేకములైన సాధనలు చేసిన తర్వాత మాత్రమే కలుగుతుంది. దానిలో కూడా, ఒకటి, రెండు, మూడు మొదలైన భేదములతో ఒక్కొక్కచోట, ఒక్కొక్కరికి, ఒక్కొక్కవిధముగా, విచిత్రములైన రీతులలో, సాధకుని విశ్వాసమును బట్టి అది లభిస్తుంది.

ఎనిమిది విధములైన స్నానము

స్నానము చేయడమనేది లేదా శుద్ధత్వం లభించడమనేది, ఎనిమిది విధములుగా ఉంటుంది. పరమశివుడు అష్టమూర్తిస్వరూపుడు. అంటే, భూమి, జలము, వాయువు, అగ్ని, ఆకాశము, చంద్రుడు, సూర్యుడు, ఆత్మ మొదలైన ఎనిమిది రూపములుగా పరమేశ్వరుడే ఈ సృష్టిలో కొలువై ఉన్నాడు. కనుక ఈ ఎనిమిది దారులలోనే జీవునకు శుద్ధత్వం సంభవిస్తుంది. ఈ అష్టమూర్తుల యొక్క మంత్రములను న్యాసము చేయుటవలన, తనను తానే ఆయా పరమేశ్వరస్వరూపములుగా భావించడం జరుగుతుంది. ఈ ధ్యానబలం వలన, ఈ అష్టమూర్తులతో తాదాత్మ్యము చెందగా, తన దేహములో పరమేశ్వరశక్తితో కలయిక సంభవిస్తుంది. ఆయా అష్టమూర్తుల స్వరూపములైన దేహభాగములలో కూడా, పరమేశ్వర సమావేశప్రాప్తి లభిస్తుంది. ఈ విధముగా ఆయా దేహభాగములకు సిద్ధత్వం లభిస్తుంది. ఇది పూర్తిగా ధ్యానవిధానము.

సరాసరిగా ఇటువంటి ధ్యానమును చేయలేనివారుంటారు. అలాంటివారికి, స్నానము చేయడము, శుభ్రమైన వస్త్రములను ధరించడము మొదలైన పనుల ద్వారా సంతోషం లభిస్తుంది. కనుక, అవి కూడా, వారివరకు వారిని, పరమేశ్వరుని దరికి జేర్చే ఉపాయములే అవుతాయి. శ్రీమద్ ఆనందాది శాస్త్రములలో - అష్టమూర్తి సాధనవల్ల ఈ క్రింది ఫలితములు కలుగుతాయని చెప్పబడినది.

అష్టమూర్తి సాధన - ఫలితములు

సంఖ్య	సాధన	ఫలితము
1	పృథివీ సాధన	స్థిరత్వము
2	జల సాధన	ఆప్యాయము (మెత్తదనము, ప్రాణశక్తి)
3	అగ్ని సాధన	వీర్యము (తేజస్సు)
4	వాయు సాధన	మలదాహము (దోషములు కాలిపోవడము)
5	ఆకాశ సాధన	వ్యాప్తి (వ్యాపించే స్వభావము)
6	చంద్ర సాధన	సృష్టిని చేసే సామర్థ్యము
7	సూర్య సాధన	స్థితిని కల్పించే సామర్థ్యము

సంఖ్య	సాధన	ఫలితము
8	ఆత్మ సాధన	శివునితో అభేదస్థితిలో లయమైపోవడం

పై ఎనిమిది విధములైన సాధనల వల్ల, ఇవి ముఖ్యఫలితములుగా కలుగుతాయి. ఇవిగాక, వాటి వాటి ఉపఫలితములు కూడా ఉంటాయి. ఆయా మంత్రముల ఉపాసనవలన, ఆయా రూపముల ధారణవల్ల ఈ సిద్ధులు సిద్ధిస్తాయి.

వీరాచార సాధకులలో అయితే, ఇది మరొక విధముగా జరుగుతుంది. ఏలాగనగా, రణరేణు, వీరామ్భము, మహామరుత్, వీరభస్మ, శ్మశాననభము, వాటిలో ఉన్నటువంటి చంద్రుడు, సూర్యుడు, నిర్వికల్పక ఆత్మ ఇవి ఎనిమిది. అంటే, యుద్ధభూమిలోని మట్టి, వీరజలము (మద్యము), మహావాయువు, వీరభస్మము, శ్మశానంలో ఉన్న ఆకాశము, చంద్ర, సూర్య, ఆత్మలు - ఈ ఎనిమిది విధములైన స్నానవస్తువులను వీరాచారులు స్వీకరిస్తారు.

స్నానము - రెండు విధములు

బాహ్యస్నానము, అంతరికస్నానమని - స్నానము రెండు విధములుగా ఉన్నది. దేహమును శుభ్రపరచుకోవడం బాహ్యస్నానము. ఎక్కడైతే, ఉపాసింపబడిన మంత్రముతో తాదాత్మ్యము కలుగుతుందో, తన్మయత్వము సిద్ధిస్తుందో, అక్కడే అంతరికస్నానమైనట్లుగా భావించాలి. అదే నిజమైన స్నానము.

వీరస్నానము

దీనికి విభిన్నమైన వీరాచారమార్గంలో, సారాయిని ఉపయోగించడం ఉంటుంది. దీనికి ఆనందద్రవ్యమని పేరు. అట్టి ఆనందద్రవ్యమును చూస్తూ, దానిని ఆనందస్వరూపముగా, శివమయముగా భావించి, దానిలోనే మంత్రసహితమైన చక్రపూజను చేసి, తన దేహప్రాణములు రెండింటిలోనూ ఆశ్రయించియున్న దేవతాచక్రములకు దానిని తర్పణము చేయుటయే ముఖ్యమైన స్నానముగా ఈ పద్ధతిలో ఆచరించబడుతుంది.

అంతరిక స్నానము

ఇక లోపలి స్నానమును వివరిస్తున్నాను. పృథివి మొదలైన పంచభూతముల రూపములను ధారణ చేయడం వల్ల, అయా చక్రములలో సాధకునకు కలిగే తన్మయ ధ్యానభావమే అంతరిక స్నానమౌతుంది.

పరస్నానము

పరభైరవునిలో తానుగా మునగడమే స్నానము. సృష్టికి అతీతమైన అనంతమైనతత్త్వమే పరభైరవుడు. దానిలో లయించడమే అసలైన స్నానమని చెప్పబడుతుంది. అందరికీ ఇది సాధ్యం కాదు గనుక, జలంతో చేసే బాహ్యస్నానమనేది అందరికీ అందుబాటులో ఉన్నది. ఇది తప్పక చేయవలసిన విధి కాదు. ఇష్టమైతే చేయవచ్చు. లేకపోతే లేదు. అసలైన స్నానమును చేయడం మాత్రం మరువకూడదు.

కం// పరభైరవ తేజములో

నరగున తాముఙ్గు టెన్న స్నానము జూడన్
ఇరవౌ దేహస్నానము
జరపుట లేకుంట జనుల సౌకర్యమురా

ఆ॥ పరమునందు మునుగ వరస్నాన మదియౌను
ఒడలు దడపుకొనుట యొట్టి యాట
నీటిస్నానమెంచ నీ ఇష్ట సౌఖ్యంబు
ముఖ్యమనగబోరు మునులు దాని

కం॥ స్నానములెన్నో గలవిట
వానిన్, పరస్నానమెంచ వన్నెలకెక్కున్
మేనున్ జలమున దడపుట
జ్ఞానుల కది మెప్పుగాదు; జనవాక్యంబౌ !

ఇతి శ్రీమదాచార్యాభినవగుప్తవిరచితే శ్రీతన్త్రసారే స్నానప్రకాశనం నామ ద్వాదశమాహ్నికమ్ ॥ 12 ॥

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని స్నానప్రకాశనమనే పన్నెండవ ఆహ్నికము.

పదమూడవ ఆహ్నికము

సమయిదీక్షా ప్రకాశనము

యదార్థః - యదార్థము

అథ ప్రసన్నహృదయో యాగస్థానం యాయాత్, తచ్చ యత్రైవ హృదయం ప్రసాదయుక్తం పరమేశ్వరసమావేశయోగ్యం భవతి తదేవ, న తు అస్య అన్యల్లక్షణమ్, ఉక్తావపి ధ్యేయతాదాత్మ్యమేవ కారణమ్, తదపి భావప్రసాదాదేవ ఇతి నాన్యత్ స్థానమ్ |

అప్పుడు ప్రసన్నహృదయముతో యాగస్థానమునకు వెడలవలెను. ఎక్కడైతే హృదయము ప్రసాదయుక్తమై పరమేశ్వరసమావేశయోగ్యము అవుతుందో అదే యాగస్థలము. దీనికంటే దానికి వేరే లక్షణమేమీ లేదు. ఒకవేళ చెప్పబడినప్పటికీ ధ్యేయతాదాత్మ్యతయే దాని కారణము, అదికూడా భావప్రసాదముతోనే సాధ్యమౌతుంది.

పీఠపర్వతాగ్రమ్ ఇత్యాదిస్తు శాస్త్రే స్థానోద్దేశ ఏతత్పర ఏవ బోద్ధవ్యః - తేషు తేషు పీఠాదిస్థానేషు పరమేశనియత్యా పరమేశ్వరావిష్టానాం శక్తీనాం దేహగ్రహణాత్, ఆర్యదేశా ఇవ ధార్మికాణాం, మ్లేచ్ఛదేశా ఇవ అధార్మికాణామ్, పర్వతాగ్రాదేస్తైకాన్తత్వేన విక్షేపపరిహారాత్ ఐకాగ్ర్యపదత్వమ్ ఇతి |

పీఠము, పర్వతాగ్రము మొదలైనవి శాస్త్రములలో చెప్పబడినది ఈ ఉద్దేశ్యముతోనే యని గ్రహించవలెను. ఆయా పీఠాదిస్థానములలో పరమేశ్వరుని నియతివలన, పరమేశ్వరావిష్టములైన శక్తులు దేహగ్రహణము గావించి ఉంటాయి. ఆర్యదేశములలో ఇదే విధముగా ధార్మికులకు, మ్లేచ్ఛదేశములలో అధార్మికులకు జన్మ కలుగుతుంది. పర్వతాగ్రము మొదలైన ఏకాంత ప్రాంతములలో విక్షేపములుండవు గనుక ఏకాగ్రత సులభముగా లభిస్తుంది.

తత్ర యాగగృహాగ్రే బహిరేవ సామాన్యన్యాసం కుర్యాత్, కరయోః పూర్వం, తతో దేహే | హ్రీం-స-ఫ-హ్రీం, హ్రీం-అ-క్ష-హ్రీం ఇత్యాభ్యాం శక్తిశక్తిమద్వాచకాభ్యాం మాలినీశబ్దరాశిమన్త్రాభ్యామ్, ఏకేనైవ ఆదౌ శక్తిః తతః శక్తిమా నితి, ముక్తౌ పాదాగ్రాచ్ఛిరోఽన్తమ్, భుక్తౌ తు సర్వో విపర్యయః|

ఆ యాగగృహాగ్రమున బయటనే సామాన్యన్యాసము చేయవలెను. ముందుగా కరన్యాసము, తదుపరి దేహన్యాసము. హ్రీం-సం-ఫం-హ్రీం, హ్రీం-అం-క్షం-హ్రీం వీనితో శక్తిశక్తిమంతుల వాచకములతో మాలినీశబ్దరాశి మన్త్రములతో, ఒక్కరే అయినప్పటికీ మొదట శక్తి, తరువాత శక్తిమంతుడు. ముక్తాభిలాషులు పాదాగ్రమునుండి శిరస్సు అంతము వరకు, భుక్తాభిలాషులు దీనికి విపర్యయముగా చేయవలెను.

మాలినీ హి భగవతీ ముఖ్యం శాక్తం రూపం బీజయోనిసంఘట్టేన సమస్తకామదుఘమ్ | అస్వర్థం చైతన్నామ రుద్రశక్తిమాలాభిర్యుక్తా ఫలేషు పుష్పితా సంసారశిశిరసంహార నాదభ్రమరీ సిద్ధిమోక్షధారిణీ దానాదానశక్తియుక్తా ఇతి ర-ల-యోరేకత్వస్మృతేః | అత ఏవ హి భ్రష్టవిధిరపి మన్త్ర ఏతన్న్యాసాత్ పూర్ణో భవతి, సాక్షానోఽపి గారుడవైష్ణవాదిర్నిరక్షానతామ్ ఏత్య మోక్షప్రదో భవతి |

భగవంతుని ముఖ్యశక్తి రూపమే మాలిని. బీజము, యోని కలసినప్పుడు అది సమస్తకామములను సిద్ధింపజేస్తుంది. ఈ నామము అన్వర్థచేతస్సు. రుద్రశక్తిమాలతో కూడిన ఇది ఫలములకు పుష్పము వంటిది. సంసారశిశిరమును సంహారము చేసే నాదభ్రమరీ రూపంలో సిద్ధిని కలిగిస్తుంది, మోక్షధారిణి అవుతుంది. దానము అదానము రెంటికీ శక్తియుక్తమౌతుంది. స్మృతులలో 'ర-ల' లకు ఏకత్వము చెప్పబడినది. ఎవడైతే విధులలో భ్రష్టత్వమును పొందినాడో, అతడు కూడా ఈ మంత్రన్యాసము వలన పూర్ణత్వమును పొందుతాడు. మలినముతో కూడిన గారుడ, వైష్ణవాది మంత్రములకు అమలినత్వమొసగి మోక్షప్రదమౌతుంది.

దేహన్యాసానన్తరమ్ అర్ఘపాత్రే అయమేవ న్యాసః । ఇహ హి క్రియాకారకాణాం పరమేశ్వరాభేదప్రతిపత్తిదార్ఢ్యసిద్ధయే పూజాక్రియా ఉదాహరణీకృతా, తత్ర చ సర్వకారకాణామ్ ఇత్థం పరమేశ్వరీభావః, తత్ర యష్ట్రాధారస్య స్థానశుద్ధ్యాపాదానకరణయో రర్ఘపాత్రశుద్ధిన్యాసాభ్యామ్ యష్టుర్దేహ న్యాసాత్, యాజ్యస్య స్థణ్డిలాదిన్యాసాత్ । ఏవం క్రియాక్రమేణాపి పరమేశ్వరీకృత సమస్తకారకః తయైవ దృశా సర్వక్రియాః పశ్యన్ వినాపి ప్రముఖజ్ఞానయోగాభ్యాం పరమేశ్వర ఏవ భవతి ।

దేహన్యాసము తరువాత అర్ఘపాత్రలో కూడా ఇదే న్యాసమును చేయవలెను. ఇందులో క్రియ, కారకుడు ఈ రెంటికీ పరమేశ్వరాభేదప్రతిపత్తి సిద్ధించుట కొరకు పూజ, క్రియ చెప్పబడినవి. అక్కడ సర్వకారకులకు ఈ పరమేశ్వరభావముతోనే సిద్ధి, యజ్ఞకారకులకు స్థానశుద్ధి, అపాదానకరణము, అర్ఘపాత్రశుద్ధి, న్యాసాదులవలన, యజ్ఞకర్తకు దేహన్యాసము ద్వారా, యాగము చేసేవారికి స్థణ్డిలాదిన్యాసము వలన. ఈ విధమైన క్రియాక్రమములలో కూడా పరమేశ్వరుడే ఈ సమస్తకారకుడనిన దృష్టితో సర్వక్రియలను చూచినచో గొప్పదైన జ్ఞానయోగాది సాధనలు లేకున్నప్పటికీ వారు పరమేశ్వరస్వరూపులే అవుతారు.

ఏవమ్ అర్ఘపాత్రే న్యస్య పుష్పధూపాద్యైః పూజయిత్వా తద్విప్రుడ్భిః యాగసారం పుష్పాది చ ప్రోక్షయేత్ । తతః ప్రభామణ్డలే భూమౌ ఖే వా ఓం-బాహ్యపరివారాయ నమ ఇతి పూజయేత్ । తతో ద్వారస్థానే ఓం-ద్వారదేవతాచక్రాయ నమ ఇతి పూజయేత్ । అగుప్తే తు బహిఃస్థానే సతి ప్రవిశ్య మణ్డలస్థణ్డిలాగ్ర ఏవ బాహ్యపరివారద్వారదేవతాచక్రపూజాం పూర్వోక్తం చ న్యాసాది కుర్యాత్, న బహిః । తతోఽపి ఫట్ ఫట్ ఫట్ ఇతి అస్త్రజప్తపుష్పం ప్రక్షిప్య విఘ్నానపసారితాన్ ధ్యాత్వా అన్తః ప్రవిశ్య పరమేశ్వరకిరణేద్ధయా దృష్ట్యా అభితో యాగగృహం పశ్యేత్ ।

ఈ విధముగా అర్ఘపాత్రలో న్యసించి పుష్పధూపాదులతో పూజించి, విప్రులను యాగసారమును పుష్పాదులను ప్రోక్షించాలి. అప్పుడు ప్రభామణ్డలమున భూమిలో గాని, ఆకాశంలో గాని, ఓం బాహ్యపరివారాయ నమః అని పూజించవలెను. అప్పుడు ద్వారస్థానమున ఓం ద్వారదేవతాచక్రాయ నమః అని పూజించవలెను. రహస్యము కానిచో, బహిఃస్థానమునకు వచ్చి మణ్డల స్థణ్డిలాగ్రములో బాహ్యపరివార ద్వార దేవతాచక్రపూజను పూర్వోక్తముగా న్యాసాదులను చేయవలెను. అప్పుడు ఫట్ ఫట్ ఫట్ అంటూ అస్త్రమంత్రముతో పుష్పములనుంచి విఘ్నములు తొలగినట్లుగా ధ్యానించి లోనికి ప్రవేశించి పరమేశ్వరకిరణ దృష్టితో యాగగృహమును చూడవలెను.

తత్ర ముముక్షురుత్తరాభిముఖస్తిష్ఠేత్, యథా భగవదఘోరతేజసా ఝటిత్యేవ పుష్పపాతో భవేత్ । తత్ర పరమేశ్వరస్వాతన్త్ర్యమేవ మూర్త్యాభాసనయా దిక్తత్త్వమ్ అవభాసయతి । తత్ర చిత్ప్రకాశ ఏవ మధ్యం, తత

ఇతరప్రవిభాగప్రవృత్తేః ప్రకాశస్వీకార్యమూర్ధ్వమ్, అతథాభూతమ్ అధః, ప్రకాశనసంముఖీనం పూర్వమ్, ఇతరత్ అపరమ్, సంముఖీభూతప్రకాశత్వాత్ అనన్తరం తత్ప్రకాశధారారోహస్థానం దక్షిణమ్ ఆనుకూల్యాత్, తత్సంముఖం తు అవభాస్యత్వాత్ ఉత్తరమ్, ఇతి దిక్చతుష్కమ్ । తత్ర మధ్యే భగవాన్, ఊర్ధ్వేఽస్య ఐశానం వక్త్రమ్, అధః పాతాలవక్త్రమ్, పూర్వాదిదిక్చతుష్కే శ్రీతత్పురుషాఘోరసద్యోవామాఖ్యమ్, దిక్చతుష్కమధ్యే అన్యాశ్చతస్రః - ఇత్యేవం సంవిన్మహిమైవ మూర్తికృతం దిగ్భేదం భాసయతి, ఇతి దిక్ న తత్త్వాన్తరమ్ ।

ముముక్షువు ఉత్తరాభిముఖముగా కూర్చోవాలి. భగవంతుడైన అఘోరుని తేజస్సుతో అతని పాశములన్నీ కాలిపోతాయి. పరమేశ్వరుని స్వాతన్త్ర్యమే మూర్త్యాభాసనమై దిక్తత్త్వములను దీపింపజేస్తుంది. మధ్యలో నున్నది చిత్ప్రకాశము. అనగా, 'చిత్' యొక్క వెలుగు. అక్కడినుండి ఇతర విభాగముల ప్రవృత్తి జరుగుతుంది. ప్రకాశమును స్వీకరించునది ఊర్ధ్వము, అటుల చేయనిది అధమము, ప్రకాశన సంముఖము పూర్వము, ఇతరమైనది అపరము, సంముఖీభూతప్రకాశము యొక్క లోపల దాని ధారారోహస్థానము దక్షిణము, అనుకూలమున్నది గనుక, దానికి అవభాసితమైనది ఉత్తరము, ఇవి నాలుగు దిక్కులు. ఆ మధ్యలో భగవంతుడు, ఊర్ధ్వమున ఈశానముఖము, అధరమున పాతాలవక్త్రము, పూర్వాది నాలుగు దిక్కులలో తత్పురుష, అఘోర, సద్యోజాత, వామదేవాఖ్యములు, నాలుగు దిక్కుల మధ్యలో ఇంకొక నాలుగు దిక్కులుంటాయి. ఈ విధముగా సంవిత్ యొక్క మహిమమే మూర్తులుగా దిక్కులను కల్పిస్తుంది. దిక్కులు వేరే తత్త్వములు కావు.

యథా యథా చ స్వచ్ఛాయా లఙ్ఘయితుమ్ ఇష్టా సతీ పురః పురో భవతి తథా పరమేశ్వరమధ్యతామేతి సర్వాధిష్ఠాతృత్వైవ మాధ్యస్థ్యమ్ ఇత్యుక్తమ్ । ఏవం యథా భగవాన్ దిగ్విభాగకారీ తథా సూర్యోఽపి, స హి పారమేశ్వర్యేవ జ్ఞానశక్తిరిత్యుక్తం తత్ర తత్ర, తత్ర పూర్వం వ్యక్తేః పూర్వా యత్రైవ చ తథా తత్రైవ, ఏవం స్వాత్మాధీనాపి స్వసంముఖీనస్య దేశస్య పురస్తాత్త్వాత్ । ఏవం స్వాత్మసూర్య పరమేశ త్రితయైకీభావనయా దిక్కర్తా ఇతి అభినవగుప్తగురవః ।

ఏ విధముగా ఒకడు తన నీడను దాటాలని చూచినప్పటికీ అది ముందుముందుకు పోతూ ఉంటుందో, అదే విధముగా పరమేశ్వరుడు కూడా సర్వాధిష్ఠాతయైనప్పటికీ మధ్యలోనే ఉంటాడు. ఏ విధముగా భగవంతుడు దిగ్విభాగకారి యౌతున్నాడో అదే విధముగా సూర్యుడు కూడా. అతడు పరమేశ్వరుని జ్ఞానశక్తియేనని అక్కడక్కడ చెప్పబడినది. దీని ప్రకాశము ఎక్కడెక్కడ ముందుగా పడుతుందో అది తూర్పు. కనుక ఆత్మాధీనమైనప్పటికీ స్వసమ్ముఖమైన దిశ తూర్పు. ఈ విధముగా స్వాత్మ, సూర్యుడు, పరమేశ్వరుడు - ఈ ముగ్గురి ఏకైక భావనతో దిక్కులను భావించవలెనని అభినవగుప్తుల గురువుల సిద్ధాంతము.

ఏవం స్థితే ఉత్తరాభిముఖమ్ ఉపవిశ్య దేహపుర్యష్టకాదౌ అహంభావత్యాగేన దేహతాం దహేత్ సంనిధావపి పరదేహవత్ - అదేహత్వాత్, తతో నిస్తరఙ్గధ్రువధామరూఢస్య దృష్టిస్వాభావ్యాత్ యా కిల ఆద్యా స్పన్దకలా సైవ మూర్తిః, తదుపరి యథోపదిష్టయాజ్యదేవతాచక్రన్యాసః, ప్రాధాన్యేన చ ఇహ శక్త్యయో యాజ్యాః - తదాసనత్వాత్ భగవన్నవాత్మాదీనాం శక్తేరేవ చ పూజ్యత్వాత్, ఇతి గురవః । తత్ర చ పఞ్చ అవస్థా జాగ్రదాద్యాః, షష్ఠీ చ అనుత్తరా నామ స్వభావదశా అనుసంధేయా, - ఇతి షోఢా న్యాసో భవతి ।

ఈ స్థితిలో ఉత్తరాభిముఖముగా కూర్చుండి దేహపుర్యష్టకములో అహంభావత్యాగము ద్వారా

దేహత్వమును దహించవలెను. దగ్గరున్నప్పటికీ పరదేహములాగా, దేహము లేనట్లుగా. అప్పుడు నిస్తరఙ్గ ధ్రువధామమును పొందవలెను. స్వభావపరముగా అది సమస్తసృష్టిని చేయగల స్పందన. తదుపరి యథోపదిష్ట యాజ్యదేవతాచక్రన్యాసము. ప్రాధాన్యమును బట్టి శక్తులను యజింపవలెను. భగవంతుని నవశక్తులకు ఆసనములిచ్చి, గురువచనానుసారముగా శక్తులను పూజించవలెను. అక్కడ జాగ్రదాది అయిదు అవస్థలున్నాయి. ఆరవది అనుత్తరమనిన పేరుగల స్వభావదశ. ఈ విధముగా న్యాసము ఆరువిధములుగా ఉంటుంది.

తత్ర కారణానాం బ్రహ్మ-విష్ణు-రుద్రేశ-సదాశివ-శక్తిరూపాణాం ప్రత్యేకమ్ అధిష్ఠానాత్ షట్త్రింశత్తత్త్వ కలాపస్య లౌకికతత్త్వోత్తీర్ణస్య భైరవభట్టారకాభేదవృత్తే న్యాసే పూర్ణత్వాత్ భైరవీభావః తేన ఏతత్ అనవకాశమ్ | యదాహుః 'అతరఙ్గరూఢౌ లబ్ధాయాం పునః కిం తత్త్వసృష్ట్రిన్యాసాదినా' ఇతి | తావత్ హి తదతరఙ్గం భైరవవపుః యత్ స్వాత్మని అవభాసిత సృష్టిసంహారా వైచిత్ర్యకోటి |

ఆయా కారణములలో బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వర, సదాశివ, శక్తిరూపములలో ప్రత్యేకముగా అధిష్ఠాతలై ముప్పదియారు కళలతో ఉంటుంది. లౌకికతత్త్వోత్తీర్ణమై భైరవభట్టారకునితో అభేదవృత్తి న్యాసము ద్వారా పూర్ణత్వమును పొంది భైరవభావములో ప్రవేశిస్తాడు. కనుక దీనిని చెప్పేదేమున్నది? ఇలా చెప్పబడినది 'అతరఙ్గరూఢౌ లబ్ధాయాం పునః కిం తత్త్వసృష్ట్రిన్యాసాదినా'. ఆ అతరఙ్గమే భైరవునిగా స్వాత్మరూపములో సృష్టిసంహారాది విచిత్రకోటులను గావిస్తూ ఉంటుంది.

ఏవమ్ అన్యోన్యమేలకయోగేన పరమేశ్వరీభూతం ప్రాణదేహబుద్ధ్యాది భావయిత్వా బహిరస్తః పుష్ప- ధూప- తర్పణాద్యైర్యథాసంభవం పూజయేత్ | తత్ర శరీరే ప్రాణే ధియి చ తదనుసారేణ శూలాబ్జన్యాసం కుర్యాత్, తద్యథా-ఆధారశక్తిమూలే మూలం, కన్ద ఆమూలసారకం లమ్బికాన్తే, కలాతత్త్వాన్తో దణ్డః, మాయాత్మకో గ్రన్థిః, చతుష్కికాత్మా శుద్ధవిద్యాపద్మం, తత్రైవ సదాశివభట్టారకః స ఏవ మహాప్రేతః - ప్రకర్షేణ లీనత్వాత్ బోధాత్ ప్రాధాన్యేన వేద్యాత్మకదేహక్షయాత్ నాదామర్శాత్మకత్వాచ్చ, ఇతి |

ఈ విధముగా అన్యోన్యమేలకయోగముతో పరమేశ్వరభూతములుగా ప్రాణ, దేహ, బుద్ధ్యాదులను భావించుచూ బహిరస్తములలో పుష్ప, ధూప, తర్పణాదులతో పూజింపవలెను. శరీర-ప్రాణ-బుద్ధులలో చెప్పబడిన రీతిలో శూలాబ్జన్యాసము చేయవలెను. ఎట్లనగా - ఆధారశక్తిమూలమున మూలము, కన్దము లమ్బికాన్తము వరకు, కలాతత్త్వాన్తము వరకు దణ్డము, మాయాత్మకమైనది గ్రన్థి, చతుష్కికాత్మయైనది శుద్ధవిద్యాపద్మము, దానిపైన సదాశివభట్టారకుడున్నాడు, ఆయనే మహాప్రేతము - ప్రకర్షము, లీనత, బోధయొక్క ప్రాధాన్యతవలన, వేద్యాత్మకమైన దేహము క్షయమగుటవలన, నాదము యొక్క ఆమర్శనమువలన.

తన్నాభ్యుత్థితం తస్మూర్ధరన్ధ్ర త్రయనిర్గతం నాదాన్తర్వర్తిశక్తి వ్యాపినీ సమనారూప మరాత్రయం ద్విషట్కాన్తం, తదుపరి శుద్ధపద్మత్రయమ్ ఔన్మనసమ్, ఏతస్మిన్ విశ్వమయే భేదే ఆసనీకృతే అధిష్ఠాతృతయా వ్యాపకభావేన ఆధేయభూతాం యథాభిమతాం దేవతాం కల్పయిత్వా యత్ తత్రైవ సమస్తభావనిర్భరాత్మని విశ్వభావార్పణం తదేవ పూజనం, యదేవ తన్మయీభవనం తద్ధ్యానం, యత్ తథావిధాన్తః పరామర్శ సద్భావనాదాన్దోలనం స జపః, యత్ తథావిధపరామర్శ క్రమప్రబుద్ధ మహాతేజసా తథాబలాదేవ

విశ్వాత్మీకరణం స హోమః, తదేవం కృత్వా పరివారం తత ఏవ వహ్నిరాశేర్విస్ఫులిఙ్గవత్ ధ్యాత్వా తత్రైవ పూజయేత్ ।

దాని నాభినుండి ఉదయించి శిరస్సులోని మూడు రంధ్రములనుండి నిర్గమించి నాదాన్తర్వర్తియైన శక్తి, వ్యాపినీ, సమనా రూపములతో అరాత్రయమై ద్విషట్కాన్తమువరకూ ఉన్నది. దానిపైన మూడు శుద్ధపద్మములతో టెన్మసనమున్నది. అక్కడ విశ్వమయమైన భేదముతో ఆసనమును కల్పించి అధిష్ఠాత్రమై వ్యాపకభావముతో ఆధేయముగా ఉన్నదానిని ఇష్టదేవతగా కల్పించి అక్కడే సమస్వభావము నిండిన ఆత్మతో విశ్వభావార్పణం గావించుటయే పూజనము. దానిలో తన్మయీభావమే ధ్యానము. దీనియొక్క అన్తఃపరామర్శ సద్భావనాద డోలికయే జపము. ఈ పరామర్శ క్రమములో ఉదయించిన మహాతేజస్సులో విశ్వాత్మను హుతం గావించడం హోమము. అట్లా చేసి, ఆ అగ్నిలోనుండి వెలువడుతున్న రవ్వల వలె పరివారదేవతలను ధ్యానించి పూజించాలి.

శ్లో॥ ద్వాదశాన్తమిదం ప్రాగ్రం త్రిశూలం మూలతః స్మరన్ ।
దేవీచక్రాగ్రగమ్ త్యక్తక్రమః ఖచరతాం వ్రజేత్ ॥
మూలాధారాద్విషట్కాన్తవ్యోమాగ్రాపూరణాత్మికా ।
ఖేచరీయం ఖసంచారస్థిభ్యాం ఖామృతాశనాత్ ॥

ద్వాదశాంతము వరకూ తూర్పుపైకి పోతున్న త్రిశూలమును మూలమునుండి దేవీచక్రముపైవరకూ త్యక్తక్రమములో స్మరించితే ఖేచరత్వములో కుదురు లభిస్తుంది. మూలాధారమునుండి ద్వాదశాంతము చివరవరకూ ఆకాశమును పూరించుచూ, ఖేచరియై, ఆకాశమున సంచరిస్తూ, ఆకాశామృతమును త్రాగుతుంది.

ఏవమ్ అన్తర్యాగమాత్రాదేవ వస్తుతః కృతకృత్యతా । సత్యతః తదావిష్టస్య తథాపి బహిరపి కార్యోయాగోఽవచ్ఛేదహానయ ఏవ, యోఽపి తథా సమావేశభాక్ న భవతి తస్య ముఖ్యో బహిర్యాగః, తదభ్యాసాత్ సమావేశలాభో-యతస్తస్యాపి తు పశుతా తిరోధానాయాన్తర్యాగః-తదరూఢావపి తత్సంకల్పబలస్య శుద్ధిప్రదత్వాత్ ।

ఈ విధమైన అంతర్యాగము వల్లనే కృతకృత్యత లభిస్తుంది. సత్యముగా దీనియందు కుదురుగా ఉన్నవానికి లోపలగాని, బయటగాని, యాగకార్యము నిర్విఘ్నముగా జరుగుతుంది. అయినప్పటికీ ఈ విధమైన సమావేశమున్నవానికి బహిర్యాగము ముఖ్యము కాదు. ఈ అభ్యాసమువలన సమావేశ లాభమౌతుంది. పశుత్వ తిరోధానమే అంతర్యాగము. దానిని అందుకోలేనివానికి కూడా ఆ సంకల్పబలమే శుద్ధిని కలిగిస్తుంది.

అథ యదా దీక్షాం చికీర్షేత్ తదాధివాసనార్థం భూమిపరిగ్రహం, గణేశార్చనం, కుమ్భకలశయోః పూజాం, స్థణ్డిలార్చనం, హవనం చ కుర్యాత్ । నిత్యనైమిత్తికయోస్తు స్థణ్డిలాద్యర్చనహవనే ఏవ । తత్ర అధివాసనం శిష్యస్య సంస్కృతయోగ్యతాధానమ్ అభ్యాకరణమివ దన్తానాం, దేవస్య కర్తవ్యోన్ముఖత్వగ్రాహణమ్, గురోస్తద్గ్రాహణమ్ । ఉపకరణద్రవ్యాణాం యాగగృహాన్తర్వర్తితయా పరమేశతేజోబృంహణేన పూజోపకరణ యోగ్యతార్పణమితి ।

దీక్షయందు చికీర్ష ఉదయించినప్పుడు అధివాసం కొరకు భూమిపరిగ్రహం, గణేశార్చనం,

కుమ్భకలశముల పూజనము, స్థణ్డిలార్చనము, హవనము చేయవలెను. నిత్యనైమిత్తికములలో కూడాను స్థణ్డిలాద్యర్చనము హవనము చేయవలెను. అప్పుడు అధివాసనము, శిష్యునకు సంస్కృతయోగ్యతాధానము, దంతముల అఖ్షీకరణము, దేవతయొక్క కర్తవ్యోన్ముఖత్వగ్రాహణము, గురువు ద్వారా దానిని స్వీకరించుట, ఉపకరణద్రవ్యములలో యాగగృహాన్తర్వర్తిత్వము ద్వారా పరమేశతేజోబృంహణముతో పూజోపకరణముల యోగ్యతార్పణము గావించాలి.

తత్ర సర్వోపకరణపూర్ణం యాగగృహం విధాయ భగవతీం మాలినీం మాతృకాం వా స్మృత్వా తద్వర్ణతేజఃపుఞ్జభరితం గృహీతం భావయన్ పుష్పాఞ్జలిం క్షిపేత్ | తత ఉక్తాస్త్రజప్తాని యథాసంభవం సిద్ధార్థధాన్యాక్షతలాజాదీని తేజోరూపాణి వికీర్య ఐశాన్యాం దిశి క్రమేణ సంఘట్టయేత్, ఇతి భూపరిగ్రహః |

ఆ విధముగా సర్వోపకరణపూర్ణమైన యాగగృహమును ప్రవేశించి భగవతియగు మాలినిని లేదా మాతృకలను స్మరించి ఆమెయొక్క వర్ణతేజోపుంజములను గ్రహించినట్లుగా భావించి పుష్పాంజలిని సమర్పించవలెను. అప్పుడు ఇంతకుముందు చెప్పబడిన అస్త్రమంత్రములను జపించి యథాసంభవముగా సిద్ధార్థ, ధాన్య, అక్షత, లాజలు మొదలైనవాటిని తేజోరూపములుగా, ఈశాన్యదిశాక్రమంలో పెట్టవలెను. ఇది భూపరిగ్రహణము.

తతః శుద్ధవిద్యాన్తమాసనం దత్త్వా గణపతేః పూజా, తతః కుమ్భమ్ అనన్తద్రవ్యపూరితమ్ అలంకృతం పూజయేత్, తతో యాజ్యమను పూగం న్యస్య తత్ర ముఖ్యం మన్త్రం సర్వాధిష్ఠాతృతయా విధిపూర్వకత్వేన స్మరన్ అష్టోత్తరశతమన్త్రితం తేన తం కుమ్భం కుర్యాత్ | ద్వితీయకలశే విఘ్నశమనాయ అస్త్రం యజేత్ | తతః స్వస్వదిక్షు లోకపాలాన్ సాస్త్రాన్ పూజయేత్ | తతః శిష్యస్య ప్రాక్ దీక్షితస్య హస్తే అస్త్రకలశం దద్యాత్ | స్వయం చ గురుః కుమ్భమ్ ఆదదీత | తతః శిష్యం గృహపర్యన్తేషు విఘ్నశమనాయ ధారాం పాతయన్తం సకుమ్భోఽనుగచ్ఛేత్ ఇమం మన్త్రం పఠన్-

అపుడు శుద్ధవిద్యాన్తమాసనముతో గణపతిని పూజించవలెను. అపుడు అనన్తద్రవ్యపూరితము, అలంకృతము అయిన కుంభమును పూజించవలెను. తరువాత పూగమును అందులో ఉంచి సర్వాధిష్ఠాతయైన మంత్రమును విధిపూర్వకముగా స్మరించి అష్టోత్తరశతమన్త్రితము జేసి ఆ కుంభమును అభిమంత్రించాలి. ద్వితీయకలశమున విఘ్నశమనార్థమై అస్త్రమును ఉంచాలి. ఆయా దిక్కులలో అస్త్రసహితులైన లోకపాలకులను పూజించాలి. ఇంతకు ముందే దీక్షితుడైన శిష్యునకు హస్తములో అస్త్రకలశమునివ్వాలి. గురువు స్వయముగా కుంభమును తీసుకోవాలి. ఆ తరువాత విఘ్నశమనార్థమై గృహపర్యన్తము ధార పోసుకుంటూ దానివెంట కుండతో అనుసరిస్తూ ఈ మంత్రమును పఠించాలి.

శ్లో|| భో భోః శక్ర త్వయా స్వస్యాం దిశి విఘ్నప్రశాన్తయే |
సావధానేన కర్మాన్తం భవితవ్యం శివాజ్ఞయా ||

ఓ ఇంద్రా ! విఘ్నప్రశాంతికొరకు కర్మాంతమువరకూ సావధానంగా నీయొక్క దిశలో నీవుండవలెను. ఇది శివాజ్ఞ.

త్ర్యక్షరే నామ్ని - భో ఇత్యేకమేవ | తత ఐశాన్యాం దిశి కుమ్భం స్థాపయేత్ | వికిరోపరి అస్త్రకలశమ్ | తత

ఉభయపూజనమ్ | తతః స్థణ్డిలమధ్యే పరమేశపూజనమ్ | తతః అగ్నికుణ్డం పరమేశ్వరశక్తిరూపతయా భావయిత్వా తత్ర అగ్నిం ప్రజ్వాల్య హృదయాన్తర్బోధాగ్నినా సహ ఏకీకృత్య మన్త్రపరామర్శసాహిత్యేన జ్వలన్తం శివాగ్నిం భావయిత్వా, తత్ర న్యస్య అభ్యర్చ్య మన్త్రాన్ తర్పయేత్ ఆజ్యేన తిలైశ్చ | అర్ఘపాత్రేణ చ ప్రోక్షణమేవ తిలాజ్యాదీనాం సంస్కారః | స్రుక్స్రువయోశ్చ పరమేశాభేదదృష్టిరేవ హి సంస్కారః |

మూడక్షరముల నామమును, 'ఫో' అని ఒక్కసారిగాను అనవలెను. అప్పుడు ఈశాన్యదిశలో కుంభమును స్థాపించవలెను. వికిరముపైన అస్త్రకలశము నుంచవలెను. రెండింటిని పూజించవలయును. అప్పుడు స్థణ్డిలమధ్యములో పరమేశపూజనము గావించవలయును. అప్పుడు పరమేశ్వరశక్తిరూపమైన అగ్నికుండమును భావించి దానిలో అగ్నిని జ్వలింపజేసి హృదయాన్తమైన బోధాగ్నితో ఒక్కటిచేసి మంత్రపరామర్శ సహితముగా వెలుగుతున్న శివాగ్నిని భావించి, దానిలో నెయ్యి నువ్వులను మంత్రములతో తర్పణము చేయవలెను. అర్ఘపాత్రతో ప్రోక్షణముగావిస్తే తిలాదుల సంస్కారము జరుగుతుంది. స్రుక్స్రువములకు కూడా పరమేశాభేదదృష్టితోనే సంస్కారము.

తతో యథాశక్తి హుత్వా స్రుక్స్రువౌ ఊర్ధ్వాధోముఖతయా శక్తిశివరూపౌ పరస్పరోన్ముఖౌ విధాయ సముపాదోర్థితో ద్వాదశాన్తగగనోదిత శివపూర్ణచన్ద్రనిఃసృత పతత్పరామృతధారా భావనాం కుర్వన్ వౌషడన్తం మన్త్రమ్ ఉచ్చారయన్ చ ఆజ్యక్షయాన్తం క్షిపేత్, ఇతి పూర్ణాహుతిః మన్త్రచక్రసంతర్పణీ | తతశ్చరుం ప్రోక్షితమానీయ స్థణ్డిల-కలశ-కుమ్భ-వహ్నిషు భాగం భాగం నివేద్య, ఏకభాగమ్ అవశేష్య, శిష్యాయ భాగం దద్యాత్ | తతో దన్తకాష్ఠమ్ | తత్పాతోఽగ్ని-యమ- నిర్ఋతిదిక్షు అధశ్చ న శుభ ఇతి | తత్ర హోమోఽస్త్రమన్త్రేణ కార్యః |

యథాశక్తి హోమము గావించి, స్రుక్స్రువములను ఊర్ధ్వాధోముఖములుగా శక్తిశివరూపములుగా పరస్పరోన్ముఖములుగా ఉంచి నిలుచుండి, ద్వాదశాంతగగనములో ఉదయించిన శివరూపమైన పూర్ణచంద్రుని నుండి కురియుచున్న అమృతధారను భావిస్తూ ద్వాదశాంతము వరకూ మంత్రమును ఉచ్చరిస్తూ నెయ్యి క్షయమయ్యేవరకూ ఉండాలి. ఇది పూర్ణాహుతి. అన్ని మంత్రచక్రములను సంతర్పణ గావిస్తుంది. అప్పుడు ప్రోక్షితమైన చరువును తెచ్చి స్థణ్డిల, కలశ, కుంభ, వహ్నులలో ఒక్కొక్కభాగముగా నివేదించాలి. మిగిలిన ఒక భాగమును శిష్యునకు ఇవ్వాలి. తరువాత దంతకాష్ఠమును విసరివేయాలి. అది దక్షిణ, నైరృతి దిక్కులకు గాని, క్రిందకు గాని పడితే శుభం కాదు. దానికొరకు అస్త్రమన్త్రములతో హోమము చెయ్యాలి.

తతో విక్షేపపరిహారేణ భావిమన్త్ర దర్శనయోగ్యతాయై బద్ధనేత్రం శిష్యం ప్రవేశ్య జానుస్థితం తం కృత్వా పుష్పాఞ్జలిం క్షేపయేత్ | తతః సహసా అపాసితనేత్రబన్ధోఽసౌ శక్తిపాతానుగ్రహీత కరణత్వాత్ సంనిహితమన్త్రం తత్స్థానం సాక్షాత్కారేణ పశ్యన్ తన్మయో భవతి, అనుగృహీత కరణానాం మన్త్రసంనిధిః ప్రత్యక్షః యతస్పృతామ్ ఇవ భూతానామ్ |

అప్పుడు విక్షేపపరిహారము కొరకు భావిమంత్రదర్శనయోగ్యత కొరకు బద్ధనేత్రుడైన శిష్యుని ప్రవేశింపజేసి కూర్చున్నపిదప పుష్పాంజలిని సమర్పింపజేయాలి. అప్పుడు నేత్రబంధములను విప్పగా, శక్తిపాతమును గ్రహించినకారణం చేత మంత్రసాక్షాత్కారమై తన్మయత్వము కలుగుతుంది. అనుగ్రహము యొక్క కారణముగా మంత్రసంనిధి ప్రత్యక్షమౌతుంది. వానినిచూచినప్పుడు పశువులకు భయము కలుగుతుంది.

తతః స్వదాక్షిణహస్తే దీప్యతయా దేవతాచక్రం పూజయిత్వా తం హస్తం మూర్ధహృన్నాభిషు శిష్యస్య పాశాన్ దహన్తం నిక్షిపేత్ | తతో వామే సౌమ్యతయా పూజయిత్వా శుద్ధతత్త్వాప్యాయినం, తతః ప్రణామం కుర్యాత్ | తతో భూతదేవతాదిగ్బలిం మద్యమాంసజలాదిపూర్ణం బహిర్దద్యాత్, ఆచామేత |

తన దక్షిణహస్తములో వెలుగుచున్న దేవతాచక్రమును పూజించి ఆ హస్తమును శిష్యుని శిరస్సు హృదయము నాభి వీనిపైన ఉంచి శిష్యుని పాశములను దహించాలి. ఎడమచేతిలో శుద్ధతత్త్వాప్యాయమైన సోమతత్త్వముతో పూజించి ప్రణామం చెయ్యాలి. అప్పుడు మద్య, మాంస, జలాదిపూర్ణమైన భూతదేవతా దిగ్బలిని బయటుగా చేసి ఆచమించాలి.

తతః స్వయం చరుభోజనం కృత్వా శిష్యాత్మనా సహ ఐక్యమాపన్నః ప్రబుద్ధవృత్తిః తిష్ఠేత్ | స్వపన్ అపి ప్రభాతే శిష్యః చేత్ అశుభం స్వప్నం వదేత్ తత్ అస్మై న వ్యాకుర్యాత్ - శఙ్కాతఙ్కౌ హి తథాస్య స్యాతామ్, కేవలమ్ అస్త్రేణ తన్నిష్కృతిం కుర్యాత్ |

అప్పుడు స్వయముగా చరుభోజనము చేసి శిష్యునితో ఏకత్వ భావనతో ప్రబుద్ధవృత్తిలో ఉండాలి. నిద్రించిన తర్వాతగాని, ప్రభాతకాలమునగాని శిష్యునకు ఏమైనా అశుభస్వప్నములు అగుపిస్తే వాటిని వివరించకూడదు. అట్లా చెయ్యడం వలన అతని మనసులో శంకలు కలుగుతాయి. కేవలం అస్త్రమంత్రములతో వాటికి నిష్క్ృతి చేయాలి.

తతస్తత్రైవ పరమేశ్వరం పూజయిత్వా తదగ్రే శిష్యస్య ప్రాణక్రమేణ ప్రవిశ్య హృత్కణ్ఠతాలులలాటరన్ధ్రద్వాదశాన్తేషు షట్సు కారణషట్కస్పర్శం కుర్వన్ ప్రత్యేకమష్టౌ సంస్కారాన్ చిన్తయన్ కంచిత్కాలం శిష్యప్రాణం తత్రైవ విశ్రమయ్య పునరవరోహేత్ | ఇత్యేవాపాది తాష్టాచత్వారింశత్సంస్కారోపలిక్షత రుద్రాంశాపత్తిః సమయీభవతి | తతః అస్మై పూజ్యం మన్త్రం పుష్పాద్యైః సహ అర్పయేత్ | తతః సమయాన్ అస్మై నిరూపయేత్ |

అప్పుడు పరమేశ్వర పూజనుగావించి ఆ తరువాత శిష్యుని ప్రాణములో ప్రవేశించి హృదయము, కంఠము, తాలువు, లలాటము, రంధ్రము, ద్వాదశాంతముల లో ఉన్నట్టు కారణషట్కములను స్పర్శిస్తూ అష్టసంస్కారములను స్మరిస్తూ ఆయా స్థలములలో శిష్యుని ప్రాణమును కొంతసమయం పాటు ఉంచి తరువాత వెనుకకు రావలెను. ఈ విధముగా చేయబడిన 48 సంస్కారములవలన శిష్యునిలో రుద్రాంశ ఆవేశించి, అతడు సమయి అవుతాడు. అప్పుడతడు పూజ్యములైన మంత్రములను పుష్పాదులతో కలిపి అర్పించాలి. అప్పుడతనికి సమయమును నిరూపించాలి.

గురౌ సర్వాత్మనా భక్తిః, తథా శాస్త్రే దేవే, తత్ప్రతిద్వన్ద్విని పరాఙ్ముఖతా, గురువత్ గురుపుత్రాదేః విద్యాసంబన్ధకృతస్య తత్పూర్వదీక్షితాదేః సందర్శనమ్ యౌనసంబన్ధస్య తదారాధనార్థమ్, న తు స్వత ఇతి మన్తవ్యమ్ | స్త్రియో వన్ద్యాయాస్తజ్జుగుప్సాహేతుం న కుర్యాత్ | దేవతానామ్ గురూనామ్ తథా మన్త్రం పూజాకాలాత్ ఋతే న ఉచ్చారయేత్ | గురూపభుక్తం శయ్యాది న భుఞ్జీత | యత్ కించిత్ లౌకికం క్రీడాది తత్ గురుసంనిధౌ న కుర్యాత్ | తద్వ్యతిరేకేణ న అన్యత్ర ఉత్కర్షబుద్ధిం కుర్యాత్ | సర్వత్ర శ్రాద్ధాదౌ గురుమేవ పూజయేత్ | సర్వేషు చ నైమిత్తికేషు శాకినీత్యాదిశబ్దాన్ న వదేత్ | పర్వదినాని పూజయేత్ | వైష్ణవాద్యైరధోదృష్టిభిః సహ సంగతిం న కుర్యాత్ | పతచ్ఛాసనస్థాన్ పూర్వజాతిబుద్ధ్యా న పశ్యేత్ | గురువర్గే

గృహాగతే యథాశక్తి యాగం కుర్యాత్ | అధోమార్గస్థితం కంచిత్ వైష్ణవాద్యం తచ్ఛాస్త్రకుతూహలాత్ గురూకృత్యాపి త్యజేత్ | తదాపి న ఉత్కర్షబుద్ధ్యా పశ్యేత్ | లిఙ్గిభిఃసహ సమాచారమేలనం న కుర్యాత్, తాన్ కేవలం యథాశక్తి పూజయేత్ | శఙ్కాస్త్యజేత్ | చక్రే స్థితశ్చరమాగ్ర్యాదివిభాగం జన్మకృతం న సంకల్పయేత్ | శరీరాత్ ఋతే న అన్యత్ ఆయతనతీర్థాదికం బహుమానేన పశ్యేత్ |

గురువన్నచో సర్వాత్మతాభక్తి, అదే విధముగా శాస్త్రములు, దేవతలపట్ల, వాటి విరుద్ధములపట్ల విముఖత్వము, గురువువలె గురుపుత్రులను గౌరవించవలెను. విద్యాసంబన్ధములలో కూడా ఇంతకుపూర్వమే దీక్ష పొంది ఉన్నట్లయితే, వారిని కూడా ఇదే విధముగా ఆరాధించవలెను. వారు యోనిసంభవులని భావించకూడదు. వంధ్యలైన స్త్రీలను జుగుప్సతో చూడరాదు. దేవత, గురు, మంత్రపూజాకాలములలో ఇతర శబ్దములను మాట్లాడకూడదు. గురువు వాడిన శయ్యను వాడరాదు. లౌకికక్రీడలను కొంచమైనా కూడా గురుసన్నిధిలో చెయ్యకూడదు. ఆయనకు వ్యతిరేకులైన వారిపట్ల ఉత్కర్షబుద్ధి పనికిరాదు. శ్రాద్ధాది కార్యముల మొదట్లో గురువును పూజించాలి. అన్ని నిమిత్త కార్యములలోను శాకిని మొదలైన పదములను అనకూడదు. పర్వదినములలో పూజించాలి. అధోదృష్టి కలిగినట్టి వైష్ణవాది మతముల జోలికి పోకూడదు. ఆ శాసనస్థులను పూర్వజాతి దృష్టితో చూడరాదు. గురువర్గములు ఇంటికి వచ్చినపుడు యథాశక్తి యాగము చేయవలెను. అధోమార్గస్థితులైన వైష్ణవాదులలో ఆయా శాస్త్రముల కుతూహలముతో గురువులైనప్పటికీ వారిని త్యజించవలెను. అప్పుడు కూడా వారిని గొప్పగా చూడకూడదు. లింగధారులతో సమానముగా కలువరాదు. వారిని యథాశక్తి పూజించాలి. శంకలను వదలిపెట్టాలి. చక్రమునందు స్థితులైనప్పుడు ఉత్తమకులము మొదలైనవాటిని చూడకూడదు. శరీరమునకు భిన్నములైన తీర్థక్షేత్రములను గొప్పగా చూడకూడదు.

మన్త్రహృదయమ్ అనవరతం స్మరేత్, ఇత్యేవం శిష్యః శ్రుత్వా ప్రణమ్య అభ్యుపగమ్య గురుం ధనదారశరీరపర్యన్తయా దక్షిణయా పరితోష్య పూర్వదీక్షితాంశ్చ దీనానాథాదికాన్ తర్పయేత్ | భావివిధినా చ మూర్తిచక్రం తర్పయేత్ | ఇత్థం సమయీభవతి | మన్త్రాభ్యాసే నిత్యపూజాయాం శ్రవణేఽధ్యయనే అధికారీ, నైమిత్తికే తు సర్వత్ర గురుమేవ అభ్యర్థయేత, ఇతి సామయికో విధిః |

మంత్రహృదయమును నిరంతరము స్మరించాలి. ఈ నియమములను శిష్యుడు విని, ప్రణామం గావించి, గురువునకు ధన, దార, శరీరపర్యన్తము దక్షిణతో తృప్తి పరచి దీనులైన పూర్వదీక్షితులకు తర్పణం చేయాలి. ఇప్పుడు చెప్పబోయే విధితో మూర్తిచక్రమును తర్పణం గావించాలి. ఈ విధముగా సమయి అవుతాడు. అప్పుడు మంత్రాభ్యాసము, నిత్యపూజ, శ్రవణ, అధ్యయనములలో అధికారి అవుతాడు. నైమిత్తికవిధులలో కూడా గురువునే ప్రార్థించాలి. ఇదియే సమయవిధి.

శ్లో|| అధ్వానమాలోచ్య సమస్తమన్తః పూర్ణం స్వమాత్మానమథావలోక్య |
పశ్యేదనుగ్రహధియా ద్విషట్క-పర్యన్తమేవం సమయీ శిశుః స్యాత్ ||

అన్ని అధ్వములను ధ్యానించి, పూర్ణమైన స్వాత్మను దర్శించాలి. అప్పుడు, శిష్యుని ద్వాదశాంతము వరకూ అనుగ్రహబుద్ధితో చూచినచో, శిష్యుడు సమయి అవుతాడు.

వ్యాఖ్యానము

ఈ అధ్యాయములో, సమయదీక్షావిధానము చెప్పబడుచున్నది. సమయదీక్షయనగా హోమపూర్వకమైన మంత్రానుష్ఠాన ప్రక్రియ. ఇది ఒక్కొక్క మెట్టుగా వివరించబడుతుంది. మొదటగా, స్నానమును పూర్తిచేసిన తరువాత, శాంతముగా ఉన్న హృదయముతో యాగస్థానమునకు చేరవలెను.

యాగస్థలము

యాగస్థలమంటే ఏమిటి? ఏ స్థలములోనైతే, హృదయము దానంతట అది ప్రశాంతముగా మారి, ఈశ్వరుని యందు లగ్నమై, ఆయనయొక్క అనుగ్రహమును స్వీకరించడానికి సిద్ధమౌతుందో, అదే యాగస్థలము. దీనికంటే వేరే లక్షణమేమీ యాగస్థలమునకు ఉండదు. ఒకవేళ, దానికి ఇతర లక్షణములున్నాయని చెప్పబడినప్పటికీ, ధ్యేయమునందు ఉపాసకునికి కలిగే చిత్తతాదాత్మ్యతయే ఆ లక్షణముల వెనుకనున్న అసలైన కారణమౌతుంది. అదియే యాగస్థలమును నిర్వచించుటకు గల అసలైన కారణము.

ప్రత్యేకస్థలముల ప్రభావము

అదికూడా, భావము యొక్క స్థిరత్వముతో, ఏకాగ్రతతోనే సాధ్యమౌతుంది. ఆశ్రమము, పీఠము, పర్వతాగ్రము, నదీతీరము మొదలైన స్థలములు ధ్యానమునకు ప్రశస్తములైనవని శాస్త్రములలో చెప్పబడినది ఈ ఉద్దేశ్యముతోనే యని గ్రహించవలెను. ఎందుకనగా, ఆయా స్థానములలో, పరమేశ్వరునిచే ఏర్పరుచబడిన ప్రకృతిపరమైన నియమము (నియతి) వలన, పరమేశ్వరస్వరూపములైన కొన్ని శక్తులు, రూపములను తీసుకుని నిలచియుంటాయి. అంటే, ఆయా స్థలములను బట్టి, వాటి భౌగోళిక స్వరూపములను బట్టి, అక్కడ ఎంతో కాలముగా జరుగుతున్నట్టి కార్యకలాపములను బట్టి, ఆయా శక్తితరంగములు ఆయా ప్రదేశములలో వ్యాపించి ఉంటాయి. వాటికి తగిన జీవులు అక్కడకు ఆకర్షింపబడతారు. ఇది దైవనియతి.

ఇదే విధముగా, ఆర్యదేశములలో ధర్మప్రవర్తన కలిగిన జీవులకు, మ్లేచ్ఛదేశములలో అధర్మప్రవర్తన కలిగిన జీవులకు జన్మ కలుగుతుంది. ఆయా ప్రాంతములకు అనుగుణములైన సంస్కారములు కలిగిన జీవులే అక్కడ జన్మిస్తారు. పర్వతాగ్రము మొదలైన ఏకాంత ప్రాంతములలో మనసును చెదురగొట్టే ధ్వనులు, గందరగోళములు ఉండవు గనుక, అలాంటి చోట్లలో ఏకాగ్రత సులభముగా లభిస్తుంది. కనుక, అవి సాధనకు అనుకూలములని చెప్పబడింది.

న్యాసము

యాగగృహములోకి ప్రవేశించే స్థలములోనే, అనగా వాకిటిదగ్గరనే, సామాన్యన్యాసమును చేయవలెను. ముందుగా కరన్యాసమును చేసి, తదుపరి దేహన్యాసము (అంగన్యాసము) ను చేయవలెను. వీటికి వరుసగా, హ్రీం-నం-ఫం-హ్రీం, హ్రీం-అ-క్ష-హ్రీం అనే బీజాక్షరములను వాడుకోవలెను. ఇవన్నియు, మాలినీశబ్దరాశి మన్త్రములతోను, శివ శక్తుల బీజాక్షరములతోను కూడియున్న న్యాసములు. శివశక్తులు నిజమునకు ఒక్కరే అయినప్పటికీ, న్యాసవిధానంలోనూ, పూజావిధానం లోనూ, మొదటగా శక్తిని, తరువాత శక్తిమంతుడైన శివుని ధ్యానించవలసి ఉంటుంది. కనుక వీని మొదటిలో శక్తిబీజమైన 'హ్రీమ్' కారము, దాని తరువాత,

శివబీజాక్షరములైన నం, ఫం మొదలైన వర్ణములు వచ్చినాయి. ఈ న్యాసమును రెండు విధములుగా చేయవలసి యుంటుంది. ముక్తిని కోరుకునే సాధకులు, సంహారక్రమంలోను, అనగా, పాదముల నుండి శిరస్సు వరకు పైపైకి దీనిని న్యాసం చేయాలి. అదే విధముగా, భోగములను కోరుకునేవారు దీనికి వ్యతిరేకదిశలోను, అనగా, సృష్టిక్రమములోను, శిరస్సునుండి పాదముల వరకూ న్యాసమును చేయవలెను.

వర్ణముల బీజ - యోనులు

పరమేశ్వరుని యొక్క ప్రధానమైన శక్తిరూపమే మాలినీవర్ణములు. అది బీజములు (అచ్చులు), యోనులు (హల్లులు) అంటూ రెండు విభాగములుగా ఉన్నది. అవి రెండునూ కలసినప్పుడు శివశక్తి సంయోగము జరుగుతుంది. దానినుండి, కుమారుని జననం కలుగుతుంది. అదే విధముగా, బీజయోని సంయుతమైన మంత్రము అన్ని కోరికలనూ సిద్ధింపజేస్తుంది. ఇది చేతనారూపమైనది. ఇది రుద్రశక్తుల యొక్క మాలతో కూడి ఉంటుంది. మంత్రసిద్ధిని ఫలమనుకుంటే, ఈ మంత్రము పుష్పము వంటిది. పుష్పము నుండి ఫలము వస్తుంది. అదే విధముగా, ఈ మంత్రము నుండి మంత్రసిద్ధి లభిస్తుంది. ప్రకృతి యంతయూ మోడువారి పోయే శిశిరఋతువును అంతం చేసేది వసంత ఋతువు. వసంతప్రవేశంతో వికసించే పూలకోసం తుమ్మెదలు ప్రత్యక్షమై కనువిందు చేస్తాయి. సంసారమును సారహీనమైన శిశిరఋతువుగా భావిస్తే, ఈ మంత్రజపంతో వినవచ్చే భ్రామరీనాదం తుమ్మెదను సూచిస్తుంది. ఈ నాదం సంసారపు శిశిరమును నాశనం చేస్తుంది. మోక్షమును సునాయాసముగా అందిస్తుంది. దానమిచ్చే సమయములోను, దానమును స్వీకరించే సమయంలోను, ఈ మంత్రమును ఉపయోగించుకొన వచ్చును.

న్యాస ప్రాముఖ్యత

స్మృతులలో 'ర' వర్ణమునకు 'ల' వర్ణమునకు అభేదము చెప్పబడినది. కనుక, 'హ్రీమ్' అనబడు మంత్రము, 'హ్లీమ్' అనబడు మంత్రమూ రెండునూ సమానములే. కొంతమంది తాము చేయవలసిన విధులను విస్మరించి, ఆచారభ్రష్టత్వమును పొంది ఉంటారు. అటువంటివారు కూడా, ఈ మంత్రన్యాసమును చేయడం వలన పూర్ణత్వమును పొందుతారు. కోరికలను కోరుకుంటూ సాధన గావింపబడే గారుడము మొదలైన వైష్ణవమంత్రములకు కూడా ఈ న్యాసజపము శుద్ధిని కలిగించి, మోక్షప్రదమౌతుంది. కనుక అన్ని విధులలోనూ ఈ న్యాసము చాలా మంచిది. ఈ విధముగా అంగన్యాస కరన్యాసములు చేసిన తరువాత అర్ఘపాత్రలో కూడా ఇదే న్యాసమును చేయవలెను.

క్రియలలో ఉండవలసిన భావన

చేయబడు క్రియకు, చేయుచున్న కారకునికి, ఈ రెంటికి పరమేశ్వరునితో అభేదము సిద్ధించుట మాత్రమే, హోమము, పూజ మొదలైన క్రియల పరమోద్దేశ్యమై యున్నది. ఈ పరమేశ్వరభావముతోనే అన్ని క్రియలలోనూ సిద్ధి లభిస్తుంది. యజ్ఞకారకులకేమో స్థానశుద్ధి, అపాదానకరణము, అర్ఘపాత్రశుద్ధి, న్యాసము మొదలైన క్రియలవలన లభిస్తుంది. యజ్ఞకర్తకు దేహన్యాసము ద్వారా లభిస్తుంది. యాగము చేసేవారికి స్థండిలాదిన్యాసము వలన లభిస్తుంది. ఈ విధమైన క్రియలను చేసే సమయంలో కూడా, 'పరమేశ్వరుడే ఈ సమస్తకారకుడ'నిన దృష్టితో సర్వక్రియలను చూచినచో, గొప్పవైన జ్ఞానయోగాది సాధనలు చేయకున్నప్పటికీ,

వారు కూడా పరమేశ్వరస్వరూపులే అవుతారు. హోమము మొదలైన అన్ని క్రియలలోనూ ఈ భావన చాలా ముఖ్యమైనది.

ద్వారపూజ

ఈ విధమైన విధానముతో అర్ఘపాత్రలో న్యాసము చేసి, పుష్పము, ధూపము మొదలైన వస్తువులతో పూజించి, విప్రులను, యాగసారమును, పూజాసామాగ్రిని కూడా ప్రోక్షించాలి. అప్పుడు భూమిలో గాని, ఆకాశంలో గాని, వెలుగును ధ్యానిస్తూ, "ఓం బాహ్యపరివారాయ నమః" అని పరివారదేవతలను పూజించవలెను. తరువాత, యాగస్థలము యొక్క ద్వారసమీపంలో "ఓం ద్వారదేవతాచక్రాయ నమః" అని ద్వారదేవతలను పూజించవలెను. సామాన్యముగా, ఇటువంటి యాగములను రహస్యముగా చేయవలెను. కానీ, రహస్యము కాకపోతే, యాగస్థలముయొక్క బయట ప్రదేశమునకు వచ్చి, బాహ్యపరివార దేవతాపూజను, ద్వారదేవతా చక్రపూజను ఇంతకు ముందు చెప్పబడినట్లుగా, న్యాసములతో సహా చేయవలెను. అప్పుడు "ఫట్ ఫట్ ఫట్" అంటూ అస్త్రమంత్రమునుచ్చరిస్తూ, ఆయా స్థలములలో పుష్పముల నుంచి, ఆ ప్రదేశములలో విఘ్నములన్నీ తొలగిపోయినట్లుగా ధ్యానించాలి. అప్పుడు యాగస్థలము లోనికి ప్రవేశించి, పరమేశ్వరుని యొక్క కృపాకిరణములు తననుండి ప్రసరిస్తున్నటువంటి దృష్టితో యాగగృహమును తేరిపార చూడవలెను. ఈ విధమైన క్రియ వల్ల, యాగస్థలము, పూజాద్రవ్యములు సర్వమూ శుద్ధములై, విఘ్నములు శాంతించి, హోమము చేయుటకు సర్వమూ సిద్ధమౌతుంది.

దిక్కుల ప్రాధాన్యత

మోక్షమును కోరుకునేవారు, ఉత్తరపు ముఖంగా కూర్చుని సాధనను చేయాలి. అప్పుడు, సాధకుని బంధించి ఉంచుతున్న పాశములన్నీ, భగవంతుడైన అఘోరుని యొక్క తేజస్సుతో కాలి, భస్మములైపోతాయి. పరమేశ్వరుని యొక్క పరమస్వాతంత్ర్యరూపమైన ఇచ్ఛాశక్తియే వెలుగుగా మారి అన్ని దిక్కులనూ వెలిగిస్తుంది. మధ్యలో నున్నది చిత్శక్తి యొక్క వెలుగు. అక్కడినుండి అన్ని దిక్కులకూ ఆ వెలుగు ప్రసరిస్తుంది. ఈశ్వరుని యొక్క వెలుగును ఏదైతే స్వీకరిస్తుందో అది 'ఊర్ధ్వము'ని, ఆ విధముగా స్వీకరించనిది, 'అధమము'ని అనబడతాయి. ప్రకాశమునకు ఎదురుగా ఉన్నది తూర్పుదిక్కు అవుతుంది. వెనుకగా ఉన్నది పశ్చిమమౌతుంది. అది ఊర్ధ్వమునకు చూచు స్థానము దక్షిణము. దానికి ఎదురుగా క్రిందుగా ఉన్నది ఉత్తరము. ఈ విధముగా, నాలుగు దిక్కులు ఏర్పడతాయి.

ఈశ్వరుని ముఖములు

వీటి మధ్యలో భగవంతుడైన పరమేశ్వరుడున్నట్లు భావించాలి. ఆయనకు, ఊర్ధ్వముగా చూచునట్టి ఈశాన ముఖము, క్రిందివైపు చూచునట్టి పాతాళ ముఖము, తూర్పు మొదలైన నాలుగు దిక్కులలో చూచునట్టి తత్పురుష, అఘోర, సద్యోజాత, వామదేవముఖములు ఉంటాయి. ఈ నాలుగు దిక్కుల మధ్యలో, ఇంకొక నాలుగు విదిక్కులుంటాయి. ఈ విధముగా చిద్రూపమైన సంవిత్ యొక్క వెలుగే, ఇన్ని మూర్తులుగా మారి, దిక్కులను కల్పిస్తుంది. దిక్కులంటే ఏవో వేరే తత్త్వములు కావు. ఒకడు తన నీడను దాటాలని చూచినప్పటికీ, అది ముందుముందుకు పోతూ ఉంటుంది. తన నీడ, అన్నివైపులకూ పోతూ ఉంటుంది గాని, తాను మాత్రం

మధ్యలోనే ఉంటాడు. నీడకు తానే ఆధారము. అదే విధముగా, పరమేశ్వరుడు కూడా, అన్నింటికీ మూలమైనప్పటికీ, అధిష్ఠాతయైనప్పటికీ, అన్నింటి మధ్యలోనే ఉంటాడు. ఈ విధముగా, దిక్కులనేవి భగవంతుని నుండి ఉద్భవిస్తున్నాయి. అదే విధముగా సూర్యుడు కూడా అవుతున్నాడు. అతడు పరమేశ్వరుని యొక్క ప్రకాశరూపమైన జ్ఞానశక్తియేనని శాస్త్రములలో అక్కడక్కడా చెప్పబడినది.

సూర్యుని వెలుగు ముందుగా ఎక్కడ పడుతుందో అది తూర్పుదిక్కు కదా ! కనుక, ఆత్మను సూచించే తనకు ఎదురుగా ఉన్న దిశ తూర్పు అవుతుంది. ఇదే విధముగా, తనకు వెనుక దిక్కును పడమరగాను, ఎడమ కుడి దిక్కులను ఉత్తర దక్షిణములుగాను భావించాలి. ఈ విధముగా తనయొక్క ఆత్మ, సూర్యుడు, పరమేశ్వరుడు - ఈ ముగ్గురూ ఒక్కటే అనిన దృఢమైన భావనతో దిక్కులను భావించవలెనని అభినవగుప్తులవారి గురువులు బోధించారు. ఇటువంటి ధ్యానస్థితిలో ఉంటూ, ఉత్తరదిక్కును చూస్తూ కూర్చోవాలి.

కాలాగ్ని న్యాసము

మొదటగా దేహభావనకు అతీతుడవు కావాలి. అనగా, దేవభావనను దహించివేయాలి. దీనినే విధముగా చేయాలి? దేహపుర్యష్టకములో అహంభావత్యాగము ద్వారా దేహత్వమును దహించవలెనని చెప్పబడింది. దేహపుర్యష్టకమంటే ఏమిటి? దేహమనే పురములో ఉన్న ఎనిమిది భాగములని దాని అర్థం. అవేమిటి? ఈ పదమునకు ఎన్నో అర్థములున్నప్పటికీ, సామాన్యముగా ఆదరింపబడిన అర్థం మాత్రము, 1. పంచభూతములు 2. పంచతన్మాత్రలు 3. పంచ జ్ఞానేంద్రియములు 4. పంచ కర్మేంద్రియములు 5. మనస్సు 6. చిత్తము 7. అహంకారము 8. బుద్ధి యని. వెరసి, దీనినే సూక్ష్మశరీరమని అంటారు. వీటన్నిటిలో ఉన్న 'అహం' భావనను దహించివేయడం ద్వారా ఈ క్రియను చేయవలసి యుంటుంది. ఇది బాహ్యప్రక్రియ కాదుగాని, అంతరిక ధ్యానప్రక్రియతో చేయబడుతుంది. దీని ఫలితంగా, తన దేహమే పరదేహములాగా గోచరిస్తుంది. లేదా, తనకసలు దేహమే లేనట్లుగా అనిపిస్తుంది. అప్పుడు, అలలు లేని సముద్రం లాగా, నిశ్చలమై ఉన్నట్టి ధ్రువపదం అనుభూతిలోకి వస్తుంది. ఇది సృష్టికి ముందున్నటువంటి స్పందనాశక్తియై ఉంటుంది. తననుండి సమస్తమైన సృష్టినీ చేయగల శక్తిగా ఇది అనుభూతిలోకి వస్తుంది. తదుపరి క్రియను అప్పుడు ఆరంభించాలి.

దేవతాచక్ర న్యాసము

హోమములో యజింపబడుతున్న దేవతాచక్రమును అప్పుడు న్యాసం చేయాలి. వాటి వాటి ప్రాధాన్యతా క్రమములో, ఆయా శక్తులను యజింపవలెను. మొదటగా, భగవంతుడైన ఈశ్వరుని యొక్క తొమ్మిదిశక్తులకూ ఆసనములిచ్చి, గురువచనానుసారముగా ఆయా శక్తులను యథాశక్తిగా పూజించవలెను. మానవునకు జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయ, తురీయాతీతములనే అయిదు అవస్థలున్నాయి. ఆరవదియైన అనుత్తరమనిన పేరుగలది, ఈ అయిందింటినీ మించినట్టి స్వభావదశ. కనుక న్యాసమనినది ఎల్లప్పుడూ ఆరువిధములుగా ఉంటుంది. ఆయా స్థాయిలలో, బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వర, సదాశివ, శక్తులు అధిష్ఠాతలై ఉంటారు. ఒక్కొక్కరికి మరలా ఆరుకళలు చొప్పున మొత్తము ముప్పదియారు కళలతో ఇదంతా ఉంటుంది.

ఈ విధమైన న్యాసముతో ప్రపంచమును దాటినప్పుడు, భైరవునితో (పరమశివునితో) అభేదన్యాసము

ద్వారా పూర్ణత్వమును పొంది, భైరవభావములో సాధకుడు ప్రవేశిస్తాడు. ఈ స్థితిని గురించి చెప్పనదేమున్నది? దీనిని గురించి శాస్త్రములలో ఈ విధముగా చెప్పబడినది 'అతరఙ్గరూఢౌ లబ్ధాయాం పునః కిం తత్త్వసృష్టిన్యాసాదినా'. 'తరంగములు లేని సముద్రము వంటి స్థితిని పొందినవానికి, తత్త్వముల యొక్క సృష్టియు, న్యాసము మొదలైన క్రియల యొక్క అవసరమేమున్నది?' లేదని అర్థము.

తరంగములు లేని సముద్రము వంటి స్థితియే భైరవుడు. తన స్వాత్మరూపములో నిశ్చలముగా ఉంటూ, సృష్టి, స్థితి, సంహారము మొదలైన కోటానుకోట్ల చర్యలను అది చేస్తూ ఉంటుంది. కనుక అట్టి స్థితిని పొంది, దానిలో కుదురుగా ఉండటం ద్వారా, తనయొక్క ప్రాణము, దేహము, బుద్ధి మొదలైనవాటినన్నింటినీ, పరమేశ్వర స్వరూపములుగా దృఢముగా భావించుచూ, బాహ్యముగానూ, అంతరికముగానూ, పుష్పములు, ధూపము, తర్పణము మొదలైనవానితో దానినే పూజింపవలెను.

శూలాబ్జ న్యాసము

ఇప్పుడు శరీరము-ప్రాణము-బుద్ధి స్థాయిలలో, ఇంతకు ముందు చెప్పబడిన రీతిలో 'శూలాబ్జన్యాసము' అను క్రియను చేయాలి. శూలాబ్జన్యాసమనేది శైవతంత్రములో చాలా ముఖ్యమైన న్యాసక్రియ. ఏ విధముగా దీనిని చేయాలి? ఎట్లనగా, - మూలాధారమున శూలము యొక్క మూలమును ధ్యానించాలి. అక్కడనుండి పైపైకి పెరుగుతున్న శూలము యొక్క మధ్యభాగము అంగిటిపైనున్న లంబికాచక్రము వరకు ఉన్నట్లు భావించాలి. శూలముయొక్క పిడి, లంబికాచక్రమును దాటినట్లును, ఆ పైన కళాతత్త్వము వరకు శూలదండమును, శూలము యొక్క గుబ్బను మాయాత్మకమైనట్లు గాను, అక్కడున్న నాలుగు కోణముల పలకను శుద్ధవిద్యాపద్మముగాను, దానిపైన సదాశివుడు పడుకొని యున్నట్లుగా ధ్యానించాలి. నిత్యసమాధి నిమగ్నుడైన అయననే మహాప్రేతమంటారు. ఈ ధ్యానలీనత వలన కలుగు బోధచే దేహస్పృహ పోతుంది. ఆ మహాప్రేతము యొక్క నాభిస్థానం నుండి మహానాదం వెలువడుతూ ఉంటుంది. ఆ నాదము, యోగి యొక్క శిరస్సులోని మూడు రంధ్రములనుండి పైపైకి శూన్యములోకి పోతూ, వ్యానము సమానము మొదలైన రూపములలో ద్వాదశాంతము వరకూ వ్యాపిస్తూ ఉంటుంది. ద్వాదశాంతమనగా, నెత్తిపైన పన్నెండు అంగుళముల దూరములో ఉన్న శూన్యమని అర్థము. దానిపైన, శుద్ధముగా వెలుగుతున్న మూడు పద్మములను ధ్యానించాలి. దానినే ఉన్మనీస్థానమంటారు. అక్కడ విశ్వవ్యాప్తమైన ఆసనమును ఊహించి, దానికి ఆధారమై ఉన్నదానిని ఇష్టదేవతగా భావించి, ఆ విశ్వభావములో తన ఆత్మను లీనం గావించాలి. ఇదే నిజమైన పూజ అనబడుతుంది. దానిలో తన్మయం చెంది అలా ఉండిపోవడమే ధ్యానము. అప్పుడు వినవస్తున్న నాదములో ఊయలూగడమే జపము. ఈ భావనాక్రమములో ఉదయించిన మహాతేజస్సులో తన ఆత్మనే హుతం గావించడం హోమము. అట్లా చేసి, ఆ హోమాగ్నిలోనుండి వెలువడుతున్న రవ్వలవలె ఉన్నట్లుగా, ఈశ్వరుని యొక్క పరివారదేవతలను ధ్యానించి పూజించాలి.

అంతర్యాగము

ఈ విధముగా, మూలాధారము నుండి, ద్వాదశాంతము వరకూ పైపైకి పోతున్న త్రిశూలమును, దేవీచక్రముయొక్క పైవరకూ తృక్షక్రమములో స్మరించితే ఖేచరత్వములో కుదురు లభిస్తుంది. దేవీచక్రమంటే

త్రిశూలపు కొనలలో ఉన్న మూడు పద్మములు. ఈ పద్మములలో వరుసగా ఎడమ పద్మమునందు అపరాశక్తిని, మధ్యపద్మమందు పరాశక్తిని, కుడిపద్మమునందు పరాపరాశక్తిని ధ్యానించాలి. ఆ తదుపరి వాటిని కూడా దాటి ఇంకా పైపైకి శూన్యములోనికి పోవాలి. ఈ ధ్యానక్రమములో, మూలాధారమునుండి పాకీ లేచుచున్న శూలము, ద్వాదశాంతము చివరవరకూ పోతూ, ఆకాశమును పూరించుచూ, ఆకాశమున సంచరిస్తూ, ఆకాశామృతమును త్రాగుతుంది. కనుక 'ఖేచరి' అనబడుతుంది. ఈ ధ్యానమునే 'అంతర్యాగము' అంటారు. దీనిలో, తన ఆత్మనే అనంతచిత్స్వరూపములో ఆహుతి చేయడం జరుగుతుంది.

ఈ విధమైన అంతర్యాగము వల్లనే సాధకునకు తన ధ్యానములో కృతకృత్యత లభిస్తుంది. సత్యముగా ఈ ధ్యానమునందు కుదురుగా ఉన్నవానికి లోపల (అంతర్యాగము) గాని, బయట (బహిర్యాగము) గాని, సమస్తమూ నిర్విఘ్నముగా జరుగుతుంది. ఈ విధమైన ధ్యానస్థితిలో పరిపక్వత పొందినట్టి యోగికి బహిర్యాగము ముఖ్యము కాదు. ఈ విధమైన ధ్యానాభ్యాసమువలన ఏమి జరుగుతుంది? దీనివలన పరమశివునితో సమావేశం సిద్ధిస్తుంది. తనలోని పశుత్వము నశించడమే అసలైన అంతర్యాగము. దానిని అందుకోలేనివానికి కూడా, ఈ విధమైన సంకల్పము యొక్క బలమే కాలక్రమేణా శుద్ధిని కలిగిస్తుంది.

హోమవిధి

దీక్షను స్వీకరించాలని ఉత్సాహము తనలో ఉదయించినప్పుడు, అధివాసం కొరకు భూమిని శుద్ధిచేసి సిద్ధపరచడము, గణేశార్చన, కుంభము, కలశముల పూజ, స్థణ్డిలము (పూజావేదిక) యొక్క అర్చనము, హవనము (హోమము) లను చేయాలి. నిత్యనైమిత్తికవిధులలో కూడా స్థణ్డిలము మొదలైన వాటి అర్చన మరియు హవనములను చేయాలి. అప్పుడు అధివాసనము, శిష్యునకు సంస్కృతయోగ్యతాధానము, దంతశుద్ధులను చేసి, దేవతయొక్క కర్తవ్యోన్ముఖత్వగ్రాహణము, గురువు ద్వారా దానిని స్వీకరించుట, పరమేశ్వరుని తేజస్సును ఉపకరణద్రవ్యములలోను, యాగగృహములోను భావించుట ద్వారా, వాటిని శుద్ధీకరించాలి.

ఆ విధముగా అన్నివిధములుగా శుద్ధి చేయబడి, సిద్ధముగా ఉన్న యాగగృహములోకి ప్రవేశించి, భగవతియగు (భిన్న) మాలినిని గాని, లేదా (అభిన్న) మాతృకలను గాని, స్మరించి, ఆమెయొక్క వర్ణములు తేజోపుంజములుగా తనలో ప్రవేశించుచున్నట్లు ధ్యానించి, దేవికి పుష్పాంజలిని సమర్పించవలెను. అప్పుడు ఇంతకుముందు చెప్పబడిన ఇంద్రాదిదేవతల యొక్క అస్త్రమంత్రములను జపించి, యథాశక్తిగా సిద్ధార్థలు (తెల్లనువ్వులు), ధాన్యము, అక్షతలు, లాజలు (నిద్రగన్నేరు గింజలు) మొదలైనవాటిని చేతిలోకి తీసుకుని, వాటిని తేజోరూపములుగా ధ్యానిస్తూ, ఈశాన్యము నుండి మొదలుపెట్టి, అన్ని దిశలలోనూ వాటిని ఉంచవలెను. ఇది భూపరిగ్రహణము.

అపుడు శుద్ధవిద్యామంత్రములను జపిస్తూ, గణపతిని పూజించవలెను. ఆ తరువాత ఆనందద్రవ్యముతో నిండినది, అలంకరింపబడినది యైన కుంభమును పూజించవలెను. దానిలో పూగమును (పచ్చి వక్కలను) ఉంచి, సర్వాధిష్ఠాతయైన మంత్రమును విధిపూర్వకముగా నూట ఎనిమిది సార్లు స్మరించి, మంత్రముతో ఆ కుంభమును అభిమంత్రించాలి. విఘ్నములు తొలగిపోవడానికై, రెండవ కలశంలో అస్త్రమును ఉంచాలి. అయా

దిక్కులలో అస్త్రసహితులైన లోకపాలకులను పూజించాలి. ఇంతకు ముందే దీక్షితుడైన శిష్యునకు అస్త్రకలశమునివ్వాలి. గురువు స్వయముగా కుంభమును తీసుకోవాలి. ఆ తరువాత విఘ్నములు తొలగిపోవడానికై, గృహమంతటా ఆ నీటిని ధారగా పోసుకుంటూ, దానివెంట కుండతో అనుసరిస్తూ ఈ మంత్రమును పఠిస్తూ నడువవలెను.

"ఓ ఇంద్రా ! విఘ్నప్రశాంతికొరకై, ఈ కర్మ అయిపోయేంతవరకూ, సావధానంగా నీయొక్క దిశలో నీవుండవలెను. ఇది శివాజ్ఞ"

మూడక్షరముల నామమును, 'భో' అని ఒక్కసారిగాను అంటూ ఈశాన్యదిశలో కుంభమును స్థాపించవలెను. వికిరము (కొన్ని ధాన్యపు గింజలను చల్లి), వాటి పైన అస్త్రకలశము నుంచవలెను. కుంభమును, అస్త్రకలశమును, రెండింటిని పూజించవలయును. అప్పుడు స్థండిల (వేదికా) మధ్యములో పరమేశ్వరుని స్థాపించి పూజను గావించవలయును. పరమేశ్వరశక్తిరూపముగా అగ్నికుండమును భావించి, దానిలో అగ్నిని ప్రజ్వలింపజేసి, తన హృదయములో ఉన్న బోధయనే అగ్నితో దానిని ఒక్కటిగా చేసి, మంత్రోచ్చారణ చేస్తూ, వెలుగుతున్న అగ్నిని శివస్వరూపముగా భావించి, దానిలో నెయ్యిని నువ్వులను తర్పణము చేయవలెను.

అర్ఘపాత్రతో ప్రోక్షణముగావిస్తే తిలాదుల సంస్కారము జరుగుతుంది. స్రుక్కు, స్రువములను కూడా, అవి పరమేశ్వరుని కంటే వేరైనవి కావనిన దృష్టితో చూస్తూ, వాటిని శుద్ధి చేయాలి. ఈ విధముగా, యథాశక్తిగా హోమమును చేసి, స్రుక్కు స్రువములను ఒకదానిపైన మరొకటిగా ఉంచి, శక్తిశివరూపములుగా వాటిని భావిస్తూ, లేచి నిలబడి, తన యొక్క ద్వాదశాంతస్థానములో ఉదయించిన శివరూపమైన పూర్ణచంద్రుని నుండి కురియుచున్న అమృతధారను భావిస్తూ, ద్వాదశాంతము వరకూ మంత్రమును ఉచ్చరిస్తూ, ఆహుతికాబడిన నెయ్యి క్షయమయ్యే వరకూ అదే ధ్యానంలో ఉండాలి. ఇది పూర్ణాహుతి అనబడుతుంది. ఈ క్రియ, అన్ని మంత్రచక్రములను సంపూర్ణముగా సంతర్పణము గావిస్తుంది.

చరువనగా నైవేద్యముగా సమర్పింపబడు పాయసము. దానిపైన మంత్రపూతమైన జలముతో ప్రోక్షించి, చరువును తెచ్చి, స్థండిలము, కలశము, కుంభము, అగ్నులకు సమానమైన ఒక్కొక్క భాగముగా నివేదించాలి. మిగిలిన ఒక భాగమును ప్రసాదముగా శిష్యునకివ్వాలి. తరువాత, శిష్యుడు తన దంతకాష్ఠమును విసరివేయాలి. అది, దక్షిణ, నైరృతి దిక్కులకు గాని, సూటిగా క్రిందకు గాని పడితే శుభం కాదు. ఆ విధముగా పడినప్పుడు, దాని శాంతికొరకు అస్త్రమన్త్రములతో హోమమును చేయాలి.

శిష్యునకు అనేకవిధములైన మానసిక, ప్రాణిక విక్షేపములు కలుగుతూ ఉంటాయి. వాటియొక్క పరిహారము కొరకు మరియు ఉపదేశింపబోయే మంత్రము యొక్క దర్శనయోగ్యత కొరకు, శిష్యుని నేత్రములను వస్త్రములతో మూసి, ఆ విధముగా బద్ధనేత్రుడైన శిష్యుని, హోమ మండలమున ప్రవేశింపజేయాలి. అతడు కూర్చున్న పిదప అతనిచేత పుష్పాంజలిని సమర్పింపజేయాలి. అప్పుడు గురువతని కన్నులకున్న వస్త్రమును తొలగించాలి. శక్తిపాతమును గ్రహించిన కారణంచేత శిష్యునకు మంత్రసాక్షాత్కారమై తన్మయత్వము కలుగుతుంది. దేవతానుగ్రహము యొక్క కారణముగా మంత్రసన్నిధి అతని ఎదుట

ప్రత్యక్షమౌతుంది. కానీ, దానిని చూచినప్పుడు పశువులకు (దుష్టసంస్కారములున్న వారికి) మాత్రం భయము కలుగుతుంది.

అప్పుడు గురువు, తన కుడి అరచేతిలో వెలుగుచున్న దేవతాచక్రమును (దేవతా సమూహములను) ఎడమచేతితో పూజించి, ఆ కుడి అరచేతిని శిష్యుని యొక్క శిరస్సు, హృదయము, మరియు నాభి - వీనిపైన ఉంచి, శిష్యుని పట్టుకొని యున్న సమస్త పాశములనూ దహించివేయాలి. తన యొక్క ఎడమచేతిలో శుద్ధతత్త్వముతో కూడి, ఆప్యాయరూపమైన సోమతత్త్వముతో పూజించి, దానికి ప్రణామం చెయ్యాలి. అప్పుడు, మద్య, మాంస, జలములతో సంపూర్ణమైన భూతదేవతా దిగ్బలిని, యాగస్థలము బయటగా చేసి, స్వయంశుద్ధికోసం ఆచమించాలి. అప్పుడు స్వయముగా చరువు (పాయసపు) భోజనమును ముగించి, శిష్యునితో ఏకత్వభావనలో ఉంటూ, ప్రబుద్ధవృత్తిలో విశ్రమించాలి. నిద్రించిన తర్వాత గాని, ప్రభాతకాలమున గాని శిష్యునకు ఏవైనా అశుభస్వప్నములు అగుపించి, అతడు నిద్రనుండి లేచిన తరువాత వాటిని తనకు వినిపించినచో, వాటి అర్థములను అతనికి వివరించి చెప్పకూడదు. అట్లా వివరించడం వలన అతని మనసులో లేనిపోని అనుమానములు, భయములు కలుగుతాయి. ఆయా స్వప్నముల అర్థములను చెప్పకుండా, కేవలం అస్త్రమంత్రములతో మాత్రమే వాటికి నిష్కృతిని చేయాలి.

అప్పుడు పరమేశ్వర పూజను గావించి, ఆ తరువాత శిష్యుని ప్రాణములో ప్రవేశించి, అతని యొక్క హృదయము, కంఠము, తాలువు, లలాటము, బ్రహ్మరంధ్రము, ద్వాదశాంతముల లో ఉన్న కారణషట్కములను స్పర్శిస్తూ అష్టసంస్కారములను స్మరిస్తూ ఆయా స్థలములలో శిష్యుని ప్రాణమును కొంతసమయం పాటు ఉంచి తరువాత వెనుకకు రావలెను. ఈ విధముగా చేయబడిన 48 సంస్కారములవలన శిష్యునిలో రుద్రాంశ ఆవేశించి, అతడు సమయి అవుతాడు. అప్పుడతడు పూజ్యములైన మంత్రములను పుష్పాదులతో పూజించాలి.

సమయవిధులు

అప్పుడతనికి సమయవిధులను వివరించి చెప్పి నిరూపించాలి. అవి,

- గురువన్నచో సర్వాత్మతాభక్తి, అదే విధముగా శాస్త్రములు, దేవతలపట్ల కూడా భక్తి ఉండవలెను.
- వాటి విరుద్ధములపట్ల విముఖత్వము చూపవలెను.
- గురువువలె గురుపుత్రులను కూడా గౌరవించవలెను.
- శాస్త్రవిద్యను బోధించిన గురువుకు, ఇంతకుపూర్వమే ఎవరివద్దనైనా దీక్షను పొంది ఉన్నట్లయితే, ఆ గురువును కూడా ఇదే విధముగా ఆరాధించవలెను. వారు యోనిసంభవులని భావించకూడదు.
- వంధ్యలైన స్త్రీలను జుగుప్సతో చూడరాదు.
- దేవతలను, గురువును, పూజించునపుడును, మంత్రజప సమయములోను ఇతర శబ్దములను

మాట్లాడకూడదు.

- గురువు వాడిన శయ్యను శిష్యుడు వాడరాదు.
- లౌకికమైన చేష్టలను కొంచమైనా కూడా గురుసన్నిధిలో చెయ్యకూడదు.
- ఆయనకు వ్యతిరేకులైన వారిపట్ల శ్రద్ధను చూపడం పనికిరాదు.
- శ్రాద్ధాది కార్యముల ప్రారంభసమయంలో గురువును తప్పనిసరిగా పూజించాలి.
- అన్ని నిమిత్తకార్యములలోనూ, 'శాకిని' మొదలైన పదములను అనకూడదు.
- పర్వదినములలో తప్పనిసరిగా ఈశ్వరుని పూజించాలి.
- ఈ మతము కంటే అధమమైన సిద్ధాంతములను బోధించే వైష్ణవాది మతముల జోలికి పోకూడదు.
- ఎవరైతే, పరమేశ్వరాద్వైత మార్గంలో ఉన్నారో, వారియొక్క కులమును ఏమాత్రమూ చూడకూడదు.
- గురువు యొక్క బంధువులు తన ఇంటికి వచ్చినపుడు యథాశక్తిగా హోమమును చేయవలెను.
- అధోమార్గస్థితులైన వైష్ణవాదులలో గురువులను కూడా, ఆయా శాస్త్రముల పట్ల కుతూహలముతో సమీపించకూడదు. వారిని గొప్పగా చూడకూడదు. త్యజించవలెను.
- లింగధారులను తమతో సమానముగా తలచకూడదు.
- యథాశక్తి పూజించాలి. శంకలను వదలిపెట్టాలి.
- సాధనాసమయంలో, యోగినీచక్రమునందు కూర్చున్నపుడు, ఉత్తమకులము, తక్కువకులము మొదలైనవాటిని చూడకూడదు.
- శరీరమునకు భిన్నముగా బయట ఉన్నట్టి తీర్థక్షేత్రములను గొప్పగా తలచకూడదు.
- మంత్రహృదయమును (మంత్రము యొక్క అర్థమును) నిరంతరమూ స్మరించాలి.

ఈ నియమములను శిష్యుడు విని, గురువుకు ప్రణామం గావించాలి. గురువునకు ధనము నిచ్చి, తన భార్యతో సహా ఆయనను సేవించి, తనకంటే ముందు దీక్షను తీసుకున్న పేదవారికి దక్షిణలనివ్వాలి. అప్పుడు విధివిధానసహితముగా మూర్తిచక్రమును తర్పణం గావించాలి. ఈ విధముగా శిష్యుడు 'సమయి' అవుతాడు. అప్పుడు మంత్రాభ్యాసము, నిత్యపూజ, శ్రవణ, అధ్యయనములకు అధికారి అవుతాడు. నైమిత్తికవిధులలో కూడా గురువునే ప్రార్థించాలి. ఇదియే సమయవిధి.

అన్ని అధ్వములను ధ్యానించి, పూర్ణమైన స్వాత్మను దర్శించాలి. అప్పుడు, శిష్యుని ద్వాదశాంతము

వరకూ అనుగ్రహబుద్ధితో చూచినచో, శిష్యుడు సమయి అవుతాడు.

ఆ// అధ్వగతులనన్ని యవలీలగా దాల్చి
పూర్ణమైన యాత్మ పుట్టుదెలిసి
కడమవరకు సుతుని కరుణతో వీక్షింప
సమయదీక్షనందు సాధకుండు

కం// అంతస్థుల నన్ని దెలిసి
పంతముగా యాత్మతేజ పారము గనుచున్
వింతగ ద్వాదశమండల
మెంతయు వీక్షింప సమయ మేతెంచునుగా !

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే సమయిదీక్షాప్రకాశనం నామ త్రయోదశమాహ్నికమ్ ‖ 13 ‖

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని సమయిదీక్షాప్రకాశనమనే పదమూడవ ఆహ్నికము.

పద్నాలుగవ ఆహ్నికము

పుత్రకదీక్షా ప్రకాశనము

యదార్థః - యదార్థము

అథ పుత్రకదీక్షావిధిః । స చ విస్తీర్ణః తన్త్రాలోకాత్ అవధార్యః । సంక్షిప్తస్తు ఉచ్యతే ।

ఇప్పుడు పుత్రకదీక్షావిధి చెప్పబడుచున్నది. దీనిని వివరముగా తన్త్రాలోకమున చూడవచ్చును. ఇక్కడ సంక్షిప్తముగా చెప్పబడుచున్నది.

సమయ్యన్తం విధిం కృత్వా తృతీయేఽహ్ని త్రిశూలాబ్జే మణ్డలే సాముదాయికం యాగం పూజయేత్, తత్ర బాహ్యపరివారం ద్వారదేవతాచక్రం చ బహిః పూజయేత్, తతో మణ్డలపూర్వభాగే ఐశకోణాత్ ఆరభ్య ఆగ్నేయాన్తం పఙ్క్తిక్రమేణ గణపతిం గురుం పరమగురుం పరమేష్ఠినం పూర్వాచార్యాన్ యోగినీచక్రం వాగీశ్వరీం క్షేత్రపాలం చ పూజయేత్ ।

సమయవిధులను చేసిన తర్వాత మూడవరోజున త్రిశూలాబ్జమణ్డలమున సాముదాయిక యాగమును గావించాలి. బాహ్యపరివారమును, ద్వారదేవతాచక్రమును, బాహ్యముగా పూజించాలి. అక్కడ మణ్డలపూర్వభాగములో ఈశాన్యకోణమునుండి ఆరంభించి ఆగ్నేయాన్తమువరకు వరుసగా గణపతి, గురువు, పరమగురువు, పరమేష్ఠిగురువు, పూర్వాచార్యులను, యోగినీచక్రమును, వాగీశ్వరిని, క్షేత్రపాలకుని పూజించవలయును.

తత ఆజ్ఞాం సముచితామ్ ఆదాయ శూలమూలాత్ ప్రభృతి సితకమలాన్తం సమస్తమ్ అధ్వానం న్యస్య అర్చయేత్, తతో మధ్యమే త్రిశూలే మధ్యారాయాం భగవతీ శ్రీపరాభట్టారికా భైరవనాథేన సహ, వామారాయాం తథైవ శ్రీమదపరా, దక్షిణారాయాం శ్రీపరాపరా, దక్షిణే త్రిశూలే మధ్యే శ్రీపరాపరా, వామే త్రిశూలే మధ్యే శ్రీమదపరా, ద్వే తు యథాస్వమ్ । ఏవం సర్వస్థానాధిష్ఠాతృత్వే భగవత్యాః సర్వం పూర్ణం తదధిష్ఠానాత్ భవతి ఇతి ।

అప్పుడు సముచితమైన ఆజ్ఞను గైకొని శూలమూలము నుండి వికసితకమలాన్తము వరకు అన్ని అధ్వములను న్యసించి అర్చనము గావించాలి. త్రిశూలములోని మధ్యశూలములో భైరవనాథునితో సహా భగవతి శ్రీపరాభట్టారికను, ఎడమ శూలములో అదేవిధముగా శ్రీమత్ అపరాశక్తిని, కుడివైపు శూలములో శ్రీపరాపరా శక్తిని, ఇద్దరినీ యథావిధిగా పూజించవలెను. ఈ విధముగా భగవతుల సర్వస్థానాధిష్ఠాతృత్వము వలన సర్వము పూర్ణమౌతుంది.

తతో మధ్యశూలమధ్యారాయాం సమస్తం దేవతాచక్రం లోకపాలాస్త్రపర్యన్తమ్ అభిన్నతయైవ పూజయేత్ తదధిష్ఠానాత్ సర్వత్ర పూజితమ్ । తతః కుమ్భే కలశే మణ్డలే అగ్నౌ స్వాత్మని చ అభేదభావనయా పఞ్చాధికరణమ్ అనుసన్ధిం కుర్యాత్, తతః పరమేశ్వరాద్వయరసబృంహితేన పుష్పాదినా విశేషపూజాం కుర్యాత్ । కిం బహునా - తర్పణనైవేద్యపరిపూర్ణం విత్తశాఠ్యవిరహితో యాగస్థానం కుర్యాత్ । అసతి విత్తే తు మహామణ్డలయాగో న కర్తవ్య ఏవ ।

మధ్యశూలములోని మధ్యలో సమస్తదేవతాచక్రమును లోకపాలాస్త్రపర్యన్తము అభిన్నతతో పూజించి తదధిష్ఠానములను కూడా పూజించాలి. కుంభములోను, కలశములోను, మణ్డలములోను, అగ్నిలోను, స్వాత్మలోను, అభేదభావనతో, ఈ పంచాధికరణమును పరమేశ్వరాద్వయ భావనతో అనుసంధించి, రసబ్రంహితమైన పుష్పాదులతో విశేషపూజను గావించాలి. ఎక్కువ ఎందుకు? విత్తశాఠ్యము లేకుండా తర్పణ, నైవేద్యములను పరిపూర్ణం గావించాలి. విత్తము లేనప్పుడు మహామణ్డలయాగము కర్తవ్యము కాదు.

పశూంశ్చ జీవతో నివేదయేత్ | తేఽపి హి ఏవమ్ అనుగ్నహీతా భవన్తి, ఇతి కారుణికతయా పశువిధౌ న విచికిత్సేత్ | తతోఽగ్నౌ పరమేశ్వరం తిలాజ్యాదిభిః సంతర్ప్య తదగ్రేఽన్యం పశుం వపాహోమార్థం కుర్యాత్, దేవతాచక్రం తద్వపయా తర్పయేత్, పునర్మణ్డలం పూజయేత్, తతః పరమేశ్వరం విజ్ఞప్య సర్వాభిన్నసమస్తషడధ్వపరిపూర్ణమ్ ఆత్మానం భావయిత్వా శిష్యం పురోఽవస్థితం కుర్యాత్ |

జీవపశువులను నివేదించాలి. అప్పుడవి కూడా అనుగ్రహింపబడతాయి. కారుణ్యంతో ఉండవలెను, పశువిధులను విమర్శించరాదు. అప్పుడగ్నిలో పరమేశ్వరునకై నువ్వులను నెయ్యిని అర్పించి తరువాత వపాహోమము కొరకు పశువును సిద్ధమొనర్చవలెను. ఆ వపముతో దేవతాచక్రము తర్పణము గావించాలి. మరలా మండలమును పూజించాలి. పరమేశ్వరుని ప్రార్థించి సర్వాభిన్నమైన సమస్త షడధ్వపరిపూర్ణముగా తన ఆత్మను భావించుచూ శిష్యుని తనకు దగ్గరగా కూర్చుండ బెట్టుకొనవలెను.

పరోక్షదీక్షాయాం జీవన్మృతరూపాయామ్ అగ్రే తం ధ్యాయేత్, తదీయాం వా ప్రతికృతిం దర్భగోమయాదిమయీమ్ అగ్రే స్థాపయేత్ | తథావిధం శిష్యమ్ అర్ఘపాత్రవిప్రుట్ప్రోక్షితం పుష్పాదిభిశ్చ పూజితం కృత్వా సమస్తమధ్వానం తద్దేహే న్యసేత్ | తత ఇత్థం విచారయేత్, భోగేచ్ఛోః శుభం న శోధయేత్ | ముముక్షోస్తు శుభాశుభమ్ ఉభయమపి | నిర్బీజాయాం తు సమయపాశాన్ అపి శోధయేత్, సా చ ఆసన్నమరణస్య అత్యన్తమూర్ఖస్యాపి కర్తవ్యా ఇతి పరమేశ్వరాజ్ఞా, తస్యాపి తు గురుదేవతాగ్నౌ భక్తినిష్ఠత్వ మాత్రాత్ సిద్ధిః |

పరోక్షదీక్షలలో జీవన్మృతరూపులను దగ్గరగా ఉన్నట్లు ధ్యానించి, లేదా దాని ప్రతికృతిగా దర్భనుగాని, గోమయాదిరూపమును గాని స్థాపించాలి. ఈ విధిగా శిష్యుని అర్ఘపాత్రలోని జలముతో ప్రోక్షితుని గావించి, పుష్పాదులతో పూజించి, సమస్తములైన అధ్వములను అతని దేహములో న్యసించాలి. అప్పుడీ విధముగా విచారించాలి - భోగేచ్ఛ యున్నచో శుభమును శోధించరాదు. ముముక్షువుకు మాత్రం శుభాశుభములు రెంటినీ శోధించాలి. నిర్బీజదీక్షలో అయితే సమయపాశములను కూడా శోధించాలి. మరణమాసన్నమైన వానికి, అత్యన్తమూర్ఖునికి కూడా ఇదే ఇవ్వమని పరమేశ్వరాజ్ఞ. వారికికూడా గురు, దేవతా అగ్నుల భక్తి ఉన్నప్పుడే సిద్ధి లభిస్తుంది.

అత్ర చ సర్వత్ర వాసనాగ్రహణమేవ భేదకమ్ - మన్త్రాణాం వాసనానుగుణ్యేన తత్తత్కార్యకారిత్వాత్ | ఏవం వాసనాభేదమనుసంధాయ ముఖ్యమన్త్రపరామర్శవిశేషేణ సమస్తమధ్వానం స్వదేహగతం శివాద్వయభావనయా శోధయేత్ | ఏవం క్రమేణ పాదాఙ్గుష్ఠాత్ ప్రభృతి ద్వాదశాన్తపర్యన్తం స్వాత్మదేహస్వాత్మచైతన్యాభిన్నీకృతదేహచైతన్యస్య శిష్యస్య ఆసాద్య తత్రైవ అనన్తానన్దసరసి స్వాతన్త్ర్యైశ్వర్యసారే సమస్తేచ్ఛాజ్ఞాన క్రియాశక్తినిర్భర సమస్తదేవతా చక్రేశ్వరే సమస్తాధ్వభరితే చిన్మాత్రావశేష

విశ్వభావమణ్డలే తథావిధరూపైకీకారేణ శిష్యాత్మనా సహ ఏకీభూతో విశ్రాన్తిమాసాదయేత్, ఇత్యేవం పరమేశ్వరాభిన్నోఽసౌ భవతి |

ఈ సమస్తములో వాసనాగ్రహణమే భేదకము. మంత్రములు కూడా వాసనానుగుణ్యముగానే వాటి కార్యములను చేస్తాయి. ఈ విధముగా వాసనాభేదమనుసంధించి ముఖ్యమన్త్ర పరామర్శవిశేషముతో స్వదేహగతములైన సమస్తాధ్వములను శివాద్వయభావనతో శోధించాలి. ఈ క్రమములో పాదాంగుష్ఠములనుండి ద్వాదశాన్తపర్యన్తము తన ఆత్మచైతన్యముతో ఒక్కటైన దేహచైతన్యముతో శిష్యుని ఒక్కటిగా చేసి, అనంతమైన ఆనందసరస్సులో స్వాతన్త్ర్యైశ్వర్యసారమున, సమస్త ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తి నిర్భరమై, సమస్తదేవతా చక్రేశ్వరుడై, సమస్త అధ్వభరితుడై, చిన్మాత్రావశేష విశ్వభావమణ్డలములో ఒకటైన రూపముతో శిష్యాత్మతో ఏకీభూతుడై విశ్రాంతిని పొందవలెను. ఈ విధముగా శిష్యుడు పరమేశ్వరునితో అభిన్నతను పొందుతాడు.

తతో యది భోగేచ్ఛుః స్యాత్ తతో యత్రైవ తత్త్వే భోగేచ్ఛా అస్య భవతి తత్రైవ సమస్తవ్యస్తతయా యోజయేత్ | తదనన్తరం శేషవృత్తయే పరమేశ్వరస్వభావాత్ ఝటితి ప్రసృతం శుద్ధతత్త్వమయం దేహమ్ అస్మై చిన్తయేత్, - ఇత్యేషా సమస్తపాశవియోజికా దీక్షా |

ఒకవేళ అతనిలో భోగేచ్ఛ ఉన్నట్లయితే, ఏ తత్త్వములో భోగేచ్ఛ ఉన్నదో ఆ తత్త్వములోనే యోజించవలెను. తరువాత శేషవృత్తితో పరమేశ్వరస్వభావములో ప్రసృతమయ్యే శుద్ధతత్త్వమయమైన దేహమును అతనికిచ్చినట్లు చింతించవలయును. ఇదియే సమస్తపాశములను విడిపించే దీక్ష.

తతః శిష్యో గురుం దక్షిణాభిః పూర్వవత్ పూజయేత్ | తతోఽగ్నౌ విధిం కుర్యాత్, శ్రీపరామన్త్రః అముకస్యాముకం తత్త్వం శోధయామి, ఇతి స్వాహాన్తం ప్రతితత్త్వం తిస్ర ఆహుతయః, అన్తే పూర్ణా వౌషడన్తా | ఏవం శివాన్తతత్త్వశుద్ధిః, తతో యోజనికోక్తక్రమేణ పూర్ణాహుతిః | భోగేచ్ఛోః భోగస్థానే యోజనికార్థమపరా, శుద్ధతత్త్వసృష్ట్యర్థమన్యా | తతో గురోః దక్షిణాభిః పూజనమ్, ఇత్యేషా పుత్రకదీక్షా | యత్ర వర్తమానమేకం వర్జయిత్వా భూతం భవిష్యచ్చ కర్మ శుధ్యతి ||

అప్పుడు శిష్యుడు గురువునకు ఇంతకుముందు వలెనె దక్షిణలొసగి పూజించవలెను. తదుపరి యథావిధిగా అగ్నిక్రియను చేయాలి. "శ్రీపరామన్త్రః అముకస్యాముకం తత్త్వం శోధయామి" అంటూ స్వాహాంతముతో ప్రతితత్త్వమునకు మూడు మూడుమార్లు ఆహుతులివ్వాలి. అంతములో "వౌషట్" అంటూ ఆహుతినివ్వాలి. అప్పుడు శివాంతమువరకూ తత్త్వశుద్ధి అవుతుంది. అప్పుడు యోచనప్రకారం పూర్ణాహుతినివ్వాలి. భోగేచ్ఛ ఉన్నచో భోగస్థానములో యోజనికార్థమై ఒకటి, శుద్ధతత్త్వ సృష్టికోసం ఇంకొకటి ఇవ్వాలి. అప్పుడు గురువును దక్షిణతో పూజించాలి. ఇదియే పుత్రకదీక్ష. దీనివలన వర్తమానమొక్కటి వర్జింపబడి భూత భవిష్యత్తుల కర్మ శుద్ధి అవుతుంది.

శ్లో|| అన్తః సమస్తాధ్వమయీం స్వసత్తాం బహిశ్చ సంధాయ విభేదశూన్యః |
శిష్యస్య ధీప్రాణతనూర్మిజాసుతాస్వేకతాం సంగమయేత్ప్రబుద్ధః |

శ్లో|| శిష్యైకభావం ఝటితి ప్రపద్య తస్మిన్మహానన్దవిబోధపూర్ణే |
యావత్స విశ్రామ్యతి తావదేవ శివాత్మభావం పశురభ్యుపైతి ||

శిష్యుడీ ఏకత్వభావంలో ప్రవేశించి మహానందబోధపూర్ణుడై విశ్రమించినపుడు పశువునకు శివాత్మభావం కలుగుతుంది.

సమస్త అధ్వములతో లోలోపలనున్న స్వసత్తను, విభేదశూన్యముగా బాహ్యంగా కూడా అనుసంధించి, శిష్యుని బుద్ధి, ప్రాణము, తనువులను, ప్రబుద్ధములు గావించి తనవాటితో ఒక్కటి గావించవలెను.

వ్యాఖ్యానము

ఈ అధ్యాయములో పుత్రకదీక్ష వివరింపబడింది. పుత్రకుడంటే, పుత్రునితో సమానముగా చూడబడే శిష్యుడు. శిష్యులందరూ పుత్రులతో సమానులే అయినప్పటికీ, వారిలో ఉత్తముడైన వానిని తన పుత్రునిగా భావిస్తూ ఇవ్వవలసిన దీక్ష ఈ అధ్యాయములో చెప్పబడింది. పూర్తివివరముల కొరకు, తనచే రచింపబడిన 'తన్త్రాలోకము'నే గ్రంథమును పరిశీలించమని ఆచార్యులవారు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ గ్రంథములో మాత్రం, సంక్షిప్తముగా చెప్పబడుతుంది.

క్రిందటి అధ్యాయములో చెప్పబడిన సమయవిధులను చేసిన తర్వాత, మూడవరోజున ఈ దీక్షనివ్వాలి. అనగా, సమయదీక్షకు, ఈ దీక్షకు మధ్యన రెండురోజుల గడువుండాలి. సమయదీక్ష యొక్క ఫలితము శిష్యునిలో స్థిరం కావడానికి ఈ సమయం ఉపయోగపడుతుంది. అప్పుడు, త్రిశూలాబ్జమణ్డలమున సాముదాయిక యాగమును గావించాలి. త్రిశూలాబ్జ మండలమంటే ఏమిటో గత అధ్యాయంలో వివరింపబడింది. తన మూలాధార చక్రమునుండి ద్వాదశాంతము వరకూ పోతున్న త్రిశూలమును, దానిలో సమస్త అధ్వములను, దానిపైన మూడు పద్మములను, వాటిలో అపరా, పరాపరా, పరా యనబడే త్రిశక్తులను ధ్యానించాలి. ఇది త్రిశూలాబ్జ న్యాసము. ఇదే మండలమును నేలపైన చిత్రించి, దానిలో బాహ్యహోమమును చేసే ప్రక్రియ ఇక్కడ వివరింపబడింది.

మొదటగా, బాహ్యపరివారమును, ద్వారదేవతాచక్రమును, యాగస్థలము యొక్క బాహ్యములో పూజించాలి. మణ్డలము యొక్క తూర్పుభాగములో, ఈశాన్యకోణమునుండి ఆరంభించి ఆగ్నేయమువరకు వరుసగా గణపతి, గురువు, పరమగురువు, పరమేష్ఠిగురువు, పూర్వాచార్యులను, యోగినీచక్రమును, వాగీశ్వరిని, క్షేత్రపాలకుని పూజించాలి.

ఈ క్రమమును క్రింది పట్టికలో చూడవచ్చు.

సంఖ్య	దిక్కు	దేవత
1	తూర్పు	గణపతి
2	ఈశాన్యము	గురువు
3	ఉత్తరము	పరమగురువు
4	వాయవ్యము	పరమేష్ఠి గురువు
5	పశ్చిమము	అపైని ఆచార్యులు

సంఖ్య	దిక్కు	దేవత
6	నైరృతి	యోగినులు
7	దక్షిణము	వాగీశ్వరి
8	ఆగ్నేయము	క్షేత్రపాలకుడు

అప్పుడు, గురువుల యొక్క, దేవతలయొక్క సముచితమైన ఆజ్ఞలను తీసుకుని, త్రిశూలము యొక్క మొదలునుండి, దాని శిఖరమున వికసించియున్న కమలము వరకు, అన్ని అధ్వములనూ న్యసించి, వాటికి అర్చనము గావించాలి. త్రిశూలములోని మధ్యశూలములో భైరవనాథునితో సహా కొలువైయున్నట్టి భగవతి శ్రీపరాభట్టారికను పూజించాలి. ఎడమశూలములో అదేవిధముగా శ్రీమత్ అపరాశక్తిని పూజించాలి. కుడివైపు శూలములో శ్రీపరాపరా శక్తిని యథావిధిగా పూజింపవలెను. ఈ విధముగా అన్ని స్థానములలోను ఆయా దేవతల, శక్తుల సన్నిధి వలనను, భైరవనాథుడు మరియు పరాశక్తుల సన్నిధి వలనను, ఈ సర్వమునూ పరిపూర్ణమై భాసిస్తుంది.

మధ్యశూలములోని మధ్యభాగములో లోకపాలురను, వారి అస్త్రములను, సమస్తదేవతాచక్రమును వారి అధిష్ఠానదేవతలను కూడా పూజించాలి. అప్పుడు, కుంభములోను, కలశములోను, మణ్డలము (యంత్రము) లోను, హోమాగ్నిలోను, తనయొక్క ఆత్మలోను, 'ఇవన్నియు ఒక్కటే, ఇవన్నియు పరమేశ్వర స్వరూపములే' అనినట్టి అభేదభావనను కలిగియుండాలి. ఈ అయిందింటిని పంచాధికరణమంటారు. వీటిని పరమేశ్వరునితో ఒక్కటిగా అనుసంధించాలి. ఈ విధమైన అమృతమయమైన భావనతో కలిపిన పువ్వులు మొదలైన పూజా ద్రవ్యములతో విశేషపూజను గావించాలి. ఇదంతా చేసేటప్పుడు ధనమును ఖర్చు పెట్టడానికి వెనుకంజ వేయకూడదు. అలా వెనుకంజ వేయడాన్ని 'విత్తశాఠ్య'మంటారు. అది ఉండకూడదు. దానిని వదలిపెట్టి, యథాశక్తిగా తర్పణ మరియు నైవేద్యములను పరిపూర్ణం గావించాలి. తగినంత ధనము తనవద్ద లేనప్పుడు, ఈ మహామణ్డల యాగమును చేయడానికి పూనుకోకూడదు.

పశుబలి

జీవంతో ఉన్న పశువులను నివేదించాలి. అనగా వాటిని బలినివ్వాలి. కొన్ని వైదిక హోమములలో పశుబలి ఉంటుంది. అదే విధముగా, కొన్ని రకములైన తాంత్రికహోమములలో కూడా అది ఉంటుంది. అప్పుడా పశువులు కూడా అనుగ్రహింపబడతాయి. వాటిపట్ల కారుణ్యంతో ఉండవలెను. వాటిని తిరస్కారభావంతో చూడకూడదు. ఈ విధముగా పశువును బలినివ్వడాన్ని విమర్శించకూడదని శాస్త్రములలో చెప్పబడింది.

పశుబలి - రహస్యములు

జిహ్వాచాపల్యంతో మాంసమును వండుకుని తినడానికోసం పశువులను చంపడాన్ని తంత్రం ఒప్పుకొనదు. కారణమేమంటే, తంత్రమార్గంలో శుద్ధి చేయబడని పశువులలోని మూడు విధములైన మలములు వాటితోనే ఉంటాయి. అవి, అణవ, మాయీయ, కర్మ మలములు. వీటిని గురించి క్రిందటి

అధ్యాయములలో వివరింపబడింది. అటువంటి పశువుల యొక్క మాంసమును తినినవారిలో ఆయా మలములు భాగములుగా మారుతాయి. కనుక, కేవలం తిండికోసం ఇష్టానుసారంగా మాంసాహారమును తినేవారు సాధనామార్గంలో ఒక్క అడుగు కూడా పురోగమించలేరు. ఆధ్యాత్మికమార్గంలో నడవడం వారికి జరిగే పని కాదు.

అయితే, హోమవిధానంలో బలినివ్వబోయే పశువు యొక్క మూడు మలములను ఆచార్యుడు తన ధ్యానశక్తితో శుద్ధి చేస్తాడు గనుక, ఆ విధమైన పశుబలి వల్ల ఆ పశువుకు ఉత్తమగతి లభిస్తుంది. ఒక విధముగా పశుత్వం నుండి దానికి మోక్షం లభించి, ఉన్నతమైన జన్మ దానికి లభిస్తుంది. అప్పుడు దాని మాంసమును ప్రసాదంగా స్వీకరించినప్పటికీ, దోషం ఉండదు. దానిని తినడం వల్ల, తినినవారిలో మలములు పెరుగవు. అయితే దానిని జిహ్వాచాపల్యం కోసం తినకూడదు. ప్రసాదంగా మాత్రమే తినాలి. ఆహారం కోసం పశువును వండుకుని తినడానికీ, హోమంలో చేయబడే పశుబలికీ, బయటకు కనిపించని ఇంతటి భేదం ఉంటుంది అయితే, నిజమైన తపశ్శక్తి ఉన్న ఆచార్యుడే ఈ క్రియను చేయగలుగుతాడు గాని, మామూలుగా మంత్రోచ్చారణను నేర్చుకున్నవారు దీనిని చేయలేరు. ఈ భేదమును కూడా స్పష్టముగా గమనించాలి.

అప్పుడు, నువ్వులను నెయ్యిని పరమేశ్వరార్పణంగా అగ్నిలో అర్పించాలి. ఆ తరువాత, వపాహోమము కొరకు పశువును సిద్ధం చేయాలి. 'వప' అంటే, పశువు యొక్క క్రొవ్వు. ఎముకలోపల ఉండే మూలుగ అని కూడా దీనికి అర్థం ఉన్నది. పశుబలి తర్వాత, వపముతో దేవతాచక్రమును తర్పణము గావించాలి. తదుపరి మండలము (త్రిశూలాబ్జ యంత్రము) ను మరలా పూజించాలి.

అప్పుడు పరమేశ్వరుని ప్రార్థించి, ఆరు అధ్వములతో పరిపూర్ణముగా ఉన్నట్లుగా తన ఆత్మను భావిస్తూ, శిష్యుని తనకు దగ్గరగా కూర్చుండ బెట్టుకోవాలి. శిష్యుడు తన ఎదురుగా ఉన్నపుడు ఈ విధంగా చేయాలి. దీనిని 'ప్రత్యక్షదీక్ష' అంటారు. దూరంగా ఉన్నవారికిగాని, చనిపోయిన వారికి గాని ఇవ్వబడే దీక్షను 'పరోక్షదీక్ష' అంటారు. పరోక్షదీక్షలలో అయితే, చనిపోయినవారిని తన ఎదురుగా ఉన్నట్లుగా ధ్యానిస్తూ ఈ దీక్షనివ్వాలి. లేదా, వారికి ప్రతీకగా, ఒక దర్భను గాని, ఆవుపేడతో చేయబడిన, వారియొక్క ప్రతిమను గాని ఎదురుగా ఉంచుకోవాలి.

ఈ విధముగా, అర్ఘపాత్రలోని జలముతో శిష్యుని ప్రోక్షణము చేయాలి. పుష్పాదులతో అతనికి పూజించాలి. అన్ని అధ్వములనూ అతని దేహములో న్యసింపజేయాలి. అధ్వశోధనను రెండు విధములుగా చేయాలి. జీవితభోగములను అనుభవించాలనిన కోరిక శిష్యునిలో గనుక మిగిలి ఉన్నట్లయితే, అతనిలోని శుభసంస్కారములను శోధించకూడదు. వాటిని ఉండనిచ్చినపుడు మాత్రమే, అతని జీవితములో శుభఫలితములు కలుగుతాయి. దీనికి వ్యతిరేకముగా, మోక్షమును మాత్రమే కోరుకునేవానికి మాత్రము, అతనిలోని శుభాశుభసంస్కారములను రెంటినీ శోధించాలి. శుభమును, అశుభమును రెంటినీ దాటినవాడు మాత్రమే మోక్షమునకు అర్హుడౌతాడు.

నిర్బీజదీక్షలో అయితే, సమయవిధులచేత ఏర్పడినట్టి సంస్కారపాశములను కూడా శోధించాలి. మరణం దగ్గర పడినవానికి, మహామూర్ఖుడైన వానికి కూడా ఇదే దీక్షనివ్వమని పరమేశ్వరాజ్ఞయై యున్నది. అటువంటి

వారికి కూడా గురు, దేవతా, అగ్నుల పట్ల భక్తి ఉన్నప్పుడే సిద్ధి అనేది లభిస్తుంది. లేకుంటే లభించదు.

ఈ మొత్తము ప్రక్రియలో, శిష్యుల మధ్యన ఉన్న అత్యంత ముఖ్యమైన భేదము, వారి వాసన (సంస్కారము) లే. ఉపదేశింపబడిన మంత్రములు కూడా, ఆయా శిష్యుల వాసనలను (పూర్వసంస్కారములను) బట్టి మాత్రమే వాటి పనులను చేస్తాయి. అనగా, సత్వ, రజో, తమోగుణముల ఆధిక్యతలను బట్టి, శిష్యులకు పర, పరాపర, అపరా మంత్రములను ఉపదేశించాలి. ఈ విధముగా శిష్యుల యొక్క వాసనాభేదములను బట్టి, వారికనుగుణములైన మంత్రోపదేశములను చేయాలి. తనను తాను పరమశివుడనని భావించుకొనుచూ, శిష్యుల యొక్క దేహములలోని సమస్తములైన అధ్వములనూ శోధించి, శుద్ధి గావించాలి.

ఈ క్రమములో, తనయొక్క పాదముల నుండి ద్వాదశాంతము వరకు వెలుగుతున్న ఆత్మచైతన్యముతో, శిష్యుని చైతన్యమును ఒక్కటిగా ధ్యానించాలి.

విమోచనా దీక్ష

అనంతమైన ఆనందసరస్సులో మునిగిన స్థితిలో, పరమ స్వాతంత్ర్యము, పరమైశ్వర్యము, ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులతో నిండినదీ అయిన ధ్యానస్థితిలో ఉండాలి. ఈ విధముగా సమస్తదేవతా చక్రేశ్వరుడై, సమస్త అధ్వములతో నిండినవాడై, తానుదప్ప వేరేదీ లేని చిత్స్వరూపములో ఉంటూ, సమస్త విశ్వముతోనూ ఒక్కటిగా నిలచి, శిష్యుని యొక్క ఆత్మతో ఏకీభూతుడై విశ్రాంతిగా నిలువవలెను. ఈ విధముగా చేసినపుడు, శిష్యుడు పరమేశ్వరునితో అభిన్నతను పొందుతాడు. ఒకవేళ అతనిలో కొద్దిగానైనా భోగేచ్ఛ మిగిలి ఉన్నట్లయితే, 36 తత్వములలోని ఏ తత్త్వములో భోగేచ్ఛ ఉన్నదో గమనించి, ఆ తత్త్వములోనే అతనిని శోధించాలి. తరువాత కేవలభావనతో, పరమేశ్వరభావముతో నిండిన శుద్ధమైన దేహమును అతనికిచ్చినట్లు చింతించాలి. ఇదియే సమస్తపాశములనుండి పశువును (జీవుని) విడిపించే 'విమోచనాదీక్ష' యనబడుతుంది.

పుత్రక దీక్ష

అప్పుడు, ఇంతకు ముందులాగా దక్షిణలతో, శిష్యుడు గురువును పూజించవలెను. ఆ పిమ్మట, యథావిధిగా అగ్నిక్రియను చేయాలి. 'శ్రీపరామన్త్రః అముకస్యాముకం తత్త్వం శోధయామి' అని ఉచ్చరిస్తూ 'స్వాహాం'తముతో ప్రతితత్త్వమునకు మూడు మూడుమార్లు ఆహుతులనివ్వాలి. చిట్టచివరి ఆహుతిలో మాత్రము, 'వౌషట్' అంటూ ఆహుతినివ్వాలి. అప్పుడు, శిష్యుని దేహములో, భూమినుండి శివాంతమువరకూ ఉన్న 36 తత్త్వములకూ తత్త్వశుద్ధి జరుగుతుంది. తదుపరి, పూర్ణాహుతినివ్వాలి. శిష్యునిలో భోగేచ్ఛ మిగిలియున్నట్లైతే, భోగస్థానములో దాని శుద్ధికోసం ఒకటి, శుద్ధతత్త్వసృష్టికోసం ఇంకొకటి ఆహుతులనివ్వాలి. అప్పుడు గురువును దక్షిణతో పూజించాలి. ఇది 'పుత్రకదీక్ష' అనబడుతుంది. ఈ క్రియ వలన, వర్తమానంలోని కర్మఫలితం శుద్ధి కాదు. భూతకాలము, భవిష్యత్తులలోని కర్మ మాత్రమే శుద్ధి అవుతుంది.

తనయొక్క ఆరుఅధ్వముల లోపల ఉన్న చైతన్యమును, ఏమాత్రమూ భేదం లేని విధముగా బాహ్యాంగా

కూడా అనుసంధించాలి. ఈ విధంగా, శిష్యుని యొక్క బుద్ధి, ప్రాణము, తనువులను, చైతన్యవంతములను గావించి, తనయొక్క బుద్ధి, ప్రాణము, దేహములతో వాటిని ఒక్కటిగా చేయవలెను.

శిష్యుడు, ఆచార్యునితో ఈ విధమైన ఏకత్వభావంలోకి ప్రవేశించి, మహానందబోధతో నిండినవాడై ధ్యానస్థితుడైనప్పుడు, పశువుగా ఉన్నట్టి అతనికి శివాత్మభావం లభిస్తుంది. అప్పుడతడు 'పశుపతి' అవుతాడు.

ఆ// అద్వపూర్ణమైన యాత్మలో నిలుచుండి
భేదమెల్ల బాపి బాహ్యమందు
బుద్ధి ప్రాణ దేహ పూర్ణత్వమున్ దాల్చి
శిష్య కొసగ; యతడు శివుడు గాడె?

ఆ// శిష్యుడిట్టి దివ్య చింతనమ్మున నిల్చి
బోధపూర్ణుడగుచు బొసగినంత
శివుని రూపుదాల్చి చిన్మాత్ర ఘనుడౌచు
పతిగ దేరి పశువు బఱగు నపుడు

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే పుత్రకదీక్షాప్రకాశనం నామ చతుర్దశమాహ్నికమ్ || 14 ||

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని పుత్రకదీక్షాప్రకాశనమనే పద్నాలుగవ ఆహ్నికము.

పదిహేనవ ఆహ్నికము

సప్రత్యయదీక్షా ప్రకాశనము

యదార్థః - యదార్థము

యదా పునరాసన్నమరణస్య స్వయం వా బన్ధుముఖేన శక్తిపాత ఉపజాయతే, తదా అస్మై సద్యః సముత్క్రమణదీక్షాం కుర్యాత్ । సమస్తమధ్వానం శిష్యే న్యస్య తం చ క్రమేణ శోధయిత్వా, భగవతీం కాలరాత్రీమ్ మర్మకర్తనీం న్యస్య, తయా క్రమాత్క్రమం మర్మపాశాన్ విభిద్య, బ్రహ్మరన్ధ్రవర్తి శిష్యచైతన్యం కుర్యాత్ । తతః పూర్వోక్తక్రమేణ యోజనికార్థం పూర్ణాహుతిం తద్యాత్, యథా పూర్ణాహుత్యన్తే జీవో నిష్క్రాన్తః పరమశివాభిన్నో భవతి ।

ఎవనికైతే మరణం దగ్గరైనదో వానికి స్వయముగా గాని, బంధుముఖంగా గాని శక్తిపాతము కలిగితే, అతనికి అప్పుడే సముత్క్రమణదీక్షనివ్వవలెను. సమస్త అధ్వములను శిష్యునిలో న్యసించి, క్రమముగా శోధించవలెను. మర్మములను ఛేదించే భగవతి కాళరాత్రిని న్యాసము చేయవలెను. ఆమె ద్వారా క్రమముగా మర్మపాశములను భేదించవలెను. శిష్యచైతన్యమును బ్రహ్మరంధ్రములో నిక్షేపించవలెను. పూర్వోక్తక్రమములో పూర్ణాహుతినివ్వవలయును. ఆ విధముగా పూర్ణాహుతి చివరలో అతడు నిష్క్రమించి పరమశివునితో అభిన్నుడౌతాడు.

బుభుక్షోస్తు ద్వితీయా పూర్ణాహుతిః - భోగస్థానే యోజనాయ, తత్కాలే చ తస్య జీవలయః, నాత్ర శేషవర్తనమ్, బ్రహ్మవిద్యాం వా కర్ణే పఠేత్, సా హి పరామర్శస్వభావా సద్యః ప్రబుద్ధపశుచైతన్యే ప్రబుద్ధవిమర్శం కరోతి । సమయ్యాదేరపి చ ఏతత్పాఠేఽధికారః ।

బుభుక్షువైనవానికి భోగస్థానములో యోజించుటకొరకు రెండవ పూర్ణాహుతి నివ్వవలయును. ఆ క్షణములోనే అతని జీవం లయమౌతుంది. శేషం మిగలదు. లేదా వాని చెవిలో బ్రహ్మవిద్యను పఠించవలెను. అది పరామర్శస్వభావి యగుటవలన తత్క్షణమే ప్రబుద్ధపశుచైతన్యములో ప్రబుద్ధవిమర్శను కలిగిస్తుంది. సమయులైనవారికి కూడా దీనిని పఠించదానికి అధికారమున్నది.

సప్రత్యయాం నిర్బీజాం తు యది దీక్షాం మూఢాయ ఆయాతశక్తిపాతాయ చ దర్శయేత్, తదా హి శివహస్తదానకాలే అయం విధిః - త్రికోణమాగ్నేయం జ్వాలాకరాలం రేఫవిస్ఫులిఙ్గం బహిర్వాత్యాచక్రధ్మాయమానం మణ్డలం దక్షిణహస్తే చిన్తయిత్వా తత్రైవ హస్తే బీజం కించిత్ నిక్షిప్య ఊర్ధ్వాధోరేఫవిబోధితఫట్కారపరమ్పరాభిః అస్య తాం జననశక్తిం దహేత్, ఏవం కుర్వన్ తం హస్తం శిష్యస్య మూర్ధని క్షిపేత్, ఇతి స్వయోరపి ఏషా దీక్షా నిర్బీజా స్వకార్యకరణసామర్థ్యవిధ్వంసినీ భవతి - స్థావరాణామపి దీక్ష్యత్వేన ఉక్తత్వాత్, వాయుపురాన్తర్వ్యవస్థితం దోధూయమానం శిష్యం లఘూభూతం చిన్తయేత్ - యేన తులయా లఘుః దృశ్యతే ఇతి ।

ఎవనికైతే సప్రత్యయమైన నిర్బీజదీక్ష ఇవ్వబడినదో అతడు మూఢుడైనప్పటికీ శక్తిపాతమును చూపించాలి. శివహస్తదానకాలమున ఈ విధిని ఆచరించాలి. అగ్నిమయమై రేఫవిస్ఫులిఙ్గమైన త్రికోణములో

వాయుచక్రముద్వారా బయటకు సంచరించనున్న అగ్నిమండలమును దక్షిణహస్తమున చింతించి ఆ హస్తములో కొన్ని బీజములనుంచి ఊర్ధ్వముగా అధోముఖంగా ప్రసరించుచున్న ఫట్కారశక్తితో వాటి జననశక్తిని దహించాలి. ఇది చేసిన పిదప ఆ హస్తమును శిష్యుని మూర్ధమున ఉంచాలి. ఇదియే నిర్బీజదీక్ష. ఇది స్వకార్యకరణసామర్థ్యమును విధ్వంసము గావిస్తుంది. స్థావరములకు కూడా దీక్ష చెప్పబడినది. వాయుపురముందు ఉండి దోధూయమానుడౌతున్నట్లుగా శిష్యుని లఘురూపములో చింతించవలెను. దీనివల్ల అతడు లఘువౌతాడు.

శ్లో|| మర్మకర్తనవిధౌ లఘుభావేబీజభావవిలయే యది మన్త్రః |
తత్తథోచితపథేన నియుక్త-స్తత్తదాశు కురుతే పరమేశః ||

మర్మములను ఛేదించడం వలన దేహం తేలికపడుతుంది. మంత్రోచ్చారణతో బీజలయము సిద్ధిస్తుంది. ఈ మార్గములో నియుక్తుడైనప్పుడు అతడిని పరమేశ్వరుడు స్వీకరించి సముచితపదమును అనుగ్రహిస్తాడు.

వ్యాఖ్యానము

ప్రత్యయమంటే, ఒక పదమునకు ముందూ వెనుకలలో తగిలించబడు విశేషణము. దానివలన, ఆ పదము యొక్క మూలార్థము వెలుగులోకి వస్తుంది. మూలార్థము వైపుకు మనసును నడిపించే పదమునే ప్రత్యయమంటారు. తంత్రమార్గములో అయితే, ఋజువులను చూపించే దీక్షను 'ప్రత్యయదీక్ష' అంటారు. ఈ దీక్షాసమయంలో, మరణశయ్య మీద ఉన్న శిష్యుని దేహం బరువును కోల్పోయి, తేలికపడి, గాలిలోకి లేవడం వంటి ఋజువులు ప్రత్యక్షంగా కనిపిస్తాయి గనుక ఇది స-ప్రత్యయ (ఋజువులతో కూడిన) దీక్ష అనబడుతుంది.

ప్రత్యయదీక్ష అంటే, మరణము మొదలైన ఆపత్సమయములలో, ఆ జీవుని మనస్సును ఈశ్వరునిలో లగ్నము చేసే విధంగా, కొన్ని ఋజువులను చూపిస్తూ ఇవ్వబడే దీక్షయని అర్థము.

కొంతమందికి వారి వారి జీవితపు ఆఖరిఘడియలలో జ్ఞానోదయం అవుతుంది. మరణం దగ్గరైనప్పుడు ఆధ్యాత్మికం యొక్క విలువ వారికి తెలుస్తుంది. ఇది అందరిలో జరుగదు గాని, కొందరిలో జరుగుతుంది. కుటుంబ బాధ్యతలలో జీవితం మొత్తం గడిచినప్పటికీ, వారిలో కొంత ఆధ్యాత్మికతృష్ణ మినుకు మినుకుమంటూ ఉంటుంది. కాని, దీక్షను తీసుకుని సాధన చేయడానికి వారికి సమయం ఉండదు. తీవ్రమైన చింతన ద్వారా వారికి స్వయముగా శక్తిపాతం కలుగవచ్చు. లేదా, ఎవరో ఆధ్యాత్మికమార్గంలో సాధన గావిస్తున్న బంధువులు చెబితే కూడా వారికి శక్తిపాతము కలుగవచ్చు. అటువంటివారికి, అప్పటికప్పుడే 'సముత్క్రమణదీక్ష' అనేదానిని ఇవ్వాలి. దానిని ఈ అధ్యాయములో క్లుప్తముగా వివరిస్తున్నారు.

సప్రత్యయ దీక్ష

ఆరు అధ్వములనూ శిష్యునిలో న్యాసము గావించి, వాటిని క్రమముగా శోధించాలి. ఆపైన, మర్మములను ఛేదించే భగవతి కాళరాత్రిని (కాళరాత్రి మంత్రమును) న్యాసము చేయవలెను. దీక్షను స్వీకరిస్తున్న శిష్యుని

యొక్క మర్మపాశములను ఈ మంత్రోచ్చారణ ద్వారా ఒక్కొక్కటిగా ఛేదించివేయాలి. అప్పుడు, శిష్యుని యొక్క చైతన్యమును పైపైకి తెచ్చి అతనియొక్క బ్రహ్మరంధ్రములో నిక్షేపించాలి. ఇంతకు ముందు చెప్పబడిన క్రమములో పూర్ణాహుతినివ్వాలి. హోమవిధానములో పూర్ణాహుతి యంటే, హోమముయొక్క చివరలో ఇవ్వబడే ఆహుతి. యోగమార్గములో పూర్ణాహుతి యంటే, జీవచైతన్యమును బ్రహ్మరంధ్రము వరకూ తీసుకుని పోయి, అక్కడనుండి మహాశూన్యంలో ఉన్న ద్వాదశాంతస్థానములో దానిని లయం చేయడమే పూర్ణాహుతి యనబడుతుంది. దీనిని చేయగలగాలంటే, ఎన్నో ఏండ్ల సాధనాబలము, తపోబలమూ ఉండాలి. ఈ విధమైన ప్రక్రియను మరణసమయంలో ఉన్న శిష్యుడు చేయలేడు గనుక, ఆచార్యుడే ఈ పనిని చేయవలసి ఉంటుంది. అంతటి శక్తి ఆయనలో ఉండాలి. ఈ విధముగా పూర్ణాహుతి చేయబడినప్పుడు, శిష్యుడు బంధవిముక్తుడై, దేహమును విడచిపెట్టి, పరమశివునిలో లీనుడై, ఆయనతో ఒక్కటైపోతాడు.

బుభుక్షువు - ముముక్షువు

బుభుక్షువు, ముముక్షువు అనే రెండు పదములను అర్థం చేసుకోవాలి. బుభుక్షువంటే ప్రపంచభోగములను ఇంకా అనుభవించాలన్న కోరికలు తనలో మిగిలియున్నవాడు. ముముక్షువంటే ఆ కోరికలను విడచిపెట్టి, కేవలం మోక్షమును మాత్రమే ఆశించేవాడు. ముముక్షువునకు ఏ విధమైన దీక్షనివ్వాలో పైన చెప్పబడింది. ఇక, బుభుక్షువైనవానికి, అంటే కోరికలు బలంగా మిగిలి ఉన్న జీవునికి, రెండవ పూర్ణాహుతిని కూడా ఇవ్వాలి. ఆయా కోరికలను నిశ్శేషం చేయడం కోసం ఇది ఇవ్వబడుతుంది. ఆ క్షణములోనే అతని జీవం ఈశ్వరునితో లయమైపోతుంది. ఆపైన అతనికి కర్మశేషం ఎంతమాత్రమూ మిగులదు.

రెండవ విధానములో, దీక్షను స్వీకరిస్తున్న వాని చెవిలో బ్రహ్మవిద్యామంత్రమును పఠించవలెను. దానిని వినడం వలన, దీక్షితునిలో పరామర్శ తలయెత్తుతుంది. అంటే, ధ్యానపూర్వకమైన చింతనాస్థితి పైకొంటుంది. కనుక అది, అప్పుడే వెలుగును నింపుకుంటున్న పశువు (జీవుని) యొక్క చైతన్యములో వివేకపు వెలుగుతో కూడిన చింతనను రగిలిస్తుంది. సమయదీక్షను స్వీకరించినవారు కూడా అక్కడ ఉన్నట్లయితే, వారు కూడా దీనిని పఠించవచ్చు. దీనివల్ల, మరణిస్తున్న జీవికి సమయదీక్ష లభిస్తుంది.

ఈ దీక్షను గురించి వివరిస్తూ, తంత్రాలోక గ్రంథము 19 వ అధ్యాయంలో అభినవగుప్తులవారు ఇలా అంటారు, 'దేహపాశములను త్రెంచివేసే ఈ దీక్ష, యోగవిద్యలో సిద్ధుడైన గురువు చేత మాత్రమే ఇవ్వబడుతుంది. వివిధములైన ప్రాణాయామక్రియలను అభ్యాసం చేయని ఆచార్యుడు దీనినెలా ఇవ్వగలడు?' ఇవ్వలేడని అర్థము.

ఎవనికైతే సప్రత్యయమైన నిర్బీజదీక్ష ఇవ్వబడినదో, అతడు మూఢుడైనప్పటికీ, వానికి కూడా శక్తిపాతమును ప్రదర్శించి చూపించాలి. లేకపోతే, అతని మూర్ఖత్వకారణంగా, దీక్షయందు అతనికి విశ్వాసం కలుగదు. శివహస్త ప్రదానకాలమున కూడా ఈ విధిని ఆచరించాలి.

శివహస్త విధానము - నిర్బీజ దీక్ష

ఈ 'శివహస్త విధానము' ఇప్పుడు వివరింపబడుచున్నది. అగ్నిజ్వాలలను వెదజల్లుతూ, 'రం' అనే

వర్ణముతో నిండియున్న త్రికోణమును తన కుడి అరచేతిలో యున్నట్లుగా ధ్యానించాలి. వాయువుద్వారా ప్రేరితమైన ఆ అగ్ని, తన చేతినుండి బయటకు వెదజల్లబడుచున్నట్లుగా ధ్యానించాలి. ఆ హస్తములో కొన్ని వడ్లగింజల నుంచాలి. 'ఫట్' అనే మంత్రమును ఉచ్చరిస్తూ, ఆ గింజలయొక్క పైనా క్రిందులుగా అగ్నిని ధ్యానించి, వాటియొక్క మొలకలెత్తే శక్తిని దహించివేయాలి. అనగా, బీజములను నిర్బీజములుగా మార్చివేయాలి. ఈ బీజములు శిష్యుని మనస్సు యొక్క లోతులలో ఉన్న సంస్కారములు. వీటిని దహించడం వలన, అతని సంస్కారములు దహింపబడతాయి. దీనిని చేసిన తరువాత, ఆ హస్తమును శిష్యుని తలపైన ఉంచాలి. ఇదియే 'నిర్బీజదీక్ష' అనబడుతుంది. ఈ క్రియ వలన, ఆ బీజములకు మొలకలెత్తే సామర్థ్యం నశిస్తుంది. కదలలేని మొక్కలవంటి వాటికికూడా ఈ విధానంలో దీక్షనివ్వవచ్చు. ఆకాశములో గాలిమధ్యన, దూదివలె బరువులేకుండా తేలుతూ ఉన్న రూపంలో శిష్యుని రూపమును ఆచార్యుడు ధ్యానించాలి. అప్పుడు నిజంగానే శిష్యుడు తన బరువును కోల్పోయి తేలికపడతాడు.

అయిదవ అధ్యాయములో చెప్పబడిన ప్రాగానందము, ఉద్భవము, కంపము, నిద్ర, ఘూర్ణి అనబడే అయిదు స్థితులు ఈ సమయంలో శిష్యునకు కలుగుతాయి. మంత్రోచ్చారణము వల్లను, ధ్యానశక్తి వల్లను, శిష్యుని దేహములోనున్న భూతత్వము శిథిలమైపోగా, అతని దేహము తేలికపడి గాలిలోకి లేవడం సంభవిస్తుందని తంత్రాలోకములో అభినవగుప్తులవారు అనినారు.

ఈ విధానము తన గురువైన శ్రీ శంభునాథాచార్యుని అనుగ్రహంతో తనకు సిద్ధించినదని అభినవగుప్తులవారు వ్రాసినారు. దీనివల్ల, అణవ, కర్మ, మాయీయ మలములు మూడునూ భస్మమై పోతాయి గనుక, ఇది చాలా మహత్తరమైన దీక్షగా చెప్పబడింది.

ఆ// మర్మభేదనమున మనుజుండు లఘువౌను
బీజలయము జేయు బీజశక్తి
జీవుడిట్టి పదము జేరగా దిలకించి
ఇష్టభూమి నొసగు నీశ్వరుండు

మర్మములను భేదించడం వలన శిష్యుని దేహం తేలికపడుతుంది. మంత్రోచ్చారణతో అతనికి బీజలయము సిద్ధిస్తుంది. ఈ మార్గములో నియుక్తుడైనప్పుడు అతడిని పరమేశ్వరుడు స్వీకరించి అతనికి ఇవ్వవలసిన స్థానమును అనుగ్రహిస్తాడు.

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే సప్రత్యయదీక్షా ప్రకాశనం నామ పఞ్చదశమాహ్నికమ్ || 15 ||

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని సప్రత్యయదీక్షాప్రకాశనమనే పదిహేనవ ఆహ్నికము.

పదహారవ ఆహ్నికము
పరోక్షదీక్షా ప్రకాశనము

అథ పరోక్షస్య దీక్షా, ద్వివిధశ్చ సః - మృతో జీవంశ్చ । తత్ర కృతగురుసేవ ఏవ మృత ఉద్వాసితో వా అభిచారాదిహతో డిమ్బాహతో మృత్యుక్షణోదితతథారుచిః ముఖాన్తరాయాతశక్తిపాతో వా తథా దీక్ష్య ఇత్యాజ్ఞా । అత్ర చ మృతదీక్షాయామ్ అధివాసాది న ఉపయుజ్యతే ।

ఇప్పుడు పరోక్షదీక్ష వివరింపబడుచున్నది. ఇది రెండు విధములు, మృతులకు, జీవులకని. ఎవరైతే గురుసేవ చేస్తూ మరణిస్తాడో, లేదా వేరేచోటకు పోయి యున్నాడో, లేదా అభిచారాదులవలన హతుడైనాడో, లేదా డింబాహతుడైనాడో, మృత్యుక్షణములో అతనికి దీక్షాసంకల్పము కలిగినట్లైతే, లేదా ఇతరుల ముఖమునుండి గాని విని శక్తిపాతమైతే, అతనికి దీక్షనివ్వవలెనన్నది ఆజ్ఞ. వీనిలో మృతదీక్షయందు అధివాసాదుల ఉపయోగము లేదు.

మణ్డలే మన్త్రవిశేషసంనిధయే యత్ర బహులా క్రియా, ఉత్తమముపకరణం పుష్పాది, స్థానం పీఠాది, మణ్డలం త్రిశూలాబ్జాది, ఆకృతిః ధ్యేయవిశేషః, మన్త్రః స్వయం దీప్తశ్చ, ధ్యానపరస్య యోగినః తదేకభక్తిసమావేశశాలినో జ్ఞానినశ్చ సంబన్ధః, ఇత్యేతే సంనిధానహేతవో యథోత్తరమ్ ఉక్తాః । సముదితత్వే తు కా కథా స్యాత్ - ఇతి పరమేశ్వరేణ ఉక్తమ్ ।

మండలములో మంత్రవిషయసంబంధమై ఏయే బహుళక్రియలైతే ఉన్నవో, ఉత్తమోపకరణములైన పుష్పములు మొదలైనవి, పీఠములు మొదలగు స్థానము, త్రిశూలాబ్జమండలము మొదలైన యంత్రములు, ధ్యేయవిశేషములైన ఆకృతులు, స్వయముగా దీప్తమైన మంత్రము, ధ్యానపరుడైన యోగికి, తదేక భక్తిసమావేశ సమర్థుడైనవానికి, జ్ఞానసంబంధుడైనవానికి, సన్నిధానహేతువు లౌతున్నాయని చెప్పబడింది. పరమేశునితో సముదితత్వము లభించినవాని గురించి ఇక చెప్పునదేమున్నది? ఇది పరమేశ్వరునిచేతనే చెప్పబడినది.

తతో దేవం పూజయిత్వా తదాకృతిం కుశాదిమయీమ్ అగ్రే స్థాపయిత్వా గుర్వాసాదితజ్ఞానోపదేశక్రమేణ తాం పశ్యేత్, స చ

శ్లో॥ మూలాధారాదుదేత్య ప్రసృతసువితతానన్తనాద్యధ్వదణ్డం
వీర్యేణాక్రమ్య నాసాగగనపరిగతం విక్షిపన్వ్యాప్తుమీప్సేః ।
యావద్ధూమాభిరామప్రచితతర శిఖాజాలకేనాధ్వచక్రం
సంఛాద్యాభీష్ట జీవానయనమితి మహాజ్జాలనామా ప్రయోగః ॥

శ్లో॥ ఏతేనాచ్ఛాదనీయం వ్రజతి పరవశం సంముఖీనత్వమాదౌ
పశ్చాదానీయతే చేత్సకలమథ తతోఽపృథ్వమధ్యాద్యభేష్టమ్ ।
ఆకృష్టావుద్ధృతౌ వా మృతజనవిషయే కర్షణీయేఽథ జీవే
యోగః శ్రీశంభునాథాగమపరిగమితో జాలనామా మయోక్తః ॥

అప్పుడు దేవుని పూజించి, శిష్యుని ఆకృతిని కుశలో నిర్మించి పీటపైన స్థాపించి గురువుచేత లభించిన

జ్ఞానోపదేశక్రమములో అతడిని చూడవలెను. మూలాధారము నుండి ఉదయించి అనంతములైన నాడులలో ప్రసరిస్తున్న ప్రాణము దండమై, వీర్యమునాక్రమించి, ముక్కులనుండి శూన్యములోకి నిర్గమించి వ్యాపించడాన్ని వీక్షించాలి. దానియొక్క అగ్నిశిఖలతోను, ధూమముతోను, అర్ఘ్యచక్రము మొత్తమును ఆచ్ఛాదించగా, అభీష్టములను జీవునికొసగే మహాజాలమనబడే ప్రయోగమగుచున్నది.

ఈ విధముగా అచ్ఛాదితమైనవి పరవశములౌతాయి. మొదట వాటిని సమ్ముఖంలో ఉంచుకోవాలి. తరువాత వాటిని దగ్గరగా తీసుకోవాలి. ఆ అర్ఘ్యముల మధ్యలోకి మృతజీవుని ఆకర్షించి ఇచ్చే దీక్షను, శ్రీ శంభునాథుల ద్వారా నాకు లభించినదానిని నేను చెప్పినాను.

బహిరపి ఇత్థం కథం న భవతి, ఆకర్షణాదౌ వినాభ్యాసాత్? ఇతి చేత్ - రాగద్వేషాది యోగవశేన తత్ప్రవృత్తౌ ఐశ్వర్యావేశాయోగాత్| తతో నియతి నియన్త్రితత్వాత్ అభ్యాసాద్యాపేక్షా స్యాదేవ | ఇహ తు అనుగ్రహాత్మక పరమేశ్వరతావేశాత్ తథాభావః | పరమేశ్వర ఏవ హి గురుశరీరాధిష్ఠానద్వారేణ అనుగ్రహ్యాన్ అనుగృహ్ణాతి | స చ అచిన్త్యమహిమా ఇతి ఉక్తప్రాయమ్ |

బాహ్యంగా కూడా ఇట్లా ఎందుకు జరుగదు? ఆకర్షణ మొదలైన క్రియలలో అభ్యాసము లేకపోవడం వల్లనా? అనగా, అలా కాదని సమాధానం. ఎందువలననగా, రాగద్వేషాదియోగవశమున ఆచార్యునిలో ఈశ్వరావేశము జరుగదు. అది నియతి నియన్త్రితము వలన జరుగుతుంది. అభ్యాసము తప్పనిసరి. కానీ ఇక్కడ అనుగ్రహాత్మక పరమేశ్వరతావేశత ఉంటుంది గనుక అభ్యాసము అక్కరలేదు. పరమేశ్వరుడే గురుశరీరాధిష్ఠాతయై అనుగ్రహీతమైన తన అనుగ్రహాముని వర్షిస్తాడు. ఆయన యొక్క మహిమ అచిన్త్యమని చెప్పబడినది.

ఏవం జాలప్రయోగాకృష్టో జీవో దార్భం జాతీఫలాది వా శరీరం సమావిష్టో భవతి, న చ స్పన్దతే - మనఃప్రాణాదిసామగ్ర్యభావాత్, తదనుధ్యానబలాత్ తు స్పన్దతేఽపి తాదృశేఽపి తస్మిన్ పూర్వవత్ ప్రోక్షణాదిసంస్కారః పూర్ణాహుతియోజనికాన్తః అత్ర పరం పూర్ణాహుత్యా తస్య దార్భాద్యాకారస్య పరతేజసి లయః కర్తవ్యః | ఏవమ్ ఉద్ధృతోఽసౌ పూర్ణాహుత్యైవ అపవృజ్యతే - యది స్వర్నరకప్రేతతిర్యక్షు స్థితః |

ఈ జాలప్రయోగమునకు ఆకృష్టుడైన జీవుడు దర్భలోగాని, జాతీఫలాది ఫలములలో గాని ప్రవేశిస్తాడు. వానిలో స్పందన ఉండదు, మనఃప్రాణాది సామగ్రి అతనిలో ఉండదు గనుక. వాటిని అనుధ్యానించినట్టి బలముతో స్పందన కూడా వస్తుంది. అప్పుడు దానికి ఇంతకు ముందటివలెనే, ప్రోక్షణాదిసంస్కారములు గావించి, పూర్ణాహుతినొసగి, దర్భాది ఆకారములో ఉన్న అతడిని పరతేజస్సులో లీనం చేయవలెను. ఈ విధముగా ఉద్ధరించబడిన పూర్ణాహుతితో అతనికి మోక్షము లభిస్తుంది, అతడు స్వర్గ నరక ప్రేత తిర్యక్ భూములలో ఉన్నట్లయితే.

మనుష్యస్తు తథైవ జ్ఞానం యోగం దీక్షాం వివేకం వా లభతే - అధికారిశరీరత్వాత్, ఇతి మృతోద్ధరణమ్ | జీవతోఽపి పరోక్షస్య ఉత్పన్నే శక్తిపాతేఽయమేవ క్రమః, దార్భాకృతికల్పనజీవాకృష్టివర్జమ్ | ధ్యానమాత్రోపస్థాపితస్యైవ అస్య సంస్కారః | దీక్షా చ భోగమోక్షోభయదాయినీ - స్వావాసనాబలీయస్త్వాత్, భోగవాసనావిచ్ఛేదస్య చ అసంభావ్యమానత్వాత్ బహుభిః, దీక్షాయామ్ ఊర్ధ్వశాసన సంస్కారో బలవాన్ అన్యస్తు తత్సంస్కారాయ స్యాత్ | పరోక్షస్యాపి దీక్షితస్య తథైవ జ్ఞానాద్యావిర్భావః ఇతి |

ఒకవేళ మనుష్యుడైతే, అధికారి శరీరముతో ఉన్నాడుగనుక, వానికి జ్ఞానము, యోగము, దీక్ష, వివేకములు లభిస్తాయి. ఇది మృతోద్ధరణము. జీవించి ఉన్నప్పటికీ పరోక్షంలో ఉంటే, ఈ విధమైన శక్తిపాతమే విధానము. దర్భాకృతి యొక్క కల్పన, జీవాకర్షణము అక్కరలేదు. కేవలము ధ్యానము ద్వారానే అతనికి సంస్కారమౌతుంది. దీక్ష భోగ-మోక్షములనే రెంటినీ ప్రసాదిస్తుంది. వాసనలు బలీయములైనవి. ఎక్కువగా ఉండే భోగవాసనలను విచ్ఛేదము చేయడం అసంభవము. దీక్షలలో ఊర్ధ్వశాసన సంస్కారదీక్షలు బలవత్తరములైనవి. అన్యములకు మళ్ళీ సంస్కారములు గావించాలి. పరోక్షములో ఉన్నట్టి దీక్షితునికి కూడా దీనివలన జ్ఞానము ఆవిర్భవిస్తుంది.

పరమేశ్వరతావేశదార్ఢ్యాత్స్వాతన్త్ర్యభాగ్గురుః |
పరోక్షమభిసంధాయ దీక్షితేతి కిమద్భుతమ్ ||

పరమేశ్వరావేశమువల్ల కలిగిన శక్తి స్వాతంత్రములతో వెలిగే గురువు, పరోక్షంలో కూడా దీక్షనివ్వగలడు. ఏమి ఈ అద్భుతము?

వ్యాఖ్యానము

ఇప్పుడు 'పరోక్షదీక్ష' యనబడే విధానము వివరింపబడుచున్నది. పరోక్షదీక్ష యంటే, తన సమక్షంలో లేనివానికి దీక్షనిచ్చే విధానము. ఇది రెండువిధములుగా ఉంటుంది. ఒకటి, చనిపోయినవారికి. రెండవది, జీవించియున్నవారికి. చనిపోయినవారు ఎలాగూ తన సమక్షంలో ఉండరు. జీవించి యున్నవారు కూడా, దూరదేశంలో ఉన్నవారుంటారు. అలాంటి వారికి కూడా, ఇక్కడనుంచి దీక్షనిచ్చే విధానం తంత్రశాస్త్రంలో ఉన్నది. దానిని ఈ అధ్యాయంలో అభినవగుప్తులవారు వివరిస్తున్నారు.

ఎటువంటి వారికి ఈ దీక్షను ఇవ్వవచ్చు? అనగా, నాలుగు విధములైన వారికి దీనినివ్వవచ్చు.

1. ఏ శిష్యుడైతే, గురుసేవను చేస్తూ చేస్తూ, దీక్షను తీసుకోకుండా మరణిస్తాడో అతనికి.

2. లేదా, దూరప్రాంతమునకు పోయి అక్కడనే ఉండిపోయిన వానికి.

3. లేదా, అభిచారాదుల వలన హతుడైనవానికి. అభిచారమంటే చేతబడి మొదలైన క్షుద్రప్రయోగములని అర్థము.

4. లేదా, డింబాహతుడైనవానికి. అంటే, ప్రమాదంలో మరణించినవాడని ఈ మాటకు అర్థం.

పై నాలుగువిధముల వారిలో, చనిపోయినవారి విషయంలో అయితే, మృత్యుక్షణములో అతనికి దీక్షాసంకల్పము గనుక కలిగియున్నట్లైతే అతనికి ఈ దీక్షనివ్వవచ్చు. లేదా, అతనికి శక్తిపాతమైనదని ఇతరుల నోటినుండి ఆచార్యునకు తెలిస్తే, అప్పుడు కూడా అతనికి ఈ విధమైన దీక్ష ఇవ్వవలెనన్నది శివాజ్ఞ. శక్తిపాతమంటే, పరమేశ్వరాద్వయ మార్గములో నడుద్దామనిన భక్తిశ్రద్ధలతో కూడిన సంకల్పమని అర్థం. ఈ సంకల్పం ఉదయిస్తే, అతనికి శక్తిపాతం లభించినట్లేనని అర్థం చేసుకోవాలి.

పైన చెప్పబడిన దీక్షలలో, మృతదీక్ష యందైతే, అధివాసము (గురుశిష్యులిరువురూ దీక్షాస్థలములో అంతకు ముందు రాత్రి నిద్రించడం) మొదలైనవి జరగడం అసంభవం గనుక వాటియొక్క ఉపయోగము ఉండదు. హోమస్థలంలో రకరకములైన వస్తువులు ఉపయోగింపబడుతాయి. అనేక విధములైన క్రియాకలాపములు చేయబడతాయి. వాటిలో, ఉత్తమములైన పుష్పములు, పీఠములు, త్రిశూలాబ్జమండలము మొదలైన యంత్రములు, ధ్యానమునకు పూజకు ఆధారములైన విగ్రహములు, మంత్రోచ్చారణము, ఇవన్నీ ఉంటాయి. వీటియొక్క ఉపయోగమేమిటి? ధ్యానపరుడైన యోగికి, తదేకనిష్ఠతో కూడిన భక్తితో నిండినవానికి, జ్ఞానపరుడైనవానికి, ఇవన్నీ పరమేశ్వరుని యొక్క సన్నిధిని దరిజేర్చే ఉపకరణాలౌతాయి. వీటన్నిటియొక్క ఉపయోగము, పరమేశుని సాన్నిధ్యమును ఆ ప్రదేశంలో సాక్షాత్కరింపజేయడమే. వీటితో పనిలేకుండా, సాధనాబలంతో, తపోబలంతో, పరమేశ్వరుని సాక్షాత్కారమును స్వయముగా పొందినవారు కొందరుంటారు. అటువంటి మహనీయుల గురించి ఇక చెప్పనవసరం లేదు. వారికి, ఈ వస్తువుల అవసరం ఉండదని అర్థము.

మహాజాల ప్రయోగము

మొదటగా, పరమేశ్వరుని పూజించాలి. శిష్యుని యొక్క ఆకృతిని కుశదర్భలతో తయారు చేసి, ఒక పీటపైన దానిని స్థాపించాలి. తన గురువుచేత లభించిన జ్ఞానోపదేశమును బట్టి, ఆ ఆకృతిని కాళ్లనుంచి తలవరకూ తేరిపార చూడాలి. అతనియొక్క మూలాధారచక్రము నుండి ఉదయించిన ప్రాణశక్తి, అనంతములైన నాడులలో ప్రసరిస్తూ, ఒక దండము మాదిరిగా అయినట్లు, అతని శక్తిని ఆక్రమించి, ముక్కులనుండి శూన్యములోకి వెళ్ళిపోయి, ఆకాశమంతటా వ్యాపించినట్లుగా ధ్యానించాలి. ఆ శక్తి నుండి వెలువడుతున్న అగ్నిశిఖలు, ధూమములు, అధ్వచక్రము మొత్తమును ఆచ్ఛాదించినట్లుగా ధ్యానించాలి. ఇది, కోరుకున్నట్టి అభీష్టములను జీవునికొసగే మహాజాలమనబడే ప్రయోగమగుచున్నది.

ఈ మహాజాల ప్రయోగమును తన తంత్రాలోక గ్రంథములో అభినవగుప్తులవారు చాలా వివరముగా ఇచ్చియున్నారు. మహాజాలమంటే, 'గొప్పదైన వల' యని అర్థము. చెరువులో చేపలను వలవేసి పట్టినట్లుగా, ఈ మహాజాలమనే ప్రయోగము ద్వారా, ఆకాశంలో విహరిస్తున్న శిష్యుని ఆత్మను పట్టి, కుశలతో చేయబడి తన ఎదురుగా ఉన్న మృతుని ఆకృతిలోకి దానిని ఆకర్షించి, అప్పుడు దానికి దీక్షనిచ్చి, అతని భవబంధములను తొలగించే ప్రక్రియ చేయబడుతుంది.

ఈ విధముగా, ప్రాణము యొక్క అగ్నిశిఖలతోను, ధూమముతోను అచ్ఛాదింపబడిన అధ్వములు తమ సహజశక్తిని కోల్పోయి, తనకు వశమౌతాయి. మొదట, వాటిని తన ఎదురుగా దించుకోవాలి. తరువాత వాటిని తనకు దగ్గరగా తెచ్చి ఉంచుకోవాలి. ఆ అధ్వముల మధ్యలోనికి చనిపోయిన జీవుడిని ఆకర్షించి అతనికి దీక్షనివ్వాలి. ఈ దీక్ష, శ్రీ శంభునాథాచార్యులవారి ద్వారా నాకు లభించినది. దానిని నేనిక్కడ వివరిస్తున్నానని అభినవగుప్తులవారు అంటున్నారు.

ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తున్నది. ఈ ప్రక్రియ నిజమే అయితే, బాహ్యంగా కూడా ఇట్లా ఎందుకు జరుగదు? అంటే, బాహ్యంగా కూడా ఒక వ్యక్తిని ఇదే ప్రక్రియద్వారా ఆకర్షించలేమా? ఆకర్షణ మొదలైన క్రియలలో అభ్యాసము లేకపోవడం వల్ల ఈ క్రియ విఫలం అవుతుందా? అని ప్రశ్న కలుగుతుంది. దానికి

సమాధానం ఏమంటే, 'అలా కాదు' అని. మరి ఎందుకని ఈ క్రియ విఫలం అవుతుంది? అనినప్పుడు, ఆ శిష్యుని పట్ల ఆచార్యునికి రాగద్వేషములు గనుక ఉన్నట్లయితే, వాటి ఫలితంగా, ఆచార్యునిలో ఈశ్వరావేశము జరుగదు. అనగా, ఆయనకు ఈశ్వరునితో సమావేశం లభించదు. అలా లభించకుండా, ఆ రాగద్వేషములు అడ్డుపడుతూ ఉంటాయి. ఇది ప్రకృతి నియమము. ఈ శాస్త్రములో దీనిని 'నియతి' అనే పేరుతో పిలుస్తాము. యోగక్రియలలో అభ్యాసము తప్పనిసరిగా అవసరమౌతుంది. కానీ ఈ సందర్భంలో, ఆకర్షణాది తంత్రములలో ఆచార్యునకు ప్రవేశము, అభ్యాసములు ఉండనక్కరలేదు. ఎందుకంటే, ఇక్కడ జరిగేదంతా ఈశ్వరానుగ్రహంతో జరుగుతుంది గాని, తంత్రజాలం యొక్క అభ్యాసబలంతో కాదు. కనుక అభ్యాసము అక్కరలేదు. నిజమునకు, గురువుద్వారా ఈ పనిని జరిపించేది పరమేశ్వరుడే. మృతజీవుని ఉద్ధరించేది ఆచార్యుడు కాదుగాని, పరమేశ్వరుడే అయి ఉన్నాడు. పరమేశ్వరుని మహిమ వర్ణించుటకు అలవి గానిది. దానిని ఊహించుటకు కూడా మానవులకు సాధ్యం కాదు. కనుక ఆచార్యునిలో రాగద్వేషములు ఉండకూడదని, అప్పుడే ఈ క్రియ సఫలమౌతుందని స్పష్టమౌతున్నది.

అప్పుడు, ఈ జాలప్రయోగమునకు మృతజీవుడు ఆకర్షింపబడతాడు. ఆ విధముగా ఆకర్షింపబడి, ఆచార్యుని ఎదురుగా ఉన్న దర్భాకృతిలోగాని, జాజికాయ మొదలైన ఫలములలో గాని ప్రవేశిస్తాడు. కానీ వాటిలో స్పందన ఉండదు. అవి కదలవు. ఎందుకంటే, మనస్సు, ప్రాణము మొదలైన సామగ్రి ఆ జీవునిలో ఉండదు గనుక అవి కదలవు. కానీ, వాటిలోని ప్రాణమును, మనస్సును కూడా ఆచార్యుడు గట్టిగా ధ్యానించినట్లైతే వాటిలో కదలిక కూడా వస్తుంది. అప్పుడు ఇంతకు ముందు చెప్పబడినట్లుగా వాటికి ప్రోక్షణ మొదలైన సంస్కారములను గావించాలి. ఆ తరువాత పూర్ణాహుతినిచ్చి, దర్భ మొదలైన ఆకారములలో ఉన్న ఆ జీవుడిని పరమేశ్వరుని తేజస్సులో లీనం చేయాలి.

వివిధ లోకములలో జీవుని స్థితి

ఆ జీవుడు గనుక, స్వర్గము, నరకము, ప్రేతలోకము, పాతాళము మొదలైన లోకములలో ఉన్నట్లయితే, ఈ విధముగా ఇవ్వబడిన పూర్ణాహుతితో అతనికి మోక్షము లభిస్తుంది.

ఒకవేళ అప్పటికే జన్మను తీసుకుని, మనుష్యునిగా అతడు ఉన్నట్లైతే, వానికి జ్ఞానము, యోగము, దీక్ష, వివేకము మొదలైన ఉత్తమస్థితులు లభిస్తాయి. ఎందుకంటే, వీటన్నిటినీ పొందటానికి కావలసినట్టి అర్హతలున్న మానవదేహంలో అప్పటికే ఉన్నాడు కాబట్టి, ఇవన్నీ లభిస్తాయి. అతడు ఆ విధంగా ఉద్ధరింపబడతాడు. ఇది మృతోద్ధరణమనే ప్రక్రియ.

జీవోద్ధరణము

ఒకవేళ అతడు జీవించి ఉన్నప్పటికీ, తన పరోక్షంలో దూరంగా ఎక్కడో ఉంటే, ఇదే విధానముతోనే అతనిని కూడా ఉద్ధరించవలసి ఉంటుంది. అప్పుడు, దర్భాకృతిని కల్పించడం, దానిలోనికి ఆత్మను ఆకర్షించడం వంటి పనుల అవసరము లేదు. కేవలము ధ్యానశక్తి ద్వారానే అతనికి సంస్కారదీక్ష ఇవ్వబడుతుంది.

దీక్ష - ఫలితములు

కం// ఈశుని తాదాత్మ్యంబున
పాశతతుల మీరివెల్గు పరగురుడిట; యా
వేశంబున దీక్షనిడుచు
దోసంబుల మాపునౌర ! దూరము నుండిన్

ఆ// పరమశివుని జేరి పరమాత్ముడై వెల్గు
గురువుకబ్బునెంతొ గూఢశక్తి
దవ్వునున్నగాని ధరయందు దీక్షతో
శిష్యునుద్ధరించు చిత్రమొప్ప

దీక్ష యనేది, భోగము, మోక్షము రెంటినీ ప్రసాదిస్తుంది. అయితే, వాసనలు (సంస్కారములు) అనేవి చాలా బలీయములైనవి. అవి ఎక్కువగా ఉన్నపుడు, ఆయా భోగవాసనలను విచ్ఛేదము చేయడం అసంభవమౌతుంది. ఈ దీక్షలలో కూడా, ఉన్నత స్థాయిలకు చెందిన దీక్షలు బలమైనట్టివి. క్రింది స్థాయి దీక్షలలో అయితే, మళ్ళీ కొన్ని ఇతర సంస్కారములను చేయడం ద్వారా వాటిని పరిపుష్టం గావించాలి. అటువంటప్పుడు, తనకు పరోక్షములో ఉన్నట్టి దీక్షితునిలో కూడా, జ్ఞానము ఆవిర్భవిస్తుంది.

పరమేశ్వరునితో ఏకత్వము వలన ఆచార్యునకు పరమములైన శక్తి, స్వాతంత్ర్యములు లభిస్తాయి. వాటితో వెలిగే గురువు, తన పరోక్షంలో ఉన్న శిష్యునికి కూడా దీక్షనివ్వగలుగుతాడు. ఇదెంత అద్భుతమో కదా?

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే పరోక్షదీక్షాప్రకాశనం నామ షోడశమాహ్నికమ్ || 16 ||

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని పరోక్షదీక్షాప్రకాశనమనే పదహారవ ఆహ్నికము.

పదిహేడవ ఆహ్నికము

లింగోద్ధరణము

యదార్థః - యదార్థము

అథ లిఙ్గోద్ధారః ||

ఇప్పుడు లింగోద్ధారము చెప్పబడుచున్నది.

వైష్ణవాదిదక్షిణతన్త్రాన్తేషు శాసనేషు యే స్థితాః తద్గృహీతవ్రతా వా, యే చ ఉత్తమశాసనస్థా అపి అనధికృతాధరశాసనగురూపసేవినః, తే యదా శక్తిపాతేన పారమేశ్వరేణ ఉన్ముఖీక్రియన్తే తదా తేషామయం విధిః,

వైష్ణవాదిదక్షిణతన్త్రముల అంతము వరకూ ఉన్నట్టి శాసనములలో ఎవరైతే ఉన్నారో, ఆయా వ్రతములను స్వీకరించి యున్నారో, వారు అనధికృత అధరశాసనగురువులను సేవించుచున్నందువలన ఉత్తమశాసనము వారికి లభించదు. అటువంటి వారిని పరమేశ్వర శక్తిపాతము ద్వారా ఉద్ధరించవలెనంటే ఈ విధిని పాటించాలి.

తత్ర ఏనం కృతోపవాసమ్ అన్యదినే సాధారణమన్త్రపూజితస్య తదీయాం చేష్టాం శ్రావితస్య భగవతోఽగ్రే ప్రవేశయేత్, తత్రాస్య వ్రతం గృహీత్వా అమ్భసి క్షిపేత్, తతోఽసౌ స్నాయాత్, తతః ప్రోక్ష్య, చరుదన్తకాష్ఠాభ్యాం సంస్కృత్య, బద్ధనేత్రం ప్రవేశ్య సాధారణేన మన్త్రేణ పరమేశ్వరపూజాం కారయేత్ | తతః సాధారణమన్త్రేణ శివీకృతే అగ్నౌ వ్రతశుద్ధిం కుర్యాత్, తన్మన్త్రసంపుటం నామ కృత్వా 'ప్రాయశ్చిత్తం శోధయామి' ఇతి స్వాహాన్తం శతం జుహుయాత్ | తతోఽపి పూర్ణాహుతిః వౌషడన్తేన | తతో వ్రతేశ్వరమ్ ఆహూయ పూజయిత్వా తస్య శివాజ్ఞయా 'అకిఞ్చిత్కరః త్వమస్య భవ' ఇతి శ్రావణాం కృత్వా తం తర్పయిత్వా విసృజ్య అగ్నిం విసృజేత్, ఇతి లిఙ్గోద్ధారః | తతోఽస్య అధివాసాది ప్రాగ్వత్ | దీక్షా యథేచ్ఛమ్ |

వారిని ఉపవాసముంచి, రెండవ దినమున సాధారణమన్త్రపూజను గావించి, అతని కథను విని, భగవంతునివైపు ప్రవేశపెట్టాలి. అతని వ్రతమును జలములో విడిచిపెట్టాలి. స్నానము చేయమని చెప్పాలి. ప్రోక్షించాలి. చరు, దన్తకాష్ఠములను సంస్కరించాలి. అతనియొక్క నేత్రములను బంధించి సాధారణమంత్రముతో పరమేశ్వరపూజను చేయించాలి. సాధారణమంత్రముతో శివస్వరూపమైన అగ్నిలో వ్రతశుద్ధిని చేయించాలి. అతని నామముతో మంత్రమును సంపుటీకరించి 'ప్రాయశ్చిత్తం శోధయామి స్వాహా' అంటూ నూరు ఆహుతులనివ్వాలి. చివరలో వౌషట్ తో పూర్ణాహుతినివ్వాలి. అప్పుడు వ్రతేశ్వరుని ఆహ్వానించి పూజించి, శివాజ్ఞతో 'అకిఞ్చిత్కరః త్వమస్య భవ' అని వినిపించి, తర్పణము చేసి, విసర్జించి, అగ్నిని విసర్జించవలెను. ఇది లింగోద్ధారము. దీని పిదప అధివాసము వంటి విధులు ముందువలెనే. దీక్షను యథాశక్తిగా చేయవలెను.

అధరస్థోఽపి గాఢేశశక్తిప్రేరితమానసః |
సంస్కృత్య దీక్ష్యో యశ్చ ప్రాజ్ఞైరతోఽసద్గురావభూత్ ||

క్రిందభూములలో ఉన్నప్పటికీ, శక్తిప్రేరితమానసుడైనప్పుడు, ఇంతకుముందు అసద్గురుసేవలో ఉన్నవాడైనప్పటికీ, అటువంటివానికి కూడా దీక్షనొసగి సంస్కరించవలెను.

వ్యాఖ్యానము

ఇప్పుడు లింగోద్ధారమనబడే ప్రక్రియ చెప్పబడుచున్నది. ఇతరమార్గములలో, ఇతర గురువులను సేవిస్తూ ఉన్నవారిని ఈ విధానముద్వారా శైవమార్గములో ప్రవేశపెట్టి, వారికి దీక్షనివ్వాలి.

పరమశివుని దక్షిణ ముఖమునుండి ఉద్భవించినవి దక్షిణతంత్రములు. ఇటువంటి విభజన శాక్తతంత్రములలో కూడా ఉన్నది. ఆయా తంత్రములలో చాలావరకు ద్వైతసిద్ధాంతమును ప్రతిపాదిస్తాయి. పరమేశ్వరాద్వయసిద్ధాంతము అద్వైతమును ప్రతిపాదిస్తుంది. ఈ దక్షిణతంత్రములలో వైష్ణవము మొదలైన మతములు కూడా ఉన్నాయి. వీటిని అధమశాసనము (క్రిందిస్థాయికి చెందిన మార్గము) లని ఈ శాస్త్రమంటుంది. ఆయా దక్షిణతంత్రములలో దీక్షలను స్వీకరించి, వాటిని పాటిస్తున్నవారికి అద్వైతసిద్ధాంత రూపమైన ఈ శాస్త్రము లభించుట దుర్లభమవుతుంది. కానీ, వారిలో కూడా కొందరు, ఆయా మార్గములతో సంతృప్తిని పొందక, ఈ పరమేశ్వరాద్వయ శాస్త్రపు దారిలో నడవాలనిన తహతహతో ఉంటారు. వారిని పరమేశ్వరుని శక్తిపాతముతో నింపి ఉద్ధరించి ఉత్తమమైన ఈ మార్గములో నడిపించడానికై, ఈ విధానమును అనుసరించాలి.

లింగోద్ధార ప్రక్రియ

ముందుగా వారిని ఒకదినము పాటు ఉపవాసముంచాలి. రెండవదినమున సాధారణముగా ప్రతిదినమూ చేసే శివపూజను గావించాలి. అప్పుడతని కథను విని, అతని చేష్టలను హావభావములను త్రికరణశుద్ధిని గమనించి, ఈశ్వరుని వైపు అతడిని నడిపించాలి. అతని యొక్క పాత వ్రతమును, దీక్షను, జలములో విడచిపెట్టాలి. ఆ తరువాత, అతనికి స్నానము చేయించాలి. మంత్రజలంతో అతనిని ప్రోక్షించాలి. చరువును, దన్తకాష్ఠమును సంస్కరించాలి. అతనియొక్క నేత్రములను శుభ్రమైన వస్త్రముతో బంధించి, సాధారణమంత్రముతో అతనిచేత పరమేశ్వరపూజను చేయించాలి. శివస్వరూపమైన అగ్నిలో వ్రతశుద్ధిని చేయించాలి. అతని నామముతో మంత్రమును సంపుటీకరించి 'ప్రాయశ్చిత్తం శోధయామి స్వాహా' అంటూ అగ్నిలో నూరు ఆహుతులనివ్వాలి. చివరలో 'వౌషట్' అనే శబ్దంతో పూర్ణాహుతినివ్వాలి. అప్పుడు వ్రతేశ్వరుని ఆహ్వానించి పూజించి, శివాజ్ఞతో 'అకిఞ్చిత్కరః త్వమస్య భవ' అని వినిపించి, తర్పణము చేసి, అగ్నిని విసర్జించాలి. ఈ ప్రక్రియను 'లింగోద్ధారము' అంటారు. దీని తరువాత, అధివాసము వంటి విధులు ముందువలెనే జరిపించాలి. తదుపరి, ఇంతకు మునుపు చెప్పబడిన దీక్షను యథాశక్తిగా ఆచరించవలెను.

ఆ// నిమ్నగురుల యందు నిష్ఠబూనిన వాని
ఈశునందు భక్తి ఇనుమడింప
దీక్ష వానికొసగి దివ్యాత్ముగాజేసి
ఉద్ధరించవలయు నూర్మి గురులు

క్రిందస్థాయిలకు చెందిన ఇతర మార్గములలో ఉన్నప్పటికీ, శక్తిచేత ప్రేరేపించబడిన వాడైనప్పుడు, అటువంటివానికి కూడా దీక్షనొసగి సంస్కరించవలెను. ఇంతకుముందు అసద్గురువుల సేవలో ఉన్నవాడైనప్పటికీ అతడిని తిరస్కరించకూడదు.

ఇతి శ్రీమదాచార్యాభినవగుప్తవిరచితే శ్రీతన్త్రసారే లిఙ్గోద్ధరణం నామ సప్తదశమాహ్నికమ్ ‖ 17 ‖

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని లింగోద్ధరణమనే పదిహేడవ ఆహ్నికము.

పద్దెనిమిదవ ఆహ్నికము

అభిషేక ప్రకాశనము

యదార్థః - యదార్థము

అథాభిషేకః |

ఇప్పుడభిషేకము చెప్పబడుచున్నది.

స్వభ్యస్తజ్ఞానినం సాధకత్వే గురుత్వే వా అభిషిఞ్చేత్-యతః సర్వలక్షణహీనోఽపి జ్ఞానవానేవ సాధకత్వే అనుగ్రహకరణే చ అధికృతః న అన్యః అభిషిక్తోఽపి |

స్వయముగా జ్ఞానియైనవానిని సాధకత్వములోగాని, గురుత్వములోగాని అభిషేకించవలెను. సర్వలక్షణహీనుడైనప్పటికీ, జ్ఞానవంతుడైతే, సాధకపదములో అభిక్తుడౌతాడు. ఇతరులను అనుగ్రహించుటకు సమర్థుడౌతాడు.

స్వాధికారసమర్పణే గురుః దీక్షాది అకుర్వన్ అపి న ప్రత్యవైతి, పూర్వం తు ప్రత్యవాయేన అధికారబన్ధేన విద్యేశపదదాయినా బద్ధ ఏవ అస్య దీక్షాద్యకరణమ్, సోఽభిషిక్తో మన్త్రదేవతాతాదాత్మ్యసిద్ధయే షాణ్మాసికం ప్రత్యహం జపహోమవిశేషపూజాచరణేన విద్యావ్రతం కుర్యాత్, తదనన్తరం లబ్ధతన్మయీభావో దీక్షాదౌ అధికృతః, తత్ర న అయోగ్యాన్ దీక్షేత్, న చ యోగ్యం పరిహరేత్ దీక్షితమపి జ్ఞానదానే పరీక్షేత్, ఛద్మగృహీతజ్ఞానమపి జ్ఞాత్వా ఉపేక్షేత, అత్ర చ అభిషేకవిభవేన దేవపూజాదికమ్ |

స్వాధికారసమర్పణమున గురువు దీక్షాదిక్రియలను చేయకపోయినప్పటికీ దోషము లేదు. దీక్షాపూర్వము అధికారబన్ధముతో విద్యేశపదదాయియైతే, అట్టివానికి దీక్షాదులను చేయకపోవడం దోషమౌతుంది. అభిషిక్తుడైనవాడు మన్త్రదేవతా తాదాత్మ్యసిద్ధికోసం, ఆరునెలలపాటు ప్రతిరోజును, జప, హోమ, విశేషపూజలు చేస్తూ విద్యావ్రతమునాచరించాలి. ఆ తరువాత తన్మయీభావమున స్థితుడై దీక్షాదులను ఇచ్చుటకు అధికారియౌతాడు.

అయోగ్యునికి దీక్షనివ్వరాదు. యోగ్యుడైనవానిని పరిహరించరాదు. దీక్షితుని కూడా జ్ఞానదానసమయమున పరీక్షించాలి. రహస్యముగా జ్ఞానము కలిగినవానిని గురువు గ్రహించి ఉపేక్షించాలి. ఈ అభిషేకక్రమములో దేవపూజాదికములు కూడా యథాశక్తిని జరిపించాలి.

శ్లో|| స్వభ్యస్తజ్ఞానతయా స్వార్థపరార్థాధికారతాం వహతః |
సాధకగురుతాయోగస్తత్ర హి కార్యస్తదభిషేకః ||

తనంతట తానే జ్ఞానమును పొంది, స్వార్థ పరార్థములకు అధికారియైనవానిని, సాధక, గురు యోగముల వలన అభిషేకించవలెను.

వ్యాఖ్యానము

ఈ అధ్యాయములో 'అభిషేక విధి' చెప్పబడుచున్నది.

అభిషేక విధి

కొంతమంది, గురూపదేశము లేకున్నప్పటికీ, స్వయముగా సాధనగావించి జ్ఞానమును పొందినవారుంటారు. అట్టివారిని, వారి స్థాయినిబట్టి, సాధకపదవిలో గాని, గురుపదవిలో గాని కూర్చుండబెట్టి అభిషేకించాలి. తంత్రలోక గ్రంథము 23వ అధ్యాయములో అభినవగుప్తులవారు ఇలా అంటారు, 'సద్గురువైనవాడు, అనుభవజ్ఞానపూర్ణుడైన వానికి తన అధికారమును ధారాదత్తం చేయవలెను. ఈ అనుభవజ్ఞానం లేనివాడు, సమయదీక్ష వంటి ఇతర దీక్షలను స్వీకరించినప్పటికీ, అనుభవజ్ఞానం లేకపోవడం వలన, గురుపదవికి అర్హుడు కాడని కామికాగమము చెప్పినది. కనుక గురుపదవిని స్వీకరించుచున్నవాడు, పూర్ణజ్ఞానవంతుడై ఉండవలెనని నియమమున్నది. ఈ క్రమంలో అతని దేహము, దేశము, కులము మొదలైనవాటిని లెక్కించనవసరం లేదు'.

శాస్త్రాధ్యయనము మొదలైన ఇతర లక్షణములు లేకున్నప్పటికీ, కేవల జ్ఞానవంతుడైతే, అట్టివాడిని సాధకపదములో అభిషిక్తునిగా చేయవచ్చు. అట్టివాడు కూడా ఇతరులను అనుగ్రహించుటకు సమర్థుడౌతాడు. తన అధికారమును అతనికి సమర్పణము చేసే సమయంలో, గురువు దీక్షాదిక్రియలను చేయకపోయినప్పటికీ దోషము లేదు. కానీ, మరికొందరుంటారు. వారు, దీక్షను స్వీకరించక ముందు గురుపీఠమును అధిష్ఠించి యుండి, ఇతరులకు మంత్రోపదేశములను చేయుటకు అధికారమును పొందియుంటారు. అటువంటివారికి గురుపదవిని ఇచ్చే సమయంలో దీక్షాదులను చేయకపోవడం దోషమౌతుంది.

మంత్రవ్రతము

ఈ విధముగా అభిషిక్తుడైనవాడు, ఆ తరువాత చాలా సాధనను చేయవలసి యుంటుంది. మన్త్రదేవతతో తాదాత్మ్యత లభించడం కోసం, ఆరునెలలపాటు ప్రతిరోజూనూ, జప, హోమ, విశేషపూజలను చేస్తూ, నియమనిష్ఠలతో కూడిన మంత్రవ్రతమును అతడు ఆచరించాలి. ఆ తరువాత, మంత్రదేవతతో ఏకత్వరూపమైన తన్మయీభావమున స్థితుడై ఉంటాడు. అప్పుడు, దీక్షాదులను ఇచ్చుటకు కావలసిన అధికారము అతనికి దక్కుతుంది.

విధినిషేధములు

యోగ్యత లేనివానికి దీక్షనివ్వకూడదు. అలా చేయడం వల్ల, శిష్యుని యొక్క చెడుకర్మ గురువుకు చుట్టుకుంటుంది. దాని ఫలితమును అతడు తప్పక అనుభవించవలసి వస్తుంది. కనుక, దీక్షనివ్వబోయే ముందుగా, శిష్యునియొక్క యోగ్యతను గురువు బాగుగా పరిశీలించవలసి ఉంటుంది. శిష్యునిలో తగినంత యోగ్యత లేనప్పుడు, దీక్షను తిరస్కరించాలి. అదే సమయంలో, యోగ్యత కలిగిన శిష్యుని తిరస్కరించకూడదు. ఇంతకు ముందు దీక్షను స్వీకరించినవానిని కూడా, జ్ఞానదానము చేసే సమయంలో బాగుగా పరీక్షించాలి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు, స్త్రీలకు, నపుంసకులకు ఎవరికైనా సరే, వారి కులమును లెక్కించకుండా దీక్షనివ్వాలని తంత్రాలోకగ్రంథము 23 వ అధ్యాయమున అభినవగుప్తులవారు

చెప్పినారు. తననుండి సూటిగా ఉపదేశమును జ్ఞానోపదేశమును పొందకుండా, దొంగతనముగా రహస్యముగా దానిని పొందినవానిని గురువు గ్రహించి, వానిని ఉపేక్షించి ఊరుకోవాలి. ఈ అభిషేకమును చేసే సమయంలో, దేవపూజ మొదలైనవాటిని కూడా యథాశక్తిగా జరిపించాలి.

కం// తానే జ్ఞానము నందుచు
తనతో యొరులన్ నడుపగ తగగను వానిన్
గని; సాధకగురువని వా
నిన్; యభిషేకించ వలయు నెమ్మది మీరన్

ఆ// తాను దప్పుజేరి దనతోడ నల్వురన్
దరిని జేర్చువాని దయను జూచి
సాధకుండు గురుడు సత్పాత్రు డితడంచు
శిరము దడుపవలయు శీఘ్రగతుల

తన సాధనతో తానే అనుభవజ్ఞానమును పొంది, మోక్షమును సాధించుకొని, ఇతరులకు కూడా దానినివ్వగలిగిన వానిని, సాధక, గురు పదవులలో కూర్చుండబెట్టి, అభిషేకించాలి.

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే అభిషేకప్రకాశనం నామ అష్టాదశమాహ్నికమ్ || 18 ||

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని అభిషేకప్రకాశనమనే పద్దెనిమిదవ అహ్నికము.

పందొమ్మిదవ ఆహ్నికము

శ్రాద్ధదీక్షా ప్రకాశనము

యదార్థః - యదార్థము

అథ అధరశాసనస్థానాం గుర్వన్తానామపి మరణసమనన్తరం మృతోద్ధారోదిత శక్తిపాత యోగాదేవ అన్త్యసంస్కారాఖ్యాం దీక్షాం కుర్యాత్, ఊర్ధ్వశాసనస్థానామపి లుప్తసమయానామ్ అకృతప్రాయశ్చిత్తానామ్ - ఇతి పరమేశ్వరాజ్ఞా |

గుర్వంతము వరకు ఉన్నట్టి అధరశాసనస్థులకు మరణానంతరము మృతోద్ధార పూర్వకమైన శక్తిపాతయోగమునివ్వడం వలన అన్త్యసంస్కారమనబడే దీక్షనివ్వాలి. ఊర్ధ్వశాసనస్థులకు కూడా లుప్తులైనవారికి, అకృతప్రాయశ్చిత్తులకు, ఈ దీక్షనివ్వమని పరమేశ్వరాజ్ఞ.

తత్ర యో మృతోద్ధారే విధిః ఉక్తః స సర్వ ఏవ శరీరే కర్తవ్యః, పూర్ణాహుత్యా శవశరీరదాహః, మూఢానాం తు ప్రతీతిరూఢయే సప్రత్యయామన్త్యేష్టిం క్రియాజ్ఞానయోగబలాత్ కుర్యాత్, తత్ర శవశరీరే సంహారక్రమేణ మన్త్రాన్ న్యస్య జాలక్రమేణ ఆకృష్య రోధనవేధనఘట్టనాది కుర్యాత్ - ప్రాణసంచారక్రమేణ హృది కణ్ఠే లలాటే చ ఇత్యేవం శవశరీరం కమ్పతే | తతః పరమశివే యోజనికాం కృత్వా తత్ దహేత్ పూర్ణాహుత్యా, అన్త్యేష్ట్యా శుద్ధానామ్ అన్యేషామపి వా శ్రాద్ధదీక్షాం త్ర్యహం తుర్యే దినే మాసి మాసి సంవత్సరే సంవత్సరే కుర్యాత్ | తత్ర హోమాన్తం విధిం కృత్వా నైవేద్యమేకహస్తే కృత్వా తదీయాం వీర్యరూపాం శక్తిం భోగ్యాకారాం పశుగతభోగ్యశక్తితాదాత్మ్యప్రతిపన్నాం ధ్యాత్వా పరమేశ్వరే భోక్తరి అర్పయేత్, ఇత్యేవం భోగ్యభావే నివృత్తే పతిరేవ భవతి, అన్త్యేష్టి-మృతోద్ధరణ-శ్రాద్ధదీక్షాణామ్ అన్యతమేనాపి యద్యాపి కృతార్థతా తథాపి బుభుక్షోః క్రియాభూయస్త్వం ఫలభూయస్త్వాయ ఇతి సర్వమాచరేత్ |

మృతోద్ధారమున ఏదైతే విధియై ఉన్నదో అది సర్వదేహములకూ చేయబడుతుంది. పూర్ణాహుతితో శవశరీరమును దహించాలి. మూఢులకు ఋజువును చూపుటకొరకు ప్రత్యయసహితమైన అన్త్యేష్టిని క్రియా, జ్ఞాన, యోగబలముతో చేయవలెను. శవశరీరములో సంహారక్రమములో మంత్రములను న్యసించి జాలక్రమమున జీవుని ఆకర్షించి రోధన, వేధన, ఘట్టనాదులను చేయవలెను. అప్పుడు ప్రాణసంచారము వలన హృదయము, కణ్ఠము, లలాటము ఈ క్రమంలో శవశరీరము కంపిస్తుంది. అప్పుడాజీవుని పరమశివునిలో లీనం చేసి, దేహమును పూర్ణాహుతి ద్వారా దహించవలయును. అంత్యేష్టి ద్వారా శుద్ధులైనవారికి, ఇతరులకు కూడా, శ్రాద్ధదీక్షను మూడు నాలుగు రోజులపాటు, నెలకొకసారి, సంవత్సరమునకొకసారి చేయవలెను. అప్పుడు హోమమును చేసి ఒక్క హస్తములో నైవేద్యమునుంచి, అందులో భోగ్యాకారమును ధరించి పశుగతమైన భోగ్యశక్తికి అభిముఖమైన శక్తిని ధ్యానించి, పరమేశ్వరరూపుడైన భోక్తకు అర్పించవలెను. దీనివలన జీవునిలో భోగ్యభావము నశించి పతి అవుతాడు. అన్త్యేష్టి, మృతోద్ధరణ, శ్రాద్ధదీక్షాదులవల్ల, కృతార్థత లభిస్తుంది. కానీ, బుభుక్షువులకు, క్రియలు కూడా ఎక్కువగా ఉంటాయి, వాటన్నిటినీ చేయవలెను.

ముముక్షోరపి తన్మయీభావసిద్ధయే అయమ్ జీవతః ప్రత్యహమ్ అనుష్ఠానాభ్యాసవత్ | తత్త్వజ్ఞానినస్తు న కోఽప్యయమ్ అన్త్యేష్ట్యాదిశ్రాద్ధాన్తో విధిః ఉపయోగీ - తన్మరణం తద్విద్యాసంతానినాం పర్వదినం

సంవిదంశపూరణాత్, తావతః సంతానస్య ఏకసంవిన్మాత్రపరమార్థత్వాత్ జీవతో జ్ఞానలాభసంతానదివసవత్ । సర్వత్ర చ అత్ర శ్రాద్ధాదివిధౌ మూర్తియాగః ప్రధానమ్ ఇతి శ్రీసిద్ధామతమ్, తద్విధిశ్చ వక్ష్యతే నైమిత్తికప్రకాశనే ।

ముముక్షువులు కూడా తన్మయీభావసిద్ధి కొరకు, జీవించియున్నంతవరకూ ప్రతీరోజూనూ అనుష్ఠానము గావించాలి. తత్త్వజ్ఞానియైనవాడికి మాత్రము, అన్త్యేష్టి మొదలుకొని శ్రాద్ధాన్తము వరకు ఏ విధియు అవసరం లేదు. అతని మరణదినము వాని విద్యాసంతానులకు పర్వదినము. సంవిదంశపూరణత వలన, అందరు సంతానమునకు ఏక్ సంవిత్ రూపములో పరమార్థము లభించినందువలన, జీవించియున్నవారికి జ్ఞానలాభము కలిగినందువలన, పర్వదినమౌతున్నది. ఈ శ్రాద్ధాదివిధులలో మూర్తియాగమే ప్రధానము. ఇది శ్రీ సిద్ధమతము. ఆ విధానమును నైమిత్తికప్రకాశనములో చెప్పెదను.

***శ్లో॥ అనుగ్రహపరః శివో వశితయానుగృహ్ణాతి యం
స ఏవ పరమేశ్వరీభవతి నామ కిం వాద్భుతమ్ ।
ఉపాయపరికల్పనా ననుతదీశనామాత్రకం
విదన్నితి న శఙ్కతే పరిమితేఽప్యుపాయే బుధః ॥***

శివుడు అనుగ్రహపరుడు. ఎవరినైతే ఈ విధముగా అనుగ్రహించుచున్నాడో అతడు కూడా పరమేశ్వరుడే అగుచున్నాడు. ఏమి అద్భుతము? ఉపాయముల కల్పన ఆయన ఇచ్ఛానుసారమే జరిగినది. దీనిని గ్రహించిన బుధులు పరిమితములైన ఉపాయములను గ్రహించినప్పటికీ శంకామనస్కులు కారు.

వ్యాఖ్యానము

మృతోద్ధార దీక్ష

పరమేశ్వరాద్వయ సిద్ధాంతమును అనుసరించకుండా ఇతర మార్గములను అనుసరించేవారందరూ అధరశాసనములకు చెందినవారు. అంటే, తక్కువ తరగతికి చెందినవారు. కనుక, వారి మరణం తర్వాత, అంత్య సంస్కారమనబడే దీక్షను వారికివ్వవలసి ఉంటుంది. వారిలో గురువులైనవారికి కూడా ఈ దీక్షను ఇవ్వాలి. ఆయా జీవులను ఉద్ధరించే శక్తిపాతంతో కూడిన ఈ దీక్ష, మృతోద్ధార దీక్ష అనబడుతుంది. ఈ దీక్షవల్ల మృతజీవుని యొక్క పుర్యష్టకము (సూక్ష్మశరీరము) శుద్ధి అవుతుందని తంత్రలోక గ్రంథము 24 వ అధ్యాయమున అభినవగుప్తులవారు చెప్పినారు.

ఊర్ధ్వశాసనములలో ఉన్నవారంటే శైవసిద్ధాంతములోని వారు. వీరిలోకూడా, కొంతమంది దీనినుంచి పడిపోయి పతనమైనవారుంటారు. అటువంటివారికి కూడా ఈ దీక్షనివ్వాలి. అదే విధంగా, తప్పులు చేసి, ప్రాయశ్చిత్తం చేసుకొనని వారికి కూడా, ఈ దీక్షనివ్వమని పరమేశ్వరుని ఆజ్ఞగా శాస్త్రములలో చెప్పబడి యున్నది. మృతోద్ధార విధానంలో చెప్పబడిన విధియే అన్ని జీవుల దేహములకూ వర్తిస్తుంది. అంటే, చనిపోయిన వ్యక్తియొక్క శవమునకు మృతోద్ధారవిధిని నిర్వర్తించాలి. చివరిలో ఇవ్వబడే పూర్ణాహుతితో శవము యొక్క శరీరమును దహించివేయాలి. దీనిని చేసే సమయంలో, దీనిని శంకించేవారుంటారు. మూఢులుంటారు. వారికి ఋజువులు కావాలి. వాటిని చూపించడం కోసం, ఋజువులతో కూడిన అన్త్యేష్టిని,

తన యొక్క క్రియా, జ్ఞాన, యోగబలముతో ఆచార్యుడు చేసి చూపించాలి.

ఈ విధమైన క్రియ వల్ల, చూచేవారిలో దీనిపట్ల విశ్వాసం కలుగుతుంది. 'తంత్రాలోకము' 25 వ అధ్యాయంలో ఈ క్రియనంతా వివరముగా వర్ణించారు అభినవగుప్తాచార్యులవారు. మొదటి సంవత్సరమైతే, మరణ దినమునకు రెండవ, మూడవ, పదియవ దినములలో ప్రతి మాసములోనూ దీనిని చేయాలని, ఆ తరువాత ఏడాదికి ఒక్కసారి మాత్రమే చేయాలని చెప్పినారు. సిద్ధయోగీశ్వరీ మతంలో ఈ విధమైన ప్రక్రియ నిర్దేశింపబడింది.

ప్రత్యయములు (ఋజువులు)

సంహారక్రమములో (పాదముల నుండి శిరస్సువైపుకు), శవము లోకి ఆయా మంత్రములను న్యాసం చేయాలి. జాలప్రయోగమనేది క్రిందటి అధ్యాయములో వివరింపబడింది. దాని ప్రకారంగా, చనిపోయిన వ్యక్తి యొక్క జీవుడిని శూన్యంలోనుండి ఆకర్షించాలి. తరువాత దానిని నిరోధించి (కట్టివేసి), వేధనము (చిలకడము), ఘట్టనము (తాడించడము) చేయాలి. అప్పుడు, తనలో కలిగే ఈ ప్రాణసంచారము వలన హృదయము, కణ్ఠము, లలాటము మొదలైన క్రమంలో శవశరీరము కంపనలకు గురౌతుంది. అప్పుడా జీవుని, ఇంతకు ముందు వివరింపబడిన రీతిలో పరమశివునిలో లీనం చేసి, అతని దేహమును పూర్ణాహుతి ప్రక్రియద్వారా దహించివేయాలి.

ఈ విధముగా అంత్యేష్టి ప్రక్రియ ద్వారా శుద్ధులైనవారికి, ఈ విధంగా శుద్ధి కానివారికి ఇరువురికీ, ఈ శ్రాద్ధదీక్షను మూడవ రోజునగాని, నాలుగవ రోజున గాని, నెలకొకసారి, లేదా సంవత్సరమునకొకసారి చేయాలి.

పశువు నుండి పశుపతి

అప్పుడు యథావిధిగా హోమమును చేయాలి. తన హస్తములో నైవేద్యమునుంచుకోవాలి. పశుతుల్యుడైన జీవునికి శక్తిని చేకూర్చగల జీవశక్తి అందులో నిండియున్నట్లుగా ధ్యానించాలి. దానిని పరమేశ్వరరూపుడైన భోక్తకు అర్పించాలి. దీనివలన జీవునిలో భోగ్యభావము నశించి పశుపతి అవుతాడు. భోగకాంక్ష ఉన్నవాడు పశువు, దానిని దాటినవాడు పశుపతి గనుక, ఈ క్రియవల్ల భోగకాంక్ష నశించిన జీవుడు ఈశ్వరునిలో లీనమౌతాడు.

బుభుక్షువు - ముముక్షువు - తత్త్వజ్ఞాని

అన్త్యేష్టి, మృతోద్ధరణ, శ్రాద్ధదీక్ష మొదలైన క్రియల వల్ల, జీవునికి తప్పక కృతార్థత లభిస్తుంది. కానీ, బుభుక్షువులకు, క్రియలు కూడా ఎక్కువగా ఉంటాయి. బుభుక్షువంటే, ప్రాపంచిక భోగములను అనుభవించాలన్న కోరికలు బలంగా ఉన్నవాడు. కనుక, అట్టి జీవి విషయంలో ఈ తంతులన్నింటినీ తప్పక చేయాలి. మరి, ప్రాపంచికములైన భోగముల పట్ల కోరిక లేని ముముక్షువులుంటారు. వారి విధులేమిటి? అన్నప్పుడు, అటువంటి వారు కూడా, ఈశ్వరునితో తన్మయత్వ భావము సిద్ధించడానికై, వారు జీవించియున్నంత వరకూ, ప్రతీరోజూ తప్పకుండా అనుష్ఠానమును చేస్తూనే ఉండాలి. ముముక్షుత్వమును

కూడా దాటి తత్త్వజ్ఞాని యైనవాడు ఏయే విధులను చేయాలి? అనిన ప్రశ్న ఉదయించినపుడు, తత్త్వజ్ఞానియైనవాడికి మాత్రము, అన్త్యేష్టి మొదలుకొని శ్రాద్ధము వరకు, ఎటువంటి విధికూడా అవసరం లేదని చెప్పబడుతుంది.

పర్వదినము

అతని మరణదినము, వాని విద్యాసంతానులకు పర్వదినమౌతుంది. విద్యాసంతానమంటే, తనవద్ద మంత్రదీక్షను గ్రహించిన శిష్యులు. వీరు కూడా తన సంతానముతో సమానులే. కనుక వారికి కూడా గురువు యొక్క మరణదినము పండుగ దినమే. ఇదెట్లా జరుగుతున్నది? అంటే, గురువుయొక్క పుత్రులు, శిష్యులు అందరికీ సంవిత్ అనునది అంశగా మాత్రమే ఉంటుంది. ఆ రోజున మాత్రం వీరందరికీ అది పూరింపబడి పరిపూర్ణతను సంతరించుకుంటుంది. వారందరికీ ఒకే సంవిత్ రూపములో ఈశ్వరుని యొక్క చిదానంద జ్ఞానలాభము లభిస్తుంది. కనుక ఆ దినము వారందరికీ పర్వదినమౌతున్నది.

మూర్తియాగము

ఈ శ్రాద్ధవిధులలో మూర్తియాగమే ప్రధానమైనది. మూర్తియాగమంటే, జీవుని యొక్క ఆకారములోకి చేయబడే న్యాసపూర్వకమైన ప్రక్రియ. శ్రీ సిద్ధమతముననుసరించి ఈ విధానమంతా ఈ విధముగా ఉంటుంది. ఇంకా వివరముగా, నైమిత్తికప్రకాశనమనే అధ్యాయములో చెప్పబడుతుంది.

పరిమితము - అపరిమితము

కం|| కరుణాపరుడౌ నీశుడు
పరుగున నెవ్వాని గాంచు పరుడౌ నతడున్
తెఱగుల్ కల్పన లన్నియు
పరిమితులని గాంచువారు బట్టరు శంకల్

ఆ|| కరుణతోడ శివుడు గాంచగా నరుడిందు
తానె ఈశుడౌను దన్వయమున
వానిజేరు విధులు వంకలే సరిజూడ
దీని దెలియ శంక దీఱిపోవు

శివుడు పరమదయాళువు మరియు అనుగ్రహస్వరూపుడు. ఆయన ఎవరినైతే ఈ విధముగా అనుగ్రహిస్తాడో అతడు కూడా పరమేశ్వరుడే అగుచున్నాడు. ఇదెంత అద్భుతమో కదా? సాధనా ఉపాయముల కల్పన అంతా, ఆయన ఇచ్ఛానుసారమే జరుగుతుంది. ఉపాయములు పరిమితములే అయినప్పటికీ ఇవి అపరిమితమైన పరమార్థ లాభమును కలిగిస్తాయి. ఈ విషయం చక్కగా అర్థమైనవారు, ఉపాయములు పరిమితములని గ్రహించినప్పటికీ, అనుమానములు మరియు శంకలతో కృంగిపోరు.

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే శ్రాద్ధదీక్షాప్రకాశనం నామ ఏకోనవింశమాహ్నికమ్ || 19 ||

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని శ్రాద్ధదీక్షాప్రకాశనమనే పందొమ్మిదవ ఆహ్నికము.

ఇరవైయవ ఆహ్నికము

శేషవర్తన ప్రకాశనము

యదార్థః - యదార్థము

అథ శేషవర్తనార్థం ప్రకరణాన్తరమ్ |

శేషవర్తనమును చెప్పుటకై ఇంకొక ప్రకరణము.

తత్ర యా దీక్షా సంస్కారసిద్ధ్యై జ్ఞానయోగ్యాన్ ప్రతి, యా చ తదశక్తాన్ ప్రతిమోక్షదీక్షా స బీజా, తస్యాం కృతాయామ్ ఆజీవం శేషవర్తనం గురుః ఉపదిశేత్ |

జ్ఞానసంపద వారికి సంస్కారసిద్ధి కొరకు ఏ దీక్ష ఇవ్వబడుతుందో, దానికి అశక్తులైనవారికి సబీజమైన ఏ ప్రతిమోక్షదీక్ష ఇవ్వబడుతుందో, వారికి జీవితాంతమూ పాటించవలసిన నియమములను గురువు ఉపదేశించాలి.

తత్ర నిత్యం, నైమిత్తికం, కామ్యమ్ ఇతి త్రివిధం శేషవర్తనమ్, అన్త్యం చ సాధకస్యైవ, తత్ న ఇహ నిర్ణేతవ్యమ్ | తత్ర నియతభవం నిత్యం, తన్మయీభావ ఏవ నైమిత్తికం, తదుపయోగి సన్ధ్యోపాసనం ప్రత్యహమనుష్ఠానం, పర్వదినం, పవిత్రకమ్ ఇత్యాది | తదపి నిత్యం స్వకాలనైయత్యాత్ - ఇతి కేచిత్ |

వాటిలో నిత్యము, నైమిత్తికము, కామ్యమని మూడు విధములైన శేషవర్తనముంటుంది. చివరిది సాధకులకోసము, కనుక ఇక్కడ దానిని చెప్పడం లేదు. నియతభవమైనది నిత్యము, తన్మయీభావము నైమిత్తికము, దీనికి ఉపయోగించే సంధ్యోపాసనము మొదలైనవాటిని ప్రతిదినము ఆచరించాలి. కొందరి ప్రకారము, స్వకాలనియతి వలన, పర్వదినములు, పవిత్రకములు కూడా నిత్యములే.

నైమిత్తికం తు తచ్ఛాసనస్థానామపి అనియతమ్, తద్యథా - గురుతద్వర్గాగమనం తత్పర్వదినం జ్ఞానలాభదినమ్ ఇత్యాదికమ్ - ఇతి కేచిత్ | తత్ర నియతపూజా, సన్ధ్యోపాసా, గురుపూజా, పూర్వపూజా, పవిత్రకమ్ ఇతి అవశ్యంభావి | నైమిత్తికమ్-జ్ఞానలాభః, శాస్త్రలాభో, గురుతద్వర్గగృహాగమనం, తదీయ జన్మసంస్కారప్రాయణదినాని, లౌకికోత్సవః, శాస్త్రవ్యాఖ్యా ఆదిమధ్యాన్తా, దేవతాదర్శనం, మేలకః, స్వప్నాజ్ఞా, సమయనిష్కృతిలాభః - ఇత్యేతత్ నైమిత్తికం విశేషార్చనకారణమ్ |

నైమిత్తికములేవనగా ఆయా శాసనములలో ఉన్నవారికి కూడా అనియతములు. అవి, గురువు ఆయన వర్గము ఇంటికి వచ్చిన రోజు, వారియొక్క పర్వదినము, జ్ఞానలాభదినము మొదలైనవని కొందరంటారు. వానిలో నియతపూజ, సంధ్యోపాసన, గురుపూజ, పూర్వపూజ, పవిత్రకము మొదలైనవి ఆవశ్యములు. జ్ఞానలాభము, శాస్త్రలాభము, గురువు ఆయన వర్గము ఇంటికి వచ్చుట, ఆయన యొక్క జన్మసంస్కార, తిరోగమన దినములు, లౌకికోత్సవము, శాస్త్రవ్యాఖ్యయొక్క ఆదిమధ్యాన్త దినములు, దేవతాదర్శనము, మేలకము, స్వప్నాజ్ఞ, సమయనిష్కృతిలాభము - ఇవన్నీ నైమిత్తిక విశేషార్చన కారణములు.

తత్ర కృతదీక్షాకస్య శిష్యస్య ప్రధానం మన్త్రం సవీర్యకం సంవిత్తిస్ఫురణసారమ్ అలిఖితం వక్త్రాగమేనైవ

అర్పయేత్, తతః తన్మయీభావసిద్ధ్యర్థం స శిష్యః సంధ్యాసు తన్మయీభావాభ్యాసం కుర్యాత్, తద్వారేణ సర్వకాలం తథావిధసంస్కారలాభసిద్ధ్యర్థం ప్రత్యహం చ పరమేశ్వరం చ స్థణ్డిలే వా లిఙ్గే వా అభ్యర్చయేత్ | తత్ర హృద్యే స్థణ్డిలే విమలముకురవద్భాతే స్వమేవ రూపం యాజ్యదేవతాచక్రాభిన్నం మూర్తిబిమ్బితమివ దృష్ట్వా హృద్యపుష్ప గన్ధాసవ తర్పణ నైవేద్య ధూపదీపోపహార స్తుతి గీత వాద్యనృత్తాదినా పూజయేత్, జపేత్, స్తువీత - తన్మయీభావమశక్యేతం లబ్ధుమ్ |

దీక్షాపరుడైన శిష్యునకు ప్రధానమైన బలమైన మన్త్రమును సంవిత్తిస్ఫురణసారమైనదానిని అలిఖితముగా వక్త్రాగమముగా అర్పించాలి. దానియందు తన్మయీభావ సిద్ధ్యర్థమై ఆ శిష్యుడు సంధ్యలలో తన్మయీభావాభ్యాసమును చెయ్యాలి. దానిద్వారా సర్వకాలములలో సంస్కారలాభసిద్ధ్యర్థమై ప్రతిదినము పరమేశ్వరుని స్థణ్డిలముగా గాని లింగముగా గాని అర్చించాలి. వీనిలో, హృద్యమైన స్థణ్డిలములో స్వచ్ఛమైన అద్దమువలె తన రూపమును ధ్యానదేవతాచక్రము కంటే అభిన్నముగా ధ్యానించుచూ మూర్తి బింబము వలె చూచుచూ హృద్యములైన పుష్పములు, గంధము, ఆసవము, తర్పణము, నైవేద్యము, ధూపము, దీపము, ఉపహారము, స్తుతి, గీతము, వాద్యము, నృత్తాదులతో పూజించాలి, జపించాలి, స్తవం గావించాలి. తన్మయీభావము నిశ్చన్నగా లభిస్తుంది.

ఆదర్శే హి స్వముఖమ్ అవిరతమ్ అవలోకయతః తత్స్వరూపనిశ్చితిః అచిరేణైవ భవేత్, న చాత్ర కశ్చిత్ క్రమః ప్రధానమ్ - ఋతే తన్మయీభావాత్ | పరమన్త్రతన్మయీభావావిష్టస్య నివృత్తపశువాసనాకలఙ్కస్య భక్తిరసానువేధవిద్రుతసమస్తపాశజాలస్య యత్ అధివసతి హృదయం తదేవ పరమముపాదేయమ్, ఇతి అస్మద్గురవః |

అద్దములో తన ముఖమును నిరంతరము చూచుకునే వానికి స్వరూపనిశ్చయము కలిగినట్లుగా ఇది కూడా అవుతుంది. దీనిలో, తన్మయభావము తప్ప, వేరే ఇతరక్రమము యొక్క ప్రధానము లేదు. పర మంత్రములో తన్మయీభావమును పొంది పశువాసనాకలఙ్కములు నివృత్తి కాగా, భక్తిరసములో మునిగి పాశజాలములన్నీ విడచిపోగా, దేనిలో హృదయము అధివసించి యుంటుందో అదే పరమ ఉపాధేయమని మా గురువులు చెప్పినారు.

శ్లో|| అధిశయ్య పారమార్థికః భావప్రసరం ప్రకాశముల్లసతి యా |
పరమామృతదృక్త్వాం తయార్చయన్తే రహస్యవిదః ||

పారమార్థిక భావప్రసర ప్రకాశమునందు ఉల్లాసమును పొందునట్టి పరమామృత దృక్కు యొక్క రహస్యమును ఎరిగిన విదులు నిన్ను ఈ విధముగా పూజిస్తారు.

శ్లో|| కృత్వాధారధరాం చమత్కృతిరసప్రోక్షాక్షణక్షాలితా-
మాత్తైర్మానసతః స్వభావకుసుమైః స్వామోదసందోహిభిః |
ఆనన్దామృతనిర్భర స్వహృదయానర్ఘార్ఘపాత్రక్రమాత్
త్వాం దేవ్యా సహ దేహదేవసదనే దేవార్చయేఽహర్నిశమ్ ||

ధరను ఆధారముగా చేసి చమత్కార రసముతో ప్రోక్షణము గావించగా ప్రక్షాళనమైనట్టి మనస్సుతో, స్వామోదముతో కలసిన స్వభావపుష్పములతో, ఆనందామృతముతో నిండిన హృదయమనే అనర్ఘ

అర్ఘ్యపాత్రద్వారా, దేహమనే దేవాలయములో, దేవితో కూడిన దేవుని, రాత్రీపగలూ అర్చించవలెను.

ఇతి శ్లోకద్వయోక్తమర్థమ్ అన్తర్భావయమ్ దేవతాచక్రం భావయేత్ । తతో ముద్రాప్రదర్శనం, జపః, తన్నివేదనమ్ । బోధ్యైకాత్మ్యేన విసర్జనమ్ । ముఖ్యం నైవేద్యం స్వయమ్ అశ్నీయాత్, సర్వం వా జలే క్షిపేత్, జలజా హి ప్రాణినః పూర్వదీక్షితాః చరుభోజనద్వారేణ ఇతి ఆగమవిదః । మార్జార మూషకశ్వాదిభక్షణే తు శఙ్కా జనితా నిరయాయ - ఇతి జ్ఞానీ అపి లోకానుగ్రహేచ్ఛయా న తాదృక్ కుర్యాత్, లోకం వా పరిత్యజ్య ఆసీత, ఇతి స్థణ్డిలయాగః ।

ఈ రెండు శ్లోకముల అర్థమును లోలోపల భావించుచూ దేవతాచక్రమును భావించవలెను. అప్పుడు ముద్రాప్రదర్శనము, జపము, నివేదనము. బోధతో ఏకమైన ఆత్మలో విసర్జనము చేయవలయును. ముఖ్య నైవేద్యమును తానే తినవలెను. లేదా మొత్తమును జలములో వదలవలెను. నీటిలో ఉండే ప్రాణులు చరుభోజనము ద్వారా మునుపే దీక్షితులై యున్నారు. వారు ఈ నైవేద్యము వలన ఆగమవేత్తలౌతారు. పిల్లి, ఎలుక, కుక్కలు తింటే నరకమేమోనని శంక యున్నది గనుక, జ్ఞానియైనవాడు లోకానుగ్రహమును కోరి అటువంటి పనినీ చేయకూడదు, లోకమును పరిత్యజించి కూడా ఉండకూడదు. ఇది స్థణ్డిలయాగము.

అథ లిఙ్గే, తత్ర న రహస్యమన్త్రైః లిఙ్గం ప్రతిష్ఠాపయేత్, విశేషాత్ వ్యక్తమ్-ఇతి పూర్వప్రతిష్ఠితేషు ఆవాహనవిసర్జనక్రమేణ పూజాం కుర్యాత్ ఆధారతయా । తత్ర గురుదేహం స్వదేహం శక్తిదేహం రహస్యశాస్త్రపుస్తకం వీరపాత్రం అక్షసూత్రం ప్రాహరణం బాణీయం మౌక్తికం సౌవర్ణం పుష్పగన్ధ ద్రవ్యాది హృద్యవస్తుకృతం మకురం వా లిఙ్గమ్ అర్చయేత్ । తత్ర చ ఆధారబలాదేవ అధికాధిక మన్త్రసిద్ధిః భవతి ఇతి పూర్వం పూర్వం ప్రధానమ్, ఆధారగుణానువిధాయిత్వాత్ చ మన్త్రాణాం తత్రతత్ర సాధ్యే తత్తత్ప్రధానమ్ ఇతి శాస్త్రగురవః । సర్వత్ర పరమేశ్వరాభేదాభిమాన ఏవ పరమః సంస్కారః ।

ఇప్పుడు లింగము. రహస్యమంత్రములతో లింగస్థాపనము చేయరాదు. విశేషముగా వ్యక్తలింగములలో అసలు పనికిరాదు. అదే ఆధారముగనుక, ఇంతకుమునుపు ప్రతిష్ఠితమైన లింగమును ఆవాహన విసర్జనక్రమములో పూజ చేయవలయును. గురుదేహము, స్వదేహము, శక్తిదేహము, రహస్యశాస్త్రపుస్తకము, వీరపాత్ర, అక్షసూత్రము, ప్రాహరణము, బాణలింగము, మౌక్తికలింగము, సౌవర్ణలింగము, పుష్పగన్ధద్రవ్యాది హృద్యవస్తు కృతమైన మకురమును గాని, లిఙ్గముగా అర్చించవచ్చును. ఆధారబలముతోనే అధికాధికముగా మన్త్రసిద్ధి కలుగుతుంది. వీనిలో ముందటివి వెనుకవానికంటే ప్రధానములైనవి. ఆధారగుణానువిధాయియైనవి మంత్రములు. రకరకములైనవి సాధించుటకు ఆయా తత్త్వములు ప్రధానములని శాస్త్రములు గురువులు చెప్పినారు. అన్నిచోట్లా, పరమేశ్వరునితో అభేదరూపమైన అభిమానమే పరమ సంస్కారము.

అథ పర్వవిధిః । తత్ర సామాన్యం, సామాన్యసామాన్యం, సామాన్యవిశేషో, విశేషసామాన్యం, విశేషో, విశేషవిశేషశ్చ ఇతి షోఢా పర్వ - పూరణాత్ విధేః ।

ఇప్పుడు పర్వవిధి చెప్పబడుచున్నది. సామాన్యము, సామాన్యసామాన్యము, సామాన్యవిశేషము, విశేషసామాన్యము, విశేషము, విశేషవిశేషములని ఇవి ఆరు పర్వములు. విధిని పూరిస్తుంది గనుక పర్వమైనది.

తత్ర మాసి మాసి ప్రథమం పఞ్చమం దినం సామాన్యమ్, చతుర్థాష్టమ-నవమ-చతుర్దశ-పఞ్చదశాని

ద్వయోరపి పక్షయోః సామాన్యసామాన్యమ్, అనయోరుభయోరపి రత్యోః వక్ష్యమాణ తత్తత్తిథ్యుచిత గ్రహనక్షత్రయోగే సామాన్యవిశేషః,

ప్రతిమాసమునందును పాడ్యమి, పంచమి దినములు సామాన్యము. రెండు పక్షములలోను చతుర్థ, అష్టమి, నవమి, చతుర్దశులు, రెండు పక్షములలోని పంచదశులు సామాన్యసామాన్యములు, ఈ రెండుపక్షములలోను ఇప్పుడు చెప్పబోవునట్టి ఆయా తిథి, గ్రహనక్షత్ర యోగములు సామాన్యవిశేషములు.

మార్గశీర్షస్య ప్రథమరాత్రిభాగః కృష్ణనవమ్యామ్, పౌషస్య తు రాత్రిమధ్యం కృష్ణనవమ్యామ్, మాఘస్య రాత్రిమధ్యం శుక్లపఞ్చదశ్యామ్, ఫాల్గునస్య దినమధ్యం శుక్లద్వాదశ్యామ్, చైత్రస్య శుక్లత్రయోదశ్యామ్, వైశాఖస్య కృష్ణాష్టమ్యామ్, జ్యేష్ఠస్య కృష్ణనవమ్యామ్, ఆషాఢస్య ప్రథమే దినే, శ్రావణస్య దివసపూర్వభాగః కృష్ణైకాదశ్యామ్, భాద్రపదస్య దినమధ్యం శుక్లషష్ఠ్యామ్, ఆశ్వయుజస్య శుక్లనవమీదినమ్, కార్తికస్య ప్రథమో రాత్రిభాగః శుక్లనవమ్యామ్ - ఇతి విశేషపర్వ।

మార్గశీర్షమాసములో ప్రథమరాత్రి భాగమునందు వచ్చునట్టి కృష్ణనవమి, పుష్యమాసమున అర్ధరాత్రిలో వచ్చునట్టి కృష్ణనవమి, మాఘమాసమున అర్ధరాత్రియందు వచ్చునట్టి శుక్లపఞ్చదశి (పౌర్ణమి), ఫాల్గునమాసమున దినమధ్యమున వచ్చునట్టి శుక్లద్వాదశి, చైత్ర శుక్లత్రయోదశి, వైశాఖ కృష్ణాష్టమి, జ్యేష్ఠ కృష్ణనవమి, ఆషాఢపాడ్యమి, శ్రావణమున దినపు పూర్వభాగమున వచ్చు కృష్ణ ఏకాదశి, భాద్రపదమున దినమధ్య శుక్లషష్ఠి, ఆశ్వయుజ శుక్లనవమి, కార్తికమున రాత్రిమొదటిభాగపు శుక్లనవమి - ఇవి విశేషపర్వములు.

చిత్రాచన్ద్రౌ, మఘాజీవౌ, తిష్యచన్ద్రౌ, పూర్వఫాల్గునీబుధౌ, శ్రవణబుధౌ, శతభిషక్చన్ద్రౌ, మూలాదిత్యౌ, రోహిణీశుక్రౌ, విశాఖాబృహస్పతీ, శ్రవణచన్ద్రౌ ఇతి । యది మార్గశీర్షాదిక్రమేణ యథాసంఖ్యం భవతి ఆశ్వయుజం వర్జయిత్వా తదా విశేషవిశేషః। అన్యవిశేషశ్చేత్ అన్యపర్వణి తదా తత్ - అనుపర్వ ఇత్యాహుః।

చిత్రా చంద్రుడు, మఘలో గురువు, తిష్యాచంద్రుడు, పూర్వఫల్గునిలోని బుధుడు, శ్రవణా బుధుడు, శతభిషములోని చంద్రుడు, మూలానక్షత్ర సూర్యుడు, రోహిణీశుక్రుడు, విశాఖాబృహస్పతి, శ్రవణా చంద్రుడు - వీటిని మార్గశీర్షాదిక్రమములో ఆశ్వయుజమును వర్జించగా విశేషవిశేషములు వస్తాయి. మిగిలిన పర్వములలో ఇతర విశేషములైతే అవి అనుపర్వములు.

భగ్రహయోగే చ న వేలా ప్రధానం - తిథేరేవ విశేషలాభాత్, అనుయాగకాలానువృత్తిస్తు పర్వదినే ముఖ్యా - అనుయాగప్రాధాన్యాత్ పర్వయాగానామ్, అనుయాగో మూర్తియాగః చక్రయాగః ఇతి పర్యాయాః।

భగ్రహయోగమైతే వేళ ప్రధానముగాదు. విశేషలాభము తిథితోనే అవుతుంది. అనుయాగకాలానువృత్తియే పర్వదినమున ముఖ్యము. పర్వయాగములలో అనుయాగమే ప్రాధాన్యము. అనుయాగమన్నది మూర్తియాగము, చక్రయాగముల వరుసలో ఉంటుంది.

తత్ర గురుః, తద్వర్గ్యః సనన్తానః, తత్త్వవిత్, కన్యా, అన్త్యా, వేశ్యా, అరుణా, తత్త్వవేదినీ వా ఇతి చక్రయాగే ముఖ్యపూజ్యాః - విశేషాత్ సామస్త్యేన। తత్ర మధ్యే గురుః తదావరణక్రమేణ గుర్వాదిసమయ్యన్తం వీరః శక్తిః ఇతి, క్రమేణ-ఇత్యేవం చక్రస్థిత్యా వా పఙ్క్తిస్థిత్యా వా ఆసీత, తతో గన్ధధూపపుష్పాదిభిః క్రమేణ

పూజయేత్, తతః పాత్రం సదాశివరూపం ధ్యాత్వా శక్త్యమృతధ్యాతేన ఆసవేన పూరయిత్వా తత్ర భోక్త్రీం శక్తిం శివతయా పూజయిత్వా తయైవ దేవతాచక్రతర్పణం కృత్వా నర-శక్తి-శివాత్మక- త్రితయమేలకం ధ్యాత్వా ఆవరణావతరణక్రమేణ మోక్షభోగప్రాధాన్యం బహిరన్తశ్చ తర్పణం కుర్యాత్, పునః ప్రతిసంచరణక్రమేణ, ఏవం పూర్ణం భ్రమణం చక్రం పుష్ణాతి |

వాటిలో, గురువు, ఆయన వర్గము, ఆయన సంతానము, తత్త్వవేత్తలు, కన్య, అన్త్య, వేశ్య, అరుణ, తత్త్వవేదిని - వీరు చక్రయాగములో ముఖ్యపూజ్యులు. విశేషముగా అందరినీ పూజించాలి. చక్రమధ్యభాగములో, గురువు, ఆవరణక్రమములో గురువునుండి సమయ వరకు వీరులు, శక్తులు కూర్చోవాలి. చక్రస్థితిలోగాని, పంక్తిస్థితిలోగాని, వారు కూర్చోవాలి. అప్పుడు గన్ధ, ధూప, పుష్పాదులతో వారిని క్రమముగా పూజించాలి. అప్పుడు, పాత్రను సదాశివరూపముగా ధ్యానించి, అమృతమును శక్తిగా ధ్యానించి ఆసవముతో పాత్రను నింపి భోక్త్రలను శక్తిరూపులుగా భావిస్తూ, తాను శివుడనని భావించి పూజించాలి. దానితో దేవతాచక్ర తర్పణం చేయాలి. అప్పుడు నర, శక్తి, శివాత్మకమైన ముగ్గురూ ఒక్కటేనని ధ్యానించి, ఆవరణలలో పైనుంచి క్రిందకు వస్తూ మోక్షభోగప్రాధాన్యమైన బహిరంతర తర్పణమును చేయాలి. మరలా వెనుక క్రమంలో తర్పణమును చెయ్యగా పూర్ణమౌతుంది.

తత్ర ఆధారే విశ్వమయం పాత్రం స్థాపయిత్వా దేవతాచక్రం తర్పయిత్వా స్వాత్మానం వన్దితేన తేన తర్పయేత్, పాత్రాభావే భద్రం వేల్లితశుక్తిః వా, దక్షహస్తేన పాత్రాకారం భద్రం, ద్వాభ్యాముపరిగతదక్షిణాభ్యాం నిఃసన్ధీకృతాభ్యాం వేల్లితశుక్తిః, పతద్భిః బిన్దుభిః వేతాలగుహ్యకాః సంతుష్యన్తి, ధారయా భైరవః, అత్ర ప్రవేశో న కస్యచిత్ దేయః, ప్రమాదాత్ ప్రవిష్టస్య విచారం న కుర్యాత్, కృత్వా పునర్ద్విగుణం చక్రయాగం కుర్యాత్, తతోఽవదంశాన్ భోజనాదీన్ చ అగ్రే యథేష్టం వికీర్యేత, గుప్తగృహే వా సంకేతాభిధానవర్జం దేవతాశబ్దేన సర్వాన్ యోజయేత్ - ఇతి వీరసంకరయాగః |

విశ్వమయమైన ఆధారములో పాత్రను స్థాపించి దేవతాచక్రమును తర్పణము జేసి వందనములిస్తూ తనను తాను తర్పణము చేసుకోవాలి. పాత్రలేనపుడు, భద్రము గాని, వేల్లితశుక్తిగాని పట్టవలెను, కుడిచేతిని పాత్రాకారముగా ఉంచడం భద్రం, ఎడమచేయిపైన కుడిచేయి నుంచి సందులు లేకుండా దోసిలి పడితే అది వేల్లితశుక్తి. సందులనుండి జారిపడిన బిందువులతో బేతాళ, గుహ్యక గణములు తృప్తిపడతాయి. ధారతో భైరవుడు. ఈ చక్రములోనికి ఎవరినీ ప్రవేశించనీయరాదు, ఒకవేళ ప్రమాదవశాత్తు ప్రవేశించినచో విచారించరాదు. మరలా ఇంకొకసారి చక్రయాగమును చేయాలి. భోజనాదికములను కావలసినన్ని అక్కడ ఉంచవలెను. ఈ గుప్తగృహములో ఉన్నవారినందరినీ, వారివారి పేర్లతో గాక, సంకేతనామములతో దేవతాశబ్దములతో సంబోధించాలి. ఇది వీరసంకరయాగము.

తతోఽన్తే దక్షిణాతామ్బూలఫలవస్త్రాదిభిః తర్పయేత్ - ఇతి ప్రధానతమోఽయం మూర్తియాగః | అదృష్టమణ్డలోఽపి మూర్తియాగేన పర్వదినాని పూజయన్ వర్షాదేవ పుత్రకోక్తం ఫలమేతి, వినా సన్న్యాసుష్ఠానాదిభిః - ఇతి వృద్ధానాం భోగినాం స్త్రీణాం విధిరయమ్, శక్తిపాతే సతి ఉపదేష్టవ్యో గురుణా |

దాని చివరలో, దక్షిణ, తామ్బూలము, ఫలములు, వస్త్రములు మొదలైనవాటితో తర్పణమివ్వాలి. మూర్తియాగములో ఇది ముఖ్యమైన విధి. అదృష్టమణ్డలములో కూడా మూర్తియాగము ద్వారా

పర్వదినములలో పూజించగా, ఏడాదిలోనే, పుత్రకమువలె ఫలము లభిస్తుంది. దీనిలో సంధ్య మొదలైన అనుష్ఠానములు అక్కరలేదు. ఇది వృద్ధులకు, భోగులకు, స్త్రీలకు విధి. దీనిని శక్తిపాతము తదుపరి గురువుద్వారా ఉపదేశము నొందాలి.

అథ పవిత్రకవిధిః । స చ శ్రీరత్నమాలా త్రిశిరోమత శ్రీసిద్ధామతాదౌ విధిపూర్వకః పారమేశ్వరాజ్ఞాపూరకశ్చ, ఉక్తం చైతత్ శ్రీతన్త్రాలోకే 'వినా పవిత్రకేణ సర్వం నిష్ఫలమ్ ।' ఇతి ।

ఇప్పుడు పవిత్రకవిధి చెప్పబడుచున్నది. ఇది శ్రీరత్నమాల, త్రిశిరోమతము, శ్రీ సిద్ధమతములలో విధిపూర్వముగా చెప్పబడినది. పరమేశ్వరాజ్ఞాపూరకముగూడ, తంత్రాలోకమున ఇట్లు చెప్పబడినది - 'పవిత్రము లేకపోతే అంతా నిష్ఫలమౌతుంది'

తత్ర ఆషాఢశుక్లాత్ కులపూర్ణిమాదినాన్తం కార్యం పవిత్రకమ్, తత్ర కార్తికకృష్ణపఞ్చదశీ కులచక్రం నిత్యాచక్రం పూరయతి ఇతి శ్రీనిత్యాతన్త్రవిదః । మాఘశుక్లపఞ్చదశీ ఇతి శ్రీభైరవకులోర్మివిదః । దక్షిణాయనాన్తపఞ్చదశీ ఇతి శ్రీతన్త్రసద్భావవిదః ।

ఆషాఢశుక్ల పాడ్యమినుండి కులపూర్ణిమ వరకూ పవిత్రకమును చేయవలెను. కార్తీక కృష్ణపఞ్చదశి నాటి విధిద్వారా కులచక్రము, నిత్యాచక్రము పూర్ణమౌతుందని శ్రీనిత్యా తన్త్రవేత్తలు చెప్పుచున్నారు. మాఘశుక్లపఞ్చదశియని శ్రీభైరవకులోత్తర వేత్తలు అంటున్నారు. దక్షిణాయనములో చివరలో వచ్చే పఞ్చదశియని శ్రీతన్త్రసద్భావ వేత్తలంటారు.

తత్ర విభవేన దేవం పూజయిత్వా ఆహుత్వా తర్పయిత్వా పవిత్రకం దద్యాత్, సౌవర్ణముక్తారత్నవిరచితాత్ ప్రభృతి పటసూత్రకార్పాసకుశగర్భాన్తమపి కుర్యాత్ । తచ్చ తత్త్వసంఖ్యగ్రన్థికం పదకలాభువనవర్ణమన్త్రసంఖ్యగ్రన్థి చ జాన్వన్తమేకం, నాభ్యన్తమపరం, కణ్ఠాన్తమన్యత్, శిరసి అన్యత్ - ఇతి చత్వారి పవిత్రకాణి దేవాయ గురవే చ సమస్తాధ్వపరిపూర్ణతద్రూపభావనేన దద్యాత్, శేషేభ్య ఏకమ్ ఇతి ।

అపుడు వైభవముగా దేవుని పూజించి ఆహుతులు తర్పణములు ఇచ్చి పవిత్రకమునివ్వవలయును. సువర్ణము, ముక్త, రత్నములు మొదలైనవాటితోను, పటసూత్రము, కార్పాసము, కుశలతోను చేయవలెను. దానికి తత్త్వసంఖ్యను బట్టి ముడులుండాలి. పద, కలా, భువన, వర్ణ, మన్త్రసంఖ్యలతో ముడులు మోకాళ్లవరకు ఒకటి, నాభివరకు ఇంకొకటి, కంఠము వరకు ఇంకొకటి, శిరస్సు వరకు మరొకటి - ఈ విధముగా నాలుగు పవిత్రకములను దేవునికి, గురువుకు సమస్తాధ్వములతో పరిపూర్ణమైన వారి రూపభావనముతో ఇవ్వాలి. శేషమును ఒక్కదానినివ్వాలి.

తతో మహోత్సవః కార్యః, చాతుర్మాస్యం సప్తదినం త్రిదినం చ ఇతి ముఖ్యాన్యాపత్కల్పాః, సతి విభవే మాసి మాసి పవిత్రకమ్, అథ వా చతుర్షు మాసేషు, అథ వా సకృత్, తదకరణే ప్రాయశ్చిత్తం జపేత్, జ్ఞానీ అపి సంభవద్విత్తోఽపి అకరణే ప్రత్యేవైతి లోభోపహితజ్ఞానాకరణే జ్ఞాననిన్దాపత్తేః । 'యదా ప్రాప్యపి విజ్ఞానం దూషితం పరమేశశాసనం తదా ప్రాయశ్చిత్తీ ।' ఇతి వచనాత్ । ఇత్యేష పవిత్రకవిధిః ।

అప్పుడు మహోత్సవం చెయ్యాలి. చాతుర్మాస్యమును పట్టి సప్తదినములు గాని, త్రిదినములు గాని ముఖ్యములైన ఆపత్కాలములలో ఇవ్వాలి. ధనముంటే ప్రతినెలా పవిత్రకము నివ్వాలి. లేదా నాలుగు

నెలలకొకమారు గాని, ఒకేఒక్కమారుగాని. అది చెయ్యకపోతే ప్రాయశ్చిత్త మంత్రములను జపించాలి. జ్ఞానియైనా, ధనమున్నప్పటికీ కూడా లోభంతో దీనిని చెయ్యకపోతే జ్ఞాననింద కలుగుతుంది. ఈ విషయమై ఇలా చెప్పబడినది - 'ఎవడైతే విజ్ఞానమును పొందిన తరువాత పరమేశశాసనమును దూషిస్తాడో అతడు ప్రాయశ్చిత్తమును ఆచరించాలి. ఇది పవిత్రక విధి.

జ్ఞానలాభాదౌ లౌకికోత్సవాన్తేఽపి సర్వత్ర సంవిదుల్లాసాధిక్యం దేవతాచక్రసంనిధిః విశేషతో భవతి, ఇతి తథావిధాధిక్యపర్యాలోచనయా తథావిధమేవ విశేష మనుయాగాదౌ కుర్యాత్ |

జ్ఞానలాభము మొదట్లోనూ, లౌకికోత్సవము యొక్క చివరలోను, దేవతాచక్ర సన్నిధిలో సర్వత్రా సంవిదుల్లాసాధిక్యం కలుగుతుంది. దీనిని బాగుగా విచారించి ఆ విధముగా అనుయాగమును విశేషముగా చేయవలెను.

అథ వ్యాఖ్యావిధిః | సర్వశాస్త్రసంపూర్ణం గురుం వ్యాఖ్యార్థమ్ అభ్యర్థయేత్, సోఽపి స్వశిష్యాయ పరశిష్యాయాపి వా సముచితసంస్కారోచితం శాస్త్రం వ్యాచక్షీత, అధరశాసనస్థాయాపి కరుణావశాత్ ఈశ్వరేచ్ఛావైచిత్ర్యోద్భావిత శక్తిపాత సంభావనాభావిత హృదయో వ్యాచక్షీత - మర్మోపదేశవర్జమ్ | తత్ర నిమ్నాసనస్థితేభ్యః తత్పరేభ్యో నియమిత వాఙ్మనః కాయేభ్యో వ్యాఖ్యా క్రియమాణా ఫలవతీ భవతి, ప్రథమం గన్ధాదిలిప్తాయాం భువి ఉల్లిఖ్య సంకల్ప్య వా పద్మాధారం చతురశ్రం పద్మత్రయం పద్మమధ్యే వాగీశీం వామదక్షిణయోః గణపతిగురూ చ పూజయేత్, ఆధారపద్మే వ్యాఖ్యేయకల్పదేవతామ్ |

ఇప్పుడు వ్యాఖ్యావిధి. సర్వశాస్త్రసంపూర్ణుడైన గురువును వ్యాఖ్యార్థమై అభ్యర్థనము చేయవలయును. ఆయనకూడా తనశిష్యులకు పరశిష్యులకు సముచితరీతిని వారివారి సంస్కారోచితముగా శాస్త్రమును వ్యాఖ్యానించవలయును. నిమ్నశాసనస్థులను కూడా, కరుణతో ఈశ్వరేచ్ఛావైచిత్రితో ఉద్భవించే శక్తిపాతమును భావించుచూ వ్యాఖ్యానించవలయును. మర్మోపదేశమును చెప్పరాదు. వారిని క్రిందనున్న ఆసనమున కూర్చుండబెట్టి, వారందరు వాఙ్మనఃకాయములలో నియమితులై ఉన్నప్పుడు వ్యాఖ్య క్రియారూపమును దాల్చి, ఫలవతి అవుతుంది. మొదటగా గన్ధము మొదలైనవి చల్లిన భూమిపైన పద్మాధారమును చతురశ్రమును పద్మత్రయమును ఆ పద్మమధ్యమున సరస్వతిని, ఎడమ కుడివైపులలో గణపతిని గురువును పూజించవలెను. ఆధారపద్మమున వ్యాఖ్యేయ కల్పదేవతను పూజించవలయును.

తతః సామాన్యార్ఘపాత్రయోగేన చక్రం తర్పయేత్, తతో వ్యాచక్షీత సూత్రవాక్యపటలగ్రన్థమ్, పూర్వాపరావిరుద్ధం కుర్వన్ తన్త్రావృత్తిప్రసఙ్గసముచ్చయవికల్పాదిశాస్త్రన్యాయౌచిత్యేన పూర్వం పక్షం సమ్యక్ ఘటయిత్వా సమ్యక్ చ దూషయన్ సాధ్యం సాధయన్ తాత్పర్యవృత్తిం ప్రదర్శయన్ పటలాన్తం వ్యాచక్షీత నాధికమ్, తత్రాపి పటలాన్తే పటలాన్తే తర్పణం పూజనమ్ ఇతి యావద్వ్యాఖ్యాసమాప్తిః | తతోఽపి పూజయిత్వా విద్యాపీఠం విసర్జ్య ఉపలిప్య అగాధే తత్ క్షేపయేత్ | ఇతి వ్యాఖ్యావిధిః |

అప్పుడు సామాన్యార్ఘపాత్రము ద్వారా చక్రమును తర్పించవలయును. అప్పుడు సూత్రవాక్యపటలగ్రన్థమును వ్యాఖ్యానించవలయును. పూర్వాపరములకు అవిరుద్ధముగా చేసి, తన్త్రము, ఆవృత్తి, ప్రసఙ్గము, సముచ్చయము, వికల్పము మొదలైన శాస్త్రన్యాయౌచిత్యముల ద్వారా పూర్వపక్షమును చక్కగా చూపించి, తరువాత చక్కగా ఖండించి, సాధ్యమును సాధిస్తూ తాత్పర్యవృత్తిని ప్రదర్శనము చేస్తూ,

పటలాన్తము వరకు వ్యాఖ్యానము చేయవలెను. అంతకంటే కాదు. అప్పుడు కూడా వస్తువు యొక్క అంతములలో తర్పణము పూజనము చేయుచూ యావత్తు వ్యాఖ్యయొక్క సమాప్తి వరకూ చేయవలెను. తదుపరి పూజించిన విద్యాపీఠమును విసర్జించి అగాధజలములలో దానిని పడవేయవలెను. ఇది వ్యాఖ్యావిధి.

అథ సమయనిష్కృతిః | యద్యాపి తత్త్వజ్ఞాననిష్ఠస్య ప్రాయశ్చిత్తాది న కించిత్ తథాపి చర్యామాత్రాదేవ మోక్షభాగినః, తాన్ అనుగ్రహీతుమ్ ఆచారవర్తనీం దర్శయేత్ | అతత్త్వజ్ఞానీ తు చర్యైకాయత్తభోగమోక్షః సమయోల్లఙ్ఘనే కృతే ప్రాయశ్చిత్తమ్ అకుర్వన్ వర్ష శతం క్రవ్యాదో భవతీతి - ఇతి ప్రాయశ్చిత్తవిధిః వక్తవ్యః, తత్ర స్త్రీవధే ప్రాయశ్చిత్తం నాస్తి, అన్యత్ర తు బలాబలం జ్ఞాత్వా అఖణ్డాం భాగవతీం మాలినీం ఏకవారాత్ ప్రభృతి త్రిలక్షాన్తమ్ ఆవర్తయేత్ యావత్ శఙ్కావిచ్యుతిః భవతి, తదన్తే విశేషపూజా, తత్రాపి చక్రయాగః, స హి సర్వత్ర శేషభూతః | ఇతి సమయనిష్కృతివిధిః |

ఇప్పుడు సమయనిష్కృతి. తత్త్వజ్ఞాననిష్ఠ కలిగినవానికి ప్రాయశ్చిత్తాదుల అవసరము లేకున్నప్పటికీ, చర్యామాత్రముతోనే మోక్షభాగియయ్యే వానికి, అనుగ్రహించి ఆచారవర్తనమును చూపవలెను. తత్త్వజ్ఞాని కానివాడు, చర్యలద్వారా మాత్రమే భోగమోక్ష సాధకుడౌతున్నాడు. అటువంటివాడు సమయోల్లఙ్ఘనము చేస్తూ, ప్రాయశ్చిత్తము చేసుకోకుంటే, అతడు నూరేండ్లపాటు క్రవ్యాది నరకములలో పడతాడు. కనుక ప్రాయశ్చిత్తవిధిని చెప్పవలయును. స్త్రీవధ చేసినవానికి ప్రాయశ్చిత్తము లేదు. ఇతరములలో అయితే బలాబలములను గమనించి, ఆ శంక పోయేవరకు, అఖణ్డ భగవతి మాలినిని ఒక్కవారములో మూడులక్షలుగా జపించాలి. ఆ తరువాత విశేషపూజ. దానిలో కూడా చక్రయాగమును సర్వత్రా చేయవలెను. ఇది సమయనిష్కృతి విధి.

అథ గురుపూజావిధిః | సర్వయాగాన్తేషు ఉపసంహృతే యాగే అపరేద్యుః గురుపూజాం కుర్యాత్, పూర్వం హి స విధ్యఙ్గతయా తోషితో న తు ప్రాధాన్యేన, ఇతి తాం ప్రాధాన్యేన అకుర్వన్ అధికారబన్ధేన బద్ధో భవతి - ఇతి తాం సర్వథా చరేత్ | తత్ర స్వాస్తికం మణ్డలం కృత్వా తత్ర సౌవర్ణం పీఠం దత్వా తత్ర సమస్తమధ్వానం పూజయిత్వా తత్పీఠం తేన అధిష్ఠాప్య తస్మై పూజాం కృత్వా తర్పణం భోజనం దక్షిణామ్ ఆత్మానమ్ ఇతి నివేద్య నైవేద్యోచ్ఛిష్టం ప్రార్థ్య వన్దిత్వా స్వయం ప్రాశ్య చక్రపూజాం కుర్యాత్ | ఇతి గురుపూజావిధిః |

ఇప్పుడు గురుపూజావిధి. సర్వయాగాన్తములలోను యాగము అయిపోయిన మరునటి దినమున గురుపూజను గావించవలెను. ఇంతకుముందు, ఆచారానుసారముగా జరిగినది, ప్రాధాన్యముతో కాదు. ప్రాధాన్యరూపంలో గురుపూజను చేయనప్పుడు అధికారబన్ధము ద్వారా బద్ధుడౌతాడు. కనుక సర్వదా చేయవలెను. స్వస్తిక మణ్డలమును నిర్మించి దానిలో సువర్ణపీఠమునుంచి దానిలో సమస్త అధ్వములను పూజించి, దానిపైన గురువును కూర్చుండబెట్టి ఆయనకు పూజచేసి, తర్పణము, భోజనము, దక్షిణలను నివేదించి నైవేద్యోచ్ఛిష్టమును ప్రార్థనా వందనములతో తానే భుజించి చక్రపూజను చేయాలి. ఇది గురుపూజావిధి.

శ్లో|| నిత్యం నైమిత్తికం కర్మ కుర్వఞ్శాఠ్యవివర్జితః |
వినాపి జ్ఞానయోగాభ్యాం చర్యామాత్రేణ ముచ్యతే ||

శాఠ్యము లేకుండా నిత్యనైమిత్తిక కర్మలను ఎవడైతే చేస్తాడో, వాడు జ్ఞాన, యోగములు లేకున్నప్పటికీ

కేవలము చర్యలతోనే ముక్తిని పొందుతాడు.

వ్యాఖ్యానము

దీక్షాస్వీకారము చేసిన తరువాత, మిగిలిన జీవితమునంతా శిష్యుడు ఏ విధముగా గడుపవలెనన్న విషయము ఈ అధ్యాయములో చెప్పబడుచున్నది.

దీక్షను గ్రహించిన శిష్యుడు, తనయొక్క శేష జీవితమును ఏ విధముగా గడుపవలెనో వివరిస్తున్నది ఈ అధ్యాయము.

శిష్యులలో రెండు రకములవారుంటారు. ఒకరు, జ్ఞానసంపద కలిగినవారు. రెండు, జ్ఞానసంపద లేనివారు. వీరిలో, జ్ఞానసంపద కలిగినవారికి, ఆయా సంస్కారములతో కూడిన సిద్ధి కొరకు కొన్ని విధములైన దీక్షలు ఇవ్వబడతాయి. జ్ఞానము లేనివారికి, బీజమంత్రములతో కూడిన ప్రతిమోక్షదీక్ష ఇవ్వబడుతుంది. ఈ రెండువర్గముల వారికీ, వారు జీవితాంతమూ పాటించవలసిన నియమములను గురువు ఉపదేశించాలి.

నిత్యము - నైమిత్తికము - కామ్యము

శేషవర్తనము (జీవితాంతమూ చేయవలసిన విధుల) లో, నిత్యము, నైమిత్తికము, కామ్యమని మూడు విధములైన అనుష్ఠానములుంటాయి. వీటిలో కామ్యములంటే, కోరికలను తీర్చుకోవడం కోసం చేయబడే రకరకములైన తంత్రప్రక్రియలు. ఇవి వాటిని సాధించాలనుకునే సాధకులకోసం ఉద్దేశించబడినవి. కనుక, వాటినిక్కడ వివరించి చెప్పడం లేదు.

జీవితం చివరివరకూ ప్రతినిత్యమూ చేయవలసిన అనుష్ఠానము నిత్యమనబడుతుంది. ఈశ్వరునియందు తన్మయభావము సిద్ధించడం కోసం చేయబడే అనుష్ఠానమును నైమిత్తికమంటారు. దీనిని సిద్ధింపజేసే సంధ్యోపాసన మొదలైన అనుష్ఠానములను ప్రతిదినమూ చేస్తూనే ఉండాలి. పర్వదినములు, పవిత్రకములు నైమిత్తికములు. అంటే, అప్పుడప్పుడు చేయవలసినవి. కానీ, కొందరి అభిప్రాయము ప్రకారం ఇవి కూడా నిత్యములే. ఎందుకంటే, ఆయా సమయములలో అవి మళ్ళీ మళ్ళీ వస్తుంటాయి గనుక, ఆయా సమయములు వచ్చినపుడు, సంధ్యావందనాదుల లాగా వీటిని కూడా చేయవలసి ఉంటుంది గనుక, ఇవి కూడా నిత్యములేయని కొందరంటారు.

మరి నైమిత్తికములేమిటి? అంటే, వారి వారి సాంప్రదాయములలో కూడా, కాలనియతిని బట్టి రాని సంఘటనలేవైతే ఉంటాయో, వాటిని నైమిత్తికములంటారు. ఉదాహరణకు, గురువుగారు లేదా ఆయన కుటుంబవర్గము శిష్యుని ఇంటికి వచ్చిన రోజు, గురువుగారి పర్వదినము లేదా తనకు జ్ఞానోపదేశము లభించిన దినము మొదలైన రోజులు నైమిత్తికములని కొందరంటారు. ఆయా సందర్భములలో, రోజువారీ చేయవలసిన పూజ, సంధ్యోపాసన, గురుపూజ, పూర్వపూజ, పవిత్రకము మొదలైన అనుష్ఠానములు తప్పనిసరిగా చేయవలసినట్టివి.

తనకు జ్ఞానోదయము కలిగిన దినము, శాస్త్రలాభము కలిగిన దినము, గురువుగాని ఆయన

కుటుంబవర్గము గాని తన ఇంటికి వచ్చుట, గురువు యొక్క జన్మదినము, ఆయన మరణించిన దినము, లౌకికములైన పండుగరోజులు, శాస్త్రాధ్యయనము యొక్క మొదలు, మధ్య, సమాప్తి దినములు, దేవతాదర్శనము లభించినట్టి రోజు, తనతోటి శిష్యుని కలసిన దినము, స్వప్నములో ఏదియో ఒక ఆజ్ఞను పొందిన దినము, సమయవిధుల యొక్క పాలన నుండి విడుదల కలిగిన రోజు - ఇవన్నీ నైమిత్తికపరముగా విశేషార్చన చేయవలసిన దినములు.

మంత్రసాధన

ముందు చెప్పబడినట్లుగా దీక్షాపరులైన శిష్యునకు, ముఖ్యమైనది, బలమైనది అయిన మంత్రమును ఉపదేశించాలి. ఆ మంత్రము, సంవిత్ స్వరూపమై, దానిని స్మరించినంత మాత్రమున స్ఫురణను కలిగించునదై ఉండాలి. దానిని ఎక్కడా వ్రాయకూడదు. గురువు యొక్క నోటినుండి శిష్యుని చెవిలోనికి మాత్రమే అది ప్రయాణించాలి. దానియందు తన్మయత్వభావమును శిష్యుడు సాధించాలి. అనగా, మంత్రచైతన్యముతో ఏకత్వమును పొందాలి. దీనిని సాధించడం కోసం, మూడుసంధ్యలలోను, మంత్రచైతన్యముతో తన్మయత్వభావమును శిష్యుడు అభ్యాసము చేయాలి. ఈ తన్మయత్వ భావము సర్వకాల సర్వావస్థలలోనూ తనలో నిలచియుండే విధముగా శిష్యుడు జీవించాలి. ఇందుకోసమై, పరమేశ్వరుని విగ్రహమును గాని, లేదా, లింగాకారములో గాని ఆయనను ప్రతిదినమూ అర్చించాలి.

తన్మయభావము

చూడటానికి మనోహరముగా ఉన్న ఒక వేదికపైన, తన రూపము కూర్చుని ఉన్నట్లుగా ఊహించాలి. స్వచ్ఛమైన అద్దములో తనయొక్క ప్రతిబింబమును చూచుకున్న రీతిలో, ధ్యానదేవతాచక్రము కంటే తన రూపము భిన్నము కాదని, రెండూ ఒక్కటే అనీ ధ్యానించాలి. ఈ విధముగా తనను తానే ధ్యానిస్తూ, మంచి మంచి పుష్పములు, గంధము, తేనె, తర్పణము, నైవేద్యము, ధూపము, దీపము, ఉపహారము, స్తుతి, గీతము, వాద్యము, నృత్యములతో దేవతకంటే అభిన్నమైన తన రూపమును తానే పూజించాలి, జపించాలి, స్తోత్రం గావించాలి. ఈ విధంగా చేయగా చేయగా, అనుమానం లేని విధముగా ఈశ్వరునితో తన్మయభావము లభిస్తుంది. అద్దములో తన ముఖమును నిరంతరము చూచుకునే వానికి తన రూపము ఖచ్చితముగా కనిపించిన రీతిలో ఇదికూడా జరుగుతుంది.

లయము

ఈ సాధనలో, తన్మయభావము తప్ప, ఇతరమైన ఫలితమేదీ ప్రధానము కాదు. పరామంత్రములో తన్మయీభావమును పొందటమే దీని పరమగమ్యము. ఈ ధ్యానబలంచేత, తనలో ఉన్న సమస్తములైన పశువాసనా కళంకములన్నీ నివృత్తి అయిపోతాయి. భక్తిరసములో మునగడం వల్ల, బంధాలన్నీ తనను విడచిపెడతాయి. ఈశ్వరునిలో లీనమైన ఈ స్థితిలో హృదయము నిలచి ఉండటమే సాధనయొక్క పరమగమ్యమని మా గురువులు మాకు చెప్పినారని అభినవగుప్తులవారు అంటున్నారు.

పారమార్థిక భావపూరితమైన ధ్యానమనేది గొప్పదైన మరియు అమృతమయమైన దృష్టినిస్తుంది. ఈ

దృష్టి యొక్క రహస్యమును తెలుసుకున్నట్టి వేత్తలు నిన్ను దానితోనే పూజిస్తారని ఈశ్వరునితో అభినవగుప్తాచార్యులవారు అంటున్నారు.

మూలాధారచక్రమును ఆధారముగా చేసుకొని, వెలుగుతో నిండిన ధ్యానరసముతో దానిని ప్రోక్షణము చేస్తూ, ఈ ధ్యానముతో కడుగబడినట్టి మనస్సుతో, స్వభావమనే పుష్పములతో, ఆనందామృతముతో నిండిన హృదయమనే వెలకట్టలేని అర్ఘపాత్రద్వారా, దేహమనే దేవాలయములో, దేవి (ప్రాణశక్తి)తో కూడిన దేవుని (ఆత్మను), రాత్రీపగలూ (ఇడా పింగళా నాడులద్వారా) నిత్యమూ అర్చించవలెను.

పైన చెప్పబడిన రెండు శ్లోకముల అర్థమును లోలోపల భావించుచూ, దేవతాచక్రమును తనలోనే ధ్యానించవలెను. దాని తరువాత, ముద్రాప్రదర్శనము, జపము, నివేదనములను చేసి, జ్ఞానముతో కూడిన ఆత్మలో విసర్జనము చేయవలయును. ముఖ్య నైవేద్యము మొత్తమును తానే తినవలెను. లేదా దానినంతటినీ నీటిలో వదలివేయాలి. నీటిలో ఉండే చేపలు మొదలైన ప్రాణులు, ఇంతకు ముందే ఇవ్వబడిన చరుభోజనము ద్వారా దీక్షను పొంది ఉంటారు. వారిప్పుడు, ఈ నైవేద్యమును తినడం ద్వారా ఆగమవేత్తలౌతారు. ఒకవేళ, పిల్లి, ఎలుక, కుక్క మొదలైన క్రూరజంతువులు ఈ ప్రసాదమును తింటే నరకం లభిస్తుందని శాస్త్రం చెబుతున్నది కాబట్టి, జ్ఞానియైనవాడు లోకానుగ్రహమును కోరి, లోకాచారమును పాటించనూ కూడదు, పూర్తిగా దానికి దూరంగానూ ఉండకూడదు. ఇది స్థణ్డిలయాగమనబడుతుంది.

లింగపూజ

ఇప్పుడు లింగపూజ చేసే విధానము చెప్పబడుతున్నది. రహస్యములైన మంత్రములతో లింగస్థాపనమును చేయకూడదు. ముఖ్యముగా వ్యక్తలింగమును ఆ విధంగా అసలు చేయకూడదు. ఎందుకంటే, లింగమనేది సృష్టిలో వ్యక్తమౌతున్నది గనుక దానికి రహస్యము లేదు. లింగమునకు రెండు రూపములున్నాయి. ఒకటి అవ్యక్తలింగము, రెండవది వ్యక్తలింగము. అవ్యక్తలింగమనేది సృష్టికి అతీతంగా వ్యక్తం కాకుండా ఉంటుంది. వ్యక్తలింగమనేది సృష్టిరూపంగానూ ఉంటుంది, సృష్టిలోని వివిధములైన ఆకారములలోనూ ఉంటుంది. వ్యక్తలింగములలో, వాటంతట అవి ఏర్పడిన రూపములు శ్రేష్ఠములైనవి. వాటిని స్వయంభూలింగములంటారు. మానవులు ప్రతిష్ఠించిన లింగములు వీటికంటే తక్కువస్థాయికి చెందినవి.

లింగములనేవి, చిన్నచిన్న రాళ్లతో, రత్నములతో, ముత్యములతో, ఆహారపదార్థములతో, వస్త్రములతో, సుగంధద్రవ్యములతో చేయబడవచ్చునని అభినవగుప్తాచార్యులవారు తంత్రలోక గ్రంథమున వ్రాసినారు. రాతితో చెక్కబడినవి, లోహములతో చేయబడినవి పనికిరావని ఆయనన్నారు. అయితే, బంగారముతో చేయబడిన లింగము ప్రశస్తమైనది.

ఆధారములు

పూజకు ఆధారము లింగమే. కనుక, ఇంతకుమునుపు ప్రతిష్ఠ చేయబడినయున్న లింగమును ఆవాహన మరియు విసర్జనా పద్ధతిలో పూజ చేయాలి. ఇలా పూజ చేయడానికి మరికొన్ని ఆధారములు చెప్పబడినాయి.

అవి, ఈ క్రింది వరుసలో ఉంటాయి.

1. గురువు యొక్క దేహము

2. తన (శిష్యుని యొక్క) దేహము

3. శక్తి (తన సహచరి యొక్క) దేహము

4. రహస్యమైన మంత్రములున్నట్టి పుస్తకము

5. వీరపాత్ర

6. జపమాల

7. కత్తి లేక గద వంటి ఆయుధము

8. నర్మదానదిలో దొరకునట్టి బాణలింగము (సాలగ్రామము)

9. ముత్యములతో చేయబడిన లింగము

10. బంగారముతో చేయబడిన లింగము

11. పుష్పములు, గంధము మొదలైన వస్తువులతో చేయబడిన లింగము

12. అద్దము

ఒక ఆధారమనేది ఉన్నప్పుడే, దానిననుసరించి మంత్రసిద్ధి యనేది కలుగుతుంది. ఆధారమంటే లింగమే. దాని బలము అన్నింటికంటే ముఖ్యమైనది. కనుక లింగపూజ యనేది ప్రధానమైనది. పైన చెప్పబడిన ఆధారములలో, ముందు చెప్పబడినవి, తరువాత చెప్పబడిన వానికంటే ప్రశస్తములైనవి.

ఆధారముయొక్క గుణమును బట్టి మంత్రములు నడుస్తూ ఉంటాయి. ఆధారములో ఏ గుణమైతే ఉన్నదో అదే మంత్రములో వ్యక్తమౌతుంది. కనుక ఆయా మంత్రములకు, ఆయా ఆధారములు సరిపోవునట్లుగా చూచుకొని పూజించాలి. ఇది శాస్త్రములలో చెప్పబడింది, గురువులు కూడా దీనినే చెప్పినారు. ఏ విధమైన పూజ చేసినప్పటికీ, అంతిమముగా, పరమేశ్వరునితో అభేదరూపమైన ధ్యానభావముతో ఆ పూజను చేయాలి. అటువంటి పూజయే అత్యుత్తమమైనదని చెప్పబడుతుంది.

పర్వవిధి

ఇప్పుడు, పర్వవిధి చెప్పబడుచున్నది. అంటే, పర్వదినములలో చేయవలసిన అనుష్ఠానము వివరింపబడుతుంది. పర్వదినమంటే 'పండుగ దిన'మని అర్థము. అయితే, వ్యాకరణానుసారముగా చూచినప్పుడు, 'పూరించునది' యని ఆచార్యులవారి భావనగా తోస్తుంది. విధులను పూరిస్తుంది గనుక పర్వదినమని అర్థం చేసుకోవాలి.

ఇప్పటివరకూ నిత్యవిధులు చెప్పబడినాయి. ఇక్కడనుండి నైమిత్తికవిధులు చెప్పబడతాయి.

పర్వములనేవి ఆరు విధములుగా ఉన్నాయి. అవి,

1. సామాన్యము

2. సామాన్యసామాన్యము

3. సామాన్యవిశేషము

4. విశేషసామాన్యము

5. విశేషము

6. విశేషవిశేషము

అప్పటివరకూ చేయబడుతున్న విధిని పూరిస్తుంది, పరిపూర్ణం చేస్తుంది గనుక, పర్వదినమని అనబడుతుంది.

సామాన్యము

పాడ్యమి, పంచమి

సామాన్యసామాన్యము

చతుర్థి, అష్టమి, నవమి, చతుర్దశి, రెండు పంచదశులు (అమావాస్య, పౌర్ణములు)

సామాన్యవిశేషము

పై రెండింటిలో కొన్ని కొన్ని తిథి, గ్రహ, నక్షత్ర యోగములు కలసినప్పుడు అవి సామాన్యవిశేషములౌతాయి. అవి ముందు ముందు చెప్పబడతాయి.

విశేషము

మార్గశిర కృష్ణనవమి రాత్రి ప్రథమభాగము, పుష్య కృష్ణనవమి అర్ధరాత్రి, మాఘ శుక్లపౌర్ణమి అర్ధరాత్రి, ఫాల్గుణ శుక్లద్వాదశి మధ్యాహ్నము, చైత్ర శుక్లత్రయోదశి, వైశాఖ కృష్ణాష్టమి, జ్యేష్ఠ కృష్ణనవమి, ఆషాఢపాడ్యమి, శ్రావణ కృష్ణ ఏకాదశి మధ్యాహ్నము లోపు, భాద్రపద శుక్లషష్ఠి మధ్యాహ్నము, ఆశ్వయుజ శుక్లనవమి, కార్తీక శుక్లనవమి రాత్రి – ఇవి విశేషపర్వములని పిలువబడుతాయి.

విశేషవిశేషము

చిత్రానక్షత్రములో చంద్రుడు, మఘలో గురువు, తిష్యా (పుష్యమీ) నక్షత్రములో చంద్రుడు, పూర్వఫల్గునిలోని బుధుడు, శ్రవణా నక్షత్రములో బుధుడు, శతభిషములోని చంద్రుడు, మూలానక్షత్రములో

సూర్యుడు, రోహిణీ నక్షత్రములో శుక్రుడు, విశాఖా నక్షత్రములో బృహస్పతి, శ్రవణానక్షత్రములో చంద్రుడు - ఈ యోగములున్నపుడు, వాటిని మార్గశీర్ష మాసము నుండి మొదలుపెట్టి, మధ్యలో ఆశ్వయుజమును వదలిపెట్టి లెక్కిస్తే, విశేషవిశేషములౌతాయి. అనగా,

- మార్గశిరమాసములో చిత్రానక్షత్రములో చంద్రుడున్న రోజు
- పుష్యమాసములో మఖా నక్షత్రములో గురువున్న రోజు
- మాఘమాసములో పుష్యమీ నక్షత్రములో చంద్రుడు
- ఫాల్గుణమాసములో పూర్వఫల్గునిలోని బుధుడున్న రోజు
- చైత్రమాసములో శ్రవణా నక్షత్రములో బుధుడున్న రోజు
- వైశాఖ మాసములో శతభిషములో చంద్రుడున్న రోజు
- జ్యేష్ఠమాసములో మూలానక్షత్రములో సూర్యుడున్న రోజు
- ఆషాఢమాసములో రోహిణీ నక్షత్రములో శుక్రుడున్న రోజు
- శ్రావణమాసములో విశాఖా నక్షత్రములో బృహస్పతి ఉన్నరోజు
- భాద్రపద మాసములో శ్రవణానక్షత్రములో చంద్రుడున్న రోజు

మిగిలిన పర్వదినములలో ఏవైనా ఇతర విశేషములు గనుక అయితే, అవి అనుపర్వములని చెప్పబడతాయి. ఏ విషయములోనైనా తిథియన్నది ఒక్కటే ఫలితమునిస్తుంది. కనుక, నక్షత్రము, గ్రహము కలసి ఉన్నప్పుడు ఆ దినము యొక్క వేళను లెక్కించే అవసరం లేదు. ఎందుకంటే, విశేషమైన లాభము తిథివల్లనే కలుగుతుంది. యాగము జరుగుట మాత్రమే పర్వదినమున ముఖ్యమైన విషయము. పర్వయాగములో కూడా, అనుయాగమే ముఖ్యమైనది. అనుయాగమన్నది మూర్తియాగము, చక్రయాగము అనబడే వరుసలో ఉంటుంది. ఈ రెండూ ఒకదానికొకటి పర్యాయపదములే.

చక్రయాగము అయిదు విధములుగా ఉంటుంది. అవి,

1. కేవలము - ఒక్కరితో చేయబడేది. దీనిలో గురువు ఒక్కడే యాగమును ఆచరిస్తాడు.

2. యామళము - జంటగా చేసేది. గురువు, గురుపత్ని కలసి చేసేది.

3. మిశ్రము - గుంపుగా చేసేది. దీనిలో శిష్యులు కూడా వారివారి పత్నులతో కలసి యాగవిధిలో పాల్గొంటారు.

4. చక్రయుగ్మము - రెండు చక్రములుగా చేయబడేది. దీనిలో శిష్యులు వారి పత్నులతో గాని, ఉపపత్నులతో గాని కలసి పాల్గొంటారు.

5. వీరసంకరము - వీరులందరూ కలసి చేసేది. దీనిలో అందరూ కలసి ఒకేసారి యాగములో పాల్గొంటారు.

గురువు, ఆయన బంధువర్గము, ఆయన సంతానము, తత్త్వవేత్తలు, కన్య, అంత్యజాతి స్త్రీ, వేశ్య, అరుణ (బహిష్ఠుగా ఉన్న స్త్రీ), తత్త్వవేదిని - వీరు చక్రయాగములో ముఖ్యపూజ్యులు. వీరిలో ఒక్కొక్కరినీ పూజించాలి. మరలా అందరినీ కలిపి ఒకసారి విశేషముగా పూజించాలి. చక్రమధ్యభాగములో గురువు కూర్చోవాలి. సవ్యదిశగా అవరణక్రమములో గురువునుండి మొదలుపెట్టి, సమయ వరకు, వీరులు, శక్తులు వరుసగా కూర్చోవాలి. ఈ కూర్చోవడము, చక్రము వలె గుండ్రముగా గాని, పంక్తిగా ఒక వరుసలో గాని, వారు కూర్చోవాలి. గంధము, ధూపము, పుష్పములు మొదలైన వాటితో వారిని క్రమముగా పూజించాలి. అప్పుడు, పాత్రను సదాశివరూపముగాను, అందులో నింపబడిన మద్యమును శక్తిగాను ధ్యానించాలి. మద్యముతో పాత్రను నింపి భోక్తలను శక్తిరూపులుగాను, తాను శివుడనని భావిస్తూ వారిని పూజించాలి. దానితోనే దేవతాచక్ర తర్పణం చేయాలి. అప్పుడు నరుడు, శక్తి, శివుడు ముగ్గురూ ఒక్కటేనని ధ్యానిస్తూ, ఆవరణలలో పైనుంచి క్రిందకు వస్తూ తర్పణమును చేయాలి. దీనిలో భోగము బాహ్య తర్పణము ద్వారాను, మోక్షము అంతరతర్పణము ద్వారాను కలుగుతుంది. ఇదే వరుసలో, మరలా వెనుకకు తర్పణమును చెయ్యగా క్రియ మొత్తమూ పూర్ణమౌతుంది. విశ్వమయముగా ఒక ఆధారమును (కుదురును) కల్పించి దానిలో ఈ పాత్రను స్థాపించాలి. మొదట, అందులోని సారాయితో దేవతాచక్రమును తర్పణము జేసి వారికి నమస్కరిస్తూ, తనను తాను కూడా దానితోనే తర్పణము చేసుకోవాలి. పాత్ర లేనపుడు, కుడిచేతిని దొప్పగా పట్టి, దాని క్రింద ఎడమచేతినుంచి, వ్రేళ్ళమధ్యన సందులు లేకుండా చూచుకోవాలి. కుడిచేతిని పాత్రాకారముగా ఉంచడం 'భద్ర' మనబడుతుంది. ఎడమచేయిపైన కుడిచేయి నుంచి సందులు లేకుండా దోసిలి పడితే అది 'వేల్లితశుక్తి' అనబడుతుంది. సందులనుండి జారి నేలపైన పడిన అమృత (మద్యపు) బిందువులతో బేతాళ, గుహ్యక గణములు తృప్తిపడతాయి. దాని ధారతో భైరవుడు తృప్తిపడతాడు.

బయటివారినెవరినీ ఈ చక్రములోనికి ప్రవేశించనీయ కూడదు. ఒకవేళ ప్రమాదవశాత్తు ఎవరైనా ప్రవేశించినచో, వారిని అనుమానించకూడదు. ఒకవేళ అనుమానం కలిగితే, మరలా ఇంకొకసారి చక్రయాగమును మొదటినుంచీ చేయాలి. అందరికీ సరిపోయేటట్లుగా, కావలసినన్ని మంచి మంచి భోజనపదార్థములను అక్కడ ఉంచవలెను. ఈ రహస్య యాగగృహములో ఉన్నవారినందరినీ, వారివారి మామూలు పేర్లతో గాక, సంకేతనామములతో దేవతాశబ్దములతో కూడిన మారుపేర్లతో సంబోధించాలి. ఇది 'వీరసంకరయాగము' అనబడుతుంది.

దాని చివరలో, దక్షిణ, తాంబూలము, ఫలములు, వస్త్రములు మొదలైనవాటితో అందరికీ తర్పణమివ్వాలి. మూర్తియాగములో ఇది చాలా ముఖ్యమైన విధి. మండలమును చూడకపోయినప్పటికీ, మూర్తియాగము ద్వారా పర్వదినములలో పూజను చేస్తే, ఏడాదిలోపలనే, పుత్రకదీక్షాఫలము లభిస్తుంది. దీనిలో సంధ్యావందనము మొదలైన నిత్యానుష్ఠానములు అక్కరలేదు. ఇది వృద్ధులకు, భోగమును కోరుకునేవారికి మరియు స్త్రీలకు విధి. శక్తిపాతము కలిగిన తరువాత, ఈ విధానమునంతా గురువుద్వారా ఉపదేశమును పొందాలి.

పవిత్రక విధి

ఇప్పుడు పవిత్రకవిధి చెప్పబడుచున్నది. గురువుపట్ల, శాస్త్రముల పట్ల, సమయవిధులపట్ల అపచారము చేసినవారికి గాని, పర్వదినములను పాటించకుండా వదలిపెట్టిన వానికిగాని ఈ పవిత్రక విధిని చేయడం వలన, దోషపరిహారమౌతుందని అభినవగుప్తులవారు చెప్పినారు. ఇది శ్రీరత్నమాల, త్రిశిరోమతము, శ్రీ సిద్ధమతములలో చాలా వివరముగా చెప్పబడినది. దీనిని పరమేశ్వరుడే తన ఆజ్ఞగా చెప్పియున్నాడు. తంత్రాలోకమున ఇట్లు చెప్పబడినది, 'పవిత్రము లేకపోతే అంతా నిష్ఫలమౌతుంది'. కనుక పవిత్రకవిధిని తప్పకుండా చేయాలి.

ఆషాఢశుక్ల పాడ్యమినుండి కుల (మాఘ) పూర్ణిమ వరకూ పవిత్రకవిధిని ఆచరించాలి. కార్తీక అమావాస్య నాటి రాత్రికి చేసే విధి ద్వారా కులచక్రము, నిత్యాచక్రము రెండూ పూర్ణములౌతాయని శ్రీ నిత్యాతంత్రవేత్తలు అంటారు. ఆ దినము మాఘశుక్లపౌర్ణమి యని శ్రీ భైరవకులోత్తరతంత్రవేత్తలు అంటున్నారు. దక్షిణాయనము చివరలో వచ్చే పంచదశి తిథి యని శ్రీ తన్త్ర సద్భావవేత్తలంతున్నారు.

అపుడు, తన శక్తిని బట్టి, వైభవముగా ఈశ్వరుని పూజించి, ఆహుతులు, తర్పణములు ఇచ్చి పవిత్రకము నివ్వాలి. పవిత్రకమనేది బంగారముతో గాని, ముత్యములతో గాని, రత్నములతో గాని, పట్టుదారముతో గాని, నూలుతో గాని, కుశదర్భలతో గాని చేయబడాలి. దానికి తత్త్వముల యొక్క సంఖ్యను బట్టి 36 ముడులుండాలి. పద, కలా, భువన, వర్ణ, మంత్ర సంఖ్యలతో సరిపడే ముడులతో, మోకాళ్లవరకు ఒకటి, నాభివరకు ఇంకొకటి, కంఠము వరకు ఇంకొకటి, శిరస్సు వరకు మరొకటి - ఈ విధముగా నాలుగు పవిత్రకములను దేవునికి, గురువుకు ఇవ్వాలి. ఆ సమయంలో, సమస్తాధ్వములతోను పరిపూర్ణముగా ఉన్నట్లుగా వారి రూపములను ధ్యానిస్తూ ఇవ్వాలి. మిగిలినవారికోసం ఒక్క పవిత్రకమును చివరలో ఇవ్వాలి. అప్పుడు మహోత్సవమును జరిపించాలి. చాతుర్మాస్యము తరువాత ఏడుదినములు గాని, మూడుదినములు గాని పవిత్రకవిధిని జరిపించాలి. ఒకవేళ ఏదైనా ఆపద కలగడం వల్ల అలా చేయడం వీలుకాకపోతే, కనీసం ఒకసారి అయినా ఇవ్వాలి. ధనవంతుడైతే ప్రతినెలా పవిత్రక విధిని చేయవచ్చు. లేదా నాలుగు నెలలకు ఒకసారిగా గాని, ఒకేఒక్కసారి గాని చేయాలి. అదికూడా కుదరనప్పుడు, ప్రాయశ్చిత్త మంత్రములను జపించాలి.

ఒకనికి జ్ఞానం ఉండవచ్చు. సరిపోయినంత ధనం ఉండవచ్చు. కానీ, పిసినారితనంతో పవిత్రకవిధిని చెయ్యకపోతే జ్ఞాననింద కలుగుతుంది. ఈ విషయమై శాస్త్రములలో ఇలా చెప్పబడినది.

'ఎవడైతే విజ్ఞానమును పొందిన తరువాత పరమేశశాసనమును దూషిస్తాడో అతడు ప్రాయశ్చిత్తమును ఆచరించాలి'.

ఇక్కడ జ్ఞానమును పొందటమంటే, అనుభవజ్ఞానమును పొందటం కాదు. విషయమును మనస్సుతో అర్థం చేసుకుని బౌద్ధికజ్ఞానమును పొందటమని అర్థం. ఆ విధంగా విషయం అర్థమైన తర్వాత, శైవశాస్త్రములలో చెప్పబడిన అనుష్ఠానములను ఎవరైతే దూషిస్తారో వారు దోషానికి గురౌతారు. వారు తప్పక ప్రాయశ్చిత్తవిధిని చేసుకొనవలసి ఉంటుంది. పవిత్రక విధియనేది ఈ విధంగా ఉంటుంది.

జ్ఞానోపదేశమును పొందిన రోజునా, లౌకికోత్సవముల సమయములోనూ, దేవతాచక్రము యొక్క సన్నిధిలోనూ, ఎక్కువగా సంవిత్ యొక్క ఉల్లాసము, అక్కడున్నవారిలో అందరిలోనూ కలుగుతుంది. అప్పుడు, అనుయాగమును మరొక్కసారి విశేషముగా చేయాలి.

వ్యాఖ్యావిధి

శాస్త్రవ్యాఖ్యానమును గురువు చేయుచుండగా వినే ప్రక్రియ ఈ భాగములో చెప్పబడినది.

శాస్త్రవ్యాఖ్య చేయబోయే గురువు, సర్వశాస్త్రములను చక్కగా గ్రహించినవాడై ఉండవలెను. అట్టి గురువును సమీపించి, శాస్త్రమును వివరించమని అభ్యర్థన పూర్వకముగా అడుగవలెను. గురువైనవాడు, తనశిష్యులకు, ఇతర గురువుల శిష్యులకు కూడా, శాస్త్రమును వ్యాఖ్యానించవచ్చు. కానీ, వారివారి సంస్కారములను బట్టి వారికి అర్థమైనంతవరకే వివరించి చెప్పాలి. తక్కువ శాసనములను చెందినవారికి, అంటే, వైష్ణవాది ద్వైతమతస్థులైన ఇతర సాంప్రదాయముల వారికి కూడా, కరుణతో కూడిన మనస్సుతో శాస్త్రమును వివరించి చెప్పాలి. శక్తిపాతమనేది ఎవరిలో ఏ విధముగా అనుగ్రహింపబడుతుందో తెలియదు గనుక, ఈశ్వరుని ఇచ్ఛానుసారంగా జరుగబోయే ఈ శక్తిపాతమును ఊహిస్తూ, కరుణాపూరితంగా శాస్త్రవ్యాఖ్యను చేయాలి. దానినికూడా, వారి వారి స్థాయి వరకే చెప్పాలిగాని, స్థాయిని గమనించకుండా అందరికీ అన్ని మర్మములనూ చెప్పకూడదు. ఎందుకంటే, ఎవరి స్థాయిని బట్టే వారికి శాస్త్రం అర్థమౌతుంది. అంతకు మించి కాదు.

గురువు ఉన్నతాసనమున కూర్చోవాలి. వినువారిని క్రిందనున్న ఆసనములలో కూర్చుండబెట్టాలి. వారందరూ, గురువు యొక్క వ్యాఖ్యానమును వినడానికి శ్రద్ధతో కూడినవారై ఉండాలి. అందరూ వారివారి, వాక్కులోను, మనస్సులోను, దేహములలోను నియమముగా ఉండాలి. అంటే, త్రికరణములను నిగ్రహించుకొని, శ్రద్ధతో వినేవారై ఉండాలి. అటువంటప్పుడు మాత్రమే, గురువు చేత చెప్పబడే వ్యాఖ్య వారిలోకి ప్రవేశించి ఫలితమును చూపిస్తుంది.

మొదటగా గంధము మొదలైనవాటిని చల్లి, భూమిని శుభ్రం చేయాలి. దానిపైన పద్మమును లిఖించాలి. దానిపైన చతురశ్ర మండలమును, మూడు పద్మములను చిత్రించాలి. మధ్యపద్మములో సరస్వతీ దేవిని, ఎడమ కుడివైపు పద్మములలో గణపతిని గురువును ఉంచి పూజించాలి. ఏ విషయమును వివరించబోతున్నారో, ఆ విషయమునకు అధిదేవతను ఆధారపద్మములో, అనగా మొదటి పద్మములో ఉంచి పూజించాలి. మామూలు అర్ఘ్యపాత్ర ద్వారా చక్రమునకు తర్పణము చేయాలి. అప్పుడు శాస్త్రగ్రంథమునుండి ఆయా సూత్రములను, వాక్యములను, అధ్యాయములను వ్యాఖ్యానించాలి. ముందు చెప్పబడినవి, ఆ తరువాత చెప్పబడినవాటితో విరుద్ధముగా ఉండకూడదు. అంటే, వ్యాఖ్య మొత్తమూ తార్కికముగా ఉండి, విషయములన్నీ మెట్లుమెట్లుగా ఒకదానినొకటి సమర్థించుకొంటూ పూరించుకొంటూ ఉండాలి. ఆ విధముగా వ్యాఖ్య సాగాలి.

తన్త్రము (చక్కని అల్లిక), ఆవృత్తి (చెప్పినదానిని సమర్థిస్తూ మళ్ళీ చెప్పడము), ప్రసఙ్గము (విషయమును వివరించడము), సముచ్చయము (విషయమంతటినీ ఒకచోటకు చేర్చి సారాంశమును చెప్పడము), వికల్పము (చెప్పబడుచున్న విషయము యొక్క బలహీనతలను వివరించడము) మొదలైనవి తర్కశాస్త్రములోని అంగములు. వీటన్నిటిద్వారా మొదటగా ప్రత్యర్థుల వాదమును వివరించాలి. తరువాత ఆయా వాదములను

చక్కగా ఖండించి, ఆ ఖండనము ఎటు దారితీస్తుందో దానివైపు తర్కమును కొనసాగిస్తూ, అంతిమముగా దాని సారాంశమును, తాత్పర్యమును నిరూపిస్తూ, ఆ అధ్యాయము యొక్క చివరివరకూ ఇదే వ్యాఖ్యానము చేయవలెను. అంతకంటే ఎక్కువగా చెప్పకూడదు. ఈ విధముగా చేసే సమయంలో కూడా, ఆయా విషయముల యొక్క వివరణల చివరలలో, దేవతాతర్పణము, పూజ చేస్తూ, యావత్తు వ్యాఖ్యయొక్క సమాప్తి వరకూ ఇదే విధముగా చేయాలి. ఆ పిమ్మట, అప్పటివరకూ పూజించిన విద్యాపీఠమును విసర్జనము చేసి, లోతైన జలములలో దానిని పడవేయాలి. ఇది వ్యాఖ్యావిధి అనబడుతుంది.

సమయ నిష్కృతి

సమయనిష్కృతి యంటే, సమయాచారపు విధులను సరిగా పాటించని వానికి చేయబడే ప్రాయశ్చిత్తక్రియలని అర్థము. ఈ భాగములో ఇది వివరింపబడుతున్నది.

తత్త్వజ్ఞాననిష్ఠ కలిగినవానికి, నిత్యనైమిత్తికములనబడే విధులయొక్క అవసరము లేదు. అటువంటి వానికి, ఇక ప్రాయశ్చిత్తము మొదలైన క్రియల యొక్క అవసరమేమున్నది? ఉండదు. కానీ, అందరూ అతనితో సమానులు కాలేరు. అతడు విధులను పాటించడం లేదని చెప్పి, అవి చేయవలసినవారు కూడా చేయకపోవడం దోషమౌతుంది. ఎక్కువమందికి, అనుష్ఠాన చర్యలతోనే యోగము, మోక్షములు సిద్ధిస్తాయి. కనుక అటువంటి వారిని అనుగ్రహించి, ఆచార్యుడు వారికి ఆచారవర్తనమును నేర్పవలసిన అవసరమున్నది.

తత్త్వజ్ఞాని కానివాడు, అనుష్ఠానము మొదలైన క్రియల ద్వారా మాత్రమే యోగము మరియు మోక్షములను పొందుతున్నాడు. అటువంటివాడు వాటిని చేయకుండా ఉంటూ, దానికి ప్రాయశ్చిత్తమును కూడా చేసుకోకపోతే, అతడు నూరేండ్లపాటు క్రవ్యాది నరకములలో పడతాడు. క్రవ్యమంటే, పిశాచరూపంలో ఉంటూ శవాలను పీక్కుతినే స్థితిలో ఉండే నరకం. కనుక, ఆ గతినుండి అతడిని తప్పించడానికోసం, ప్రాయశ్చిత్తవిధిని అతడికి చేయాలి. అయితే, స్త్రీవధ చేసినవానికి మాత్రం ప్రాయశ్చిత్తము లేదు. వానికి నరకం తప్పదు. ఇతర పాపములలో అయితే, ఆయా పాపముల బలాబలములను గమనించి, అవి తీరినాయని నిస్సంశయముగా అనిపించే వరకూ, తన మనసులో ఉన్న పాపభయం పోయేటంతవరకూ, భగవతియైన అఖండమాలినీ మంత్రమును ఒక్కవారము లోపల మూడులక్షల సార్లు జపించాలి. అంటే, ఒక్కొక్క సంధ్యాసమయంలో 15,000 చొప్పున రోజుకు 45,000 జపం చేయాలి. ఆ తరువాత విశేషపూజను యథావిధిగా చేయవలసి ఉంటుంది. దానిలో కూడా చక్రయాగమును సర్వత్రా చేయాలి. ఇది 'సమయనిష్కృతి విధి' అనబడుతుంది.

గురుపూజావిధి

అన్ని యాగముల చివరలో గురుపూజను తప్పకుండా చేయవలసి యుంటుంది. చక్రయాగము అయిపోయిన మరుసటి దినమున ఈ గురుపూజను చేయాలి. ఇంతకుముందు కూడా గురుపూజ యనేది చాలాసార్లు జరిగి యుంటుంది. కానీ, ఆచారమును బట్టి, పూజాక్రమములో అది జరిగియుంటుంది గాని, దానికి మాత్రమే ప్రాధాన్యతనిస్తూ జరిగియుండదు. గురుపూజ యనినదానిని, అదే ఒక ముఖ్యమైన విధిగా చేయకపోతే, అధికార బంధము అతడిని చుట్టుకుంటుంది. కనుక గురుపూజ యనినదానిని ఎల్లప్పుడూ చేయవలెను.

ఈ క్రియలో, మొదటగా స్వస్తిక మండలమును నిర్మించాలి. దానిలో సువర్ణపీఠమునుంచి, దానిలో సమస్త అధ్వములను పూజించాలి. దానిపైన గురువును కూర్చుండబెట్టి, ఆయనకు పూజచేసి, తర్పణమునివ్వాలి. తరువాత, భోజనము పెట్టి, దక్షిణలను నివేదించాలి. మిగిలిన పదార్థములను పరమేశ్వరుని యొక్క నైవేద్యమనే భావముతో ప్రార్థనాపూర్వక వందనములతో భుజించాలి. ఆ తరువాత, చక్రపూజను చేయాలి. ఇది గురుపూజావిధి.

కం|| నిత్యము నైమిత్తికముల
సత్యముగా నెఱపువాడు సత్పాత్రుండౌ
భృత్యముగా జ్ఞాన గరిమ
నిత్యము యోగమ్ములేక నినుజేరునుగా

ఆ|| నిత్యక్రియల నెల్ల నైమిత్తికములెల్ల
బాగజేయువాడు భవునిజేరు
జ్ఞానయోగ గరిమ జేయూత లేకున్న
నిత్యవిధుల ముక్తి నిండునతని

అందరూ జ్ఞానులు యోగులు కాలేరు. అటువంటి వారికి ఆచారము, అనుష్ఠానములు తప్పనిసరులు. కనుక, పిసినారితనం లేకుండా, ఎవడైతే తాను చేయవలసిన నిత్యనైమిత్తిక కర్మలను చేస్తూ ఉంటాడో, అట్టివాడు జ్ఞానము లేకున్నప్పటికీ, యోగమును అభ్యాసం చేయనప్పటికీ, కేవలము తాను చేసే అనుష్ఠానచర్యల తోనే మోక్షమును పొందుతాడు. కనుక, అనుభవపూర్వకంగా తత్త్వజ్ఞానమును పొందనంతవరకూ, అనుష్ఠానమును చేస్తూనే ఉండాలి. వదలిపెట్టకూడదు.

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే శేషవర్తనప్రకాశనం నామ వింశమాహ్నికమ్ || 20 ||

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని శేషవర్తనప్రకాశనమనే ఇరవైయవ ఆహ్నికము.

ఇరువది యొకటవ ఆహ్నికము

ఆగమప్రామాణ్య ప్రకాశనము

యదార్థః - యదార్థము

ఏవం సమస్తం నిత్యం నైమిత్తికం కర్మ నిరూపితమ్ / అధునా అస్యైవ ఆగమస్య ప్రామాణ్యమ్ ఉచ్యతే /

ఈ విధముగా నిత్య నైమిత్తికరూపమైన సమస్తకర్మమూ నిరూపింపబడినది. దానికి గల ఆగమప్రామాణ్యమిప్పుడు చెప్పబడుచున్నది.

తత్ర సంవిన్మాత్రమయే విశ్వస్మిన్ సంవిది చ విమర్శాత్మికాయాం, విమర్శస్య చ శబ్దనాత్మకతాయాం సిద్ధాయాం, సకలజగన్నిష్ఠవస్తునః తద్గతస్య చ కర్మఫలసంబన్ధవైచిత్ర్యస్య యత్ విమర్శనం తదేవ శాస్త్రమ్ - ఇతి పరమేశ్వరస్వభావాభిన్న ఏవ సమస్తః శాస్త్రసందర్భో వస్తుత ఏకఫలప్రాపకః ఏకాధికార్యుద్దేశేనైవ, తత్ర తు పరమేశ్వరనియతి శక్తిమహిమ్నైవ భాగే భాగే రూఢిః లోకానామ్ ఇతి /

సంవిన్మాత్రమయమై విశ్వమయమైన సంవిత్ విమర్శాత్మికయై యున్నది. విమర్శయన్నది శబ్దాత్మికయగుట సిద్ధము. సకలజగము నందున్న వస్తువులు, వానివాని కర్మఫలసంబంధ వైచిత్రియొక్క విమర్శనమేమున్నదో అదే శాస్త్రము. ఈ విధముగా పరమేశ్వరస్వభావమునకు అభిన్నమైన సమస్త శాస్త్రసందర్భములు ఒకటి కన్నను ఎక్కువ ఉద్దేశ్యములున్నవైనప్పటికీ వస్తుతః ఒకటే ఫలమును పొందుచున్నవి. అవియన్నియు పరమేశ్వరనియతిశక్తి మహిమవలన రకరకములుగా లోకములో ఉంటున్నవి.

కేచిత్ మాయోచిత భేద పరామర్శాత్మని వేదాగమాదిశాస్త్రే రూఢాః, అన్యే తథావిధ ఏవ మోక్షాభిమానేన సాంఖ్యవైష్ణవశాస్త్రాదౌ, పరే తు వివిక్త శివస్వభావామర్శనసారే శైవసిద్ధాన్తాదౌ, అన్యే సర్వమయ పరమేశ్వరతామర్శనసారే మతఙ్గాదిశాస్త్రే, కేచిత్ తు విరలవిరలాః సమస్తావచ్ఛేదబన్ధ్య స్వాతన్త్ర్యానన్ద పరమార్థ సంవిన్మయ పరమేశ్వర స్వరూపామర్శనాత్మని శ్రీత్రికశాస్త్రక్రమే, కేచిత్ తు పూర్వపూర్వత్యాగక్రమేణ లఙ్ఘనేన వా - ఇత్యేవమ్ ఏకఫలసిద్ధిః ఏకస్మాదేవ ఆగమాత్ /

కొందరు మాయోచితమైన భేదపరామర్శనము చేయునట్టి వేదాగమాదిశాస్త్రములో నిష్ఠకలిగి యున్నారు. అన్యులు ఇదే విధముగా మోక్షాభిమానులై సాంఖ్య, వైష్ణవశాస్త్రాదులలో నిష్ఠగా ఉన్నారు. ఇతరులు కేవలమైన శివస్వభావమే సారమైన శైవసిద్ధాన్తము మొదలగువానిలోను, సర్వమయుడగు పరమేశ్వరతామర్శన సారములైన మతఙ్గాది శాస్త్రములలోను, మరికొందరు చాలా అరుదుగా, సమస్త బంధములను ఛేదించి, స్వాతన్త్ర్యము, ఆనన్దము, పరమార్థముల రూపమైన సంవిన్మయ పరమేశ్వరస్వరూప ఆమర్శనాత్మకులై త్రికశాస్త్ర క్రమములోను ఆసక్తులై ఉంటారు. మరికొందరు పూర్వశాస్త్రములను ఒక్కొక్కటిగా త్యాగం చేస్తూ దాటుకుంటూ పోతుంటారు. ఈ విధముగా ఆగమము ఒక్కటే గనుక ఒక్కటే అయిన సిద్ధి లభిస్తుంది.

భేదవాదేఽపి సమస్తాగమానామ్ ఏకేశ్వరకార్యత్వేఽపి ప్రామాణ్యం తావత్ అవస్థితమ్, ప్రామాణ్యనిబన్ధనస్య ఏకదేశసంవాదస్య అవిగీతతాయా అనిదన్ప్రాప్రవృత్తేశ్చ తుల్యత్వాత్, పరస్పరబాధో

విషయభేదాత్ అకించిత్కరః । బ్రహ్మహననతన్నిషేధవత్ సంస్కారభేదః సంస్కారాతిశయః తదభావే క్వచిత్ అనధికృతత్వమ్ ఇతి సమానమ్ - ఆశ్రమభేదవత్, ఫలోత్కర్షాచ్చ ఉత్కర్షః-తత్రైవ ఉపనిషద్భాగవత్, భిన్నకర్తృకత్వేఽపి సర్వ సర్వజ్ఞకృతత్వమత్ర సంభావ్యతే - తదుక్తతదతిరిక్తయుక్త్యర్థయోగాత్, నిత్యత్వేఽపి ఆగమానాం ప్రసిద్ధిః తావత్ అవశ్యోపగమ్యా - అన్వయ వ్యతిరేకాధ్యక్షాదీనాం తత్ప్రామాణ్యస్య తన్మూలత్వాత్, 'సత్యం రజతం పశ్యామి' ఇతి హి సౌవర్ణికాదిపరప్రసిద్ధ్యైవ, ప్రసిద్ధిరేవ ఆగమః సా కాచిత్ దృష్టఫలా 'బుభుక్షితో భుఙ్క్తే' ఇతి బాలస్య ప్రసిద్ధిత ఏవ తత్ర తత్ర ప్రవృత్తేః నాన్వయవ్యతిరేకాభ్యాం - తదా తయోః అభావాత్, యౌవనావస్థాయాం తద్భావేఽపి అకించిత్కరః, ప్రసిద్ధిం తు మూలీకృత్య సోఽస్తు కస్మైచిత్ కార్యాయ, కాచిత్ అదృష్టవైదేహ్య-ప్రకృతిలయ-పురుషకైవల్యఫలదా, కాచిత్ శివసమానత్వఫలదా, కాచిత్ ఐక్యపర్యవసాయినీ, సా చ ప్రత్యేకమ్ అనేకవిధా -

సమస్తాగమములలోని భేదవాదములకు కూడా, అవి ఏకేశ్వరకార్యములై నందువలన, వాటికి ప్రామాణ్యము లభిస్తున్నది. ప్రామాణ్యనిబన్ధనములో, ఒకే ప్రదేశములోని సంవాదములో అవిగీతత వల్లను, అనిదన్తా ప్రవృత్తివల్లను, సమానత్వము వల్లను, విషయభేదము వలన పరస్పరబాధ కలుగును గనుక అకించిత్కరమౌతుంది. బ్రహ్మహత్య, దాని నిషేధము లాగా సంస్కారభేదములు, సంస్కారాతిశయములు ఉంటాయి. అవి లేకుంటే ఎక్కువతక్కువలు లేక సమానమౌతుంది, ఆశ్రమభేదముల వలెనె. ఫలోత్కర్షము వలన ఉత్కర్ష కలుగుతుంది. వేదములలో ఉపనిషద్భాగము వలె. వానిలో చెప్పబడినవి, చెప్పబడనివానిలో కూడా యుక్తములున్నందువలన, భిన్నకర్తృకములైనప్పటికీ సర్వజ్ఞకృతములే యని అనుకోవాలి. నిత్యములుగా ఆగమములు ప్రసిద్ధములు. అన్వయవ్యతిరేక, అధ్యక్షాదుల ప్రమాణములకు మూలములైనందున, 'సత్యం రజతం పశ్యామి' అన్నప్పుడు సౌవర్ణికుడు మొదలైన వారి ప్రసిద్ధివల్ల కలిగినట్లు, ఆగమమే ప్రసిద్ధి. ఎక్కడైనా దృష్టఫలము ఉండవచ్చు. 'ఆకలిగొన్నవాడు భుజిస్తున్నాడు' అన్నట్లుగా. బాలకులలో ప్రసిద్ధి యున్నది ఆయా ప్రవృత్తుల ప్రకారము కలుగుతుంది. అన్వయ వ్యతిరేకముల వలన కాదు. వారిలో వాటి అభావముంటుంది. యౌవనావస్థలో ఉన్నప్పటికీ పనికిరావు. ప్రసిద్ధిని మూలకారణముగా తీసుకుని ఏదైనా పనిని చేసినప్పటికీ, కొన్నిసార్లు ఒకేఫలమును కూడా ఇస్తుంది. అనేకవిధములుగా కూడా ఉంటుంది. విదేహత్వము, ప్రకృతిలయము, పురుషకైవల్యము లాంటి ఫలములవంటివి. కొన్నిసార్లు శివసమానత్వఫలమును కూడా. కొన్నిసార్లు ఐక్యపర్యవసాయిని కూడా. అది ప్రత్యేకముగాను అనేక విధములుగాను ఉంటుంది.

ఇత్యేవం బహుతరప్రసిద్ధిపూర్ణే జగతి యో యాదృశో భవిష్యన్ స తాదృశీమేవ ప్రసిద్ధిం బలాదేవ హృదయపర్యవసాయినీమ్ అభిమన్యతే - ఇతి రిక్తస్య జన్తోః అతిరిక్తా వాచోయుక్తిః, తాసాం కాంచనప్రసిద్ధిం ప్రమాణీకుర్వతా అభ్యుపగన్తవ్యమేవ ఆగమ ప్రామాణ్యమ్, ఇతి స ఆగమ ఆశ్రయణీయో యత్ర ఉత్కృష్టం ఫలమ్, ఇత్యలమన్యేన ।

ఈ విధముగా బహువిధములైన ప్రసిద్ధులుగా జగత్తులో ఉన్నపుడు, భవిష్యత్తులో ఏది అవుతారో, దానిని అదే విధముగా హృదయపూర్వకముగా స్వీకరిస్తారు. ఇది లేనివారికి యుక్తితో కూడిన వాదన వల్ల ప్రయోజనమేమున్నది? వాటిలోని అత్యంత ఉపయుక్తమైన కాంచనప్రసిద్ధిని ఆగమప్రామాణ్యముగా స్వీకరిస్తారు. దేని ఫలముత్కృష్టమో ఆ ఆగమమును ఆశ్రయించాలి. ఇతర ఆలోచనలు దేనికి?

శ్లో|| సంవిత్ప్రకాశప్రమార్థతయా యథైవ
భాత్యామృశత్యపి తథేతి వివేచయన్తః |
సన్తః సమస్తమయచిత్ప్రతిభావిమర్శ
సారం సమాశ్రయత శాస్త్రమనుత్తరాత్మ ||

పరమార్థము ద్వారా సంవిత్ ఏ విధముగా భాసిస్తున్నదో, అదే విధముగా సంతులచేత వివేచింపబడుచున్నది. అన్నింటిలో ఉన్నట్టి చిత్ప్రతిభావిమర్శ యొక్క సారరూపియైన అనుత్తరాత్మను ప్రవచించే శాస్త్రమును ఆశ్రయించాలి.

శ్లో|| నిజదృఢప్రసిద్ధిఘటితే వ్యవహారే లోక అస్తి నిఃశఙ్కః |
తదా భవతి జనోత్తీర్ణ-ప్రసిద్ధిరూఢః పరమశివః ||

తమకు గట్టి విశ్వాసమున్న వ్యవహారంలో లోకులు నిశ్శంకులై ఉంటారు. అదే విధముగా, అన్నింటినీ మించినట్టి ప్రసిద్ధిలో కుదురుకున్న వాడు పరమశివుడే అగుచున్నాడు.

వ్యాఖ్యానము

ఇప్పటివరకూ నిత్యము, నైమిత్తికములనే విధములుగా ఉన్నట్టి సమస్తకర్మమూ నిరూపింపబడినది. వీనికి గల 'ఆగమప్రామాణ్యము' ఈ అధ్యాయములో చెప్పబడుచున్నది.

ఆగమశాస్త్రము

శుద్ధ చైతన్యరూపమైన సంవిత్, విశ్వముగా మనకు గోచరిస్తున్నది. ఇది విమర్శా స్వరూపముతో మనకు తెలియబడుతుంది. వేరే దారి లేదు. విమర్శయన్నది శబ్దముగా మారినప్పుడే మనకు అందుబాటులోకి వస్తుంది. శబ్దములతో కూడినవే శాస్త్రములు. ప్రపంచములో ఉన్న సమస్త జీవులు, వస్తువులు, మరియు వాటి మధ్యన గల విచిత్రములైన కర్మసంబంధములను వివిధశబ్దముల సహాయముతో వివరించేదేదైతే ఉన్నదో అదే శాస్త్రమనబడుతుంది.

శబ్దము శుద్ధసంవిద్రూపుడైన పరమేశ్వరుని నుండి ఉద్భవించినది గనుక శాస్త్రములు కూడా ఆయన యొక్క స్వభావమునకు అభిన్నములుగా ఉంటాయి. అయితే, శాస్త్రములన్నీ, ఎన్నెన్నో రకములుగా ఉన్నప్పటికీ, వాటి ఉద్దేశ్యములు కూడా వేర్వేరుగా ఉన్నప్పటికీ మూలములో అవియన్నీ ఒక్కటే ఫలమును పొందుచున్నవి. కానీ లోకములోనికి విస్తరించినపుడు, పరమేశ్వరునియొక్క 'నియతి' అనబడే శక్తి యొక్క మహిమవలన, రకరకములైన శాస్త్రములుగా ఈ లోకములో ఉంటున్నవి.

వివిధాగమములు

కనుక, మానవులలో కొందరు, మాయ మొదలైన వాదములతో ద్వైతప్రపంచమును వివరించే వేదములు వాటి సంబంధములైన ఆగమాదిశాస్త్రములో నిష్ఠను కలిగి యుంటున్నారు. మరికొందరు, ఇదే విధముగా, లోకభోగములను వదలి, మోక్షమును మాత్రమే కోరుకుంటూ, సాంఖ్యము, వైష్ణవము మొదలైన శాస్త్రములలో

నిష్ఠగా ఉంటున్నారు. ఇంకా కొందరు, తానుదప్ప వేరేది లేని శివస్వభావమే సారముగా గల శైవసిద్ధాన్తము మొదలగువానిలోను, పరమేశ్వరుని సర్వమయత్వమును ప్రతిపాదించే మతంగశాస్త్రము మొదలైన వాటిలోను ఆసక్తులుగా ఉన్నారు. చాలా కొద్దిమంది మాత్రం, సమస్త బంధములను ఛేదించి, స్వాతన్త్ర్యము, ఆనన్దము, పరమార్థముల రూపమైన సంవిన్మయ పరమేశ్వరస్వరూప అమర్శనాత్మకులై త్రికశాస్త్ర క్రమములోను ఆసక్తులై ఉంటారు. మరికొందరు పూర్వశాస్త్రములను ఒక్కొక్కటిగా త్యాగం చేస్తూ దాటుకుంటూ పోతుంటారు. ఈ విధముగా ఒక్కొక్క ఆగమము వలన ఒక్కొక్క విధమైన సిద్ధి లభిస్తుంది.

మనకు ఎన్నో ఆగమములున్నాయి. అవి భిన్నభిన్నములైన వాదములను ప్రతిపాదిస్తున్నాయి. మరి అవన్నీ ప్రమాణములెలా అవుతాయి? అన్నప్పుడు, బయటకు అవి ఒకదానికొకటి విభిన్నములుగా కనిపిస్తున్నప్పటికీ, వాటి మూలశక్తి ఈశ్వరుడే అయినందువలన వాటికి ప్రామాణ్యము లభిస్తున్నది. ఈ ప్రమాణములలో, ఒకే విషయమును గురించి సంవాదము తలయెత్తినపుడు, ఆ వాదము గనుక అవిగీతముగా ఉంటే, అనగా మర్యాదాపూర్వకముగా, తార్కికముగా, పండితులకు ఆమోదయోగ్యమైన విధముగా ఉంటే, ఆయా సిద్ధాంతములలో సమానత్వము గోచరించవచ్చు. సమానత్వమున్నప్పటికీ, వాటిమధ్యన విషయములో భేదముంటుంది గనుక, అది ఎటూ తేలక, ఏమి చేయాలో తెలియనట్టి పరిస్థితి ఉంటుంది. విభిన్నములైన విషయముల గురించి చర్చ అసంబద్ధమైనది. ఎందుకంటే, ఆ రెంటికీ ఒక పోలిక లేదు గనుక, వాటిని కలిపి చర్చించడం వల్ల ఉపయోగం లేదు.

బ్రాహ్మణహత్య యనేది మన శాస్త్రములలో నిషేధింపబడి యున్నది. ఎవరిని హత్య చేసినా తప్పే అయినప్పటికీ, బ్రాహ్మణహత్య యన్నది మరీ తీవ్రమైన నేరంగా ప్రాచీనకాలంలో పరిగణింపబడేది. కారణమేమిటి? లోకంలోని అన్నింటిలోనూ ఉత్తమము, మధ్యమము, అధమము అనేవి ఉన్నాయి. ఇవన్నీ ఒకటే కావు. దేనికి తగిన విధులు పద్ధతులు దానికుంటాయి. ఉత్తముడైనవాని పట్ల చేయబడిన అపచారము ఎక్కువ తీవ్రతను కలిగియుంటుంది. కనుక అది అసలే కూడదని నిషేధింపబడింది. కనుక, మానవులలో గాని, వస్తువులలో గాని, సంస్కారమును బట్టి ఆయా భేదములు, హెచ్చుతగ్గులు ఉంటాయి. అవి లేకుంటే, ఎక్కువతక్కువలనేవి లేక అంతా సమానమౌతుంది. అది ప్రకృతివిరుద్ధం కదా !

మానవ జీవితంలో నాలుగు ఆశ్రమములున్నాయి. అవి బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్యాసములు. వాటిలో, దేని విధులు దానికే ఉంటాయి. అన్నీ ఒకటే అవ్వవు. అదే విధముగా ఇది కూడా ఉంటుంది. ఫలితము ఎక్కువగా, ఉన్నతముగా ఉన్నపుడు, దానికి తగిన ఔన్నత్యం కూడా దానినిబట్టే కలుగుతుంది. వేదములలో కూడా కర్మకాండ జ్ఞానకాండ ఉన్నాయి. మిగతా వేదమంతా కర్మకాండను ప్రబోధిస్తే, ఉపనిషద్భాగము మాత్రం జ్ఞానకాండను ప్రబోధిస్తున్నది. కనుక వేదమునకు ఉపనిషత్తు తలమానికమౌతున్నది. అదే విధముగా, అన్నింటిలోనూ హెచ్చుతగ్గులనేవి ఉంటాయి.

అన్ని శాస్త్రములూ అన్ని విషయములనూ చెప్పవు. వానిలో చెప్పబడినవి, చెప్పబడనివి కూడా ఉంటాయి. రెంటిలోనూ మంచి ఉంటుంది. కనుక, శాస్త్రముల కర్తలు వేర్వేరుగా ఉన్నప్పటికీ, అవియన్నీ సర్వజ్ఞుడైన పరమేశ్వరుని చేత చెప్పబడినట్టివే యని అనుకోవాలి.

ఆగమములు నిత్యములని ప్రసిద్ధములు. ఏలాగంటే, నిత్యములైన విషయములను అవి వివరిస్తున్నాయి గనుక సిద్ధాంతపరంగా అవి నిత్యములు. అన్వయము, వ్యతిరేకము, అధ్యక్షము మొదలైనవి మాత్రమే ఎక్కడ చూచినా ప్రమాణములకు మూలములుగా ఉన్నాయి. ఏ శాస్త్రము చెప్పినా, ప్రత్యక్ష, అనుమాన ప్రమాణములను బట్టే చెబుతున్నది. 'వెండిని చూస్తున్నాను' అని ఒకరు అనినప్పుడు, అతని అనుభవమే ప్రమాణంగా తీసికొనబడుతున్నది. ఈ విషయంలో, స్వర్ణకారుని వచనమే ప్రమాణమౌతున్నది. అదే ఆగమమౌతున్నది.

కొందరిలో ఈ ఆగమము దృష్టఫలమునివ్వవచ్చు. అంటే, ఆ ఫలితము ఎదురుగా కనిపిస్తూ ఉండవచ్చు. 'ఆకలిగొన్నవాడు భుజిస్తున్నాడు' అన్నట్లుగా ఇది జరుగుతుంది. భుజించడానికి కారణమేమిటి? యన్నపుడు, ఆకలియే అని తేలుతున్నది. ఆకలి కనిపించదు, కానీ భుజించడం కనిపిస్తుంది. కనుక భుజించడాన్ని బట్టి, ఆకలిని ఊహించడం జరుగుతుంది. ఇది అనుమాన ప్రమాణమనబడుతుంది.

చిన్నపిల్లలలో అయితే, ఈ 'ప్రసిద్ధి' యనేది, వారికున్న సహజప్రవృత్తుల ప్రకారము కలుగుతుంది. అన్వయము, వ్యతిరేకము మొదలైన తార్కిక పద్ధతులు వారికి తెలియవు. ప్రకృతి నియమములప్రకారం వారు నడుచుకుంటారు. ఉదాహరణకు, ఆకలి వేసినపుడు ఏడుస్తారు. అంతేగాని, తార్కికంగా ఆలోచించి, 'నాకు ఆకలి వేస్తున్నది గనుక ఏడవాలి. లేదంటే, అమ్మకు నా ఆకలి గురించి తెలియదు' అని ఒక నిశ్చయానికి వచ్చినందువలన వారు ఏడవరు. అంతటి తార్కికశక్తి వారిలో ఉండదు. కానీ, యౌవనావస్థలో తర్కం ఉంటుంది. కానీ ఆ సమయంలో వయసు వేడివల్ల అది పనికిరాదు.

ఈ విధమైన 'ప్రసిద్ధి' లేదా ఆగమమును ప్రమాణముగా తీసుకుని ఏదైనా పనిని చేసినప్పటికీ, కొన్నిసార్లు అది ఒకేఫలమును ఇస్తుంది. మరికొన్నిసార్లు ఆ ఫలితము అనేకవిధములుగా కూడా ఉంటుంది. ఉదాహరణకు, యోగసాధన ద్వారా కలిగే ఫలితములు అనేక విధములుగా ఉండవచ్చు. అవి, విదేహత్వము (దేహపు బంధం నుంచి విముక్తి), ప్రకృతిలయము (ప్రకృతిశక్తులుగా మారిపోవడం), పురుషకైవల్యము (కేవలమైన స్వతంత్రాత్మగా మిగిలిపోవడం) మొదలైన ఫలములవంటివి. కొన్నిసార్లు, ఈ ఫలితం శివునితో సమానమైన స్థితినికూడా ఇవ్వవచ్చు. మరి కొన్నిసార్లు, శివునితో ఏకత్వస్థితిని కూడా ఇవ్వవచ్చు. కనుక, ఈ విధముగా అది, ప్రత్యేకమైన స్థితిగా ఉండవచ్చు, లేదా అనేక ఇతరవిధములుగా కూడా ఉండవచ్చు.

ఈ విధముగా, ఎన్నో విధములైన ఆగమములుగా జగత్తులో ప్రసిద్ధి చెంది ఉన్నపుడు, వాటిని స్వీకరించే మనుష్యులు కూడా, భవిష్యత్తులో తాము ఏది అవుతారో, దానిని మాత్రమే హృదయపూర్వకముగా స్వీకరిస్తారు. దానిని మాత్రమే అనుసరిస్తూ ఉంటారు. వారి విధిని బట్టి వారు ఒక్కొక్క మతమును స్వీకరిస్తారు. కనుక, తర్కముతో కూడిన వాదనను వారికి వినిపించి, అత్యుత్తమమైన మతమును వారిచేత ఒప్పించే ప్రయత్నం ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమున్నది? ఏమీ లేదు. వారి ఎదురుగా కనిపిస్తున్న అనేక ఆగమములనుంచి, వారికి ఉత్తమమని అనిపించిన దానిని మాత్రమే వారు పరమప్రామాణ్యముగా స్వీకరిస్తారు.

ఈ తర్కము వల్ల ఏమి తేలుతున్నది? దేని యొక్క ఫలితము మిగతా అన్నింటికంటే ఉత్కృష్టముగా

ఉన్నదో, ఆ ఆగమమును మాత్రమే ఆశ్రయించడం ఉత్తమమని తెలుతున్నది. మిగతా ఆలోచనల వలన ప్రయోజనం ఏమున్నది? ఏమీ లేదు.

ఊర్ధ్వాగమము

ఆ// తమకు దెలియు రీతి తాత్పర్యమని జెప్పి
సాధుజనులు భువిని జరపుచుంద్రు
సర్వసారమైన సత్యాత్మ నేజెప్పు
శాస్త్రముత్తమంబు సమ్మతింప

ఆ// చూచు చూపు బట్టి జూడనౌ చోద్యమ్ము
తాను జూచినట్లు దనకు దోచు
అన్ని నిండియున్న యద్వయాత్మను దెల్పు
శాస్త్రమందవలయు శరణమనుచు

కేవలమైన పరమేశ్వరస్థితిలో సంవిత్ (జ్ఞానముతో కూడిన వెలుగు) ఏ విధముగా వెలుగుతున్నదో, అదే విధముగా అనుభవజ్ఞానులైన మహనీయులచేత అది అర్థము చేసికొనబడుతున్నది. అంటే, తామున్న స్థితినిబట్టి మానవులు అత్యున్నత సంవిత్ స్థితిని చూస్తున్నారు. కనుక ఉత్తముడై, ఆలోచనాపరుడైన మానవుడు దేనిని ఆశ్రయించాలి? ఈ ఆగమములన్నింటిలో ఉన్న సమస్త భావనలకూ సారమైనట్టి, సర్వాతీతమైన 'చిత్' యొక్క పూర్ణత్వమును బోధిస్తున్న శాస్త్రమునే ఆగమముగా స్వీకరించాలని, ఆశ్రయించాలని, అనుసరించాలని తెలుతున్నది.

'మతములెన్నో మార్గములన్ని' యన్నది శ్రీ రామకృష్ణుల అమృతవాణి. లోకములో ఉన్న మతములు శాస్త్రములు అన్నీ సత్యములే. వారు చూచిన దృష్టిని బట్టి, వారికర్థమైనంతవరకూ అదే అంతిమసత్యమని అందరు మహనీయులూ భావించారు.

జిల్లెళ్ళమూడి అమ్మగారితో ఒకరీ విధంగా అన్నారు.

'ఫలానా ఆయన రామాయణాన్ని చక్కగా ప్రవచించాడు కదమ్మా?'

అమ్మ ఇలా జవాబిచ్చారు.

'అతనికి అర్థమైనట్లు అతను చెప్పాడు'.

అసలేమి జరిగిందో ఎవరికీ తెలియదు. చరిత్రను గాని, పురాణమును గాని, ఇతిహాసమును గాని, ఎవరికర్థమైనట్లుగా వారు వ్యాఖ్యానించుకుంటున్నారు. అంతేగాని సత్యమెవరికీ తెలియదు. అది మనుష్యుల భావములకు అతీతమై, అదే సమయంలో అన్ని భావములలోనూ అంతర్లీనంగా ఉంటూ ఉన్నది. దానిని గ్రహించునదే పరమసత్యము. దానిని ప్రవచించునదే అత్యుత్తమ శాస్త్రము.

ఎవరైనా వారికి అర్థమైనంతవరకే యోచించగలుగుతారు గాని అంతకు మించి చేయలేరు. కనుక లోకంలో ఉన్నవన్నీ పరిమితసత్యములని చెప్పవచ్చు. అన్ని సందేహములనూ సతార్కికముగా తీర్చునది, అన్నిటా నిండియున్న అద్వయాత్మను నిరూపించునది ఏ శాస్త్రమున్నదో అదే అత్యుత్తమమైనది. అదే పరమేశ్వరాద్వయ సిద్ధాంతము. ఇది అన్ని వాదములకూ అతీతమైనది మరియు అన్ని వాదములనూ సమన్వయపరచగలది. కనుక ఇది అన్ని మతములకంటే, శాస్త్రములకంటే ఉత్తమమైనదని ఆచార్యులవారు అంటున్నారు.

లోకంలో విశ్వాసమే అన్నింటికీ పునాది. తమకు ఏ విషయంలో గట్టి విశ్వాసమున్నదో, ఆ వ్యవహారంలో లోకులు ఎటువంటి సందేహమూ లేకుండా ఉంటారు. అదే విధముగా, అన్ని సందేహములూ సంపూర్ణముగా లేకుండా పోయినట్టి స్థితిలో ఉండటం సర్వోన్నతమని తెలుస్తున్నది. అదియే పరమశివస్థితి యని చెప్పబడుతుంది. కనుక దానిని బోధించే ఆగమమే అత్యుత్తమమైనది.

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే ఆగమప్రామాణ్య ప్రకాశనం నామ ఏకవింశమాహ్నికమ్ ‖ 21 ‖

ఇది శ్రీమదభినవగుప్తాచార్యులచే రచింపబడిన తన్త్రసారమనే గ్రంథములోని ఆగమప్రామాణ్య ప్రకాశనమనే ఇరవైయొకటవ ఆహ్నికము.

ఇరువది రెండవ ఆహ్నికము

కులయాగ ప్రకాశనము

యదార్థః - యదార్థము

అథ సమస్తా ఇయమ్ ఉపాసా సమున్మిషత్తాదృశదృఢవాసనారూఢాన్ అధికారిణః ప్రతి శ్రీమత్కౌలికప్రక్రియయా నిరూయతే, తత్ర ఉక్తం యోగసంచారాదౌ

'ఆనన్దం బ్రహ్మ తద్దేహే త్రిధౌష్ఠ్యాన్త్యవ్యవస్థితమ్ |
అబ్రహ్మచారిణస్తస్య త్యాగాదానన్దవర్జితాః ||

ఆనన్దకృత్రిమాహారవర్జం చక్రస్య యాజకాః |
ద్వయేఽపి నరకే ఘోరే తస్మాదేనాం స్థితిం భజేత్ ||'

ఎవరిలో ఈ సమస్తమునూ ఉపాసించవలయునన్న సంపూర్ణమైన ఇచ్ఛ ఉదయిస్తున్నదో దృఢమైన వాసన కలుగుచున్నదో అట్టి అధికారికి శ్రీమత్కౌలిక ప్రక్రియను నిరూపిస్తున్నాను. ఈ విషయమున యోగసంచారాది గ్రంథములలో ఇట్లు చెప్పబడి యున్నది.

"బ్రహ్మము ఆనందస్వరూపము. అది దేహములో, మూడు ఓష్ఠ్యవర్ణముల అంత్యములలో వ్యవస్థితమై ఉన్నది. బ్రహ్మచారి కానివాడు దీనిని త్యజించి, ఆనందమును కోల్పోవుచున్నాడు. ఆనందమును కృత్రిమాహారమని వర్జించి అతడు చక్రయాగమున నిమగ్నుడౌతాడు. ఈ రెండు కారణములవల్ల అట్టివాడికి ఘోరమైన నరకములో స్థితి కలుగుతుంది".

తదనయా స్థిత్యా కులయాగః, సచ షోఢా - బాహ్యే శక్తౌ స్వదేహే యామలే ప్రాణే సంవిది చ ఇతి | తత్ర చ ఉత్తర ఉత్తర ఉత్కృష్టః, పూర్వః పూర్వస్తద్రుచ్యర్థమ్ | సిద్ధికామస్య ద్వితీయతుర్యపఞ్చమాః సర్వథా నిర్వర్త్యాః, షష్ఠస్తు ముముక్షోః ముఖ్యః, తస్యాపి ద్వితీయాద్యా నైమిత్తికే యథాసంభవమ్ అనుష్ఠేయా ఏవ విధిపూరణార్థం చ |

ఈ విధముగా చేయుటవలన కులయాగమౌతుంది. అది ఆరు విధములు. బాహ్యమునందు, శక్తులలో, స్వదేహములో, యామలములో, ప్రాణములో, సంవిత్ లో. వానిలో ఉత్తరోత్తరము ఉత్కృష్టము. ముందటివి తరువాత వాటికి దారితీస్తాయి. సిద్ధికామునకు ద్వితీయము, తుర్యము, పంచమములు సర్వథా నిర్వర్తించదగినవి. ఆరవది ముముక్షువులకు ముఖ్యమైనది. అతనికి కూడా ద్వితీయము మొదలైన నైమిత్తికములు యథావిధిగా విధిపూర్వకములుగా అనుష్ఠేయములు.

తత్ర బాహ్యం స్థణ్డిలమ్, ఆనన్దపూర్ణం వీరపాత్రం, అరుణః పటః, పూర్వోక్తమపి వా లిఙ్గాది | తత్ర స్నానాదికర్తవ్యానపేక్షయైవ పూర్ణానన్దవిశ్రాన్త్యైవ లబ్ధశుద్ధిః ప్రథమం ప్రాణసంవిద్దేహైకీభావం భావయిత్వా సంవిదశ్చ పరమశివరూపత్వాత్ సప్తవింశతివారం మన్త్రమ్ ఉచ్చార్య మూర్ధ-వక్త్ర-హృద్గుహ్య-మూర్తిషు అనులోమవిలోమాభ్యాం విశ్వాధ్వపరిపూర్ణతా పరమేశ్వరే అపరత్వే పరాపరత్వే పరత్వేఽపి చ | తథాహి -

మాయా-పుం-ప్రకృతి-గుణ-ధీ-ప్రభృతి ధరాన్తం సప్తవింశతితత్త్వాని - కలాదీనాం తత్రైవ అన్తర్భావాత్, విద్యాశక్త్యావపి పరాపరత్వే బ్రహ్మపఞ్చకస్య సద్యస్త్వాజాతత్వభవోద్భవత్వాదీనాం ధర్మాణాం సప్తవింశతిరూపత్వమేవ ఉక్తం శ్రీమల్లకులేశాదిపాదైః।

దీనిలో బాహ్యమునందు, స్థణ్డిలము, ఆనన్దపూర్ణమైన వీరపాత్ర, ఎర్రని వస్త్రము, పూర్వోక్తమైన లింగము మొదలైనవి ఉంటాయి. స్నానాదికర్తవ్యములను చేయకుండా కూడా, పూర్ణానన్ద విశ్రాంతితోనే శుద్ధి అవుతుంది. ప్రథమముగా, ప్రాణ, సంవిత్, దేహముల ఐక్యభావమును భావించి సంవిద్రూపియైన పరమశివరూపముతో ఇరువది ఏడు మార్లు మంత్రమును జపించి మూర్ధము, వక్త్రము, హృదయము, గుహ్యములలో అనులోమ, విలోమములుగా న్యాసము చేయగా పరమేశ్వరునియొక్క అపర, పరాపర, పరత్వములలో విశ్వాధ్వ పరిపూర్ణత కలుగుతుంది. దానిలో కూడా మాయ, పురుషుడు, ప్రకృతి, గుణములు, బుద్ధి మొదలుకొని ధర వరకు ఇరువది ఏడు తత్త్వములు, వానిలో అంతర్భావములై కళాదులున్నాయి. విద్యాశక్తులతో కలిపి పరాపరత్వమౌతుంది. ఏలాగనగా, సద్యోజాత, భవోద్భవాది బ్రహ్మపంచకములో, ఇరువది ఏడు ధర్మములున్నట్లుగా శ్రీమత్ లకులేశాచార్యులవారు చెప్పినారు.

పరత్వేఽపి పఞ్చశక్తిః హి పరమేశ్వరః, ప్రతిశక్తి చ పఞ్చరూపతా, ఏవం పఞ్చవింశతిః శక్తయః, తాశ్చ అన్యోన్యమ్ అనుద్భిన్నవిభాగా ఇత్యేకా శక్తిః, సా చానుద్భిన్నవిభాగా - ఇత్యేవం సప్తవింశతిరూపయా వ్యాప్త్యా సంవిదగ్నేః శిఖాం బుద్ధిప్రాణరూపాం సకృదుచ్చారమాత్రేణైవ బద్ధాం కుర్యాత్ - యేన పరమశివ ఏవ ప్రతిబద్ధా తద్వ్యతిరిక్తం న కించిదభిభావతి,

పరత్వమున కూడా పరమేశ్వరుడు అయిదు రూపములలో ఉన్నాడు. ప్రత్యేకశక్తులు అయిదు విధములుగా ఉన్నాయి. ఈ విధముగా ఇరువది అయిదు శక్తులౌతాయి. ఇవన్నియు భిన్నములు కాకుండా అన్యోన్యముగా ఉండటము, మొత్తము కలసి ఒకటే అవడము, ఈ విధముగా రెండు స్థితులౌతాయి. ఈ విధముగా ఇరువది ఏడు రూపములలో వ్యాపిస్తున్న సంవిదగ్నిని, బుద్ధి, ప్రాణరూపమైనదానిని, ఒకసారి ఉచ్చరించుచూ శిఖలో బంధించగా, దానితో పరమశివుడే బంధింపబడుచున్నాడు. దానికి వ్యతిరేకముగా కొంచము కూడా సంభవము కాదు.

తథావిధబుద్ధ్యధిష్ఠితకరణచక్రానువేధేన పురోవర్తినో యాగద్రవ్యగృహదిగాధారాదీనపి తన్మయీభూతాన్ కుర్యాత్, తతోఽర్ఘపాత్రమపి శిఖాబన్ధవ్యాప్త్యైవ పూరయేత్ పూజయేచ్చ, తద్విప్రుడ్భిః అథాణ్డేలాన్యపి తద్రసేన వామానామాఙ్గుష్ఠయోగాత్ దేహచక్రేషు మన్త్రచక్రం పూజయేత్ తర్పయేత్ చ, తతః ప్రాణాస్త్రః, తతః స్థణ్డిలే త్రిశూలాత్మకం శక్తిత్రయాన్తమాసనం కల్పయేత్, మాయాన్తం హి సార్ణే ఔకారే చ శక్తిత్రయాన్తమాసనం కల్పయేత్, మాయాన్తం హి సార్ణే ఔకారే చ శక్తిత్రయాన్తం తదుపరి యాజ్యా విమర్శరూపా శక్తిః - ఇత్యేవం సకృదుచ్చారేణైవ ఆధారధేయన్యాసం కృత్వా తత్రైవ ఆధేయభూతాయామపి సంవిధి విశ్వం పశ్యేత్, తదపి చ సంవిన్మయమ్ - ఇత్యేవం విశ్వస్య సంవిదా తేన చ తస్యాః సంపుటీభావో భవతి, సంవిద ఉదితం తత్రైవ పర్యవసితం యతో విశ్వం, వేద్యాచ్చ సంవిత్ ఉదేతి తత్రైవ చ విశ్రామ్యతి - ఇతి ఏతావత్త్వం సంవిత్తత్త్వం సంపుటీభావద్వయాత్ లభ్యతే। తదుక్తమ్ 'సృష్టిం తు సంపుటీకృత్య..................।' ఇతి। తతో గన్ధధూపాసవకుసుమాదీన్ ఆత్మప్రహ్వీభావాన్తాన్ అర్పయిత్వా స్వవిశ్రాన్త్యా జప్త్వా ఉపసంహృత్య జలే నిక్షిపేత్। ఇతి బాహ్యయాగః।

ఈ విధముగా బుద్ధ్యధిష్ఠిత కరణచక్రమును అనువేధ చెయ్యడం ద్వారా అక్కడున్నట్టి యాగద్రవ్య, గృహ, దిశ, ఆధారములను తన్మయీభూతములుగా చేయవలయును. అప్పుడు అర్ఘపాత్రను కూడా, శిఖాబన్ధన క్రియద్వారా పూరించి పూజించవలెను. దాని కొన్ని బిందువుల ద్వారా స్థణ్డిలమును, దాని రసమును ఎడమచేతి అనామిక, అంగుష్ఠములతో తీసుకుని, దేహచక్రములలోని మన్త్రచక్రమును పూజించి తర్పించాలి. తదుపరి ప్రాణాంతమునందు. అప్పుడు స్థణ్డిలమున త్రిశూలాత్మకమై, శక్తిత్రయాత్మకమైన ఆసనమును కల్పించాలి. సవర్ణము మాయాన్తముగా, ఔకారము శక్తిత్రయాంతముగా, దానిపైన విమర్శరూపిణిగా శక్తిని యజనము చేయాలి. ఈ విధముగా చక్కగా మంత్రోచ్చారణ చేస్తూ ఆధార-ఆధేయ న్యాసమును చేయాలి. అచ్చట ఆధేయభూతమైన సంవిత్ లో విశ్వమును చూడాలి. అది కూడా సంవిన్మయమే. ఈ విధముగా విశ్వమునకు సంవిత్ తోను, సంవిత్ కు విశ్వముతోను, సంపుటీభావమౌతుంది. విశ్వము సంవిత్ నుండి ఉదయిస్తుంది, సంవిత్ లోనే పర్యవసిస్తుంది. వేద్యము కూడా సంవిత్ నుండి ఉదయిస్తుంది, దానిలోనే విశ్రమిస్తుంది. ఈ విధముగా సంవిత్తత్త్వమనేది సంపుటీభావద్వయము వలన లభిస్తుంది. కనుక ఈ విధముగా చెప్పబడినది, 'సృష్టిం తు సంపుటీకృత్య................'.

దానిలో గన్ధ, ధూప, ఆసవ, కుసుమాదులను ఆత్మసమర్పణ వరకూ అర్పించి, ఆత్మవిశ్రాంతిని జపించి, ఉపసంహారణము తరువాత జలములో నిక్షేపించాలి. ఇది బాహ్యయాగము.

అథ శక్తౌ, తత్ర అన్యోన్యం శక్తితాలాసావీరాణామ్ - ఉభయేషామ్ ఉభయాత్మకత్వేన ప్రోల్లాసప్రారమ్భసృష్ట్యన్తశివశక్తిప్రబోధే పరస్పరం వ్యాపారాత్, పరమేశనియత్యా చ శుద్ధరూపతయా తత్ర ప్రాధాన్యమ్, ఏతేన చ విశిష్టచక్రస్యాపి శక్తిత్వం వ్యాఖ్యాతమ్, తత్ర శిఖాబన్ధవ్యాప్త్యైవ పూజనం శక్తిత్రయాన్తమాసనం కోణత్రయే మధ్యే విసర్గశక్తిః ఇతి తు వ్యాప్తౌ విశేషః। ఏవం స్వదేహే తత్రైవ చక్రే తతో బ్రహ్మరన్ధ్రాద్యనుచక్రేషు।

ఇప్పుడు శక్తియాగము. ఇద్దరిలోనూ ఇద్దరూ ఉన్నారు గనుక, శక్తి-వీరులిద్దరూ అన్యోన్యరూపములను దాల్చవలెను. ప్రోల్లాసము, ప్రారమ్భము, సృష్టి ఈ మూడింటిలోనూ శివశక్తుల ప్రబోధము పరస్పరము జరుగవలెను. పరమేశ్వరునకు గల నియతిశక్తి ద్వారా, శుద్ధరూపమే ఇచ్చట ప్రధానమైనది. దీనివల్ల విశిష్టచక్రములో కూడా శక్తిత్వమే వ్యాఖ్యాతమగుచున్నది. అక్కడ, శిఖాబన్ధవ్యాప్తి ద్వారా పూజనము, శక్తిత్రయాన్తమైన ఆసనము, కోణత్రయ మధ్యమున విసర్గశక్తి, ఈ విధముగా భావించవలెను. ఇదే విధముగా స్వదేహమున, దాని చక్రములలో, ఆపైన బ్రహ్మరంధ్రము నుండి అనుచక్రముల వరకు.

అథ యామలే

శక్తేర్లక్షణమేతత్ తద్వదభేదస్తతోఽనపేక్ష్య వయః।
జాత్యాదీంశ్చాసజ్గాత్ లోకేతరయుగలజం హి తాదాత్మ్యమ్॥

ఇప్పుడు యామలము. దేనితో అభేదమౌతుందో అదే శక్తి. వయసు, జాతి మొదలైనవి పట్టించుకోకుండా, లౌకికేతరమైన కలయికయే తాదాత్మ్యతగా భావించాలి.

కార్యహేతుసహోత్థత్వాత్తైథం సాక్షాదథాన్యథా।

ఖంస్థావతో మిథోఽభ్యర్చ్యా తర్ప్యాసన్దానికత్వతః ॥

కార్యము, హేతువు, సహోత్థములుగా శక్తులు మూడు విధములు. అన్యధా కూడా ఉన్నవి. అర్చనము, తర్పణములు ఇరువురకు జరిగినప్పుడే ఆనందముదయిస్తుంది.

చక్రమర్చేత్తదౌచిత్యాదనుచక్రం తథానుగమ్ ।
బహిః పుష్పాదినాన్తశ్చ గన్ధభుక్త్యాసవాదిభిః ॥

చక్రములనర్చించి, ఉచితరీతిని అనుచక్రములను కూడా అర్చించవలయును. బయట పుష్పములు మొదలైన వాటితోను, లోపల గంధము, భోజనము, ఆసవముల ద్వారాను జరుపవలెను.

ఏవమానన్దసన్దోహితత్తచ్చేష్టోచ్ఛలత్స్మితిః ।
అనుచక్రగణశ్చతాదాత్మ్యాదభిలీయతే ॥

ఈ విధముగా, ఆనందసందోహితములైన చేష్టల చలనములతో అనుచక్రములకు తాదాత్మ్యత లభిస్తుంది.

నిజనిజభోగాభోగ-ప్రవికాసమయస్వరూపపరిమర్శే ।
క్రమశోఽనుచక్రదేవ్యః సంవిచ్చక్రం హి మధ్యమం యాన్తి ॥

తమతమ భోగాభోగముల వికాసమయమైన స్వరూపము గోచరమైనప్పుడు క్రమముగా అనుచక్రముల మధ్యలో కూడా సంవిత్ చక్రమే భాసిస్తుంది.

అనుచక్రదేవతాత్మక-మరీచిగణ పూరణాధిగతవీర్యమ్ ।
తచ్చక్రితద్వదాత్మక-మన్యోన్యసమున్ముఖం భవతి ॥

అనుచక్ర దేవతాత్మకమైన తేజోగుణముల పూరణము వలన కలిగిన శక్తితో, శక్తి శక్తిమంతులకు, అన్యోన్య ఉన్ముఖం కలుగుతుంది.

తద్యుగలమూర్ధ్వధామ-ప్రవేశసస్పన్దజాత సంక్షోభమ్ ।
క్షుభ్నాత్యనుచక్రాణ్యపి తాని తదా తన్మయాని న పృథక్తు ॥

ఆ యుగళము, ఊర్ధ్వధామమునకు ప్రవేశించే స్పందనములో పుట్టిన సంక్షోభము, అనుచక్రములను కూడా క్షోభకు గురిచేస్తుంది. అవికూడా తన్మయములౌతాయి.

ఇత్థం యామలమేతద్ గలితభిదాసంకథం యదైవ తదా ।
క్రమతారతమ్యయోగాత్ సైవ హి సంవిద్విసర్గసంఘట్టః ॥

తారతమ్యయోగమును బట్టి అన్ని భేదములు కూలిపోవగా, యామళభావమేదైతే కలుగుతున్నదో, అది సంవిత్ - విమర్శరూపమైన సంఘట్టమౌతుంది.

తద్ధ్రువధామానుత్తర-ముభయాత్మకజగదుదారమానన్దమ్ ।
నో శాన్తం నాప్యుదితం శాన్తోదితసూతికారణం పరం కౌలమ్ ॥

అదే ఉభయాత్మకమైన అనుత్తరమైన ధ్రువధామలోకము. ఉదార ఆనందము. అది శాంతమూ కాదు, ఉదితమూ కాదు. శాంతోదిత ప్రసూతి కారణము, పరమము అయిన కౌలము.

అనవచ్ఛిన్నపదేప్సుస్తాం సంవిదమాత్మసాత్కుర్యాత్ |
శాన్తోదితాత్మకద్వయ-మథ యుగపదుదేతి శక్తిశక్తిమతోః ||

అనవచ్ఛిన్నపదమును పొందగోరువారు ఈ సంవిత్ ను సాక్షాత్కరించుకోవాలి. దీనిఫలితముగా శక్తి శక్తిమంతులలో శాంతము, ఉదితము, యుగళము ఈ మూడును ఉదయిస్తాయి.

స్వాత్మాన్యోన్యావేశాత్ శాన్తాన్యత్వే ద్వయోర్ద్వయాత్మత్వాత్ |
శక్తిస్తు తద్వదుదితాం సృష్టిం పుష్ణాతి నో తద్వాన్ ||

ఇరువురిలో స్వాత్మావేశము వల్లను, అన్యోన్యావేశము వల్లను, శాంతము తప్ప ఇతరములు లేనందువల్లను, ఒకరిలో మరియొకరు లీనమైనందువల్లనూ ఇది జరుగుతుంది. కానీ, సృష్టిని శక్తి పోషిస్తున్నదిగాని శక్తిమంతుడు కాదు.

తస్యాం చార్యం కులమథ తయా సృష్ఠ ప్రోక్తయోగసంఘట్టాత్ |
అథ సృష్టే ద్వితయేఽస్మిన్ శాన్తోదితధామ్ని యేఽనుసందధతే ||

ప్రాచ్యాం విసర్గసత్తా-మనవచ్ఛిదితే పదే రూఢాః |
ఉదితం చ మిథో వక్త్రాత్ ముఖ్యాద్వక్త్రే ప్రగృహ్యతే చ బహిః ||

కుల, సంయోగరూపమైన ఈ జ్ఞానము ఆచార్యునిద్వారా, నరులకు బోధింపబడాలి. ప్రాచీనమై, విసర్గాత్మకమై, అనవచ్ఛిన్నపదరూఢమైన శాంతోదిత ధామములను ధ్యానిస్తున్న ఇరువురి ముఖములనుండి ఉదయించిన వర్ణములను ముఖ్యవక్త్రములో బయటకు సేకరించాలి.

తృప్తం దేవీచక్రం సిద్ధిజ్ఞానాపవర్గదం భవతి |
శాన్తాభ్యాసే శాన్తం శివమేతి యదత్ర దేవతాచక్రమ్ ||

తృప్తమైన దేవీచక్రము సిద్ధిని, జ్ఞానమును, మోక్షమును కలిగిస్తుంది. శాంతాభ్యాసముతో శాంతము, శివమునైన స్థితిని దేవతాచక్రము కలిగిస్తుంది.

శూన్యం నిరానన్దమయం నిర్వృతినిజధామతోఽర్ధం చ |
రణరణ కర సాన్నిజరస-భరిత బహిర్భావచర్వణరసేన ||

అది శూన్యము, నిరానందమయము, నిర్వృతిరూపమైన నిజధామమును ఉదయింప జేస్తుంది. అప్పుడు, కరణములన్నింటిని నిజరసములో కలిపి బహిర్భావమును మళ్ళీ కలిగిస్తుంది.

ఆన్తరపూర్ణసముచ్ఛల-దనుచక్రం యాతి చక్రమథ తదపి |
ఉచ్ఛలతి ప్రాగ్వదితి త్రివిధోఽన్వర్థో విసర్గోఽయమ్ |

లోలోపల ఉదయించిన పూర్ణత్వము ననుసరించి అనుచక్రములు కూడా చలిస్తాయి. ఈ విసర్గము

ఇంతకు ముందు చెప్పబడినట్లుగా మూడు విధములుగా ఉంటుంది.

ఏతాద్విసర్గధామని పరిమర్శనతస్త్రిధైవ మనువీర్యమ్ |
తత్తత్సంవిద్గర్భే మన్త్రస్తత్తత్ఫలం సూతే ||

ఈ మూడువిధములుగా ఉన్న విసర్గస్థితిలో కుదురుకుని, పరిమర్శన గావించడం వలన శక్తిని పొందిన మంత్రములకు ఆయా సంవిద్గర్భములలో, ఆయా ఫలములుదయిస్తాయి.

కోణత్రయాన్తరాశ్రిత-నిత్యోదితమఙ్గలచ్ఛదే కమలే |
నిత్యావియుతం నాలం షోడశదలకమలసన్మూలమ్ ||

మధ్యస్థనాలగుమ్ఫిత-సరోజయుగఘట్టనక్రమాదగ్నౌ |
మధ్యస్థపూర్ణశశధర-సున్దరదినకరకరౌఘసంఘట్టాత్ ||

త్రిదలారుణవీర్యకలా-సఙ్గాన్మధ్యేఽఙ్కురస్సృష్టిః |
ఇతి శశధరవాసరపతి-చిత్రగుసంఘట్టముద్రయా ఝటితి ||

కోణత్రయము లోలోపల ఉండి, నిత్యమూ ఉదయించుచున్న మంగళస్వరూపమైన కమలంలో, నిత్యలతో కూడిన నాళము, పదునారు దళముల కమలమూలము వరకూ ఉన్నది. మధ్యలోనున్న నాళమునకు పూచిన రెండు పూవుల రాపిడివలన పుట్టిన అగ్నిమధ్యములో నిండుచంద్రుడు, బంగారు సుందర సూర్యుల కిరణముల కలయికతో, మూడు దళముల శోణితము మరియు వీర్యకళల కలయికతో వాటి మధ్యలో అంకురసృష్టి జరుగుతుంది. ఇది చంద్ర, సూర్య, అగ్నుల సమిష్టిముద్రతో జరుగుతుంది.

సృష్ట్యాదిక్రమమన్తః-కుర్వంస్తుర్యే స్థితిం లభతే |
ఏతత్ఖేచరముద్రా-వేశేఽన్యోన్యం స్వశక్తిశక్తిమతోః ||

పానోపభోగలీలా-హాసాదిషు యో భవేద్విమర్శమయః |
అవ్యక్తధ్వనిరావ-స్ఫోటశ్రుతినాదనాదాన్తైః ||

అప్పుడు సృష్టి మొదటినుండి, చివరివరకూ లోలోపల ధ్యానించగా తురీయస్థితి లభిస్తుంది. ఈ విధమైన ఖేచరముద్రావేశులైన శక్తి, శక్తిమతులు అన్యోన్యులైనప్పుడు వారికి, పానీయము, ఉపభోగము, లీల, హాస్యము మొదలైన ఏ ఏ విమర్శలు కలుగుతాయో, అవి, అవ్యక్తధ్వని, రావము, స్ఫోటము, శృతి, నాదము, నాదాంతములై, తెంపులేని అనాహతనాద పరమార్థమంత్రము యొక్క శక్తితో భాసిస్తాయి.

అవ్యుచ్ఛిన్నానాహత-పరమార్థైర్మన్త్రవీర్యం తత్ |
గమనాగమవిశ్రాన్తిషు కర్ణే నయనే ద్విలక్ష్యసంపర్కే ||

తత్సంమీలనయోగే దేహాన్తాఖ్యే చ యామలే చక్రే |
కుచమధ్యహృదయదేశా-దోష్ఠాన్తే కణ్ఠగం యదవ్యక్తమ్ ||

తచ్చక్రమధ్యయమధ్యగ-మాకర్ణ్య క్షోభవిగమసమయే యత్ |

నిర్వాన్తి తత్ర చైవం యో౽ష్టవిధో నాదభైరవః పరమః ||

జ్యోతిర్ధ్వనిశ్చ యస్మాత్ సా మాన్త్రీ వ్యాప్తిరుచ్యతే పరమా |

శ్వాసప్రశ్వాసల మధ్యలో, చెవులలో, చూపులలో, లింగయోనుల స్పర్శలో, వాని మేళనములో, దేహాంతమునందున్న యామలచక్రములో, స్తనముల మధ్యన హృదయప్రదేశము నుండి గొంతుద్వారా పెదవుల చివర్లవరకు ఏ అవ్యక్తధ్వని యున్నదో, ఈ రెండు చక్రముల మధ్యలోను, క్షోభ యొక్క విశ్రాంతి సమయమున వినగా, అష్టవిధములైన నాదములు భైరవరూపములై వినవస్తాయి. జ్యోతి, నాదములు ఎక్కడ గోచరిస్తాయో అక్కడనే, పరమమంత్రము యొక్క వ్యాప్తి కూడా అవుతుంది.

ఏవం కర్మణి కర్మణి విదుషః స్యాజ్జీవతో ముక్తిః |
తజ్జ్ఞః శాస్త్రే ముక్తః పరకులవిజ్ఞానభాజనం గర్భః ||

ఈ విధముగా అన్ని కర్మలలో కూడా చేయగలిగిన విద్వాంసునికి జీవించియుండగానే ముక్తి లభిస్తుంది. దీనినెరిగినవాడు శాస్త్రముల నుండి ముక్తుడౌతున్నాడు. ఇట్టి కలయికతో కలిగిన గర్భము, పరకుల విజ్ఞానమును కలిగిస్తుంది.

శూన్యాశూన్యాలయం కుర్యాదేకదణ్డే౽నలానిలౌ |
శూలం సమరసీకృత్య రసే రసమివ స్థితమ్ ||

త్యక్తాశఙ్కో నిరాచారో నాహమస్మీతి భావయన్ |
దేహస్థా దేవతాః పశ్యన్ హ్లాదోద్వేగాది చిద్ఘనే ||

శూన్యము అశూన్యముల ఆలయమైన ఏకదణ్డములో అనలము, అనిలములను శూలముతో సమరసము చేసి రసములో రసమువలె ఉండగా, శంకలను వీడి, ఆచారమును వీడి, 'నేను లేను' అని భావిస్తూ, దేహంలో ఉన్న దేవతలను వీక్షిస్తూ ఆనందము, ఉద్వేగములతో కూడిన ఘనమైన చిత్ లో ఉండాలి.

కర్ణాక్షిముఖనాసాదిచక్రస్థం దేవతాగణమ్ |
గ్రహీతారం సదా పశ్యన్ ఖేచర్యా సిధ్యతి ధ్రువమ్ ||

చెవులు, కన్నులు, ముఖము, ముక్కు మొదలైన చక్రములలో ఉండి సర్వమునూ స్వీకరిస్తున్న దేవతా గణములను ఎల్లప్పుడూ చూస్తుంటే ఖేచరి తప్పకుండా సిద్ధిస్తుంది.

శ్వభ్రే సుదూరే ఝటితి స్వదేహంసంపాతయన్వాసమసాహసేన |
ఆకుఞ్చ్య హస్తద్వితయం ప్రపశ్యన్ ముద్రామిమాం వ్యోమచరీం భజేత్ ||

ఇత్యేష యామలయాగః |

అప్పుడు, సుదూరంలో ఉన్న ఆకాశంలోకి దేహమును అమాంతముగా లేపుతాడు. అక్కడనుంచి సాహసంతో క్రిందకు పడుతూ, రెండు చేతులను దగ్గరకు చేర్చి చూచే వ్యోమచరీ ముద్రను భజిస్తాడు. యామలయాగము ఈ విధముగా ఉంటుంది.

ఉక్తవ్యాప్తికే ప్రాణే విశ్వమయే ప్రోక్తసంవిద్వ్యాప్త్యా తర్పణాన్నగన్ధధూపాదిసమర్పణేన ఉపోద్బలనం ప్రాణయాగః / విశ్రాన్తిరూఢిస్తు సంవిద్యాగః ప్రాగేవ నిరూపితః / ఏవమ్ ఏతేభ్యో యాగేభ్యోఽన్యతమం కృత్వా యది తథావిధ నిర్విచికిత్సతా పవిత్రితహృదయః శిష్యో భవతి తదా తస్మై తద్యాగ దర్శనపూర్వకం తిలాజ్యాహుతిపూర్వకనిరపేక్షమేవ పూర్వోక్తవ్యాప్త్యా అనుసంధానక్రమేణ అవలోకనయా దీక్షాం కుర్యాత్, పరోక్షదీక్షాదికే నైమిత్తికాన్తే తు పూర్వ ఏవ విధిః - కేవలమ్ ఏతద్యాగప్రధానతయా ఇతి / గురుశరీరే సప్తమః కులయాగః సర్వోత్తమః, సోఽపి ప్రాగ్యాగసాహిత్యేన సకృదేవ కృతః సర్వం పూరయతి ఇతి శివమ్ ||

ఇంతకుముందు చెప్పబడిన విశ్వమయమైన ప్రాణమును, చెప్పబడిన రీతిలో సంవిత్ వ్యాప్తితో తర్పణ, నైవేద్య, గంధ, ధూపాది సమర్పణముతో బలవంతమును చేయుట ప్రాణయాగము. దానిలో కుదురైన విశ్రాంతి లభిస్తే అది సంవిద్యాగము. ముందే చెప్పబడినది.

ఈ విధముగా ఎవరైనా ఇతరయాగమును దాటినపుడు, అతడు సంశయము లేకుండా పవిత్రహృదయుడైన శిష్యుడౌతాడు. అప్పుడతనిని తిలకించి, నువ్వులు నెయ్యి మొదలైన ఆహుతుల అవసరం లేకుండానే, ఇంతకుముందు చెప్పబడిన అనుసంధాన న్యాసరీతిలో, చూపుతోనే దీక్షనివ్వాలి. నైమిత్తికాన్తము వరకు ఉన్నట్టి పరోక్షదీక్షలలో ఇంతకుముందు వలెనె చేయవలెను. కేవలము యాగమే ప్రధానము. గురుశరీరమున సప్తమ కులయాగము సర్వోత్తమమైనది. అది కూడా ఇంతకు ముందు చెప్పబడినట్టి యాగసహితమైతే, చక్కగా చేయబడినదై, సర్వమును పరిపూర్ణము గావిస్తుంది.

వ్యాఖ్యానము

ఇప్పటివరకూ చెప్పబడిన విధులను సమస్తమునూ ఉపాసించాలనే సంపూర్ణమైన నిష్ఠాపూర్వకమైన శ్రద్ధ కొందరిలో ఉదయిస్తుంది. విషయమును తెలిసికొనడం మాత్రమే గాక, సాధనయందు కూడా అట్టివారికి దృఢమైన అభిరుచి కలుగుతుంది. అట్టి అధికారికి శ్రీమత్కౌలిక ప్రక్రియను నిరూపిస్తున్నానని ఆచార్యులవారు అంటున్నారు. కౌలిక ప్రక్రియ అంటే, కౌలాచారపరమైన సాధనావిధానమని అర్థము. ఈ విషయమును గురించి 'యోగసంచారము' మొదలైన పూర్వగ్రంథములలో ఇట్లు చెప్పబడి యున్నది.

కౌలమత సారము

బ్రహ్మము ఆనందస్వరూపమై ఉన్నది. అది దేహములోనే నెలకొని యున్నది. ఈ భావన, వేదాంతభావనకు విరుద్ధమైనది. నశించిపోయే దేహములో బ్రహ్మానందం లేదని, అది కేవలం సచ్చిదానందస్థితిలో మాత్రమే ఉంటుందని వేదాంతశాస్త్రములంటాయి. కౌలాచారము దీనికి విరుద్ధమైన భావనను ప్రతిపాదిస్తుంది. బ్రహ్మము యొక్క ఆనందపు ఛాయ, దేహంలో కూడా ఉన్నదని అదంటుంది. వేదవేదాంతముల భావనలతో కౌలము, వామాచారము మొదలైన తంత్రములు ఇక్కడనే విభేదిస్తాయి.

సత్యమేమంటే, అతి నిమ్నమైన భౌతికస్థాయిలో కూడా బ్రహ్మము యొక్క ఆనందపు ఛాయ తప్పకుండా ఆధారమై ఉంటుంది. అది లేనప్పుడు, భౌతికము నిలబడలేదు. కానీ, తనయొక్క అత్యున్నతమైన స్థాయిలో అది భౌతికములో ఉండదు. దీనిద్వారా దానినందుకునే ప్రయత్నాన్ని కౌలాచారులు చేస్తారు. దీనిని వదలిపెట్టి,

తద్వారా పోగుపడిన శక్తిని ఇంధనంగా చేసుకుని పై స్థాయిలను అందుకోవాలని మిగిలిన ఆచారములు ప్రయత్నిస్తాయి. ఉచ్చమునూ, నీచమునూ సమానముగా బ్రహ్మానందంతో నింపాలని, సాధనలో అదే పరమావధియని మరికొన్ని సాంప్రదాయములు చెబుతాయి.

ఓష్ఠ్యవర్ణములంటే, పెదవులతో పలుకబడే వర్ణములు. అవి, ప, ఫ, బ, భ, మ లు. ఇవి క్లుప్తముగా ప, బ, మ లౌతాయి. ఆ మూడు వర్ణముల అంత్యములలో ఆనందస్వరూపమైన బ్రహ్మము వ్యవస్థితమై ఉన్నది. అంటే, మకారములో నని, ఇంకా ప్రత్యేకముగా, 'పంచమకారము' లని అర్థము. అవి, మద్య, మాంస, మత్స్య, ముద్రా, మైథునములు. బ్రహ్మచారి కానివాడు వీటిని వదలిపెట్టి, తద్వారా కలిగే ఆనందమును కోల్పోతున్నాడు. ఆచారపరులచేత ఒప్పుకొనబడిన నిర్వచనములకు భిన్నమైన భావనను ఈ గ్రంథము చెప్పినట్లు గోచరిస్తుంది. బ్రహ్మచారి యైనవాడు, పంచ మకారములకు దూరంగా ఉండాలని సదాచారం అంటుంది. కానీ కౌలాచారం ప్రకారం, వీటిని స్వీకరించి ఆచరించేవాడే బ్రహ్మచారి. వీటికి దూరంగా ఉండేవాడు బ్రహ్మచారి కాడంటుంది కౌలాచారం. మద్య, మత్స్య, మాంసములు కృత్రిమాహారమని అతడు భావించి, వాటిని వదలిపెట్టి, ఈ ఆనందమును కోల్పోతాడని అంటుంది. అదే విధముగా, వీటిని ఉపయోగించకుండా చేసే చక్రయాగమును అతడు చేస్తాడని, దీనివల్ల ఉపయోగం లేదని కౌలాచారం చెబుతుంది. వీటిని దూరంగా ఉంచడం వల్లా, ఇవి లేకుండా చక్రయాగం చేయడం వల్లా, అతడు ఘోరమైన నరకములో పడతాడట. ఇది కౌలాచార నిర్ణయము.

ఆరు కులయాగములు

ఈ విధముగా పంచమకార సహితముగా సాధనను చేయడం కులయాగమౌతుంది. అది ఆరు విధములుగా ఉంటుంది. అవి,

1. బాహ్యమునందు: అంటే, హోమము, పూజ, తర్పణము మొదలైన బాహ్యక్రియలయందు.

2. శక్తిలో: స్త్రీ యొక్క దేహభాగములను శక్తి స్వరూపములుగా పూజించడం.

3. స్వదేహములో: తన దేహములో ఉన్నట్టి అధ్వములలో

4. యామలము: శక్తి, తాను, ఇరువురి కలయికలో

5. ప్రాణములో: తన ప్రాణశక్తిలో

6. సంవిత్ లో: చిదానంద స్వరూపమైన స్థితిలో

వీటిలో, ఒకదానికంటే మరొకటి శ్రేష్ఠములు. అంటే, ముందువాటికంటే తరువాతవి ఉత్తమములని అర్థము. అంతేగాక, ముందటివి తరువాత వాటికి దారిని చూపిస్తాయి. సదాచారులు రెండు, మూడు, నాలుగవ సాధనలను తిరస్కరిస్తారు. వారు వాటిని తుచ్ఛముగా పరిగణిస్తారు. కానీ కౌలాచారులు వాటిని సమ్మతిస్తారు. ఇవన్నీ మెట్లుమెట్లుగా ఉంటాయని, క్రిందిమెట్లను దాటకుండా పైమెట్లు అందవని వారంటారు.

సిద్ధులను, అతీతశక్తులను కోరుకునేవానికి, రెండవదియైన శక్తిసాధన, నాలుగవదియైన సంభోగసాధన,

అయిదవదియైన ప్రాణసాధనలు మంచివి. ఆరవదియైన శుద్ధసంవిత్ సాధన, మోక్షమును మాత్రమే కోరుకునేవారు చేయదగినది. మొదటిది, అంటే బాహ్యాచారపూర్వకమైన సాధనను గురించి ప్రత్యేకముగా చెప్పకపోయినప్పటికీ, అది భోగకాంక్షల కోసమని మనము అన్వయించుకోవచ్చు. మోక్షమును మాత్రమే కోరుకునేవానికి కూడా, రెండు, నాలుగు, అయిదు మొదలైన సాధనలు నైమిత్తికవిధులుగా అప్పుడప్పుడు చేయదగినవేనని చెప్పబడింది.

వీనిలో బాహ్యాచారములో అయితే, పూజావేదిక, వీరపాత్ర (మద్యముతో నింపబడిన పాత్ర), ఎర్రని వస్త్రము, ఇంతకుముందు చెప్పబడిన లింగము మొదలైనవి ఉంటాయి. వీరాచారము అనబడే పదమును అర్థం చేసుకోవాలి. వీరాచారమంటే, పంచమకార సాధనతో కూడినదే. నిషిద్ధములైనవాటిని ధైర్యముగా స్వీకరించేవారే వీరులు. శాక్తతంత్ర సాంప్రదాయమునకు చెందిన లలితాసహస్రములో కూడా వీరగోష్ఠిప్రియా అనే నామముంటుంది. ఇక్కడ 'వీరగోష్ఠి' యంటే, వీరసాధకులు ఒక గుంపుగా కలసి చేసే సాధనయని, లలితాదేవి అటువంటి సాధనను ఇష్టపడుతుందని అర్థము. ఇక్కడ చెప్పబడిన సాధన అదే. పశుభావము నుండి వీరభావమునకు, దానినుండి దివ్యభావమునకు ఎదగడం సాధనావిధానమై ఉంటుంది. ఈ క్రమములో అసహ్యము, ద్వేషము మొదలైన ద్వంద్వభావనలకు అతీతముగా ఎదుగవలసి యుంటుంది. స్నానము మొదలైన కర్తవ్యములు కూడా ఈ మార్గములో అవసరములు కావు. వాటిని చేయకుండా కూడా, పూర్ణముగా మద్యమును సేవించిన స్థితిలోనే ఈ మార్గములో శుద్ధి జరుగుతుంది. అయితే, ఇతర ఆచారములను పాటించేవారు దీనిని అంగీకరించరు.

బాహ్యయాగము

మొదటిగా, 'దేహము, ప్రాణము, సంవిత్తులు మూడూ ఒక్కటే' అని ధ్యానిస్తూ సంవిద్రూపియైన పరమశివభావముతో ఇరువది ఏడుమార్లు మంత్రమును జపించాలి. శిరస్సు, ముఖము, హృదయము, జననేంద్రియములలో పైనుంచి క్రిందకు, క్రిందనుంచి పైకి న్యాసమును చేయాలి. అప్పుడు, పరమేశ్వరునియొక్క అపర, పరాపర, పరాశక్తులలోని సమస్తవిశ్వము యొక్క అధ్వములలో పరిపూర్ణత సిద్ధిస్తుంది.

ఈ మూడు శక్తులలోనే సృష్టి సమస్తమూ ఇమిడి యున్నది. మాయ, పురుషుడు, ప్రకృతి, గుణములు, బుద్ధి మొదలుకొని ధర వరకు ఇరువది ఏడు తత్త్వములుంటాయి. వాటిలోనే అంతర్భావములై కళ, నియతి మొదలైన తత్త్వములుంటాయి. ఇది పరమేశ్వరుని అపరారూపము. విద్యాశక్తులలో పరాపరత్వముంటుంది. బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వర, సదాశివులను బ్రహ్మపంచకమంటారు. వీరికే సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశానులనేవి వారికున్న ఇతర నామములు. ఈ పంచబ్రహ్మలకు ఇరువది ఏడు ధర్మములున్నట్లుగా శ్రీమత్ లకులేశాచార్యులవారు చెప్పినారు.

పరత్వమున కూడా పరమేశ్వరుడు అయిదు రూపములలో ఉన్నాడు. వాటిలో మరలా ఒక్కొక్కదానికి అయిదు విధములుగా ప్రత్యక్షశక్తులున్నాయి. ఈ విధముగా అవి మొత్తమూ ఇరవై అయిదు శక్తులౌతాయి. ఈ ఇరవై అయిదు శక్తులూ, ఒకదానికొకటి ఉన్ముఖములై ఉన్నపుడు ఇరువది ఆరవస్థితి అవుతుంది. ఇవన్నీ

కలసిపోయి ఒక్కటే స్థితిలో ఉండటం ఇరవై ఏడవ స్థితి అవుతుంది. ఈ విధముగా మొత్తం ఇరవై ఏడు శక్తులౌతాయి. ఈ ఇరవై ఏడు శక్తులనే ఇరవైఏడు నక్షత్రములుగా జ్యోతిష్యశాస్త్రం గుర్తించింది. శంకరాచార్యులవారు రచించిన శ్రీ శివపంచాక్షర నక్షత్రమాలా స్తోత్రం ఈ శక్తులనే నిగూఢముగా వర్ణిస్తుంది.

పైన చెప్పబడిన ఇరవైఏడు రూపములలో వ్యాపిస్తున్న సంవిత్తును అగ్నిగా ధ్యానిస్తూ, తన బుద్ధిగా, ప్రాణముగా దానిని భావిస్తూ, ఒక్కసారి (పరా) మంత్రమును ఉచ్ఛరించుచూ శిఖ (పిలక) ను బంధించాలి. ఈ విధంగా చేయడం ద్వారా, తన దేహ, బుద్ధి, ప్రాణములలో పరమశివుడే నిండిపోయి, తనలో స్థిరముగా బంధింపబడుచున్నాడు. దీనికి వ్యతిరేకముగా కొంచము కూడా జరగడం సంభవించదు.

బుద్ధిద్వారా నడుపబడుతున్న తనయొక్క సమస్త ఇంద్రియములనూ పై ప్రక్రియ ద్వారా పరమేశ్వరుని శక్తితో నింపాలి. ఆ తరువాత, అక్కడున్నట్టి యాగద్రవ్యములు, యాగగృహము, అష్టదిక్కులు మరియు హోమగుండములను అదే శక్తితో నింపాలి. అప్పుడు అర్ఘ్యపాత్రను కూడా ఇదేవిధమైన శిఖాబంధనక్రియ ద్వారా పూరించి, దానిని కూడా పూజించాలి. దానిలోని కొన్ని బిందువులను తీసుకుని, వాటిద్వారా వేదికను తర్పించాలి. ఎడమచేతి ఉంగరపు మరియు బొటనవ్రేళ్ళతో మళ్ళీ కొన్ని బిందువులను తీసుకుని, తన యొక్క దేహములోని చక్రములలో మంత్రచక్రమును న్యాసముచేస్తూ వాటిని పూజించి తర్పించాలి. తరువాత, ఇదే విధంగా తనయొక్క ప్రాణములో కూడా మంత్రచక్రమును న్యాసం చేస్తూ పూజించాలి.

మాయాతత్త్వము వరకూ 'స' వర్ణముంటుంది. శక్తిత్రయము వరకూ 'ఔ' కారముంటుంది. వాటిపైన శుద్ధవిమర్శరూపిణియైన విసర్గగా శక్తిని ధ్యానించాలి. ఈ విధముగా చక్కగా మంత్రోచ్చారణను చేస్తూ ఆధారము మరియు ఆధేయములను కల్పిస్తూ న్యాసమును చేయాలి. ఆధారమంటే హోమగుండము. ఆధేయమంటే సంవిద్రూపియైన పరమేశ్వరుని తేజస్సు. అచ్చట, ఆధేయమైన సంవిత్ లో విశ్వము నిండియున్నట్లుగా ధ్యానించాలి. ఆ విశ్వము కూడా సంవిన్మయమేనని ధ్యానించాలి. ఈ విధముగా విశ్వమునకు సంవిత్ తోను, సంవిత్ కు విశ్వముతోను, ఏకత్వమేర్పడుతుంది. ఏలాగంటే, విశ్వము సంవిత్ నుండి ఉదయిస్తుంది, చివరకు సంవిత్ లోనే లీనమౌతుంది. తెలియబడేదంతా కూడా సంవిత్ నుండి మాత్రమే ఉదయిస్తుంది, చివరకు దానిలోనే విశ్రమిస్తుంది. ఈ విధముగా సంవిత్తత్త్వమనేది విశ్వము, విశ్వమును గ్రహించే వేద్యములతో ఏకత్వముతోనే గోచరిస్తుంది. కనుక, 'సృష్టిని సంపుటీకరించి...' అంటూ శాస్త్రములలో చెప్పబడినది.

అప్పుడు, ఆ మూడింటి ఏకత్వములోనికి, గంధము, ధూపము, మద్యము, మరియు పుష్పములు మొదలైనవాటిని అర్పించాలి. తదుపరి, ఆత్మసమర్పణ చేసి, ఆత్మవిశ్రాంతి మంత్రమును జపించి, యాగము యొక్క ఉపసంహారణమైన తరువాత, ఆయా ద్రవ్యములనంతా నీటిలో వదలిపెట్టాలి. ఇది బాహ్యయాగమని చెప్పబడుతుంది.

శక్తియాగము

ఇప్పుడు శక్తియాగము వివరింపబడుతున్నది. శక్తియాగమంటే, ఒకరి దేహములోని అవయవములను మరొకరు, అవి శక్తిస్వరూపములనిన భావనతో పూజించడం. శక్తియంటే తంత్రసాధిక. వీరుడంటే

తంత్రసాధకుడు. ప్రతి స్త్రీలోనూ ఒక పురుషుడుంటాడు. ప్రతి పురుషునిలోనూ ఒక స్త్రీ ఉంటుంది. పురుషుడంటే పౌరుషము, చొరవ, బలము, ధైర్యము. స్త్రీయంటే సౌకుమార్యము, ఒద్దిక, స్వీకరణ, వినయము. ఈ విధముగా, ఇద్దరిలోనూ ఇద్దరూ ఉన్నారు గనుక, శక్తి, వీరులిద్దరూ ఒకరిరూపములను ఒకరు దాల్చాలి. ఒకరి పాత్రను మరొకరు పోషించాలి. ప్రోల్లాసము (సంయోగమునకు ముందుగా సరససల్లాపములతో ఒకరినొకరు రంజింపజేసుకొనుట), ప్రారంభము (సంయోగక్రియను ఆరంభించుట), సృష్టి (దాని చివరిభాగము) ఈ విధమైన మూడు స్థాయిలు సంయోగములో ఉంటాయి. ఈ మూడింటిలోనూ, శివశక్తుల ప్రబోధము పరస్పరము జరుగవలెను. అంటే, ఒకరిలో మరియొకరు శివశక్తులను ప్రేరేపణ గావించుకోవలెను. 'నియతి' యనబడే తత్త్వము మనకు తెలును. అంటే, సృష్టి నియమమని అర్థము. దీనిని బట్టి నడచుకోవాలి. ఇది శుద్ధమైన రూపంలో కొన్ని శరీరభాగములలో ఉంటుంది. కనుక విశిష్టచక్రములైన జననేంద్రియములను కూడా శక్తిస్వరూపములుగానే భావించాలి. శిఖాబంధన క్రియ ఎటువంటి ధ్యానభావనతో చేయబడిందో, అదే భావన ద్వారా వాటిని పూజించాలి. అపరా, పరాపరా, పరా అనబడే మూడు శక్తులతో కూడిన త్రికోణమును ఆసనముగాను, ఆ మూడు కోణముల మధ్యన బిందువును విసర్గశక్తిగాను భావించవలెను. ఇదే విధముగా తన దేహమునను, దాని ఉప చక్రములలోను, ఆపైన బ్రహ్మరంధ్రము నుండి దాని అనుచక్రముల వరకూ ఇదే భావనతో ధ్యానిస్తూ పూజను చేయాలి. ఇది శక్తియాగమనబడుతుంది.

యామళ యాగము

ఇప్పుడు యామళ యాగము వివరింపబడుతున్నది. దేని మూలకంగా, అభేదత్వము సిద్ధిస్తుందో అది శక్తియని చెప్పబడుతుంది. జీవునకు, శివునితో అభేదమును కలిగించేది వీరిమధ్యన వారధిగా ఉన్నట్టి శక్తియే. కనుక, ఈ సాధన చేసేటపుడు, తంత్ర సహచరుల యొక్క వయస్సు, జాతి, కులము మొదలైన భేదములను పట్టించుకోకుండా, ఇరువురి సంయోగం ద్వారా కలిగే పారలౌకికమైన, తాదాత్మ్యతాపూర్వకమైన అభేదభావనను ప్రధానమైనదిగా భావిస్తూ, దానిని మాత్రమే సాధించే ప్రయత్నమును చేయాలి.

కార్యము (దీనిలో పాల్గొనేవారు), హేతువు (దీనికి సహకరించేవారు), సహోత్థములు (ఇరువురు) గా శక్తులు మూడు విధములుగా ఉంటారు. ఇంకా ఎన్నో విధములుగా కూడా ఉండవచ్చు. శక్తిమంతునితో బాటు, ఈ శక్తులకు కూడా అర్చనము, తర్పణములు అందరికీ జరగడం ఆనందహేతువౌతుంది. కనుక వాటిని జరిపించాలి.

చక్రములను (ప్రధాన అవయవములను) ఇంతకు ముందు చెప్పబడిన రీతిలో అర్చించాలి. అదే విధముగా, అనుచక్రములను (దేహములోని ఇతర అవయవములను) కూడా అర్చించాలి. బాహ్యంగా గంధము, పుష్పములు మొదలైన వాటితో ఈ పూజను చేయాలి. లోపలకేమో, భోజనము, మద్యము మొదలైన వాటిని నైవేద్యంగా ఇవ్వడం ద్వారా ఈ పూజను జరపాలి.

ఆనందమును కలిగించే చేష్టలతో కూడి, ఈ విధముగా చేయబడిన పూజాక్రమం వల్ల అనుచక్రములకు (దేహంలోని ఇతర అవయవములను కూడా) ధ్యానంలో తాదాత్మ్యత లభిస్తుంది.

అనుచక్రములలో (ఉప అవయవములలో) కూడా వాటివాటికి కలిగే భోగానందమును బట్టి క్రమముగా

వికాసము కలిగినప్పుడు, వాటిలో కూడా అత్యున్నతమైన సంవిత్ చక్రమే దిగివచ్చి వెలుగుతుంది.

ఈ విధముగా ఆయా అవయవములలోకి దేవతాశక్తులు దిగివచ్చినపుడు, వాటి యొక్క తేజస్సులు పరస్పరము ఆకర్షించుకునే క్రమంలో, ధ్యానపూర్వకమైన స్థితిలో ఉన్నట్టి శక్తి (సాధిక) మరియు శక్తిమంతుల (సాధకుల)కు, ఒకరిపట్ల ఒకరికి ఆకర్షణ అధికమౌతుంది.

అప్పుడా జంట (సాధిక, సాధకుడు), అభేదస్వరూపము, ఏకత్వము అయి, లోకమునకు అతీతంగా ఊర్ధ్వంగా ఉన్న అద్వైతస్థితికి చేరుకునే సమయంలో కలిగే స్పందనలో పుట్టిన సంక్షోభము, ఆయా అనుచక్రములను (ఇతర అవయవములను) కూడా సంక్షోభమునకు గురిచేస్తుంది. కనుక, అవికూడా తన్మయస్థితిలోకి ప్రవేశిస్తాయి.

అప్పుడు, నీవు నేను ప్రపంచము అనబడే అన్ని ద్వైతభావములూ కూలిపోతాయి. శివశక్తిస్వరూపమైన యామళభావం సిద్ధిస్తుంది. ఎంతగా అది సిద్ధిస్తుందో అంతగా సంవిత్ (శుద్ధచైతన్యపు వెలుగు) లో విసర్గము (లీనమైన స్థితి) అనుభవంలోకి వస్తుంది.

కౌలసమాధి

ఇద్దరి ఆత్మలూ కలసి ఒక్కటిగా మారిన స్థితి లభిస్తుంది. అన్నింటినీ మించినది, దానికంటే మరేదీ లేనిది అయిన నిత్యమైన స్థిరమైన లోకం అదే. ఈ ఆనందస్థితి చాలా విశాలంగా ఉంటుంది. అది శాంతమూ కాదు, ఉదితమూ కాదు. శాంతమంటే ప్రపంచాతీతమైన నిద్రవంటి స్థితి. ఉదితమంటే, ప్రపంచపు స్పృహను కలిగి యున్న విశ్వాత్మకమైన స్థితి. ఆ స్థితి ఈ రెండూ కాకుండా ఉంటుంది. అది శాంతోదిత ప్రసూతి కారణము. అంటే, నిద్ర, మెలకువలకు మూలమై, దేనినుండి ఇవి రెండూ పుడుతున్నాయో ఆ స్థితియై ఉంటుంది. ఇది అత్యుత్తమమైన కౌలసమాధి స్థితి.

తెంపులేనిది జారిపోనిది అయిన స్థితిని పొందాలని కోరుకునేవారు ఈ సంవిత్ యొక్క స్థితిని సాక్షాత్కరించుకోవాలి. దీనిని అనుభవించిన కారణం వల్ల, శక్తి (సాధిక) మరియు శక్తిమంతుల (సాధకుల) లో, శాంతము (ప్రపంచము తెలియని స్థితి), ఉదితము (ప్రపంచము గోచరిస్తున్న స్థితి), యుగళము (ఈ రెండూ) - ఈ మూడు స్థితులూ సమానములుగా ఉదయిస్తాయి.

ఈ స్థితి ఎలా కలుగుతుంది? ఇద్దరిలోనూ ఆత్మానందం ఉదయిస్తుంది. మరలా, ఒకరితో ఒకరికి తాదాత్మ్యం సిద్ధిస్తుంది. ప్రపంచము గుర్తుకు రానటువంటి, ఇతరములైన ఏ చింతలూ బాధించనటువంటి శాంతస్థితి కలుగుతుంది. ఒకరిలో మరియొకరు లీనమౌతారు. అందువలన ఈ స్థితి లభిస్తుంది. శాంత, ఉదిత, ఉభయస్థితులు ఇద్దరికీ కలిగినప్పటికీ, ఉదితమనే స్థితిలో ఉంటూ, సృష్టిని తెలుసుకుంటూ, దానిని తనలో ధరించి, భరించి, పోషించేది శక్తి (ఈశ్వరి) యే గాని శక్తిమంతుడు (ఈశ్వరుడు) కాదు. కనుక గర్భధారణ యనేది శక్తి (స్త్రీ) లో మాత్రమే జరుగుతుంది.

కనుక, శక్తి మూలకంగా జరిగే ఈ సంయోగ విధానమంతా, ఆచార్యునిద్వారా నరులకు బోధింపబడాలి. సామాన్యులకు ఈ విధానం తెలియదు. వారికి తెలిసిన నేలబారు సంభోగక్రియలో దాగిఉన్న ఈ రహస్యాలను

ఆచార్యుడు అర్హులైనవారికి బోధించాలి.

విసర్గరూపంలో దాగి ఉన్న శాంతము, ఉదితము అనబడే రెండు ధామములను ధ్యానిస్తూ, తెంపులేని, జారిపోని స్థితిలో విశ్రాంతిని పొందుతున్న ఇరువురి కలయిక నుండి, వారి ముఖముల ద్వారా ఉదయించిన శబ్దములను సేకరించి ఉంచాలి. ఇవి మంత్రశబ్దములుగా ఉపయోగిస్తాయి. ఉచ్చరించిన మాత్రంతో వారికి కౌలికసమాధిని కలిగింపజేస్తాయి.

దేవీచక్రమునకు తృప్తిని కలిగించగలిగితే, అది సాధకునికి జ్ఞానమును, మోక్షమును కలిగిస్తుంది. శాంతముగా దేవతాచక్రమును ధ్యానిస్తూ ఉంటే, శాంతము, శుభంకరము అయిన స్థితిని కలిగిస్తుంది.

దానికి తోడుగా, శూన్యము, నిరానందమయము, సృష్టికి అతీతము అయిన, నిజధామము అయిన ఆత్మస్థితి కూడా వెంటనే ఉదయిస్తుంది. అప్పుడు, ఇంద్రియములన్నీ ఆ స్థితితో నిండిపోతాయి. ఆ తరువాత అవి బయటకు ప్రసరించి బహిర్ధ్యానమును పొంది, ప్రపంచమును చూడటం ప్రారంభిస్తాయి.

విసర్గము - మూడుస్థితులు

ఈ పూర్ణస్థితి ఇరువురకూ లోలోపల ఉదయించినప్పటికీ, దానిననుసరించి, బాహ్యములైన చక్రములు (జననేంద్రియములు), అనుచక్రములు (ఇతర అవయవములు) కూడా చలిస్తాయి. ఈ చలనమనేది విసర్గస్థితి అనబడుతుంది. ఈ విసర్గము ఇంతకు ముందు చెప్పబడినట్లుగా, శాంతము (అ కారము), ఉదితము (ఉ కారము), శాంతోదితము (మ కారము) అని మూడు విధములుగా ఉంటుంది.

ఈ మూడువిధములుగా ఉన్న విసర్గస్థితులలో నిలకడగా ఉంటూ, వాటిని ధ్యానించడం వలన, సంవిత్ నుండి ఆయా వర్ణములు శక్తిని పొందుతాయి. సంవిత్ తో ఆ విధమైన కలయికవల్ల ఆయా వర్ణముల మధ్యలో ఆయా ఫలములు గోచరిస్తాయి.

ఈ మూడు వర్ణములతో ఏర్పడిన త్రికోణము లోపల ఒక పద్మం నిత్యమూ ఉదయిస్తూ ఉంటుంది. మంగళస్వరూపమైన ఆ కమలంలో, నిత్యాదేవతల స్వరూపమైన పదహారు దళముల ఇంకొక కమలం యొక్క మూలమున్నది. మధ్యలోనున్న ఈ నాళమునకు పూచిన ఈ రెండు పూవుల రాపిడివలన అగ్ని పుడుతుంది. అగ్ని మధ్యలో నిండుచంద్రుడు, బంగారు సూర్యుల కిరణముల కలయికతో, మూడుదళములు గల శోణితము మరియు వీర్యముల కలయికతో, అంకురసృష్టి జరుగుతుంది. ఇది చంద్ర, సూర్య, అగ్నుల సమిష్టియైన ముద్రను కలిగియుంటుంది.

తురీయము - ఖేచరి

అప్పుడీ సృష్టి యొక్క మొదటినుండి, చివరివరకూ జరిగినట్టు ప్రక్రియనంతా తమ లోలోపల ధ్యానించగా వారికి తురీయస్థితి లభిస్తుంది. ఇదే ఖేచరీముద్ర అనబడుతుంది. దీనిని అందుకున్నట్టి శక్తి, శక్తిమతులకు పానీయమును త్రాగడము, ఉపభోగము (సరసములు), లీల (వినోదములు), హాస్యసంభాషణలు మొదలైన అన్యోన్య చేష్టలు కలుగుతాయి. ఈ విధంగా వారికి ఏయే విమర్శలు కలుగుతాయో, అవన్నీ కూడా,

అవ్యక్తధ్వని (అనాహత నాదము), రావము (వ్యక్త ధ్వని), స్ఫోటము (ధ్వనియొక్క ప్రకటనము), దానియొక్క శృతి, నాదముగా వ్యక్తీకరింపబడుట, చివరకు శూన్యములో లయించిపోయే నాదాంతము మొదలైన స్థితులుగా రూపుదిద్దుకుంటాయి. తెంపులేకుండా సాగే అనాహతనాదము యొక్క శక్తితో నిండిన ఇవన్నీ కూడా పరామంత్రముతో సమానములైన నాదములై వెలుగుతాయి.

అష్ట నాదములు - అష్ట భైరవులు

ఈ నాదములు ఎనిమిది విధములుగా ఉంటూ అష్టనాదములనబడతాయి. ఇవి పరమశివునియొక్క అష్టభైరవ రూపములకు సూచికలై ఉంటాయి. ఈ అవ్యక్తధ్వని యన్నది, ఈ క్రింది ఎనిమిది ప్రదేశములలో చిత్తమును ధారణచేయడం వల్ల వినవస్తుంది.

1. శ్వాస ప్రశ్వాసల మధ్యలో
2. చెవులలో
3. చూపులలో
4. లింగయోనుల స్పర్శలో
5. వాని మేళనములో
6. దేహాంతమునందున్న యామలచక్రములో
7. స్తనముల మధ్యన హృదయప్రదేశము నుండి గొంతుద్వారా పెదవుల చివర్లవరకు
8. పై రెండు చక్రముల మధ్యప్రదేశములో

సంయోగ సమయమున ఇరువురకూ కలిగిన క్షోభము తరువాత, విశ్రాంతి తీసుకునే సమయములో, ఏకాగ్రమనస్కులతో వింటే, పైన చెప్పబడిన అష్టవిధములైన నాదములు భైరవరూపములై వారికి వినవస్తాయి. ఆయా ప్రదేశములలో జ్యోతిదర్శనమౌతుంది. ఈ విధముగా నాదము, జ్యోతి (బిందువు, కళలు) ఎక్కడ గోచరిస్తాయో అక్కడనే పరామంత్రము కూడా వినవస్తుంది.

జీవన్ముక్తి

తన నిత్యజీవితములో, అన్ని కర్మలలో కూడా ఇదే సాధనను చేయగలిగిన సాధకుడు జీవించియుండగానే ముక్తిని పొందుతాడు. అంటే, జీవన్ముక్తుడౌతాడు. ఈ సాధనను తెలుసుకుని, దీనిని సాధించినవాడు శాస్త్రముల పరిధిని దాటిపోతాడు. అతడికి శాస్త్రనిబంధనలు వర్తించవు. స్త్రీపురుషుల మధ్యన జరిగిన ఈ విధమైన కలయిక వల్ల స్త్రీ గర్భమును దాలిస్తే, ఆ గర్భమునుండి పుట్టిన శిశువు, చిన్ననాటి నుంచే పరతత్త్వమును అందుకోగల దైహిక, ప్రాణిక, మానసిక సంసిద్ధతలను కలిగి ఉంటాడు. 'యోగినీభూ' అనే పదమును వాడటం ద్వారా, స్వయముగా తానిటువంటి స్థితిలో జన్మించినట్లు అభినవగుప్తులవారు వ్రాసియున్నారు.

ఋషిసంతానం

ఇది ఒక రహస్యవిజ్ఞానము. మహామునీయులను, ఋషులను, సిద్ధులను సంతానంగా కోరుకునే జంట ఈ విధమైన యామళ యాగమును ఆచరించాలి. వారికి ఋషిసంతానం కలుగుతుంది. ప్రాచీనకాలంలో ఋషులు, యోగులు, సిద్ధులు ఈ ప్రక్రియద్వారానే ఉత్తమసంస్కారములు కలిగిన సంతానమును పొందేవారు. దీనికి విరుద్ధంగా, తినడం, త్రాగడం, సుఖించడం మాత్రమే జీవిత పరమావధులుగా కలిగిన పశుప్రాయులైన నేటి మానవులకు పుట్టే సంతానం కూడా అదే విధంగా ఉంటున్నది. వేపచెట్లకు మామిడిపండ్లు ఎలా కాస్తాయి మరి?

చిదానంద స్థితి

వెన్నెముకను యోగపరిభాషలో మేరుదండమంటారు. అది శూన్యము, అశూన్యముల ఆలయమై ఉంటుంది. శూన్యమంటే మనస్సుకు అతీతమైన స్థితి. అశూన్యమంటే మనోమయమైన స్థితి. వీటికి నిలయమైన మేరువు యొక్క ఏకదండములో, ప్రాణాగ్ని మరియు ప్రాణవాయువులను, త్రిశూలక్రియలో చెప్పబడిన శూలముతో ఒక్కటిగా చేయాలి. ఆ స్థితిలో ఉంటూ, రసములో రసమువలె, అంతరిక ధ్యానస్థితిలో నిలచియుండాలి. అన్ని విధములైన అనుమానములను విడచిపెట్టి, ఆచార వ్యవహారములకు అతీతుడై, 'నేను లేను' అని భావిస్తూ, దేహభాగములలో ఉంటూ, ఇంద్రియానుభవములను పొందుతున్న దేవతలను చూస్తూ, ఆనందము, ఉద్వేగములతో కూడిన ఘనమైన చిదానందస్థితిలో ఉండాలి. ఇదే పరమేశ్వర స్థితి.

ఖేచరి - వ్యోమచరి

ఇంద్రియగణములే దేవతలు. తనయొక్క చెవులు, కన్నులు, ముఖము, ముక్కు మొదలైన ఇంద్రియచక్రములలో నిలచియుండి, అన్ని అనుభవములనూ స్వీకరిస్తున్న దేవతా గణములను ఎల్లప్పుడూ చూస్తుంటే ఖేచరి తప్పకుండా సిద్ధిస్తుంది. అప్పుడు, సుదూరంలో ఉన్న ఆకాశంలోకి తన దేహమును అమాంతముగా లేపగలిగే ఆకాశగమన శక్తి లభిస్తుంది. అక్కడనుంచి సాహసంతో క్రిందకు పడుతూ, రెండు చేతులను దగ్గరకు చేర్చి చూచే వ్యోమచరీ ముద్రను అందుకుంటాడు. యామలయాగమనేది ఈ విధముగా ఉంటుంది.

ప్రాణ - సంవిద్యాగములు

ఇంతకుముందు చెప్పబడిన విధముగా, ప్రాణమును విశ్వమయముగా చేయాలి. దానిలో సంవిత్తును వ్యాపింపజేయాలి. అప్పుడు దానికి తర్పణము, నైవేద్యము, గంధము, ధూపము మొదలైనవాటిని సమర్పణము చేయడం ద్వారా బలమును చేకూర్చాలి. ఇది ప్రాణయాగమనబడుతుంది. ఆ స్థితిలో స్థిరంగా నిలువగలిగినప్పుడు అది సంవిద్యాగమౌతుంది. దాని విధానమంతా ఇంతకు ముందే చెప్పబడినది.

పైన చెప్పబడిన ఆరు యాగములలో, ఎవరైనా ఒక ముందటి యాగమును దాటినపుడు, సంశయము లేనట్టి పవిత్రహృదయంతో అతడుంటే అతనికి తరువాతి యాగమునుపదేశించాలి. ఆ ఉపదేశంలో, నువ్వులు నెయ్యి మొదలైన ఆహుతుల యొక్క అవసరం లేదు. ఇంతకుముందు చెప్పబడిన న్యాసవిధానంలో, దృష్టితోనే

అతనికి తరువాతి దీక్షనివ్వాలి. నైమిత్తికవిధుల వరకు ఉన్నట్టి పరోక్షదీక్షలు ఇంతకుముందటి అధ్యాయములలో చెప్పబడినాయి. వాటిలో మాత్రం ఇంతకుముందు వలెనే హోమము మొదలైన విధులను చేయాలి. కానీ ఈ యాగములలో మాత్రము, వాటి అవసరం లేదు.

సప్తమ కులయాగము

గురుశరీరములో జరుపబడే సప్తమ కులయాగము అన్నిటికంటే ఉత్తమమైనది. ఇప్పటివరకూ చెప్పబడినట్టి ఆరు కులయాగములను మించినట్టి అత్యుత్తమసాధన ఇది. అదికూడా ఇంతకు ముందు చెప్పబడినట్టి హోమము మొదలైన ప్రక్రియలతో కూడినదైతే, చక్కగా చేయబడినదై, ఇప్పటివరకూ చేయబడిన సాధనసంతా పరిపూర్ణము గావిస్తుంది.

కం|| ఋజువుల కందని మార్గము
ఋజువులు బల్ జూపునట్టి ఋజుమార్గముగా
సుజనుల నిధియౌ త్రికమిది
విజయము నందించు తంత్ర విజ్ఞానమురా

కం|| గురువౌ శంభుని కరుణన్
పరుగున బ్రాప్తించె తంత్ర పరమార్థంబుల్
వెరువని మానస వృత్తిన్
తరుగని నిధివోలె త్రికము తానై యమరెన్

ఆ|| తంత్రసారమనుచు ధరలోన దీపించి
శుభము గూర్చునట్టి శుద్ధపదము
శైవతంత్రమెల్ల చనువార గనుపింప
అభినవాత్మకముగ యమరె నిందు;

కం|| అభినవకృతమై వెలుగుచు
ఉభయమ్ముల నెగ్గడించు యూర్ధ్వాగమమై
అభవాద్వయ తంత్రమొండు
నభమున్ వెల్గించుగాదె నవశోభలతో

ఇతి శ్రీమదభినవగుప్తాచార్యవిరచితే తన్త్రసారే కులయాగప్రకాశనం నామ ద్వావింశమాహ్నికమ్ || 22 ||

ఇది శ్రీమదభినవగుప్తాచార్యవిరచితమైన తన్త్రసారమున కులయాగప్రకాశనమనే ఇరువది రెండవ ఆహ్నికము.

ఉపసంహారము

ఇత్థం షడర్ధక్రమసంప్రదాయంసప్రత్యయాప్రత్యయభిన్నమాప్య |
శ్రీశంభునాథాత్మకరుణారసేన స్వయం ప్రసన్నాదనపేక్షవృత్త్యా ||

కాశ్మీరికోఽభినవగుప్తపదాభిధానః
శ్రీతన్త్రసారమకరోదృజునా క్రమేణ |
యత్తేన సర్వజన ఏష శివం ప్రయాతు లోకోత్తరప్రసరశాంభవతన్త్రసారమ్||

ఇదియే, ప్రత్యయము, అప్రత్యయములకు భిన్నమైన షడర్ధక్రమ సాంప్రదాయము. శ్రీ శంభునాథాచార్యుని యొక్క అవ్యాజమైన కరుణవలన, కాశ్మీరరాష్ట్రవాసి యైన అభినవగుప్తునిచేత గ్రహించబడి, తంత్రసారమనే ఈ గ్రంధముద్వారా చెప్పబడినది. లోకోత్తరమైన స్థితిని కలిగించగల ఈ శాంభవతంత్రసారం వల్ల సమస్తజనులకూ శుభము కలుగుగాక !

శ్రీస్వాత్మసంవిదభిన్నరూపశివార్పణం భూయాత్ |

ఆత్మసంవిత్ కు అభిన్నమైన శ్రీ పరమశివునకు అర్పణము.

సమాప్తం చేదం తన్త్రసారాఖ్యం శాస్త్రమ్ |

తంత్రసారమనే శాస్త్రము సమాప్తము.

సారాంశము

మొదటి అధ్యాయము

ఎల్లలు లేని వెలుగే పరమశివుడు. ఆయనకు చిత్ (ఎరుక, చైతన్యము), మరియు ఆనందములు సహజలక్షణములు. కనుక ఆయన చిదానందస్వరూపుడు. సర్వాతీతుడు. ఆయనకు ఎన్నో శక్తులున్నప్పటికీ ముఖ్యముగా ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులు మూడు ముఖ్యములైనవి. వీటిలో ఇచ్ఛాశక్తినే స్వాతంత్ర్యశక్తి అంటాము. తన ఇచ్ఛానుసారం, ఒక లీలగా, ఒక ఆటను ఆడినట్లుగా, తనను తాను తగ్గించుకుని జీవుడౌతాడు. మరలా తన పూర్వరూపమును ధరించి మునుపటివలె ప్రకాశిస్తాడు. ఈ తగ్గించుకోవడం, మళ్ళీ పూర్ణరూపమును ధరించడం అనే ప్రక్రియ మూడు విధములుగా ఉంటుంది. అవియే, ఇచ్ఛా, జ్ఞాన, క్రియలనబడే మెట్లు. ఏ విధముగా క్రిందకు దిగినాడో, అదే విధముగా పైకి పోతాడు. పైకి పోయే క్రమంలో ఇవే శాంభవ, శాక్త, అణవ ఉపాయములౌతాయి. ఈ మూడూ లేని తనదైన స్థితిలో తానున్నపుడు అది అనుపాయమనబడే నాలుగవ ఉపాయమౌతుంది. కనుక దీనిని ఉపాయమని చెప్పలేము.

రెండవ అధ్యాయము

బలమైన శక్తిపాతము, గురూపదేశము, స్వయంవిచారణ - ఈ మూడూ ఉన్నవానికి తత్క్షణమే పరమేశ్వరానుసంధానం కలిగి సమాధి సిద్ధిస్తుంది. నిత్యసత్యస్వరూపమైన పరమశివానుభవంలో అతడా క్షణమే లీనుడౌతాడు. వేరే ఎటువంటి సాధనలూ దీనికి అవసరము లేదు. అనుగ్రహంతోనే పరమేశ్వరానుసంధానం కలుగుతుంది గాని సాధనలతో కాదు. ఆ అనుగ్రహమును స్వీకరించే స్థాయి శిష్యునిలో ఉన్నపుడు, అతని మనస్సులో విరుద్ధపు వికల్పములు ఏమాత్రమూ తలలెత్తని పరిస్థితి ఉన్నపుడు, తత్క్షణమే అతనికి అది సిద్ధిస్తుంది.

మూడవ అధ్యాయము

పరమశివుడు ప్రకాశస్వరూపుడు. నిరంకుశ స్వాతంత్రం ఆయనయొక్క ముఖ్యమైన స్వభావము. దీనికే ఇచ్ఛాశక్తి యని పేరు. అనుపాయమును సాధించలేనివారు, దీనిని ధ్యానించడం ద్వారా శాంభవసమావేశమును పొందవచ్చు. ఈ శక్తి తోడ్పాటుతో, అద్దంలో ప్రతిబింబంలాగా సమస్తవిశ్వమూ ఆయనలో ప్రతిఫలిస్తుంది. కానీ దీనివల్ల ఆయన అఖండత్వమునకు లోటు వాటిల్లదు. శక్తి శబ్దమయి. సమస్తభావములూ శబ్దరూపములే. శబ్దములలో అచ్చులు శివరూపములుగాను, హల్లులు శక్తిరూపములుగాను ఉన్నాయి.

సృష్టికి ముందు తనయొక్క వెలుగులో, స్వరూపములో, ఆనందములో సర్వాతీతుడుగా ఉన్న పరమశివుడు, సృష్టికి ఉన్ముఖుడై ఇచ్ఛాశక్తిగా, జ్ఞానశక్తిగా, క్రియాశక్తిగా, ఎట్లా విస్తరిస్తూ వచ్చాడో, చివరకు బిందువుగా మారి, విసర్గము ద్వారా సృష్టిగా ఎట్లా విస్ఫోటనం జరిగిందో, ఆ ప్రక్రియ అంతా 'అ' నుండి 'అః' వరకూ ఉన్న 16 అచ్చులలో కనిపిస్తుంది. ఈ విసర్గమే కాళికాశక్తి. ఈమె పన్నెండు రూపములలో సృష్టిని

నడుపుతూ పరిపుష్టం గావిస్తూ ఉంటుంది. ఈ శబ్దజాలము, భావజాలము అంతా ఉపశమించి, ఆరు అధ్వములుగా ఉన్న సృష్టి సమస్తమూ, తనలోనే సృష్టి, స్థితి, ఉపసంహారములను పొందుతూ ఉన్నదన్న అనుభవంలో స్థిరంగా ఉన్న సాధకుడు ఇచ్ఛారూపుడైన భైరవశివునితో ఐక్యమును పొందుతున్నాడు. ఇదే శాంభవోపాయము.

ఇది ఉత్తమసాధకుల పద్ధతి. అనూపాయంలో లాగా వెంటనే ఇది సిద్ధించదు. దానికి కారణాలు, ఉత్తమోత్తమస్థాయిలో శక్తిపాతం లేకపోవడం, సాధకుని మనస్సులో అంతటి పరిపక్వత లేకపోవడములే. అటువంటి పరిస్థితి ఉన్నపుడు, స్వాతంత్ర్యశక్తిని ఆశ్రయించాలి.

సులభంగా అర్థం కావడానికి ఇంకొక కథను వినండి.

ఒక అమ్మాయికి తల్లిదండ్రులు కుదిర్చే సంబంధం మీద నమ్మకం లేదు. వారు చూచి కుదిర్చిన వరుడితో ప్రేమలో పడేటంత శుద్ధమైన మనస్సు ఈ అమ్మాయికి లేదు. ఈమెకు అనుమానం ఎక్కువ. వారు కుదిర్చిన సంబంధం ఎలా ఉంటుందో అని సంశయం ఉన్నది. కనుక, తన స్వంతతెలివితో, ప్రేమవివాహం చేసుకుందామని అనుకుంటుంది. చివరకు అదే విధంగా చేసుకుంటుంది కూడా. పెత్తనం తనదే కనుక, తన ఇష్టానుసారం అంతా తానే చేసింది కనుక, పెళ్లి అయిన తర్వాత, సంశయం తీరి, బుద్ధికుదురుగా భర్తను ప్రేమించడం మొదలుపెడుతుంది. ఇది శాంభవోపాయ లక్షణం.

నాలుగవ అధ్యాయము

శాంభవోపాయమును కూడా అనుసరించలేని అశక్తుడు, శాక్తోపాయమును అనుసరించాలి.

తనలోని విరుద్ధపు ఆలోచనలను, సక్రమమైన ఆలోచన సాయంతో తొలగించుకోవాలి. అలా చేయడానికి, సరియైన తర్కము, సరియైన ఆగమశాస్త్రము, సరియైన గురువు యొక్క ఉపదేశములు చాలా అవసరములు. ఈ స్థాయిలో ఉన్నవానికి కూడా, బాహ్యములైన సాధనల అవసరం లేదు. కేవలం తర్కమే సరిపోతుంది. అది, విరుద్ధపు ఆలోచనలను తొలగిస్తుంది. అప్పుడు పరమశివతత్వం తనంతట తానై ప్రకాశిస్తుంది.

యాగము, యోగము, హోమము, వ్రతము, జపము మొదలైన సాధనలన్నీ అంతరికమైన సత్తర్కమే. వీటివల్ల శక్తిసమావేశము లభిస్తుంది. శక్తులు పన్నెండు కాళికలుగా ఉంటూ, ప్రమాత, ప్రమాణ, ప్రమేయములలో సృష్టి స్థితి లయములను చేస్తూ ఉంటారు. సత్తర్కమే శుద్ధవిద్యగా మారి పరమశివానుభవమును కలిగిస్తుంది.

దీనికి సంబంధించిన కథ ఇట్లా ఉంటుంది.

ఒక యువతి, దూరదేశంలో ఉన్న తన ప్రియుని చేరుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఆ క్రమంలో ప్రయాణం గురించి ఏవేవో ఊహలను కలిగి ఉంటుంది. కానీ, అవియన్నీ సరియైన ఆలోచనలు కావని, తాననుకున్న దారిలో నడిస్తే అతడిని చేరుకోలేనని, ఆ దారిని తెలిసినవారిద్వారా తెలుసుకుని, తన ఆలోచనలను మార్చుకుని, సరియైన దారిలో నడచి, చివరకు అతడిని చేరుకుంటుంది. ఇది శాక్తోపాయము.

అయిదవ అధ్యాయము

ఏదైనా ఒక ఉపాయము యొక్క సహాయముతో తప్ప సాధనలో పురోగమించలేని వానికి, దేహము, ప్రాణము, విగ్రహము మొదలైన వాటి అవసరం ఉంటుంది. దీనిలో బాహ్యప్రాణము, సూక్ష్మ ప్రాణములలో సృష్టి స్థితి లయముల ధ్యానము, భైరవభావప్రాప్తి, పన్నెండు శక్తుల ధ్యానము, పంచప్రాణములు, పంచకోశములు, ఆరు వేదాంత భూమికలు, ఆరు ఆనంద భూమికలు, ఆరు యోగస్థితులు, సృష్టి సంహార బీజములతో కూడిన సోహం భావసాధన, అవ్యక్త, వ్యక్తావ్యక్త, వ్యక్తలింగములు, సూక్ష్మ ప్రాణ వర్ణన వివరింపబడినాయి.

ఉపాయములలో ఉచ్చనీచములు లేవని, పరమశివుని చేర్చే ఉపాయము ఏదైనప్పటికీ అది ఆమోదయోగ్యమేనన్న భావనతో ఈ అధ్యాయము ముగుస్తుంది.

ఆరవ అధ్యాయము

ఇందులో కాలాధ్వము, దేశాధ్వములు చెప్పబడినాయి. బాహ్యము, దేహము, ప్రాణములలో కాలవిభజన చెప్పబడింది. వీటిలో తిథి, మాసము, సంవత్సరము, మానవులు మరియు దేవతల ఆయుష్షు. పంచవాయువులలో కాలోదయ క్రమము, వర్ణ మంత్ర పదముల వివరణము కనిపిస్తాయి.

ఏడవ అధ్యాయము

దీనిలో దేశాధ్వము చెప్పబడినది. దేశములో ఉన్న 118 భువనములను, ప్రాణము, బుద్ధి, అహంకారము, శూన్యము, సంవిత్ లలో వరుసగా లీనం చేసే ప్రక్రియ వివరించబడింది.

ఎనిమిదవ అధ్యాయము

ఈ అధ్యాయములో తత్త్వాధ్వము వివరింపబడింది. 118 భువనములలో ఉన్న 36 తత్త్వములను యోగి తనలోనే దర్శించి, చివరకు వాటన్నింటినీ సంవిత్ యొక్క రూపములుగా ఏ విధముగా ధ్యానించవలెనో, ఆ వివరం ఇవ్వబడింది.

తొమ్మిదవ అధ్యాయము

ఈ అధ్యాయములో వివిధ తత్త్వభేదములు చెప్పబడినాయి. సకల, ప్రళయాకల, విజ్ఞానాకల, మంత్ర, మంత్రేశ, మంత్రమహేశ, శివాది రూపములుగా ఉన్న పంచదశ విధి నుండి త్రివిధి వరకూ ధ్యానపూర్వకములైన విధులు చెప్పబడినాయి.

పదవ అధ్యాయము

ఈ అధ్యాయములో నివృత్తి, ప్రతిష్ఠా, విద్యా, శాంతి, శాంత్యతీతములనే అయిదు కళలతో కూడిన సమస్త అధ్వముల వివరమూ ఇవ్వబడినది.

పదకొండవ అధ్యాయము

దీక్షకు ముందు ఉండవలసిన శక్తిపాతము, దాని లక్షణములు, తొమ్మిది విధములైన శక్తిపాతములలోని భేదములు, వాటి అధికారి శిష్యుల భేదములు. గురువు, సద్గురువు, వారి లక్షణములు. వైష్ణవ శైవ దీక్షలు, వాటి వివరములు, యోగులు జ్ఞానులు, వారి అధికార భేదములు, తిరోభావ వర్ణనము ఈ అధ్యాయములో చెప్పబడినది.

పన్నెండవ అధ్యాయము

మలమంటే ఏమిటి, దానిని స్నానము ద్వారా ఎలా పోగొట్టుకోవాలి?, రెండు స్నానములు, ఎనిమిది భేదములు, వాటి ఫలితములు, వీరస్నానము, పరస్నానముల వివరములు ఈ అధ్యాయములో చెప్పబడినవి.

పదమూడవ అధ్యాయము

సమయదీక్షావిధి, యాగము, అధివాసము, శక్తిపాతము, చరుభోజనము, పరమేశ్వర పూజనము, రుద్రావేశము మరియు సమయనియమములు వివరింపబడినవి.

పదునాలుగవ అధ్యాయము

పుత్రకదీక్ష, పశుబలి, పాశవిమోచనా దీక్షల వివరములు ఈ అధ్యాయములో చెప్పబడినాయి.

పదిహేనవ అధ్యాయము

ఒకనికి మరణ సమయం దగ్గరైనపుడు ఇవ్వవలసిన సముత్క్రమణ దీక్ష, సప్రత్యయ (ఋజువులతో కూడిన) దీక్షలను ఇచ్చే విధానం ఈ అధ్యాయంలో ఇవ్వబడింది.

పదహారవ అధ్యాయము

తన ఎదురుగా గాని, పరోక్షంలో దూరంగా ఉన్నవానికి గాని ఇవ్వబడే దీక్షావిధానం ఈ అధ్యాయములో చెప్పబడింది. ఈ క్రమంలో, జీవించియున్నవారికీ, మరణించిన వారికి కూడా దీక్షనివ్వవచ్చు. మరణించిన జీవులను మహాజాలమనే ప్రయోగం ద్వారా పట్టి ఆకర్షించి వారికి మలశోధనము చేసి, వారియొక్క త్రిబంధములను విడిపించి, వారికి మోక్షమునివ్వవచ్చు. జీవించి యున్నవారికైతే ఉత్తమ సంస్కారములను కలిగించి, సాధనోన్ముఖులనుగా వారిని చేయవచ్చు.

ఈ విధమైన విధానమును తెలిసి, దానిని చేయగల శక్తి యున్న గురువు, శిష్యుడు తన ఎదురుగా లేకపోయినప్పటికీ, లేదా అతడు చనిపోయినప్పటికీ కూడా దీక్షనిచ్చి అతడిని ఉద్ధరించగలుగుతాడు. ఈ విధానమంతా ఈ అధ్యాయంలో చెప్పబడింది.

పదిహేడవ అధ్యాయము

వైష్ణవము మొదలైన మతములలో గాని, శైవమతంలోని ద్వైత సాంప్రదాయములలో గాని దీక్షలు

తీసుకుని ఆయా మార్గములలో నడుస్తున్నవారికి, శివాద్వైత మార్గంలో శ్రద్ధ కలిగినప్పుడు, వారికి శుద్ధి సంస్కారములను చేసి, దీక్షనిచ్చి, దారిని చూపించే విధానం ఈ అధ్యాయంలో వివరించబడింది. అట్టివారిని దీక్ష లేదని చెప్పి పొమ్మనకూడదని చెప్పబడింది.

పద్దెనిమిదవ అధ్యాయము

కొంతమంది స్వయంసాధనతో సిద్ధులైనవారుంటారు. వారికి గురూపదేశము, శాస్త్రాధ్యయనము మొదలైనవి ఉండకపోవచ్చు. కానీ పూర్వకర్మవశంగా, సొంతసాధనతోనే సిద్ధిని అందుకుంటారు. వారు ఇతరులకు కూడా గురుత్వమును వహించగల స్థాయిలో ఉంటారు. అటువంటి వారిని గుర్తించి, వారికి తగిన గురుపదవిలో వారిని కూర్చుండబెట్టి, అభిషేకప్రక్రియ ద్వారా వారిని క్రమబద్ధీకరించే ప్రక్రియను ఈ అధ్యాయంలో వివరించారు. అట్టివాడు చేయవలసిన సాధన కూడా చెప్పబడింది. దీక్షను ఎవరికివ్వాలి, ఎవరికివ్వకూడదు మొదలైన వివరాలు కూడా చెప్పబడినాయి.

పందొమ్మిదవ అధ్యాయము

సిద్ధిని అందుకోకుండా మరణించిన సాధకులకు, ఇతరులకు ఇవ్వవలసిన మృతోద్ధార శ్రాద్ధ దీక్ష ఈ అధ్యాయంలో చెప్పబడింది. శవసంస్కారసమయంలో కనిపించే, శవం తేలికపడి గాలిలోకి లేవడం వంటి ఋజువులు వివరించబడినాయి. శక్తివంతుడైన గురువుచేత ఈ దీక్ష ఇవ్వబడినప్పుడు ఈ ఋజువులు గోచరిస్తాయి. గురువు యొక్క మరణదినమును శిష్యులు పండుగగా జరుపుకోవాలని దుఃఖించకూడదని చెప్పబడింది.

ఇరవయ్యవ అధ్యాయము

దీక్షా స్వీకారం చేసిన శిష్యులు తమ జీవితాంతమూ చేయవలసిన విధులు, పాటించవలసిన నియమనిష్ఠల గురించి ఈ అధ్యాయములో వివరింపబడింది.

వీటిలో నిత్యనైమిత్తిక విధులు, స్థణ్డిలయాగము, లింగస్థాపనము, పర్వదినములలో చేయవలసిన విధులు, పాటించవలసిన నియమములు. అనుయాగము (మూర్తియాగము, చక్రయాగములు), వీరసంకరయాగము, పవిత్రకవిధి, మహోత్సవము, వ్యాఖ్యావిధి, సమయనిష్కృ తి విధి, గురుపూజావిధి మొదలైన విధులు వివరింపబడినవి.

ఇరవై ఒకటవ అధ్యాయము

ఇప్పటివరకూ చెప్పబడిన నిత్య నైమిత్తికకర్మలన్నిటికీ ఉన్న ఆగమప్రామాణికతను ఈ అధ్యాయంలో నిరూపించారు.

చిదానందరూపియైన పరతత్త్వమును ఎవరికి అర్థమైన రీతిలో వారు, లోకంలో వివరిస్తూ వచ్చారు. వీరిలో ఎవరికి అర్థమైనట్లుగా వారు, వేదములను, సాంఖ్య వైష్ణవ శైవాది సిద్ధాంతములను వారివారికి తగినట్లుగా అనుసరిస్తున్నారు. అరుదుగా కొందరు మాత్రం సర్వోత్తమమైన త్రికశాస్త్రమును అనుసరిస్తారు. ఈ

ఆగమశాస్త్రములన్నీ రకరకములైన ఫలితములనిచ్చినప్పటికీ అంతిమముగా ఒకే గమ్యమును చేరుతున్నాయి. దీనిని నమ్మి అనుసరించేవారు దాని ఫలితమును పొందుతున్నారు. కనుక, అన్ని సందేహములనూ తీర్చుతూ, అన్నింటినీ సమన్వయము చేస్తూ, అన్నింటినీ మించినట్టి శివాద్వైతశాస్త్రమును అనుసరించడం ఉత్తమము.

ఇరవై రెండవ అధ్యాయము

బ్రహ్మము ఆనందస్వరూపము. అది దేహంలోనే ఉన్నది. దానిని అనుభూతిలోకి తెచ్చుకోవాలంటే, పంచమకార సాధన అవసరము. ఈ విషయాన్ని తెలియనివారు వాటిని దూరం ఉంచి ఆనందానికి దూరమౌతున్నారు.

బాహ్యము, శక్తి, దేహము, యామలము, ప్రాణము, సంవిత్ అని ఆరు విధములుగా ఈ సాధన ఉంటుంది. హోమముతో కూడినది బాహ్యయాగము. స్త్రీదేహములో న్యాసము రెండవది. తన దేహములో న్యాసము మూడవది. స్త్రీ పురుష సంభోగరూపమైనది యామలము. తన ప్రాణములో చేసే యాగము అయిదవది. చిదానందస్వరూపమైన సంవిత్ లో యాగము ఆరవది. ఇవి ఒకదానికంటే మరొకటి ఉత్తమములు. వీటిని ఏ విధంగా సాధన చేయాలన్నది ఈ అధ్యాయంలో క్లుప్తంగా వివరించబడింది.

శ్రీమన్మహామాహేశ్వర

అభినవగుప్తాచార్య కృత

తంత్రసారము

పదవశతాబ్దము నందు కాశ్మీర్ లో నివసించిన శ్రీ అభినవగుప్తుల వారు, కాశ్మీరశైవమని పిలువబడుతున్న శివాద్వైతము లేదా త్రికసిద్ధాంతము నందు మహా పండితుడే గాక, పరమేశ్వరానుభవమును పొందిన మహా తపశ్శాలి, తంత్రసిద్ధుడూ అయి ఉన్నారు. స్పంద, క్రమ, కుల, ప్రత్యభిజ్ఞములనే విభాగములతో విరాజిల్లుతున్న త్రికశాస్త్రమును ఔపోసన పట్టిన ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి రచించిన అనేక గ్రంథములలో, శైవాగమముల సారమని చెప్పదగిన తంత్రాలోకము సుప్రసిద్ధమైనది. అనేక వేల శ్లోకములతో బహువిస్తారముగా ఉన్న ఈ గ్రంథమును అల్పబుద్ధులు గ్రహించలేకపోతున్నందు వలన, దానిని కుదించి, సులభవచనంలో 'తంత్రసారము' అనే గ్రంథమును ఆయన రచించారు. ఈ సంస్కృతగ్రంథమును జిజ్ఞాసువుల ఉపయోగార్థమై తెలుగుభాషలోకి తేగలగడం పరమేశ్వర కటాక్షంగా భావిస్తున్నాము.



శ్రీ సత్యనారాయణశర్మ గారు వేదాంతము, యోగము, తంత్రము, జ్యోతిష్యశాస్త్రం, వీరవిద్యలు, మరియు ప్రత్యామ్నాయ వైద్యవిధానములలో లబ్ధప్రతిష్ఠులు. భారతదేశము మరియు అమెరికా సంయుక్త రాష్ట్రములలో వీరిచే స్థాపించబడిన 'పంచవటి స్పిరిట్యువల్ ఫౌండేషన్' ప్రపంచవ్యాప్తంగా వేలాదిమందికి వెలుగుదారులలో నడిపిస్తున్నది. వీరి ఇతర రచనలైన, శ్రీవిద్యా రహస్యం, లలితాసహస్రనామ రహస్యార్థ ప్రదీపిక, తారాస్తోత్రం, దత్తాత్రేయ యోగశాస్త్రము, జాబాల దర్శనోపనిషత్తు, మహాసారము, విజ్ఞానభైరవ తంత్రము, మహాస్మృతిప్రస్థాన సూత్రము, ధమ్మపదము, యోగకుండలినీ ఉపనిషత్తు, యోగతత్త్వోపనిషత్తు, యోగశిఖోపనిషత్తు, యోగతారావళి, నాదబిందూపనిషత్తు, శాండిల్యోపనిషత్తు, వరాహోపనిషత్తు, ఇతర యోగోపనిషత్తులు, ధ్యానబిందూపనిషత్తు, సిద్ధసిద్ధాంతపద్ధతి, గోరక్షసంహిత, యోగయాజ్ఞవల్క్యము, పతంజలి యోగసూత్రములు, వైద్యజ్యోతిష్యము, వెలుగుదారులు, శ్రీమాలినీ విజయోత్తర తంత్రము ఆధ్యాత్మిక జ్ఞానగనులుగా చదువరులచే కొనియాడబడుచున్నవి.



PANCHAWATI
SPIRITUAL FOUNDATION
INDIA & USA

www.usapanchawati.org
www.mapanchawati.org